# SANSKRIT

## (DT24)

## (M.A. TELUGU)


## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం - 1

# కుమార సంభవమ్ - పంచమ సర్గ

## - మహాకవి కాళిదాసు

## 1. కవి సామాన్య పరిచయం :-

మహాకవి కాళిదాసు పరిచయానికి ముందు సంస్కృత సాహిత్యం పోకడను ముందు తెలుసుకోవాలి. సంస్కృత కవుల కాలాలు స్పష్టంగా తెలియనందువల్ల సంస్కృత సాహిత్య చరిత్రను కాలక్రమాన్ని అనుసరించి కాకుండా, ప్రక్రియా వైవిధ్యాన్ని బట్టి అధ్యయనం చేయడం మంచిది. ఆ దృష్టితో సంస్కృత సాహిత్యంలోని ప్రధాన ప్రక్రియలను ఇలా విభజించుకోవచ్చు.

1. మహా కావ్యాలు, 2. రూపకాలు, 3. లఘు (ఖండ) కావ్యాలు - సంకలనాలు, 4. గద్య కావ్యాలు, 5. చారిత్రిక కావ్యాలు, 6. చంపూ కావ్యాలు, 7. కథా కావ్యాలు, 8. నీతి కథలు, 9. చిత్ర కావ్యాలు, 10. అలంకార శాస్త్ర గ్రంథాలు, 11. నిఘంటువులు.

మహా కావ్యం సర్గ బంధంతో కూడి ఒక మహా పురుషుని జీవిత చరిత్రను వివరిస్తూ అర్థ సౌష్టవం కలిగి మంత్రణం, దౌత్య, యుద్ధ, నాయకాభ్యుదయాది వర్ణనలతో పంచ సంధి సమన్వితమై ఉండాలని భామహుడు నిర్దేశించాడు. తరువాత దండి, అగ్ని పురాణ కర్త, హేమ చంద్రుడు, రుద్రటుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు, జగన్నాథుడు మొదలయిన అలంకారికులు కూడా ఇంచుమించు ఇదే విధముగా మహా కావ్యాన్ని నిర్వచించారు.

సంస్కృత మహా కవులలో ముఖ్యంగా పేర్కొనదగినవారు: కాళిదాసు, అశ్వఘోషుడు, భారవి, భట్టి, కుమారదాసు, మాఘుడు, శ్రీ హర్షుడు, వేదాంత దేశికులు, అప్పయ దీక్షితులు.

సంస్కృత మహా కవులలో తరతరాలుగా, కాళిదాసు మహాకవి నిరుపమానుడుగా ప్రసిద్ధి పొందాడు.

పురా కవీనాం గణనా ప్రసంగే
కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసా ।
అద్యాపి తత్తుల్యకవేరభావాత్
అనామికా సార్థవతీ బభూవ ॥

వెనుక సంస్కృతంలో కవులను లెక్కించడానికి పూనుకొని, "కాళిదాసు" అని చిటికెన వేలు ముడిచారు. తరువాత ఆయనతో సమానుడైన కవి మరొకరు కనిపించకపోవడం వల్ల ఆ చిటికిన వ్రేలుకి ప్రక్కన ఉన్న ఉంగరం వ్రేలికి "అనామిక" (పేరు లేనిది) అనే వ్యవహారం ఏర్పడింది.

ఈ శ్లోకం కాళిదాసు పట్ల భారతీయ కవితా రసజ్ఞులకు గల విశిష్టాదరాన్ని వ్యక్తం చేస్తుంది. కాళిదాసు రచించిన కృతులలో
రెండు మహా కావ్యాలు - 1. కుమార సంభవం, 2. రఘు వంశం
రెండు ఖండ కావ్యాలు - 1. మేఘ సందేశం, 2. ఋతు సంహారం
మూడు నాటకాలు - 1. అభిజ్ఞాన శాకుంతలం, 2. మాళవికాగ్ని మిత్రం, 3. విక్రమోర్వ శీయమ్ ఉన్నాయి.

కుమార సంభవ కథ హిమాలయ వర్ణనతో ఆరంభమై పార్వతి జననం, శివపార్వతుల వివాహం, కుమార స్వామి జననం, కుమార స్వామి తారకాసురుని జయించడం మొదలయిన సన్నివేశాలతో మనోహరంగా కూర్చబడింది. కొంతమంది కుమార సంభవం (అష్టమ) 8వ సర్గ వరకే కాళిదాసు రచన అంటారు.

దీనిలో హిమాలయ వర్ణన (1వ సర్గ), వసంత వర్ణన (3వ సర్గ), రతి విలాపం (4వ సర్గ), శివ పార్వతుల సంవాదం (5వ సర్గ) మొదలైన ఘట్టాలు విశేషంగా ప్రజాదరణ పొందాయి.

కాళిదాసు శివభక్తుడైనా విష్ణు ద్వేషి కాడు అనడానికి ఆయన రఘు వంశం ప్రమాణం. దానిలో ఆయన "రామాభిధానోహరిరిత్యువాచ" (రాముడు విష్ణుమూర్తి అవతారమే 13 - 1) అని ప్రకటించాడు.

దిలీపుని మొదలుకొని అగ్నివర్ణుని వరకు గల రఘువంశ రాజులందరి వృత్తాంతం ఈ రఘు వంశ కావ్యంలో వర్ణింపబడింది. రఘు వంశం 19 సర్గల మహా కావ్యం. ఇప్పుడు మల్లినాథసూరి వ్యాఖ్యానంలో 19 సర్గలే మనకు లభిస్తున్నా, అది అసలు 25 సర్గల మహా కావ్యం అనీ, అగ్నివర్ణుని తరువాత మరి 27 మంది రఘు వంశ రాజుల చరిత్ర వర్ణింపబడిన భాగం లుప్తమైందనీ కొందరు విమర్శకులు భావిస్తున్నారు. కాళిదాసును "రఘుకారుడు" అని కూడా వ్యవహరించడం కద్దు. "క ఇహ రఘు కారేణ రమతా" (రఘుకారుని రచన యందు ఎవడు ఆనందంతో విహరింపడు?) అని ప్రసిద్ధి. మహాకావ్య లక్షణాలన్నియును రఘు వంశంలో కనిపిస్తాయి.

కాళిదాసు రచించిన నాటకాలు మూడు మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞాన శాకుంతలం.

1. **మాళవికాగ్ని మిత్రం :-** ఇది అయిదంకాల నాటకం. శృంగ వంశపు రాజైన అగ్నిమిత్రుడు మాళవికను వివాహమాడిన శృంగార కథ దీనిలో వర్ణింపబడింది.

2. **విక్రమోర్వశీయం :-** అయిదంకాలతో కూడిన త్రోటకం అనే ఈ ఉప రూపకంలో నాయకుడు పురూరవుడు, నాయిక అప్సరస అయిన ఊర్వశి. నాయకుడు తన విక్రమం వలన ఊర్వశిని భార్యగా పొందిన కథ గనుక ఇది విక్రమోర్వశీయమైంది. ఇది ప్రగాఢమయిన ప్రణయాన్ని చిత్రించే మనోహరమైన దృశ్యకావ్యం.

3. **అభిజ్ఞాన శాకుంతలం :-** కాలిదాసు రచించిన రూపకాలలో ఇది తలమానికం. సంస్కృత రూపక కళ దీనిలో పరాకాష్ఠ అందుకొన్నదని విద్వాంసుల అభిప్రాయం. ఏడు అంకాలు గల ఈ నాటకంలో శకుంతలా దుష్యంతుల ప్రణయం, దూర్వాస శాపం, దుష్యంతుడు అభిజ్ఞానంగా (గుర్తుగా) యిచ్చిన అంగుళీయకాన్ని శకుంతల కోల్పోవడం, మారీచ మహర్షి ఆశ్రమంలో శకుంతల భరతుని ప్రసవించడం మొదలైన వృత్తాంతాలు మనోహరంగా వర్ణించబడ్డాయి.

లఘు కావ్యాలలో కాళిదాసు రెండు కావ్యాలు ప్రసిద్ధాలు. 1. మేఘ సందేశం, 2. ఋతు సంహారం

(విశ్వనాథుడు తన సాహిత్య దర్పణంలో ఖండకావ్యాన్ని మహా కావ్యంలోని ఒక ఖండమనీ, కోశం, పరస్పరాపేక్ష లేని శ్లోక సముదాయమనీ నిర్వచించాడు. ఈ ఖండ కావ్య కోశాలను రెండింటిని లఘు కావ్యాలుగా గ్రహింపవచ్చు)

సుప్రసిద్ధమైన మేఘసందేశ కృతికర్త కాళిదాసు. సంస్కృతంలో ఖండ కావ్యానికి మేఘ సందేశం ఉదాహరణప్రాయమైనది. ఒక యక్షుడు తన ప్రియురాలికి మేఘుని ద్వారా సందేశం పంపించడం ఈ కావ్యంలోని ఇతివృత్తం. ఇది పూర్వ మేఘం, ఉత్తర మేఘం అని రెండు భాగాలుగా విభజింపబడింది. యక్షుడు ఉన్న రామగిరి నుంచి తన ప్రియురాలు ఉన్న అలకానగరానికి పోయే మార్గాన్ని మేఘునికి మనోహరంగా యక్షుడు వర్ణించి చెపుతాడు. ఉత్తర మేఘంలో తన ప్రియురాలికి చెప్పవలసిన సందేశాన్ని యక్షుడు వివరిస్తాడు. వేదాంత దేశికులు రచించిన హంస సందేశ కావ్యం అన్ని విధాలా కాళిదాసు వ్రాసిన మేఘ సందేశానికి దీటురాగల కావ్యం అని విమర్శకుల అభిప్రాయం. కాళిదాసు మేఘ సందేశాన్ని అనుసరిస్తూ వామనభట్టు బాణుడు మరో హంస సందేశం అనే (మరో కావ్యాన్ని) ఖండ కావ్యాన్ని రచించాడు. మందాక్రాంతా వృత్తంలోనే ఈ కావ్యం యుంది. ఇక్కడ దక్షుడనే యక్షుడు హంస ద్వారా తన ప్రియురాలు కందర్ప లేఖకు పంపిన సందేశం ఈ హంస సందేశం.

## 2. కాళిదాసు దేశ కాలాదులు :-

భారతదేశం గర్వించదగిన మహాకవులలో కాళిదాసు అద్వితీయుడు. అనేకానేక శతాబ్దాలుగ, ఈ మహాకవి కావ్యాలు సహృదయులకు హృదయాహ్లాదాన్ని కలుగజేస్తున్నాయి. ప్రధానమైన భారతీయ భాషలన్నింటిలోకి ఈయన కావ్యాలు అనువదింపబడ్డాయి. అంతేకాదు, కొన్ని విదేశీ భాషలలోనికికూడా ముఖ్యమయిన కొన్ని కావ్యాలు రూపాంతరితాలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కవి శేఖరునిగ కీర్తింపబడిన కాళిదాసుని స్థల కాలాదులుగానీ, జీవిత విశేషాలు గానీ, ఇంత వరకూ ఇదమిత్థమని తెలియకపోవడం విస్మయాన్ని కల్గిస్తుంది. జన్మ స్థల విషయ నిర్ణయంలో గాని, జన్మకాల విషయంలోనైతేనేమి, ఇంత వరకూ జరిగిన వాదోపవాదాలకూ, చర్చలకూ, ఇప్పటికీ ముగింపు కనిపించడం లేదు.

క్రీస్తు పూర్వం ప్రథమ శతాబ్దంలోనే కాళిదాసు ఉన్నాడనీ, అధిక సంఖ్యాకులైన భారతీయులు విశ్వసిస్తున్నారు. ఇందుకు భిన్నంగా కాళిదాసు మహాకవి క్రీ॥శ॥ 4 వందల ప్రాంతం వాడని కొంత మంది పాశ్చాత్య విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఈ అభిప్రాయాలలోనూ, మళ్ళీ చాలా తేడాలున్నాయి. ఈ వాదంలో కూడా పండితుల మధ్య ఏకీభావం కనిపించడం లేదు.

కాళిదాసుకు సంబంధించిన రకరకాల ఐతిహ్యాలు, చిర కాలంగా, దేశమంతటా ప్రచారంలో ఉన్నాయి. కొన్ని కథలు, కాళిదాసుకూ, విక్రమార్కునకూ మధ్య గల సంబంధాలను గురించి తెలియ చేస్తున్నాయి. మరి కొన్ని కథలు భోజ రాజుకు, ఈ మహాకవికి మధ్యగల సంబంధాలను గురించి వివరిస్తున్నాయి. ఈ రెండు కథల వలన ధారానగరానికి, ఉజ్జయినికి కాళిదాసుతో సంబంధం తెలుస్తోంది. ఈ కథలన్నింటిలోనూ, ఉజ్జయినీ ప్రభువులైన విక్రమార్క మహారాజుకు కాళిదాస మహాకవికీ గల సంబంధ బాంధవ్యాలను తెలియజేసే వాటినే పండితులు అంగీకరిస్తున్నారు.

అయితే యిందులోనూ అనేక సమస్యలు కనబడుతున్నాయి. విక్రమార్క బిరుదం కలిగిన రాజులు, మన దేశంలో చాలా మంది ఉన్నారు. వీరిలో విక్రమశకం ఆరంభించిన విక్రమార్కుడెవరో స్పష్టంగా తెలియడం లేదు.

కాళిదాసు ప్రాచీనుడే కావచ్చు గానీ, మరీ అంత ప్రాచీనుడయి ఉండడని, పాశ్చాత్య పండితులూ, వారి అనుయాయులూ విశ్వసిస్తున్నారు. క్రీ॥శ॥ 357 - 413 సంవత్సరాల మధ్య ఉజ్జయినీ ప్రాంతాన్ని పరిపాలించిన గుప్త సార్వభౌముడు చంద్ర గుప్తుని కాలంలోనే కాళిదాసు కూడా ఉండి ఉంటాడని వీరు తేల్చి చెప్పారు.

ఈ చంద్ర గుప్తునికి విక్రమాదిత్య బిరుదం కూడా ఉంది. గుప్త రాజుల కాలంలో శత్రువుల బాధలేమీ లేకుండా, ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించారు. అలాంటి ప్రశాంత వాతావరణం ఉన్నది కనుకనే, కాళిదాసు మహాకవి అంతటి మహోత్కృష్ట సాహిత్యాన్ని సృష్టించాడని వీరి వాదన.

క్రీ॥పూ॥ 150 - 100 సంవత్సరాల మధ్య కాలంలో కాళిదాసు ఉండి ఉంటాడని మరొక వర్గం వారు వాదిస్తున్నారు. వీరి వాదనకు మాళవికాగ్ని మిత్ర నాటకంలో వర్ణితమయిన చారిత్రకాంశాలే బలాన్నిస్తున్నాయి. ఈ నాటకాంతాన అగ్ని మిత్రుడు చెప్పిన భరత వాక్యం సమకాలికుడైన ప్రభువు ప్రశంసను సూచిస్తున్నదని ఈ నాటకానికి వ్యాఖ్య రాసిన కాటయ వేమారెడ్డి చెప్పాడు.

అలహాబాదు నగరానికి సమీపంగా భీతక అన్న గ్రామం ఉంది. సర్‌జాన్ మార్షల్ దొరకు, ఈ గ్రామంలో లభించిన లోహపు రేకుల మీద, శాకుంతలం నాటకంలోని ప్రథమాంకం చెక్కబడి యుంది. ఈ రేకులు క్రీస్తు పూర్వం 185 - 73 సమయం మధ్య కాలంలో పాలకులుగా ఉన్న సంగ రాజుల కాలం నాటివని పరిశోధకులు భావిస్తున్నారు.

ఇలా చర్చిస్తే అన్ని వాదాలకు ఎంతో కొంత ప్రమాణం ఉంటుంది. అన్ని వాదాలు పరిశీలింపదగ్గవే. ఇంతవరకూ సంస్కృత సాహిత్య చరిత్రను బట్టి చూస్తే కాళిదాసు కాలం విషయంలో అభిప్రాయ భేదాలు ఇలా ఉన్నాయి.

1. సర్ విలియం జోన్స్ అభిప్రాయానుసారం విక్రమ శక ఆరంభకర్త అయిన విక్రమార్క బిరుదాన్ని పొందిన ఒకానొక రాజు యొక్క ఆస్థానంలో కాళిదాసు క్రీ॥పూ॥ ఒకటవ శతాబ్దంలోఉండేవాడని తెలుస్తోంది.

2. డా॥ బేబర్ తాసన్ యాకోబి, మోనియర్ విలియమ్ మొదలైన పాశ్చాత్య విద్వాంసులు క్రీ॥శ॥ 2, 3 శతాబ్దాలలో కాళిదాసు ఉండేవాడని అభిప్రాయపడుతున్నారు.

3. డా॥ భావుదాజీ అనే విమర్శకుడు ఉజ్జయినీ రాజైన హర్ష విక్రమాదిత్యుడు కాశ్మీర దేశాలను పాలించుటకు పంపిన మాతృ గుప్తుని అనే సామంతుని ఆస్థానంలో కాళిదాసు ఉండేవాడని తేల్చారు.

4. వత్సభట్టు అనే రాజు శిలా శాసనం దొరుకుతోంది. ఆ శిలా లేఖంలో మాళవ సంవత్సర శకం - 529 అని రాసి యుంది. ఆ శిలా లేఖ ప్రకారం ఈ సమయం క్రీ॥శ॥ 473. ఈ శిలాలేఖ భాష కాళిదాసు భాష సమానంగా యుంది. ఈ ఆధారంగా మేక్‌డొనల్ అనే విమర్శకుడు కాళిదాసు సమయం క్రీ॥శ॥ 5వ శతాబ్ది అని చెబుతున్నాడు.

5. డా॥ హర్నెలే మొదలయిన వారు - కాళిదాసు కావ్యాల్లో ప్రయోగించిన - గోప్తా, గోప్త్రే, కుమార గుప్త, స్కంద గుప్త అనే పదాల ఆధారంగా గుప్త వంశ రాజులకు కాళిదాసుకీ సంబంధం కల్పించి కాళిదాసు సమయం క్రీ॥శ॥ 5 - 6 శతకాలు కావచ్చని వాదిస్తున్నారు.

6. ఎ.సి. బెనర్జీ కాళిదాసు మాళవ నరేశుడైన యశోవర్మ సమకాలికుడని, అందుచేత కాళిదాసు సమయం క్రీ॥శ॥ 6వ శతాబ్ది అని తెలియచెప్పాడు.

7. రామచంద్ర వినాయక పడవర్ధనుడనే ఆచార్యుడు "ఆషాడస్య ప్రథమ దివసే", "ప్రత్యాసన్నేనభసి" అనే పద్యాల ఆధారంగా జ్యోతిషానికి సంబంధించిన గణన ప్రకారం కాళిదాసు 1800 సంవత్సరాల పూర్వం ఉండేవాడని నిర్ణయించాడు. ఈయన ప్రకారం కాళిదాసు క్రీ॥శ॥ 1వ శతాబ్దివాడని తేలుతుంది.

8. ఆర్. కృష్ణమాచారియర్ "దిఙ్నాగానం పథి పరహరిన్" అనే మేఘ సందేశంలోని శ్లోకం ఆధారంగా కాళిదాసు దిఙ్నాగుని సమకాలికుడనీ, దిఙ్నాకుని సమయం క్రీ॥శ॥ 6వ శతాబ్ది కాబట్టి కాళిదాసు సమయం కూడా క్రీ॥శ॥ 6వ శతాబ్ది కావచ్చని అభిప్రాయపడ్డారు.

9. మహా మహోపాధ్యాయ రామావతార శర్మ కాళిదాసు ద్వితీయ చంద్ర గుప్తుని ఆస్థానం వాడు కాబట్టి క్రీ॥శ॥ 375 నుంచి 450 వరకూ కాళిదాసు సమయం అని సప్రమాణంగా నొక్కి వక్కాణించాడు.

10. కొంత మంది చరిత్రకారులు ఇలా చెబుతున్నారు - పూర్వం పశ్చిమ భారతంలో మాళవ రాజ వంశం ప్రసిద్ధి పొందింది. క్రీ॥పూ॥ 3వ శతాబ్దంలో వీరు గణ రాజ్యాలతో కలిసి అలెగ్జాండరుని పారద్రోలడానికి ప్రయత్నం చేసి వైఫల్యాన్ని పొందారు. ఈ మాళవ వంశమే గ్రీకుల దాడి వలన రాజ స్థానంలో నివాసం ఏర్పరచుకున్నారు. ఈ గణ రాజ్యంలో విక్రమాదిత్యుడనే రాజు శకులను ఓడించి "శకారి" అనే బిరుదాన్ని పొందాడు. ఇతని పేరు మీదనే మాళవ శకం ప్రారంభమయింది. ఈ సమయం క్రీ॥పూ॥ మొదటి శతాబ్ది. కాళిదాసు ఇతని ఆస్థానంలోనే ఉండేవాడు కాబట్టి కాళిదాసు సమయం క్రీ॥పూ॥ ఒకటవ శతాబ్ది అయి ఉంటుంది.

11. క్షేత్రేశచంద్ర ఛట్టోపాధ్యాయుడు "Date of Kalidasa" అనే పరిశోధనా వ్యాసంలో ఇలా చెప్పాడు. కాళిదాసు రఘు వంశం అగ్నివర్ణుని ప్రసంగంతో ఆపు చేసాడు. ఈ అగ్నివర్ణుడు శుంగ వంశీయుడు. "దేవభూమి" అనే పేరు గలవాడు ఈ రాజే మంత్రి అయిన వాసుదేవునిచే చంపబడ్డాడు. అందుచేత అగ్నివర్ణుని సమకాలికుడు కాళిదాసు.

ఇలా ఎన్నో అభిప్రాయ భేదాలు కాళిదాసు కాల విషయంలో ఉన్నాయి. కాని అశ్వఘోషుడనే కవి సమయం నిర్ధారింపబడింది. అతను కుషాణ నరేశుడైన కనిష్కుని సమకాలికుడు. క్రీ॥శ॥ ప్రథమ శతకంలో ఉండేవాడు. అతను సౌందర నందం, బుద్ధ చరితం అనే కావ్యాలు వ్రాసాడు.

అతని కావ్యాలలో కాళిదాస శ్లోక ప్రభావం కనిపిస్తోంది.

| కాళిదాసు శ్లోకం | బుద్ధ చరితంలో అశ్వఘోషుని శ్లోకం |
|---|---|
| వాతావవుః సేఖ్యకరాః ప్రసేదు | వాతావవుః స్పర్శ సుఖం మనోజ్ఞా |
| రాశా విధూమీ హుత భుగ్ది దీపే । | దివ్యాని వాసాంస్యవ పాతయన్తః । |
| జలాన్య భూవన విమాలాని తత్రో | సూర్యస్స ఏవాభ్యధికం చకాశే |
| త్సవే కంతరిక్షం ప్రససాద సద్యః ॥ | జజ్వాల సేమ్యార్చి రనీరిత్యోగ్నిః |
| కుమార సంభవం - 11/37 | బుద్ధ చరితం - 13/73 |
| నిశీధ దీపాస్స్పహసా హతత్విషో | దీప ప్రభం భాస్కర వన్మమోష |
| బభూవు రాలేఖ్య సమర్పితా ఇవ | బుద్ధ చరితం - 1/32 |
| రఘు - 3/5 | |

అందువల్ల కాళిదాసు అశ్వఘోషుని కంటే ముందువాడనీ, కాబట్టి కాళిదాసు క్రీ॥పూ॥ 2, 3 శతాబ్దాల ముందు వాడనీ సమర్థిస్తున్నారు.

## 3. కాళిదాసు - జన్మ దేశం :-

కాళిదాసు ఏ ప్రాంతానికి (దేశానికి) సంబంధించినవాడనే విషయంలో కూడా చాలా అభిప్రాయ భేదాలున్నాయి. కాళిదాసు కాశ్మీర వాసి అని, వంగదేశ వాసి అని, మిథిలా దేశ వాసి యనీ అంటూ ఉంటారు. కానీ మాళవ రాజ్యానికి ముఖ్యనగరమైన ఉజ్జయినియే కాళిదాసు వాస స్థానమని చాలా మంది విమర్శకుల అభిప్రాయం. కాళిదాసు ఉజ్జయిని గురించి చాలా వర్ణించడం కూడా ఈ అభిప్రాయానికి ప్రమాణంగా తీసుకోవచ్చు. కాళిదాసు అవంతీ దేశాన్ని చాలా నిశితంగా వర్ణించాడు. హిమాలయాది వర్ణనలు కాళిదాసుకి ఆయా రాజ్యాలతో సంబంధం ఉన్నట్టు ప్రమాణంగా యున్నప్పటికీ మాళవ దేశ వాసిత్వమే కాళిదాసుకు ఎంతో అనుకూల ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది.

ఇతని గ్రంథాలలో ఉజ్జయినీ నగర ప్రశస్తి విశేషంగా కనబడుతూ ఉండడాన్ని బట్టి, అతనీనగరంలో నివసించాడనీ, రఘు మహారాజు విజయయాత్ర సందర్భంగా భారతదేశపు నాలుగు చెరగులనూ, వర్ణించిన తీరుని బట్టి కాళిదాసు భరత ఖండాన్ని ఆమూలాగ్రం దర్శించాడనీ అనడమే తప్ప, తగిన సాక్ష్యాధారాలు ఏమీ లేవు. ఇవన్ని ఒట్టి ఊహలే అని కొందరి నమ్మకం.

కాళిదాసుది ఏ మతమో తేల్చి చెప్పడం సాధ్యపడదు. అతని గ్రంథాలలో శివస్తుతి కనపడుతుంది. విష్ణు స్తోత్రం కనబడుతుంది. ఈ రెండింటితో పాటుగా అద్వైత, వేదాంతపరమైన అంశాలు, వేదాంతపరమైన అనుసరణలు కూడా కనబడుతున్నాయి. చాలా మంది నాటక కర్తలు, తమ తమ దేశ, కాల, పాండిత్య, వంశ పరంపలతో ప్రస్తావనలను నింపిన సందర్భాలున్నాయి. కాళిదాసు తన నాటకాలలో తన పేరు తప్ప ఇతర వివరాలను చెప్పకపోవటం దురదృష్టం.

## 4. కాళిదాసు కృతి పరిచయం :-

అనన్యమైన ప్రకృతి పరిశీలనా సామర్థ్యం, అనల్పమైన కల్పనా చాతుర్యం అపూర్వమైన శిల్ప నైపుణ్యం, అతి గంభీరమయిన మానవ స్వభావ వివేచనా శక్తిని వినియోగించి, భారతజాతికి తలమానికాలయిన మహా గ్రంథాలను కాళిదాసు సృష్టించాడు. ఋతు సంహారం, రఘు వంశం, కుమార సంభవం, మేఘ సందేశాల వంటి కావ్యాలను, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞాన శాకుంతలం వంటి నాటకాలను రచించాడు.

(A) **ఖండ కావ్యాలు :-** ఖండ కావ్యాలు రెండు. 1. మేఘ సందేశం, 2. ఋతు సంహారం

1. **మేఘ సందేశం :-** మహాకవి కాళిదాసుకూ, సంస్కృత సాహిత్యానికి దేశ విదేశాలలో సమున్నత స్థాయిని, సమకూర్చిన వ్యంగ్య ప్రధానమైన కావ్యమిది. విరహాతురుడైన యక్షుని మనో వృత్తి ఈ కావ్యంలో చిత్రితమయింది. ఇందులోని కథ కేవలము కల్పితం. కుబేర సేవకుడైన ఒక యక్షుడు స్వామి ఆగ్రహానికి గురి కావల్సి వచ్చింది. కుబేరుడు ఒక ఏడాది పాటు భార్యావియోగాన్ని భరించవలసినదిగా యక్షుణ్ణి శపిస్తాడు. ఆ యక్షుడు ఆషాఢమేఘాన్ని చూస్తాడు. ఆ మేఘ వీక్షణం, ఇతనిలోని జ్ఞాపకాలను మేలుకొలుపుతుంది. మధురాతి మధురమైన స్మృతులెన్నో మనస్సులో మెదులుతాయి. ఆ మేఘం ఉత్తర దిశగా ప్రయాణిస్తుంది. అలకానగరంలో ఉన్న తన ప్రేయసికి, ఒక సందేశాన్ని పంపుదామనుకొన్నాడు. ఆ జలధరునికి, ఆ నగరాన్ని చేరుకొనే మార్గ మధ్యంలో కనిపించే విశేషాలను వివరిస్తాడు యక్షుడు. తన ప్రస్తుత స్థితిగతులను, ఆమెకు తెలియజేయవలసిందిగా మేఘాన్ని వేడుకొంటాడు. ఈ కావ్యంలోని కథా వస్తువు సంక్షిప్తంగా ఇది.

మేఘ సందేశం కావ్యంలో "పూర్వ మేఘమనీ, ఉత్తర మేఘమనీ రెండు సర్గలున్నాయి. ఈ రెండు సర్గలలోని శ్లోకాల సంఖ్య 115. సాహిత్య జగత్తులో మేఘ సందేశం కావ్యానికి మహోన్నతమైన స్థానముంది. పూర్వ మేఘమును వర్ణనాగీతమనీ, ఉత్తర మేఘాన్ని ఉత్కంఠా గీతమని వ్యవహరిస్తూ ఉంటారు. పూర్వ మేఘమన్న సర్గలో, ఉత్తర భారతంలోని నదీనదాలు, గిరికందరాలు, పల్లెలు, పట్టణాలు, పుణ్య క్షేత్రాలు వర్ణింపబడ్డాయి. ఇతివృత్తానికి తగినట్టుగా "మందాక్రాంతా" వృత్తంలోనే కావ్య రచన కొనసాగింది. ఉత్తర మేఘమన్న రెండవ సర్గలో అలకా నగరం, యక్ష భవనం, మేఘుడు ద్వారా యక్షుడు పంపిన సందేశం వర్ణింపబడ్డాయి. సందేశ (దూత) కావ్యాలన్నింటిలోనూ మేఘ సందేశం మకుటాయమానమైనటువంటిది. కాళిదాసు కావ్యాలన్నింటిలోనూ కానవచ్చే వస్తు విన్యాసం, పాత్ర సృష్టి, వర్ణనా వైచిత్ర్యం, రస ప్రతిపాదనాది విషయాలు ఇతని కళా కౌశలాన్ని తెలియ చేస్తున్నాయి.

2. **ఋతు సంహారం :-** ఋతు సంహార కర్తృత్వ విషయంలో భేదాభిప్రాయాలున్నాయి. ఆరు ఋతువుల సొగసులను చిత్రించే వర్ణనాత్మకమైన కావ్యమిది. సాధారణ క్రమంలోనయితే వసంతర్తు వర్ణనతో ప్రారంభం కావాలి. అలా కాక, ఈ కావ్యం గ్రీష్మ ఋతు వర్ణనతో ప్రారంభం కావడం ఒక విశేషం. వివిధ ఋతువులలోని ప్రకృతి ప్రభావం మానవుల మీద, వివిధ జంతువుల మీద, వృక్ష విశేషాల మీద ఎటువంటి మార్పులను కల్గిస్తుందో ఈ కావ్యంలో హృదయంగమంగా చిత్రించాడు కవి. ఈ వర్ణనలను అధ్యయనం చేస్తున్నప్పుడు కవి నిశిత పరిశీలన పటిమకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వివిధ ఋతువులలోని పరిణామాలను, ఒక ప్రియురాలికి, ప్రియుడు వివరిస్తున్న తీరులో కావ్య రచన కొనసాగింది. వర్షా కాలాన్ని ఒక రాజు గాను, జలధరాలను తద్వాహకములైన ఏనుగులు గాను, వాటి గర్జన ప్రయాణ భేరిగాను చెప్పడం, ఇక్కడ వర్ణనా వైచిత్రి దర్శనం. ఋతు సంహారం గ్రీష్మ ఋతు వర్ణనంతో ప్రారంభించి, వసంత ఋతువుతో ముగించడం ప్రళయం నుంచి సృష్టిని చూపిస్తూ కావ్యాన్ని మంగళాంతం చేసాడు అని కొందరి అభిప్రాయం. వసంతంతో ప్రారంభిస్తే శిశిరంతో ముగించాలి. శిశిరం అంటే ఆకురాలు కాలం వలన అమంగళకరం కదా.

(B) **మహా కావ్యాలు :-**

1. **రఘు వంశం :-** రెండు మహాకావ్యాలను కాళిదాసు రచించాడు. అవి రఘు వంశం, కుమార సంభవం అని చెప్పుకొన్నాం. అందులో రఘు వంశం గురించి కొంచెం తెలుసుకుందాం. కాళిదాసు నాటకాల్లో శాకుంతలం రత్నమయినట్లే, కావ్యాలలో రఘు వంశం రత్నమని పండితుల అభిప్రాయం. ఈ కావ్యంలోని కథా వస్తువును రామాయణం నుండీ, విష్ణు పురాణ, పద్మ పురాణాల నుండి గ్రహించాడు కాళిదాసు. రసోచితమైన మార్పుల్ని చేసి, ఉత్తమ కావ్యంగా రూపొందించాడు.

సూర్య వంశ ప్రభువులు చిరకాలంగా అయోధ్యను పరిపాలించారు. వారిలో దిలీప, రఘు, అజ, దశరథ మహారాజులు చాలా ముఖ్యమైన వారు. వీరి తరువాత పరిపాలించిన వాడు శ్రీరామ చంద్రుడు. ఈయన శ్రీహరి అపరావతారం. ఆ తరువాత ఇరవైనాలుగు మంది రాజులు పరిపాలించారు. ఈ పరంపరలో చివరివాడు అగ్నివర్ణుడు. అతను మరణించిన తరువాత, అగ్నివర్ణుని అర్ధాంగికి పట్టాభిషేకం జరుగుతుంది. అప్పుడామె గర్భవతి. ఈ పట్టాభిషేకోత్సవంతో రఘు వంశ కావ్యం ముగుస్తుంది.

రఘు వంశంలోని మొత్తం సర్గలు పందొమ్మిది. వీటిల్లో దిలీప మహారాజు - నందినీధేనువుకు బదులుగా, తన శరీరాన్ని సింహానికి అర్పించడం, రఘు మహారాజు జైత్రయాత్ర, ఇందుమతి స్వయంవరం, అజ విలాపం, సీతా పరిత్యాగం మొదలైన ఘట్టాలు రసరమ్యంగా ఉన్నాయి. ఈ కావ్యాన్ని మూడు విభాగాలుగా చేయవచ్చు. మొదటి తొమ్మిది సర్గలలో శ్రీరాముని కన్నా పూర్వులైన వారి చరిత్ర ఉంది. పదవ సర్గ నుండి 15వ సర్గ వరకూ శ్రీరామాయణ కథ ఉంది. మిగిలిన నాలుగు సర్గలలోనూ, శ్రీరాముని అనంతరం రాజ్యాన్ని పాలించిన పాలకుల చరిత్ర వర్ణితమయి ఉంది. రఘు వంశ కావ్యంలో, కావ్య నాయకుడెవరన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పడం కష్టమే గానీ, శ్రీరాముడనే ప్రత్యుత్తరంతో కొంత వరకూ సమాధానపడవచ్చు.

శ్రీరాముని వంటి పవిత్ర చరిత్రుడూ, వీరనాయకుడూ జన్మించడానికి రఘు మహారాజు వంటి సచ్చరితులతో పవిత్రమైన రఘు వంశమే తగినది కావడం వలన, రఘు చక్రవర్తికి ప్రాశస్త్యం లభించి కావ్యానికి రఘు వంశం అన్న పేరు స్థిరపడిపోయింది. ఈ కావ్యంలోని కథలలో ఐక్యంలేదనీ, రామకథలో రామాయణంలోని రచనా సౌందర్యం కానరాదనీ, కొందరు విమర్శకుల అభిప్రాయం.

2. **కుమార సంభవం :-** ఇది పదిహేడు సర్గల కావ్యం. కుమార సంభవం, రఘు వంశం అన్న ఈ రెండు గ్రంథాలను "కావ్యాలు" అనడం కన్నా లఘు పురాణాలనడం సముచితంగా ఉంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. వీటి సౌందర్యం కథా విషయంలో కాకుండా కథా పద్ధతిలో ఉండడం విశేషం. అంటే విషయానికి కాకుండా రీతికి ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చినట్లన్నమాట. ఈ కుమార సంభవంలోని కథా వస్తువు, శివ పురాణం నుండీ, స్కాంద పురాణం నుండీ కాళిదాసు గ్రహించి ఉండాలి.

పార్వతీ దేవి జననం, తారకుని దురాగతాలను సహించలేని దేవతలు తామనుభవిస్తున్న బాధలను, పరమేష్టితో మొరపెట్టుకోవడం, ఈయన ఆదేశం మేరకు, శివపార్వతులను సంధించడానికి దేవేంద్రుడు, మన్మథుని పంపడం, మారుని దహనం, రతీదేవి విలాపం, పార్వతీ దేవి తపశ్చర్య, శివుడు ప్రసన్నుడు కావడం, పార్వతీ పరమేశ్వరుల పరిణయం, గిరిజా శంకరుల ప్రణయ లీలలు, కుమార సాహసం వర్ణింపబడ్డాయి. ఈ కావ్యంలో వీర రసం కన్నా శృంగార రసమే మిన్నగా ఉన్నట్లు విమర్శకుల అభిప్రాయం. పూర్వార్థంలో గోచరించే కావ్య సౌందర్యం, ఉత్తరార్థంలో లేనందువల్ల ఈ తరువాతి భాగాన్ని కాళిదాసు కాక ఇంకెవరైనా రచించి ఉండవచ్చునని కొందరు అభిప్రాయపడ్డారు. జగత్పితరులైన పరమేశ్వరుని ప్రణయ క్రీడను వర్ణించిన కాళిదాసును, మమ్మటుడు మొదలైన వారు తీవ్రంగా ఆక్షేపించారు. ప్రకృతి వర్ణనం వ్యంగ్య ప్రధానమైన శృంగార రస పోషణ కుమార సంభవంలో హృదయంగమంగా ప్రకటితమయ్యాయి.

(C) **రూపకాలు :-**

1. **మాళవికాగ్ని మిత్రం :-** కాళిదాసు రచించిన మొట్టమొదటి నాటకం. శుంగ వంశానికి చెందిన అగ్నిమిత్రుని కథ ఈ నాటకంలోని ప్రధాన ఇతివృత్తం. 'మాళవిక' అనే స్త్రీని అగ్నిమిత్రుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. శుంగ వంశపు రాజులు బ్రాహ్మణులు.

మౌర్య వంశంలోని చివరివాడు బృహద్రథుడు. ఇతనిని వధించి పుష్యమిత్రుడన్న సేనాని మగధ సామ్రాజ్యాన్ని వశపరుచుకున్నాడు. ఆ పుష్య మిత్రుని కుమారుడే ఈ అగ్ని మిత్రుడు. కాళిదాసు కాలం నాటికి ఈ పుష్య మిత్రాదుల ప్రతిష్ఠ ఏ మాత్రం తరిగిపోలేదు.

ఇది అయిదు అంకాల నాటకం. ప్రధానమైన రసం శృంగారం. ఈ నాటకం ఇతి వృత్తం - రాజు అగ్నిమిత్రుడు ఒక స్త్రీని ప్రేమించాడు. ఆ స్త్రీ రాణి ధరణీదేవి దాసి. ఈ విషయం తెలిసిన తరువాత, రాణికి కోపం వస్తుంది. తరువాత ఆ స్త్రీ బంధువు కావడం వల్ల కోపం తగ్గిపోతుంది. రాజుకు, ఆమెకు వివాహమౌతుంది. సంక్షిప్తంగా ఈ నాటకంలోని కథ ఇదే.

2. **విక్రమోర్వశీయం :-** విక్రమౌర్వశీయ నాటకం కాళిదాసుని రెండవ రచన. అప్సరాంగన ఊర్వశికి, పురూరవునకు మధ్య నడచిన ప్రేమ గాథ. ఈ కథ వేదం లోనూ, భాగవతం లోనూ ఉంది. వ్యాసుడీ కథను పౌరాణికంగా వ్రాసాడు. కాళిదాసు నాటకంగా వ్రాసాడు.

పురూరవ చక్రవర్తికి విక్రముడనే పేరు. ఈ పేర్లలోని అంతరార్థాన్ని జర్మనీ పండితుడు "మాక్స్‌ముల్లరు" ఈ విధంగా వివరించాడు. ఊర్వశి అంటే ఉదయ కాలపు పొగమంచు. "విక్రముడు" మానవ రూపంలో చిత్రింపబడిన సూర్యుడు. ఈ సూర్యుడు ప్రకాశించునపుడు మంచు విడిపోతుంది. ఈ నాటకంలో ఉన్న సౌందర్యమంతా రాజు గారికి పట్టిన పిచ్చిని కాళిదాసు విచిత్రంగా చిత్రించడంలో ఉంది.

3. **అభిజ్ఞాన శాకుంతలం :-** కాళిదాసుని పై రూపకాల కన్నా 'అభిజ్ఞాన శాకుంతలం' రమ్యమైన నాటకం. "కావ్యేషు నాటకం రమ్యమ్ తత్ర రమ్యా శకుంతలా" అనే నానుడి ఈ నాటకం ప్రాశస్త్యాన్ని చెబుతుంది. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం సౌందర్యాన్ని పాశ్చాత్యులు కూడా కొనియాడారు.

ఈ నాటకం కథా వస్తువు ప్రసిద్ధమైనది. రాజు దుష్యంతుడు వేటకై అడవికి వెళ్లి విశ్రమించడానికి కణ్వాశ్రమానికి వెడతాడు. అక్కడ మొక్కలకు నీరు పోస్తూ ఉన్న శకుంతలను చూసాడు. చూసి ఆమెను ప్రేమించాడు. ఆమె జన్మ వృత్తాంతాన్ని తెలుసుకుంటాడు. గాంధర్వంగా ఆమెను వివాహమాడాడు. కార్యాంతరం వల్ల రాజధానికి వెడుతూ ఒక ఉంగరాన్ని గుర్తుగా యిస్తాడు. దుష్యంతుని విరహం వల్ల ఖిన్నురాలైన శకుంతల దుర్వాసునికి ఆతిథ్యం ఇవ్వకపోవడం వల్ల దుర్వాసుని శాపగ్రస్తురాలైంది. కణ్వుడు సోమ తీర్థం నుంచి వచ్చి ఆమెను తగిన సమయంలో భర్త దగ్గరకు పంపుతాడు. రాజు దుర్వాస శాపం వల్ల శకుంతలను చూచిననూ గుర్తించడు, తిరస్కరిస్తాడు. ఆమె అప్సరసల ప్రభావంతో మారీచుని ఆశ్రమంలో కుమారుని ప్రసవిస్తుంది. దుష్యంతుడు తను శకుంతలకు యిచ్చిన ఉంగరాన్ని చూచి ఆమెను ఎన్నోసార్లు తలచుకుంటూ విరహ వేదనతో బాధపడతాడు. ఇంతలో దేవకార్యం కోసం ఇంద్రుడు పిలవగా దేవతలకు సహాయం చేసి అమరావతి నుంచి తిరిగి వస్తూ మారీచాశ్రమంలో యున్న సర్వదమనుని, శకుంతలను చూసి వారిరువురిని పరిగ్రహిస్తాడు.

ఇంత చిన్న కథను తీసుకొని కాళిదాసు నాటక విన్యాసాలతో, కథా మలుపులతో సుందరంగా చిత్రీకరించాడు. ఈ నాటకంలో ఆయా సందర్భాల్లో రచించిన శ్లోకాలు సాహితీ రంగంలో ఎంతో విలువైనవి, ప్రసిద్ధమయిన నాలుగు శ్లోకాలు భారతీయ సంస్కృతిని తెలుపుతాయి. కూతురు అత్తవారింటికి వెడుతున్నప్పుడు కన్న తండ్రి దుఃఖ భారం ఎలా యుంటుందో ఈ శ్లోకంలో వర్ణిస్తాడు కాళిదాసు.

1. యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్ట ముత్కంఠయా
కంఠ స్తంభిత బాష్పవృత్తి కలుషశ్చింతా జడం దర్శనమ్ ।
వైక్లబ్యం మమ తావదీదృశ మహో స్నేహా దరణ్యౌకసః
పీడ్యంతే గృహిణః కథంను తనయా విశ్లేష దుఃఖైర్నవైః ॥

శకుంతల అత్తవారింటికి వెడుతున్నపుడు కణ్వుడు అనుకొనే మాటయిది. నేడు శకుంతల వెడుతోందనే మాట హృదయాన్ని తాకుతోంది. డగ్గుత్తికతో హృదయం శోక పూరితమవుతుంది. వియోగ దుఃఖంతో చింతతో చూపు కనుపించుట లేదు. అరణ్యంలో చిన్నప్పటి నుంచీ ఉన్న నాకే శకుంతలను పెంచడం చేత ఇంత దుఃఖంగా యుంటే నిజంగా కనిపెంచిన కన్న తలిదండ్రులు కన్యను అత్తవారింటికి పంపుతూ ఎంత దుఃఖిస్తారో కదా!

2. పాతుంన ప్రథమం వ్యవస్యతి జలం యుష్మాస్వ పీతేషుయా
నాదత్తే ప్రియమండనాపి భవతాం స్నేహేన యా పల్లవమ్ ।
ఆద్యేవః కుసుమ ప్రసూతి సమయే యస్యా భవత్యుత్సవః
సేయం యాతి శకుంతలా పతి గృహం సర్వైరనుజ్ఞాయతామ్ ॥

వన దేవతలనుద్దేశించి కణ్వుడు ఇలా అంటున్నాడు.

ఓ వృక్షములారా! మీకు నీరు పోయకుండా జలాన్ని కూడా ముట్టేది కాదు శకుంతల. కురులనలంకరించుట ఇష్టమయినప్పటికీ ఒక్క చిగురుటాకును కూడా కోయలేదు. మీ మొదటి పూవు పరిమళించిన వెంటనే ఆమె పండుగ చేసికొనెడిది. ఆ ఈ శకుంతల నేడు అత్తవారింటికి వెళ్లుచున్నది. అందరూ అనుమతించెదరు గాక.

3. శుశ్రూషస్వ గురూన్, కురు ప్రియసఖీ వృత్తం సపత్నీజనే
భర్తు ర్విప్రకృతాపి రోషణతయా మాస్మ ప్రతాపం గమః ।
భూ యిష్ఠం భవ దక్షిణా పరిజనే భాగ్యేష్వనుత్సేకినీ
యాన్త్యేవం గృహిణీ పదం యువతయో వామాః కుల స్యాధయః ॥

అత్తవారింటికి వెళ్లే కూతురికి తండ్రి ఉపదేశించిన మాటలివి.

పెద్దవారిని సేవించుము. సవతులతో సఖ్యముగా నుండుము. భర్త కోపించిననూ తిరిగి మాటలాడకుము. పరిజనుల యందు మృదువుగా వ్యవహరించుము. భాగ్యములు కలిగినపుడు గర్వించకు. ఇలా ప్రవర్తించిన స్త్రీలే గృహిణి అనిపించుకుంటారు. అట్లు కాని వారు కులమునకు మనోవ్యథను కలిగించేవారు (తలనొప్పి వంటి వారు).

4. అస్మాన్ సాధు విచింత్య సంయమ ధనానుచ్చైః కులంచాత్మనః
త్వయ్యస్యాః కథమ ప్యబాంధవ కృతాం స్నేహ ప్రవృత్తించ తామ్ ।
సామాన్య ప్రతిపత్తి పూర్వకమియం దారేషు దృశ్యా త్వయా
భాగ్యాయత్తమతః పరం నఖలు తద్వాచ్యం వధూబంధుభిః ॥

అభిజ్ఞాన శాకుంతలంలో ఇది కణ్వ సందేశం. దుష్యంతునికి పంపిన సందేశం.

సంయమధనులమైన మమ్ము బాగుగా విచారించి ఈ శకుంతలను సాధారణ గౌరవంతో ఆదరించుము. నీ కుల మర్యాదలననుసరించి మర్యాదగా చూసుకో. మీ ఇరువురి మధ్య స్వయంగానే ప్రేమను సద్భావించి ఇతర భార్యల కంటే మిక్కిలి గౌరవముగా చూసుకో. ఇక పై అంతయూ భాగ్యాధీనము. వధూ బంధువులు ఇక పై ఏమియూ చెప్పకూడదు.

ఈ నాలుగు శ్లోకాలు కణ్వుని చేత చెప్పిస్తాడు కాళిదాసు. ఇవి భారతీయ సంస్కృతి శాశ్వత విలువల్ని చిరస్థాయిగా నిరూపించే అమూల్యమయిన శ్లోకాలు. ఇవన్నీ చతుర్థాంకంలోనే యున్నాయి. అందుకే "తత్రాపి చ చతుర్థోంకః, తత్ర శ్లోక చతుష్టయమ్" అంటారు.

ఇలా శాకుంతలంలో ఉత్తమ నాటక రచనకు ఆపేక్షితములయిన కథోప కథనం చరిత్ర చిత్రణం, ప్రకృతి వర్ణనం, రసపుష్టి బాగుగా కలిగి యుండటం చేతనే ఈ నాటకం అందరికీ ప్రశంసా పాత్రమయింది. జర్మన్ దేశీయ పండితుడు గేడే మహాశయుడు రాసిన శాకుంతల ప్రశంసా వాక్యాలు మహా మహోపాధ్యాయ బలదదేవోపాధ్యాయుడు ఇలా సంస్కృతంలో అనువదించాడు.

వాసంతం కుసుమం ఫలంచ యుగపద్గ్రీష్మస్య సర్వంచయత్
యచ్చాన్యన్మనసో రసాయన మతః సంతర్పణం మోహనమ్ ।
ఏకీ భూతమ భూత పూర్వ మథవా స్వర్లోక భూలోకయో
రైశ్వర్యం యది వాంఛసి ప్రియ (సఖే సుహృత్) శాకుంతలం సేవ్యతామ్ ॥

మిత్రమా! వసంత ఋతువులో ఉన్న పూల వాసన, గ్రీష్మంలో ఉండే పండ్ల రుచి మొదలైన మనస్సుకు రసభరితమయిన ఇంకా ఏదైన వస్తువుల ఆహ్లాదాన్ని మైమరువుని కల్గిస్తుందో అవన్నీ ఒకేసారి స్వర్గలోక భూలోకముల యొక్క ఐశ్వర్యాన్ని కోరుకొన్నచో శాకుంతలాన్ని సమగ్రంగా చదువు.

నాటక రచనలో కాళిదాసు సాధించిన పరిణతికి మూడు నాటకాలు ప్రత్యక్ష సాక్ష్యాలు. మాళవికాగ్ని మిత్రం నాటకం కంటే విక్రమోర్వశీయంలోను, ఆ నాటకం కన్నా శాకుంతలంలోనూ కాళిదాసు రచనా ప్రతిభ అధికాధికంగా ద్యోతకమవుతూ వచ్చింది. శాకుంతలం నాటకంలో ఈ ప్రతిభా ప్రభలు పరమోన్నత స్థాయినందుకున్నాయి. ఈ మూడు నాటకాలను, నిశితంగా అధ్యయనం చేసినపుడు కాళిదాసుని మనః పరిపాకం తాలూకు క్రమ పరిణామం స్పష్టంగా తెలియవస్తుంది. ఇతడు ప్రధానంగా శృంగార రచయిత.

## 5. కాళిదాస కవితా శైలీ వైశిష్ట్యము :-

కాళిదాసు శృంగార రసాన్ని పోషించడంలో సర్వసమృద్ధుడు. శృంగారంలోను కాళిదాసు విప్రలంభ పరిపోషణం అనన్యా సాధారణం అను విమర్శకుల అభిప్రాయం ప్రకారం కావ్య కళాపక్షాలైన శబ్దార్థ గుంఫనం, అలంకార విన్యాసాల కంటే చమత్కారాన్ని కల్గించే రసపరిపాకం చొప్పించ గల కవియే మహాకవి అవుతాడు. మహా కావ్యంలో కావల్సిన రస పరిపుష్టి కాళిదాసు కావ్యాలలో లభిస్తాయి. కాళిదాసు వస్తు వర్ణనలోనే ఎంతో చమత్కార పూర్ణమయిన హృదయ పక్షాన్ని ప్రకటించగలడు.

మానవ జీవనం యొక్క సర్వాంగ సంపూర్ణమయిన చిత్రం కాళిదాసు రఘు వంశంలో చిత్రిస్తాడు. ప్రేమాతిశయాన్ని ప్రకృష్టంగా నిరూపించాడనికే కుమార సంభవం వ్రాసాడు.

రఘు వంశంలో ద్వితీయ సర్గలో ఆశ్రితులను పరిపాలించడానికి దిలీపుడు తన శరీరాన్ని అర్పించే సంఘటనతో కవి గొప్ప ఆదర్శాన్ని చూపించాడు. రఘువు విజయాత్ర వర్ణనంలో ఆయా దేశాల చిత్రణం మనో వినోదాన్ని కల్గిస్తుంది. ఇందుమతీ

స్వయంవర వర్ణనంలో మనోభావ జ్ఞానము యొక్క ప్రకృష్టమైన పరిచయం చేసాడు. దశరథునికి సంతానం లేకపోవుట, ముని వృత్తాంతాలతో సంతాన హీనత యొక్క క్లేశాన్ని చూపించాడు. సీతా పరిత్యాగం సందర్భంలో రాముని మాటల్లో కర్తవ్యం ప్రేమలలో ఈ రెండింటిలో కర్తవ్యమే ప్రధానమని నైతిక గొప్పదనాన్ని చూపించాడు. చివరికి అగ్నివర్ణుని ఘట్టంలో అతికాంతాసక్తి అనిష్టమని చూపించాడు.

రఘు వంశంలో అద్వితీయోపమాన విన్యాసం కాళిదాసుకి మంచి కీర్తిని తెచ్చి పెట్టింది. ఇందుమతి స్వయం వర మండపంలో ఆయా రాజులు దగ్గరకు సమీపించినపుడు ఆమె నడుస్తున్న దీప శిఖలా రాజ మార్గంలో ఉన్న ప్రతిభవన్ని ఎలా ప్రకాశింప చేస్తుందో అలా ప్రకాశింప చేసిందని వర్ణిస్తాడు. అందుకే ఆయనకు 'దీపశిఖా' అని పేరు వచ్చింది.

సంచారిణీ దీప శిఖేవ రాత్రౌ యం యం వ్యతీయాయ పతింపరాసా ।

నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రపేదే వివర్ణ భావం సస భూమి పాలః ॥

ఇలాగే "అయోఘ నేనాయ ఇవాతితప్తం ।

వైదేహి, బంధోర్హృదయం విదద్రే"

ఇటువంటి ఉపమానాలు కాళిదాసు ఉపమా విన్యాసాలకి ఉదాహరణలు. అందుకే కాళిదాసుకి "ఉపమా కాళిదాసస్య" అనే సూక్తి సార్థకమయింది.

శబ్ద విన్యాసంలోకూడా కాళిదాసు గొప్పవాడు.

ఇత్థం <u>ద్విజేన</u> <u>ద్విజ</u> రాజ కాంతి రా<u>వేది</u>తో <u>వేద</u>విదాం వరేణ్యః ।

<u>ఏనో</u> నివృత్తేంద్రియ వృత్తి <u>రేనం</u> <u>జగాద</u> భూయో <u>జగదేక</u> నాథః ॥

ఇటువంటి పదాల కూర్పు వేరే కవి దగ్గర కనిపించదు.

కుమార సంభవం ప్రథమ సర్గంలో హిమాలయ వర్ణనంలో వాస్తవిక వస్తు విన్యాస సహకృతమయిన కావ్యకళ డెందాన్ని రంజింప చేస్తుంది. తృతీయ సర్గలో శృంగారోద్వేజకమయిన సామగ్రి సంకలనంలో ముందు వసంత శోభను తరువాత కానన రామణీయకాన్ని అటు పిమ్మట వసంత పుష్పాలను అలంకరించుకున్న పాలిండ్ల భారంతో కొంచెం వంగిన, బాల సూర్యుని రంగు గల వస్త్రాన్ని ధరించి వస్తున్న పర్వత రాజు పుత్రిని చూపించాడు. ఈమెను చూసిన శంకరుడు ఎలా ఉన్నాడని వర్ణించే ఈ శ్లోకం శృంగార రసానికి ఎంతో పరిపోషకం.

హరస్తు కించిత్పరిలుప్త ధైర్యః చంద్రో దయారంభ ఇవాంబురాశౌ ।

ఉమాముఖే బింబ ఫలాధరోష్ఠే వ్యాపార యాయాస విలోచనాని ॥

చంద్రోదయారంభంలో సముద్రుడు వలె చలిస్తూ శంకరుడు ధైర్యాన్ని కోల్పోయినవాడై దొండపండు వంటి పెదవులు గల ఉమా ముఖమందు చూపులను మరల్చినాడు.

ఇలాగే శాకుంతలంలో సౌందర్య భావన రస సిద్ధికి పరాకాష్ఠగా వర్ణించాడు.

అధరః కిసలయరాగః కోమల విటపానుకారిణౌ బాహూ ।

కుసుమ మివ లోభనీయం యౌవన మంగేషు సన్నద్ధమ్ ॥

పెదవులు చిగురుటాకులలా ఎర్రగా ఉన్నాయి. కోమల రెమ్మలతో సమానంగా ఉన్నాయి బాహువులు. పువ్వులా ఆకర్షించదగిన యౌవనం ప్రతి అవయవంలోనూ ప్రవేశించింది, అనే భావం గల ఈ శ్లోకం బాహ్య ప్రకృతిలో ఆంతరిక ప్రకృతి యొక్క సామంజస్యాని తెలియజేస్తుంది. అందుకే రస సిద్ధ కవులలో కాళిదాసు అగ్రగణ్యుడు.

శకుంతల ప్రయాణ సమయంలో కణ్వుని పరితాపం సకల జన సంవేద్యం. సఖురాండ్రయిన అనసూయ ప్రియంవదల కంటి నీరు అందరికీ తెలిసిందే. ఈ భావ స్ఫూర్తి చేతనాల్లోనే కాదు అచేతనాల్లో కూడా వర్ణించగల కాళిదాసు నేర్పుని ఇక్కడ చూద్దాం.

ఉద్గీర్ణ దర్భ కబళా మృగీ పరిత్యక్త నర్తనా మయూరీ ।
ఉపసృత పాండు పత్రా ముంచంత్యశ్రూణీవలతాః ॥

శకుంతల అత్తవారింటికి బయలుదేరినపుడు ఆశ్రమంలో ఉన్న లేడి సగం కొరికిన దర్భలను నెమరి వేయకుండా అలాగా చూస్తోంది. ఆ ధర్భలు నోటి నుండి జారుతున్నాయి. నృత్యం చేస్తున్న నెమలి నృత్యాన్ని మానేసింది. లతలన్నీ కన్నీరు కార్చుచున్నట్టుగా ఎండుటాకులను రాలుస్తున్నాయి.

కాళిదాసు నాటకీయ పాత్రలు సజీవాలు. ఉపమలు శోభాదాయకాలు. భావాలు హృదయానురంజకాలు.

మేఘ సందేశంలో కాళిదాసు కవితా శైలి అద్వితీయం. అందుకే వ్యాఖ్యాతృ సార్వభౌముడు మల్లినాథుడు "మాఘే మేఘే గతం వయః" అంటాడు. మేఘ సందేశ కవితా వైశిష్ట్యం ఏమిటంటే ఇచట ప్రకృతి వర్ణనంలో కూడా యక్షుని విరహావస్థ కనిపిస్తూ ఉంటుంది.

వేణీ భూత ప్రతను సలిలా సావతీతస్య సింధుః
పాండు చ్ఛాయా తటరుహ తరుభ్రంసిభిర్జీర్ణ పర్ణః ।
సౌభాగ్యం తే సుభగ విరహా వస్థయా వ్యంజయన్తీ
కార్శ్యం యేన త్యజతి విధినా స త్వయ్యేవోప పాద్యః ॥

ఇచట సింధు నది ప్రవాహం విరహిణి జడలా కృశించింది. తీరాల్లో ఉన్న చెట్ల ఎండుటాకులు పడుతుండటం చేత పాలిపోయింది. ఆ నది అలా ఉండటానికి కారణం నీ విరహమే. నీవు భాగ్యవశాత్తు వెళ్లావు కాబట్టి ఆ నది కార్శ్యాన్ని (చిక్కిపోవడాన్ని) విడిచి వెడుతుంది.

"తన్వీ శ్యామా, శిఖరిదశనా పక్వ బింబాధ రోష్ఠీ"

అని ఆ యక్షుని ప్రియురాలిని వర్ణిస్తూ కాళిదాసు యౌవన మధ్యస్థురాలైన ఆమె కోమలాంగి అనీ, మల్లి పూవులు వంటి పలువరుస కలదనీ, బాగుగా పండిన దొండపండు వంటి పెదవులు కలదనీ చెప్పి చివరకు ఆమె స్త్రీ జాతికి బ్రహ్మగారి మొదటి సృష్టి అని ముగిస్తాడు.

ఋతు సంహార కావ్య శైలి కూడా సరసమైనది.

గృహీత తాంబూల విలేపన స్రజః పుష్పాసవా మోదిత వక్త్ర పంకజాః ।
ప్రకామ కాలాగురు ధూపవాసితం విశంతి శయ్యా గృహముత్సుకాః స్త్రియః ॥

ఉత్కంఠ గల స్త్రీలు తాంబూలం, మైపూతలు, పూదండలు పుచ్చుకొని, పుష్పాస వాదులను సేవించుట చేత సుగంధితమైన ముఖ పద్మములు కల వారగుచూ, చక్కటి అగరుధూపములచే ఘుమ ఘుమలాడు శయన గృహాలను ప్రవేశించుచున్నారు.

ఎంతో గంభీరమైన భావాలను సరళంగా వర్ణించ గల కాళిదాసు కవిత వైదర్భీరితి సమన్వితమైనది.

గాహంతాం మహిషా నిపాన సలిలం శృంగైర్ముహుస్తాడితం
ఛాయాబద్ధ కదంబకం మృగకులం రోమంధమభ్యాస్యతు ।
విస్రబ్ధం క్రియతాం వరహా తతిఖ ర్ముస్తాక్షతి పల్వలే
విశ్రాంతిం లభతామిదం చశిథిల జ్యాబంధ మస్మద్ధనుః ॥

అడవి దున్నలు మాటి మాటికి కొమ్ములతో కుమ్మిన చెరువులలో మునుగు గాక, చెట్ల నీడను మృగ సముదాయం సామూహికంగా కూర్చుని నెమరు వేసుకొను గాక. వరాహ సమూహాలు బురదలలో ఉన్న తుంగ ముస్తులను (తుంగ గడ్డి విత్తులను) ఇష్టానుసారంగా పాడుచేయుగాక ఈనారిని సడలించిన మాధనుస్సు కూడా విశ్రాంతిని పొందు గాక.

ఇక్కడ నాలుగు వాక్యాల సమన్వయం చాలా తేలికగా తెలుస్తూ ఉంటుంది. రామాయణం వాల్మీకి ఎంత మృదుమధురంగా తేటతెల్లంగా వ్రాసాడో వ్యాసుని కవిత ఎంత తేలికగా (కొన్ని కొన్ని చోట్ల) ఉంటుందో అలాగే కాళిదాసు కవితా శైలి కూడా ఉంటుంది. సమగ్ర గుణ గుంఫితమైన వైదర్భీ కవిత ఈ కావ్యాల్లో ప్రస్ఫుటంగా కనబడుతుంది కనుకనే అభిజ్ఞులంటారు.

> "వాల్మీకే రజని ప్రకాశితతమా వ్యాసేన లీలావతీ ।
> వైదర్భీ కవితా స్వయం వృతవతీ శ్రీ కాళిదాసం వరమ్ ॥ అని,

వాల్మీకి నుంచి బయలుదేరిన వైదర్భీ కవిత వ్యాసుని దగ్గర విలాసాలను నేర్చుకొని కాళిదాసు అనే వరుని స్వయంగా వరించినదట.

కుమార సంభవం పంచమ సర్గలో పార్వతీ దేవి తపస్సు, తపో విధానము, శంకరుడు బ్రహ్మచారి వేషంలో వచ్చి పార్వతిని పరీక్షించడం, పరీక్షలో పార్వతి నిశ్చయం తెలుసుకోవడం, పరమేశ్వరుడు ప్రత్యక్షం అవడం, గౌరీ శివ సమాగమం ప్రధానాంశాలు. ఈ సర్గలో 86 శ్లోకాలున్నాయి. మొదటి శ్లోకం నుంచి 84వ శ్లోకం వరకూ వంశస్థ వృత్తంలో వ్రాయబడ్డాయి. 85, 86 ఈ రెండు శ్లోకాల్లో ఛందస్సు వసంత తిలక.

## (B) పాఠ్య భాగ వివరణం - కథా సారాంశం :-

## 1. పార్వతి తపస్సుచే శివుని వశపఱచుకొనుటకు నిశ్చయించుకొనుట :-

మంచు కొండ మీద శివుడు తపస్సు చేస్తున్నాడు. హిమవంతుడు తపస్సు చేస్తున్న శివుని సపర్యల కోసం పార్వతిని నియమించాడు. పార్వతి శివుని సేవిస్తూ శివ సాంగత్యాన్ని కోరుకుంటుంది.

ఇంతలో తారకుడనే రాక్షసుడు బ్రహ్మ వరం చేత దేవతలను పీడిస్తాడు. పీడితులయిన దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి తారకుని ఆగడాలు చెప్పి రక్షించమని వేడుకొంటారు. బ్రహ్మ తారకుని సంహరించడానికి శివుని వీర్యం వల్ల పుట్టిన కుమారుడే సమర్థుడని చెబుతాడు. శివ వీర్యాన్ని పార్వతియే భరించగలదు. గౌరీ శివ సమాగమం కోసం ప్రయత్నించండని సలహా చెప్పాడు. ఇంద్రుడు మన్మథుని శివ తపో భంగానికి (గౌరీ శివ సమాగమానికి నాందిగ) హిమాలయాలకు పంపుతాడు.

హిమాలయాల్లో వసంతుడు విజృంభించాడు. పార్వతి సర్వాంగ సుందరంగా అలంకరించుకుని శివుని సపర్యలు చేస్తోంది. ఇదే సమయం అనుకొని మన్మథుడు సంమోహనాస్త్రాన్ని శివుని మీద సంధించాడు. శివుడు విచలితుడయ్యాడు. పార్వతిని ప్రేమగా చూసాడు. ఇంతలో తన చిత్త విచలనానికి కారణమేమిటని పరికించాడు. మన్మథుడని తెలుసుకున్నాడు. మూడవ కంటిని తెరిచాడు. మన్మథుని దగ్ధం చేసాడు.

ఇలా చూస్తుండగానే పినాకి మన్మథుణ్ణి దగ్ధం చేయగా పార్వతికి శివుని పొందాలనే కోరిక భగ్నమయింది. ఆమె తన అందాన్ని డెందంతో నిందించుకుంది. ప్రియులు ప్రసన్నమయితేనే కదా సుందరాగుల సౌందర్యం సార్థకమయ్యేది.

ఆమె తపము చేత తన సౌందర్యానికి సార్థకం చేకూర్చాలనీ, శివుని పతిగా పొందాలనీ నిశ్చయించుకుంది. పరమేశ్వరుని వంటి పతి, అర్థ శరీరాన్నిచ్చేన ప్రేమ పొందాలంటే తపస్సే కదా సాధనం. లేకపోతే ఈ రెండు ఎలా సిద్ధిస్తాయి.

## 2. మేనాదేవి పార్వతిని తపస్సు చేయవద్దని వారించుట :-

శివునికి మనసిచ్చిన పార్వతి తపస్సు చేయడానికి ప్రయత్నిస్తోందని విని మేనాదేవి హృదయ పూర్వకంగా కౌగిలించుకుని కఠోరమైన తపస్సు నుంచి కుమార్తెను నివారించడానికి ఇలా పలికింది.

ఓ పార్వతీ! మనస్సుకు అభీష్టులయిన శచ్యాది (శచీ దేవీ మొదలయిన వారంతా) దేవతలు మన ఇంటిలోనే ఉన్నారు కదా. కఠోరమైన తపస్సుకు కోమలమైన నీ శరీరము తగునా? మృదువైన దిరిసెన పూవు తుమ్మెద పదములను సహించును గానీ, గండ భేరుండ పక్షి పాదములను సహించునా?

అని స్థిరమైన నిశ్చయము గల పార్వతిని అనునయ పూర్వకంగా సామాదుల చేత వారించినప్పటికీ మేనా దేవి ఆమెను తపః ప్రయత్నాన్నుంచి మరల్చ లేకపోయింది. అభీష్ట విషయములందు లగ్నమైన మనస్సును, పల్లమెరిగిన నీటిని ఎవరు మరల్చ గలరు.

## 3. పార్వతి గౌరీ శిఖరానికి చేరుకొనుట :-

దృఢనిశ్చయురాలైన పార్వతి సఖురాండ్ర ద్వారా ప్రసంగవశాత్తూ తన కోరికను తెలుసుకున్న తండ్రి హిమవంతుని "ఫలోదయము వరకూ తపస్సు చేయుటకు తన్ను అరణ్యములకు పంపుము" అని ప్రార్థించినది.

మహాశయుడైన హిమవంతుడు పార్వతి యొక్క తగిన ఆసక్తిని చూసి సంతోషించిన వాడై ఆమెను తపస్సుకై అనుమతించెను. పార్వతి తండ్రి ఆజ్ఞను పొందినదై నెమళ్లు నాట్యమాడు సుందరమైన హిమవన్నగ శిఖరము నధిరోహించెను. ఆ శిఖరమే నేడు ప్రజలలో "గౌరీ శిఖరము" అని ప్రసిద్ధికెక్కినది.

## 4. పార్వతి తపో వేషమును ధరించుట :-

వీడని పట్టుదల గల ఆ పార్వతి చందనాది మైపూతలచే సుగంధితమైన తన మెడ నుండి ముత్యాల హారములను తీసి ఎఱుపు పసుపు కలియక గల కషాయ వల్కలమును (నార చీరను) ఉన్నతమైన పాలిండ్ల నుంచి వ్రేలాడునట్లుగా ధరించెను. పాలిండ్ల నుంచు వ్రేలాడు చీర పాలిండ్లు ఎత్తుగా ఉండటం చేత మిగిలిన నాభీకటి ప్రదేశములను స్పృశించుట లేదు.

(ముంగురులు) కురుల చేత సుందరంగా కనిపించే ఆమె ముఖము నేడు జటల చేత కూడా అంత అందంగానే ప్రకాశిస్తోంది. కమలం గండు తుమ్మెదల చేతనే కాదు నాచుతో కూడా ప్రకాశిస్తుంది కదా.

నిత్యము మొలనూలును (వడ్డాణమును) ధరించుట చేతనే సౌకుమార్యము చేత రక్తమును చిందు ఆమె కటి ప్రదేశమందు స్పర్శ చేతనే గగుర్పాటు కలిగించు గరుకు గల దర్భపు త్రాటిని ముప్పేటగా ధరించినది.

ప్రతి దినము అధరాన్నిలాక్షా రసంతో ఎర్రగా చేసే, బంతిని తాకటం చేతనే కందే ఆమె చేతులు దర్భల స్పర్శ చేత వరిపిడి చేయి బడినవి. ఆమె ఎల్లప్పుడు జపమాలను చేతితో తిప్పుచునే యున్నది.

హంస తూలికా తల్పము పై అటునిటు పొరలుచుటచే కేశముల నుండి జారిన పుష్పములకే కందే సుకుమార స్వభావం గల పార్వతి బండ రాళ్ల మీద చేతినే దిండుగా అమర్చుకొని నిద్రించుచున్నది. జాగ్రవస్థ యందు కూడా కఠిన శిలలపైనే కూర్చుని యుండెడిది.

వ్రత దీక్షను ధరించిన పార్వతి తపము పూర్తియగు వరకూ, తన విలాస చేష్టలను లతల తీగెలందను, తన చంచలమైన చూపును ఆడు లేళ్ల యందును (రెంటిని రెంటి యందును) పదిలపరచుకొన్నది.

1. **పార్వతి తపస్సు :-** పార్వతి అలసట లేనిదై చిన్న మొక్కలను పాలిండ్ల వలేయున్న ఘటములతో స్వయముగా పయోధారలచే సుతులను వలే పెంచినది. తరువాత కుమారస్వామి పుట్టిననూ చెట్ల యందు పుత్ర వాత్సల్యము ఆమెకు పోలేదు. ఆమె ప్రతి దినము అడవి యందలి నీవార ధాన్యములతో స్వయముగా లేడి పిల్లలను ప్రేమగా పెంచెను. ఆ విశ్వాసంతో ఆమె లేడికళ్ళ పెద్దవా? తన కళ్ళు పెద్దవా? అని సఖీ సమక్షంలో కొలుచునపుడు వాటికి నేత్ర పీడనకల్గినప్పటికీ ఆ లేళ్ళ ఆపీడను సహించినవి.

నిత్యమూ పవిత్రమైన జల తీర్థములందు స్నానము చేసి, అగ్ని హోత్రాదులను నిర్వర్తించి వల్కల వస్త్రములనే ధరించి స్తోత్ర పాఠములను చేయు ఆ పార్వతిని దర్శించుటకు తపో నిధులైన మహర్షులు కూడా వచ్చెడివారు. ధర్మవృద్ధులందు వయస్సుతో పని ఏమి?

ఇట్లు పార్వతి తపః ప్రభావం చేత ఆ వనంలో యుండే పరస్పర విరోధం గల జంతువులు మైత్రితో ఉన్నాయి. చెట్లు చక్కని పండ్లను కాస్తున్నాయి. అతిధులకు పూజ జరుగుతోంది. ఈ విధంగా ఆ వనమంతా పావనమైంది. ఆశ్రమాలలో త్రేతాగ్నులు (దక్షిణాగ్ని, ఆహారనీయం, గార్హపత్యం) రక్షింపబడుతున్నాయి.

ఇంత కఠోరమైన తపస్సు చేసినా తపస్సు ఫలోన్ముఖం కాలేదని తెలిసుకొన్న పార్వతి తన శరీర సౌకుమార్యాన్ని కూడా లెక్కింపక గొప్ప తపస్సుని చేయుటకు ఆరంభించింది.

బంతి యాటలచేతనే కందిపోయే ఆమె ఎంతో కఠోరమైన తపస్సు చేయుటకు ఆరంభించెను. అందుచేత ఆమె శరీరం బంగారు తామర పూవులతో చేయబడిందని నిశ్చయింపవచ్చును. కనుకనే ఆమె శరీరం స్వభావం చేత కోమలం గాను, కఠోరంగా కూడా యున్నది.

ఎండల కాలంలో మండుటెండల్లో నాలుగు వైపుల రగులుతున్న అగ్నిహోత్రాల మధ్య మిట్టమధ్యాహ్నం తదేక దీక్షతో కళ్ళ చూపును పోగొట్టే కాంతి గల సూర్యుని చూసెడిది.

అలా సూర్యుని కిరణాల చేత సంతప్తమైన ఆమె ముఖం కమల కాంతులను ధరించింది. ఆమె కన్నుల కొలకులు నల్లటి రేఖలను పొందాయి.

అయాచితంగా (కోరుకొనకుండా) వచ్చిన నీటిని, రస రూపాలయిన చంద్ర కాంతులను మాత్రమే ఆస్వాదిస్తూ ఆమె నిత్యమూ ఆహార స్వీకరణము వ్రతము పూర్తయేంత వరకూ చెట్లువలెనే ఆచరించినది.

మండుటెండల్లో చాలా తపించిన ఆమె వర్షాకాల మందు వాన నీటి బిందువులతో తడిసిన భూమితో కూడా ఊష్మను పైకి వదిలిపెట్టినది.

వర్షాకాలంలో వాన నీటి యొక్క బిందువులు ముందు పార్వతి కనురెప్పలందు కొంత సమయముండి తరువాత జారినవై పెదవులందు కొట్టబడినవై పాలిండ్ల యందు ఛిన్నా భిన్నములై వళులందు క్రమముగా కలిసుకొని మరల నాభి యందు ప్రవేశిస్తున్నాయి. అందుచేత ఆమె కనురెప్పలందు పక్ష్మములు దట్టంగా ఉన్నాయనీ, పెదవులు మొద్దుబారి యున్నాయనీ, ఆమె వక్షోజాలు ఎత్తుగా యున్నాయని, నాభి లోతుగా యుందనీ పద్మినీ జాతి స్త్రీల యొక్క సాముద్రిక లక్షణాలు తెలియబడుతున్నాయి. ఆమె అంత వర్షంలోను పద్మాద్యాసనంలో కూర్చుని తపస్సు చేస్తోంది.

ఝంఝూ వానల్లో బట్ట బయలు బండరాళ్ళ మీద వానలో తడుస్తూ ఉన్న ఆ పార్వతి తపస్సుకు మెరుపులనే కళ్ళతో చూసే ఆ వర్షపు రాత్రులు సాక్షులు. నిరంతరమూ మంచుకురిసే చల్లని గాలులతో కూడిన పుష్య మాస రాత్రులందు నీటిలోనే కంఠ వరకూ ఉంటూ చీకటి పడటం చేత పరస్పరం చూసుకోలేక విరహంతో బాధపడుతున్న చక్రవాక పక్షులను జాలితో చూస్తూ కాలం గడిపింది.

ఆమె రాత్రుల యందు కమలములతోసమానమైన సుగంధము గల పెదవులనే ఆకులుతో తన ముఖం చేత చలికాలంలో మంచుచేత కమలాలు మాడినప్పటికి ఆ జల మందు కమలాలు వికసించాయా అన్నట్లు భ్రాంతిని గొలిపెడిది.

స్వయంగా రాలిన పండుటాకులను భుజిస్తూ ఉండేది. కాని తపస్సు ఫలించకపోవటంతో ఆ ఆకులను కూడా తినడం మాని వేసింది. ఇలా తపస్సు పరాకాష్ఠ అయింది. అందుచేతనే ఆమెను "అపర్ణ" అనిపిలుస్తూ ఉంటారు.

తామర తూడువలే మృదువైన ఆమె శరీరమును కఠోరమైన వ్రతముల చేత తపింప చేస్తూ నిత్యమూ కఠోర నియమాలతో సంపాదించిన మహర్షుల తపమును కూడా చాలా కించపరిచినది.

2. **కపట బ్రహ్మచారి వృత్తాంతము :-** ఇట్లు కఠోర తపము పార్వతి చేస్తుండగా లేడి చర్మమును, మోదుగ కర్రను ధరించిన బ్రహ్మచారి వాక్పటిమ కలవాడై బ్రహ్మమయమయిన తేజస్సుతో ప్రకాశిస్తూ మూర్తీభవించిన బ్రహ్మచర్యాశ్రమమా అని తలపించుచూ ఆ తపోవను ప్రవేశిస్తాడు.

పార్వతి ఆతిథ్యం యిస్తుంది, ఆదరిస్తుంది. కొంత మందికి కొందర్ని చూస్తే ఏదో ఒకరకమయిన ప్రేమాతిశయం ఆవిర్భవిస్తుంది. అలాగే ఈ బ్రహ్మచారిని చూచిన వెంటనే పార్వతికి ఆదరాభిమానం ఎక్కువయింది.

బ్రహ్మచారి అతిథి సత్కారాలను స్వీకరించి, కాసేపు విశ్రమించి, అమాయకంగా చూస్తూ మాటల యందు నేర్పుగా సక్రమంగా పార్వతిని అడిగాడు.

ఓ పార్వతీ! అగ్నిహోత్రాదులకు సమిధలు, దర్భలూ దొరుకుతున్నాయా? స్నానానికి నీరు యోగ్యంగా యుందా? ఒంటికి పట్టినంత తపస్సే చేస్తున్నావా? శరీరానికి మించిన తపస్సు చేస్తే అనారోగ్యం వస్తుంది. శరీరమే కదా ప్రముఖమైన ధర్మ సాధనం.

నీవు రోజూ స్వయముగా నీళ్ళు పోసి పెంచే చెట్లు ఏపుగా పెరుగుతున్నాయా?' చిగుళ్ళ తొడుగుతున్నాయా? ఎందుచేతనంటే అలక్తకరసంతో పాటల వర్ణము గల నీ అధరములతో ఈ చిగురుటాకులు తులతూగుచున్నాయి కదా!

లేత గడ్డితో ప్రతి రోజూ పెంచే ఈ లేడి పిల్లలు నీ మనస్సును దోచుకుంటున్నాయా? ఈ లేళ్ళ తమ కొంటె చూపులతో నీ చూపులను అనుసరిస్తున్నాయి సుమా.

'ఎచట అందమున్నదో అచట గుణములుండునని పెద్దలు చెప్పుదురు' ఈ సూక్తి నీ యందు సార్థకమగుచున్నది. నీ రూపమూ, శీలము తపస్యులకు కూడా ఉపదేశయోగ్యమయినవి.

నీ తండ్రి హిమవంతుడు సప్తర్షుల పూజలందుకున్న ఆకాశ గంగాజలాలతోనే పవిత్రుడు కాలేదు. నీ ఉదారమైన పవిత్రమైన నీ చరిత్ర శీలము చేతనే పుత్ర పౌత్ర సమేతంగా పవిత్రుడయ్యాడు.

ధర్మమే త్రివర్గంలో (ధర్మార్థకామాల్లో) ప్రధానమని నేడు నాకు తోస్తుంది. ఎందుచేతనంటే అర్థకామాల్లో గొప్పదానవైనా ఆ రెండింటినీ వదలి నీవు ధర్మాన్నే సేవిస్తున్నావు కదా.

సరే! ఇంతవరకూ ఏదో మాట్లాడాను. నన్ను ఆతిథ్యంతో సత్కరించావు. కాబట్టి నేను పరాయివాణ్ణికాను. అయినా ఇంతవరకూ మాట్లాడాను కాబట్టి మనిద్దరికీ స్నేహం కుదిరినట్లే. "సాప్తపదీనం సఖ్యం" అంటారు కదా పెద్దలు.

అందుచే నేను బ్రహ్మచారి బ్రాహ్మణ్ణి కావడం చేత సులభ చాంచల్యంతో నిన్ను అడుగుదామనుకుంటున్నాను. నీవు ఓర్పు గలదానివి. ఒకవేళ రహస్యం కాకపోతే చెప్పగలవని ఆశ యుంది.

3. **బ్రహ్మచారి జిజ్ఞాస :-** ఓ పార్వతీ! నీవు ముందు బ్రహ్మ వంశములో పుట్టావు. నీ శరీరమా త్రిలోక సౌందర్య రాశి. నీవు ఐశ్వర్యం గురించి వెదుకవలసిన పని లేదు. వయస్సా నవ యౌవన దశ. నీకీ తపస్సు ఎందులకో? దేని గురించి చేస్తున్నావో చెప్పు.

అనుకోని ఆపద సంభవించినపుడు గానీ, అవమానం కలిగినపుడు గానీ ఇటువంటి తపస్సుకు పూనుకుంటారు మనుష్యులు. ఎన్ని విధాలుగా ఆలోచించినా నీకు అటువంటి పరిస్థితులు సంభవిస్తాయని నేను అనుకోవడం లేదు.

నీ ఆకారమా అవమాన శోకమునకు తగినది కాదు. (అత్తవారింట నీకు గౌరవమే లభించును) పుట్టినింటి యందు నీకు అవమానమెట్లు సంభవించును? మిగిలిన వారు నిన్నవమానించి మనగలరా? పాము పడగ మీద మణిని పొందడానికెవరైనా చేయి చాపగలరా?.

నిండు తరుణంలో (యౌవనంలో) చక్కగా అలంకరించుకోదగిన ఆభరణాలను వదిలి ముసలితనంలో ఒప్పే ఈ నార చీరలను ధరించడమేమిటి చెప్పు. తారా చంద్రులతో ఒప్పే రాత్రి ప్రదోష సమయంలో అరుణోదయాన్ని (పొందుతుందా) తగునా?.

స్వర్గాన్ని గురించి తపస్సు చేస్తున్నావా? నీ తపస్సు వృథాయే. ఎందుచేతనంటే నీ తండ్రి హిమవంతుని ప్రదేశాలన్నీ దేవభూములే. తగిన వరుని గురించి తపస్సు చేస్తున్నావా? తపస్సు చేయనే అక్కరలేదు. రత్నాన్ని పరులు అన్వేషిస్తారు గానీ రత్నం పరులను అన్వేషించదు కదా.

ఇలా ప్రశ్నించిన వెంటనే పార్వతి వేడి నిట్టూర్పులను విడచుట చూసి బ్రహ్మచారి ఇలా అంటున్నాడు.

నీ వేడి నిట్టూర్పులే నీవు వరుని గురించి తపమాచరిస్తున్నావని చెప్పక చెప్పుచున్నాయి. అందుకే నాకు మరింత సందేహం కలుగుతుంది. నీవు ప్రార్థింపవలసిన వరుడు నాకు కనిపించడమే లేదు. ప్రార్థించినా గాని దుర్లభుడయిన వరుడు ఎవడు కాగలడు? అని.

అహో! నీకు ఈప్సితుడయిన యువకుడు ఎవరో చాలా కఠినమయిన వాడు. కాననిచో కలువలతో అలంకరింపదగిన నీ చెక్కిళ్ళు వేళాడుతూ ఉండే ఈ జటలతో పాలిపోతుంటే ఎలా చూస్తూ ఉంటాడు. అందుచేత అతడు నిశ్చయంగా వజ్ర హృదయుడే.

చాంద్రాయణాది ముని వ్రతాల చేత మిక్కిలి కృశించిన నిన్ను అలంకారయోగ్యమైన శరీరము ఎండచే నల్లబడుతుంటే పగటి వెన్నెల వలే చూస్తే ఎవడి మనస్సు వ్యథ నొందదు?

ఓ పార్వతీ! నీ ప్రియుడు తన అందంతో గర్వించే వాడులా కనిపిస్తున్నాడు. వాడి చూపులు గల నీ నేత్ర సంపదను ముఖాన్ని ఇంతవరకూ అతను చూడలేదంటే అదే కదా తాత్పర్యం.

నీవు ఎంతకాలం కష్టపడతావు? నాకు కూడా బ్రహ్మచర్యంలో చేసిన తపస్సు ఉంది. అందులో సగం తపస్సు నీకిస్తాను. నీవు కోరుకున్న వరుని పొందుము. అందువల్ల ఆ వరుడెవడో తెలుసుకోవాలని ఉంది.

4. **సఖురాలి సమాధానం :-** ఇలా పార్వతి గుండెల్లో గుచ్చి గుచ్చి అడిగాడు బ్రహ్మచారి. కానీ పార్వతి సిగ్గుతో తన హృదయంలో మాటను చెప్పలేకపోయింది. అందువల్ల ఆమె ప్రక్కనే ఉన్న సఖురాలిని పొడి కన్నులతో సైగ చేసింది.

ఇలాసైగ చేయబడిన ఆ సఖురాలు బ్రహ్మచారితో ఇలా అంది. ఓ తపోధనా! ఈమె ఎవరి కోసం తన శరీరాన్ని కమలాన్ని ఎండలో గొడుగులా తపస్సాధకంగా చేసింది? అని తెలుసుకోవాలని కుతూహలంగా ఉంటే విను.

ఈ మహేంద్రాది దిక్పాలకులను తిరస్కరించి, సౌందర్యంచే పొందనలివిగాని పినాకపాణిని పతిగా పొందుటకు కోరుకుంటోంది.

5. **పార్వతి మన్మథావస్థలు :-** మన్మథునిచే విడువబడిన పుష్పబాణం ఈశ్వరుని హుంకారము వలన అతనిని వేధించలేక ఈ పార్వతి హృదయంలో గాఢంగా గుచ్చుకొని గాయాన్ని కలిగించింది.

అప్పటి నుండి ఈమె తండ్రి హిమాలయుని ఇంటిలో కామపరవశురాలై లలాటమందు చందనాన్ని ధరించుట చేత ధూసరితమైన అలకలు కలదై ఘనీభూతమైన మంచు రాళ్ల యందు పరున్నప్పటికీ సుఖాన్ని పొందలేదు.

ఈమె ఆ పినాకి చరితమును పాడుతూ కన్నీరు కారుస్తూ డగ్గుత్తికతో స్ఖలితమైన పదాలను కష్టపడి ఉచ్ఛరిస్తూ చాలా సార్లు వనాంతమందున్న సంగీత సఖురాండ్రు కిన్నర రాజకన్యకలను దుఃఖ సాగరంలో ముంచెత్తుతూండేది.

రాత్రులందు ఎట్టకేలకు అతి కష్టం మీద మూడవ జామున కాసేపు కళ్లు మూసుకొని వెంటనే హఠాత్తుగా శివుణ్ణి కౌగిలించు కున్నాననే భ్రమతో రెండు చేతులను కట్టుకొని ఓ నీలకంఠ! ఎక్కడికి వెడుతున్నావంటూ లేచేది.

ఆ చంద్రశేఖరుని చిత్రాన్ని లిఖిస్తూ ఆ చిత్రాన్నే శివుడుగా భావించి ఇలా మాట్లాడేది - నీవు సర్వవ్యాపి యని విద్వాంసులంతా భావిస్తూ ఉంటారు. అటువంటి నీవు నిన్నే ప్రేమించు నన్ను ఎందుకు తెలుసుకోలేకపోతున్నావు? అని రహస్యంగా నిందించేది.
ఇలా కాలాన్ని గడుపుతూ జగదీశ్వరుని పొందడం కోసం తపస్సే ముఖ్య సాధనం అని ఎపుడయితే తెలుసుకుందో అప్పటి నుంచి తండ్రి గారి అనుజ్ఞ పొంది మా అందరితో కలిసి తపస్సు కోసం తపోవనానికి వచ్చింది.

తపస్సాక్షులయిన ఈమె పెంచిన ఈ చెట్లు ఫలించాయి కానీ, చంద్రశేఖరుని పొందాలనే ఈమె తపస్సుకు ఫలం మొలకెత్తే సూచనలు కూడా కనబడడం లేదు.

ప్రార్థించినా కూడా దుర్లభుడయిన ఆ శివుడు సఖురాండ్రకు కన్నీటి తోటే సమాధానం చెప్పే ఈ పార్వతిని తపస్సుచే కృశించినప్పటికీ అనావృష్టితో సుష్కించిన దున్నిన భూమిని ఇంద్రుడు వలే ఎపుడు అనుగ్రహిస్తాడో తెలియకుండా యుంది.

6. **పార్వతీ - బ్రహ్మచారుల సంవాదం :-** ఇలా పార్వతి మనోగతాభిప్రాయాన్ని సఖి ద్వారా తెలుసుకున్న ఆ నైష్ఠిక సుందరుడు పార్వతి వైపు చూసి - ఇది నిజమా? పరిహాసమా? అని లోలోపల సంతసించుచున్ననూ గంభీరంగా ప్రశ్నించాడు.

అలా ప్రశ్నించిన బ్రహ్మచారికి జపమాలను ముంజేయితో ధరిస్తూ సిగ్గుతో ముందుకు వంగి చాలా కాలం తరువాత మౌనాన్ని విడవడం చేత మెల్లి మెల్లిగా మాట్లాడింది.

అయ్యా - నీవు విన్నది నిజమే. ఈ దీనురాలు పెద్ద కోరిక యందు లగ్నమయింది. ఆ కోరిక ఫలించడానికి తపస్సే కదా సాధనం. కోరికలకు హద్దేమున్నది. శక్తికి మించిన కోరికలు కోరకూడదనే మున్నది?

అని చెప్పినంతనే బ్రహ్మచారి మహేశ్వరుడేనీకు ప్రార్థనీయుడు. అందుకే తపము చేయుచున్నావు. నీవు అమంగళాల్ని యిష్టపడే అతన్ని కోరుటను నేను యిష్టపడను.

తుచ్ఛ వస్తువులందు అభినివేశము గల అతనితో నీకు పొంతన ఏమి? పాణిగ్రహణ సమయమందు, వివాహదీక్షితియైన నీ చేయి బుస్సుమను పాములను ధరించే అతని చేతితో కలియుట తగునా?

నీవే బాగుగా స్వయంగా ఆలోచించుము. రాజయంచల వధూటి చీరకు రక్తము స్రవించు ఏనుగు చర్మానికి పొంతన కుదురుతుందా?

నాలుగు వైపుల పుష్పముల బాటలో నడచు నీ పాదముల లత్తుకరస చిహ్నములు చిందరవందరగా పడి జుట్టుగల శ్మశానములందు పడుటకు పరాయి వాడుకూడా అంగీకరించునా?

చందన చర్చితమయిన నీ వక్షోజములందు శివుని చితాభస్మర జస్సు (ఆలింగానాదుల యందు) తగుల్కొన్నచో ఇంతకన్నా విరూపమైన అవస్థ వేరొకటి యున్నదా? నీవే చెప్పుము.

వివాహము చేసుకొని గజరాజములచే ఊరేగదగిన నీవు శివుని వివాహమాడి ముసలి ఎద్దును ఎక్కి ఊరేగినచో చూసినవారు నవ్వరా? ఇంతకన్నా పరిహాసమేమైనా యున్నదా?

ఇప్పటికే ఆ పినాకి తలమీద చంద్రరేఖను చూసి జాలి పడుతున్నారు జనులు. నీవు కూడా ఆ శివుని వివాహమాడిన యెడల లోకానికి కన్నుల పండుగ లాంటి నిన్ను చూసి మరింత చింతిస్తారు.

సాధారణంగా కన్యలు కోరుకునే రూపమున్నదా ఆ శివునికి. అతడు విరూపాక్షుడు, మంచి వంశ మర్యాదులున్నవా? అతను ఎపుడు, ఎక్కడ జన్మించాడో ఎవరికీ తెలియదు. కన్య తల్లి కోరుకొనే సంపద కలదా? దిగంబరుడవడం చేతనే అతని ఐశ్వర్యం కూడా తెలుస్తోంది. వరుల యందు ఏ గుణాలు వెదుకదగినవో ఆ గుణం ఒక్కటైనా ఆ ముక్కంటిలో కనిపిస్తుందా?

అందువల్ల అతను నుంచి నీ మనస్సును మరల్చుకో. అటువంటి ముక్కంటి ఎక్కడ? సుకృత సౌందర్య రాశివైన నీవెక్కడ? ఉత్తముడు శ్మశానంలో శూలానికి వైదిక యూప స్తంభ సత్కారాన్ని చేస్తాడా?

ఆ బ్రహ్మచారి యిలా ప్రతికూలంగా మాట్లాడుతుండగా కంపిస్తున్న పెదవులతో కోపాన్ని చూపిస్తున్న ఆ పార్వతి కనుబొమ్మలు వంకరబోయి కళ్ళు ఎర్రబడ్డాయి. అలా కోపంగా చూస్తూ బ్రహ్మచారితో యిలా అంది.

శంకరుని గూర్చి నీకు బొత్తిగా తెలియదు. అందుకోసమే నా దగ్గర యిలా వదరుతున్నావు. మూఢమతులు కారణములు తెలియని అలౌకికమయిన లోకోత్తర మహాత్ముల చరిత్రను యిలా నిందిస్తారు.

అతడు అమంగళ కార్యాల యందు ఆసక్తుడంటున్నావు. ఆపదలంటే భయపడేవారు, సంపదలను కోరే వారు మంగళ కార్యాలు చేస్తారు. జగత్తుకే అభయమిచ్చే కోరికలు లేని ఆ శివునికి ఈ మంగళ కార్యాలతో పని ఏమి?

అతను స్వయంగా దరిద్రుడయినప్పటికి అపారమైన సంపదలకు మూలకారణం. శ్మశాన వాసి అయినా ముల్లోకాలను పాలించేవాడు. భయంకర మూర్తి అయినా శివుడు (మంగళకరుడు) అనే పిలవబడతాడు. శివుని యదార్థ స్వరూపం తెలుసుకొన్నవారు లేనేలేరు.

విశ్వమూర్తి అయిన ఆ శంకరుని శరీరం అలంకార భూషితమై, పాములచే కట్టబడినదా? ఏనుగు చర్మంచే కప్పబడిందా? చీనీ చీనాంబరాలు ధరించినదా? కపాలాన్ని ధరించిందా? చంద్రుని శిరస్సు మీద ధరించినదా? అని నిశ్చయించలేము.

అతను శ్మశాన భస్మాన్ని పూసుకుంటాడని అంటున్నావు. చిత్మాభస్మమయినా అతని శరీరాన్ని స్పర్శించడంచే పవిత్రమైనది. అదే అపవిత్రాలను కూడా పవిత్రంగా చేస్తుంది. అందుకే దేవతలంతా శివతాండవ సమయంలో అతని శరీరాన్నుంచి రాలిన ఆ భస్మాన్ని శిరసా ధరిస్తారు.

అతనికి సంపదేమున్నది అంటున్నావు కదా! సంపద లేకపోయినప్పటికీ నంది నెక్కివెడుతున్న అతని పాదాలకు మదపుటేనుగు ఐరావతాన్ని ఎక్కిన ఆ ఇంద్రుడు కూడా మందార పూవులతో పూజిస్తాడు.

అతని జన్మ ఎవరికి తెలుసు అంటున్నావు కదా? నీవు శివుణ్ణి నిందిద్దామని దోషాలను చెబుతున్నా అతని గుణాన్నే చెప్పావు. సృష్టికర్త బ్రహ్మకే కారణభూతమయిన అతని పుట్టుక ఎవరికి తెలుస్తుంది?

కానిమ్ము, నీవు ఆ శివుని గురించి ఎలా విన్నావో అలాగే ఉండనీ. కానీ నా మనస్సు శివునికే అర్పించాను. స్వేచ్ఛ మనస్సిచ్చి ప్రేమించిన వానికి లోకాపవాదం వల్ల భయమేమిటి?

ఇలా అంటుండగా ఏదో మాట్లాడడానికి పెదవిని కదిపిన ఆ బ్రహ్మచారిని చూచి, ఈ బ్రహ్మచారి ఏదో చెబుదామనుకుంటున్నాడు. ఇతన్ని వారించు. పెద్దలను నిందించే వాడే కాదు దోషి; అతని నుంచి పెద్దల నిందలను వినే వాడుకూడా పాపే అవుతాడు.

పోనీ నేనే వెడతాను. అని చెబుతూ పమిటజారుచుండగా ఆమె అక్కడి నుండి కదిలింది. ఇంతలో పరమ శివుడు చిరునవ్వుతో తన నిజ స్వరూపాన్ని ధరించాడు.

శివుణ్ణి చూసి చలిస్తూ ముచ్చెమటలు పోస్తుండగా ఎత్తిన అడగును కిందికి పెడదామనుకుంటూ పర్వతాన్ని అడ్డుకోవడం చేత స్తంభించిన ప్రవాహం గల నదిలా ఆ శైల కన్య వెళ్లనూ లేదు నుంచోను లేదు.

నేటి నుండి నీకు దాసుణ్ణయాను. నీ ఈ తపస్సుల చేత నేను అమ్ముడు పోయాను. అని ఆ చంద్రమౌళి అంటుండగా ఆమె తపస్సు శ్రమను మరచిపోయింది. కష్టం ఫలం దక్కిన వెంటనే మరల కొత్తదనాన్ని సంతరించుకుంటుంది కదా!

**డా॥ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి**
**సాహిత్య విభాగాధిపతి**
**రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం**
**(మానిత విశ్వవిద్యాలయం)**
**తిరుపతి**

పాఠం - 2

# కుమార సంభవము - కాళిదాసు

# పంచమ సర్గ

**లక్ష్యం :-**

ఈ పాఠములో 18 ముఖ్యమైన శ్లోకములకు వ్యాఖ్య (1-40) చేయబడినది.

**1. శ్లో॥** తథా సమక్షం దహతా మనోభవం
పినాకినా భగ్నమనోరథా సతీ
నినిన్ద రూపం హృదయేన పార్వతీ
ప్రియేషు సౌభాగ్యఫలా హి చారుతా (5 - 1)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| పార్వతీ | = | పర్వత రాజ పుత్రిక అయిన పార్వతీ దేవి |
| తథా | = | ఆ విధముగా |
| సమక్షం | = | తన కన్నుల యెదుటనే |
| మనోభవం | = | మన్మథుని |
| దహతా | = | భస్మము చేసిన |
| పినాకినా | = | శివునిచే |
| భగ్న | = | చెఱుపబడిన |
| మనోరథా | = | కోరిక కలది |
| సతీ | = | అగుచున్నదై |
| హృదయేన | = | మనసు నందు |
| రూపం | = | తన సౌందర్యమును |
| నినింద | = | నిందించుకొనెను |
| హి | = | అది యుక్తమే |
| చారుతా | = | సౌందర్యము |
| ప్రియేషు | = | పతుల విషయమున |
| సౌభాగ్య | = | ప్రియుల యనురాగమే |
| ఫలా | = | ప్రయోజనముగా కలది |

**తాత్పర్యము :-** పార్వతి ఆ విధముగా తన కన్ను యెదుటనే మన్మథుని భస్మము గావించిన శివుడు తన కోరికను నశింపజేయగా మనసులోనే తన రూపమును నిందించుకొనెను. అది యుక్తమే. ఏలయన, స్త్రీల సౌందర్యమునకు భర్తృ వాల్లభ్యమే కదా ఫలము!

పార్వతి ధీరోదాత్త నాయిక గనుక ప్రియుని హృదయము నాకర్షింపలేని తన సౌందర్యము నిష్ఫలమని తన మనస్సులోనే నిగూఢముగా భావించెనని భావము.

**విశేషాంశములు :-** పతులు మెచ్చని సతుల చెలువము నిష్ఫలమనెడి సామాన్యముచే విశేషము సమర్థింపబడినది. కావున అర్థాంతరన్యాసాలంకారము.

జ, త, జ, ర అను గణములతో కూడిన వంశస్థ వృత్తముననే ఈ పంచమ సర్గ యందలి శ్లోకములన్నియు రచింపబడినవి.

**2. శ్లో॥** ఇయేష సా కర్తు మవంధ్యరూపతాం
సమాధి మాస్థాయ తపోభిరాత్మనః
అ వాప్యతే వా కథ మన్యథా ద్వయం
తథావిధం ప్రేమ పతిశ్చ తాదృశః (5 - 2)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| సా | = | పార్వతి |
| సమాధిం | = | మనోలయమును, ఏకాగ్రతను |
| ఆస్థాయ | = | అవలంబించి |
| తపోభిః | = | పలు విధములగు నియమముల చేత |
| ఆత్మనః | = | తనకు |
| అవంధ్య రూపతాం | = | నిష్ఫలము కాని సౌందర్యము కలిగి యుండుటను |
| కర్తుం | = | సంపాదించుకొనుటకు |
| ఇయేష | = | కోరెను |
| అన్యథా | = | అట్లు కానిచో |
| కథం వా | = | ఎట్లు |
| తథా విధం | = | అట్టి (శివుని శరీరార్ధము పొందునంతటి) |
| ప్రేమ | = | స్నేహము (భర్తృ ప్రేమ) |
| తాదృశః | = | అట్టి (మృత్యుంజయుడగు) |
| పతిః చ | = | భర్తయు |
| ద్వయం | = | ఈ రెండును |
| అవాప్యతే | = | పొందబడును? |

**తాత్పర్యము :-** శివ హృదయము నాకర్షింపలేని తన సౌందర్యము వ్యర్థమని తలచిన పార్వతి, తన మనస్సునేకాగ్రము గావించి, పలువిధములగు నియమముల నవలంబించి తపముచే శివుని ప్రసన్నుని చేసికొని తన సౌందర్యమును సఫలము గావించుకొనవలెనని నిశ్చయించెను. తపస్సుచే కాక, మరి దేనిచేత శరీరార్ధము నొసగునట్టి భర్తృ ప్రేమ, మృత్యువు లేని భర్త లభించును? తపస్సు తప్ప మరియొక ఉపాయమేదియును అట్టి ఫలమును చేకూర్పలేదని భావము.

**విశేషాంశములు :-** తపస్సుచే సాధింపరానిది లేదను సామాన్యముచే విశేషము సమర్థింపబడినది కావున అర్థాంతరన్యాసాలంకారము.

స్త్రీలకు భర్త ప్రేమను చూరగొనుట, దీర్ఘ సుమంగళియగుట ఈ రెండే ప్రధానముగ కోరదగినవి. ఈ రెండును తపశ్చర్య చేతనే సిద్ధించునట్టివి.

తపస్సు చేత సాధింపరాని దేదియును లేదని మనువిట్లు చెప్పినాడు.

శ్లో॥ యద్దుస్తరం యద్దురాపం, యద్దుర్గం యచ్చ దుష్కరమ్
తత్సర్వం తపసా సాధ్యం, తపో హి దురతిక్రమమ్ (మను 11 - 138)

"ఏది దాట శక్యము కానిదో? ఏది పొంద శక్యము కానిదో? ఏది పోవ శక్యము కానిదో? ఏది చేయ శక్యము కానిదో? అదియంతయును తపస్సుచే సాధింప శక్యమైనదే. తపస్సునకు లొంగని దేదియును లేదు."

3. శ్లో॥ మనీషితాః సంతి గృహేషు దేవతా
స్తపః క్వ?వత్సే!క్వ చ తావకం వపుః?
పదం సహేత భ్రమరస్య పేలవం
శిరీష పుష్పం న పునః పతత్రిణః (5 - 4)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| వత్సే | = | బిడ్డా! |
| మనీషితాః | = | మనసుకు నచ్చిన |
| దేవతాః | = | ఇంద్రాణి మున్నగు దేవతలు |
| గృహేషు | = | మన యింటనే |
| సంతి | = | ఉన్నారు |
| తపః | = | తపము |
| క్వ | = | ఎక్కడ? |
| తావకం | = | నీ దగు |
| వపుః చ | = | శరీరమును |
| క్వ | = | ఎక్కడ? |
| పేలవం | = | మృదువగు |
| శిరీష పుష్పం | = | దిరిసెన పూవు |
| భ్రమరస్య | = | తుమ్మెద యొక్క |
| పదం | = | పాదము మోపుటను |
| సహేత | = | సహింపవచ్చును |
| పతత్రిణః పునః | = | పక్షి యొక్క (పాదమును) మాత్రము |
| న | = | సహింప నేరదు |

**తాత్పర్యము :-** తపస్సు చేసి తన కోరికను సాధింపనెంచిన పార్వతిని వారించుచు నామె తల్లి మేనాదేవి యిట్లనెను.

బిడ్డా! నీ కోరికను సాధించుకొనుటకు మనయింటనున్న ఇంద్రాణీ ప్రముఖ దేవతలను పూజింపుము. తపస్సెక్కడ? నీ శరీరమెక్కడ? అతి సుకుమారమగుటచే నీ శరీరము దివ్య భోగములనుభవింపదగినది కానోపును గాని కఠినమగు తపము చేయజాలదు. మృదువైన దిరిసెనపూవు తన పై తుమ్మెద వ్రాలిన సహించునే గాని పక్షి వ్రాలిన సహింపనేర్చునా?

**విశేషాంశములు :-** కఠిన శరీర సాధ్యమగు తపస్సునకును, అతి కోమలమగు పార్వతి శరీరమునకును - అనురూపములు కాని వానికి సంబంధము పూర్వార్ధమున వర్ణింపబడినది. కనుక శ్లోక పూర్వార్ధమున విషమాలంకారము. ఉత్తరార్థమున సాదృశ్య నిమిత్తక అర్థాంతరన్యాసము. ఈ రెండింటికిని సంసృష్టి మరియు పార్వతి దేహము ఉపమేయము, దిరిసెనపూవు ఉపమానము కనుక ఉపమానోపమేయ ధర్మములకు బింబ ప్రతిబింబ భావమును చెప్పుటచే దృష్టాంతాలంకారము.

**4. శ్లో॥** ఇతి ధ్రువేచ్ఛా మనుశాసతీ సుతాం
శశాక మేనా న నియంతు ముద్యమాత్
క ఈప్సితార్థ స్థిర నిశ్చయం మనః
పయశ్చ నిమ్నాభిముఖం ప్రతీపయేత్ (5 - 5)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| ఇతి | = | ఇట్లు |
| అనుశాసతీ | = | ఉపదేశించుచున్నదై |
| మేనా | = | మేనా దేవి |
| ధ్రువేచ్ఛాం | = | స్థిరమైన పట్టుదల గల |
| సుతాం | = | పుత్రికను |
| ఉద్యమాత్ | = | తపః ప్రయత్నము నుండి |
| నియంతుం | = | నివారించుటకు |
| న శశాక | = | సమర్థురాలు కాదయ్యెను |
| ఈప్సిత | = | పొందుట కిష్టమైన |
| అర్థ | = | విషయము నందు |
| స్థిర | = | చెదరని |
| నిశ్చయం | = | నిర్ణయము కల |
| మనః | = | మనస్సును |
| నిమ్నాభిముఖం | = | పల్లము వైపు ప్రసరించు |
| పయఃచ | = | నీటిని |
| కః | = | ఎవడు |
| ప్రతీపయేత్ | = | వెనుకకు మరల్చగలుగును? |

**తాత్పర్యము :-** మేనక యటులెంతగా నుపదేశించియును గట్టి పట్టుదల గల పుత్రికను తపమునకై చేయు ప్రయత్నము నుండి మరలింపజాలదయ్యెను. అది యుక్తమే. ఏలయన, అభిలషిత వస్తువు నందు స్థిరాభినివేశము గల మనస్సును, పల్లము వైపు పరుగిడు నీటిని ఎవ్వరు వెనుకకు మళ్ళించగలుగుదురు?

అనగా పల్లమునకు పోవు నీటిని వలె ఇష్టార్థము నందు పట్టుదల గల మనస్సును నివారించుట దుస్సాధ్యమని భావము.

**విశేషాంశములు :-** సామాన్యముచే విశేషము సమర్థింపబడుటచే ఈ శ్లోకమున అర్థాంతరన్యాసము పోషింపబడుటయే గాక అది దీపకాలంకారముచే అను ప్రాణితమైనది.

"యత్ర ప్రకృతానా మప్రకృతానాం చైక సాధారణ ధర్మాన్వయః ఔపమ్యస్య చ గమ్యత్వం తత్ర దీపకమ్".

**5. శ్లో॥** యథా ప్రసిద్ధై ర్మధురం శిరోరుహై
ర్జటాభి రప్యేవ మభూ త్తదాననమ్,
నషట్పద శ్రేణిభిరేవ పంకజం
స శైవలా సంగమపి ప్రకాశతే (5 - 9)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| తత్ | = | ఆ పార్వతి యొక్క |
| ఆననం | = | ముఖము |
| ప్రసిద్ధైః | = | అలంకరించబడిన |
| శిరోరుహైః | = | తల వెంట్రుకలచే |
| యథా | = | ఎట్లు |
| మధురం అభూత్ | = | ప్రియమై యుండెనో |
| జటాభిః అపి | = | జడలచే గూడ |
| ఏవం | = | ఇట్లే మధురమై యొప్పెను |
| పంకజం | = | పద్మము |
| షట్పద | = | తుమ్మెదల యొక్క |
| శ్రేణిభిః ఏవన | = | సమూహములచే మాత్రమే కాదు |
| సశైవలా సంగం అపి | = | నాచుతో సంపర్కము కలిగియున్నను |
| ప్రకాశతే | = | ప్రకాశించును |

**తాత్పర్యము :-** ఆ పార్వతి తపమొనర్చు సమయమున నిరాభరణయై, వల్కల ధారణము గావించి, కేశ సంస్కారమును కూడ మరచినది. అయినను పార్వతి ముఖము చక్కగా శిరోజముల నలంకరించుకొనినపుడే కాక. ఆ శిరోజములు తైలాది సంస్కారము లేక జడలు గట్టుకొని పోయినపుడును మధురమై యుండెను. పద్మము తుమ్మెదలు వాలినప్పుడే కాదు, నాచు చుట్టును పెనవైచుకొన్నను అందముగనే యుండును. ఆమె ముఖము సహజ సుందరమని భావము.

**విశేషాంశములు :-** ఈ శ్లోకమున అర్థాంతరన్యాసాలంకారము కూర్చబడినది.

**6. శ్లో॥** పునర్గ్రహీతుం నియమస్థయా తయా
ద్వయేఽపి నిక్షేప ఇవార్పితం ద్వయమ్,
లతాసు తన్వీషు విలాస చేష్టితం
విలోల దృష్టం హరిణాంగనాసుచ (5 - 13)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| నియమస్థయా | = | వ్రతమందున్న |
| తయా | = | ఆ పార్వతీ దేవిచే |
| తన్వీషు లతాసు | = | లేదీగలయందు |
| విలాస చేష్టితం | = | తన విలాస చేష్టయు |
| హరిణాంగనాసు | = | ఆడు లేళ్ళయందు |
| విలోల దృష్టం | = | తన చంచలావలోకనమును |
| పునః గ్రహీతుం | = | మరల స్వీకరించుటకై |
| ద్వయేఽపి | = | రెంటియందును |
| ద్వయం | = | రెండును |
| నిక్షేపః | = | నిక్షేపరూపముగ |
| అర్పితమ్ ఇవ | = | ఉంచబడినది వలెనుండెను |

**తాత్పర్యము :-** పార్వతి వ్రతము చేయుచుండుటచే స్త్రీ సహజమగు విలాస చేష్టలు, చంచలములగు చూపులు ఆమెలో కనబడకుండెను. పార్వతి తన తపస్సు పూర్తియైన పిమ్మట వెనుకకు తీసుకొనునట్లుగా లేదీగలందు విలాస చేష్టలను, ఆడులేళ్ళ యందు చంచలావలోకనమును నిక్షేపించినదో అన్నట్లుగా ఆ రెండును క్రమముగా లేదీగలలో, ఆడులేళ్ళలో కనబడుచున్నవి.

**విశేషాంశములు :-** లేదీగలు విలాసముగ కదలుటయు, ఆడులేళ్ళు బెదరు చూపులు కలిగి యుండుటయు ప్రసిద్ధము. ఆ రెంటిని పార్వతియే వాని వద్ద నిక్షేపముగా నుంచినట్లు కవి కల్పించిన ఉత్ప్రేక్షాలంకారమీ శ్లోకమున కలదు.

**7. శ్లో॥** అరణ్య బీజాంజలి దానలాలితా
స్తథాచ తస్యాం హరిణా విశశ్వసుః,
యథా తదీయైర్నయనైః కుతూహలాత్
పురః సఖీనా మమిమీత లోచనే (5 - 15)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| అరణ్యబీజ | = | నీవారాదుల యొక్క |
| అంజలి | = | దోసిళ్ళను |
| దాన | = | ఇచ్చుటచే |
| లాలితాః | = | లాలించబడిన |

| | | |
|---|---|---|
| హరిణాఃచ | = | లేళ్ళును |
| తస్యాం | = | ఆ పార్వతి యందు |
| తథా | = | ఆ విధముగా |
| విశశ్వసుః | = | విశ్వాసముంచినవి |
| యథా | = | ఎట్లనగా |
| (సా = ఆమె) | | |
| కుతూహలాత్ | = | వేడుక వలన |
| తదీయైః | = | ఆ లేళ్ళకు సంబంధించిన |
| నయనైః | = | కన్నులచే |
| లోచనే | = | తన కన్నులను |
| సఖీనాంపురః | = | చెలుల ఎదుట |
| అమిమీత | = | కొలిచెను |

**తాత్పర్యము :-** తపము చేయుచున్న పార్వతి తానే స్వయముగా మొక్కలకు నీరు పోసి పుత్ర వాత్సల్యముతో పెంచుచుండెను. ఆమె ప్రతి దినము హరిణములకు దోసిళ్ళతో నీవార ధాన్యము తినిపించుచు లాలించిన కారణముచే, ఆ హరిణము లామెయందు ఎంతో విశ్వాసము కలిగి యుండెను. ఆ విధముగా అవి విశ్వసించుట చేతనే పార్వతి యొకమారు ఎవరి కనులు పెద్దవియో అను ఉత్సుకతతో తన చెలుల యెదుట లేడి కనులతో తన కనులను చేర్చి వానిని కొలిచెను. తమ కనులను కొలుచుటకై ఎంత పీడించినను లేళ్ళు కలత నొందకుండుట వాని విశ్వాసమునకు పరాకాష్ఠ.

**8. శ్లో॥** కృతాభిషేకాం హుత జాతవేదసం
త్వగుత్తరా సంగవతీ మధీతినీమ్,
దిదృక్షవస్తా మృషయోఽ భ్యుపాగమ
న్న ధర్మ వృద్ధేషు వయః సమీక్ష్యతే (5 - 16)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| కృత + అభిషేకాం | = | త్రిషవణ స్నానమొనర్చినదియు |
| హుతజాత వేదసం | = | అగ్నికార్యమనుష్ఠించినదియు |
| త్వగుత్తరా సంగవతీం | = | వల్కలముచే ఉత్తరీయము కలదియు |
| అధీతినీం | = | స్తోత్ర పఠనాదులు చేయుచున్నదియును అగు |
| తాం | = | ఆ పార్వతిని |
| దిదృక్షవః | = | చూడగోరినవారై |
| ఋషయః | = | మునులు |
| అభ్యుపాగమన్ | = | వచ్చిరి |
| ధర్మ వృద్ధేషు | = | ధర్మాచరణము నందు పెద్దలయిన వారి విషయమున |

| | | |
|---|---|---|
| వయః | = | వయస్సు (చిన్న, పెద్దయను తారతమ్యము) |
| న సమీక్ష్యతే | = | (ప్రమాణముగ) చూడబడదు |

**తాత్పర్యము :-** పార్వతి శివుని గూర్చి ఘోరమగు తపస్సు చేయుచుండెను. త్రిషవణ స్నానము చేసి, సాయంప్రాతర్హోమములు చేసి, వల్కలోత్తరీయమును ధరించి, శివస్తోత్రములను పఠించుచున్న పార్వతిని చూడవలెనను కోరికతో, చిర కాలము తపస్సు చేసిన ఋషులు ఆమె కడకేతెంచిరి. ధర్మవృద్ధుల యెడ, సచ్ఛీల జ్యేష్ఠుల యెడ, వేదోక్త ధర్మానుష్ఠాన తత్పరుల యెడ వయస్సు (వయో వృద్ధత్వము) ప్రమాణముగా స్వీకరింపబడదు. అనగా వయో వృద్ధులనే దర్శింపవలెను, పూజింపవలెను, వయసుచే చిన్నవారిని దర్శింపరాదు, పూజింపరాదు - అనుట అయుక్తము. శీలజ్యేష్ఠత్వమే ముఖ్యమని భావము.

**విశేషాంశములు :-** పార్వతి వయసుచే పిన్నదైనను, తపముచే మిన్న కావున పిన్నయగు పార్వతి కడకు పెద్దలగు ఋషులు పోవుటను కవి సమర్థించినాడు. కావున సామాన్యముచే విశేషమును సమర్థించిన అర్థాంతర న్యాసాలంకారమీ శ్లోకమున కలదు.

శ్రుతి స్మృత్యుక్త సకల కర్మములు స్నాన పూర్వకములు. కావుననే మహాకవి కాళిదాసు 'కృతాభిషేకామ్' అని చెప్పినాడు.

శ్లో॥ అస్నాత్వా నాచరేత్కర్మ, జపహోమాది కిఞ్చన ।
స్నానమూలాః క్రియాస్సర్వాః, శ్రుతి స్మృత్యుదితా నృణామ్ ॥ (స్మృతి)

వృద్ధత్వము చతుర్విధము. 1. వైరాగ్య వృద్ధత్వము, 2. జ్ఞాన వృద్ధత్వము, 3. శీల వృద్ధత్వము, 4. వయో వృద్ధత్వము.

పార్వతి శీల వృద్ధురాలు. వయో వృద్ధుల కంటే పైన చెప్పిన త్రివిధ వృద్ధులు శ్రేష్ఠులు.

9. శ్లో॥ విరోధి సత్త్వోజ్ఝిత పూర్వమత్సరం
ద్రుమై రభీష్ట ప్రసవార్చితాతిథి,
నవోట జాభ్యంతర సంభృతానలం
తపోవనం తచ్చ బభూవ పావనమ్(5 - 17)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| విరోధి సత్త్వ | = | పరస్పరము జాతి వైరము కల ఆవు - పులి మున్నగు జంతువులచే కూడ |
| ఉజ్ఝిత | = | విడువబడిన |
| పూర్వ మత్సరం | = | వెనుకటి వైరము కలదియు<br>(శాశ్వత విరోధము మరచి హింసారహితమైనదియు) |
| ద్రుమైః | = | వృక్షములచే |
| అభీష్ట ప్రసవ + అర్చిత + అతిథి | = | ఇష్టములగు పండ్లచే పూజింపబడిన అతిథులు కలదియు |
| నవ | = | నూతనమైన |
| ఉటజ | = | పర్ణశాలల యొక్క |
| అభ్యంతర | = | లోపలి ప్రదేశములందు |
| సంభృత | = | ప్రజ్వలింప చేయబడిన |
| అనలం | = | అగ్నులు కలదియు అగు |

తత్ చ తపోవనం = ఆ తపోవనము

పావనం = జగత్తునే పవిత్రము చేయునది

బభూవ = అయ్యెను

**తాత్పర్యము :-** పార్వతి నివసించుచున్న ఆయాశ్రమమందు సంచరించుచున్న ఆవు, పులి మున్నగు జంతువులు శాశ్వతమైన జాతి వైరమును విడనాడి మైత్రితో నుండెను. ఆశ్రమమందలి వృక్షములు అతిథుల కిష్టమగు పండ్లను వారికి సమర్పించుచు వారినారాధించుచుండెను. క్రొత్తగా నిర్మింపబడిన పర్ణశాలలో అగ్నులు ప్రజ్వలింపజేయబడుచుండెను. ఇట్లా తపోవనము అహింస, అతిథి సత్కారము, అగ్ని పరిచర్యలచే జగత్పావనమయ్యెను.

**10. శ్లో॥** క్లమం యయౌ కందుక లీలయాఽపి యా
తయా మునీనాం చరితం వ్యగాహ్యత,
ధ్రువం వపుః కాంచన పద్మ నిర్మితం
మృదు ప్రకృత్యా చ ససార మేవచ (5 - 19)

**ప్రతిపదార్థము :-**

యా = ఏ పార్వతి దేవి

కందుక లీలయా అపి = బంతియాటచే గూడ

క్లమం యయౌ = అలసినదాయెనో

తయా = ఆమె చేత

మునీనాం = మునుల యొక్క

చరితం = ఆచరణము (తీవ్ర తపము)

వ్యగాహ్యత = ప్రవేశించబడెను

ధ్రువం = నిశ్చయముగ

వపుః = ఈమె యొక్క శరీరము

కాంచన పద్మ నిర్మితం = బంగారు కమలముచే చేయబడి యుండును కావుననే

ప్రకృత్యా = (పద్మ) స్వభావము చే

మృదు చ = మృదువైనది అయ్యును

ససారం ఏవచ = (బంగారు స్వభావముచే) కఠినమైనదే

**తాత్పర్యము :-** పార్వతి తాను చేయు సాధారణ తపము తన లక్ష్యమును సాధింపజాలదని తలచెను. ఇక తన శరీర సౌకుమార్యమును సైతము పరిగణింపక కఠోర తపము చేయదొడంగెను.

బంతియాటచే కూడ బడలిక జెందునట్టి ఆమె మునులొనరించు కఠోర తపము చేయసాగెను. నిశ్చయముగ ఆమె శరీరము బంగారు కమలముచే నిర్మితమై యుండును. కావుననే పద్మ ధర్మమగు కోమలత, సువర్ణ ధర్మమగు కాఠిన్యము అట కలసి యుండెను.

**విశేషాంశములు :-** కఠోర తపము చేయజొచ్చుట చూడనామె శరీరము స్వభావ మృదులమయ్యు దృఢమని భావము. ఇందులకు కారణము పార్వతి శరీరము బంగారపు పద్మముతో నిర్మించబడి యుండుటయని కవి ఉత్ప్రేక్షించుచున్నాడు. కాన ఈ శ్లోకమున ఉత్ప్రేక్షాలంకారము కలదు.

బంగారు పద్మము - పద్మము కాన, సుకుమారము, బంగారము కాన గట్టిది. దానిచే నిర్మితమగుటచే కారణ గుణములు కార్యమున సంక్రమించి ఆమె శరీరము సహజ సుకుమారమయ్యు, దృఢమయ్యెనని భావము.

**11. శ్లో॥** శుచౌ చతుర్ణాం జ్వలతాం హవిర్భుజాం
శుచిస్మితా మధ్యగతా సుమధ్యమా,
విజిత్య నేత్ర ప్రతి ఘాతినీం ప్రభా
మనన్య దృష్టిః సవితారమైక్షత (5 - 20)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| శుచౌ | = | గ్రీష్మమందు |
| శుచిస్మితా | = | తెల్లని మందహాసము కల |
| సుమధ్యమా | = | చక్కని నడుము గల పార్వతి |
| జ్వలతాం | = | ప్రజ్వలించుచున్న |
| చతుర్ణాం | = | నాలుగు |
| హవిర్భుజాం | = | అగ్నుల యొక్క |
| మధ్యగతా | = | నడుమనున్నదై |
| నేత్ర ప్రతిఘాతినీం | = | కన్నులు మిరుమిట్లు గొలుపు |
| ప్రభాం | = | సూర్య తేజమును |
| విజిత్య | = | జయించి |
| అనన్య దృష్టిః | = | (వేరొక వస్తువు పై చూపు నిలుపక) తదేక దృష్టి కలదై |
| సవితారం | = | సూర్యుని |
| ఐక్షత | = | చూచెను |

**తాత్పర్యము :-** తెల్లని చిరునగవు గల పార్వతి గ్రీష్మర్తువులో ప్రజ్వలించు నాలుగగ్నుల నడుమ నిలచి, కన్నులు మిరుమిట్లు గొలుపు సూర్య తేజమును సైతము లక్ష్య పెట్టక, ఐదవయగ్నియగు సూర్యుని ఏకాగ్రతతో దర్శించెను. పంచాగ్ని మధ్యమున తపమొనర్చుట పార్వతి తీవ్రతరమైన తపమునకు నిదర్శనము.

**12. శ్లో॥** శిలాశయాం తామనికేత వాసినీం
నిరంతరా స్వంతర వాత వృష్టిషు,
వ్యలోకయన్ను న్మిషితై స్తడిన్మయై
ర్మహా తపః సాక్ష్య ఇవ స్థితాః క్షపాః (5 - 25)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| నిరంతరాసు | = | ఎడతెగని |
| అంతరవాత వృష్టిషు | = | నడుమ గాలితో కూడిన వానల యందు |
| అనికేత వాసినీం | = | ఆరుబయటనే నివసించుచున్నదియు |
| శిలాశయాం | = | రాతి పై ఏయాచ్ఛాదన లేకయే శయనించుచున్నదియును అగు |
| తాం | = | ఆ పార్వతిని |
| మహాతపః సాక్ష్యే | = | గొప్పగా చేయుచున్న తపమునకు సాక్ష్యమందు |
| స్థితాః | = | ఉన్నట్టి |
| క్షపాః | = | రాత్రులు |
| తటిన్మయైః | = | విద్యుద్రూపములైన |
| ఉన్మిషితైః | = | చూపులచే |
| వ్యలోకయన్ ఇవ | = | చూచినవో యన్నటులుండెను |

**తాత్పర్యము :-** గ్రీష్మము తొలగి వర్షాకాలము రాగా తొలి వాన చినుకులు తపము చేయుచున్న పార్వతి దేహమును తడిపెను.

ఆమె రాతి పై శయనించుచు, ఎడతెగక నడుమ గాలితో కూడి వాన కురియుచుండగా ఆరుబయట నివసించుచు తపము చేయుచుండెను. నిర్విరామముగ వాన కురియుచున్నను లక్ష్య పెట్టక పార్వతి చేయుచున్న తీవ్ర తపమునకు సాక్షులుగా నిలచిన రాత్రులు మెఱపులను చూపులతో ఆమెను చూచినవో యన్నటులుండెను.

**విశేషాంశములు :-** కఠిన శిలా తలము పై శయనించుచు, పై కప్పు లేని ప్రదేశమున నివసించుచు జడివానను సైతము లక్ష్య పెట్టక పార్వతి చేయుచున్న నిశ్చల తపమును రాత్రులు మెఱపులను కన్నులతో దర్శించుచున్నవో యన్నట్లున్నవని కవి ఊహించుటచే ఉత్ప్రేక్షాలంకారమీ శ్లోకమున కలదు.

**13. శ్లో॥** ముఖేన సా పద్మ సుగంధినా నిశి
ప్రవేపమానాధర పత్ర శోభినా,
తుషార వృష్టిక్షత పద్మ సంపదాం
సరోజ సంధాన మివాకరోదపామ్ (5 - 27)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| సా | = | ఆ పార్వతి |
| నిశి | = | రాత్రి యందు |
| పద్మ సుగంధినా | = | పద్మము వలె పరిమళించునట్టిదియు |
| ప్రవేపమాన | = | కంపించుచున్న |
| అధర పత్ర | = | తామరరేకు వంటి క్రింది పెదవి చే |
| శోభినా | = | ప్రకాశించునదియు అగు |
| ముఖేన | = | తన ముఖముచే |

| | | |
|---|---|---|
| తుషార వృష్టి | = | మంచు కురియుటచే |
| క్షత | = | నాశము నొందిన |
| పద్మసంపదాం | = | పద్మముల శోభ కలిగిన |
| అపాం | = | నీటికి |
| సరోజ సంధానం | = | పద్మమును సమకూర్చుటను |
| అకరోత్ ఇవ | = | చేసినది వలె నుండెను |

**తాత్పర్యము :-** పార్వతి మంచు కురియు రాత్రులలో నీట నిలచి తపము చేయుచుండగా, ఆమె ముఖము పద్మము వలె సురభిళమై యుండెను. చలికి ఆమె యధరోష్ఠము తామరరేకు వలె కంపించసాగెను. అట్టి సుందరమగు ముఖముతో నామె మంచు కురియుటచే సొంపు తొలగిన పద్మములు కల జలములకు, మంచుచే నొకింతయు కాంతి తొలగని తన ముఖమను పద్మమును సమకూర్చినటులుండెను

**14. శ్లో॥** స్వయం విశీర్ణద్రుమ పర్ణ వృత్తితా
పరా హి కాష్ఠా తపస స్తయా పునః,
తదప్యపాకీర్ణ మతః ప్రియంవదాం
వదంత్యపర్ణేతి చ తాం పురావిదః (5 - 28)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| స్వయం | = | తమంత తామే |
| విశీర్ణ | = | రాలిన |
| ద్రుమ | = | చెట్ల యొక్క |
| పర్ణ | = | ఆకులే |
| వృత్తితా | = | జీవనముగా కలిగి యుండుట |
| తపసః | = | తపస్సునకు |
| పరాకాష్ఠా | = | మిక్కిలి గొప్ప |
| హి | = | కదా |
| తయా పునః | = | ఆ దేవి చేతనో |
| తత్ అపి | = | అపర్ణ భక్షణమును |
| అపాకీర్ణం | = | త్రోసిపుచ్చబడినది |
| అతః | = | ఈ కారణము వలన |
| ప్రియం వదాం | = | ప్రియభాషిణి యగు |
| తాం | = | ఆ పార్వతిని |
| పురావిదః | = | పురాణవేత్తలు |

అపర్ణామ్ ఇతి = అపర్ణయని

వదన్తి చ = చెప్పుదురు

**తాత్పర్యము :-** రాలిన ఆకులనే ఆహారముగా స్వీకరించుటయే తపమునకు మిక్కిలి ఉత్కర్షగా ప్రసిద్ధము. అట్టి యెడ ప్రియభాషిణి యగు పార్వతి ఆ పర్ణములను సైతము తినకయే తపము చేయుటచే ఆమెను పురాణవేత్తలు 'అపర్ణ' యని పిలుతురు.

**15. శ్లో॥** తమాతిథేయీ బహుమాన పూర్వయా
సపర్యయా ప్రత్యుదియాయ పార్వతీ,
భవంతి సామ్యేఽపి నివిష్ట చేతసాం
వపు ర్విశేషే ష్వతి గౌరవాః క్రియాః (5 - 31)

**ప్రతిపదార్థము :-**

ఆతిథేయీ = అతిథుల యెడ ఆదరము కలదగు

పార్వతీ = పార్వతి

తం = ఆ బ్రహ్మచారిని

బహుమాన పూర్వయా = గౌరవ పురస్సరమగు

సపర్యయా = పూజచేత

ప్రత్యుదియాయ = ఎదుర్కొనెను

సామ్యే అపి = సమానతయే యున్నను

నివిష్ట చేతసాం = స్థిర చిత్తులకు

వపుర్వి శేషేషు = విశిష్ట వ్యక్తుల యెడ

అతి గౌరవాః = మిక్కిలి ఆదరముతో కూడిన

క్రియాః = చేష్టలు

భవంతి = ఉండును

**తాత్పర్యము :-** పార్వతి తన తపస్సుచే మహర్షుల తపస్సును గూడ క్రిందుపఱిచెను. ఇట్లుండ నొకనాడు పార్వతి భావమును పరీక్షించి, అనుగ్రహింపదలచి శివుడు బ్రహ్మచారి వేషము ధరించి పార్వతి ఆశ్రమమునకు వచ్చెను.

అతిథులను సత్కరించుటలో నేర్పరియగు పార్వతి తన ఆశ్రమము ప్రవేశించిన అతిథిని సగౌరవముగా అర్ఘ్య పాద్యాదులతో ఎదురుగానేగి పూజించెను. అది యుక్తమే. ఏలయన అతిథులు తమతో సమానులైనను స్థిర చిత్తులగువారు విశిష్ట వ్యక్తులకు, అనగా తేజో విశేష కలిత శరీరధారులగు వ్యక్తులకు గావించు సత్కారములు అతి గౌరవ భరితములుగా నుండును. అంతియే గాని తారతమ్యముదలచి ఉపేక్షింపరు.

**విశేషాంశములు :-** సామాన్యముచే విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసాలంకారమీ శ్లోకమున కలదు.

"సామ్యేఽభిని విష్టచేతసామ్" అని పాఠాంతరము కలదు. రాగ ద్వేషరాహిత్యము వలన అందరి యెడల సమబుద్ధి గల వారు అని ఆ పాఠమునకర్థము.

**16. శ్లో॥** అపి క్రియార్థం సులభం సమిత్కుశం
జలాన్యపి స్నానవిధి క్షమాణి తే,
అపి స్వశక్త్యా తపసి ప్రవర్తసే
శరీర మాద్యంఖలు ధర్మసాధనమ్ (5 - 33)

**ప్రతిపదార్థము :-**

ఓ పార్వతీ!

| | | |
|---|---|---|
| క్రియార్థం | = | హోమాదికము ననుష్ఠించుట కొరకు |
| సమిత్కుశం | = | సమిధలును, దర్భలును |
| సులభం అపి | = | చక్కగా లభించుచున్నవా? |
| జలాని | = | జలములు |
| తే | = | నీకు |
| స్నానవిధి క్షమాణి అపి | = | స్నానమొనర్చుటకు తగి యున్నవా? |
| స్వశక్త్యా | = | నీ సామర్థ్యము ననుసరించియే |
| తపసి | = | తపము చేయుట యందు |
| అపి ప్రవర్తసే | = | ప్రవర్తించుచుంటివా? |
| ఖలు | = | ఎందువల్లనైతే |
| శరీరం | = | దేహము |
| ఆద్యం | = | మొట్ట మొదటి |
| ధర్మసాధనమ్ | = | ధర్మముననుష్ఠించు సాధనమో |

**తాత్పర్యము :-** పార్వతి చేసిన అతిథి సత్కారమును స్వీకరించి క్షణకాలము విశ్రమించి, ఆ కుహనా బ్రహ్మచారి పార్వతినిట్లు ప్రశ్నించెను.

ఓ తపస్వినీ! ఇక్కడ హోమాది క్రియల కొరకు నీకు సమిధలు, దర్భలు సులభముగా లభించుచున్నవా? ఇక్కడి నీళ్ళు నీకు స్నానయోగ్యములుగా నున్నవా? నీ శక్తి ననుసరించి దేహమును ఎక్కువగా బాధింపక తపస్సు చేయుచున్నావు గదా! ఏలయన, శరీరము ధర్మ సాధనములలో మొదటిది గదా!

**విశేషాంశములు :-** సామాన్యముచే విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసాలంకారమీ శ్లోకమున కలదు.

ధర్మము - శరీరము చేతను, వాక్కు చేతను, మనస్సు చేతను, ధనము చేతను, ఇంకను అనేకముల చేతను సాధింపబడును. వీనియన్నింటిలోను శరీరము ముఖ్యము. "శీర్యత ఇతి శరీరమ్" అను వ్యుత్పత్తిచే శుష్కించి పోవునది శరీరము అని తెలినది కనుక, శీర్ణము గాకుండ జాగరూకతతో శరీరమును కాపాడుకొనవలెను.

శరీరమున్ననే, ధర్మార్థ కామ మోక్షములను చతుర్విధ పురుషార్థములను సాధింప వీలగును. కనుకనే "సతత మాత్మాన మేవ గోపాయీత" (ఎల్లప్పుడు శరీరమునే రక్షించుకొనుడు) అని శ్రుతి ఆత్మరక్షణను విధించినది. ఇక్కడ 'ఆత్మానం' అను దానికి 'శరీరమును' అనియే అర్థము.

**17. శ్లో॥** అపిత్వదా వర్జిత వారి సంభృతం
ప్రవాలమాసా మనుబంధి వీరుధాం,
చిరోజ్ఘితాలక్తక పాటలేన తే
తులాం యదారోహతి దంత వాససా (5 - 34)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| త్వత్ | = | నీ చేత |
| ఆవర్జిత | = | తడుపబడిన |
| వారి | = | నీటిచే |
| సంభృతం | = | పుట్టించబడిన |
| ఆసాం | = | ఈ |
| వీరుధాం | = | లతల యొక్క |
| ప్రవాలం | = | చిగురాకు |
| అనుబంధి అపి | = | అనుస్యూతముగనున్నది కదా |
| యత్ | = | ఏ చిగురాకు |
| చిర | = | చాలా కాలమునకు ముందే |
| ఉజ్ఘిత | = | విడువబడిన |
| అలక్తక | = | లత్తుక రంగు పూత కలదగుటచే |
| పాటలేన | = | సహజమగు ఎఱ్ఱదనము మాత్రమే కల |
| తే | = | నీ యొక్క |
| దంతవాససా | = | అధరముతో |
| తులాం | = | సామ్యమును |
| ఆరోహతి | = | పొందుచున్నదో |

**తాత్పర్యము :-** ఓ పార్వతీ! నీవు స్వయముగా పోసిన నీటిచే జనించిన ఈ లతలు చిగురాకు తొడుగుచున్నవా? ఆ చిగురాకు చిరకాలముగ లత్తుక రంగు పూయకుండుటచే సహజమగు ఎఱ్ఱదనము గల నీ యధరమును పోలుచున్నది.

నీవు నీళ్ళు పోసి శ్రద్ధగా పెంచుచుండుటచే లతలు, అవిచ్ఛిన్నముగా కొంగ్రొత్త చిగుళ్ళు ధరించుచున్నవి గదా యని అర్థము.

**విశేషాంశములు :-** ఈ శ్లోకమున లతల ప్రవాళము ఉపమేయము. సహజారుణమగు పార్వతి యధరము ఉపమానము. ఇందు ప్రసిద్ధోపమానమగు ప్రవాళమునకు ఉపమేయత్వము వర్ణింపబడినది. కావున ప్రతీపాలంకార మగుచున్నది.

**శ్లో॥** ప్రతీపముపమానస్యో, పమేయత్వ ప్రకల్పనమ్ ।
త్వల్లోచన సమం పద్మం త్వ ద్వక్త్ర సదృశో విధుః ॥

ప్రసిద్ధమగు ఉపమానమునకు ఉపమేయత్వమును కవి కల్పించి చెప్పినచో ప్రతీపాలంకారము.

**ఉదా॥** చెలీ! నీ కన్ను వంటిది పద్మము. నీ వదనము వంటి వాడు చంద్రుడు

**18. శ్లో॥** యదుచ్యతే పార్వతి పాప వృత్తయే
న రూపమిత్యవ్యభిచారి తద్వచః,
తథాహి తే శీల ముదార దర్శనే
తపస్వినా మప్యుపదేశతాం గతమ్ (5 - 36)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| పార్వతి | = | ఓ పార్వతీ! |
| రూపం | = | సౌమ్యమగు ఆకృతి |
| పాపవృత్తయే | = | పాపాచరణమునకై |
| న | = | కాదు |
| ఇతియత్ ఉచ్యతే | = | అని జనులచే ఏది చెప్పబడుచున్నదో |
| తద్వచః | = | ఆ వచనము |
| అవ్యభిచారి | = | సత్యము |
| ఉదారదర్శనే | = | విశాలములగు కన్నులు కలదానా! విపులమగు జ్ఞానము కలదానా! |
| తే | = | నీ యొక్క |
| శీలం | = | మంచి నడవడి |
| తపస్వినాం అపి | = | తపస్వులకు సయితము |
| ఉపదేశతాం | = | ఉపదేశమగుటను |
| గతం | = | పొందినది |

**తాత్పర్యము :-** పార్వతీ! సుందర రూపము కలవారు పాపము లాచరింపరు అని జనులు పలుకునది యథార్థము. వివేకవతీ! విశాలనయనముల కలదానా! నీ సత్ప్రవర్తనము, సదాచారము తాపసులకును మార్గదర్శకమగు ప్రమాణమైనది. నీవాచరించు తపస్సును జూచి, మహర్షులు సైతము తమ తపస్సమాచరణములోని లోపములను సరిదిద్దుకొనుచున్నారని భావము.

**విశేషాంశములు :-** రూపకలిత పార్వతీ శీల రూప ప్రకృత విశేషముచే, మహర్షి శీల రూప అప్రకృత సామాన్యమును సమర్థించిన అర్థాంతరన్యాసమీ శ్లోకమున కలదు.

## సారాంశము :-

కుమార సంభవ కావ్యము నందలి పంచమ సర్గ ప్రారంభము నుండి 40 శ్లోకములలోని 18 ముఖ్యమైన శ్లోకములకు ప్రతి పదార్థతాత్పర్యములతో పాటు అలంకారాది విశేషములు వివరింపబడినవి.

**డా॥ గోగినేని యోగ ప్రభావతీ దేవి**
**ఎం.ఏ. (సంస్కృతం), ఎం.ఏ. (తెలుగు), ఎం.ఫిల్., పి.హెచ్.డి.**
**శాఖాధిపతి**
**తెలుగు & ఓరియంటల్ లాంగ్వేజస్**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**

పాఠం - 3

# కుమార సంభవము - కాళిదాసు

## పంచమ సర్గ

**లక్ష్యం :-**

ఈ పాఠములో 18 ముఖ్యమైన శ్లోకములకు వ్యాఖ్య (41-86) చేయబడినది.

**1. శ్లో॥** కులే ప్రసూతిః ప్రథమస్య వేధస
త్రి లోక సౌందర్య మివోదితం వపుః,
అమృగ్యమైశ్వర్య సుఖం నవం వయ
స్తపః ఫలం స్యాత్ కిమతః పరం వద (5 - 41)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| ప్రథమస్య వేధసః | = | హిరణ్యా గర్భుని యొక్క |
| కులే | = | వంశము నందు |
| ప్రసూతిః | = | పుట్టుక |
| వపుః | = | శరీరము |
| త్రిలోక సౌందర్యం | = | ముల్లోకములలోని సౌందర్యము |
| ఉదితం ఇవ | = | ఒక్కచోట ప్రోగు చేయబడినటులున్నది |
| ఐశ్వర్య సుఖం | = | సంపదల వలని సుఖము |
| అమృగ్యం | = | వెదుకవలసిన పని లేనిది |
| నయః నవం | = | వయస్సా నూతనము (యౌవనము) |
| అతఃపరం | = | ఇంతకు మించి |
| కిం | = | ఏమి |
| తపః ఫలం | = | తపమునకు ఫలము |
| స్యాత్ | = | ఉండును? |

**తాత్పర్యము :-** పార్వతి చేసిన అతిథి సత్కారమును స్వీకరించి, ఆ మాయా వటువు పార్వతితో " ఓ తపోధనా! సాప్తపదీనమగు సఖ్యము మన కేర్పడుటచే నేను నిన్నొకటి యడుగదలంచుచున్నాను. రహస్యము కానిచో తెలుపుము.

నీ పుట్టుకయా హిరణ్యగర్భుని వంశము నందు. శరీరమా ముల్లోకముల సౌందర్యమొక్కచో చేర్చినటులున్నది. ఐశ్వర్య సుఖమా చేతికందియున్నది. అవస్థయా తొలియౌవన దశ. ఇంత కంటెను నీవు తపముచే సాధింపదగిన దేమున్నది?" అని పలికెను.

2. శ్లో॥ అలభ్య శోకాభిభవేయ మాకృతి
ర్విమాననా సుభ్రు! కుతః పితుర్గృహే,
పరాభిమర్శో న తవాస్తి, కః కరం
ప్రసారయేత్పన్నగ రత్న సూచయే (5 - 43)

**ప్రతిపదార్థము :-**

సుభ్రు = ఓ సుందరములగు కనుబొమలు కలదానా!
ఇయం = ఈ
ఆకృతిః = నీ రూపము
అలభ్య = పొంద శక్యము గాని
శోక = దుఃఖము వల్లనైన
అభిభవా = తిరస్కారము కలదిగా కనుపించు చున్నది
పితుః = తండ్రి యొక్క
గృహే = ఇంటి యందు
విమాననా = అవమానము
కుతః = ఎట్లు కలుగును?
పరాభిమర్శః = ఇతరులెవ్వరేని బాధించుట
తవ = నీకు
న అస్తి = లేదు
పన్నగ రత్న సూచయే = పాము తల పై నున్న రత్నపు మొనను తాకుటకై
కః = ఎవడు
కరం = చేతిని
ప్రసారయేత్ = చాచును?

**తాత్పర్యము :-** ఓ సుందరీ! సకల సాముద్రిక లక్షణ లక్షితమగు నీయీ ఆకారము, తనకు రాగూడని అవమానము వచ్చినందు వలన కలిగిన దుఃఖమునకు భాజనమైనదిగా కనబడుచున్నది. కాని, అది అసంభావ్యము. నీ తండ్రి యింటనే అవమానము కలుగుట ఎంత మాత్రము సంభవించునది కాదు. పోనీ పరపురుషుని వలన అవమానము కలిగినదందుమా? అదియును నీకు ఉండదు. నిన్నితరులెవ్వరు అవమానింపగలరు? పాము తల పై నుండు రత్నమునకై ఎవ్వడు చేయి చాపును?

**విశేషాంశములు :-** "పరాభిమర్శోన తవాస్తి, కః కరం, ప్రసారయేత్ పన్నగ రత్న సూచయే" అనుచోట రెండు వాక్యములకు ఏకసామ్యము ఉండుటచే ప్రతి వస్తూపమాలంకారము ఈ శ్లోకమున కలదు". "ఇతర స్పర్శలేమియే" ఇందు వేర్వేరు పదములతో రెండు వాక్యములందు చెప్పబడినది కనుక ప్రతివస్తూపమ.

3. శ్లో॥ కిమిత్యపాస్యాభరణాని యౌవనే
ధృతం త్వయా వార్ధక శోభి వల్కలమ్,
వద ప్రదోషే స్ఫుట చంద్ర తారకా
విభావరీ యద్య రుణాయ కల్పతే (5 - 44)

**ప్రతిపదార్థము :-**

పార్వతీ!

| | | |
|---|---|---|
| కిమితి | = | ఏ కారణము చే |
| యౌవనే | = | పడుచుతనము నందు |
| త్వయా | = | నీచే |
| ఆభరణాని అపాస్య | = | ఆభరణములు విడువబడి |
| వార్ధక శోభి | = | ముసలితనమందు శోభిల్లెడి |
| వల్కలం | = | నార వస్త్రము |
| ధృతం | = | ధరింపబడినది? |
| ప్రదోషే | = | సాయంకాల మందు |
| స్ఫుట | = | స్పష్టముగా కనిపించు |
| చంద్ర | = | చంద్రుడు |
| తారకా | = | నక్షత్రములతో కూడిన |
| విభావరీ | = | రాత్రి |
| అరుణాయ కల్పతే యది | = | అరుణోదయమునకు సిద్ధపడుచో ఎట్లుండునో |
| వద | = | చెప్పుము |

**తాత్పర్యము :-** "పార్వతీ! సకలాభరణ ధారణ యోగ్యమగు యౌవనము నందు ఆభరణములను ధరింపక, వార్ధకము నందు శోభించు నార వస్త్రమును నీ వేల ధరించితివి? ప్రస్ఫుటముగా ప్రకాశించుచున్న చంద్ర తారకలు గల ప్రదోష సమయమున, రాత్రి అరుణుని పొందుటకు అర్హమగునా? చెప్పుము" అని బ్రహ్మచారి పార్వతిని ప్రశ్నించుచున్నాడు.

చంద్రుడు, చుక్కలతో కూడిన రాత్రి ఒక్కుమ్మడిగా అరుణోదయముగా మారుచో ఎట్లుండునో ఊహింపుము. అనగా చంద్ర తారకలు స్ఫుటముగా ప్రకాశించు ప్రదోష కాలమున అరుణుడుదయించినచో, యువతివగు నీవు విభూషణములు పరిత్యజించి వల్కలమును ధరించుట ఘటించును. ఈ రెండును ఘటింపవని భావము.

**విశేషాంశములు :-** 'కిమితి ధృతమ్' 'యది కల్పతే' అని, ఒక యర్థమే భిన్న శబ్దములతో రెండు వాక్యములందు చెప్పబడినది గనుక ఇందలి అలంకారము ప్రతివస్తూపమ.

ఇందు యౌవనమునకు - ప్రదోషమునకు, ఆభరణములకు - తారకలకు, వల్కలమునకు - అరుణునకు, రాత్రికి - పార్వతికిని వస్తు ప్రతి వస్తు భావము.

**4. శ్లో॥** దివం యది ప్రార్థయసే వృథా శ్రమః
పితుః ప్రదేశా స్తవ దేవభూమయః
అథోపయన్తార మలం సమాధినా
నరత్న మన్విష్యతి మృగ్యతేహి తత్ (5 - 45)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| దివం | = | స్వర్గమును |
| ప్రార్థయసే యది | = | కోరుదువేని |
| శ్రమః | = | ఈ తపము చేయుట వలని బడలిక |
| వృథా | = | నిష్ఫలము |
| తవ | = | నీ యొక్క |
| పితుః | = | తండ్రి యొక్క |
| ప్రదేశాః | = | ప్రదేశములే |
| దేవభూమయః | = | దేవ నివాసములు |
| అథ | = | లేక |
| ఉపయంతారం | = | వరుని కోరుదువేని |
| అలం | = | వలదు |
| హి | = | ఎందువల్లనైతే |
| రత్నం | = | రత్నము |
| న అన్విష్యతి | = | తన్ను స్వీకరించు వానికై వెదుకదు |
| తత్ | = | అది |
| మృగ్యతే | = | (గ్రహీతలచే) వెదుకబడును |

**తాత్పర్యము :-** "ఓ హైమవతీ! నీవు స్వర్గ కాంక్షతో తపము చేయుచుంటివేని, ఆ ప్రయాసము వ్యర్థము. నీ తండ్రి భూములు (హిమాలయ ప్రాంతమే) దేవ భూములు. అనగా దేవతలకు నివాసమే హిమ వన్నగము. పోనీ, భర్త కొరకు తపించుచుంటివా? అట్లైనచో తపస్సు మానుము. అది నీకు తగదు. ఏలయన? రత్నమును ధరించువారు రత్నమును వెదకుదురు కాని, రత్నము తన్ను ధరించు వారిని వెదకదు కదా!" కనుక, కన్యా రత్నమవగు నీవు వరునికై తపస్సు చేయనక్కర లేదు. వరుడే నీ కొరకు తపస్సు చేయవలెనని బ్రహ్మచారి పలుకుల భావము.

**విశేషాంశములు :-**

1. రత్న శబ్దమునకు శ్రేష్ఠము అనునర్థమును చెప్పినచో "సకల గుణ శ్రేష్ఠురాలగు కన్య వరునన్వేషింపదు. అట్టి కన్యను వరుడే వెదకికొనవలెను" అను సామాన్యముచే వరునికై పార్వతి తపస్సు చేయనక్కరలేదు అను విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసాలంకారము.
2. రత్న శబ్దమునకు "రత్నం శ్రేష్ఠే మణావపి" అని రెండర్థములు చెప్పబడుచున్నవి గాన, ఇందు "రత్నము = పద్మరాగాది

మణి" అనునర్థమును చెప్పినచో "రత్నము తన్ను ధరించువారిని వెదుకదు" అని రత్న కర్తృకాన్వేషణమును నిషేధించుట చేత తత్సదృశమగు దేవీ కర్తృక వరాన్వేషణమునకు నిషేధము ప్రతీయమాన మగుచున్నది. కనుక సాదృశ్యమూలక అప్రస్తుత ప్రశంసాలంకారము.

"తగిన వరుడు గాని, తదీయులు గాని, కన్యాదాత కడకు వచ్చి యడిగిననే కన్యనియ్యవలను" అనునది ఆర్ష ధర్మము. అందులకు సూచకము వివాహాంగమగు కన్యావరణము. కనుకనే శివుడును, హిమవంతుని కడకు కన్యావరణమునకై సప్తర్షులను పంపినట్లు కాళిదాసు షష్ఠ సర్గమున వర్ణించినాడు.

**5. శ్లో॥** అహో స్థిరః కో౽పి తవేప్సితో యువా
చిరాయ కర్ణోత్పల శూన్యతాంగతే,
ఉపేక్షతే యః శ్లథలంబినీ ర్జటాః
కపోల దేశే కలమాగ్ర పింగళాః (5 - 47)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| అహో! | = | ఆశ్చర్యము! |
| తవ | = | నీకు |
| ఈప్సితః | = | పొందుట కిష్టమైన |
| యః | = | ఏ యువకుడు |
| చిరాయ | = | చాలా కాలము నుండి |
| కర్ణోత్పల శూన్యతాంగతే | = | చెవిలో కలువ పూవు నలంకరించుకొనని |
| కపోల దేశే | = | చెక్కిలి యందు |
| శ్లథలంబినీః | = | ముడివీడి వ్రేలాడుచున్న |
| కలమాగ్ర పింగళాః | = | కలమమను పేరు యొక్క కొనవలె పింగళ వర్ణము కల, |
| జటాః | = | జడలను (చూచియు) |
| ఉపేక్షతే | = | ఊరకుండును? |

**తాత్పర్యము :-** పార్వతీ! నీ వేడి నిట్టూర్పు నీవు వరుని కోరుచున్నావని సూచించుచున్నను నా మనుస్సులోని సంశయము పోవుట లేదు. నీవు కోరదగిన యోగ్యత కలవాడే కనపడడు. అట్టి యెడ నీవు కోరినను లభింపని వాడెవ్వడుండును? అని ప్రశ్నించుచు బ్రహ్మచారి ఆమె స్థితికి పరితపించుచు ఇట్లు పలికెను.

ఆశ్చర్యముగా నున్నది. నీవు మక్కువ చూపుచున్ననను నీ కడకు రాని ఆ యువకుడు నిజముగ కఠినాత్ముడే కానోపును. అట్లు కానిచో చాల కాలము నుండి నీవు చెవిలో కలువ పూవు నలంకరించుకొనకుండుటచే బోసిపోయి, నీ కపోలము పై ముడి వీడి వ్రేలాడు కలమసస్యపు అగ్రము వలె పింగళ వర్ణము గల జడలను చూచి యుపేక్షించునా?

**విశేషాంశములు :-** "శ్లథలంబినీః జటాః కపోల దేశే కలమాగ్ర పింగళాః"

పింగళ వర్ణము గల జడలను కలమ సస్యపు కొనలతో పోల్చుటచే ఉపమాలంకారము

ఉపమానము - కలమాగ్రములు

| | | |
|---|---|---|
| ఉపమేయము | - | జటలు |
| సమాన ధర్మము | - | పింగళత్వము |
| ఉపమా వాచకము | - | ఇవ |

కలమాగ్రాణీవ పింగళాః - అని విగ్రహము. సమాసమున వాచకము లోపించినది.

**6. శ్లో॥** మునివ్రతై స్త్వా మతిమాత్ర కర్శితాం
దివాకరా ప్లుష్ట విభూషణాస్పదామ్,
శశాంక లేఖామివ పశ్యతో దివా
స చేతసః కస్య మనో న దూయతే (5 - 48)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| ముని వ్రతైః | = | చాంద్రాయణాదికములగు మునులాచరించు వ్రతములచే |
| అతి మాత్ర కర్శితాం | = | మిక్కిలి కృశింపజేయ బడినదియు |
| దివాకర | = | సూర్యునిచే |
| ఆ ప్లుష్ట | = | దహింపజేయబడిన |
| విభూషణాస్పదాం | = | ఆభరణములు ధరించు ప్రదేశములు కలదియు |
| దివా | = | పగలు |
| శశాంక లేఖామివ | = | చంద్రరేఖ వలెనున్న |
| త్వాం | = | నిన్ను |
| పశ్యతః | = | చూచుచున్న |
| సచేతసః | = | మంచి మనసున్న |
| కస్య | = | ఎవని యొక్క |
| మనః | = | మనస్సు |
| న దూయతే | = | పరితపించదు? |

**తాత్పర్యము :-** "ఓ పార్వతీ! చాంద్రాయణాది వ్రతములచే కృశించి, ఆభరణములు దాల్చు ప్రదేశములు సూర్య కాంతిచే కమలి యుండగా, పగలు చంద్రరేఖ వలె కాంతి తొలగియున్న నిన్ను గాంచి మనసున్న వాడెవ్వడు బాధపడకుండును?" సహృదయులగు వారి యందరి హృదయములు పరితపించునని యర్థము.

**విశేషాంశములు :-**

| | | |
|---|---|---|
| ఉపమానము | - | పగటి సమయము నందలి చంద్ర రేఖ |
| ఉపమేయము | - | పార్వతి |
| ఉపమా వాచకము | - | ఇవ (వలె) |

అతి మాత్ర కర్శితామ్, దివాకరా ప్లుష్ట విభూషణాస్పదామ్ అనునవి శ్లిష్టములు. శ్లేషచే ఉపమానోపమేయములకు సాధారణ ధర్మము చెప్పబడినది. కనుక ఇందు శ్లేష చే సాధారణ ధర్మమును చెప్పిన ఉపమాలంకారము కలదు.

**7. శ్లో॥** సఖీ తదీయా తమువాచ వర్ణినం
నిబోధ సాధో! తవచేత్ కుతూహలమ్,
యదర్థ మంభోజ మివోష్ణవారణం
కృతం తపస్సాధన మేతయా వపుః (5 - 52)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| తదీయా | = | పార్వతి యొక్క |
| సఖీ | = | చెలి |
| తం | = | ఆ |
| వర్ణినం | = | బ్రహ్మచారిని గూర్చి |
| ఉవాచ | = | ఇట్లు పలికెను |
| సాధో | = | ఓ సజ్జనుడా! |
| తవ | = | నీకు |
| కుతూహలం చేత్ | = | వినవలెనని కుతూహలమున్నచో |
| యదర్థం | = | ఎందులకై |
| ఏతయా | = | ఈమె చేత |
| అంభోజం | = | పద్మము |
| ఉష్ణవారణం ఇవ | = | గొడుగుగా వలె |
| వపుః | = | శరీరము |
| తపః సాధనమ్ | = | తపస్సు చేయుటకు సాధనముగా |
| కృతం | = | చేయబడినదో |
| నిబోధ | = | వినుము |

**తాత్పర్యము :-** మాయావటు రూపధారి శివుడు, పార్వతి తపస్సునకు కారణమేమని యడిగెను. అందులకు గౌరీ సఖి ఇట్లు సమాధానమిచ్చెను. "ఓ విద్వాంసుడా! ఏ లాభము కొరకు ఈ హైమవతి - అంభోజమును ఆతపత్రమును బోలె - తన శరీరమును తపస్సునకు సాధనముగా చేసినదో ఆ కారణమునుచెప్పెదను, నీకు కుతూహలమున్నచో వినుము".

**విశేషాంశములు :-** ఎండను వారించుటకు తామర పూవును గొడుగుగా పట్టినట్లు, ఈమె తన మృదు శరీరమును తపస్సునకు సాధనముగా చేసినదను చెలి కత్తె పలుకులలో ఉపమాలంకారము.

| | | |
|---|---|---|
| ఉపమానము | - | సుకుమారము, సుందరమునైన అంభోజము |
| ఉపమేయము | - | సుకుమారము, సుందరమునైన వపువు |
| సమాన ధర్మము | - | అనురూప కార్యమునకు సాధనమును చేయుట |

ఉపమా వాచకము - ఇవ (వలె)

తపస్సాధనం కృతమ్ - బింబము, ఉష్ణవారణమ్ కృతమ్ - ప్రతిబింబము. కనుక ఇందు గమ్య మానానుగామిత్వ - బింబ ప్రతిబింబ భావములకు మిశ్రణము గలదు.

**8. శ్లో॥** ద్రుమేషు సఖ్యా కృత జన్మసు స్వయం
ఫలం తపస్సాక్షిషు దృష్టమేష్వపి,
న చ ప్రరోహాభి ముఖోఽపి దృశ్యతే
మనో రథోఽస్యాః శశిమౌళి సంశ్రయః (5 - 60)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| సఖ్యా | = | మా చెలి పార్వతిచే |
| స్వయం | = | స్వయముగనే |
| కృత జన్మసు | = | జన్మమీయబడినవియు (నాటబడినవియు) |
| తపః సాక్షిషు | = | ఈమె తపమును సాక్షాత్తుగా చూచినవియు అగు |
| ఏషు ద్రుమేషు | = | ఈ వృక్షములందును |
| ఫలం | = | పండు |
| దృష్టం | = | కనబడినది |
| అస్యాః | = | ఈ పార్వతి యొక్క |
| శశిమౌళి సంశ్రయః | = | శివ విషయకమగు |
| మనోరథః తు | = | కోరిక మాత్రము |
| ప్రరోహాభిముఖోఽపి | = | మొలకెత్తబోవు చున్నట్లు కూడ |
| న దృశ్యతే | = | కనబడుట లేదు |

**తాత్పర్యము :-** శివుని పతిగా పొంద దలచి పార్వతి తపమొనరించుచున్నదను విషయమును పార్వతి చెలికత్తె బ్రహ్మచారికి విన్నవించుచు ఇట్లు పలికినది.

మా చెలి స్వయముగ నాటి పెంచగా, ఆమె చేసిన తపమునకు ప్రత్యక్ష సాక్షులుగ నిలిచిన ఈ చెట్లు కూడ ఫలించుచున్నవి. కాని పార్వతి మనోరథము మాత్రము మొలకెత్తుచున్నటులైన కనిపించదు. ఇక ఫలించునను ఆశ ఎట్లు కలుగునని పార్వతి చెలికత్తె పలుకుల భావము.

**9. శ్లో॥** న వేద్మి సప్రార్థిత దుర్లభః కదా
సఖీభి రస్రోత్తర మీక్షితా మిమామ్,
తపః కృశా మభ్యుపపత్స్యతే సఖీం
వృషేవ సీతాం తదవగ్రహక్షతామ్ (5 - 61)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| ప్రార్థిత దుర్లభః | = | కోరబడిన వాడై లభించని |
| సః | = | ఆ పరమేశ్వరుడు |
| తపః కృశామ్ | = | తపస్సుచే క్షీణించినదియు |
| సఖీభిః | = | చెలులచే |
| అస్రోత్తరం | = | కన్నీరు అధికముగాకార్చుచు |
| ఈక్షితాం | = | చూడబడినట్టి |
| ఇమాం | = | ఈ |
| సఖీం | = | మా చెలిని |
| తత్ | = | ఆ యింద్రుని యొక్క |
| అవగ్రహ | = | అనావృష్టి చేత |
| క్షతాం | = | పీడింపబడిన |
| సీతాం | = | దున్నబడిన భూమిని |
| వృషా ఇవ | = | ఇంద్రుని వలె |
| కదా | = | ఎప్పుడు |
| అభ్యుపపత్స్యతే | = | అనుగ్రహించునో |
| న వేద్మి | = | ఎఱుగను |

**తాత్పర్యము :-** "కోరినను దుర్లభుడైన ఆ పరమేశ్వరుడిట్లు తపముచే కృశించి, చెలులు కన్నీరు గార్చుచు చూచుచున్న ఈమెను, చిరకాలము వర్షము లేక దున్నబడియున్న భూమిని ఇంద్రుని వలె ఎపుడను గ్రహించునో తెలియజాలకున్నాను" అని పార్వతి చెలికత్తె బ్రహ్మచారితో దీనముగా పలికినది.

**విశేషాంశములు :-** "వృషేవ సీతాం.............." అనుటచే ఉపమాలంకారము

| | | |
|---|---|---|
| ఉపమానము | - | సీతను (నాగేటి చాలుము) |
| ఉపమేయము | - | పార్వతిని |
| సమాన ధర్మము | - | అనుగ్రహించుట (ఇది అనుగామి ధర్మము) |
| ఉపమా వాచకము | - | ఇవ (వలె) |
| తదర్థక తపః కృశామ్ | - | బింబము |
| తత్కృతావగ్రహ క్షతామ్ | - | ప్రతి బింబము |

"సఖీభి రస్రోత్తర మీక్షితామ్", 'ప్రార్థిత దుర్లభః'

ఇవి ఉభయాన్వయములు , శ్లిష్టములు.

| | | |
|---|---|---|
| సః (పినాకపాణిః ) | - | బింబము |
| వృషా | - | ప్రతిబింబము |

కనుక ఇందు అనుగామిత్వ - బింబ ప్రతిబింబ భావ - శ్లేషలకు మిశ్రణము గలదు.

**10. శ్లో॥** యథా శ్రుతం వేదవిదాం వరత్వయా
జనోఽయ ముచ్చైః పదలంఘనోత్సుకః,
తపః కిలేదం తదవాప్తి సాధనం
మనోరథానా మగతి ర్న విద్యతే (5 - 64)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| వేద విదాంవర! | = | వైదిక శ్రేష్ఠుడా! |
| త్వయా | = | నీ చేత |
| యథా | = | ఎట్లు |
| శ్రుతం | = | వినబడినదో |
| అయం జనః | = | నేను |
| ఉచ్చైఃపద | = | శివుడు లభించుట యను ఉన్నత స్థానమును |
| లంఘన | = | ఆక్రమించుట యందు |
| ఉత్సుకః | = | మిక్కిలి యుత్సాహము కలదాననై యున్నాను |
| ఇదం తపః | = | ఈ తపము |
| తత్ | = | ఆ ఉన్నత పదము యొక్క |
| అవాప్తి | = | పొందుటకు |
| సాధనం | = | ఉపకరణము |
| మనోరథానాం | = | కోరికలకు |
| అగతిః | = | విషయము కానిది |
| న విద్యతే | = | ఉండదు |

**తాత్పర్యము :-** శివుని పొందగోరి పార్వతి తపమొనరించుచున్నదను విషయమును ఆమె చెలికత్తె వలన తెలిసికొన్న మాయా వటువు తనకు గలిగిన సంతోషమును బయటకు తెలియనీక "పార్వతీ! నీ చెలి పలికినది వాస్తవమా? లేక పరిహాసమునకా?" అని పార్వతినడిగెను.

అంత పార్వతి సిగ్గుతో పరిమితాక్షరములు కల పదములతో ఇట్లు పలికెను. "ఓ వేదజ్ఞ శిరోమణీ! నీవు వినినట్లే నేను శివ పత్నినగుటయను ఉన్నత స్థానము నాక్రమింపవలెనని ఉత్కంఠ కలిగి యున్నాను. ఈ తపస్సుచే నేనా యున్నత పదమును సాధింపదలచుచున్నాను. ఈ అత్యల్ప తపస్సు ఎంత మాత్రము చాలదు. కనుక తపము చాలింపుమందువేమో? అట్లు కాదు. కోరికలకు విషయము కానిది లేదు" అనగా కోరికలు కోరు వారి శక్తి నాలోచించి ప్రవర్తింపవు అని భావము. కోరికలను సాధ్యాసాధ్య ప్రసక్తియే యుండదు. పొంద శక్యమైనను, అశక్యమైనను కోరుట సాధారణము.

**విశేషాంశములు :-** సామాన్యముచే విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసాలంకారమీ శ్లోకమున కలదు.

**11. శ్లో॥** త్వమేవ తావత్ పరిచింతయ స్వయం
కదా చిదేతే యది యోగ మర్హతః,
వధూదుకూలం కలహంస లక్షణం
గజాజినం శోణిత బిందు వర్షిచ (5 - 67)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| త్వమ్ ఏవ | = | నీవే |
| స్వయం | = | స్వయముగా |
| తావత్ | = | ఇంత మాత్రము |
| పరిచింతయ | = | ఆలోచింపుము |
| కల హంస లక్షణం | = | కల హంస చిహ్నములు గల |
| వధూదుకూలం | = | క్రొత్త పెండ్లి కూతురు ధరించిన పట్టు వస్త్రము |
| శోణిత బిందువర్షి | = | రక్తపు చుక్కలు స్రవించు |
| గజాజినంచ | = | ఏనుగు తోలును |
| ఏతే | = | ఈ రెండును |
| కదాచిత్ | = | ఎన్నడైనను |
| యోగం | = | కలయికను |
| అర్హతః యది | = | తగునేమో (నీవే ఆలోచింపుము) |

**తాత్పర్యము :-** పార్వతి శివుని పొందగోరుచున్న విషయము చెలికత్తె ద్వారా విన్న కపట వటువు అమంగళాచారపరుడగు శివుని కోరుట తగదని వారించుచు పార్వతితో పలుకుచున్నాడు.

"ఓ పార్వతీ! నాగకంకణుడగు శివుని చేతిని వివాహ సమయమున ఎట్లు స్పృశింప గలవు? నూతన వధువుగా నీవు ధరించిన కల హంసలు చిత్రింపబడిన నీ పట్టు వస్త్రమునకును, శివుడు ధరించు రక్తసిక్తమైన ఏనుగు తోలునకును బ్రహ్మముడి వేయుట ఎంత వరకు తగునో నీవే ఆలోచింపుము".

**12. శ్లో॥** ఇయం చ తేఽన్యా పురతో విడంబనా
యదూఢయా వారణ రాజ హార్యయా,
విలోక్య వృద్ధోక్ష మధిష్ఠితం త్వయా
మహాజనః స్మేరముఖో భవిష్యతి

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| ఇయంచ | = | ఇదియు |
| తేపురతః | = | నీ యెదుటే |
| అన్యా | = | వేరొక |

| | | |
|---|---|---|
| విడంబనా | = | పరిహాసము |
| ఊఢయా | = | వివాహమాడి |
| వారణరాజ | = | శ్రేష్ఠ గజముచే |
| హార్యయా | = | తీసికొనిపోదగిన |
| త్వయా | = | నీచే |
| అధిష్ఠితం | = | ఎక్కబడిన |
| వృద్ధోక్షం | = | ముసలి యెద్దును |
| విలోక్య | = | చూచి |
| మహాజనః | = | సాధువులు |
| స్మేరముఖః | = | చిరునగవు కలవారు |
| భవిష్యతి | = | అగుదురు (పరిహసింతురు) |

**తాత్పర్యము :-** "ఓ పార్వతీ! చతుశ్శాలలో పూలు పరిచిన నేల పై యుంచెడు లాక్షార సరాగ రంజితములైన నీ యడుగుల గుర్తులు, వెంౘ్రుకలు పరిచిన శ్మశాన వాటికలలో పడుటను శత్రువైనను అనుమతింపనేరడు. శివాలింగన సమయమున చందన మలదిన నీ దేహమునకు శ్మశానపు భస్మమంటుకొనును.

ఇక నీ ముందు వేరొక పరిహాసము కలదు. వివాహానంతరము భద్ర గజము పై తీసికొని పోదగిన నీ వొక ముసలి యెద్దునెక్కుట చూచి పలువురు పరిహసింతురు సుమీ! అని మాయా వటువు పార్వతిని ఎగతాళి చేయుచున్నాడు.

**13. శ్లో॥** వపుర్విరూపాక్ష మలక్ష్య జన్మతా
దిగంబరత్వేన నివేదితం వసు,
వరేషు యద్బాల మృగాక్షి మృగ్యతే
తదస్తి కిం వ్యస్తమపి త్రిలోచనే

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| వపుః | = | రూపము |
| విరూపాక్షం | = | వికృత రూపములగు కన్నులు (మూడు) కలది |
| అలక్ష్య జన్మతా | = | జన్మ ప్రకారము తెలియరానిది |
| వసు | = | ధనము |
| దిగంబరత్వేన | = | వస్త్రములు దాల్చకుండుట చేతనే |
| నివేదితం | = | (లేదని) సూచితము |
| బాల మృగాక్షి | = | పిల్లలేడి కన్నుల వంటి కన్నులు కలదానా! |
| యత్ | = | ఏ రూప విత్తాదికము |
| వరేషు | = | వరుల కడ |
| మృగ్యతే | = | (కన్యాదాతలచే) అన్వేషింపబడునో |

| | | |
|---|---|---|
| తత్ | = | అది |
| త్రిలోచనే | = | శివుని యందు |
| వ్యస్తమ్ అపి | = | ఒక్కటియైన |
| అస్తికిమ్? | = | ఉన్నదా? |

**తాత్పర్యము :-** "ఓ పార్వతీ! శివుని శిరమందున్న కాంతిమంతమగు చంద్రకళయు, ఈ లోకమునకే నేత్రానందము గూర్చు నీవును - మీరిరువురు శివ సమాగమము కోరి శోచనీయులయితిరి సుమా.

శివుని రూపమో మూడు కన్నులచే అసుందరము. పుట్టుక ఎట్లో తెలియదు. సంపదలు లేవని వస్త్రములు ధరింపకుండటే తెలుపుచున్నది. కన్యాదాత వరునిలో ఏయే గుణములున్నవా, లేవాయని యన్వేషించునో అందొక్క గుణమైన శివుని యందున్నదా?" అని బ్రహ్మచారి పార్వతిని ప్రశ్నించుచున్నాడు.

**14. శ్లో॥** ఉవాచ చైనం పరమార్థతో హరం
న వేత్సి నూనం యత ఏవ మాత్థమామ్,
అలోక సామాన్య మచింత్య హేతుకం
ద్విషన్తి మందాశ్చరితం మహాత్మనామ్ (5 - 75)

**ప్రతిపదార్థము :-**

పార్వతీ,

| | | |
|---|---|---|
| ఏనం | = | ఈ బ్రహ్మచారిని (ఉద్దేశించి) |
| ఉవాచ చ | = | పలికెను |
| పరమార్థతః | = | యథార్థముగ |
| హరం | = | శివుని |
| న వేత్సి | = | ఎరుగవు |
| నూనం | = | నిశ్చయముగ |
| యతః | = | ఎందువల్లనైతే |
| మాం | = | నన్ను |
| ఏవం | = | ఇట్లు |
| ఆత్థ | = | పలుకుచుంటివో |
| అలోక సామాన్యం | = | అనితర సాధారణమును |
| అచింత్య హేతుకం | = | తెలియరాని కారణము కలదియు అగు |
| మహాత్మనాం | = | మహాత్ముల యొక్క |
| చరితం | = | ఆచరణమును |
| మందాః | = | మూఢులు |
| ద్విషన్తి | = | దూషింతురు |

**తాత్పర్యము :-** పార్వతి చెలులు, పార్వతియు చెప్పిన మాటలు విని, మాయా వటు రూపధారి యగు శివుడు, శివుని పలువిధముల నిందించి "అమంగళాచారపరాయణుడు శివుడు, ప్రశంసనీయ భాగ్య లక్షణలక్షితవు నీవు. మీ యురువురకు సమాగమము తగదు. ఈ కోరిక మానుకొనుము" అని చెప్పెను. ఆ మాటలు విన్న పార్వతి కోపముతో నిట్లు పలికెను.

"ఓయీ! వటువా! నీవు నాకీ విధముగా చెప్పుచున్నాడవు గనుక వినుము. నీవు హరుని యథార్థ స్వరూపము నెఱుగవు. కావుననే ఇట్లు పలుకుచుంటివి. అలోక సామాన్యము (ఇతర జన సాధారణము కానిది), అచింత్య హేతుకము (సామాన్యులకు తెలియరాని కారణములు గలది) అగు మహాత్ముల చరిత్రమును, పరమార్థ జ్ఞానరహితులైన మూఢులు దూషింతురు". (ప్రాజ్ఞులు మాత్రము, ఇందులకేదేని కారణముండునని గౌరవ భావముతో చూతురని అభిప్రాయము).

**విశేషాంశములు :-** ఈ శ్లోకము నందు ఉత్తరార్థ రూప సామాన్యముచే పూర్వార్థ రూప విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసాలంకారము కలదు.

**15. శ్లో॥** అలం వివాదేన యథా(శుత స్త్వయా
తథా విధ స్తావదశేష మస్తు సః,
మమాత్ర భావైక రసం మనః స్థిరం
న కామ వృత్తి ర్వచనీయ మీక్షతే (5 - 82)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| వివాదేన | = | కలహము (చే), |
| అలం | = | వలదు |
| త్వయా తావత్ | = | నీ చేత |
| యథా | = | ఎట్లు |
| సః | = | ఆ యీశ్వరుడు |
| శ్రుతః | = | వినబడెనో |
| అశేషం | = | పూర్తిగా |
| తథా విధః | = | అట్టివాడే |
| అస్తు | = | కానిమ్ము |
| మమ మనః (తు) | = | నా మనస్సు మాత్రము |
| అత్ర | = | ఈ శివుని యందు |
| భావ | = | శృంగారమే |
| ఏక | = | అద్వితీయమగు |
| రసం | = | ఆస్వాదమగునట్లు |
| స్థిరం | = | అచంచలమై యున్నది |
| కామ వృత్తిః | = | స్వేచ్ఛగా వ్యవహరించు వ్యక్తి |
| వచనీయం | = | అపవాదును |
| న ఈక్షతే | = | ఆలోచింపడు కదా! |

**తాత్పర్యము :-** ఓ బ్రహ్మచారీ! ఇంక వివాదమేల? నీవు ఆ శివుని గూర్చి ఎట్టివాడని వినియుంటివో? సంపూర్ణముగా ఆతడు అట్టివాడే యగుగాక! నా మనస్సు ఆయనయందే శృంగార రసైక ప్రవణమైయున్నది. స్వేచ్ఛా వ్యవహారి (తన యిష్టము చొప్పున నడచుకొను జనము) లోకనిందను లెక్క చేయదు.

**విశేషాంశములు :-** సామాన్యముచే విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసాలంకారమీ శ్లోకమున గలదు.

**16. శ్లో॥** నివార్యతా మాలి! కిమప్యయం వటుః
పునర్వివక్షుః స్ఫురితోత్తరాధరః,
న కేవలం యోమహతోఽ పభాషతే
శృణోతి తస్మాదపి యః సపాపభాక్ (5 - 83)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| ఆలి | = | ఓ చెలీ! |
| స్ఫురిత | = | అదరుచున్న |
| ఉత్తరాధరః | = | రెండు పెదవులు కల |
| అయం వటుః | = | ఈ బ్రహ్మచారి |
| పునః | = | మరల |
| కిమ్ అపి వివక్షుః | = | ఏదో పలుక గోరుచున్నాడు |
| నివార్యతామ్ | = | అతడు వారింపబడు గాక! |
| యః | = | ఎవడు |
| మహతః | = | పూజ్యులను |
| అపభాషతే | = | నిందించునో |
| న కేవలం సః | = | అతడు మాత్రమే కాదు |
| తస్మాత్ | = | అట్లు నిందించు వాని వలన |
| యః శృణోతి | = | ఎవ్వడు వినునో |
| సః అపి | = | వాడును |
| పాపభాక్ | = | పాపము నొందును |

**తాత్పర్యము :-** "సఖీ! ఎక్కువగా కదలుచున్న అధరోష్ఠము గల ఈ వటువు, మరల నేదియో చెప్పనెంచుచున్నాడు. కావున, ఈతనిని నివారింపుము. ఎవడు మహాత్ములను నిందించునో అతడు మాత్రమే పాప భాక్కు గాడు. ఆ మహాజన నిందకుని వలన మహాత్ముల నిందలను వినువాడును పాపభాక్కు అగును" అని పార్వతి చెలికత్తెతో పలుకుచున్నది.

**విశేషాంశములు :-** సామాన్యముచే విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసాలంకారమీ శ్లోకమున కలదు.

**శ్లో॥** "గురోర్యత్ర పరీవాదో, నిందా వాఽపి ప్రవర్తతే
కర్ణౌ తత్ర పిధాతవ్యౌ, గన్తవ్యం వాతతోఽన్యతః" (మను 2-200)

ఈ శ్లోకము నందలి గురు శబ్దము పూజ్యులకు ఉపలక్షణము.

ఏ ప్రదేశమున గురువును గూర్చి గాని, పూజ్యులను గూర్చి గాని పరీవాదము (ఉన్న దోషములనుద్ఘాటించుట) గాని, నింద (లేని దోషములనుద్ఘాటించుట) గాని జరుగుచుండునో? అక్కడ శిష్యుడు చెవులు మూసికొనవలెను లేదా అక్కడ నుండి మరియొక తావునకు పోవలెను.

పై వాక్యముల కనుగుణముగా బ్రహ్మచారి చేయుచున్న శివ నిందను వారింపుమని చెలికత్తెతో పలుకుచున్న పార్వతి, అట్లు కానిచో నేనే వేరొక చోటికి పోయెదనని పలికి, వేగముగా అట నుండి కదలెను.

**17. శ్లో॥** "తం వీక్ష్య వేపథుమతీ సరసాంగయష్టి
ర్నిక్షేపణాయ పదముద్ధృత ముద్వహంతీ,
మార్గాచల వ్యతికరాకులితేవ సింధుః
శైలాధిరాజ తనయా న యయౌ నతస్థౌ" (5 - 85)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| తం | = | ఆ దేవుని |
| వీక్ష్య | = | చూచి |
| వేపథుమతీ | = | ఒడలు కంపించుట కలదై |
| సరసాంగయష్టిః | = | చెమట పట్టిన శరీరము కలదై |
| నిక్షేపణాయ | = | నేల పై మోపుటకై |
| ఉద్ధృతం | = | ఎత్తబడిన |
| పదం | = | పాదమును |
| ఉద్వహంతీ | = | అట్లే నిలిపియున్నదై |
| మార్గ | = | త్రోవ యందలి |
| అచల | = | కొండ యొక్క |
| వ్యతికర | = | ఎదుర్కొనుటచే |
| ఆకులితా | = | సంభ్రాంతి నొందిన |
| సింధుః ఇవ | = | నది వలె |
| శైలాధిరాజ | = | హిమవంతుని యొక్క |
| తనయా | = | కూతురగు పార్వతి |
| న యయౌ | = | పోలేదు |
| న తస్థౌ | = | నిలువను లేదు |

**తాత్పర్యము :-** "సఖీ! శివనింద వినుటయు పాపమే. పోనీ అతనినిక్కడనే యుండనిమ్ము. నేనిట నుండి వెళ్ళెదను" అని పార్వతి కదలినంతనే మహేశ్వరుడు నిజ రూపమును దాల్చి, నవ్వుచు, హైమవతిని పట్టుకొనెను. ఆ శంకరుని చూడగనే పార్వతికి సాత్త్విక భావములు పొడసూపెను. ఒడలు కంపించెను. అవయవములు చెమటకు తడిసెను. ఆమె పోవుటకై ఎత్తిన పాదమునట్లే నిలిపి

యుంచినది. ఎత్తిన పాదమునట్లే యెత్తి యుంచిన పర్వత సార్వభౌమ తనయ - ప్రవాహ మార్గమున ఎదురైన కొండను జూచి సంభ్రాంతి నొందిన నది వలె - అట నుండి పోలేకయు, ఉండజాలకయు నుండెను.

**విశేషాంశములు :-** ప్రవాహ మార్గమున కడ్డముగా నున్న పర్వతపు నిరోధముచే కలగుండు పెట్టబడిన నది వలె, పార్వతి పోవను లేదు. ఉండను లేదు అనుటచే ఉపమాలంకారమీ శ్లోకమున కలదు.

| | | |
|---|---|---|
| ఉపమానము | - | నది |
| ఉపమేయము | - | పార్వతి |
| సమాన ధర్మము | - | పోకుండుట, ఉండకుండుట |
| ఉపమా వాచకము | - | (ఇవ) వలె |

శివ దర్శనము చేత ఒడలు కంపించుట - బింబము, కొండ యొక్క ఎదుర్కొనుటచే సంభ్రాంతి నొందుట - ప్రతిబింబము సరసాంగయష్టిః - చెమట పట్టిన శరీరము కలది - శిష్టము. కనుక ఇందు అనుగామిత్వ - బింబ ప్రతిబింబ భావ - శ్లేషలకు మిశ్రణము గలదు.

ఈ శ్లోకమున - శివునకు సేవ చేయు కాలమున మన్మథ బాణ ప్రయోగమున దేవికి ఉదయించిన వ్రీడాహర్షాది సంచారి భావములను "వివృణ్వతీ శైలసుతాఽపి భావమ్....................తస్థౌ" (3 - 68) అనుదానిచే ప్రకటించి, అట్లే శివునకు కలిగిన సాత్త్విక వ్యభిచారి భావములను "హరస్తు కించిత్పరిలుప్త ధైర్యః........................ ఉమాముఖే బింబ ఫలాధరోష్ఠే వ్యాపారయామాస విలోచనాని" (3 - 69) అనుదానిచే ప్రకటించెను. పై భావములు మదన దహనముచే వ్యవహితములు కాగా, మరల సరియగు సమయమున

"అవ్యంజిత హర్ష లక్షణః" (5 - 62)

'వే పథుమతీ' , 'సరసాంగ యష్టిః' (5 - 85)

మున్నగు వానిచే సమున్మిషితములైనట్లు వ్యక్తీకరించి, ఇటు పై వర్ణింపబోవు పార్వతీ పరమేశ్వర సంభోగ శృంగారమును పరిపుష్టము గావించినాడు మహాకవి యని గ్రహింపవలెను.

**18. శ్లో॥** అద్య ప్రభృత్యవన తాంగి తవాస్మిదాసః
క్రీతస్తపోభి రితి వాదిని చంద్రమౌళౌ,
అహ్నాయ సా నియమజం క్లమముత్ససర్జ
క్లేశః ఫలేన హి పునర్నవతాం విధత్తే (5 - 86)

**ప్రతిపదార్థము :-**

| | | |
|---|---|---|
| చంద్రమౌళౌ | = | చంద్రశేఖరుడైన శివుడు |
| అవనతాంగి | = | కొంచెము వంగిన శరీరము గల సుందరీ! |
| అద్య ప్రభృతి | = | నేటి నుండి |
| తవ | = | నీ యొక్క |
| తపోభిః | = | తపస్సులచే |
| క్రీతః | = | కొనబడిన |
| దాసః | = | దాసుడను |

| | | |
|---|---|---|
| ఇతి | = | అని |
| వాదిని | = | చెప్పుచుండగా |
| సా | = | ఆ దేవి |
| అహ్నాయ | = | వెంటనే |
| నియమజం | = | తపోజన్యమైన |
| క్లమం | = | క్లేశమును |
| ఉత్ససర్జ | = | విడచెను (మరచెనని భావము) |
| హి | = | ఎందువల్లనైతే |
| క్లేశః | = | కష్టము |
| ఫలేన | = | ఫల సిద్ధిచే |
| పునః | = | తిరిగి |
| నవతాం | = | క్రొత్తదనమును (తొల్లింటి వలె క్లేశము లేకుండు స్థితిని) |
| విధత్తే | = | పొందించును |

**తాత్పర్యము :-** చంద్రశేఖరుడైన శివుడు "పార్వతీ! నేడు మొదలు నేను నీకు తపస్సులచే కొనబడిన దాసుడను" అని పలికినంతనే పార్వతి తపః కృతములైన కష్టములను వెంటనే మఱచిపోయెను. అది యుక్తమే. ఏలయన? ఫలించిన కష్టము నవత్వమును అనగా క్లేశా భావ రూపమగు స్థితిని కలిగించును కదా!

**విశేషాంశములు :-** శ్రమము ఫల ప్రాప్తిచే (శ్రమపడక ముందు ఉన్నట్లే) క్లేశ రాహిత్యమును కలిగించును గదా! అనగా శ్రమమునకు తగిన ఫలము లభించినప్పుడు అది శ్రమముగా తోపదని భావము. సామాన్యముచే విశేషమును సమర్థించిన అర్థాంతరన్యాసమీ శ్లోకమున కలదు.

దాసులు రెండు రకములుగా నుందురు. "వంశ క్రమాగతులు - క్రీతులు" అని. వీరిలో క్రీతులు ఎల్లప్పుడును కొన్నవారికి సన్నిహితులై యుండి, వారికి సేవలు చేయుచుందురు. శివుడు తపః క్రీతుడు గావున "సర్వదా పార్వతికి సన్నిహితుడనై సేవలు చేయుదు"నని చెప్పినాడు.

## సారాంశము :-

41 నుండి సర్గాంతము (86) వరకు గల శ్లోకములలో ముఖ్యమైన శ్లోకములకు ప్రతిపదార్థ తాత్పర్యములు, అలంకారాది విశేషములు వివరింపబడినవి.

**డా॥ గోగినేని యోగ ప్రభావతీ దేవి**
**ఎం.ఏ. (సంస్కృతం), ఎం.ఏ. (తెలుగు), ఎం.ఫిల్., పి.హెచ్.డి.**
**శాఖాధిపతి**
**తెలుగు & ఓరియంటల్ లాంగ్వేజస్**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**

# పాఠం - 4 కుమార సంభవమ్ - మహాకవి కాళిదాసు

# పంచమ సర్గ - సందర్భ సహిత వ్యాఖ్యలు

## సందర్భ సహిత వ్యాఖ్యలు :-

కావ్యంలోని కొన్ని వాక్యాలు సందర్భ వాక్యాలుగా వస్తాయి. ముందు కవి, కావ్యం, సర్గ ప్రసంగాలను ఉదాహరించాలి. ఆ తరువాత సందర్భ వాక్యాన్ని గురించి వివరించాలి. సందర్భ వాక్యం యొక్క ప్రతి పదార్థం తెలియజేయాలి. ఆ వాక్యం యొక్క సారాంశం వ్రాసి, విశేషార్థాన్ని వివరించాలి. ఛందస్సు, అలంకారాలను కూడా తెలియజేస్తే మంచిది.

## కుమార సంభవం పంచమ సర్గలో సందర్భ వాక్యాలిలా ఉన్నాయి :-

1. ప్రియేషు సౌభాగ్యఫలా హి చారుతా (శ్లో॥ 1)
2. అవాప్యతే వా కథ మన్యథా ద్వయం తథా విధం ప్రేమ పతిశ్చ తాదృశః (శ్లో॥ 2)
3. పదం సహేత భ్రమరస్య పేలవమ్, శిరీష పుష్పం న పునః పతత్రిణః (శ్లో॥ 4)
4. క ఈప్సితార్థ స్థిర నిశ్చయం మనః పయశ్చ నిమ్నాభిముఖం ప్రతీపయేత్ (శ్లో॥ 5)
5. ప్రజాసు పశ్చాత్ప్రథితం తదాఖ్యయా జగామ గౌరీ శిఖరం శిఖండి మత్ (శ్లో॥ 7)
6. న షట్పదశ్రేణిభిరేవ పంకజం సశైవలాసంగమపి ప్రకాశతే (శ్లో॥ 9)
7. గుహోఽపి యేషాం ప్రథమాప్త జన్మనాం న పుత్రవాత్సల్య మపాకరిష్యతి (శ్లో॥ 14)
8. న ధర్మవృద్ధేషు వయస్సమీక్ష్యతే (శ్లో॥ 16)
9. ధ్రువం వపుః కాంచన పద్మ నిర్మితం, మృదు ప్రకృత్యాచ ససారమేవచ (శ్లో॥ 19)
10. బభూవ తస్యాః కిల పారణావిధిః న వృక్ష వృత్తి వ్యతిరిక్త సాధనః (శ్లో॥ 22)
11. ప్రపేదిరే చిరేణ నాభిం ప్రథమోద బిందవః (శ్లో॥ 24)
12. మహా తపస్సాక్ష్య ఇవ స్థితాః క్షపాః (శ్లో॥ 25)
13. పురో వియుక్తే మిథునే కృపావతీ (శ్లో॥ 26)
14. వదన్త్య పర్ణేతిచ తాం పురా విదః (శ్లో॥ 28)
15. తపిస్వినాం దూర మధశ్చకార సా (శ్లో॥ 28)
16. శరీరబద్ధః ప్రథమాశ్రమో యథా (శ్లో॥ 30)
17. వపుర్విశేష్వతి గౌరవాః క్రియాః (శ్లో॥ 31)
18. ప్రచక్రమే వక్తు మనుజ్ఞతక్రమః (శ్లో॥ 32)
19. శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్ (శ్లో॥ 33)
20. తపిస్వి నామ ప్యుపదేశతాంగతమ్ (శ్లో॥ 36)
21. సంగతం మనీషిభి స్సాప్త పదీనముచ్యతే (శ్లో॥ 39)

22. న చేద్రహస్యం ప్రతి వక్తు మర్హసి (శ్లో॥ 40)
23. తఫః ఫలం స్యాత్ కిమతః పరం వద (శ్లో॥ 42)
24. కః కరం ప్రసారయేత్పన్నగ రత్న సూచయే? (శ్లో॥ 43)
25. విభావరీ యద్య రుణాయ కల్పతే (శ్లో॥ 44)
26. న రత్న మన్విష్యతి మృగ్యతే హి తత్ (శ్లో॥ 45)
27. భవిష్యతి ప్రార్థిత దుర్లభః కథమ్? (శ్లో॥ 46)
28. సచేతసః కస్య మనోన దూయతే? (శ్లో॥ 48)
29. వృషేవ సీతాం తదవ గ్రహక్షతామ్ (శ్లో॥ 61)
30. మనోరథానా మగతి ర్నవిద్యతే (శ్లో॥ 64)
31. మహాజనః స్మేరముఖో భవిష్యతి (శ్లో॥ 70)
32. తదస్తి కిం వ్యస్తమపి త్రిలోచనే (శ్లో॥ 72)
33. అపేక్ష్యతే సాధుజనేన వైదికీ
శ్మశాన శూల స్య న యూప సత్క్రియా (శ్లో॥ 73)
34. ద్విషంతి మందాః చరితం మహాత్మనామ్ (శ్లో॥ 75)
35. న సంతి యాథార్థ్యవిదః పినాకినః (శ్లో॥ 77)
36. కథం స లక్ష్య ప్రభవో భవిష్యతి? (శ్లో॥ 81)
37. న కామవృత్తి ర్వచనీయ మీక్షతే (శ్లో॥ 82)
38. న కేవలం యోమహత్యోపభాషతే ;
శృణోతి తస్మాదపి యః స పాపభాక్ (శ్లో॥ 83)
39. శైలాధిరాజ తనయా నయయౌనతస్థౌ (శ్లో॥ 85)
40. క్లేశః ఫలేనహి పునః నవతాం విధత్తే (శ్లో॥ 86)

## సందర్భ వాక్యాలు :-

**1. ప్రియేషు సౌభాగ్య ఫలా హి చారుతా**

ఈ వాక్యము కాళిదాస ప్రణీతమైన కుమార సంభవం పంచమసర్గ నుంచి గ్రహింపబడింది.

పార్వతి చూస్తూండగానే మన్మథుడు ముక్కంటి మూడవ కంటి అగ్నిచే దగ్ధం కాగా భగ్నమైన కోరిక కలదై తన రూపాన్ని నిందించుకుంది అనే సందర్భాన్ని సమర్థిస్తూ కవి చెప్పిన వాక్యమిది.

| | | |
|---|---|---|
| చారుతా | = | సౌందర్యము |
| ప్రియేషు | = | ప్రియుల విషయంలో |
| సౌభాగ్య ఫలాహి | = | పతి వాల్లభ్యమే ఫలముగా కలది కదా |

పతి ప్రేమ లభిస్తేనే అందం సార్థకమవుంది. పతి ప్రేమ లభించకపోతే ఫలమేమున్నది?

ఇక్కడ వంశస్థము ఛందము. వంశస్థ వృత్తంలో ప్రతి పాదానికి 12 అక్షరాలు ఉంటాయి. నాలుగు పాదాలు సమానంగా ఉంటాయి. ఒక్కొక్క పాదంలో నాలుగు గణాలుంటాయి. ఆ గణాలు వరుసగా జ గణం, త గణం, జ గణం, ర గణం.

| | | | |
|---|---|---|---|
| I S I | S S I | I S I | S I S |
| ప్రయేషు | సౌభాగ్య | ఫలాహి | చారుతా |
| జ | త | జ | ర |

కుమార సంభవమ్ - పంచమ సర్గలోని ఎక్కువ శ్లోకాలు వంశస్థ వృత్తంలోనే కనిపిస్తాయి.

2. **అవాప్యతే వా కథమన్యథా ద్వయం తథా విధం ప్రేమ పతిశ్చ తాదృశః**

ఈ వాక్యము కాళిదాసు కుమార సంభవములోని పంచ సర్గ నుండి గ్రహింపబడినది. పార్వతి తన సౌందర్యము చేత పరమ శివుని పొందలేక పోయినది. అందువల్ల ఆమె తపస్సు చేతనే పరమ శివుని పొంద నిశ్చయించుకున్నది. అనే సందర్భాన్ని సమర్థిస్తూ వ్రాసిన వాక్యమిది.

అన్యథా = పార్వతి శివుని పొందుటకు తపస్సు చేయకుండా

కథమ్ = ఎట్లు?

తథావిధం = అలాయుండే నిరతిశయమైన

ప్రేమ = ప్రేమయూ

తాదృశః = పరమ శివుని వలేయున్న

పతిశ్చ = పతియునూ

తద్వయం = ఈ రెండునూ

అవాప్యతే = పొందబడును

దుష్కరమైనట్టియు, పొందుటకు శక్యము కానట్టియు, దర్గమమయినట్టియు, తరుచుటకు శక్యము కాని అన్నియునూ, తపస్సు వలనే సాధ్యమగును. తపస్సు మాత్రము అతిక్రమంచుటకు శక్యము కానిది.

ఇక్కడ వంశస్థము ఛందము - అర్థాంతరన్యాసాలంకారము.

3. **పదం సహేత భ్రమరస్యపేలవం శిరీష పుష్పం నపునః పతత్రిణః ॥**

కుమార సంభవ మందలి పంచమ సర్గలోని వాక్యమిది.

శివుని పొందుటకు తపస్సు చేయడానికి కృత నిశ్చయురాలైన పార్వతిని వారిస్తూ మేనాదేవి పలికిన మాటలివి.

పార్వతీ! నీ శరీరము సుకుమారమయినది. తపస్సుకు తగినది కాదు. అని చెప్పుచూ దృష్టాంత పూర్వకంగా తెలియచేసినది.

పేలవం = మృదువయిన

శిరీష పుష్పం = దిరిసిన పూవు

భ్రమరస్య = తుమ్మెద యొక్క

పదము = పాదమును

సహేత = సహించును

పతత్రిణః = పక్షి యొక్క

పదం పునః = పదమునైతే

న సహేత = సహింపదు

ఇచట దృష్టాంతాలంకారము. వంశస్థము ఛందము.

4. **ఈప్సితార్థ స్థిర నిశ్చయం మనః పయశ్చ నిమ్నాభి ముఖం ప్రతీపయేత్**

ఈ వాక్యము కాళిదాసు రచించిన కుమార సంభవము పంచమ సర్గలోనిది. తల్లి మేనాదేవి ఎంత చెప్పిననూ కఠోరమైన తపస్సు చేతనే పరమ శివుని పొందగలను అని ధృఢ నిశ్చయురాలైన పార్వతిని సమర్థిస్తూ కాళిదాసు పలికిన వాక్యమిది.

కః = ఎవడు

ఈప్సితార్థ స్థిర నిశ్చయము = నచ్చిన పని చేయుటకు నిశ్చయించుకొన్న

మనః = మనస్సును

నిమ్నాభి ముఖం = పల్లమెరిగిన

పయశ్చ = నీటిని

ప్రతీపయేత్ = ఎవరు మారల్చగలరు?

పల్లమెరిగిన నీటిని, ఇష్టమయిన పనులందు తగుల్కొన్న మనస్సు వారింపనలవి కానివి కదా. ఇచట దీపకాలంకారముతో కూడిన అర్థాంతర న్యాసాలంకారము. వంశస్థము ఛందము.

5. **ప్రజాసు పశ్చాత్ప్రథితం తదాఖ్యయా జగామ గౌరీ శిఖరం శిఖండిమత్**

తండ్రి అయిన హిమవంతుని ఆజ్ఞతో తపస్సుతో శివుని పొందుటకు కృత నిశ్చయురాలై ఒక శిఖరమును ఆశ్రయించినది అని తెలుపుచూ కాళిదాసు కుమార సంభవం పంచమ సర్గంలో ఈ వాక్యాన్ని ఉదహరించాడు. పార్వతి తపస్సు చేసిన శిఖరమే గౌరీ శిఖరంగా ప్రసిద్ధి కెక్కింది.

గౌరీ = పార్వతి

పశ్చాత్ = ఆ పిమ్మట!

ప్రజాను = ప్రజలలో

తదాఖ్యయా = ఆమె పేరులో

ప్రథితం = ప్రసిద్ధికెక్కిన

శిఖరం = శిఖరమును

జగామ = వెళ్లెను

ఇచట వంశస్థము ఛందము. భావికాలంకారము.

**6. న షట్పదశ్రేణి భిరేవ పంకజం స శైవలా సంగమపి ప్రకాశతే**

తపస్సుకు సిద్ధమైన పార్వతిని వర్ణిస్తూ కాళిదాసు చెప్పిన వాక్యమిది.

అలంకరింపబడిన ముంగురుల చేత పార్వతి ముఖం ఎలా అందంగా యుందో అలాగే తపస్సుకు ఉపక్రమించినప్పటికీ ఆమె ముఖం అంతే అందంగా యుంది. అని చెబుతూ దృష్టాంతంగా ఈ వాక్యాన్ని కవి ఉదాహరించాడు.

| | | |
|---|---|---|
| పంకజం | = | పద్మము |
| షట్పద శ్రేణి భిరేవ | = | తుమ్మెద పంక్తుల చేతనే |
| న ప్రకాశతే | = | ప్రకాశింపదు |
| సశైవలా సంగమపి | = | నాచుతో కూడుకున్నప్పటికీ |
| ప్రకాశతే | = | ప్రకాశిస్తుంది |

అందం ఉండాలి గానీ, అలంకారాలున్నా లేకున్నా కూడా శోభిస్తుంది కదా అని కాళిదాసు అభిప్రాయం.

వంశస్థం ఛందస్సు, అర్థాంతరన్యాసాలంకారము.

**7. గుహ్యోపి యేషాం ప్రథమాప్త జన్మానాం న పుత్ర వాత్సల్య మపాకరిష్యతి**

పార్వతి తపమాచరించుటకు సంసిద్ధురాలై ముందు కొన్ని చెట్లను నాటి, స్వయముగా ఘటమనే పాలిండ్లలో స్వయంగా పెంచినది. అని చెబుతూ కాళిదాసు పార్వతి తపస్సును హర్షిస్తూ చెప్పిన మాటలివి.

| | | |
|---|---|---|
| గుహః | = | కుమార స్వామి |
| అపి | = | కూడా |
| ప్రథమాప్త జన్మనాం | = | ముందు పొందబడిన జన్మము కల |
| యేషాం | = | ఏ చెట్ల యొక్క |
| పుత్రవాత్సల్యమ్ | = | పుత్రప్రేమను |
| న అపా కరిష్యతి | = | దూరము చేయలేక పోయెడివాడో ఆ చెట్లను పెంచినది |

ఇచట కాళిదాసు ప్రకృతి సౌందర్యము నందలి ప్రేమను చూపించుచున్నాడు. కవి దృష్టిలో చెట్లను పెంచడం కూడా తపస్సే అని పార్వతి తపో విధానాన్ని వర్ణిస్తూ సూచిస్తున్నాడు. ఆ పార్వతి చెట్లను తన కుమారుని వలే పెంచినదట.

వంశస్థము ఛందము

**8. న ధర్మవృద్ధేషు వయస్స మీక్ష్యతే**

పార్వతి తపస్సు చేస్తోందని తెలుసుకుని ఎందరో మహాతపస్సంపన్నులు ఆమెను చూడాలని వచ్చారట. ఈ సందర్భాన్ని వివరిస్తూ కాళిదాసు ఈ వాక్యాన్ని ఉదాహరించాడు.

పార్వతి వయసులో చిన్నది కదా, ఆమెను చూడటానికి అంత వయో వృద్ధులు రావడమేమిటి? అని వివరిస్తూ ఈ వాక్యాన్ని చెబుతున్నాడు కాళిదాసు.

| | | |
|---|---|---|
| ధర్మ వృద్ధేషు | = | ధర్మము తెలియడం చేత తలపండిన వారి విషయంలో |
| వయః | = | వయస్సు |
| న సమీక్ష్యతే | = | ప్రమాణం కాదు |

ధర్మము చిన్న వారి నుంచయినా తెలుసుకోవచ్చు. అని ఈ వాక్యం అర్థము. తల పండినంత మాత్రాన పెద్దవారని చెప్పలేము. చదువుకున్న చిన్నవాడయినా వృద్ధుడనే చెప్పవచ్చును. అని ఈ వాక్యము అభిప్రాయము.

వంశస్థము ఛందము. అర్థాంతరన్యాసాలంకారము.

9. **ధ్రువం వపుః కాంచన పద్మ నిర్మితం మృదు ప్రకృత్యాచ ససారమేవచ**

పార్వతి ఎంత తపస్సు చేసినా శివుని అనుగ్రహం పొందక పోయినపుడు మరల కఠోరమైన తపస్సుని చేసింది. బంతి ఆడుతున్నప్పుడే కందిపోయే శరీరం గల ఆమె కఠోరమైన తపస్సు ఎలా చేయగలిగింది అనే సందేహాన్ని ఈ వాక్యం చేత దూరం చేస్తున్నాడు కవి.

ఆ పార్వతి యొక్క

| | | |
|---|---|---|
| వపుః | = | శరీరము |
| కాంచన పద్మ నిర్మితం | = | బంగారు తామర పూవులతో చేయబడినది అందువలననే |
| ప్రకృత్యా | = | స్వభావం చేత |
| మృదు | = | కోమలమయినది |
| ససారమేవచ | = | సారవంతమయినది కూడా |

ఉత్ప్రేక్షాలంకారము. కమలం ఎలా సుకుమారంగా యుంటుందో అలాగే ఆమె శరీరం కోమలమైంది. అలాగే ఎంతో ఘనిష్ఠమయినది కూడా.

ఇక్కడ వంశస్థము ఛందము.

10. **బభూవ తస్యాః కిల పారణా విధిః న వృక్షవృత్తి వ్యతిరిక్త సాధనః**

కఠోరమైన తపస్సు చేసే పార్వతి ఆకులను కూడా తినకపోవడం చేత "అపర్ణ" అనే పేరును పొందిన ఆమె ఎలా జీవనం చేస్తుంది అని వర్ణిస్తూ కాళిదాసు కుమార సంభవంలో పంచమ సర్గలో ఈ వ్యాక్యాన్ని చెబుతాడు.

| | | |
|---|---|---|
| తస్యాః | = | ఆ పార్వతి యొక్క |
| పారణావిధిః | = | భోజన నియమము |
| వృక్ష వృత్తి వ్యతిరిక్త సాధనః | = | చెట్ల యొక్క నియమాన్ని అతిక్రమించనదై (చెట్లకంటే మించని నియమము కలదై) |
| న బభూవ కిల | = | కాలేదట |

చెట్లు అయాచితంగా వచ్చిన వర్షపు బిందువులతోనూ, వెన్నెలతోనూ జీవిస్తాయి. అలాగే పార్వతి కూడా అయాచితంగా లభించే వాన నీటినే తాగుతూ యుండేది. వెన్నెల చల్లదనంలోనే సేద తీర్చుకుంటూ యుండేది.

వంశస్థము ఛందము

**11. ప్రపేదిరే చిరేణ నాభింప్రథమోద బిందవః**

ధారా వృష్టిలో తపస్సు చేస్తున్న పార్వతిని వర్ణిస్తూ కాళిదాసు ఈ మాటలను చెబుతున్నాడు.

పార్వతి పద్మాసనంలో కూర్చుని నాసాగ్ర దృష్టియై తపస్సు చేస్తున్న సమయంలో వాన తుంపరలు కొంత సేపు కనురెప్పల మీద, తరువాత పెదవుల మీద, తరువాత పాలిండ్ల మీద, వళులు (పొట్ట ముడతల మీద) మీద పడ్డం చేత చిన్నా భిన్నమైన బిందువులు మరల కలిసి ఏకమై తన నాభిలో చేరుకున్నాయి. అని చెబుతూ ఈ వాక్యాన్ని చెప్పాడు.

| | | |
|---|---|---|
| ప్రథమోదబిందవః | = | మొదటి నీటి బిందువులు |
| చిరేణ | = | చాలా కాలానికి |
| నాభిం | = | బొడ్డుని |
| ప్రపేదిరే | = | పొందినవి |

ఈ శ్లోకంలో కవి పార్వతి అంగవిన్యాసాన్ని అంగసాముద్రిక శాస్త్రం ప్రకారం వర్ణించాడు. నాభి లోతుగా యుండటం చేతనే ఆ నీటి బిందువులు ప్రవేశించాయి అని అర్థం.

ఈ వాక్యంలో (శ్లోకంలో) ప్రతి పదమూ సాభిప్రాయము. ఎంతో అర్థాన్ని స్తోంది కాబట్టి పరికరాలంకారము. వంశస్థము ఛందము.

**12. మహా తపస్సాక్ష్య ఇవ స్థితాః క్షపాః**

రాత్రులందు బండరాళ్లపై ధారావృష్టి పడుతున్నపుడు తపస్సు చేస్తున్న పార్వతి తపస్సును వర్ణిస్తూ కాళిదాసు అన్న వాక్యము.

| | | |
|---|---|---|
| క్షపాః | = | రాత్రులు |
| మహా తపస్సాక్ష్యే | = | గొప్ప తపమునకు సాక్ష్యమందు |
| ఇవ | = | వలే |
| స్థితాః | = | ఉన్నాయి |

ఇక్కడ కవి యిలా ఊహిస్తున్నాడు. వర్షాకాలపు రాత్రులందు మెరుపులు మెరుస్తున్నాయి. రాత్రులు ఒక్కొక్క మెరుపు అనే చూపులతో పార్వతి తపస్సును చూస్తున్నాయా అన్నట్లుగా ఉన్నాయి అని.

**విశేషార్థం** - ఏ పని చేస్తున్నా ఈ ప్రకృతి మనల్ని పరికిస్తూ ఉంటుంది. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, ఆకాశం, భూమి, మన హృదయం, యమధర్మరాజు, పగలు, రాత్రి, ప్రాతః కాలపు సంధ్య, మధ్యాహ్నపు సంధ్య, కాలం, ధర్మం ఇవన్నీ మనిషి చేసే ప్రతి పనికీ సాక్ష్యం అని ప్రమాణ సిద్ధం.

ఇక్కడ ఉత్ప్రేక్షాలంకారం. వంశస్థం ఛందస్సు.

**13. పురో వియుక్తే మిథునే కృపావతీ**

తపస్సుకు ముఖ్యం దుఃఖిస్తూ ఉండే వాళ్ల విషయంలో దయ కలిగి యుండటం. అదే గొప్పవారి మనుస్సులో ఉండే ధర్మ అని సూచిస్తూ పార్వతికి ఈ దయా గుణం ఉందని చెబుతూ ఈ వాక్యాన్ని చెబుతాడు కాళిదాసు కుమార సంభవము పంచమ సర్గలో.

పార్వతి

| | | |
|---|---|---|
| పురః | = | ముందు |
| వియుక్తే | = | వియోగం కల, |
| మిథునే | = | చక్రవాక జంట యందు |
| కృపావతీ | = | దయకలదై ఆయెను |

హేమంత రాత్రులందు చల్లటి నీరు గల తటాకములందు తపిస్తూ, రాత్రి కాలంలో పరస్పరం చూసుకోలేని చక్రవాక పక్షుల జంటలలోని ఒక పక్షితో మరొక పక్షిని చేరుస్తూ వాటి యందు ఎంతో దయా దృష్టిని కలిగియుండేది పార్వతి.

కేవలమూ, మనుష్యుల యందే కాక పశు పక్ష్యాదుల యందు కూడా గొప్పదయతో ఉండాలి అనే భావాన్ని ఇక్కడ కాళిదాసు తెలియచేస్తున్నాడు.

ఛందము వంశస్థము

**14. వదన్త్యపర్ణేతి చ తాం పురావిదః**

కాళిదాసు కుమార సంభవ కావ్యంలో పంచమ సర్గలో పార్వతి తపస్సు పరాకాష్టను వర్ణిస్తూ ఈ వాక్యాన్ని ఉదహరించాడు.

చెట్ల నుండి ఆకులు కోస్తే ఏమి బాధపడతాయో అని చెట్లు నుంచి రాలిన ఆకులనే భక్షిస్తూ తపస్సు చేసింది. కొంత కాలం అయిన తరువాత ఆ ఆకులను తినడాన్ని కూడా మానేసింది. అందుచేతనే పార్వతిని "అపర్ణా" అని పిలుస్తూ ఉంటారు.

| | | |
|---|---|---|
| తాం | = | ఆ పార్వతిని |
| పురావిదః | = | పురాణము తెలిసియున్న తపస్యులు |
| అపర్ణేతి | = | అపర్ణ అని |
| | | (తపస్సు చేసే సమయంలో పర్ణాలను ఆకులను భక్షించలేదు కాబట్టి) |
| వదంతి | = | చెబుతున్నారు |

వంశస్థము ఛందము

**15. తపస్వినాం దూరమధశ్చకార సా**

పార్వతి కఠోర తపస్సు మహా ఋషులు కూడా చేయలేరు అని చెబుతూ కాళిదాసు కుమార సంభవంలో ఐదవ సర్గలో ఈ వాక్యాన్ని రాస్తాడు.

| | | |
|---|---|---|
| సా | = | ఆ పార్వతి |
| తపస్వినాం | = | ఋషుల యొక్క |
| తపః | = | తపస్సును |
| దూరం | = | చాలా దూరంగా |
| అధశ్చకార | = | తిరస్కరించింది |

16. **శరీర బద్ధః ప్రథమాశ్రమో యథా**

పార్వతిని పరీక్ష చేయడం కోసం బ్రహ్మచారి వేషంలో వచ్చిన శివుణ్ణి వర్ణిస్తూ చెప్పిన మాటలివి.

ఈ వాక్యంలో ఛందస్సు - వంశస్థము. అలంకారం ఉపమాలంకారము. ఆ శివుని యొక్క బ్రహ్మచారి వేషం ఎలా ఉంది అని చక్కటి ఉపమాలంకారంలో వివరిస్తున్నాడు.

ఆ బ్రహ్మచారి

శరీరబద్ధః = శరీరాన్ని ధరించిన

ప్రథమాశ్రమః = బ్రహ్మచర్యాశ్రమం కలవాడు

యథా = వలే (ఉన్నాడు)

ఆశ్రమాలు నాలుగు బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అని అందులో బ్రహ్మచర్యం ప్రథమాశ్రమం. ఆ బ్రహ్మచారి బ్రహ్మతేజస్సుతో జింక చర్మాన్ని మోదుగ కఱ్ఱను ధరించి ఉన్నాడు. చూస్తే బ్రహ్మచర్యం మూర్తీ భవించినట్టున్నాడు.

17. **పపుర్విశే ష్వతిగౌరవాః క్రియాః**

పార్వతి తపస్సును పరీక్షించడానికి వచ్చిన బ్రహ్మచారికి ఆమె అనేక సపర్యలు చేసిందని తెలుపుతూ కవి పలికిన వాక్యమిది.

పపుర్విశేషేషు = వ్యక్తి విశేషములందు విభిన్నమైన వ్యక్తులందు

క్రియాః = అతిథి సత్కారాది సపర్యలు

అతిగౌరవాః = అత్యంతం ఆదరము కలదై

భవంతి = అగుచున్నవి

అతిథి సత్కారాల్లో ఆరితేరిన ఆ పార్వతి ఆ బ్రహ్మచారిని ఎంతో మానమర్యాదలతో ఆహ్వానించింది. సమానత యున్నప్పటికీ స్థిరమైన చిత్తము గల వ్యక్తి విశేషములందు ఎంతో గొప్ప గౌరవము కల్గును కదా.

18. **ప్రచక్రమే వక్తుమనుజ్ఝితక్రమః**

కాళిదాసు కుమార సంభవంలోని పంచమ సర్గలోని వాక్యమిది. శివుడు కపట బ్రహ్మచారి వేషంలో వచ్చి పార్వతితో మాట్లాడుతున్నప్పుడు కవి పలికిన వాక్యమిది.

అనుజ్ఝిత క్రమః = విడిచిపెట్టని క్రమము గల అనుస్యూతంగా మాట్లాడునట్టి స్వభావము గల ఆ బ్రహ్మచారి

వక్తుం = చెప్పుటకు

ప్రచక్రమే = పూనుకొనెను

మాటలాడుట ఒక కళ. ఆ కళ ఎన్నో వేల మందిలో ఏ ఒక్కరికో అలవడుతుంది. అది ఒక క్రమంలో యుండాలి. అందుకే కాళిదాసు బ్రహ్మచారి ఎలా మాట్లాడాడో అని తెలియజేస్తూ ఈ విశేషణంలో వాడాడు. ఉపక్రమం, ఉపసంహారం, అభ్యాసం, అపూర్వం అనే లక్షణాలు మాట్లాడటంలో చాలా అవసరం. ఈ విషయాన్నే అనుజ్ఝతక్రమః అనే పదంతో తెలియచేసాడు.

**19. శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్**

కాళిదాసు కుమార సంభవం పంచమ సర్గలోని వాక్యమిది. కపట బ్రహ్మచారి పార్వతుల మధ్య జరిగిన సంవాద ప్రసంగంలో ఈ వాక్యం ఉంది.

తపస్సుతో శరీరాన్ని తపింప చేసినచో ధర్మాన్ని ఆచరించడం కష్టమని తెలియచేస్తూ కపట బ్రహ్మచారి పార్వతిని హెచ్చరిస్తూ చెప్పిన వాక్యం.

| | | |
|---|---|---|
| శరీరమ్ | = | శరీరము |
| ఆద్యం | = | మొట్టమొదటి |
| ధర్మ సాధనం ఖలు | = | ధర్మానికి సాధనము కదా |

తపమాచరించుటలో, జపాదులకు, ఉపవాసాది తీర్థ యాత్రలను చేయుటలో శరీరము ప్రధానము. అందుకు శరీరాన్ని రక్షించుకోవాలి. ధర్మము వాక్కు చేతను, శరీరము చేతను, బుద్ధి చేతను, ధనాదుల చేతను, ఆచరించబడుతుంది. వాటిలో శరీరమే ముఖ్య సాధనము కదా.

**20. తపస్వినా మప్యుపదేశతాం గతమ్**

కాళిదాస ప్రణీతమైన కుమార సంభవ కావ్యంలో పంచమ సర్గలో పార్వతిని కపట బ్రహ్మచారి రూపంలో శివుడు ప్రశ్నిస్తూ చెప్పిన వాక్యమిది. ఓ పార్వతి! నీ పూర్వ జన్మ కృతమైన పాపాన్ని నివారించడానికి తపస్సు చేయనక్కర్లేదు. నీ రూపమే నీవు పుణ్య శీలవు అని చెబుతోంది కదా. అని పలికే సందర్భంలో బ్రహ్మచారి యిలా అంటున్నాడు.

హే పార్వతి, తే శీలం

| | | |
|---|---|---|
| తపస్వినామపి | = | తపమాచరించే వారికి కూడా |
| ఉపదేశతామ్ | = | ఉపదేశించటను |
| గతమ్ | = | పొందినది. |

"యత్రాకృతిః తత్ర గుణాః" అని నానుడి. రూపమున్న చోట గుణాలుంటాయి. మంచి అందమైన వారు పాపాన్ని ఆచరించరు. అందుచేత ఓ పార్వతి! నీ రూపమే పుణ్యశీలవని ఋజువు చేస్తోంది. అందుకోసమే మునులు కూడా నిన్ను చూసి తమ నడవడికను నేర్చుకుంటారు.

**21. సంగతం మనీషి భిస్సాప్త పదీన ముచ్యతే**

కుమార సంభవం 5వ సర్గలో కాళిదాసు పార్వతీ బ్రహ్మచారి సంవాద ప్రసంగంలో కుమార సంభవంలో బ్రహ్మచారి మాటల ప్రసంగంలో స్నేహాన్ని గురించి తెలుపుతూ ఈ వాక్యాన్ని తెలుపుతాడు.

బ్రహ్మచారి వేషంలో శివుడు వచ్చి ప్రప్రథమంగా కుశల ప్రశ్నలను వేస్తాడు. పార్వతి వాటికి సమాధానం చెప్పలేదు. కానీ ఇంతసేపూ మాటల సందర్భంతో మన స్నేహం బలపడింది అని తెలియజేస్తూ ఇలా అంటాడు -

నాకు యిచ్చిన అతిథి సత్కారాలతో నేను పరాయి వాణ్ణి కాను అని తెలిసింది కదా. ఇంకా ఇంత సేపటి నుంచి మాట్లాడుకుంటున్నాము కదా అందుచేత మన స్నేహం బలపడింది. అని చెప్పడానికి సమర్థిస్తూ ఈ సంప్రదాయిమాన్యత గల వాక్యాన్ని చెబుతున్నాడు.

సంగతం మనీషిభిః సాప్త పదీనముచ్యతే

సత్పురుషుల యొక్క

| | | |
|---|---|---|
| సంగతం | = | మైత్రి |
| సాప్త పదీనం | = | ఏడడుగుల సంబంధం గాను, ఏడు మాటల సంబంధం గాను |
| మనీషిభిః | = | పెద్దల చేత |
| ఉచ్యతే | = | చెప్పబడుతుంది |

"సాప్తపదీనం సఖ్యం" అని నానుడి. మైత్రి ఏడడగులలో కలుస్తుంది. ఏడు మాటలతో బలపడుతుంది. సప్త పదోచ్చారణ సాధ్యం సఖ్యం అని కదా పెద్దలన్నారు.

ఇక్కడ వంశస్థము ఛందము. అర్థాంతరన్యాసం అలంకారం.

**22. న చేద్రహస్యం ప్రతివక్తు మర్హసి**

కాళిదాసుని కుమార సంభవంలో పార్వతినుద్దేశించి బ్రహ్మచారి పలికిన మాటలలోనిదీ వాక్యము. ఓ పార్వతీ! నీవు తపస్సు చేస్తున్నావు కదా. దీనికి ప్రధానమైన ఉద్దేశ్యం ఏమిటి అని ప్రశ్నించే సందర్భంలోనిది.

నేను ఇంతవరకూ మాట్లాడాను ఎంతో ఓపికగా నీవు విన్నావు. బ్రహ్మచారి స్వభావంతో చనువుగా మాట్లాడుతున్నాను. అంటూ బ్రహ్మచారి యిలా అంటాడు.

| | | |
|---|---|---|
| రహస్యం | = | రహస్యము |
| న చేత్ | = | కాకపోయినట్లయితే |
| ప్రతివక్తుం | = | సమాధానము చెప్పుటకు |
| అర్హసి | = | తగినదానవు |

బ్రహ్మచారి పార్వతితో యిలా అంటున్నాడు. ఇంతవరకూ మనం మాట్లాడుకున్నాము. ఏడు అడుగులు వేసినా, ఏడు మాటలు మాట్లాడినా సఖ్యం కుదురుతుంది. ఆ సఖ్యంతోనే నిన్ను తపస్సు యొక్క ఉద్దేశ్యాన్ని గురించి అడుగుతున్నాను. రహస్యం కాకపోయినట్లయితే చెప్పు.

**23. తపః ఫలం స్యాత్కిమతః పరం వద**

బ్రహ్మచారి అడిగిన ప్రశ్నల సందర్భంలో కవి నిబద్ధవక్తయైన ఆ బ్రహ్మచారి ద్వారా అడిగించిన ప్రశ్నయిది.

ఓ పార్వతీ! నీవు మంచి కులంలో పుట్టావు. ప్రజాపతి వంశజుడు కదా నీ తండ్రి, నీ శరీరం ముల్లోకాలలో సౌందర్యవంతం గదా, నీ ఐశ్వర్య సుఖం అన్వేషించదగినది కాదు, నీ వయస్సా నిత్య నూతనమైనది. నీవు దేని గురించి తపస్సు చేస్తున్నావు చెప్పు?

| | | |
|---|---|---|
| తపః ఫలమే | = | తపస్సు యొక్క ప్రయోజనం |
| అతః | = | ఇంతకంటే |
| పరం | = | ప్రకృష్టమైనది |

కింస్యాత్ = ఏమి కాగలదు?

వద = చెప్పుము

మంచి కులములో పుట్టటానికో, అందమైన శరీరం కోసమో, అనితరమైన ఐశ్వర్యం కోసమో, చక్కటి యౌవనం కోసమో చేస్తారు. ఇంతకన్నా అధికమైన ఫలమేమైనా ఉన్నదా చెప్పు. అని బ్రహ్మచారి పార్వతిని అడిగిన మాటలు.

**24. కః కరం ప్రసార యేత్పన్నగ రత్న సూచయే**

కుమార సంభవంలో ఐదవ సర్గలో పార్వతి తపస్సు గురించి అడిగిన సందర్భంలో బ్రహ్మచారి ఈ వాక్యాన్ని ఉదహరిస్తాడు.

తపస్సు చేయడానికి కారణాలు ఏదైన పొందని భాగ్యాలని అనుభవించాలనే కోరికా, లేక గొప్ప అవమానమా? పార్వతికి అన్ని భాగ్యాలు పుట్టింటనే ఉన్నాయి. మరో భాగ్యం కోసం తపస్సు చేయనక్కరలేదు. పోనీ, గొప్ప అవమానం సంభవించిందని అందామా అంటే తండ్రి యింట్లో పార్వతికి అవమానమేమిటి? ఇతరుల నుంచి అవమానం కలుగుతుందని అంటే అది అసలే లేదు. అని చెబుతూ బ్రహ్మచారి యీ మాటను చెబుతాడు.

పన్నగ రత్న సూచయే = పాము మీద యుండే రత్న శలాకను గ్రహించుటకు

కః = ఎవడు,

కరమ్ = చేయిని

ప్రసారయేత్ = చాపగలడు?

వంశస్థం వృత్తమ్

**25. విభావరీ యద్య రుణాయ కల్పతే**

కుమార సంభవంలో పంచమ సర్గలో బ్రహ్మచారి పార్వతిని అడిగిన ప్రశ్నల సందర్భంలోనిదీ వాక్యము.

ఓ పార్వతీ! నీవు ఈ యౌవనంలో ఆభరణాలను విడిచి, వల్కలాలను ధరించడం సబబుగా యున్నదా? సాయం ప్రదోష సమయంలో నక్షత్రాలు శోభిస్తాయి కాని, అరుణోదయం శోభిస్తుందా? అని చెబుతూ ఈ వాక్యాన్ని ఉదహరిస్తాడు.

విభావరీ = రాత్రి

అరుణాయ = అరుణుని కొరకు

కల్పతేయది = శోభించునో

నీవు ఈ యౌవన సమయంలో అందమైన ఆభరణాలు ధరించాలి. ఈ నార చీరలు ధరించకూడదు. ప్రదోష సమయంలో అరుణోదయం శోభిస్తుందా? అని దృష్టాంతాన్ని చూపిస్తున్నాడు.

వంశస్థం - వృత్తం - దృష్టాంతం అలంకారం

**26. న రత్నమన్విష్యతి మృగ్యతే హి తత్!**

బ్రహ్మచారి పార్వతి తపః ప్రయోజనాన్ని గురించి అడుగుతూ తపస్సు వృథా అని చెబుతున్నపుడు అన్న మాటలివి.

ఓ పార్వతీ! స్వర్గాన్ని గురించి తపస్సు చేసేటట్లయితే శ్రమ వృథాయే. ఎందుచేతనంటే నీ తండ్రి ప్రదేశాలన్నీ దేవ భూములే కదా! పతిని గురించి చేస్తున్నావా అంటే అది వృథాయే అని చెబుతూ సమర్థనం కోసం ఈ వాక్యాన్ని పలుకుతాడు.

రత్నం = మణి

కమపి = ఎవరినీ

న అన్విష్యతి = అన్వేషించదు

తత్ = అది

మృగ్యతేహి = అన్వేషింపబడును గదా!

వరుడు నిన్ను అన్వేషించాలి గానీ, నీవు వరుణ్ణి అన్వేషించడం సముచితమా? వరుడు నీ కోసం తపస్సు చేయాలి గాని, నీవు వరుడు గురించి తపస్సు చేయన్కర లేదు. తగునా? అని ఈ వాక్యం అర్థం. వంశస్థం, వృత్తం - అర్థాంతరన్యాసం అలంకారం.

**27. భవిష్యతి ప్రార్థిత దుర్లభః కథమ్?**

కుమార సంభవం పంచమ సర్గలో శివ పార్వతీ సంవాదంలోని వాక్యమిది. పార్వతిని తపస్సు ఎందుకు చేస్తున్నావు. అని అనేక విధాలుగా ప్రశ్నించినప్పటికి సమాధానం చెప్పలేదు. పతిని గురించి తపం చేస్తున్నావా? అని అడిగినపుడు పార్వతి యొక్క వేడి నిట్టూర్పులను చూసి తను అడిగిన ప్రశ్నలకు ప్రత్యుత్తరం తెలపకపోవటం చేత స్వయంగా ఆశంకించి అన్న మాటలివి.

పార్వతీ! నీవు ప్రార్థించదగిన వాడు నాకు కనిపించడం లేదు. నీవు ప్రార్థించినప్పటికీ, దుర్లభుడు ఎలా యుంటాడో అని ఈ సందేహం తెలియనే లేదు.

తే = నీకు

ప్రార్థిత దుర్లభః = ప్రార్థించినా పొందుటకు శక్యమునే గాదు

కథమ్ = ఎట్లు

భవిష్యతి = కాగలడు. లేనేలేదు అని అర్థము

నీవు కోరినచో సరయిన పతి దొరకకపోవునా అని అడుగుతున్నాడు

**28. సచేతసః కస్యమనో నదూయతే**

బ్రహ్మచారి పార్వతి తపస్సును చూసి తపమాచరించుట తగదని చెబుతూ చెప్పిన మాటలివి.

ముని వ్రతాలు చేతను, కృచ్ఛచాంద్రాయణాదుల చేతను, అత్యంత తపించినట్టియు, మండుటెండలో తప మాచరిస్తున్న ఆ పార్వతిని చూసి ఎవరి మనస్సు పరితపించదు? అని చెబుతూ అన్న మాటలివి.

స చేతసః = హృదయ ఉన్న

కస్య = ఎవని యొక్క

మనః = మనస్సు

న దూయతే = పరితపించదు?

ఎండ యున్నప్పుడు చంద్రుని రేఖ ఎలా అయితే మ్లానంగా కనిపిస్తుందో అలాగా పార్వతి కూడా కనిపిస్తోంది. అందుచేత ఈ రెంటినీ చూసి హృదయం ఉన్న ప్రతివాడి మనస్సు పరితపిస్తుంది అని దీని భావం.

వంశస్థం వృత్తం. అర్థాంతరన్యాసం అలంకారం

**29. వృషేవ సీతాం తదవ గ్రహ క్షతామ్**

బ్రహ్మచారి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతున్న పార్వతి సఖురాలు అన్న మాటలివి. ప్రార్థించినప్పటికీ అనుగ్రహాన్ని ప్రసాదించని ఆ మహాదేవుడు ఎపుడు అనుగ్రహిస్తాడో కదా అని చెబుతూ ఉపమానాన్ని చూపిస్తుందీ వాక్యంలో.

వృషా = ఇంద్రుడు వలే

తదవ గ్రహక్షతామ = అనావృష్టి చేత ఎండిన

సీతామివ = దున్నిన భూమిని వలే

ఆ మహాదేవుడు ఎపుడు మా సఖురాలిని అనుగ్రహిస్తాడో కదా? అని చెబుతూ ఈ వాక్యాన్ని పలుకుతుంది పార్వతి సఖి. అనావృష్టి చేత ఎండిన దున్ని యున్న భూమి ఇంద్రుడు వర్షించటం చేత ఎలా సస్య శ్యామలం అవుతుందో అలాగే తపస్సుచే కృశించి మా పార్వతి ఎపుడు మహాదేవుని అనుగ్రహంతో మరల సస్య శ్యామలం అవుతుందో కదా, అని ఈ వాక్యం అర్థం.

ఇక్కడ ఉపమాలంకారం

ఉపమేయం - పార్వతి, శంకరుడు

ఉపమానం - దున్నిన భూమి, ఇంద్రుడు

సమాన ధర్మం - ఈతి బాధలతో ఎండుట, తపస్సు చేత కృశించడం సమాన ధర్మాలు

ఛందస్సు - వంశస్థం

**30. మనోరథానామగతిర్న విద్యతే**

చెలి ద్వారా పార్వతి తపస్సు ఈశ్వరుని పతిగా పొందడం కోసం చేస్తోందని తెలుసుకున్న బ్రహ్మచారి పార్వతిని సూటిగా ప్రశ్నించినపుడు బ్రహ్మచారికి సమాధానంగా పార్వతి పల్కిన వాక్యమిది.

ఓ బ్రహ్మచారీ! నీవు విన్న మాట నిజమే. నా మనస్సు ఉన్నతమైన కోరికతో యుంది. దానికి తపస్సే కదా మూలం. మనోరథానికి అంతమేమి అని సమర్థిస్తూ అన్న వాక్యం.

మనోరథానాం = కోరికలకు

అగతిః = అడ్డువేయకపోవటం

నవిద్యతే = లేదు కదా

నా తపస్సు ఎక్కడ? ఆ పరమేశ్వరుడు ఎక్కడ? ఆ పరమేశ్వరుని పతిగా పొందాలని అనుకోవడం కూడా తగినది కాదు. అయితే శివుని పతిగా పొంగాలనుకోవటం మానుకో అనుకుంటే కోరికలకు అంతేముంది? దురాశ నన్ను విడిచి పెట్టడం లేదని పార్వతి బ్రహ్మచారికి చెప్పింది.

ఇక్కడ అర్థాంతరన్యాసం, వంశస్థం ఛందము.

**31. మహాజనః స్మేరముఖో భవిష్యతి**

పార్వతి శివుని వివాహం చేసుకోవడానికి తపస్సు చేస్తోందని తెలుసుకున్న బ్రహ్మచారి శివ పార్వతుల వివాహమయినట్లయితే పొంతన కుదురుతుందా? అని ప్రశిస్తూ బ్రహ్మచారి అన్న మాటలివి.

ఓ పార్వతీ! నీవు శివుని వివాహమాడనట్లయితే నీ తండ్రి నిన్ను ఏనుగుల మీద ఊరేగిస్తాడు. వివాహమయిన తరువాత నీవు ఆ ముసలి ఎద్దు అయిన నంది మీద ఊరేగితే ఎవరైనా హర్షిస్తారా? నవ్వుతారు కూడా అని చెబుతూ యిలా అంటాడు.

| | | |
|---|---|---|
| మహాజనః | = | మంచివాడు |
| స్మేరముఖః | = | నవ్విన వాడుగా |
| భవిష్యతి | = | కాగలడు |

వంశస్థము ఛందము. అర్థాంతరన్యాసము అలంకారం.

**32. తదస్తి కిం వ్యస్తమపి త్రిలోచనే**

పార్వతి ఈశ్వరుని వివాహమాడుతుందని తెలిసుకున్న బ్రహ్మచారి వరుని లక్షణాలను వివరిస్తూ చెప్పిన వాక్యమిది. వివాహ సంబంధం విషయంలో కన్య వరుని యొక్క రూపాన్ని కోరుకుంటుది. కన్య తల్లి వరుని ధనాన్ని చూస్తుంది. తండ్రి వంశ మర్యాదలను చూస్తాడు. బాంధవులు కులాన్ని చూస్తారు. ఇతరులు మృష్టాన్నాన్ని ఆశిస్తారు. శివుడి విషయంలో అతని అందం విరూపం కాదా, శివుని వంశ మర్యాదలు ఎవరికైనా తెలుసునా? దిగంబరుడు అవడం చేత అతని భాగ్యం అందరికీ తెలుసు. పై లక్షణాలలో ఏ ఒక్క లక్షణము అయినా శివునిలో ఉన్నదా? నీవే ఆలోచించుకో అని చెబుతున్నాడు బ్రహ్మచారి.

| | | |
|---|---|---|
| త్రిలోచనే | = | ఆ శివుని యందు |
| వ్యస్తమపి | = | ఏ ఒక్కడైనా |
| తత్ | = | అది (ఆ వరునికి ఉండవలసిన లక్షణం) |
| ఆస్తికిమ్? | = | ఉన్నదా? నీవే ఆలోచించుకో |

ఇక్కడ వంశస్థము ఛందము

**33. అపేక్ష్యతే సాధుజనేన వైదికీ శ్మశాన శూలస్య న యూపసత్క్రియా**

కపట బ్రహ్మచారి పార్వతి శివుని వివాహం చేసుకుంటుందని అందుకే తపస్సు చేస్తుందని తెలుసుకున్న వెంటనే ఆమెను వారిస్తూ చెప్పిన వాక్యం ఇది. సర్వాంగ సుందరివైన నీవు ఎక్కడ? అందవికారియైన ఆ శివుడెక్కడ? మీ ఇద్దరికీ వివాహం తగునా?

బుద్ధిమంతుడు పరస్పర విరుద్ధమైన వస్తువులను ఒక చోట చూడగలడా? అని చెబుతూ కాళిదాసు అన్న మాటలివి.

| | | |
|---|---|---|
| సాధుజనేన | = | ఉత్తముని చేత |
| శ్మశాన శూలస్య | = | శ్మశాన మందు తవ్విన వధ్య శంకువుకు (సూది వాడైన కర్రకు) |
| వైదికీ | = | వేద విహితమైన |

యాపస(త్క్రి)యా = యూప స్తంభానికి చేసే పూజ

నాపేక్ష్యతే = కోరబడదు

యజ్ఞంలో పశువుని బంధించే స్తంభాన్ని యూప స్తంభం అంటారు. యూపస్తంభానికి పవిత్రమైన కర్రను వాడతారు. అది దొరకలేదని స్మశానంలో వధ్య స్తంభాన్ని తీసుకొచ్చి యూపస్తంభంగా వాడరు కదా! అలాగే నీవు పవిత్రమైన దానవు. మంగళ ప్రదురాలవు. నీవు ఆ శ్మశానంలో తిరిగే శివుడి పెండ్లి చేసుకోవడం తగునా? అని బ్రహ్మచారి పార్వతిని గురించి అన్న మాటలివి.

ఇక్కడ వంశస్థము ఛందము, అర్థాంతరన్యాసము అలంకారం.

**34. ద్విషంతి మందాః చరితం మహాత్మనామ్**

శివుని పార్వతి వివాహమాడుతుందని తెలిసిన బ్రహ్మచారి శివుడు వరునిగా పనికిరాడని నిందించినపుడు పార్వతి పలికిన వాక్యమిది.

గొప్పవారి చరితలు చాలా లోతుగా యుంటాయి. ఆ చరిత్రం ఎవరికీ తెలియదు. తెలియని మంద బుద్ధులు గొప్పవారిని ద్వేషిస్తూ ఉంటారు.

మందాః = అధములు

మహాత్మనామ్ = గొప్పవారి యొక్క

చరితం = చరిత్రమును

ద్విషంతి = ద్వేషిస్తున్నారు

మహాత్ముల చరిత్రం తెలుసుకొనుటకు శక్యము కానివి. అవి ఎంతో అలోక సామాన్యంగా ఉంటాయి. ఆ చరిత్రలను ఎవరూ తెలుసుకోలేరు. అందుకోసం మందమతులు వారి చరిత్రకారులు తెలుసుకోలేక వారిని నిందిస్తూ ఉంటారు. అందుకే ఓ బ్రహ్మచారీ, నీకు శివుని గురించి యిలా మాట్లాడుచున్నావు అని పార్వతి అభిప్రాయం.

**35. న సంతి యాథార్థ్య విదః పినాకినః**

పార్వతి బ్రహ్మచారి చేసిన శివ నిందను భరించలేక అతనిని ఎదుర్కొంటూ చెప్పిన వాక్యమిది.

శివుడు దరిద్రుడయినప్పటికీ, సంపదలకు స్థానము, శ్మశాన వాసి యైనప్పటికీ త్రిలోకనాథుడే. భయంకర రూపుడైనా శివుడు అనే చెప్పబడుతున్నాడు. కానీ శివుని యొక్క నిజ స్వరూపాన్ని తెలిసిన వారెవరైనా ఉన్నారా?

పినాకినః = పినాకాన్ని ధరించిన శివునికి

యథార్థ్య విదః = యథార్థతను తెలిసిన వారు

నసంతి = లేనే లేరు

వంశస్థం వృత్తం

**36. కథం సలక్ష్య ప్రభవో భవిష్యతి**

శివుని జన్మ ఎపుడో అని ఎవరికి తెలుసు? అనే ప్రశ్నకి సమాధానం చెబుతూ పార్వతి బ్రహ్మచారితో అన్నమాటలివి.

ఓ బ్రహ్మచారీ! నీవు శివుని నిందిస్తూ నిజాన్నే చెప్పావు. అనంత విశ్వానికి కారణమైన ఆ శివుని జన్మ ఎవరికి తెలుస్తుంది. ఆది అంతం తెలియని భగవంతుని జన్మ ఎలా తెలుస్తుంది? బ్రహ్మకి కూడా కారణమైన వాడు కావడం చేత అతని పుట్టుక ఎవరికీ తెలియదు.

| | | |
|---|---|---|
| సః | = | ఆ శివుడు |
| లక్ష్య ప్రభవః | = | తెలియదగిన పుట్టుక గలవాడై |
| కథం | = | ఎట్లు |
| భవిష్యతి | = | కాగలడు? |

**37. న కామ వృత్తి ర్వచనీయ మీక్షతే**

కాళిదాసు కుమార సంభవంలో పంచమ సర్గలో శివుడు వరుడుగా నీకు తగడు అని బ్రహ్మచారి చెప్పిన వెంటనే పార్వతి బ్రహ్మచారితో శివుని గురించి చెప్పిన వాక్యాలలోనిదీ సందర్భం.

నేను శివుని గుణాలను గురించి ఎంత చెప్పినా నీవు వివాదానికి తలపడతావు. నీవు చెప్పినట్టే శివునిలో అకించనత్వాది గుణాలుండవచ్చు. కానీ నా మనస్సు అతని పైనే లగ్నమయింది. స్వేచ్ఛాచారి అయినవారు తగని వానితో స్నేహం కుదిరిందనే లోకాపవాదానికి భయపడరు.

| | | |
|---|---|---|
| కామవృత్తిః | = | స్వేచ్ఛాచారి అయిన వాడు |
| వచనీయం | = | లోకాపవాద నిందను |
| న ఈక్షతే | = | చూడడు |

స్వేచ్ఛాచారి అయిన వానికి నిందతో పని లేదు

శివుని వివాహమాడాలనే పార్వతి కోరికకు ఇతరులతో పనిలేదు.

**38. న కేవలం యోమహత్యోపభాషతే శృణోతి తస్మాదపి యస్స పాపభాక్**

కాళిదాసు రచించిన కుమార సంభవం పంచమ సర్గలోని వాక్యమిది.

పార్వతి తపస్సు చేస్తున్నప్పుడు (ఆమెను) పరీక్షించడానికి వచ్చిన కపట బ్రహ్మచారి కుశల ప్రశ్నలను అడిగి పార్వతి శివుని వరునిగా పొందటానికి తపస్సు చేస్తోందని తెలుసుకున్నాడు. శివుడు తగిన వరుడు కాడని వాదించాడు. శివునిలో ఉన్న దోషాలను విమర్శించాడు. పార్వతి ఆ దోషాలన్నింటినీ గుణాలుగా నిరూపించింది. కానీ బ్రహ్మచారి ఏదో చెప్పబోయాడు. ఆ సందర్భంలో పార్వతి సఖితో యిలా చెబుతుంది.

ఇతనేదో చెబుదామనుకుంటున్నాడు. నివారించు అని సఖితో చెప్పి, అతనిని వెళ్లమనడం ఎందుకు? మనమే బయటకు వెడదామని చెబుతూ అన్న మాటలివి.

శివుడు పూజ్యుడు. శివుని నిందించటం దోషం. అది కేవలం నిందించిన వానికే కాదు, విన్న వాడికి కూడా ఆ దోషం తగులుతుంది. అందుకే ఆ నిందించిన వారికి దూరంగా ఉండాలి.

| | | |
|---|---|---|
| యః | = | ఎవడు |
| మహతః | = | పూజనీయులైన పెద్దలను |
| అపభాషతే | = | నిందిస్తాడో |
| సః న కేవలమ్ | = | వాడు మాత్రమే కాక |
| పాపభాక్ | = | పాపము పొందిన వారు |
| భవతి | = | అవుతాడు |
| తస్మాత్ | = | అతని నుండి (ఆ నిందించిన వాని నుండి) |
| యః | = | ఎవడు |
| శృణోతి | = | వింటాడో |
| సః | = | అతడు కూడా |
| పాపభాక్ | = | పాపము పొందిన వాడు |
| భవతి | = | అగుచున్నాడు |

పెద్దలను నిందించిన వాడే కాక, పెద్దల నిందను వినే కూడా పాపాత్ముడుగా పరిగణింపబడతాడు.

గురువుల యొక్క, పెద్దల యొక్క, దేవతల యొక్క నిందలను ఎప్పుడూ వినకూడదు. ఆ సమయంలో చెవులను మూసుకోవాలి లేదా అక్కడ నుండి తప్పుకోవాలి అని దీని భావం.

**39. శైలాధిరాజ తనయా న యయౌ నతస్థౌ**

పార్వతి, బ్రహ్మచారి శివునిలోని దోషాలను చూపించినపుడు శివ నిందను వినలేక అక్కడ నుండి తప్పుకుని వెడదామని వెను తిరిగింది. ఇంతలో ఆ శంకరుడు నిజ రూపంలో ప్రత్యక్షమయ్యాడు. ఆ పరిస్థితిలో పార్వతిని వర్ణిస్తూ కవి పలికిన వాక్యమిది.

| | | |
|---|---|---|
| శైలాధి రాజ తనయా | = | పర్వతరాజైన హిమవంతుని కుమార్తె |
| నయయౌ | = | వెళ్లనూ లేదు |
| నతస్థౌ | = | నిలబడనూ లేదు |

ఇచట ఉపమాలంకారము. వసంత తిలక ఛందము

ఈ వాక్యంలో ఉపమాలంకారము లేదు, కాని శ్లోకంలో పార్వతిని ఒక నదిలా పోలుస్తాడు. మార్గంలో అడ్డు తగిలిన పర్వతం చేత వ్యాకులమైన నదిలా ఉంది పార్వతి. పర్వతాన్ని ఢీకొన్న నది ముందుకు పోదు, వెనుకకు రాదు. అలా ఉంది పార్వతి అని కాళిదాసు రమణీయమైన ఉపమాలంకార విన్యాసాన్ని చేకూర్చాడు.

**40. క్లేశః ఫలేన హి పునర్నవతాం విధత్తే**

కాళిదాసుని కుమార సంభవంలోని పంచమ సర్గలో అంతిమ శ్లోకంలోని పాదం ఇది. శివుని గురించి తపస్సు చేసి అతనిని పొందిన ఆ పార్వతి తపః క్లేశాన్ని మరచిపోయిందని అనే అంశాన్ని సమర్థిస్తూ కాళిదాసు పలికిన వాక్యమిది.

| | | |
|---|---|---|
| క్లేశః | = | కష్టము |
| ఫలేన | = | ఫలవంతమైన సిద్ధిచేత |
| పునః | = | మరల |
| నవతామ్ | = | కొత్తదనాన్ని |
| విధత్తే హి | = | సంతరించుకుంటుంది కదా! |

"కష్టేఫలీ" అని నానుడి. కష్టపడినా ఫలితం దక్కనట్టయితే ఆ కష్టాన్ని మరచిపోతారని దీని ఆశయం. సఫలమైన కష్టము కష్టము కాదని అర్థం. ఇక్కడ వసంత తిలకం ఛందస్సు. అర్థాంతరన్యాసం అలంకారం.

**డా॥ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి**
**సాహిత్యవిభాగాధ్యక్షులు**
**రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం**
**తిరుపతి**

పాఠం - 5

# కుమార సంభవమ్ - మహాకవి కాళిదాసు

# 5వ సర్గ - పార్వతి తపోవిధానము

## 1. పూర్వ రంగం :-

దక్ష ప్రజాపతి కుమార్తెయైన సతీదేవికే 'దాక్షాయణి' అని పేరు. ఈమె పరమ శివుని మొదటి భార్య. అల్లుడైన శివుడు, తనను దేవతలందరి సమక్షంలో లేచి గౌరవించలేదని కోపించిన మామ దక్షుడు, రుద్రునికి స్థానం లేని ఒక విచిత్ర యజ్ఞాన్ని తలపెట్టి, దానికి దాక్షాయణీ, శివులను పనిగట్టుకొని ఆహ్వానించక, తదితర దేవతలను ఋషులందరినీ ఆహ్వానించాడు.

సతీదేవి, శివునితో తామిరువురు ఆ యజ్ఞానికి వెళ్లాలని ప్రస్తావించింది. దానికి శివుడు, 'అరుద్రాకమైన యజ్ఞానికి ఫలితం ఉండదు. అది అశివము - అంటే అమంగళకరంగా పరిణమిస్తుందని, పైగా దోష భూయిష్ఠమైన యజ్ఞానికి వెళ్లకూడ'దన్నాడు.

చివరికి సతీదేవి, శివుడు రాకపోతే తనొకతే వెళ్లి వస్తానని, తన తండ్రి అంత గొప్ప యజ్ఞం చేస్తుంటే పోయి చూడకపోవడం దోషమవుతుందని, పెద్దలు "అనాహూతోఽధ్వరం గచ్ఛేత్" యజ్ఞానికి ఆహ్వానించకపోయినా అది జరిగే చోటుకు వెళ్లి చూడాలి" అన్నారు కాబట్టి తాను తన తండ్రి చేస్తున్న యజ్ఞానికి వెళ్లడంలో తప్పు లేదన్నది.

ఆ మాటలకు శివుడు, "పిలవని పేరంటానికి వెళ్లకూడదు. వెళ్లితే అవమానం పొందవలసి వస్తుందని" హెచ్చరించాడు. దానికి సతీదేవి, యజ్ఞం చేస్తున్నవాడు తన తండ్రియే కాబట్టి తనకెటువంటి అవమానం జరగదని తండ్రిని వెనకేసుకు వచ్చింది.

శివుడామాటలకు వెంటనే స్పందించి "అక్కడికి వెళ్లి అవమానం పొందితే, తనకది అవమానమని అలా అవమానింపబడి తన దగ్గరకు తిరిగి రావద్ద"న్నాడు.

ఆ షరతుకు అంగీకరించి సతీదేవి నందీశ్వర, భృంగిరిటులు తోడురాగా దక్ష యజ్ఞశాలకు వెళ్లింది. ఆమె వైపు చూసిన వారు లేరు. రమ్మని ఆహ్వానించిన వారు లేరు. చూచినా పలకరించిన వారు లేరు. చివరికి తల్లి కూడ చూచి చూడనట్లే మౌనం వహించింది. ఇక తండ్రి సరేసరి, ఏ మాత్రమూ పట్టించుకోలేదు.

ఈ అవమానాన్ని భరించలేక, తిరిగి వెళ్లలేక సతీదేవి అక్కడికక్కడే ఆత్మయోగాగ్నిలో దగ్ధమై పోయింది. శివుడికీ వార్త చేరింది. శివుని క్రోధం నుండి పుట్టిన వీరభద్రుడు దక్షాధ్వర ధ్వంసం చేశాడు. దక్షుడు శివుని మహిమను గుర్తించాడు. ఇది శివ పురాణంలో చెప్పబడిన కథ. ఈ పూర్వ రంగాన్ని జ్ఞాపకం చేస్తూ, కుమార సంభవంలో కాళిదాసు ప్రథమ సర్గలోనే సతీదేవియే పార్వతిగా అవతరించిందని స్పష్టంగా వ్రాశాడు.

## సతీదేవియే పార్వతి :-

అథావమానేన పితుః ప్రయుక్తా
దక్షస్య కన్యా భవ పూర్వపత్నీ ।
సతీ సతీ యోగ విసృష్ట దేహా
తాం జన్మనే శైలవధూం ప్రపేదే ॥ (కు॥సం॥ 1 - 21)

శివుని మొదటి భార్య యైన పతివ్రత దక్షపుత్రి సతీదేవి, తన తండ్రి దక్షుడు, తన భర్తకు చేసిన తిరస్కారం చేత ప్రేరితురాలయి యోగ మార్గంలో ఆ దేహాన్ని త్యజించి మరల జన్మించడానికై హిమవంతుని భార్యయైన మేనకాదేవి గర్భాన్ని చేరింది.

సా భూధరాణా మధిపేన తస్యాం
సమాధి మత్యా ముదపాధి భవ్యా ।
సమ్యక్ ప్రయోగా దపరిక్షతాయాం
నీతా వివోత్సాహ గుణేన సంపత్ ॥ (కు॥సం॥ 1 - 22)

హిమవంతుని వలన మంచి సంతానం కోసం వ్రతాలు చేస్తున్న ఆ మేనకా దేవి గర్భంలో ఉత్సాహ శక్తి వలన చక్కని సంవిధానకం ఏర్పడగా, నాశం లేని నీతి ఉండేచోట సంపద ఏ విధంగా సుస్థిరంగా ఉంటుందో ఆ విధంగా 'సతీదేవి' స్త్రీ శిశువుగా మరల జన్మించింది.

ఆమెయే పర్వత రాజ తనయ పార్వతి. కాబట్టి 'దాక్షాయణి'యే పార్వతిగా ప్రాదుర్భవించిందని కాళిదాసు కుమార సంభవం ప్రథమ సర్గలోనే ప్రతిపాదించాడు.

## దోహద క్రియలు :-

యౌవనవతి యైన పార్వతిని చూచి నారద మహర్షి, "ఈమె శివుని అర్ధాంగి అవుతుందన"డంలో (ప్రేమ్ణా శరీరార్థహరాం హరస్య) (కు॥సం॥ 1 - 50) కూడ ఆయనకు పార్వతి పూర్వజన్మ వృత్తాంతం తెలియుననడమే కాదు, పార్వతి మనస్సులో శివుని గూర్చిన భావన నాటడం, ఆమె తల్లి తండ్రుల మనసులో శివుడే తమకు తగిన అల్లుడనే భావం కల్గించడం - ఈ రెంటికీ చక్కని బీజావాపం జరిగింది.

మొదటి భార్య చనిపోయిన దుఃఖములో వైరాగ్యంతో ఉన్న శివునితో "మా పార్వతిని పెండ్లి చేసుకోవయ్యా" అని అడగడానికి హిమవంతుడు కాదు కదా, బ్రహ్మాది దేవతలెవ్వరూ పునర్వివాహ ప్రసక్తి తీసుకురావడానికి జంకి, మౌనం వహించారు.

(కు॥సం॥ 1 - 52)

యదైవ పూర్వే జననే శరీరం
సాదక్షరోషాత్ సుదతీ ససర్జ ।
తదా ప్రభృత్యేవ విముక్త సంగః
పతిః పశూ నామ పరిగ్రహోఽ భూత్ ॥ (కు॥సం॥ 1 - 53)

ఎప్పుడు సతీదేవి దక్షుని మీది కోపం చేత తన దేహాన్ని యోగాగ్నితో దగ్ధం కావించిందో, అప్పటి నుండి పరమ శివుడు ఇంద్రియాలకు సంబంధించిన అభిలాషలు మానివేసి, మరొక స్త్రీని గురించి భావించడమే నిలిపివేశాడు.

తత్రాగ్ని మాధాయ సమిత్సమృద్ధం
స్వమేవ మూర్త్యంతర మష్టమూర్తిః ।
స్వయం విధాతా తపసః ఫలానాం
కేనాపి కామేన తపశ్చచార ॥ (కు॥సం॥ 1 - 57)

ఇతరులు చేసే తపస్సులకు ఏ యింద్ర పదవినో మరే యితర గొప్ప పదవులనో ఫలంగా అనుగ్రహించే వాడైన శివుడు, స్వయంగా ఆ హిమవత్పర్వతం పై తన ఎనిమిది మూర్తులలో ఒకటైన అగ్నిని ప్రతిష్ఠించి ఏదో ఒక కోరికతో తపస్సు చేయడానికి పూనుకున్నాడు.

అటువంటి పరిస్థితుల్లో హిమవంతుడు తన పర్వతం మీదనే తపస్సు చేస్తున్న శివునికి మర్యాద పూర్వకంగా కన్పించి, గౌరవించడానికి అర్ఘ్యంతో పాద పూజ చేసి, తన కుమార్తెయైన పార్వతిని, జయ, విజయులనే యిద్దరు చెలికత్తెలను ఆమెకు తోడుగా నిచ్చి, తపోనిష్ఠుడైన శివుని పరిచర్య చేయడానికి నియమించాడు.

పార్వతి ప్రతి రోజూ పూజకై పూలు కోసికొని రావడం, అగ్ని వేదికను చక్కగా శుభ్రం చేసి, ఆవు పేడతో అలికి, రంగవల్లికలు తీర్చిదిద్దడం, నిత్యానుష్ఠానానికి నీళ్ళు, దర్భలు, సమిధలు సమకూర్చడం యిత్యాది పరిచర్యలు చేయసాగింది.

శివుని తపస్సుకు భంగం కల్గించాలని ఇంద్రుడు మన్మథుని పంపాడు. అతడు శివుని మనస్సు పార్వతి పై లగ్నం కావాలని ఒక్క పూల బాణం వేశాడు. వెంటనే శివుని మూడవ కంటి మంటతో బూడిద కుప్పగా మిగిలాడు. రతీ దేవి దుఃఖించి సహగమనానికి పూనుకోగా ఆకాశవాణి మన్మథుడు మరల జీవిస్తాడని, అంతవరకూ వేచి ఉండవలసిందిగా హెచ్చరించింది.

అక్కడ తండ్రిచే అవమానించబడిన సతీదేవి యోగాగ్నిచే దగ్ధమైంది. ఇక్కడ శివుని కటాక్ష వీక్షణాలకు నోచుకోని తన సౌందర్యం వ్యర్థమైందని పార్వతి ప్రాణపరిత్యాగానికి పూనుకోలేదు సరి కదా! పూర్వజన్మ సంస్కారంచే పట్టుదల పెరిగింది. 'తపస్సుకు తపస్సే సమాధానం' అని నిర్ణయించుకొని కఠోర తపోదీక్ష చేత శివుని మెప్పించి ఆతని యిల్లాలు కావాలని తపశ్చర్యకు పూనుకొన్నది. ఇది స్త్రీ వ్యక్తిత్వంలో ఏర్పడిన అభ్యుదయంగా పురాణ, యితిహాసాలే నిరూపిస్తున్నాయి. చనిపోవడం పిరికితనం! కార్యసాధన చేయడం వ్యక్తిత్వ వికాసం!! ఈ వ్యక్తిత్వ వికాసాన్నే పార్వతి తపోదీక్షా విధానంలో మహాకవి కాళిదాసు మనచే దర్శింపజేస్తున్నాడు.

## పార్వతి తపోదీక్షా విధానం :-

ఒక కన్నె మనసులో తన వైవాహిక జీవితాన్ని గురించిన ఎన్నో ఊహాగానాలు, ఆశాసౌధాలు ఉంటాయి. ఆ ఊహా లోకాల్లో ఆమె నిత్యం విహరిస్తూ ఉంటుంది. తాను భర్తృ వాల్లభ్యం పొందిన స్త్రీగా లోకంలో ఎలా రాణించాలో ఆమె అంచనాలు వేస్తూ ఉంటుంది.

శివుడు నిస్పృహుడు, నిరీహుడు, నిరామయుడు, విశేషించి ఇప్పుడు 'కామ దహనం' చేసి పవిత్రమైన వైవాహిక బంధానికి 'కామం' ఒక బద్ధ శత్రువని, నిష్కల్మషమైన ప్రేమ బంధమే వైవాహిక బంధమని తెలియజేయడానికే పార్వతిలోని ఆ లాలసతను తొలగించి, అగ్నిచే తప్తమైన బంగారం మాలిన్యాన్ని పోగొట్టుకొని 'అపరంజి'గా అవుతున్నట్లు, రమణీయము, ప్రసన్నమైన మనస్సుతో, శరీరంతోనే గృహస్థాశ్రమ స్వీకరణ సాధ్యమౌతుందని సందేశమిస్తున్నట్లుగా శివుడు కామ దహనం జరిగిన ఆ స్థలాన్ని వదలి వేరే ఎక్కడికో ఏకాంత ప్రదేశానికి తరలి వెళ్లాడు. ఈ గూఢమయ సందేశాన్ని ఒక యువతి వెంటనే స్వీకరించే స్థితిలో ఉండదు. కాని, పార్వతి, సతీదేవి వంటి సత్య కాలపు వ్యక్తి కాదు. సతీదేవిలోని అచంచలమైన పాతివ్రత్యమే పార్వతిలో కఠోర తపో వ్రత దీక్షగా పరిణమించి, పట్టుదలతో కార్యసాధన చేసే సాహసాన్ని ఆమె వ్యక్తిత్వంలో పాదుకొల్పిందని చెప్పవచ్చు. సంతానవతి కాకనే చనిపోయిన సతీదేవి కోర్కెలు పార్వతిలో ఫలించాయి. దానికి పార్వతీ దేవి పట్టుదల, ఆత్మ విశ్వాసం దోహదం చేశాయి. శివుడు స్థాణువైతే, పార్వతి కన్న తండ్రి హిమవంతుడు కూడ స్థాణువే! 'భూధర రాజ కన్య' అనూహ్యమైన రీతిలో కఠిన తపోవ్రత దీక్ష నవలబించడంలో ఆశ్చర్యపడవలసిన అంశమేమీ లేదని కాళిదాసు నిష్కర్ష. కాని, ఈ 'ధరణీ ధర కన్య' 'పరమ సుకుమారి' యని 'కన్యాంగ సౌందర్య కథనం' (కు॥సం॥ 1 - 32 నుండి 49 వరకు)లో కవి వర్ణించాడు. ఆమె మనస్సౌకుమార్యం, శరీర సౌకుమార్యం గల్గిన సౌందర్య లహరియైనా ఆమె వ్యక్తిత్వం పర్వతం వలెసమున్నతమైనది. సముద్రం వలె గంభీరమైనది, లోతైనది. ఈ లక్షణాలు పార్వతీ తపశ్చర్య ఘట్టంలో స్పష్టంగా కనబడుతున్నాయి.

ఆ విధంగా తన కన్నుల యెదుటనే మన్మథుని బూడిద చేసిన పరమ శివుని పట్ల తన ఆశాలత తెగిపోయి వడలిపోగా పార్వతి లోలోనల తన సౌందర్యాన్ని తనే నిందించుకొనింది. ప్రియుని మనస్సును దోచుకోని అంద చందాలు వ్యర్థమే కదా!

పార్వతి తన సౌందర్యాన్ని సార్థకం చేసుకోవడానికి తపశ్చర్యకు సంకల్పించింది. లేకుంటే మరొక విధంగా ఆ స్పృహణీయమైన ప్రేమ కాని, అటువంటి భర్త గాని ఏ విధంగా పొందగలదు?

"పార్వతి శివుని యందే లగ్నమైన చిత్తంతో కఠోర తపస్సు చేయడానికి నిశ్చయించుకొన్నది" అన్న వార్త విన్న పార్వతి తల్లి మేనకా దేవి ఆమెను గుండెలకు హత్తుకొని అటువంటి కఠినమైన నిర్ణయం నుండి మనస్సును మళ్ళించుకోమని అనునయిస్తూ - "కోరిన కోర్కెలు తీర్చే దేవతలు ఎక్కడ లేరమ్మా! నా బంగారు తల్లీ! నీ వెక్కడ? ఘోరమైన కఠోర తపో వ్రత దీక్ష యెక్కడ? ఇటువంటి సాహస కార్యాలు మన యింటావంటా ఉన్నయా చెప్పు? మిక్కిలి సుకుమారమైన దిరిసెన పువ్వు పై తేనెటీగ వాలితే అది సహించుకోగలదు గాని ఒక పక్షి వచ్చి కూర్చుంటే తట్టుకోగలదా? తపస్సు కఠిన నియమ నిష్ఠలతోకూడుకొన్నది. దానికి నీ సుకుమారమైన శరీరం తాళజాలదు సుమా! అని హెచ్చరించింది.

మేనకాదేవి ఎంతగా నివారించడానికి ప్రయత్నించినప్పటికీ, పార్వతి తను పట్టిన పట్టు విడువనన్నది. బలీయమైన కోరిక వెంట పరిగెత్తే హృదయాన్నీ, పల్లానికి ప్రవహించిపోతున్న జలాన్ని ఎవరు ఆపగలరు?

తన కత్యంతము ఆప్తురాలైన చెలికత్తె ద్వారా తండ్రియైన హిమవంతునికి పార్వతి తన కోర్కెను విన్నవించుకొని, అరణ్య వాసానికి, తపస్సు చేత ఫలితాన్ని పొందేంత వరకు అనుమతి యివ్వవలసిందిగా అభ్యర్థించింది.

పార్వతి ధృఢ నిశ్చయానికి సంతసించిన హిమవంతుడు ఆమె అరణ్య వాసానికి తవపశ్చర్యకు అనుమతించాడు. నెమళ్లు విస్తారంగా విహరించే ఒక పర్వత శిఖరం పై తపస్సు చేయడానికి ఆమె బయలు దేరింది. ఆమె తపస్సు చేయడం చేత ఆ మయూర మయ శిఖరానికి తర్వాత గౌరీ శిఖరమని పేరేర్పడింది.

మయూర గిరి శిఖరాన్ని చేరుకొన్న పార్వతి తన దృఢ ప్రతిజ్ఞను అమలుపరచడానికి కావలసిన సన్నాహాలను ప్రారంభించింది. ముప్పేటలుగా అమరిన ముత్యాల సరాలు తన వక్ష స్థలం పై పూసిన గంధపు పేటులను రాచుకొంటూ పొళ్లు పొళ్లుగా దాన్ని రాలుస్తుండడం అలవాటుగా రోజూ జరుగుతున్నదే కాబట్టి ఆ ముత్యాల పేటలను తీసివేసింది. అప్పుడే ఉదయిస్తున్న సూర్యుని ఎఱ్ఱని లేత రంగు కిరణాలతో సమానమైన నార చీరను కట్టుకొన్నది. ఆ నార చీర ఆమె ఎత్తైన కుచ మండలాన్ని పూర్తిగా ఆవరించలేక విరిసి పోయినది. అందమైన ఆమె ముఖం పై వ్రాలే వంకలు తీరిన జుత్తు నల్లని తుమ్మెదలు వ్రాలే పద్మం వలె మరింత అందంగా భాసించేది. ఇప్పుడామెలికలు తిరిగిన కుటిల కుంతలాలు జడలు కట్టి ఉన్నా మునుపటి వలెనే మధురమై చూడముచ్చటగా అమరింది. పద్మం పై తుమ్మెదల సమూహం క్రమ్మినప్పుడే కాదు, పచ్చని నీటి నాచు ఆవరించినప్పుడు కూడ రమణీయంగా కనబడుతుంది కదా!

క్షణ క్షణము శరీరం గగుర్పొడిపించే దర్భలతో ముప్పేటలుగా పేనిన మౌంజిని జఘనము పై ఆమె ధరించింది. అంతకు ముందెప్పుడూ దర్భతో పేనిన మౌంజిని ధరించిన అలవాటు లేని కారణం చేత ఆమె ముత్యాల మొలనూలు ధరించే జఘన భాగం కందిపోయి సుతిమెత్తని చర్మం ఎఱ్ఱబారింది.

అసలే ఎఱ్ఱని పెదవులకు ఎఱ్ఱని రంగు గల అలక్తకం పూయడం చేత, ఆమె తన చేతి వ్రేళ్ళను పెదవులకు తాకనీయక పోయినా కందుక క్రీడ చేస్తూ ఆ బంతి వక్ష స్థలం పై పడడం చేత స్తనాంగరాగంలో దొర్లిన ఆ బంతి ఎఱ్ఱగా మారింది. పై రెండు అంశాలలో చేతికి ఎఱ్ఱని రంగు తగులక జాగ్రత్తపడిన పార్వతి యిప్పుడు పదునైన దర్భలను కోయడం చేత నెత్తురుచే చేతులు రెండూ ఎఱ్ఱబడగా కుడి చేయి, జపమాలకు నెచ్చెలి అయింది. హంస తూలికా తల్పం మీద శయనించినప్పుడు తన జడ లోని

పూలు రాలి శయ్య పై పడగా నిద్రలో అటూయిటూ పొరలినప్పుడు ఆ రాలిన పూలు ఒత్తుకోవడం చేతనే మనోహరమైన శరీరం కందిపోతుండగా, యిప్పుడు లత వంటి తన సున్నితమైన చేతులే తలగడగా చేసికొని కటిక నేల మీద పార్వతి విశ్రమిస్తూ ఉంది. పాశుపత దివ్యదీక్షను చేపట్టిన పార్వతి తన యొక్క రెండు అంశాలను యిద్దరి వద్ద కొంత కాలం న్యాసంగా నిక్షిప్తపరచింది. అవేమిటంటే, లేత తీగెలలో తన విలాసాన్ని, కన్నె జింకలలో తన చంచలమైన బెళుగు చూపులను దాచి పెట్టింది.

పార్వతి ప్రతిరోజు పాలుమాలకుండా, చిన్నచిన్న మొక్కలకు స్తనాకారం గల్గిన కుండలలోని జలాన్ని సేచనం చేస్తూ ఎంతో ప్రేమగా, ప్రియంగా పెంచుకొన్న చెట్లను చూస్తుంటే, అవి ఆమె బిడ్డలేమో అన్నంతగా ఒప్పుతున్నాయి. పార్వతికి పెంచిన చెట్ల పై గల మమకారం చూస్తే ఆమెకు తర్వాత పుట్టబోయే ఆరు తలల (షణ్ముఖుడు) కుమార స్వామి కూడా ఈ తొలి కాన్పయిన చెట్ల పై గల ప్రేమను ఆమె నుండి తొలగించలేడు, అన్నంతగా ఆమె వాటి పై మక్కువ పెంచుకొన్నది.

జింకలకు ఆమె రోజు నీవార ధాన్యాన్ని (అడవి వడ్లను) దోసిళ్ళతో యిచ్చి తినిపించేది. దానితో నిర్భయంగా మాలిమియైన జింకలు ఆమె చెలికత్తెల సమక్షంలో తన కళ్లు వెడల్పా? లేడి కన్నులు వెడల్పా? కొలిచి చూడాలని కోర్కె కల్గినప్పుడా ఆ జింకలు ఆమె కళ్ళను తమ కళ్ళతో కొలవడానికి అనుమతించేవి. స్నానము చేసి, అగ్ని పూజ చేసి, జింక చర్మం కప్పుకొన్న ఆ పార్వతీ దేవి సకల శాస్త్రాలు చక్కగా చదువుకొన్నదని తెలిసి, ఆమెను సందర్శించాలనే కుతూహలంతో ఋషులందరూ తరలి వచ్చారు. ధర్మానుష్ఠానం చేత వృద్ధులైన వారిని లోకం గౌరవిస్తుంది. వారు వయస్సు చేత చిన్నవారయినప్పటికీ పెద్దలు వారి వయస్సును పట్టించుకోరు.

తన సహజమైన వైరభావాన్ని వదలిపెట్టి, కలసిమెలసి పర్ణశాలా ప్రాంగణంలో పరస్పరం సహ జీవనం సాగించే క్రూర మృగాలు ఆశ్రమ సాధు మృగాలు మసలు చుండగా, చెట్లు కోరిన పండ్లను యిస్తూ అతిథుల్ని అర్చిస్తుండగా, పర్ణశాల మధ్య భాగం నుండి హోమాగ్ని ధూపాలు వెల్వడుచుండగా పార్వతి తపస్సుకు పూనుకొన్న తపోవనం పావనమయింది.

తన మనస్సులోని గాఢమైన కోరిక తీరాలంటే ఇంత మాత్రపు ప్రాథమికమైన తపోజనవృత్తి చాలదని ఆమె నిశ్చయించుకొని, తన శరీర సౌకుమార్యాన్ని సైతం లక్ష్య పెట్టకుండా, కఠోర తపోవ్రత దీక్షకు పార్వతి బద్ధకంకణురాలైంది.

పూలతో తయారు చేసిన బంతి ఆటలకే అలసిసొలసి వడలిపోయే ఆ తల్లి, ముని శ్రేష్ఠులైన వారికే సాధ్యములవునో కాదో అని చెప్పబడే విలక్షణ తపో వ్రతాలను ప్రారంభించింది. నిజానికి ఆమె శరీరం కాంచన పద్మ నిర్మితం. ఆమె శారీరక ప్రకృతి పైకి చూడటానికి ఎంతో మృదువుగా కన్పడినప్పటికీ అది 'శక్తి'చే గర్భీకృతమైనది.

గ్రీష్మ ఋతువులో మిట్టమధ్యాహ్నపు మండుటెండలో ప్రజ్వలించే నాలుగు అగ్ని గుండాల నడుమ సుందర వదనార విందయై కూర్చొని, సన్నని నడుము గల ఆ పార్వతీ దేవి అచంచల దీక్షతో ధ్యావ వృథువుల్ని దహించి వేసే ఆ మహోగ్రమార్తాండవహ్నుల ప్రతాపాన్ని జయించింది. తన చూపులను చెదరనీయకుండా ఏకాగ్ర దృష్టితో తదేక ధ్యానంతో నిలిచి, మధ్యందిన మార్తాండుని కనురెప్పలార్పకుండా చూచింది. ఈ విధంగా తీక్షణమైన సూర్య కిరణాలచే తప్తమైన ఆమె ముఖ పద్మం మరింత వికసించింది. కాని, ఆతపతప్తత మరింత అధికం కావడం చేత ముఖ కమలం కొంత కమలినట్లయింది. సోగలైన ఆమె కంటి కొనలు మాత్రం కాస్త నల్లబడ్డాయి.

వేసవి రాత్రి వేళల్లో ఆమె తపోవృత్తి ఎట్టి లోపాలకు పాల్పడలేదు. తనకు దాహమవుతున్నదని అడుగకుండానే, తమంతట తామే లభించే వర్షపు చినుకులే జలంగా స్వీకరించి, ఆ జల బిందువులు లభింపని రోజుల్లో చంద్ర కిరనాలనే జలాహారంగా గ్రహించింది. ఎందుకంటే, చంద్రుడు జల స్వభావమైన శీతలత్వానికి పెట్టింది పేరు. ఒక స్థావరమైన వృక్షం జీవించినంత కాలం కదలిక లేకుండా రోజూ చంద్ర కిరణాల శీతలత్వాన్నే ఆహారంగా గ్రహించి ఉదయం సూర్య కిరణాల చేత స్వశక్తిని ఎలా సమీకరించుకొంటూ ఉన్నదో

- ఎప్పుడూ మునుల్లాగా తపస్సు చేసే ఆ చెట్ల వలె - పార్వతి ప్రకృతిలోని ఒక వృక్షం వలె స్థావరమైన తపస్సును, స్థాణువైన శివుని పొందడం కోసం చేయసాగింది.

ఇక, వర్ష ఋతువులో పార్వతి తపస్సు ఎలా సాగింది? అని ప్రశ్నిస్తే, ఎటువంటి యింధనం లేకుండానే సూర్య గోళం తనంతట తానే అగ్నిని ప్రజ్వలింప జేస్తుండగా, భూ లోకంలోని అగ్ని ఒక యింధనాన్ని అంటి పెట్టుకొనే మండుతుంది. ఈ ద్యావాపృధువుల అనింధన, యింధన మహాగ్నులకు కాగి కాగి, భూమి భరించలేని స్థితికిరాగా 'ఉష్ణం ఉష్ణేన శీతలం' అన్నట్లుగా వేసవి ఎండల్లో చిటపట చినుకులు పడి భూమి తడియగా భూ దేవితో సహా తపోదేవియైన పార్వతీ దేవి కూడ వెచ్చని ఆవిరులు ఎగజిమ్మసాగింది.

తొలకరి జల్లులతో వర్ష ఋతువు ప్రారంభమైంది. ఎంత కుంభ వృష్టి కురిసినా ఒక తపస్విని, ఒక వృక్షం ఉన్న చోటు నుండి కదలదు, కదలకూడదు. ఎడతెగకుండా కురిసే వర్షధారల్లో చెట్లతో పాటు, తపోమూర్తియైన పార్వతీ తడిసి ముద్దయిపోయింది. తొలకరి వాన చినుకులు కనురెప్పల మీద క్షణ కాలం నిలిచి, పెదవుల పై పడి చెదరి, ఎత్తైన చనుకట్టు పై బడి తుత్తుమురులై త్రివళులో తొట్రుపడుతూ మెలికలు తిరిగి జారి, ఎట్టకేలకు ఆమె నాభీ గహ్వరాన్ని ప్రవేశించింది.

ఎడగలులతో కూడిన వర్ష ధారలలో ఆరు బయట ఒక శిలాతలం పై ఆసీనయైయున్న ఆ దేవిని మెఱుపు తీగెలనే కన్నులతో రాత్రులు పార్వతి చేస్తున్న మహా తపస్సుకు సాక్ష్యంగా ఉన్నాయి.

వర్షాకాలము పోయి హేమంతసంపాతము ప్రారంభమైనది. మంచు ముమ్మరంగా విరజిమ్మే గాలులలో, తన ఎదుటనే జంటను కలసికోలేక, ఒక దానికై ఒకటి దుఃఖిస్తున్న చక్రవాక మిథునం పై కనికరంతో ఆమె పుష్యమాసపు రాత్రులు గడిపింది.

పద్మ సుగంధాన్ని గల్గిన ఆమె ముఖ పద్మం హిమ సంపాతపు గాలులచే వడవడవడకుచున్న లేత పెదవులనే దళాలతో, అంతవరకు దట్టంగా కురిసిన మంచు సోనలకు దళాలు విరిసిపోయి తామరపూలు నీటి పై తేలిపోతుండగా వర్ష జలాలకు ఒక కొత్త పద్మం వికసించిందా అన్నట్టు పార్వతి ముఖ పద్మం వికసించింది.

అంతలో శిశిర ఋతువు సంప్రాప్తమైనది. చెట్ల నుండి తమంతట తామే ఊడి పడిపోతున్న పండుటాకులు తిని ప్రాణం నిలుపు కోవడం తపస్సులో పరాకాష్ట దశ. పార్వతీ దేవి చెట్ల నుండి రాలిపడిన పండుటాకులను కూడా ఆహారంగా స్వీకరించడం మానివేసి, తపస్సు కొనసాగించింది. అందుచేతనే ముని శ్రేష్ఠులు తరుపర్ణాలను కూడా స్వీకరించడం మానివేసిన పార్వతిని 'అపర్ణ' అని పిలవసాగారు.

ఇటువంటి కఠోర నియమాలతో కూడిన తపోవ్రత దీక్షను పాటిస్తూ రాత్రింబగళ్లు తామర తూడు వంటి సుకుమారమైన శరీరాన్ని కృశింపజేస్తూ, ఘోరమైన వరవ్రతాచారాలను అనుష్ఠించే మహా మునుల తపస్సులన్నింటినీ ఆమె తపస్సు ముందు వెలవెల పోయేలా చేసింది.

## 2. మాయా (కపట) వటువు పార్వతిని పరీక్షించిన విధానము :-

ఒకనాటి సుప్రభాత సమయంలో జింక చర్మాన్ని నైష్ఠికతకు ప్రతీకగా ధరించిన వాడు, బ్రహ్మచారినని తెలియజేయడానికి మోదుగు కర్రను భుజం పై ధరించిన వాడు, ఫాల భాగం పై విభూతి పుండ్రములు దాల్చి, బ్రహ్మ తేజస్సుతో ప్రకాశించే వాడు, శరీర విన్యాసం చూస్తే మూర్తీభవించిన బ్రహ్మచర్యాశ్రమమా అనేటట్లు భాసించే వాడు, భాషించడంలో అత్యంత ప్రగల్భుడైన ఒక నవ యౌవనుడైన బ్రహ్మచారి పార్వతి తపోవనానికి వేంచేశాడు.

వచ్చిన అతిథిని పార్వతి సగౌరవంగా ఆహ్వానించి, కూర్చునేందుకు ఆసనాన్ని చూపించి, రుచికరములైన పండ్లు గల పళ్లెరాన్ని ముందు పెట్టి, చేతులు జోడించి, దూరంగా ఒక వైపు నిలబడి శ్రద్ధాసక్తులతో చూడసాగింది. స్థిరమైన మనస్సు గల వాడు తమతో సమానమైన ఆశ్రమంలో ఉండేవారిని కూడా వ్యక్తి విశేషాన్ని బట్టి అధికంగా మన్నిస్తారు కదా!

ధర్మశాస్త్రానుసారం పొంద వలసిన అతిథి సత్కారాన్ని స్వీకరించిన తర్వాత, బడలిక తీర్చుకుంటున్న వాని వలె ఒక్క క్షణం గడిపి, ఆ బ్రహ్మచారి పార్వతి వైపు సూటిగా చూస్తూ ఎటువంటి తడబాటు లేకుండా నింపాదిగా కుశల ప్రశ్నలు వేయడం ప్రారంభించాడు.

నిత్యాగ్ని హోత్రానికి, హోమానికి సమిధలు దర్భలూ ఈ ప్రాంతంలో సమృద్ధిగా దొరుకుతున్నాయా? నీళ్ళు పరిశుభ్రమై స్నానం చేయడానికి పనికి వచ్చేవేనా? నీవు నీ శక్తిని మించి తపస్సుకు పూనుకోవటం లేదు కదా! ఎందుకంటే ధర్మ సాధనాలలో మొట్ట మొదటి సాధనం శరీరమే కదా?

నీ వాలకం చూస్తుంటే నీవు చాలా కాలంగా తపస్సు చేస్తున్నట్లు కనబడుతుంది. ఎందుకు చెబుతున్నానంటే, నీవు నీ ఎఱ్ఱని పెదవులకు ఆలక్తకం పూసి అలా రంగు పూయక పోయినప్పటికీ సహజంగానే ఎఱ్ఱనైన నీ పెదవులతో సరితూగుతూ, నీవు ప్రేమతో నీళ్ళు పోసి పెంచగా పెరుగుతున్న వనలత యొక్క ఎఱ్ఱని చివుళ్లు కొనలు సాగుతున్నాయా? బెళుకు చూపులతో నీ చూపులు పోలికకు అభినయించుచున్న వాని వలె నీ చేతి దర్భలను చనవుకొలది లాగి కొనుచున్న ఈ లేళ్ల పై నీ మనుస్స కోపగించుకోవడం లేదు కదా?

యదుచ్యతే పార్వతి! పాపవృత్తమే
న రూప మిత్య వ్యభిచారి తద్వచః ।
తథా హి తే శీలముదార దర్శనే
తపస్వినామప్యుపదేశతాం గతమ్ ॥ (5 - 36)

ఓ పార్వతీ! సౌమ్యమైన ఆకృతి ధర్మ ప్రవృత్తిని ఎప్పుడూ మీరదను మాట యథార్థము. కనుకనే ఉదార దర్శనమైన నీ శీలం ముని జనములకు ఉపదేశాన్ని అందించే విధంగా అలరారుతూంది.

వికీర్ణ సప్తర్షి బలి ప్రహాసిభి
స్తథా న గాంగైః సలిలైర్దివ శ్చ్యుతైః ।
యథాత్వదీయై శ్చరితై రనా విలై
ర్మహీధరః పావిత ఏషసాన్వయః ॥ (5 - 37)

చెదిరిన సప్తర్షి పూజా సిత కమలములతో విరుగబడి నవ్వుతూ మింటి నుండి దిగిన గంగా జలాలు కూడా అకలుషమైన నీ చరితం వలె మీ తల్లి దండ్రుల వంశాలకు అటు వైపు యిటు వైపు ఏడేడు తరాలుగా ఈ గిరిరాజును పావనమొనర్చిరిండలేదు. నీ పుట్టుకతో మీ తల్లి తండ్రుల వంశాలు రెండూ ధన్యమైనాయి.

అనేన ధర్మాః సవిషేషమద్య మే
త్రివర్గసారః ప్రతిభాతి భావిని ।
త్వయా మనో నిర్విష యార్థ కమయా
యదేక ఏవ ప్రతిగృహ్య సేవ్యతే ॥ (5 - 38)

భావినీ! అర్థ కామాలను విడిచి ఒక్క ధర్మాన్నే నీవు స్వీకరించి సేవించడం చూస్తే త్రివర్గాలలో కెల్లా ధర్మమే సారభూతమని నాకిప్పుడు తెలిసివస్తున్నది. నీవింత ఆతిథ్యమిచ్చి మన్నించు నన్ను అన్యుడిగా భావిస్తావనుకోను. సజ్జనుల సంగీత సాప్తపదీనమని పెద్దలంటారు. తపస్వినీ! ఇందువలన ఎంతో ఓపిక గల నిన్ను విప్రులకు స్వాభావికమైన చొరవతో ఒక్క విషయం అడగాలని మాత్రం అన్పిస్తూ ఉంది. రహస్యం కాకపోతే చెపితే సంతోషిస్తాను.

కులే ప్రసూతిః ప్రథమస్య వేధస
స్త్రి లోక సౌందర్య మివోదితం వపుః ।
అమృగ్యమైశ్వర్య సుఖం నవం వయ
స్తపః ఫలం స్యాత్కిమతః పరం వద ॥ (5 - 41)

పుట్టింది ప్రథమ ప్రజాపతి వంశంలో. రూపమా! త్రిలోక సౌందర్యం రాశి పోసినట్లు. ఐశ్వర్య సుఖమా! అన్వేషించవలసిన అవసరం లేదు. ప్రాయమా! నవ యౌవనం. ఇంకా వేరుగా సాధింపవలసినదేమై ఉంటుంది? మరి ఈ తపస్సెందుకు చేస్తున్నట్లో? తెలియడం లేదు.

ఒక్కొక్కసారి మంచి తెలివి తేటలు గల స్త్రీలు తాము భరించరాని కష్టాలకు గురైనప్పుడు వారి ప్రవర్తన ఈ తీరుగా ఉండటం గమనించవచ్చు. కాని, ఎంత దూరమాలోచించినా నా మనుస్సుకు నీ విషయంలో అటువంటిదేదీ కనబడటం లేదు. శోకాన్ని పొదివి కోవడానికి వీలు లేని ఆకృతి గల్గిన దానివి. మీ తండ్రి యింటిలో అవమానానికి అవకాశమెక్కడ? అసలు నిన్నంత కఠినంగా అవమానించిన వాడెవ్వడు? భయంకర విష సర్పం పడగల పై గల మణి కోసం ఎవ్వడు చేతులను చాస్తాడు?

మఱి, ఈ లేత వయస్సులోనే ఆభరణాలన్నీ వదలి వేసి, ముసలి తనంలో కట్టుకోవలసిన నార చీరలను ధరించడానికి కారణమేమై ఉంటుంది? చందమామతో, చుక్కలతో దేదీప్యమానంగా వెలుగవలసిన తొలి రేయిలోనే అరుణోదయమైతే ఏం బాగుంటుందో నీవే చెప్పు చూద్దాం!

స్వర్గం కోసం ఋషులు, మునులు సాధారణంగా తపస్సు చేస్తుంటారు. ఒక వేళ అందుకోసమా? అంటే దానికింత శ్రమ పడనక్కరలేదు. మీ తండ్రి హిమగిరి సార్వభౌముని కొండనెత్తములు, చరియలు, సానువులే దేవ భూములు. ఇకపోతే, మంచి వరుని కోసమా? అంటే ఈ చేసిన తపస్సు చాలు! రత్నం తనంతట తాను ఎవరికి చేరాలో వారిని వెదుక్కుంటూ పోదు. ఆ రత్నం కావలసిన వాళ్ళు దాన్ని వెదుక్కుంటూ వస్తారు.

మాటి మాటికి నీ వెచ్చని నిట్టూర్పులు ఏదో తెలియరాని రహస్యాన్ని తెలియజేస్తూనే ఉన్నాయి. నా మనస్సు మాత్రం సంశయంలో మునుగుతూనేఉంది. నీ అందచందాలకు, నీ తెలివి తేటలకు, నీ అభిజాత్యానికి, నీ ఐశ్వర్యానికి, నీవింత వరకు చేసిన తపస్సుకు యోగ్యుడైన వరుడెక్కడున్నాడు? కాబట్టి నీవు కోరదగిన వాడే లేడు. కోరితే లభింపని వాడు కూడా ఉంటాడా?

ఓహో! యింత కాలంగా నీ అందమైన చెవులకు అలంకారంగా ఉన్న కలువ పూలు నీ బుగ్గల పై ఎంత రంగులను వెలార్చుచుండగా, ఆ అలంకార సౌభాగ్యమిప్పుడు లేకపోవడం చేత ఆ బుగ్గల పై కలమధాన్యపు మొన యొక్క పింగళ వర్ణాన్ని పోలిన జీఱాడే కఱవ జడలను ఊరికే నిర్లిప్తంగా చూస్తున్నాడంటే, నీవు ప్రేమించిన ఆ యువకుడెవ్వడో పెద్ద బండరాయి లాంటి మనస్సు గలవాడై ఉండాలి. ఈ కఠిన తపోవ్రత దీక్షలకు యింతగా కృశించి, ఎండలకు ఆభరణ స్థానాలు కమలి పోగా, పగటి పూటనే ఉదయించిన చందమామ వలె ఉన్న నిన్ను చూస్తుంటే ఉసురుండే యెవ్వని మనస్సైనా 'ఉస్సురు' మనకుండా ఉంటుందా?

వంపులు తిరిగిన కనురెప్పలు స్నేహంలో రగిలి మూతలుగ మెఱుపు చూపులు ప్రసరిస్తున్న ఆ మత్తెక్కిన కళ్లకు యింత కాలంగా తన ముఖాన్ని చూపించని ఆ ప్రేమాస్పదు డెవ్వడో కాని, తన చక్కదనపు టెక్కునకు పోయి నిజంగా చాలా నష్టపోయాడనే చెప్పాలి!

కియచ్చిరం శ్రామ్యసి గౌరి! విద్యతే
మమాపి పూర్వాశ్రమ సంచితం తపః ।
తదర్ధ భాగేన లభస్వ కాంక్షితం
వరం తమిచ్ఛామి చ సాధు వేదితుమ్ ॥ (5 - 50)

ఓ గౌరీ! యింకెంత కాలమని ఈ తపస్సు చేసి బడలిపోతావు. నా వద్ద పూర్వాశ్రమంలో సంపాదించిన తపం కొంత ఉంది. అందులోని అర్థ భాగం నీకిస్తాను. ఇక తపస్సు చేయడం మానుకో! ఆ తపశ్శక్తినీకిచ్చాను కాబట్టి దీనితో నీవు కోరిన కోర్కెయేదో సిద్ధి పొందేట్లు చేసుకో! అయితే నీవు కోరుకొన్న వరుడెవ్వడో మాత్రం నేను తెలుసుకోవాలనుకుంటున్నాను.

## 3. పార్వతి, మాయా (కపట) వటువుల సంవాదము :-

కపట వటువు తఱచి తఱచి అడుగుతున్న ప్రశ్నల పరంపరకు పార్వతి వెన్వెంటనే సమాధానం చెప్పలేక, తన మనుస్స లోని కోర్కెను వాచ్యంగా ఉచ్చరింపలేక స్వాభిమానము అడ్డురాగా తన చెంతనే నిల్చుని యున్న చెలికత్తె వైపు కాటుక తీర్చని కన్నులను తిప్పింది.

అప్పుడా పార్వతీ దేవి చెలికత్తె బ్రహ్మచారితో యిలా చెప్పసాగింది. ఓ పండితుడా! నీకంతగా మా నెచ్చెలి వృత్తాంతం వినాలని కుతూహలంగా ఉంటే విను, చెబుతాను. ఎండకు పద్మాన్ని గొడుగుగా పట్టినట్లు తన శరీరాన్ని ఈమె తపస్సాధనంగా ఎలా చేసిందో ముందుగా వివరిస్తాను.

ఈ మానవతి సమధికైశ్వర్య విభూషితులైన మహేంద్ర ప్రభృతి చతుర్దిగీశ్వరులను నిరాదరించి, కామ విజేతయై అతిలోక సౌందర్యానికి కూడ లొంగని వాడైన పినాకపాణిని పతిగా పొందడానికి అభిలషిస్తూ ఉంది.

పూర్వం దుస్సహ రుద్ర హుంకారము వల్ల ప్రక్కకు తిరిగి పురారి మీద పని చేయని బాణంతో మన్మథుని శరీరం భస్మమై పోయినా, ఆ పుష్పధనువు నుండి వెలువడిన బాణం మాత్రం ఈమె హృదయంలో గాఢంగా నాటుకొన్నది.

అప్పటి నుండి మన్మథుని చేత ఆవేశింపబడి ఈ బాల పుట్టింటిలో లలాటానికి చందనాన్ని పూసుకొని, ధూసరితాలై విప్పారి చెదరిన ముంగురులతో కరడు గట్టిన మంచు రాళ్ల మీద కూడ చల్లదనాన్ని అనుభవింపలేదు.......... అడవి లోవల పినాకధరుని చరిత్రలో పల్లవినందు కొన్నంతనే, గద్గద కంఠంతో తొట్రుపడుచున్న మాటలతో, ఈమె సంగీత సఖులైన కిన్నెర రాజ కన్యల చేత ఎన్నో మారులు కంట నీరు పెట్టించింది.

రాత్రి వేళల చివరి జాముల్లో ఒక్క క్షణం కన్నుమూసి “ఓ నీలకంఠా! ఎక్కడికి పోతున్నావు?” అని కలవరిస్తూ శూన్యాకాశాన్ని చేతులు బారసాచి పట్టుకొని తన స్వామిని కౌగిలించుకొన్నట్లు భావించి, స్పర్శ లేకపోవటంచే ఉలిక్కిపడి లేచి అది మాయగా తెలుసుకొని దుఃఖ పరవశురాలయ్యేది.

“పండితులైన వారు నిన్ను సర్వగతుడవని పలికే మాట నిజమే అయితే నా మనస్సులోని కోర్కె నీకెందుకు తెలియడం లేదు?” అని ఏకాంతంలో స్వహస్తంతో చిత్రీకరించిన శశిశేఖరుని చిత్తరువును చేత బట్టుకొని ఈ ముద్దరాలు ఉన్మాది వలె మాట్లాడుతుండేది.

ఆ జగత్పతిని పొందడానికై యింకొక మార్గాన్ని ఎంత అన్వేషించినా కానరాకుండా, ఆమె తండ్రి అనుమతి పొంది మాతో కలిసి తపస్సు చేయడానికై ఈ తపోవనాన్ని చేరింది.

తన తపస్సుకు సాక్షులుగా నిలచిన ఆనాటి తరువులు ఈమె నాటినవే యిప్పుడు సమృద్ధిగా ఫలాలను అతిధులకు సమర్పిస్తున్నాయి. ఆ శశిమౌళిని అంటి పెట్టుకొన్న ఆమె మనోరథం మాత్రం ఏకాసంతైనా మొలకెత్తేటట్లు అన్పించడం లేదు.

ఎంత ప్రార్థించినప్పటికీ దుర్లభుడిగానే మిగిలిపోయిన ఆ స్వామి, ఈ విధంగా తపస్సు చేత కృశించి మా చేత కన్నీరు పెట్టిస్తున్న ఈమా నెచ్చెలిని అనావృష్టిచే దెబ్బతిన్న నాగేటి చాలును నల్లని మేఘం వలె, ఎప్పటికి కనికరం చూపదలచుకున్నాడో తెలియడం లేదు.

ఈ విధంగా పార్వతి మనోభావాన్ని ఏ మాత్రం దాచిపెట్టకుండా, యింగితజ్ఞురాలైన నెచ్చెలి వేదిపరచగా, తను ఆనందించినట్లుగా మనుస్సలోని ఉబుకును ముఖంపై కనబడనీయక ఆనైష్ఠిక బ్రహ్మచారి, "ఇదంతా నిజమేనా? లేక వట్టి వేళాకోళమా?" అని పార్వతిని సూటిగా ప్రశ్నించాడు.

అప్పుడు రెండు చేతులను జోడించి, కుడి చేతితో స్పటికాక్షమాలను ధరించి పార్వతి చిట్ట చివరికి గొంతు పెగల్చి రెండు మాటలిలా ఉచ్ఛరించింది.

"ఓ వేద విద్వరుడా! నీవు విన్నదంతా నిజమే! ఈ ప్రాణి ఒక పెద్ద అంగవేసి ఉన్నతస్థానాన్ని పొందాలని ఉబలాట పడుతూ ఉంది. ఈ తపస్సంతా ఆ ఉన్నత పదవి సాధించటానికే. కోర్కెలు చేరని స్థలమంటూ ఉండదు కదా!"

అప్పుడా నైష్ఠిక సుందరుడిలా పలికాడు.

"ఏమీ! ఏమన్నావు? మహేశ్వరుడా! ఆయన గురించి తెలియని వాడెవ్వడు? అయితే, అప్పుడెప్పుడో కాముని కంటి మంటచే బూడిదగా చేసి, ఆ చోటు విడిచి వెళ్లిపోయిన అతనినే ఇంకా కోరుకుంటున్నావన్న మాట! అతడు చేసిన ఆ అమంగళకరమైన పనులన్నీ జ్ఞాపకానికి వచ్చిన తర్వాత, నా మనుస్స నిన్ను సమర్థించడానికి ఒప్పుకోవడం లేదు".

"నీ అభిలాష ఏ చోట కుదురుకోవాలో అక్కడ కుదురుకోక, అన్ని విధాలుగా పనికి రాని చోట గాఢంగా నాటుకొని పోయిందేనని విచారిస్తున్నాను".

అవస్తు నిబంధపరే కథం ను తే
కరోఽయ మాముక్త వివాహ కౌతుకః ।
కరేణ శంభర్వలయీకృతాఽహినా
సహిష్యతే తత్ప్రథమావలంబనమ్ ॥ (5 - 66)

అయ్యో! పెండ్లి తోరముతో నున్న నీయీ చేయి, సర్ప భూషణమైన శంభుని చేతితో, ఆ ప్రప్రథమ పాణిగ్రహణం ఏ విధంగా సహింపగలదో కదా! నీయంతట నీవే ఒక్కసారి ఆలోచించి చూడు ఎప్పుడైనా ఈ రెండూ ముడిపడదగినవేమో!

కల హంసల బొమ్మలు నేయబడిన వధువు పట్టుచీరకు బదులుగా రక్త బిందువులు చిందే ఏనుగు చర్మాన్ని అంతః పురంలో పుష్పరాసుల మీద నడయాడే నీ పాదాల పారాణి ముద్రలు కళ్ళలమైన కేశాలతో నిండిన శ్మశాన భూముల పై ముద్రితం కావడానికి పగవాడైనా అనుమతిస్తాడా?

ఇంత కంటే అనౌచిత్యమూ, అసందర్భమూ యింకా ఏమై ఉంటుందో చెప్పుకో! ఆ త్రినేత్రుని కౌగిలి నీకు సులభమే కావచ్చు గాక! హరిచందనాంకితమైన నీ వక్షః స్థలం పై చితా భస్మ రేణువు చేరుతుంది. మొట్ట మొదటినే నీవెదుర్కోవలసియున్న వేళాకోళం యుంకొకటి ఉంది. పెండ్లి కాగానే పట్టపు ఏనుగు మీద ఊరేగవలసిన నీవు ఆ ముసలి ఎద్దు పై కనబడినంతనే పౌర జనులందరూ ఫక్కున నవ్వగలరు సుమా! ఆ కపాల ధారిని నీవు ప్రేమించి ఉండటం చేత ఇప్పుడు రెండు అంశాలు శోచనీయ దశకు వచ్చి ఉన్నాయి. 1. కాంతివంతమైన చంద్ర కళ, 2. ఈ లోకానికే కన్నుల వెన్నెల వైన నీవు.

వపు ర్విరూపాక్ష మలక్ష్య జన్మతా
దిగంబరత్వేన నివేదితం వసు ।
వరేషు యద్ బాల మృగాక్షి మృగ్యతే
తదస్తికిం వ్యస్తమపి త్రిలోచనే ॥ (5 - 72)

సౌందర్యమా! విరూపాక్షము. పుట్టుకా?' తెలియదు. దిగంబరత్వమే ఏ మాత్రపు సంపద ఉందో తెలియజేస్తుంది. ఓ ముగ్ధ మృగాక్షి! సాధారణంగా వరులలో ప్రధానంగా చూడవలసిన అంశాలలో ఏ ఒక్కటైనా ఆ కృత్తివాసునిలో ఉన్నయా?

నివర్తయా స్మాదస దప్సితాన్మనః
క్వ తద్విధస్త్వం క్వచ పుణ్య లక్షణా ।
అవేక్ష్యతే సాధు జనేన వైదికీ
శ్మశాన శూలస్య నయూవ సత్క్రియా ॥ (5 - 73)

"ఈ అసమంజసమైన కోరిక నుండి నీ మనస్సు విరమించుకో! ఆ విధమైన అమంగళ లక్షణాలు గల అతడెక్కడ? పుణ్య లక్షణవైన నీవెక్కడ? శ్మశాన శూలానికి వేద వివాహితమైన యూపసత్క్రియ చేయడానికి సాధు జనులు సమ్మతించరు".

ఈ విధంగా ఆ కపట వటువు అన్నింటికీ అడ్డంకులు చెబుతుంటే, కోపంతో శరీరం కంపించి పోతుండగా పెదవులు చలించగా, పార్వతీ దేవి కంటి చివరలు ఎఱ్ఱబడగా కళ్లను, కనుబొమ్మలను ఒక వైపుగా త్రిప్పుకొన్నది. అంతేకాదు, ఆ కపట బ్రహ్మచారికిలా సమాధానం చెప్పింది.

"హరుని నీవు పరమార్థ దృష్టితో తెలిసికో లేకున్నావు. కాబట్టే నాతో ఈ విధంగా మాట్లాడుతున్నావు. మహా విషయాలు లోక సాధారణం కానందున ప్రత్యక్ష ప్రమాణాలచే నిరూపింపరానందున మహాత్ముల చరితను తెలియని వారు యిట్లే నిందిస్తారు".

విపత్ప్రతీకార పరేణ మంగలం
నిషేవ్యతే భూతి సముత్సుకేనవా ।
జగచ్ఛరణ్యస్య నిరాశిషః సతః
కిమేభిరాశోపహతాత్మవృత్తిభిః ॥ (5 - 76)

మంగళమెవ్వరికి? ఎవడికి మరణ భీతి ఉంటుందో, ఎవడికి ఐశ్వర్య కాంక్ష ఉంటుందో. వాడికి! సర్వలోక శరణ్యుడై నిరభిలాషుడైయున్న కేవల సన్మూర్తికి యిటువంటి ఆశల చేత తిరస్కరింపబడిన చిత్త వృత్తులతో పనేమిటి?

అకించనః సన్ప్రభవః స సంపదాం
త్రిలోకనాథః పితృసద్మ గోచరః ।
న భీమరూపః శివ ఇత్యుదీర్యతే
న సన్తి యాథార్థ్య విదః పినాకినః ॥ (5 - 77)

శివుడు అకించనుడు. చేతిలో చిల్లిగవ్వ లేనివాడు. అయితే అందరకీ ఐశ్వర్యం ఆయనే అనుగ్రహిస్తున్నాడు. శ్మశానాలలో ఉంటాడు కాని మూడు లోకాలకు ప్రభువు. ఆయన రూపం భయంకరంగా ఉంటుంది. కాని, ఆయనను 'శివుడు' - మంగళ ప్రదుడని పిలుస్తారు. పినాకమనే ధనస్సును ధరించిన ఆ పరమ శివుని యథార్థ స్వరూపం తెలిసినవారెవ్వరూ లేరు!

ఆ విశ్వమూర్తి శరీరం ఆభరణాలతో ప్రకాశించవచ్చును. కాల సర్పాన్ని ధరించియైన యుండవచ్చును. ఏనుగు తోలును చుట్టి కొనియైన ఉండవచ్చును. మంచి వస్త్రాన్ని దాల్చి యుండవచ్చును. కపాలాన్నైనా స్వీకరించి ఉండవచ్చును. శశాంక శేఖరుడైన కావచ్చును. ఇది ఈ విధంగానే ఉంటుందనే నిర్ధారణ లేదు.

ఆయన శరీరం తగలడం చేత చితా భస్మ రేణువైనా పావనం కావడం సత్యం. శివుడు తాండవం చేస్తున్న వేళ విరజిమ్మబడిన పాద రేణువులను దేవతలు "నేను ముందు నేను ముందు" అని ఒకరినొకరు తోసుకుంటూ త్రొక్కిసలాడుకుంటూ ఆ పాదరేణువులను శిరస్సుల పై ధరిస్తూ ఉన్నారు.

దరిద్రుడగు ఆ శివుడు వృషభ వాహనం పై ఎక్కివస్తుండగా గండ స్థలాలలో మద స్రావమవుతున్న ఐరావతాన్నారోహించి వస్తున్న ఇంద్రుడు ఆ స్వామి పాదార విందాలకు ప్రణామాలను ఆచరిస్తూ తల పై వికసించిన కల్ప వృక్షపు పూల పరాగములతో స్వామి పాదాలను పరిరంజితం చేస్తున్నాడు. దోషాలనే నీవు ఏకరువు పెట్టిన నీవు నష్టాత్ముడవైనా, నీవు కూడ శివుని గూర్చి ఒక మంచి మాట చెప్పావు. ఆత్మ అనేది లేదని వాదించే వారికి కూడ, కారణమని కీర్తింపబడు చున్నవాని జన్మాన్ని ఏ విధంగా గుర్తింపవచ్చును?

వివాదాలు దేనికి? నీవెటువంటి వాడని శివుని గూర్చి విన్నానో అటువంటి వాడే అగుగాక! అతని యందే నా మనస్సు లగ్నమై ఉంది. యథేచ్ఛగా సంచరించే వారికి నిందలతో పనేమి?

ఓసీ నెచ్చెలీ! ఈ వటువు మరల ఏదో మాట్లాడటానికి పెదవులు కదలిస్తున్నాడు. వారించు. మహాత్ముల్ని నిందించిన వారే కాదు దాన్ని విన్న వారు వారి కంటే పాపాలను మూట కట్టుకొంటారు. లేకుంటే, నేనే యిక్కడ నుండి వెళ్లుతాను. అని కోపంతో జారిన స్తన వల్కలంతో పార్వతి అక్కడ నుండి కదలింది. స్వస్వరూపంతో వృషరాజు కేతనుడైన శివుడు నవ్వుతూ ఆమె చేతిని పట్టుకున్నాడు.

హఠాత్తుగా శివుడు సాక్షాత్కరించడంతో పార్వతికి ఏం చేయాలో పాలుపోలేదు.

తం వీక్ష్య నేపథుమతీ సరసాంగ యష్టి
ర్నిక్షేపణాయ పదముద్ధృత ముద్వహన్తీ।
మార్గాలచలవ్యతికరాకులితేవ సింధుః
శైలాధిరాజతనయా నయయౌనతస్థౌ ॥

మనోరథం సాకారమై ఎదుట నిలబడి యుండగా కంపించుచున్న, చెమర్చిన శరీరంతో భూమి పై మరో అడుగు పెట్టాలని ఎత్తిన పాదం ఎత్తినట్లే అలాగే నిలిచిపోగా - ఒక నదీ ప్రవాహానికి ఒక పెద్ద పర్వతం అడ్డువడగా ఆ నది ఉక్కిరిబిక్కిరి యైనట్లు శైలాధి రాజ తనయ ముందడుగు వేయలేదు. నిలబడను లేదు. ఒక విలక్షణ లాస్య భంగిమతో నర్తకి వలె సౌందర్య లహరియై శృంగార మూర్తియైనది.

అద్య ప్రభృత్యవనతాంగి! తవాస్మి దాసః
క్రీత స్తపోభిరితి వాదిని చంద్ర మౌలౌ ।
అహ్నాయ సా నియమజం క్లమ ముత్ససర్జ
క్లేశః ఫలేన హి పునర్నవతాం విధత్తే ॥ (5 - 86)

సిగ్గుచే కుంచించుకు పోయి తల వంచి యున్నది పార్వతి! ఆమెను అవనతాంగీ! అని సంభోదిస్తూ శివుడిలా అన్నాడు - "ఈ రోజు మొదలుకొని నీకు తపస్సుచే కొనబడిన దాసుడను" అని శశిమౌళి అంటూండగానే పార్వతి తపః క్లేశాన్నంతా మరచి పోయింది. కష్టపడి ఫలితాన్ని సాధించినపుడు అది నూతనోత్సాహాన్ని కల్గిస్తుంది. క్లేశాన్ని మరిపింపజేస్తుంది.

**ఆచార్య గళ్ళా చలపతి**
**తెలుగు అధ్యయన విభాగం**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

పాఠం - 6

# పాఠ్యభాగం ఆధారంగా కాళిదాసు కవితా వైశిష్ట్య వివరణ

## ప్రస్తావన :-

శ్లో॥ పురా కవీనాం గణనా ప్రసంగే
కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసా ।
అద్యాపి తత్తుల్య కవేర భావాత్
అనామికా సార్థవతీ బభూవ ॥

ప్రాచీన కవుల్లో గొప్పకవి యెవ్వరని లెక్కపెట్టేటప్పుడు చిటికెన వేలి పై మొట్ట మొదటిగా లెక్కించదగిన వాడు మహాకవి కాళిదాసు. ఎందుకంటే, ఈ నాటికీ ఆయనతో సమానమైన కవి లేనందువల్లనే చిటికెన వేలు తర్వాత గల వేలికి 'అనామిక' అన్న పేరు సార్థకంగా నిలిచి పోయింది.

## పంచ మహాకావ్యాలు :-

సంస్కృత సాహిత్యంలో సంపూర్ణమైన పాండిత్యం గడించడానికి ప్రాచీనులు 'పంచ కావ్యాలను' అధ్యయనం చేసేవారు. ఆ పంచ కావ్యాలలో మొదటి రెండు కాళిదాసు రచనలే కావడం గమనింపదగింది.

1. కాళిదాస రఘువంశము
2. కాళిదాస కుమారసంభవము
3. భారవి కిరాతార్జునీయము
4. మాఘుని శిశుపాలవధ
5. శ్రీహర్షుని నైషధము

## బిరుదాలు :-

కాళిదాసుకు "కవికుల గురువు", "సకల కవి శిరోమణి", "మహాకవి", "కవీనాం కవిః" అనే బిరుదాలతో సాహితీ సహృదయులు, ఆలంకారికులు, వ్యాఖ్యాతలు తమ తమ గ్రంథాలలో పేర్కొన్నారు.

## రచనలు :-

కాళిదాసు ఎనిమిది రచనలు ప్రసిద్ధమైనవి.

1. శృంగార తిలకమ్
2. ఋతు సంహారమ్ } ఖండ కావ్యాలు
3. మేఘ సందేశమ్
4. రఘు వంశమ్
5. కుమార సంభవమ్ } మహా కావ్యాలు
6. మాళవికాగ్ని మిత్రమ్
7. విక్రమోర్వశయమ్ } నాటకాలు
8. అభిజ్ఞాన శాకుంతలమ్

## కాల నిర్ణయం :-

కాళిదాసు మాళవికాగ్ని మిత్ర నాటకంలో శుంగరాజైన పుష్యమిత్రుని అశ్వమేధాన్ని, ఆయన కుమారుడు అగ్నిమిత్రుని, మనుమడు వసుమిత్రుని పేర్కొనడం చేత ఈ అశ్వమేధం శుంగ వంశపు రాజుల ఉత్తరార్థ దశకు చెందిన కాలంలో అంటే క్రీ॥పూ॥ 110 - 55 మధ్య కాలంలో జరిగి ఉండాలి; అని చారిత్రకులు నిర్ణయించారు. మాళవిక, అగ్నిమిత్రుల ప్రణయ గాధను నాటకీకరించిన కాళిదాసు క్రీ॥పూ॥ 100 - 57 మధ్య కాలంలో జీవించి యుండవచ్చునని పరిశోధకులు భావిస్తున్నారు.

## ఆలంకారికుల నిర్ణయం :-

కాళిదాసు రఘువంశవతారికలో -

మందః కవియశః ప్రార్థీ గమిష్యామ్యుపహాస్యతామ్ ।
ప్రాంశులభ్యే ఫలే లోభాత్ ఉద్బాహురివ వామనః ॥

అని వ్రాశారు. "మంద బుద్ధియైన నేను కవిగా కీర్తి గడించాలని ఉవ్విళ్లూరడం హాస్యాస్పదమే అవుతుందేమో! ఒక పొడుగైన వాడికి చెట్టు పైన పండు అందినట్టుగా పొట్టివాడు చేతులెంత చాపినా అందదు కదా!"

'కవి' అనిపించుకోవడమే కష్టం! అని వినయంగా చెబుతూనే తాను కూడ ఒక 'కవి'నని భంగ్యంతరంగా తెలియజేశాడు కాళిదాసు. అటువంటి కాళిదాసుకు కాలాంతర కీర్తి దక్కిందే తప్ప, సమకాలీన కీర్తి లభించలేదు. ప్రజలు పాత పురాణాలను ఆదరించినంతగా, కొత్త కవిత్వాన్ని ఆస్వాదించి, ఆనందించే స్థితిలో లేరు. పైగా, దిగ్దంతులైన వాల్మీకి, వ్యాసులు రామాయణ మహాభారతాలనే ఇతిహాసాలను వ్రాశారు. ఈ ఐతిహాసికుల కేర్పడిన ప్రఖ్యాతి, ప్రసిద్ధిముందు కాళిదాసుకు కీర్తి రావడమనేది చాల కష్టం! అందుకే పై శ్లోకం అలా వ్రాశాడు కాళిదాసు. దానికి తగినట్లుగా ఆ రోజుల్లో ఆలంకారికులే నిజమైన విమర్శకులు. వారు గుర్తించిన వారినే లోకం గుర్తిస్తుంది. భరతుని తర్వాత మొట్ట మొదటి ఆలంకారికుడైన భామహుడు (క్రీ॥శ॥ 6వ సతాబ్ది) ఏం వ్రాశాడో చూడండి.

శ్లో॥ ముక్తకే కవయోఽనంతః సంఘాతే కవయశ్శతమ్ ।
మహా ప్రబంధేతు కవి రేకో, ద్వౌ దుర్లభాస్త్రయః ॥

"చాటు పద్యాలు, చమత్కారంగా ప్రాస్తావిక శ్లోకాలు వ్రాసే వాళ్ళు వందల కొలది ఉన్నారు. మహాకావ్య కవులు ఏ ఒకరో యిద్దరో! మూడవవాడు లేడు" అని వ్రాశాడు భామహుడు కావ్యాలంకారంలో - ఆ యిద్దరు మహా కవులెవ్వరంటే వాల్మీకి, వ్యాసుడు, వీరిద్దరే కవులైతే మఱి కాళిదాసాది కవుల గతియేమి? దీనికి సమాధానం లేదు.

అందుకే, ఆనంద వర్ధనుడు (క్రీ॥శ॥ 9వ శతాబ్దం) ధ్వన్యాలోకంలో భామహుని అభిప్రాయాన్ని సవరిస్తూ యిలా వ్రాశాడు.

"యేనాస్మిన్నతి విచిత్ర కవి పరంపరా వాహిని సంసారే
వ్యాస కాళిదాస ప్రభృతయః మహాకవయః ద్విత్రాః పంచషః వాగణ్యంతే"

ఈ ప్రపంచంలోని మిక్కిలి విచిత్రమైన కవుల పరంపరా ప్రవాహంలో ఏ యిద్దరో, అయిదుగురో మహా కవులుగా పరిగణింపబడుచున్నారు. వారే వాల్మీకి, వ్యాస, కాళిదాసాది కవులు. అని కాళిదాసును 'మహాకవి'గా గుర్తించి సాహితీ లోకంలో ప్రతిష్ఠించినాడు. అంటే కాలిదాసు చనిపోయిన 900 సంవత్సరాలకు 'మహాకవి'గా లోకంచేత గుర్తించబడినాడన్నమాట! కాళిదాసంతటి గొప్ప కవికే యింత కాలం పడితే మరి సాధారణ కవుల్ని ఆలంకారికులు కలలో కూడా స్మరించరు కాబోలు!

కాళిదాసు చెప్పింది నిజం. 'కవి' అనిపించు కోవడమే కష్టం! అందులో, 'మహాకవి' అనిపించుకోవడం మరింత కష్టం! అందుచేతనే, సహృదయులు ఆలంకారికుల్ని ప్రక్కకు నెట్టి, కాళిదాసును కనిష్ఠకాధిష్ఠితుడైన 'మహాకవి'గా గుర్తించి గౌరవించారు. 'కవికుల గురువు'గా కీర్తించారు. అటువంటి సహృదయ పరంపర చేతనే కాళిదాసు చిరంజీవిగా ప్రజల నాల్కలపై నివసిస్తున్నాడు. "కాళిదాసు, కవిత్వానికి పర్యాయపదం" "కవిత్వమంటే కాళిదాసుదే కవిత్వం" అనే సూక్తి ఏర్పడింది.

## కుమార సంభవ తత్త్వం :-

ధర్మ - అర్థ - కామ - మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలలో, అర్థ - కామాలు గృహస్థాశ్రమానికి చెందినవి. ధర్మంతో కూడిన అర్థం, ధర్మంతో కూడిన కామం అనుష్ఠించిన వారికే మోక్షం కరతలామలకమౌతుంది. చతుర్విధ ఆశ్రమాలలో -

1. బ్రహ్మచర్యం - ధర్మనిష్ఠ, నైతిక, శీల నిష్ఠ
2. గృహస్థాశ్రమం (గార్హస్థ్యం) - అర్థ, కామాలు ధర్మానుబంధంగా నడిపింపజేసే వ్యవస్థ. అందుకే భార్యను 'ధర్మపత్ని' 'సహధర్మచారిణి' 'అర్థాంగి' అంటారు. నాల్గు ఆశ్రమాలలో అత్యుత్తమమైనది.
3. వానప్రస్థం - సమాజానికి చేయవలసిన, సంతానానికి చేయవలసిన కర్తవ్యాలను నిర్వర్తించిన తర్వాత భార్యతో అరణ్య వాసం చేయడం. ధార్మిక, ఆధ్యాత్మిక చింతన, తపస్సు, వైరాగ్యం, భూతదయ యిత్యాది లక్షణాలను గల్గించే వానప్రస్థం ముముక్షు జీవితం వానప్రస్థం.
4. సన్న్యాసం - వానప్రస్థాశ్రమంలో ఉన్న కాలంలో కాల వశం చేత భార్య చనిపోతే సన్యాసాశ్రమాన్ని స్వీకరించడం. ఒక వేళ భర్త చనిపోతే సహగమనం చేయడమో లేక కుమారుని వద్దకు చేరడమో చేయాలి.

పార్వతీ పరమేశ్వరులు నిష్ఠతో నిండారిన బ్రహ్మచర్యాశ్రమం నుండి పవిత్రమైన గృహస్థాశ్రమంలో కాలు మోపడం జరిగింది. ఈ ఆది దంపతులు గృహస్థాశ్రమ స్వీకరణం లోక కళ్యాణానికి నాంది పలికింది. నిత్య తపస్వి, నిత్య జ్ఞాని ఆయనలో నిక్షిప్తమై ఉన్నాయి. ఆయన గృహస్థ తపస్వి. అర్థనారీశ్వరుడు - దక్షిణామూర్తి. ఇందులో అర్థనారీశ్వర తత్త్వం ఒక వైపు స్త్రీ పురుష ద్వంద్వ సమన్వయానికి గృహస్థాశ్రమ వైభవానికీ ప్రతీక! అందుకే కాళిదాసు రఘువంశ ప్రారంభంలో -

వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే!
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥

మనస్సు - బుద్ధి - అహంకారము - చిత్తము అనే అంతఃకరణచతుష్టయంలో సంకల్ప - వికల్పాత్మకమైన మనస్సును, చిత్తము చేత ఆలోచింపజేసి సత్సంకల్పాన్ని స్వీకరించడం, గృహస్థాశ్రమాన్ని గ్రహించి సత్సంతానాన్ని పొందడం - ఇవి రెండే భారతీయ సంస్కృతికి, పవిత్ర గృహస్థాశ్రమానికి జీవనాడి. కాళిదాసు భారతీయ సాంస్కృతిక మూల్యాలైన ఈ సత్సంకల్ప, సత్సంతానాల మీద ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించి వ్రాసిన మహా రచనలే రఘువంశ, కుమారసంభవ, అభిజ్ఞాన శాకుంతలములు. అందులో కుమార సంభవం - ఆది దంపతులు గృహస్థాశ్రమ స్వీకరణం, కుమారస్వామి జననం, తారకాసురసంహారం ధ్యేయంగా గల కథ.

## కామదహనం :-

దైహికమైన కామం దుష్టమైనది. తుచ్ఛమైనది. అది 'తృష్ణ' అనబడింది. ఈ జాంతవము, పాశవికమైన కామ భావనను దహనం చేయాలి. అందుకే, పశుపతి, మన్మథుని అసందర్భమైన చేష్టను శిక్షించి, కామాన్ని దహింపజేశాడు. కామ భావ దహనం చేత పవిత్రమైన ప్రేమ, శృంగార భావాలు వెల్లి విరిసాయి. "శృంగారః శుచిరుజ్జ్వలః" అని భరతుని నాట్యశాస్త్రం నిర్వచించింది. కామాన్ని శృంగారంగా, ప్రేమగా పరిణమింపజేయడమే తపస్సు. ధార్మిక నిష్ఠ కామం పురుషార్థాల్లో ఒకటైనప్పటికీ అది ధర్మకామమైనప్పుడే శృంగార రసంగా గుర్తింపబడుతుంది. ఆ ప్రేమానురాగాలే గృహస్థాశ్రమానికి పునాదులు. ఆది దంపతులు ఈ ప్రక్రియ ఎలా సాధ్యమౌతుందో చేసి చూపించారు.

సర్వజ్ఞుడైన శివుడు "కేనాపి కామేన తపశ్చచార" (కు॥సం॥ 1 - 57) ఏదో ఒక కోర్కెతో తపస్సు చేయడం దేనికి? కామదహనం చేసి పవిత్రమైన ప్రేమ తత్త్వాన్ని ప్రపంచానికి అందివ్వడానికి! పార్వతి కూడ పంచాగ్ని మధ్యంలో తపస్సు చేసి పవిత్రురాలైన తర్వాతనే సౌందర్యాన్ని తృణీకరించి, హృదయ సౌందర్యంతో ఉన్నప్పుడే శివుడు ఆమె తపోదీక్షకు దాసుడై ఆది గృహస్థుడై సత్సంతానాన్ని పొందాడు. ఇదే కుమార సంభవ తత్త్వం!

## కుమారుడనగానేమి? దంపతుల ప్రేమావిష్కారం :-

1. వేదాన్ని అనుసరించి 'కుమారు'డంటే నిత్యయౌవనుడు "యవిష్ఠ", యువకుడు (త్వం 'కుమార' ఉత వా కుమారీ, అస్యవామస్య పలితస్య హోతుతస్య) 'వామ' అనగా అందమైన నిత్యయౌవనావస్థ యందున్న, 'పలిత' మనగా ముసలితనము, వృద్ధాప్యదశ యందున్న అని వేదం ప్రతిపాదిస్తున్న అర్థాలు.
2. కు + మార = దుష్టత్వాన్ని, దుష్టశక్తులను నశింప జేసేవాడు అని పురాణాలలో చెప్పబడిన అర్థం.
3. 'మృ' ధాతువు యొక్క అర్థం చేత 'మృ = మార' (కు + మార) రక్కసులకు మృత్యువును శీఘ్రంగా యిచ్చేవాడని పురాణార్థం.
4. ఋ = 'గతౌ' అనే ధాత్వర్థం చేత ('కుమ్' + ఆర) స్వర్గము నుండి భూమి పై అవతరించిన వాడు అని మరొక అర్థం.
5. 'మార' - మన్మథుడు, కాముడు (కు + మార) 'ప్రేయసిని మన్మథ తాపంచే బాధించేవాడు'.
6. 'కుమార' - కోరదగినవాడు, ఆశలు రేకెత్తించేవాడు ఫల ప్రాప్తి వరకు వేచి ఉండేటట్లు చేసేవాడు. జగత్తును ప్రతి ఉదయం వినూత్నంగా భాసింపజేసేవాడు.

"క్లేశః ఫలేన హి పునర్నవతాం విధత్తే" అని కాళిదాసు పార్వతీ తపశ్చర్య శివుని సాక్షాత్కారంతో సఫలీకృతమైనప్పుడు చెప్పిన వాక్యమే కుమార సంభవ పరమార్థం. జగత్కంటకుడైన తారకాసుర సంహారానికి జనింపబోయే కుమారుని ఆవిర్భావానికి, అవతారానికి పార్వతీ పరమేశ్వరుల పవిత్రమైన ప్రేమానురాగ బంధం ఏర్పడిన తరుణమే కుమారుని ఆ గమనానికి నాంది పలికినట్లయింది. ఆ

ఘట్టం కుమార సంభవం 'పంచమ సర్గ'లోనే ఉండడం పార్వతీ తపశ్చర్య - శివానుగ్రహం రెండు ఘట్టాలు కుమార సంభవ కావ్యంలో అత్యంత కీలకమైనవి కావడం కావ్య పాఠకులు చేసుకున్న అదృష్టం! ఒక్కమాటలో చెప్పాలంటే పునరుజ్జీవించిన మన్మథుడే కుమారుడు, అతడు ప్రేమరసైకమూర్తిగా పునరుజ్జీవితుడగుచున్నాడు. ఈ కుమారుడు 'దేవసేనాని' యై 'వీర శృంగార రసావతారమూర్తి'గా పరిణమించబోతున్నాడు. తారకాసుర సంహారం కుమార స్వామి జననానికి పార్వంతిక ఫలం కాగా, కుమార జననం కావ్య ఫలం!

## కాళిదాసు కవితా సౌందర్యం - వైదర్భీరతి :-

శ్లో॥ తస్మాదాలోచితా శేష లోకశాస్త్రేణ ధీమతా ।
కర్తవ్యం కాళిదాసాదేః కావ్యానాం పరిశీలనమ్ ॥

"ఆలోచనాశీలురైన వారు, సమగ్రంగా లోకాన్ని, శాస్త్రాలను అవలోడనం చేసిన మేధావులు కాళిదాసాది కవుల కావ్యాలను పరిశీలించడం అవశ్య కర్తవ్యం" అని దండి పండితుని కావ్యాదర్శం.

పాశ్చాత్య మహాకవులలో జాన్ మిల్టన్ (John Milton) మహాకావ్య నిర్మాతగా ప్రసిద్ధుడు. ఆయనను గురించి Pattison అనే విమర్శకుడు - "An Appreciation of Milton is the last reward for consummate scholarship" "సమగ్రమైన పాండిత్యానికి గుర్తు మిల్టన్ మహాకవి కవిత్వాన్ని ప్రశంసించే స్థాయికి ఎదిగిరావడమే"నన్నాడు. ఆ దృష్టితో మనం భారతీయ వాఙ్మయంలో కవికుల గురువైన కాళిదాసును గూర్చి కూడ పై వాక్యాన్నే యిలా చెప్పవచ్చు. "An Appreciation of KĀLIDĀSA is the last reward for consummate scholarship". "ఒక మహా విమర్శకుని పాండిత్యానికి పరమావధి కాళిదాసు కావ్యాలను సమగ్రంగా అధ్యయనం చేసి అంతరార్థాన్ని ఆవిష్కరించడమే" అని చెప్పవచ్చు".

**వైదర్భీరతి :-** కాళిదాసు కవిత్వం వైదర్భీ రీతికి చెందిందని ఆలంకారికుల నిర్ణయం. ఓజః ప్రసాదాది సకల గుణాలతో కూడిందీ, వీణా నాదం వలె మధురంగా ఉండేది వైదర్భీ రీతి. గౌడీ, వైదర్భ, పాంచాలీ అనే రీతులలో విదర్భ దేశంలో పుట్టిన కవితారీతి (style)కే వైదర్భీ రీతి అని పేరు. తక్కినవి రెండూ గౌడ, పాంచాల దేశాలలో పుట్టాయి.

"వక్త ఉత్తముడు కావచ్చు. అర్థం ఉదాత్తమైనది కావచ్చు. వ్యాకరణ శుద్ధి ఉండవచ్చు. కాని, ఏది లేకపోతే వాక్కు తేనె లొలుకబోయదో అటువంటి కవితా రీతి ఒకటుంది - అదే వైదర్భీ రీతి" అన్నారు ఆలంకారికులు. ఆ శ్లోకమిది -

శ్లో॥ వచసి యమధిగమ్య స్యందతే వాచక శ్రీః
వితథ మవితథత్వం వస్తుయత్ర ప్రయాతి ।
ఉదయతి హినతాదృక్ క్వాపి వైదర్భ రీతౌ
సహృదయ హృదయానాం రంజకః కోऽపి పాకః ॥

దేన్ని పొందడంచే వాక్యంలో శబ్ద శోభ ప్రకాశిస్తుందో, దేనిలో సారహీనమైన వస్తువు సైతం సారవంతంగా కనబడుతుందో అటువంటి సహృదయ హృదయ రంజకమైన ఒకానొక పాకం వైదర్భీ రీతిలో ఉదయిస్తుంది.

ఒక్క వాక్యంలో చెప్పాలంటే బంధ పారుష్యం లేనిదీ, శబ్ద కాఠిన్యం లేనిదీ, దీర్ఘ సమాసాలు లేనిదీ అయిన కవిత్వమే వైదర్భీ రీతికి ఉదాహరణమౌతుంది.

మహాకవి దండి కావ్యాదర్శమనే అలంకార శాస్త్ర గ్రంథంలో కాళిదాసు కవిత వైదర్భీ రతికి ఉదాహరణమన్నాడు.

శ్లో॥ లిప్తా మధుద్రవేణాసన్ యస్య నిర్విషయా గిరః।
తేనేదం వర్త్మ వైదర్భ్యం కాళిదాసేన శోభితమ్ ॥

సర్వ సాధారణమైన మాటలను సైతం తేనెలొలికే పలుకులుగా రంగరించి ఎవరు సమర్పిస్తున్నారో, అటువంటి కాళిదాసు వైదర్భీ రీతిని మరింతగా శోభింప జేసినాడు.

'వైదర్భీ రీతి'కి కాళిదాసు కవితా సౌందర్యానికి 'పంచమ సర్గ'లోని రెండు, మూడు శ్లోకాలను పరిశీలిద్దాము. సుకుమారియైన పార్వతిని కఠిన తపో వ్రతం నుండి నివారించడానికి తల్లి మేనకాదేవి ప్రయత్నిస్తున్న సందర్భం. ఇక్కడ కాళిదాసు వ్రాసింది ఒకే ఒక శ్లోకం! రెండవ శ్లోకంలో పార్వతి నిర్ణయం చెప్పబడింది. ఇంకొక కవియైతే ఈ ఘట్టంలో కనీసం పది పన్నెండు శ్లోకాలు సునాయాసంగా వ్రాసి వుండేవాడు. వైదర్భీరీతి గల కవి ఒక్కడే పది శ్లోకాల విషయాన్ని ఒక్క శ్లోకంలో చెప్పగలడు. ఆ శ్లోకమిది -

మనీషితాః సంతి గృహేషు దేవతాః
తపః క్వవత్సే? క్వచ తావకం వపుః? ।
పదం సహేత భ్రమరస్య పేలవం
శిరీష పుష్పం నపునః పతత్రిణః ॥ (5 - 4)

"కోరిన కోర్కెలు తీర్చే దేవతలు మన యింటనే ఉన్నారు కదమ్మా! నా చిట్టితల్లీ! నీవెక్కడ? పరమ కఠోరమైన తపోవ్రత దీక్ష ఎక్కడ? అతి సుకుమారమైన దిరిసెన పువ్వు పై తుమ్మెద వాలితే ఓర్చుకోగలదు గాని అదే ఒక పక్షి వచ్చి వాలితే సహించ గలదా?" అని సూటిగా అడిగింది.

హిమాలయ పర్వతమే దేవాధి దేవతలకు నిలయం. అక్కడ లేని దేవతలా? దీన్ని 'నిశ్చయ వాక్యం'గా చేసి 'మనయింటిలోనే దేవతలందరూ ఉన్నారు' అని ఘంటా పథంగా చెప్పడం అందులో శివుడు కూడా అంతర్భవిస్తున్నాడు. మరి ప్రత్యేకించి ఆ శివుని కోసం తపస్సు చేయడం దేనికి? అని చెప్పకుండా "మన యిల్లే దేవతలకు నిలయం" అనడం గొప్ప ఆలోచనా శీలత్వం గల్గిన వ్యక్తి అనే మాట. హృదయ పరిపక్వత (maturity of mind) గల వ్యక్తిగా మేనకాదేవిని చిత్రీకరిస్తున్నాడు కాళిదాసు.

తర్వాత రెండు చిన్న ప్రశ్నలు. తపస్సెక్కడ? నీ శరీరమెక్కడ? అంటే 'ఇవి రెండూ ఒక దానికొకటి పొంతన లేని విషయాలు' అని చెప్పడం. ఏ విధంగా? అని ప్రశ్న! ప్రశ్న నుండి ప్రశ్న పుట్టిస్తున్నాడు కవి. దానికి సమాధానం ఆ పాత్ర చేతనే చెప్పించడంలో ఆ "పొంతన లేనితనం" బయట పెట్టడంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఒక్క విషయానికే రెండు ఉపమానాలు.

1. అన్వితోపమానం - సమత్వం
2. అనన్వితోపమానం - విషమత్వం - విషమాలంకారం

సుకుమారమైన [ పేలవం
పార్వతి శరీరం - దిరిసెన పువ్వు [ శిరీష పుష్పం ]

అన్వితోపమానం — అనన్వితోపమానం
భ్రమరం (తుమ్మెద) — పతత్రిణః (పక్షి)

ఇక్కడ సహేతుక ప్రయోగం చేత కావ్య సౌందర్యాన్ని కూడ సంపాదించాడు కవి. 'భ్రమర'మంటే పరిభ్రమిస్తూ ఉంటుంది. ఏ పుష్పంలోనైతే మకరంద ముంటుందో దాని పై వ్రాలేది భ్రమరం. దానికి రెక్కలుంటాయి. అవి చాల చిన్నవి, తేలికైనవి.

'పతత్రిణః' అంటే పక్షి పెద్ద రెక్కలు గల పక్షినే పతత్రిణ మంటారు. అది పుష్పం మీద వాలదు. వాలితే పుష్పం నలిగి నశించిపోతుంది.

ఈ రెండు ఉపమానాల చేత కవి ఏమి సాధించాడు? అని ప్రశ్నిస్తే - సుకుమారమైన శిరీషం తుమ్మెద వాలితే సహించగలదు. అంటే - తుమ్మెద ఎటువంటిది?

మాలకరి పుష్పములు కోయుమాడ్కి
తేటి, పువ్వుదేనియకొనియెడుపోల్కి
ఎదిరి కందకుండ కొనునది కార్య ఫలము
బొగ్గులకు బోలె మొదలంట బొడువ జనదు

అని మహాభారతంలో విదుర నీతి.

'ధర్మ సాధనాల్లో ఆద్యమైన సాధనం శరీరమే' అని శివుడు (శరీర మాద్యంఖలు ధర్మ సాధనమ్ - కుమార సంభవం 5-33) కూడా పార్వతికి ఉపదేశించాడు. కార్య సాధకుడైనవాని లక్ష్యమేమంటే తను కందకుండ / ఎదుటి వాడు కందకుండా ఫలితాన్ని సాధించడం. తుమ్మెదలాగా నీవు తెలివిగా తేలికైన మార్గంలో సూక్ష్మంలో కార్య ఫలాన్ని సాధించరాదా? అని 'తుమ్మెద'ను ఉపమానంగా గ్రహించడంలో గల స్వారస్యం.

అలా కాకుండా "బొగ్గులు కోసమని చెట్టునే కాల్చి వేయడం" 'తన్ను మాలిన ధర్మము మొదలు చెడ్డ బేరం' లాంటిది. అంటే ఘోరమైన తపస్సు - 'పక్షి'తో పోల్చబడింది. కఠోర తపస్సు 'బరువుతో కూడిన పని' కాబట్టి పక్షితో పోల్చడంలో ఔచిత్యం పాటింపబడింది. సుకుమారమైన శరీరం బరువైన, కష్టమైన పనులు చేయజాలదు అని మేనకాదేవి తీర్మానం.

అలా చేస్తే ఏమౌతుంది? బొగ్గుల కోసం చెట్టునే కాల్చి వేసే మూర్ఖునిలాగా, కఠోర తపస్సనే గొప్ప బరువైన పక్షిని నెత్తికెత్తుకొంటే, దాని క్రిందపడి నలిగి నశించి పోవడమే శిరీష పుష్పానికి పట్టే గతి. అంటే శరీరమే నశిస్తుంది. ఆ తర్వాత కార్య ఫలాన్ని అనుభవించేదెవరు? అని ప్రశ్న! ఇలా జీవితం ప్రశ్నార్థకంగా చేసుకోకుండా సజావుగా ఆలోచించి తేలికైన మార్గంలో కార్య సాఫల్యాన్ని కైవసం చేసుకో! అని తల్లి మేనక హితోపదేశం చేసింది.

ఇక్కడ శిరీష పుష్పంతో పార్వతి శరీర సౌకుమార్యాన్ని వ్యంజింపజేసే శబ్దం ప్రయోగించడం కేవలం అనాలోచితంగా చేసింది కాదు. కుమార సంభవం ప్రథమ సర్గ - 41వ శ్లోకంలో పార్వతీ దేవి సౌందర్య వర్ణన చేస్తూ -

**శిరీష పుష్పాధిక సౌకుమార్యౌ** బాహూ తదీయా వితిమే వితర్కః ।
పరాజితే నాపి కృతౌ హరస్య యౌ కంఠపాశౌ మకరధ్వజేన ॥

నవ యౌవనవతియైన పార్వతీ దేవి బాహువులు దిరిసెన పువ్వుల కంటె కోమలంగా ఉన్నాయి. పూల బాణాలు వేసేమన్మథుడు శివుని విషయంలో కార్య సాధకుడు కాకపోయినప్పటికీ, ఈమె శిరీష పుష్పాధిక సౌకుమార్యం గల బాహువులతో, శివుని కంఠాన్ని చుట్టుకొనేలా చేసి మన్మథుడు జయించాడు. అని కాళిదాసు మొదటనే 'శిరీష పుష్ప సౌకుమార్యం గల నీవు జయించి తీరుతావు' అని భంగ్యంతరంగా మేనకాదేవి ముఖతః భవిష్యత్కథను ధ్వనింపజేశాడని చెప్పాలి.

ఇలా, బహ్వర్థ సంగ్రహీకరణం చేయడం 'వైదర్భీ రీతి'లో ఒక భాగంగా కాళిదాసు కవితా సౌందర్యాన్ని సాధిస్తున్నాడు.

ఈ విధంగానే శివుడు కపట వటువుగా పార్వతి తపో వనానికి వేంచేసినపుడు ఒక్క శ్లోకంతోనే సరి పెట్టాడు కాళిదాసు. ఇతర కవులైతే శివుడు 'మాయా వటువు'గా వచ్చిన ఘట్టం కాబట్టి పని గట్టుకొని కనీసం పది శ్లోకాలైనా వ్రాసేవారు. ఒక్కటే ఒక్క శ్లోకంతో

శివుడు కపటి వేషధారి అనే అనుమానం రాకుండా అత్యంత సహజంగా అతడు 'నిజమైన బ్రహ్మచారియే' అనే భావం కలిగే విధంగా వర్ణించాడు.

అథా జినా షాఢధరః ప్రగల్భ వాగ్జ్వలన్నివ బ్రహ్మమయేన తేజసా ।
వివేశ కశ్చిజ్జటిలస్త పోవనం శరీరబద్ధః ప్రథమాశ్రమో యథా ॥

ప్రథమాశ్రమ మంటే - బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసము లనే చతుర్విధ ఆశ్రమాలలో - బ్రహ్మచర్యమనే ప్రథమాశ్రమం.

"శరీరబద్ధః ప్రథమాశ్రమోయథా" అంటే - మూర్తీభవించిన బ్రహ్మచర్యాశ్రమమా? అనేటట్లు - ఎక్కడా కాసంతైన అనుమానం రాకుండ - నిజమైన బ్రహ్మచారి వలెనే శివుడు పార్వతి తపోవనానికి వచ్చాడు - అని బ్రహ్మచారి కుండవలసిన లక్షణాలన్నీ ఏకరువు పెట్టాడు.

1. అజినాషాఢ ధరః - ఎ) జింక తోలును ధరించిన వాడు
   బి) మోదుగు కర్రను పట్టుకున్న వాడు

2. ప్రగల్భవాక్ - "బ్రహ్మచారీ శత మర్కటః" అనే లక్షణం కొంత కనబడేటట్లు వాచాలత్వ ప్రదర్శన 'ప్రగల్భ వాక్కు' ఎందుకంటే, 'కపట వటు' లక్షణంలో ప్రగల్భత ఒక గుణం కూడా.

3. జ్వలన్నివ బ్రహ్మమయేన తేజసా - అగ్ని జ్వాల వలె ప్రకాశిస్తున్న బ్రహ్మ తేజస్సుతో నున్న ముఖ మండలం గలవాడు. శివుని అష్ట మూర్తులలో అగ్ని ఒక్కటి. అగ్నికి తపస్సుకు అవినాభావ సంబంధం. శివుడు తపోమూర్తి. పార్వతి పంచాగ్ని మధ్యంలో తపస్సు చేసింది.

ఈ నాల్గు లక్షణాలే చాలు అతడు 'మూర్తీభవించిన బ్రహ్మచర్యాశ్రమం' అని చెప్పకనే చెబుతుంది. వైదర్భీ రీతికి ఈ శ్లోక రచన శైలి ప్రకృష్టమైన ఉదాహరణం.

పార్వతితో సంభాషిస్తూ కపట వటువు చెప్పిన శ్లోకం ఒకటి (కు॥సం॥ 5 - 41) వైదర్భీ రీతికే కాదు, కాళిదాసు కవితా సౌందర్యానికి తార్కాణంగా నిలుస్తున్నది.

కులే ప్రసూతిః ప్రథమస్య వేధసః
త్రిలోక సౌందర్య మివోదితం వపుః ।
అమృగ్యమైశ్వర్య సుఖం నవం వయః
తపః ఫలం స్యాత్కిమతః పరం వద ॥ (కు॥సం॥ 5 - 41)

పుట్టింది ప్రథమ ప్రజాపతి వంశంలో. 'కర్దముడు' ప్రథమ ప్రజాపతి (కర్దమః ప్రథమస్తేషాం - వాల్మీకి రామాయణం, అరణ్య కాండ) కర్దమ ప్రజాపతినే బ్రహ్మ అంటారు. అంటే బ్రహ్మ కులంలో అని అర్థం. రూపమా! త్రిలోక సౌందర్యం రాశి పోసినట్లు! ఐశ్వర్య సుఖమా! అన్వేషించవలసిన అవసరం లేదు. ప్రాయమా! నవ యౌవనం! ఇన్ని ఉత్కృష్ట లక్షణాలు ఒక్క చోట లభ్యమవుతుండగా వేరుగా యింకా సాధింపవలసినదేమై ఉంటుంది? మరి, ఈ తపస్సెందుకు చేస్తున్నట్లో! తెలియడం లేదు.

శివునికి పార్వతి విషయంలో అన్నీ యిష్టమైనవేనని తెలుస్తున్నది. తనకు తెలుసు పార్వతి దేనికోసం తపస్సు చేస్తున్నదో! ఏమీ తెలియనట్లు తనకు నచ్చిన అంశాలన్నీ ఏకరువు పెట్టి, అయ్యో! తపస్సు చేసి తన శారీరక సౌందర్యాన్ని కోల్పోతున్నదే, అనే విచారంతో ఆ మాట ఆమె నోటితోనే వినాలని ప్రశ్నిస్తున్నాడు ప్రగల్భ వాగ్విశారదుడైన కపట వటువు.

ఈ శ్లోకంలో చివరి పాదం అత్యంత కీలకమైంది. "తపః ఫలం స్యాత్కిమతః పరం వద!" - "ఏ ఫలాన్ని ఆశించి యీ తపస్సు చేస్తున్నట్లో చెప్పు!" అని తపః ఫలాన్ని యిచ్చేవాడే వచ్చి ప్రశ్నించడం ఎంత చమత్కారంగా ఉంది! ఫలాన్ని యివ్వడం కాదు తానే దానికి ఫలం కాబోతున్నాడు. ఆ మాటను కూడ భంగ్యంతరంగా శివుడు చెప్పనే చెప్పాడు.

దానికి ముందు ఒక విషయం చెప్పాలి. శివుడు సతీదేవి మరణించిన తర్వాత తపోమూర్తి కావడాన్ని గురించి వర్ణిస్తూ -

తత్రాగ్ని మాధాయ సమిత్సమృద్ధం
స్వమేవ మూర్త్యంతర మష్టమూర్తిః ।
స్వయం విధాతా తపసః ఫలానాం
కేనాపి కామేన తపశ్చచార ॥ (కు॥సం॥ 1 - 57)

ఇతరులు చేసే తపస్సులకు ఫలాన్ని అనుగ్రహించేవాడైన శివుడే మనసులో ఏదో కోరికతో తపస్సుకు పూనుకున్నాడు! అటువంటి శివుడు, పార్వతితో "నీవు దేనికోసం తపస్సు చేస్తున్నావు?" అని ప్రశ్నించడం, తాను దేని కోసం తపస్సు చేశాడో దానికోసమే ఆమె కూడ చేస్తున్నది అని తెలిసి కూడా ప్రశ్నించడం ప్రగల్భ వాగ్విశేషంలోని విశేషం.

పార్వతికి తన తపస్సు లోని సగ భాగాన్ని యిస్తాననడం పైకి 'తపస్సు' చాలించు! నీవు తపస్సు చేయవలసిన అవసరమే లేదు. నీ కోసమే నేను చేయాలి, చేశాను, చేస్తున్నాను కూడా! అని పరోక్షంగా సమాధానం చెప్పి ప్రత్యక్షంగా ప్రశ్నలు వేసి ఆమె చేత సమాధానాలు రాబట్టడం మాయా వటువు ప్రగల్భ వాగ్వైలక్షణ్యంలోని వైలక్షణ్యం

కియచ్చిరం శ్రామ్యసి గౌరి! విద్యతే
మమాపి పూర్వాశ్రమ సంచితం తపః ।
తదర్థ భాగేన లభస్వ కాంక్షితం
వరం తమిచ్ఛామి చ సాధు వేదితుమ్ ॥ (కు॥సం॥ 5 - 50)

ఓ గౌరీ! యింకెంత కాలం తపస్సు చేసి బడలిపోతావు. నా వద్ద పూర్వాశ్రమంలో సంపాదించిన తపస్సు ఉంది. అందులో సగ భాగం నీకిస్తాను. నీవు తపస్సు చేయడం మానుకో. ఆ తపశ్శక్తితో కోరిన కోర్కె ఏదో సాధించుకో! అనడంలో ఎంతో బుద్ధి చాతుర్యాన్ని ప్రదర్శించినా తాను మాయా వటువుననే మాట మరచిపోయి బయటపడ్డాడు శివుడు.

1. "నీకు నా తపస్సులో సగ భాగం యిస్తాను" అనడం నిన్ను నేను "అర్ధాంగి"ని చేసుకుంటాను. "అర్ధనారీశ్వరుడనవుతాను" అనే ధ్వని యిమిడి ఉంది.

2. ఆ తపస్సు పూర్వాశ్రమ సంచితమనడం ఎలా పొసగుతుంది? కపట వటువు తపో వనాన్ని ప్రవేశిస్తున్నప్పుడు కవి ఏమన్నాడు? శరీర బద్ధః ప్రథమాశ్రమో యథా ప్రథమా శ్రమం అంటే బ్రహ్మచర్యం. మూర్తి కట్టిన బ్రహ్మచర్యాశ్రమమో అన్నట్లుగా ఉన్నాడు శివుడు. మొదటి ఆశ్రమంలోనే ఉన్నవాడికి పూర్వాశ్రమం ఎలా ఉంటుంది? బ్రహ్మచర్యానికి ముందు ఏ ఆశ్రమమూ లేదే! కాబట్టి, శివుడు యిక్కడ పార్వతి మీద ఉత్కటమైన ప్రేమతో తను ప్రచ్ఛన్నుడుగా వచ్చానన్న సంగతి మరచిపోయి నిజం బైట పెట్టేశాడనే చెప్పాలి. అందుకే చివరలో - "తవాస్మి దాసః క్రీతస్తపోభిః" (కుమార సంభవం 5 - 86) "నీ తపస్సుకు దాసుడనయ్యాను. నీవు తపస్సుచే నన్ను కొనేశావు" అంటాడు శివుడు, పార్వతితో.

ఇలా ఒకరి కోసం ఒకరు పరస్పరం తపస్సు చేసి, పవిత్రమైన ప్రేమను లోకానికి తెలియజేసిన వారే పార్వతీ పరమేశ్వరులు.

వాగర్థా వివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ।
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥ (రఘు। 1)

పార్వతీ పరమేశ్వరులు శబ్దార్థాల వలే కలిసి యున్నారు. శబ్దాన్ని విడిచిన అర్థం కాని, అర్థాన్ని విడిచిన శబ్దం కాని ఉండదు. "శివాచ శివశ్చ శివౌ పుమాన్ స్త్రీ ఇత్యేక శేషః" దీని చేత కూడ పార్వతీపరమేశ్వరులు నిత్య సంబంధం ఐక్యం సూచితం.

పరస్పర తప స్సంపత్ఫలాయిత పరస్పరౌ ।
ప్రపంచమాతా పితరౌ ప్రాంచౌ జాయాపతీ స్తుమః ॥

1) ఒకరి కోసం ఒకరు పరస్పరం తపస్సు చేసి ఏకత్వ సిద్ధినందిన వారు.
2) ఈశ్వరుని తపస్సు విడిచి ఈశ్వర తపః ఫలం ఉండదు. కాగా, ఈశ్వరుని తపస్సు, ఆ తపః ఫలరూపమైన పార్వతికి అవినాభావ సంబంధం.
3) పార్వతీ తపస్సు, ఆమె తపః ఫలరూపమైన పరమేశ్వరునితో అభిన్నమైనది. ఈ విధంగా 'పార్వతీ పరమేశ్వర సంబంధం విడదీయరాని ఐక్య సంబంధం' గలది. అని నిశ్చయింపబడింది.

భగవత్పాదుల శ్రీ ఆది శంకరుల 'శివానందలహరి' మొదటి శ్లోకమే, కాళిదాసు కుమార సంభవ 'పంచమ సర్గ'కు వ్యాఖ్యానం.

కలాభ్యాం చూడాలంకృత శశి కలాభ్యాం **నిజ తపః**
**ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం** భవతుమే ।
శివాభ్యా మస్తోక త్రిభువన శివాభ్యాం హృది పున
ర్భ వాభ్యా మానంద స్ఫుర దనుభవాభ్యాం నతిరియమ్ ॥

శివుడు తన తపస్సుకు తానే ఫలాన్ని 'పార్వతి' గా ప్రకటించుకున్నాడు. (నిజ తపః ఫలం - పార్వతి), ఆయన అందరి తపస్సులకు ఫలాన్ని అనుగ్రహించే వాడు కాబట్టి భక్తురాలైన పార్వతి తపస్సుకు తానే ఫలంగా అనుగ్రహించాడు, ప్రకటించాడు. (భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం పార్వతీ తపస్సుకు ఫలం - శివుడు) ఈ విధంగా ఒకరి తపస్సుకు ఒకరు ఫలమై పరస్పరం ఆది దంపతులై, శబ్దార్థాల వలె నిత్య సంబంధం గలవారై, అర్థనారీశ్వరులై, లోక కల్యాణ్యాన్ని ప్రసాదించిన ప్రేమ రసైక మూర్తులు పార్వతీ పరమేశ్వరులకు నమస్కారము.

## ఉపమా కాళిదాసస్య :-

ఉపమా కాళిదాసస్య భారవేరర్థ గౌరవమ్ ।
దండినః పదలాలిత్యం, మాఘే సంతి త్రయోగుణాః ॥

అని ప్రాచీనుల సూక్తి! 'చిత్రమీమాంసా' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని వ్రాసిన అప్పయ్య దీక్షితుల వారు 'ఉపమాలంకారం' యొక్క గొప్పతనాన్ని యిలా ప్రశంస చేశారు.

**శ్లో॥** ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్ర భూమికా భేదాన్ ।
రంజయతి కావ్య రంగే నృత్యంతీ తద్విదాం చేతః ॥

'ఉపమ' అనే నర్తకి వివిధాలైన విచిత్ర వేషాలు ధరించి కావ్య రంగ స్థలంలో తన విన్యాత్న నృత్య భంగిమలను ప్రదర్శిస్తూ సహృదయులైన పాఠకుల చిత్తములను రంజింప చేస్తూ ఉంది.

ముఖము చంద్రుని వంటిది. అన్నపుడు చంద్రునిలోని ఆహ్లాద కరత్వం, కాంతిమత్వం, వర్తులత్వం అనే పోలికలు ముఖంలో కూడ కనబడడం చేత చక్కని ఈ సాదృశ్యాన్ని బట్టి "చంద్ర ఇవ ముఖమ్" అన్న వాక్యం - ఉపమాన, ఉపమేయ, ఉపమావాచక, సాధారణ ధర్మాలనే నాల్గు అంగాలతో 'పూర్ణోపమ' అవుతున్నది.

ఉపమాలంకారంలోని వాక్య రీతిని మారుస్తూ పోవడం చేస్తే వివిధాలంకారాలు ఉత్పన్నమౌతాయి. ఈ విధంగా అన్ని అలంకారాలకు తల్లి ఉపమ. అందుకే, అప్పయ్య దీక్షితులు - ఈ ఉపమా తత్త్వజ్ఞానం చేత, తత్త్వజ్ఞానం చే చరాచర ప్రపంచ జ్ఞానం కరతలామలకమయ్యేటట్లుగా, అలంకార ప్రపంచం చిత్ర విచిత్రంగా కనబడుతుంది అంటూ -

శ్లో॥ తదిదం చిత్రం విశ్వం బ్రహ్మ జ్ఞానా దివోపమా జ్ఞానాత్ ।
జ్ఞాతం భవతీ త్యాదౌ నిరూప్యతే నిఖిల భేద సహితా సా ॥

ఉపమాలంకారం అన్ని అలంకారాలకు మొదటిది. దీని విభిన్న రూపాలే అనన్వయాద్యలంకారాలుగా రూపొందినాయని, ఈ ఉపమా జ్ఞానంచే బ్రహ్మ జ్ఞానం చేత వలె విశిష్ట విశ్వం చిత్రంగా అవగతమౌతుందనే విషయం వ్యక్తమైనది.

ఉపమాలంకారంలో సాదృశ్యం - కీలకమైంది. అంటే చక్కని పోలిక చెప్పడం. ఇదే ఉపమకు సర్వస్వం. ఈ పోలికను రెండు భిన్న వస్తువుల మధ్య చూడగల్గినపుడే ఆ వస్తువులోని సామ్యరూప జ్ఞానం అవగతమౌతుంది. ఈ సాదృశ్య జ్ఞానం ఉపమాలంకార తత్త్వ జ్ఞానం చేతనే **"బ్రహ్మజ్ఞానాదివోపమాజ్ఞానాత్"** అని అప్పయ్య దీక్షితులన్నారు.

ఈ విచారణ చేత కాళిదాసు మహాకవికి గల ఉపమాలంకార తత్త్వజ్ఞానమే బ్రహ్మజ్ఞానం గా పరిణమించినదని చెప్పవచ్చును. కాళిదాసు తన కావ్యాలలో గ్రహించిన చరాచర వస్తు సంతతి కూడా పై అంశానికి ఉపోద్బలకంగా ఉంది. చరాచర ప్రకృతినంతటినీ తన కావ్యదర్పణంలో ప్రతి ఫలింప చేసిన మహాకవి కాళిదాసు బ్రహ్మ జ్ఞానియే అని చెప్పవచ్చు.

న వేద్మి స ప్రార్థిత దుర్లభః కదా
సఖీభి రస్రోత్తర మీక్షితా మిమామ్ ।
తపః కృశా మభ్యుపపత్స్యతే సఖీం
వృషేవ సీతాం తదవ గ్రహక్షతామ్ ॥ (కు॥సం॥ 5 - 61)

ఎంత ప్రార్థించినప్పటికీ దుర్లభుడుగానే మిగిలిపోయిన ఆ స్వామీ, ఈ విధంగా తపస్సు చేత కృశించి మాచేత కన్నీరు పెట్టిస్తున్న ఈ మా నెచ్చెలిని అనావృష్టిచే దెబ్బతిని బీటలు వారిన నాగేటిచాలును నల్లని మేఘం వలె ఎప్పటికి కనికరం చూపదలచుకున్నాడో తెలియడం లేదు.

1. ఉపమానం - నల్లని మేఘం - శివుడు
2. ఉపమేయం - నాగేటి చాలు - పార్వతి
3. ఉపమా వాచకం - 'ఇవ' (వలె)
4. సాధారణ ధర్మం - వర్షము, పంట

అనావృష్టిచే దెబ్బతిన్న నాగేటి చాలు వంటిది పార్వతి కాగా ఆ నాగేటి చాలు పై నల్లనిమేఘం వంటి శివుడు వర్షించడం చేత భూమి సస్య శ్యామలమౌతుంది. ఈ ఉపమాలంకారం చేత ఆకాశము తండ్రి - అవని తల్లిగా చెప్పబడింది. ద్యావా పృథ్వీ దాంపత్యం ఈ ఉపమాలంకారం చేత స్థాపించబడుతున్నది.

ద్వయం గతం సంప్రతి శోచనీయతాం
నమాగమ ప్రార్థనయా పినాకినః ।
కలాచ సా కాంతిమతీ కలావత
స్త్వ మస్య లోకస్య చ నేత్ర కౌముదీ ॥ (కు॥సం॥ 5 - 71)

కపట వటువు పార్వతిని యిలా ఉపాలంభన చేస్తున్నాడు. ఇది పైకి నిందగా కనబడినా భంగ్యంతరంగ స్తుతియే "ఓ పార్వతీ! నీవు ఆ కపాలధారియైన శివుని ప్రేమించి ఉండటం చేత ఇప్పుడు రెండు అంశాలు శోచనీయ దశకు వచ్చి ఉన్నాయి. 1. శివుని శిరస్సు పై చేరిన కాంతిమంతమైన చంద్రకళ, 2. ఈ రేడు లోకాలకే కన్నుల వెన్నెలవైన నీవు.

శివుడు కపాలధారి, శ్మశాన వాసి యని తెలిసికూడా వ్యోమకేశుడైన ఆ శివుని శిరస్సును 'కలావతి' యనే పేరు గల (చంద్రుని కళలలో 16వ భాగం) చంద్రరేఖ - (వంక జాబిల్లి) చేరినది. అది సమగ్రంగా లేదని సంపూర్ణ చంద్ర కళ వంటి (16 కళలు గల చంద్రుడు) షోడశ కళలతో విరాజిల్లే ముఖ మండలం గల నీవు ఆయనను చేరుతున్నావు. ఆహా! ఆ శివుని అదృష్టమే అదృష్టం! తలపై నెలవంక, వామాంకంపై షోడశ కళాత్మికా చంద్ర ముఖియైన పార్వతీ దేవి! వెండి కొండ పండు వెన్నెలలో ప్రకాశించుచున్నది.

1. ఉపమానం - చంద్రకళ (కళావతి)
2. ఉపమేయం - పార్వతీ ముఖమండలం
3. ఉపమా వాచకం - లుప్తం
4. సాధారణ ధర్మం - కాంతిమతి, నేత్ర కౌముదీ 'వెన్నెల'

తం వీక్ష్య వేపధుమతీ సరసాంగయష్టి
ర్నిక్షేపణాయ పదముద్ధృతముద్వహంతీ ।
మార్గాచల వ్యతికరాకులితేవ సింధుః
శైలాధిరాజతనయా నయయౌ న తస్థౌ ॥ (కు॥సం॥ 5 - 85)

మనోరథం సాకారమై ఎదుట నిలబడి యుండగా కంపిస్తున్న శరీరంతో చెమర్చిన శరీరంతో భూమి పై మరో అడుగు పెట్టాలని ఎత్తిన పాదం ఎత్తినట్లే అలాగే నిలిచిపోగా - ఒక నదీ ప్రవాహానికి ఒక పెద్ద పర్వతం అడ్డుపడగా ఆ నది ఉక్కిరిబిక్కిరి యైనట్లు పర్వత రాజు కుమార్తె పార్వతీదేవి ముందడుగు వేయను లేదు, నిలబడను లేదు. ఒక విలక్షణ లాస్య భంగిమతో నర్తకీ మణి వలె సౌందర్యలహరియై శృంగార మూర్తియైనది.

నదీ ప్రవాహానికి కొండలు అడ్డుపడడమనేది ప్రకృతి సహజమే. పైగా యిక్కడ ఈమె పర్వత రాజ తనయ (శైలాధి రాజ తనయ) ఆమె యిక్కడ స్త్రీ కనుక నదితో పోల్చబడింది. శివుడు హిమాలయాల పై తపస్సు చేసుకొనే ఒక యోగి, అతడు పురుషుడు కనుక కొండతో పోల్చబడినాడు. ప్రసిద్ధమైన గిరికా వసురాజుల కథ లోని సామ్యమిక్కడ అనుసంధేయం. ఈ కథను 'వసుచరిత్ర'గా రామరాజ భూషణుడు వ్రాశాడు. ఒక నదీ ప్రవాహానికి అడ్డుపడిన కొండ వాటి యొక్క కథ - వసుచరిత్ర.

నదులు, కొండలు ఉన్నంత కాలం రామకథ ఉంటుంది అన్నాడు వాల్మీకి. నదులకు, కొండలకూ అవినాభావ సంబంధం కాబట్టి శైలాధిరాజతనయను నదిగా, శివుని కొండగా చిత్రించిన ఉపమాలంకారం సార్థకమౌతున్నది.

1. ఉపమానం - అచలం - శివుడు స్థాణువు
2. ఉపమేయం - సింధువు - పార్వతి - నది

3. ఉపమా వాచకం - ఇవ

4. సమాన ధర్మం - పరస్పర సమాగమం (వ్యతికరాకులితం - ఢీ కొనడం)

**తదితర అలంకారాలు :-**

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రియేషు సౌభాగ్య ఫలాహి చారుతా | (5 - 1) | అర్థాంతరన్యాసం |
| 2. | పదం సహేత భ్రమరస్య పేలవం ।<br>శిరీష పుష్పం నపునః పతత్రిణః ॥ | (5 - 4) | విషమాలంకారం |
| 3. | క ఈప్సితార్థ స్థిర నిశ్చయం మనః<br>పయశ్చ నిమ్నాభి ముఖం ప్రతీపయేత్ | (5 - 5) | దీపకానుప్రాణిత అర్థాంతరన్యాసం |
| 4. | నషట్పద శ్రేణి భిరేవ పంకజం<br>స శైవలాసంగమపి ప్రకాశతే | (5 - 9) | తుల్యయోగిత |
| 5. | లత సుతన్వషు విలాస చేష్టితం ।<br>విలోల దృష్టం హరిణాంగనా సుచ ॥ | (5 - 13) | ఉత్ప్రేక్ష |
| 6. | న ధర్మ వృద్ధేషు వయస్సమీక్ష్యతే | (5 - 16) | అర్థాంతరన్యాసం |
| 7. | స్థితాః క్షణం పక్ష్మసు..................ప్రథమోద బిందవః | (5 - 24) | పరికరాలంకారం |
| 8. | వ్యలోక యన్ను న్మిషితైస్తడిన్మయై ।<br>ర్మహాతపః సాక్ష్య ఇవ స్థితాః క్షపాః ॥ | (5 - 25) | ఉత్ప్రేక్ష |
| 9. | తుషార వృష్టి క్షత పద్మ సంపదాం<br>సరోజ సంధాన మివా కరోదపామ్ । | (5 - 27) | ఉత్ప్రేక్ష |
| 10. | భవంతి సామ్యేఽపి నివిష్ట చేతసాం<br>వపుర్వి శేషే ష్వతి గౌరవాః క్రియాః | (5 - 31) | అర్థాంతరన్యాసం |
| 11. | శరీర మాద్యం ఖలు ధర్మ సాధనమ్ | (5 - 33) | అర్థాంతరన్యాసం |
| 12. | సంగతం మనషిభిః సాప్తపదన ముచ్యతే | (5 - 39) | అర్థాంతరన్యాసం |
| 13. | మనోరథానా మగతిర్న విద్యతే | (5 - 66) | అర్థాంతరన్యాసం |
| 14. | శ్మశాన శూలస్య న యూప సత్క్రియా | (5 - 73) | విషమాలంకారం |
| 15. | న సంతి యాథార్థ్య వాదః పినాకినః | (5 - 77) | అర్థాంతరన్యాసం |
| 16. | క్లేశః ఫలేన హి పునర్నవతాం విధత్తే | (5 - 86) | అర్థాంతరన్యాసం |

**శివతత్త్వం :-**

కుమార సంభవ మహా కావ్యంలోని పంచమ సర్గకు కాళిదాసు పెట్టిన పేరు 'తపః ఫలోదయము" ఈ సర్గలో శివుని తపస్సు, పార్వతి తపస్సు యిద్దరి తపస్సులు ఫలించాయి. ఇద్దరికీ సమాగమం తటస్థించింది. కాబట్టి ఈ సర్గ కుమార సంభవంలో అత్యంత కీలకమైంది, కాబట్టే కాళిదాసు, ఈ సర్గలో పార్వతి ముఖతః శివునికే శివతత్త్వ బోధ చేయించినాడు.

పంచమ సర్గలోని 75వ శ్లోకం నుండి 81వ శ్లోకం వరకు గల ఆరు శ్లోకాలలో 'శివతత్త్వం' పార్వతిచే చెప్పబడింది. ఈ విధంగా కాళిదాసు కుమార సంభవం కవులలో సందర్భానుసారంగా శివతత్త్వాన్ని గురించి, సౌందర్యలహరియైన పార్వతీదేవిని గురించి వర్ణించి యున్నాడు.

శ్రీ శంకర భగవత్పాదుల ప్రధాన శిష్యులలో ఒకరైన సురేశ్వరాచార్యుల వారు 'సంబంధ వార్తికం' లో శివుడనే పేరుకు యిలా నిర్వచనమిచ్చారు.

"అపరిపక్వ వాసనారూప కర్మాశ్రయ మాయావచ్ఛిన్నం
బ్రహ్మ యావత్పరిపాకం నిశ్చల తరంగ సముద్రవత్తిష్ఠతి
తచ్ఛివః"

జీవుల యొక్క అపరిపక్వ కర్మలు పరిపాక దశకు వచ్చు వరకు ఆ జీవులు వాసనారూప కర్మలతో కూడి 'మాయ'లో ఉంటారు. ఇట్టి మాయా విశిష్టమైన బ్రహ్మ స్వరూపం నిశ్చలమై, స్తబ్ధమై తరంగాలు లేని సముద్రం వలె ఉంటుంది. నిర్వికారం, నిస్తరంగకమైన ఆ సముద్రం వలె ఉండే బ్రహ్మ స్వరూపమే 'శివుడు'.

శివుని తపస్సును కుమార సంభవ కావ్యంలో కాళిదాసు నాల్గవ సర్గలో ప్రాణ వాయువును బంధించి, వాన లేని జలదం వలె, అలలు లేని సముద్రం వలె గాలి లేని తావులో ఉండే దీపం వలె (యథా దీపో నివాతస్థో - భగవద్గీత) ఉన్న శివుని మన్మథుడు చూచాడని వర్ణించాడు.

కుమార సంభవం 5వ సర్గ 75 - 81 శ్లోకాలు చాలా గంభీరార్థ ప్రతిపాదకమైనవి. అందులో 77వ శ్లోకం అత్యంత కీలకమైంది.

అకించనః సన్ ప్రభవస్స సంపదాం

త్రిలోకనాథః పితృసద్మగోచరః

స భీమరూపః శివ ఇత్యుదీర్యతే

న సన్తి యాథార్థ్యవిదః పినాకినః " (కు॥సం॥ 5-77)

శివుడు అకించనుడు. చేతిలో చిల్లిగవ్వ లేనివాడు. అయితే అందరికీ ఆయనే ఐశ్వర్యం అనుగ్రహించేవాడు. శ్మశానాలలో ఉంటాడు. కాని, మూడు లోకాలకు ప్రభువు. ఆయన రూపం భయంకరంగా ఉంటుంది. కాని ఆయనను శివుడు మంగళ ప్రదుడని పిలుస్తారు. "పినాకమనే ధనస్సును ధరించిన ఆ పరమ శివుని యథార్థ స్వరూపం తెలిసిన వారెవ్వరూ లేరు" అని పార్వతి ఘంటాపథంగా చెప్పింది.

ఏకైకమైన శివతత్త్వం సృష్టి కాలంలో స్త్రీ, పుం రూపాలుగా విభక్తమైంది. ఆ తత్త్వమే పార్వతీ పరమేశ్వరుల కల్యాణంతో అర్ధ నారీశ్వరతత్త్వమైంది. ఈ పురాణదంపతులే కాళిదాసుచే "వాగర్థావివ సంపృక్తౌ" అని వర్ణింపబడిన ఆది దంపతులు ప్రకృతి పురుషులు, ఆది గృహస్థులు, జగత్తుకు తల్లి తండ్రులు. వాగర్థముల వలె నిత్య సంబంధం గల్గి అద్వైత స్థితిలో ఉండే మాతా పితరులు "జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ"!

## రాదగిన ప్రశ్నలు :-

1. మీ పాఠ్యభాగానుసారం మహాకవి కాళిదాసు కవితా వైశిష్ట్యాన్ని విశదీకరించండి.
2. మీ పాఠ్యభాగమాధారముగా మహాకవి కాళిదాసుని ఉపమాలంకార విన్యాసకౌశలమును నిరూపించండి.
3. మహాకవి కాళిదాసు వర్ణించిన పార్వతితపశ్చర్యను వివరించండి.
4. పార్వతి - కపట వటువుల సంవాదమును సమీక్షించండి.
5. మీ పాఠ్యభాగముననుసరించి పార్వతికి శివుని యందు గల అనురాగమును వివరించండి.
6. మీ పాఠ్యభాగముననుసరించి కపట వటువు పాత్రను చిత్రీకరించండి.
7. పార్వతి ప్రతిపాదించిన శివమహాత్మ్యమును అభివర్ణించండి.
8. మీ పాఠ్యభాగానుసారం మహాకవి కాళిదాసుని అలంకార విన్యాస నైపుణ్యమును విశదీకరించండి.
9. పార్వతికి శివుని పై విరాగము కలిగించుటకు కపట వటువు చేసిన ప్రసంగమును సమీక్షించండి.

## ఆచూకీ గ్రంథాలు :-


1. సంజీవినీ వ్యాఖ్యా సహితము కుమార సంభవము - పంచమ సర్గ - శ్రీ కోలాచల మల్లినాథసూరి
2. శ్రీ కాళిదాస కవితా వైభవము - తృతీయ భాగము - శ్రీ పిసుపాటి విశ్వేశ్వర శాస్త్రి
3. సంస్కృత సాహిత్య చరిత్ర - డా॥ ముదిగొండ గోపాల రెడ్డి & డా॥ సుజాతా రెడ్డి



ఆచార్య గల్లా చలపతి
తెలుగు అధ్యయన విభాగం
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

పాఠం - 7

# ప్రతిమా నాటకం

**- భాస మహాకవి**

## విషయసూచిక :-


7.0 రూపక పరిచయం

7.0.1 రూపకోత్పత్తి

7.0.2 రూపక వికాసం

7.1 రూపకకారుడు - భాస మహాకవి పరిచయం

7.1.1 భాస మహాకవి రూపకాలు

7.1.2 భాస మహాకవి కాల నిర్ణయం

7.1.3 భాస మహాకవి రూపక విశ్లేషణ

7.1.4 రూపకాల ఏకకర్తృకత్వం

7.1.5 నాట్య శిల్పం

7.1.6 పాత్ర చిత్రణం

7.1.7 రసపుష్టి

7.1.8 కవితాశైలి

7.1.9 వర్ణనలు

7.1.10 అనంతర కవుల పై ప్రభావం

7.1.11 ప్రతిమానాటక కథా సంగ్రహం


## 7.0 రూపక పరిచయం :-

లాక్షణికులు సంస్కృత వాఙ్మయంలోని కావ్య సాహిత్యాన్ని రెండు రకాలుగా విభజించారు. అవి శ్రవ్య కావ్యాలు, దృశ్య కావ్యాలు. శ్రోతుం యోగ్యమ్ శ్రవ్యమని, ద్రష్టుం యోగ్యం దృశ్యమని వ్యవహారం. సంస్కృత సాహిత్యంలో అభినయ ప్రధానమైన దృశ్యకావ్యాన్ని రూపకమంటారు.

"తద్రూపారోపాత్తు రూపకమ్"

అని ఆలంకారికులు రూపక నిర్వచనం చెప్పారు. నిపుణుడైన నటుని యందు మూలనాయక రామాది స్వరూపారోపమే రూపకమని ఆలంకారికులు నిర్దేశించారు.

7.0.1 **రూపకోత్పత్తి :-** సంస్కృత రూపక సాహిత్యం అతి ప్రాచీనమైనదనే విషయం సర్వజన విదితమే. ఋగ్వేదంలోని "యమ - యమీ", "ఊర్వశీ - పురూరవ", "సరమా - పణ్యా"ది పదమూడు సంవాద సూక్తాలే రూపక బీజాలని భారతీయ విమర్శకుల మరియు విద్వాంసుల అభిప్రాయం. నిర్దుష్టమైన నాట్య లక్షణాలను సమగ్రంగా వివరించే అతి

ప్రాచీన లక్షణ గ్రంథం నాట్య శాస్త్రం మాత్రమే. లక్ష్యాన్ని అనుసరించే లక్షణాలను నిర్ణయించడం సంప్రదాయం. కనుకనే కావ్యతత్త్వవేత్తలు కావ్య లక్షణం, కావ్యాత్మ మొదలైన విచారాల సిద్ధాంతాలను అనేక కావ్యాలను సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించిన తరువాతనే ప్రతిపాదించారు. అదే విధంగా నాట్య శాస్త్ర రచనా కాలానికి కొన్ని వందల సంవత్సరాలకు పూర్వమే రూపక నిర్మాణ ప్రక్రియ ఆరంభమై ఉండవచ్చునని చరిత్రకారుల ఊహ.

7.0.2 **రూపక వికాసం :-** భాస, కాళిదాస, అశ్వఘోష, భవభూతి, శ్రీహర్షాది మహాకవుల ప్రఖ్యాత నాటకాలు సంస్కృత రూపక రచన వికాస దశను సూచిస్తున్నాయి. వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందించే ఒక గొప్ప ఉపకరణంగా రూపకాలు రచింపబడి జన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసాయనడానికి

"కావ్యేషు నాటకం రమ్యం",

"సందర్భేషు దశరూపకం శ్రేయః"

"నాటకాన్తం హి సాహిత్యం"

"నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనం"

మొదలయిన లోకోక్తులు చక్కని నిదర్శనాలు. ఈ విధంగా సకల జన మనోరంజకంగా జన జీవితంతో పెన వేసుకుపోయిన సంస్కృత రూపక సాహిత్యంలో భాస మహాకవి రూపకాలు అనర్ఘ రత్నాలు.

## 7.1 రూపకకారుడు - భాస మహాకవి - పరిచయం :-

సంస్కృత రూపకకారులలో ప్రధానంగా అధ్యయనం చేయదగిన వారిలో భాస మహాకవి ఒకడు. క్రీ॥పూ॥ మూడవ శతాబ్దానికే భాసుని రూపకాలు చరిత్రలో ప్రఖ్యాతి గాంచాయని ప్రతీతి. మహాకవి కాళిదాసు కాలానికే భాసుడు ప్రసిద్ధ నాటక కర్తగా కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించాడు. సంస్కృత రూపక వాఙ్మయంలో భాసుని రూపకాలు ఎంత మొదటివో అంత ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.

కేరళ రాష్ట్రానికి చెందిన మహా మహోపాధ్యాయ బిరుదాంకితులైన టి. గణపతి శాస్త్రి గారికి 1903లో భాసుని రూపక హస్త లిఖిత ప్రతులు లభించాయి. 1906లో "భాస నాటక చక్రం" అనే శీర్షికతో భాసుని పదమూడు రూపకాలను త్రివేండ్రం నుంచి గణపతి శాస్త్రి గారు ప్రచురించారు. అవి -

**7.1.1 భాస మహా కవి రూపకాలు :-**

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రతిమా నాటకం | - | 7 అంకాలు |
| 2. | అభిషేక నాటకం | - | 9 అంకాలు |
| 3. | బాల చరితం | - | 5 అంకాలు |
| 4. | పంచరాత్రం | - | 3 అంకాలు |
| 5. | మధ్యమవ్యాయోగం | - | 1 అంకం |
| 6. | దూత ఘటోత్కచం | - | 1 అంకం |
| 7. | దూత వాక్యం | - | 1 అంకం |
| 8. | కర్ణ భారం | - | 1 అంకం |
| 9. | ఊరు భంగం | - | 1 అంకం |

10. ప్రతిజ్ఞా యౌగంధరాయణం - 4 అంకాలు

11. స్వప్న వాసవదత్తం - 6 అంకాలు

12. అవిమారకం - 6 అంకాలు

13. చారుదత్తం - 4 అంకాలు

భాస మహాకవి రచించిన రూపకాలు మొత్తం 24 అని మరొక ప్రతీతి. భాసుడే ధావకుడని కొంత మంది పండితుల ఊహ.

"భాషాసు రమ్యా గైర్వాణీ, తస్యాం కావ్యం మనోహరమ్,
తత్రాపి రూపకం రమ్యం, తత్ర భాసకవేః కృతిః,
ధావకాపరనామాయం, భాసో భాసయతే జగత్,
తత్త్వైరి వాది పురుష శ్చతుర్వింశతిరూపకైః"

కిరణావళి, ఉదాత్తరాఘవం వంటి అనేక రూపకాలను భాస మహాకవి రచించినట్లు ప్రసిద్ధి. కానీ ప్రస్తుతం అవి లభించటం లేదు. యజ్ఞ ఫలం అనే మరొక రూపకం భాసునికే ఆరోపించబడినప్పటికీ అది భాసవిరచితం కాదని ఆ తరువాత తేలింది.

భాస మహాకవి లోకజ్ఞుడు. స్వతంత్ర ప్రజ్ఞాశాలి. ఇతని రూపక రచన విధానం అపూర్వం. భాసుని రూపకాలన్నీ రంగస్థల ప్రదర్శన యోగ్యాలు. భాసుని కాలం నాటికే సంస్కృత నాటక రంగం ఎంతగానో అభివృద్ధి చెందినదనటానికి అతని నాటకాలే చక్కని నిదర్శనాలు. భాసుడు, మహాకవి కాళిదాసు కంటే ప్రాచీనుడు. భాసుని శ్లోకాలెన్నింటికో కాళిదాసు కావ్యాలలో అనుకరణలు కనిపిస్తాయి.

7.1.2 **భాస మహాకవి కాల నిర్ణయం :-** మహాకవి భాసుని కాలాన్ని నిర్ధారించడానికి వివిధ విమర్శకుల, ప్రాచీన కవుల వచనాలే మనకు ఆధారాలు.

1. మహాకవి కాళిదాసు, భాసున్ని "ప్రథితయశసాం భాస - సౌమిల్ల - కవిపుత్రాదీనాం ప్రబంధాన్ అతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య క్రియాయాం కథం పరిషదోఽస్యాః బహుమానః" అని ఎంతో ఆదర భావంతో కొనియాడాడు.

2. "గౌడవహో" అనే ప్రాకృత గ్రంథంలో ప్రాకృత రాజు "భాసమ్మి జలనిమిత్తే" అని చెప్పాడు. ఇక్కడ భాసుడికీ, అగ్నిహోత్రుడికీ మధ్య మైత్రి వర్ణించబడింది. వ్యాసుడు, భాసుడు ప్రాచీన మునులు, వారిద్దరు "విష్ణుధర్మం" అనే గ్రంథాన్ని రచించారు. వారు రచించిన గ్రంథాల్లో ఏ గ్రంథం గొప్పదని పరీక్షించడానికి అగ్నిలో వేసారట. భాసుడి గ్రంథాన్నైతే అగ్నిహోత్రుడు దహించలేదట.

3. పై కథను ద్వాదశ శతాబ్దానికి చెందిన జయానకుడనే కవి తన "పృథ్వీ రాజ విజయం" అనే కావ్యంలో ఇలా లిఖించాడు -

"సత్కావ్య సంహార విధౌ ఖలానాం దీప్తాని వహ్నేరపి మానసాని ।
భాసస్య కావ్యం ఖలు విష్ణుధర్మం సోఽప్యాననాత పారదవన్ముమోచ ॥"

అసూయగ్రస్తులైన కొంత మంది దుర్మార్గులు ఏది మంచి కావ్యమో తేల్చడానికి గ్రంథాలను అగ్నిలో వేసారట. భాసుని కావ్యం విష్ణుధర్మాన్ని మాత్రం అగ్నిహోత్రుడు పాదరసం లాగ విడిచిపెట్టాడని వర్ణన.

4. అభినవ గుప్తుడు "అభినవ భారతి" అనే నాట్య శాస్త్ర వ్యాఖ్యానంలో మహాకవి భాసుని శ్లోకాన్ని ఉదహరించాడు.

"మహాకవినా భాసేనాపి స్వప్రబంధే ఉక్తమ్
త్రేతాయుగే తదిహ హన్త మైతిలీ సా
రామస్య రాగ పదవీ మృదు చాస్య చేతః ॥

--------------------------------

5. బాణభట్టుడు తన హర్ష చరితంలో

"సూత్రధారకృతారంభై నాటకైర్బహుభూమికైః ।
సపతాకైర్యశో లేభే భాసో దేవకులైరివ ॥"

అని సాదరంగా భాసుని స్మరించాడు.

6. దండ్యాచార్యుడు అవన్తి సుందరీ కథలో

"సవిభక్త ముఖాద్యంగైః వ్యక్త లక్షణ వృత్తిభిః ।
పరేతోఽపి స్థితో భాసః శరీరైరివ నాటకైః ॥"

అని భాసమహాకవి నాటక శరీరంతో అమరుడైనాడని శ్లాఘించాడు.

7. ప్రతిమా నాటకంలో బృహస్పతిని వర్ణిస్తాడు భాసుడు. కాని ప్రఖ్యాత అర్థశాస్త్రవేత్తయైన చాణుక్యుని తన రచనలలో ఎక్కడా ఉల్లేఖించలేదు. అందుచేత చాణుక్యుడి కంటే భాసుడు ప్రాచీనుడని తెలుస్తోంది.

8. రాజానక రాజశేఖరుడు తన "కవి విమర్శ" అనే గ్రంథంలో

"కారణం తు కవిత్వస్య న సంపన్న కులీనతా ।
ధావక్యోపి హి యద్భాసః కవీనామగ్రిమోఽభవత్ ॥"

అని భాస మహాకవిని స్మరించాడు.

9. ఆచార్య హేమచంద్రుడు

"సంప్రతి పరాం కాష్ఠా మారూఢేనాపి భాసేన భూత పూర్వా
స్వీయదశా న విస్మృతా యతోఽనేన పూర్వ చరితం ఘట -
కర్పరేణోదక వహనమేవ ప్రతిజ్ఞా మేనా మసహమానాః
పరే కవయః పరిహసితుమనసః విక్రమార్క సభ్యమేనం
భాసం తజ్జాతి స్ఫోరక ఘట కర్పరనామ్నా వ్యవజహ్రుః
క్రమేణ చ స ఏవ వ్యపదేశో భాస మహాకవేః సుప్రసిద్ధః
సంపన్నః " అని చెబుతూ భాసుడికి ఆ పేరు ఎలా వచ్చిందో వివరించాడు.

10. భరతముని నాట్య శాస్త్రంలో నిర్దేశించిన నియమ - నిబంధనలకు విరుద్ధంగా భాసుని రూపకాలలో దృశ్యాలు మనకు కనిపిస్తాయి. నాట్య శాస్త్ర నియమానుసారం నాటక ప్రస్తావనలో కవి పేరు ఉండాలి. కాని ప్రస్తావనలో

భాసుడు తన పేరు పేర్కొనలేదు. నాటకారంభం "స్థాపనా" అనే పేరుతో చేసాడు కాని ప్రస్తావన అని చెప్పలేదు. నాందీ పాఠం అయిన వెంటనే సూత్రధార ప్రవేశం నాటక లక్షణ విరుద్ధం. మృత్యువు, యుద్ధం, నిద్ర నాటకంలో చూపించకూడదు. కానీ భాసుని స్వప్నవాసవదత్తంలో నిద్ర, మధ్యమ వ్యాయోగంలో యుద్ధం కనిపిస్తాయి. కాబట్టి భరతముని కంటే భాస మహాకవి ప్రాచీనుడని తెలుస్తోంది.

11. భాసుని భాషలో అపాణినీయ ప్రయోగాలు మనకు కనిపిస్తాయి. కాబట్టి పాణిని మహర్షి కంటే భాసుడు ప్రాచీనుడని నిర్ణయించవచ్చు.

12. రస పరిపోషణ దృష్ట్యా, భాషా సారళ్యం దృష్ట్యా కూడ భాస మహాకవి, వ్యాస - వాల్మీకి మహర్షుల సమకాలికుడని కొంత మంది పండితుల ఊహ.

పైన పేర్కొన్న 12 హేతువుల చేత భాస మహాకవి అత్యంత ప్రాచీనుడని తెలుస్తోంది. భాసుని కాలం మహాకవి కాళిదాసు కాలం కంటే పూర్వమని నిశ్చప్రచం. భాసుని సమయం క్రీ॥పూ॥ మూడవ శతాబ్దమని నిర్థారించవచ్చు.

కాని పాశ్చాత్య విమర్శకుల, పండితుల అభిప్రాయాలు మరొక విధంగా ఉన్నాయి.

(ఎ) "ప్రొఫెసర్ వర్నటా" అనే పాశ్చాత్య విద్వాంసుడు "మత్త విలాసం" అనే నాటకాన్ని భాసుడు రచించాడని మరియు భాసుని కాలం క్రీ॥శ॥ ఏడవ శతాబ్దమని ఊహించాడు.

(బి) "స్టెనకోనో", "వింటర్‌నిటీజ్" అనే విమర్శకులు భాస మహాకవి పాకృత భాషా ప్రయోగాలను కాళిదాస, అశ్వఘోషాది కవుల పాకృత ప్రయోగాలను తులనాత్మకంగా పరిశీలించి భాసుడు కాళిదాసుకు అర్వాచీనుడని, అశ్వఘోషునకు ప్రాచీనుడని చెప్పారు. ఆ సమయం క్రీ॥శ॥ రెండవ, నాలుగవ శతాబ్దాల మధ్య కాలం కావచ్చని ఊహించారు.

పైన నిర్దేశించిన అభిప్రాయాలతో భాస మహాకవి సమయం ఇదమిత్థమని నిర్థారణ యింత వరకూ స్పష్టంగా తెలియటం లేదు. అంతే కాకుండా పాశ్చాత్యుల తర్కాలు అంత సబబుగా ఉన్నట్లు తోచడం లేదు. కేవలం ప్రాకృత భాషా ప్రయోగాలను దృష్టిలో పెట్టుకొని కవి కాలాన్ని నిర్ణయించలేము.

సంస్కృత కవుల కాల నిర్ణయం దుష్కరమే కదా.

**7.1.3 భాస మహాకవి రూపక విశ్లేషణ :-** భాస మహాకవి రచించిన పదమూడు రూపకాలను కథా వస్తువు ప్రకారం ఐదు రకాలుగా విభజించవచ్చును.

**(ఎ) బృహత్కథాధారితాలు - మూడు**

1. ప్రతిజ్ఞా యౌగంధ రాయణం
2. స్వప్న వాసవదత్తం
3. అవిమారకం

**(బి) శ్రీ మద్రామాయణ కథా శ్రితాలు - రెండు**

1. ప్రతిమా నాటకం
2. అభిషేక నాటకం

**(సి) శ్రీ మన్మహాభారత కథాశ్రయాలు - ఆరు**

1. మధ్యమ వ్యాయోగం
2. పంచరాత్రం
3. దూత ఘటోత్కచం
4. కర్ణ భారం
5. ఊరు భంగం
6. దూత వాక్యం

**(డి) శ్రీ మద్భాగవత కథాత్మకము - ఒకటి**

1. బాల చరితం

**(ఇ) కాల్పనికం - ఒకటి**

1. చారుదత్తం

**రూపకాల పరిచయం :-**

1. ప్రతిజ్ఞా యౌగంధరాయణం - ఈ నాటకంలో వత్సరాజు ఉదయనుడు ఉజ్జయిని రాజైన ప్రద్యోతనుని కుమార్తె అయిన వాసవదత్తను అపహరించే కథ వర్ణితం. ప్రద్యోతనుడు ఉదయనుని బందీ చేసినపుడు అమాత్యుడు యౌగంధరాయణుడు ఉదయనుని విడిపిస్తానని, వాసవదత్తతో వివాహాన్ని జరిపిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. అందువలన ఈ నాటకానికి ప్రతిజ్ఞా యౌగంధరాయణం అని పేరు పెట్టాడు భాసుడు.

2. స్వప్న వాసవదత్తం - భాస మహాకవి రచించిన రూపకాలలో, స్వప్న వాసవ దత్తం శిరోమణి వంటిది. సోమ దేవుడు రచించిన కథా సరిత్సాగరంలో "లావణక లంబకం"లో ఈ కథ కనిపిస్తుంది. దాన్ని ఆధారంగా చేసుకొని వినూత్నమైన మార్పులు చేర్పులు చేసి సహృదయ జన రంజకంగా మలిచాడు భాస మహాకవి.

   ఈ నాటకంలో అమాత్యుడు యౌగంధరాయణుడు మగధ నరేశుని సోదరి పద్మావతితో వత్సరాజుకి వివాహం జరిపిస్తే, ఆ వివాహంతో వత్స - మగధ దేశాలకు స్నేహం పరిఢ విల్లుతుందని మంతనం చేస్తాడు. దీనితో వత్సరాజుకి రాజ్య విస్తారం జరుగుతుందని యౌగంధరాయణుని ఆకాంక్ష. కానీ వాసవదత్త జీవించియుండగా వత్సరాజు ఉదయనుడు పద్మావతితో కళ్యాణానికి అంగీకరించడు. ఒక రోజు ఉదయనుడు వేటకు వెళ్ళినపుడు మిగిలిన మంత్రుల సహాయంతో వాసవదత్త దగ్ధమయిందని ప్రచారం చేస్తాడు యౌగంధరాయణుడు. రాజు ఎంతగానో పరితపిస్తాడు. వాసవదత్తనే ప్రేమిస్తూ ఉంటాడు. ఎట్టకేలకు పద్మావతిని వివాహమాడతాడు. తరువాత స్వప్న క్రమంలో వాసవదత్త లభిస్తుంది.

3. అవిమారకం - అవిమారకం అనే నాటకంలో కుంతీభోజుని కూతురైన కురంగికీ, సౌవీర రాజు కొడుకైన విష్ణుసేనుని వివాహవేడుక వర్ణింపబడింది. ఈ ఇతివృత్తం కథా సరిత్సాగరంలో ఉంది. కొన్ని ఘటనలను లోక కథల నుంచి కూడా గ్రహించాడు భాసుడు.

4. ప్రతిమా నాటకం - భాస మహాకవికి విశేష ఖ్యాతిని తీసుకొచ్చిన రూపక విశేషం ప్రతిమా నాటకం. ఈ నాటకంలోని ఇతి వృత్తం వాల్మీకి రామాయణంలోనిది. కైకేయి కుమారుడు భరతుడు తన మేనమామ దేశమైన కేకయ

రాజ్యంలో ఉంటాడు. దశరథునికి అనారోగ్యంగా ఉందని తెలుసుకొన్న భరతుడు తండ్రిని చూడటానికి అయోధ్యకు ప్రయాణమయ్యాడు. నగర సరిహద్దులలోకి రాగానే అయోధ్యా ప్రవేశానికి మూహుర్తం బాగుగాలేదని తెలుసుకొంటాడు భరతుడు. నగర ప్రవేశాన్ని కొంత సేపటికి వాయిదా వేసుకొని అక్కడే ఉన్న భవనంలో ప్రవేశిస్తాడు. అక్కడ నాలుగు విగ్రహాలున్నాయి. అవి దివంగతులయిన సూర్య వంశపు రాజుల విగ్రహాలని అక్కడున్న పురోహితుని ద్వారా భరతుడు తెలుసుకొంటాడు. ఆ విగ్రహాలలో తన తండ్రి దశరథుని విగ్రహం కూడా ఉండటం భరతుడు గమనించాడు. విషయాన్నంతా తెలుసుకొన్న భరతుడు దశరథుని విగ్రహం ముందే కుప్పకూలిపోతాడు. సాకేతనగర ప్రవేశం చేయటానికి అతనికి మనసొప్పదు. తండ్రికి ఉత్తర క్రియలు చేసి భరతుడు అడవికి వెళ్ళి రాజ్యాన్ని గ్రహించమని రాముడ్ని కోరతాడు. శ్రీరాముడు తిరిగి వచ్చుటకు తిరస్కరించినపుడు రామ పాదుకలను తీసుకొని అయోధ్యకు తిరిగి వచ్చి వాటికే అభిషేకం చేస్తాడు భరతుడు.

5. అభిషేకం - ఈ నాటకం కూడ రామాయణ కథాశ్రితమే. రామాయణంలోని కిష్కింధాకాండలోని వాలి వధ వృత్తాంతం నుండి ప్రారంభించి సుందరకాండ, యుద్ధ కాండలోని పట్టాభిషేక వృత్తాంతం వరకు ఉన్న కథను గ్రహించాడు భాసుడు. పాత్రోచిత కథలతో ఈ నాటకం రచించబడింది.

6. మధ్యమ వ్యాయోగం - పాండవుల వనవాస కాలంలో భీముడు ఘటోత్కచుని బారి నుండి ఒక బ్రాహ్మణ కుమారుని రక్షించటం ఈ రూపకంలోని ప్రధాన కథ.

ఒక బ్రాహ్మణుడు సపరివారంగా తీర్థ యాత్రలకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో అరణ్యంలో ఒక వృక్షచ్ఛాయలో విశ్రమిస్తారు బ్రాహ్మణ కుటుంబ సభ్యులు. ఆ ప్రాంతంలోనే హిడింబి నివసిస్తూ ఉంటుంది. ఆ రోజు హిడింబి ఒక వ్రతాన్ని ఆచరిస్తూ ఉపవాసముంటుంది. పార్వణం కోసం (వ్రత సమాప్తి సమయంలో ఆహారాన్ని స్వీకరించటం పార్వణం) ఒక మనుష్యుని తీసుకురమ్మని ఘటోత్కచుణ్ణి పంపిస్తుంది. ఘటోత్కచుడు అడవిలో ఒక పురుషుడి కోసం వెదుకుతూ ఉంటాడు. అదే సమయంలో ఆ బ్రాహ్మణ కుటుంబ సభ్యులను చూస్తాడు ఘటోత్కచుడు. బ్రాహ్మణుని ముగ్గురు కొడుకులలో ఒకణ్ణి తన తల్లి వ్రత పార్వణ కోసం పంపమంటాడు ఘటోత్కచుడు. బ్రాహ్మణుడు తన ముగ్గురు కొడుకులలో మధ్యవాణ్ణి పంపుతాడు. మధ్యవాడు ఘటోత్కచునితో బయలుదేరాడు. మార్గ మధ్యంలో దప్పికను తీర్చుకొనడానికి ఒక సరోవరంలో దిగుతాడు. సమయం మించిపోవటంతో ఘటోత్కచుడు "మధ్యమా!" అని బిగ్గరగా పిలుస్తాడు. అదే అరణ్యంలో నివాసముంటున్న కుంతీ మధ్యముడు భీముడు తననే ఎవరో పిలుస్తున్నారనుకొని అక్కడికి చేరుకొంటాడు. విషయాన్ని తెలుసుకొన్న భీమసేనుడు ఘటోత్కచునితో యుద్ధం చేస్తాడు. ఆ యుద్ధంలో ఘటోత్కచుని పరాక్రమాన్ని చూచి సంధి చేసుకొని బ్రాహ్మణ కుమారుడి స్థానంలో భీమసేనుడు హిడింబి నివాసానికి చేరుకొంటాడు. హిడింబి భీమసేనుని చూడగానే పరమానంద పడుతుంది. తండ్రీ కొడుకులు పరస్పరం పరిచితులయ్యారు.

దశ విధ రూపకాలలో పై రూపకం వ్యాయోగ లక్షణాలను సంతరించుకుంది. కాబట్టి దీనికి "మధ్యమ వ్యాయోగం" అనే పేరు సార్థకమయింది.

7. పంచరాత్రం - మహాభారతాంతర్గతమైన కథను గ్రహించి కొన్ని మార్పులు చేర్పులతో పంచరాత్ర రూపకాన్ని రచించాడు భాసుడు. దుర్యోధనుడు యజ్ఞం చేస్తాడు. యజ్ఞం పూర్తయిన తరువాత ద్రోణాచార్యుడికి దక్షిణ ఇస్తాడు. దానితో ఒక షరతును కూడా విధిస్తాడు దుర్యోధనుడు. ఎట్టి పరిస్థితుల్లోను ఐదు రాత్రుల్లో పాండవులను పట్టుకోవాలి అని. అందుకే దీనికి పంచరాత్రం అని పేరు వచ్చింది.

8. దూత ఘటోత్కచం - అభిమన్యు వధ అయిన తరువాత శ్రీ కృష్ణుడు ఘటోత్కచుణ్ణి దుర్యోధనుని దగ్గరకు దూతగా పంపిస్తాడు. ఘటోత్కచుడు దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళి కృష్ణ సందేశం వినిపిస్తాడు. ఈ కథ మహాభారతంలో కనిపించుట లేదు. ఘటోత్కచుడు దూతగా వెళ్ళాడు కాబట్టి "దూత ఘటోత్కచం" అనే పేరు సార్థకం అయింది.

9. కర్ణ భారం - ద్రోణాచార్యుని వధానంతరం కౌరవ సేనకు కర్ణుడు సేనాపతిగా నియుక్తుడయ్యాడు. కర్ణుని ఉదాత్త చరితం ఇక్కడ వర్ణింపబడింది. ఇంద్రునికి కవచకుండలాలాను కర్ణుడు దానం చేస్తాడు. భారమంతా కర్ణుడి మీద పడిందని తెలిపే రూపకం కర్ణ భారం.

10. ఊరు భంగం - మహాభారతంలో కథ. మాయాద్యూత (జూదం) క్రీడలో పాండవులు ఓడిపోయారు. ద్రౌపదిని కౌరవులు పరాభవిస్తారు. ఆ సమయంలో భీముడు భీషణ ప్రతిజ్ఞ చేస్తాడు. ప్రేయసి పరాభవంతో సంతప్తుడైన భీమసేనుడు తన ప్రతిజ్ఞను నిలబెట్టుకోవటానికి దుర్యోధనుని తొడలు విరిచి చంపిన ఘట్టం ఇక్కడ వర్ణింపబడింది. దుర్యోధన - భీమసేనుల మధ్య జరిగిన గదా యుద్ధం ఇక్కడ వర్ణించబడింది. సంస్కృత సాహిత్యంలో ఈ నాటకం దుఃఖాంతం.

11. దూతవాక్యం - మహా భారతంలోని ఉద్యోగపర్వాంతర్గత కథ. శ్రీ కృష్ణుడు పాండవుల పక్షాన్ని వహించి శాంతి దూతగా కౌరవ సభకు వెళ్ళటం, అక్కడ దుర్యోధనుని ఆగడాలు, శ్రీ కృష్ణుని దౌత్య కార్య నిర్వహణ కౌశలం మొదలగు ఘట్టాలు వర్ణింపబడ్డాయి. అందువలననే "దూత వాక్యం" అనే శీర్షికను పెట్టాడు భాస మహాకవి.

12. బాల చరితం - శ్రీ మద్భాగవతంలోని దశమ స్కంధంలోని కథా వస్తువు ఇక్కడ వర్ణితం. శ్రీ కృష్ణుని లీలా విశేషాలు ఈ నాటకంలో వర్ణింపబడ్డాయి.

13. చారుదత్తం - ఇది కాల్పనిక కథ. దీనికి మూలం ఆ నాటి జానపద కథలు కావచ్చని కొందరి అభిప్రాయం, దీనికే దరిద్ర చారుదత్తం అని పేరు కూడా ఉంది. శృంగార ప్రధానం. చారుదత్తుడు నాయకుడు. వసంత సేన అనే గణిక ఇక్కడ నాయిక. చారుదత్త - వసంత సేనల ప్రణయ గాథ ఇక్కడ వర్ణింపబడింది.

7.1.4 **రూపకాల ఏకకర్తృకత్వం :-** ఇలా భాస మహాకవి రూపకాలు కొన్ని ఇతివృత్త ప్రధానంగాను, కొన్ని ఘటనా ప్రధానంగాను, కొన్ని నాయక ప్రధానంగాను కనిపిస్తాయి. ఇవన్నీ ఏకకర్తృకాలని చెప్పటానికి కొన్ని ప్రమాణాలు లభిస్తున్నాయి. అవి

1. అన్ని రూపకాల్లోను "నాంద్యన్తే తతః ప్రవిశతి సూత్రధారః" అనే వాక్యం ఆరంభంలో కనిపిస్తుంది.

2. ఏ రూపకంలోనూ రచయిత పేరు గానీ, పరిచయం గానీ కనిపించదు.

3. ఒక్క కర్ణభారంలో తప్ప, మిగిలిన అన్ని రూపకాల్లో 'ప్రస్తావన' అనే పదానికి బదులు "స్థాపన" అనే పదం ప్రయోగించబడింది.

4. ఇంచుమించు అన్ని రూపకాల్లోను భరత వాక్యం ఒకటే

ఇమాం సాగరపర్యన్తాం హిమవద్వింధ్య కుండలామ్ ।
మహీమేకాత పత్రాంకాం రాజ సింహః ప్రశాస్తు నః ॥

సముద్రం వరకూ వ్యాపించిన వింధ్య, హిమాలయాలనే కుండలాలు గల ఒకే రాజచ్ఛత్రం గల భూమిని రాజు పరిపాలించు గాక అని

5. ఈ రూపకాలన్నింటిలో ఒకే విధమైన సరళమైన భాషను ఉపయోగించుట మరొక విశేషం.

6. అన్ని రూపకాలలోను పతాకా స్థానంలో ముద్రాలంకారం ప్రయోగించబడింది. స్వప్న వాసవదత్తంలో పద్మావతి, చారుదత్తంలో వసంత సేనల వర్ణనలు సమానంగా కనిపిస్తాయి.

7. భరతుని నాట్యశాస్త్ర నియమ విరుద్ధంగా దృశ్యాలను కూర్చటం

8. సూత్రధారుడే వచ్చి మంగళ శ్లోకాన్ని చెప్పటం

9. వ్యాకరణ లక్షణ హీన ప్రయోగాలు (అపాణినీయ ప్రయోగాలు)

10. ఇంచుమించు సమానమైన వాక్యాలు పునరుక్తాలయ్యాయి.

11. ఛందః ప్రయోగంలో కూడ సామ్యం కనిపిస్తుంది.

పై ఆధారాలతో పదమూడు రూపకాలు ఏక కర్తృకములే అన్న విషయం స్పష్టంగా విదితమవుతోంది.

7.1.5 **నాట్య శిల్పం :-** భాసుడు చాలా అనుభవజ్ఞుడు. అతను విభిన్న క్షేత్రాల్లో ఆరితేరినవాడు. జీవనంలో చాల సంఘటనల్లో సుఖదుఃఖాలను, కష్ట నష్టాలను చవిచూచిన వ్యక్తి. అందుకే భాసుడి రూపకాల్లో పాత్రలు, సన్నివేశాలు చాల చమత్కారంగా, సహజంగా కనిపిస్తాయి. రూపకాల్లో వైవిధ్యం పాఠకులకు స్పష్టంగా గోచరమవుతుంది.

భాస మహాకవి రచించిన రూపకాలలో ప్రతిమా నాటకం, స్వప్న వాసవదత్తం, ప్రతిజ్ఞా యౌగంధరాయణం మొదలగునవి వికసించిన నాటకాలు. పూర్తిగా సంధ్యంగాలతో కూడిన రూపకాలు అవి. కానీ మధ్యమ వ్యాయోగం, దూతవాక్యం, దూతఘటోత్కచం, కర్ణభారం, ఊరు భంగం ఏకాంక రూపకాలు. ఈ రూపకాలన్నీ అభినయ యోగ్యాలే. వర్ణన అధికంగా ఉండదు. అనపేక్షితమైన కథా వస్తువు ఉండదు. పాత్రల సంభాషణలు అధికంగా ఉండవు. భాసుని పాత్ర విశేషాలు చిన్న చిన్న సంభాషణలతో గంభీరమైన అర్థాన్ని ప్రతిపాదిస్తాయి. భాసుని సంవాదతత్త్వం ఎంతో మార్మికంగా ఉంటుంది.

7.1.6 **పాత్ర చిత్రణం :-** భాసుని పాత్ర విశేషాలు నమూనాలు మాత్రమే కాక సజీవ చిత్రాలు. ఆ పాత్రల్లో మహోన్నత వ్యక్తిత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆ పాత్రల్ని మనం మరచిపోలేము. భాసుడి ఉదయనుని పాత్రలో గాంభీర్యం మరియు ధీరోదాత్తతలు కనిపిస్తాయి.

ప్రతిజ్ఞా యౌగంధరాయణంలో యౌగంధ రాయణుని బుద్ధి చాతుర్యాన్ని, లోకజ్ఞానాన్ని భాస మహాకవి చక్కగా చిత్రీకరించాడు. ఒక ఆదర్శ అమాత్యుని లక్షణాలను రమణీయంగా తెలిపాడు భాసుడు యీ నాటకంలో.

ప్రతిమా నాటకంలో త్రికరణ శుద్ధియైన పితృభక్తి, త్యాగ నిరతి, భాతృ స్నేహం వంటి సుగుణాలు శ్రీరామ చంద్రునిలో, భరతునిలో, లక్ష్మణునిలో విశేషంగా చిత్రీకరింపబడ్డాయి. పితృవాక్య పరిపాలనయే తన పరమ కర్తవ్యమని శ్రీరాముడు స్పష్టంగా చెప్పాడు - వత్స, కైకేయి మాతః, మా మైవమ్.

"పితుర్నియోగాదహమాగతో వనం
న వత్స దర్పాన్న భయాన్న విభ్రమాత్ ।
కులం చనః సత్యధనం బ్రవీమి తే
కథం భవాన్ నీచపథే ప్రవర్తతే ॥" అని

తండ్రి, జ్యేష్ఠ భ్రాత లేనటువంటి అయోధ్య అరణ్యమే అని బాధా తప్త హృదయుడైన భరతుని మాటలను వినండి.

"అయోధ్యామటవీభూతాం పిత్రా భ్రాత్రాచ వర్జితామ్ ।
పిపాసార్తోఽనుధావామి క్షీణతోయాం నదీమివ ॥" అని

రాఘవుడున్న ప్రదేశమే అయోధ్య అని భరతుడు ప్రకటిస్తాడు.

"నాయోధ్యా తం వినాయోధ్యా సాయోధ్యా యత్ర రాఘవః ।" అని

భాతృ భక్తికి ప్రతీకగా లక్ష్మణ పాత్రను మలిచాడు భాస మహాకవి.

దశరథుడు లక్ష్మణుని గూర్చి సుమిత్రతో అన్న మాటలు

"తవైవ పుత్రః సత్ పుత్రో యేన నక్తందివం వనే ।
రామో రఘుకులశ్రేష్ఠః ఛ్ఛాయయేవానుగమ్యతే ॥" అని

నీడలాగ నిరంతరం రాముని అనుసరించే లక్ష్మణుడే ధన్యుడు. నేను అధన్యుడను అనే అర్థం దశరథుని మాటలలో ధ్వనిస్తుంది.

అరణ్యంలో ఉన్న శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు - సత్యానికి, శీలానికి, భక్తికి క్రమంగా సజీవ శిల్పాలు అన్న సుమంత్రుని వచనం సదా స్మరణీయం.

"అత్ర రామశ్చ, సీతా చ, లక్ష్మణశ్చ మహాయశాః ।
సత్యం, శీలం చ, భక్తిశ్చ యేషు విగ్రహవత్ స్థితమ్ ॥" అని

అన్నింటికంటే, భాస మహాకవి కైకేయి పాత్రను ఉదాత్తంగా మలిచాడు. కైకేయి పాత్రను నిర్దోషంగా తీర్చిదిద్దటంలో భాసుడు పూర్తిగా సఫలమయ్యాడు.

భాస మహాకవి నాయికలలో కూడ ఆదర్శ భావం, ఔదార్యం మొదలగు సుగుణాలు మనకు కనిపిస్తాయి. స్వప్న వాసవదత్తంలో వాసవదత్త ఔదార్యం ఆమెను పతివ్రతగా చూపిస్తుంది. వాసవదత్త రాణి అయినప్పటికీ తను రహస్యంగా రోజులను గడుపుతూ, తన భర్తకు మంచి యోగం కలగాలని త్యాగానికి సిద్ధపడిన ఉదాత్తనాయిక. ఈ చిత్రణంతో వాసవదత్త ఆదర్శ నారీ రత్నంగా నిలిచిపోయింది. ఈర్ష్యా ద్వేషాలు వాసవదత్తలో కనిపించవు. పద్మావతి తన సవతియని తెలిసినప్పటికీ ఆమెతో కలిసి ఉండేది. కురంగి నాయిక అవిమారకంలో ఎంతో భావుకతతో కనిపిస్తుంది.

ఇలా పరిశీలించినట్లయితే భాస మహాకవి పాత్ర చిత్రణంలో ఆరితేరిన మేటి కవి అని సుస్పష్టం.

7.1.7 **రసపుష్టి :-** భాస మహాకవి రూపకాల్లో నవ రసాలు అభివ్యక్తమవుతాయి. నాటకాల్లో ప్రధానమైన వీర శృంగార రసాలు ప్రస్ఫుటంగా పరిపుష్టిని పొందాయి. ప్రతిమా నాటకంలో శోకం పరాకాష్ఠకు చేరుకుంటుంది. పుత్ర వాత్సల్య పరిపూర్ణ హృదయుడైన దశరథుని శోకం ప్రేక్షకులను కలవర పెడుతుంది.

"అయే! అయం మహారాజో మహా దేవ్యా సుమిత్రయా చ సుదుస్సహమపి పుత్ర విరహ సముద్భవం శోకం నిగృహ్య ఆత్మానమేవ సంస్థాపయంతీ భ్యామ్ అన్వారయమాన స్తిష్ఠంతి, కష్టా ఖల్వవస్థా వర్తతే, ఏష ఏవ మహారాజ,

"పత్యుత్థాయ చోత్థాయ హా హేత్యుచ్చైర్లపన్ ముహుః ।
దిశం పశ్యతి తామేవ యయా యాతో రఘూద్వహః ॥" అని

రాజా - కౌసల్యే! సారవతీ ఖల్వసి త్వయాహిఖలు రామో గర్భే ధృతః.

"అహం హి దుఃఖమత్యన్తమసహ్యం జ్వలనోపమమ్ ।
నైవ సోఢుం న సంహర్తుం శక్నోమి ముషితేంద్రియః ॥" అని
"రామం ప్రతిగతా బుద్ధి రద్యాపి న నివర్తతే"

మొదలగువాక్యాలు దశరథుని శోకాన్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు భాసుడు.

స్వప్న వాసవదత్తం, చారుదత్తం, అవిమారకం నాటకాల్లో శృంగార రసం పరిపుష్టమయింది. ప్రతిజ్ఞా యౌగంధరాయణం, అభిషేకం, మధ్యమవ్యాయోగం, ఊరు భంగం రూపకాల్లో వీర రసం ప్రధానంగా కనిపిస్తుంది. మిగిలిన రూపకాల్లో వీర శృంగారాలు అంతంత మాత్రం గానే కనిపిస్తూ ఉంటాయి. బాల చరితంలో మాత్రం అద్భుత రసం ప్రధానంగా అభివ్యక్తమయింది. మిగిలిన రసాల్లో హాస్యరసం కూడా సున్నితంగా పోషించటం జరిగింది. అందుచేత భాసుడు రససిద్ధ కవీశ్వరుడు.

7.1.8 **కవితా శైలి :-** భాస మహాకవి కవితాశైలి సరళంగా ఉంటుందని వేరేగా చెప్పవలసిన పని లేదు. భాసుని రూపకాల ప్రసిద్ధే సారళ్యతకు తార్కాణం. భాసుని రూపకాల్లో దీర్ఘ దీర్ఘ సమాస ప్రయోగం ఎక్కడా కనిపించదు. భాసుని భాష సూక్తులతో, లోకోక్తులతో నిండి యుంటుంది. భాషలో సహజమైన ప్రవాహం కనిపిస్తుంది.

రూపకాల్లో ఉక్తి - ప్రత్యుక్తులు ప్రధానమైన అంగాలు. ఉక్తి - ప్రత్యుక్తుల ద్వారా నాటక కథ ముందుకు నడుస్తుంది. భాసుడి సంభాషణా శైలి సహజ మనోహరంగా ఉంటుంది. అందుకే ఆ రూపకాలకు అంత ప్రసిద్ధి వచ్చింది. భాస మహాకవి లోకోక్తులను, సామెతలను ఛందోబద్ధంగా మలచటంలో నిపుణుడు. "చక్రారి పంక్తి రివ గచ్ఛతి భాగ్య పంక్తిః" లాంటివి వీటికి ఉదాహరణలు.

సంభాషణలు కూడ ఛందోబద్ధంగా కనిపిస్తాయి. ఒక వృత్తంలో పూర్వార్థం ఒక పాత్ర చేత, ఉత్తరార్థం మరొక పాత్ర చేత చెప్పించటంతో సంభాషణ హృద్యంగా నడుస్తుంది. దీనితో పాత్రల్లో సజీవత్వం ఉట్టిపడుతుంది. భాసుని సంవాద శైలి నిరుపమానం.

'అంగీకరిస్తున్నాను' అనే అర్థంలో "బాఢమ్", "అథకిమ్", "ఆమ్" మొదలైన పదాలను ఎంతో సహజంగా వాడతాడు భాసుడు. "కుశలంగా ఉన్నావా?" అనే ప్రశ్నకు "సుఖమార్యస్య?" మొదలగునవి భాసుడి సంభాషణా శైలికి ఉదాహరణలు.

7.1.9 **వర్ణనలు :-** భాస మహాకవి వర్ణనలు హృద్యానవద్యంగా ఉంటాయి. భాసుడు ప్రకృతిలో దేన్ని వీక్షిస్తాడో దానినే యథాతథంగా గ్రహిస్తాడు. ఏ వస్తువును ఎలా వర్ణిస్తే అందంగా ఉంటుందో అలా వర్ణించ గల సమర్థుడు భాసుడు. వర్ణనీయ పదార్థాల వైశిష్ట్యాన్ని సరళ భాషలో విశదీకరించగల శక్తిమంతుడు భాసుడు. ఇతని వర్ణనలు కళ్ళకు కట్టినట్టుగా ఉంటాయి. స్వప్న వాసవదత్తంలో సాయం సమయ వర్ణనం దీనికి నిదర్శనం.

"ఖగా వాసోపేతాః సలిలమవగాఢో మునిజనః
ప్రదీప్తోऽగ్నిర్భాతి ప్రవిచరతి ధూమో మునివనమ్ ।

పరిభ్రష్టో దూరాద్రవిరపి చ సంక్షిప్త కిరణః

రథం వ్యావర్త్యాసౌ ప్రవిశతి శనైరస్తశిఖరమ్ ॥" అని

పక్షులు గూళ్ళకు చేరుకొంటున్నాయి. ముని జనులంతా సాయం సంధ్యా స్నానాలకు ఉపక్రమిస్తున్నారు. అగ్నిహోత్రాలు వెలుగుతున్నాయి. హోమం చేయడం చేత పొగలు మునివనాన్నంతా కమ్ముకుంటున్నాయి. సూర్యుడు తన కిరణాలను ఉపసంహరించుకుంటూ దూరంగా కనిపిస్తున్నాడు. తన రథాన్ని తిప్పి నెమ్మది నెమ్మదిగా అస్త శిఖరాన్ని చేరుకొంటున్నాడు సూర్యుడు.

ప్రతిమా నాటకంలో రథ వేగ వర్ణనను వీక్షించండి -

"ద్రుమా ధావంతీవ ద్రుతరథగతి క్షీణ విషయా

న దీవోద్వృత్తాంబు ర్నిపతతి మహీ నేమివివరే ।

అరవ్యక్తి ర్నష్టా స్థితమివ జవాచ్చక్రవలయం

రజశ్చాశ్వోద్ధూతం పతతి పురతో నాను పతతి ॥" అని

భూమి వేగంగా పరిగెత్తుచున్నదా! అన్నట్టుగా ఉంది. చక్రపు ఆకులు కనిపించకపోవటం చేత లుప్తమైపోయాయా! అన్నట్టు ఉంది. చక్రవలయం వేగంగా తిరగటం చేత స్థిరంగా ఉందా! అన్నట్టుంది. గుఱ్ఱపు గిట్టలచే పైకి ఎగిసి పడుతున్న ధూళి వెనకాల పడటం లేదు, ముందే పడుతుంది.

ప్రతిమా నాటకంలో శ్రీరామ చంద్రుడు అడవికి, బయలుదేరిన రోజు నుండి అయోధ్య శూన్యంగా కనిపిస్తుందని కాంచుకీయుని చేత చెప్పిస్తాడు భాసుడు.

"నాగేంద్రా యవసాభిలాషవిముఖాః సాస్రేక్షణా వాజినో

హేషాశూన్యముఖాః సవృద్ధ వనితాబాలాశ్చ పౌరాజనాః ।

త్యక్తాహారకథాః సుదీనవదనాః క్రందన్త ఉచ్చైర్దిశా

రామో యాతి యయా సదార సహజస్తామేవ పశ్యన్త్యమీ ॥" అని

ఏనుగులు ఆహారాన్ని స్వీకరించటం విడిచి పెట్టాయి, గుఱ్ఱాలు కన్నీటిని విడుస్తున్నాయి, గుఱ్ఱాలు సకిలించుట లేదు, ముసలి వారు, వనితలు, బాలురు, పురజనులు అంతా ఆహారాన్ని స్వీకరించుట లేదు. దీనంగా చూస్తున్నారు. బిగ్గరగా ఏడుస్తున్నారు. ఏ దిక్కుగా రాముడు వెళ్ళుచున్నాడో ఆ దిక్కువైపే చూస్తూ ఉండిపోయారు.

ఇక్కడ వర్ణితమైన కరుణ రసం హృదయాన్ని కదిలించి వేస్తుంది. భాస మహాకవి ఎన్నో చోట్ల సముద్రాన్ని వర్ణిస్తాడు -

"క్వచిత్ఫేనోద్గారీ క్వచిదపి చ మీనాకులజలః

క్వచిచ్ఛంఖాకీర్ణః క్వచిదపి చ నీలాంబుదనిభః ।

క్వచిద్వీచీమాలః క్వచిదపి చ నక్రప్రతిమయః

క్వచిద్భీమావర్తః క్వచిదపి చ నిష్కంపసలిలః ॥"

సముద్రం కొన్ని చోట్ల నురగలు కక్కుతోంది. కొన్ని చోట్ల చేపలతో వ్యాకులమైంది. కొన్ని చోట్ల శంఖాలతో ఉంది. కొన్ని చోట్ల నీలమేఘంలా ఉంది. కొన్ని చోట్ల తరంగాలతో నిండింది. కొన్ని చోట్ల మొసళ్ళతో కూడి

యున్నది. కొన్ని చోట్ల భయంకరమైన సుడి గుండాలతో ఉన్నది. కొన్ని చోట్ల చలించని నీళ్ళతో నిండియున్నది. ఈ వర్ణనతో మన ఎదుటకు సముద్రాన్ని తీసుకొచ్చి చూపించాడు భాసుడు.

భాస మహాకవి యుద్ధాన్ని యజ్ఞంతో పోలుస్తాడు.

కరివరకరయూపో బాణవిన్యస్తదర్భో
హతగజచయనోచ్చైర్వైర వహ్నిప్రదీపః ।
ధ్వజ వితతతవితానః సింహనాదోచ్ఛమంత్రః
పతిత పతిమనుష్యః సంస్థితో యుద్ధయజ్ఞః ॥

యజ్ఞంలో యూపస్తంభం ఉంటుంది. యుద్ధంలో ఏనుగులే యూప స్తంభాలు. బాణాలే దర్భలు. వైరమే అగ్నిహోత్రం. పతాకాలే పరచబడిన దర్భాసనాలు. సింహనాదాలే మంత్రాలు. పడిపోయిన మనుష్యులే పశువులు.

ఇలా యుద్ధ యజ్ఞాన్ని వర్ణించాడు భాసుడు. ఇట్టి లోకోత్తర వర్ణనా విశారదుడైన భాస మహాకవిని

"వాల్మీకి వైభవ నిదర్శన మాదికావ్యం
రంగే నిదర్శితమయం సరసం చకార ।
వ్యాసస్య భారత మభారతయా సుదర్మం
కృత్వాచ తత్ర వివిధాః స్వకథా యుయోజ ॥" అని

సముద్రగుప్తుడు ప్రశంసించాడు.

**1.1.1.10 అనంతర కవులపై భాస మహాకవి ప్రభావం :-** భాస మహాకవి భావాలనే తదనంతర కవులు భంగ్యంతరంగా ఉపయోగించుకొన్నారు తమ కృతులలో.

"సర్వ శోభనీయం సురూపం నామ" - ప్రతిమా నాటకం.
మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో
"కిమివ హి మధురాణాం మండనం నాకృతీనామ్?" అని వర్ణించాడు.

"హృదయనేహ తత్రాంగైర్ద్విధా భూతేవ గచ్ఛతి ।
యథా నభసి తోయే చ చంద్రలేఖా ద్విధా స్థితా ॥"
- బాల చరితం

"గచ్ఛతి పురశ్శరీరం, ధావతి పశ్చాద సంస్థితం చేతః ।
చీనాంశుకమివ కేతోః, ప్రతివాతం నీయమానస్య ॥"
- అభిజ్ఞాన శాకుంతలం

"యస్యాం న ప్రియమండనాపి మహిషీ దేవస్య మండోదరీ ।
స్నేహాల్లుంపతి పల్లవాన్న చ పునర్వీజన్తి యస్యాం భయాత్ ॥"

అని భాసుడు అభిషేక నాటకంలో వర్ణించిన దానికి సామ్యం

"నాదత్తే ప్రియమండనాపి భవతాం స్నేహేన యా పల్లవమ్"

అని శాకుంతలంలో కనిపిస్తుంది.

"చక్రారి పంక్తిరివ గచ్ఛతి భాగ్యపంక్తి" (స్వప్న వాసవదత్తం)

అని భాసుడు విధివిలాసాన్ని వర్ణిస్తే

"నీచైర్గచ్ఛత్యుపరిచదశా చక్రనేమి క్రమేణ"

అని కాళిదాసు ఉల్లేఖించాడు మేఘ సందేశంలో

"కాష్ఠా దగ్నిర్జాయతే మథ్యమానాత్
భూమిస్తోయం ఖన్యమానా దదాతి ।
సోత్సాహానాం నాస్త్య సాధ్యం నరాణాం
మార్గారబ్ధాః సర్వయత్నాః ఫలంతి ॥"

అని భాసుడు స్వప్న వాసవ దత్తంలో వర్ణిస్తే,

"కాష్ఠం హి మథ్నన్ లభతే హుతాశం
భూమిం ఖనన్ విందతి చాపి తోయం ।
నిర్బంధినః కించన నాస్త్య సాధ్యం
న్యాయేన యుక్తం చ కృతం చ సర్వమ్ ॥"

అని బుద్ధ చరితంలో అశ్వఘోషుడు వర్ణిస్తాడు.

భాసుడు రచించిన చారుదత్తంలోని శ్లోకాలు కొద్ది పాటి భేదముతో శూద్రకుడు రచించిన మృచ్ఛకటికంలో కనిపిస్తాయి.

ఈ విధంగా అనంతర కవుల పై భాసుని ప్రభావం అధికంగానే ఉన్నదని చెప్పవచ్చు.

7.1.11 **ప్రతిమా నాటక కథా సంగ్రహం :-** ప్రతిమా నాటకంలో ఏడు అంకాలున్నాయి. శ్రీ మద్రామాయణం నుండి ఇతివృత్తం గ్రహించటం జరిగింది. అయోధ్య, అరణ్య కాండాల్లోని కథను ఆధారం చేసుకొని ఈ నాటకం రచింపబడింది. కిష్కింధ, సుందర, యుద్ధ కాండల్లోని కథా వస్తువు స్వల్పంగా గ్రహించబడింది. శ్రీరామ పట్టాభిషేక భంగంతో ప్రారంభమైన యీ నాటకం శ్రీరామ పట్టాభిషేకంతో ముగుస్తుంది.

**ప్రతిమా నాటకంలోని పాత్రలు :-**

**పురుష పాత్రలు**

| | | |
|---|---|---|
| సూత్రధారః | - | సూత్రధారుడు |
| రాజా | - | కోసలాధిపతియైన దశరథుడు |
| రామః | - | దశరథుని జ్యేష్ఠ పుత్రుడు |

| | | |
|---|---|---|
| లక్ష్మణః | - | రాముని తమ్ముడు |
| భరతః | - | రాముని తమ్ముడు |
| శత్రుఘ్నః | - | రాముని తమ్ముడు |
| సుమన్త్రః | - | మంత్రి మరియు దశరథుని సారథి |
| రావణః | - | రాక్షస రాజు, సన్యాసి వేషధారి |
| కాంచుకీయః | - | కంచుకి |
| సూతః | - | సారథి |
| దేవకులికః | - | ప్రతిమాగృహ రక్షకుడు |
| భటః | - | పుర రక్షకుడు |
| వృద్ధతాపసౌ | - | ఇద్దరు ముసలి తాపసులు రామ - రావణ యుద్ధాన్ని వర్ణిస్తారు |
| తాపసః | - | పరివ్రాజకుడు |
| నన్దిలకః | - | ప్రరివ్రాజక సేవకుడు |

**స్త్రీ పాత్రలు**

| | | |
|---|---|---|
| నటీ | - | నటి |
| సీతా | - | రాముని భార్య |
| కౌసల్యా | - | రామునితల్లి |
| సుమిత్ర | - | లక్ష్మణ, శత్రుఘ్నుల తల్లి |
| కైకేయీ | - | భరతుని తల్లి |
| అవదాతికా | - | సీత చెలికత్తె |
| చేటీ | - | సీత సేవిక |
| ప్రతీహారీ | - | ప్రతీహారి |
| విజయా, నన్దినికా | - | కైక సేవికలు |
| తాపసీ | - | స్త్రీ సన్యాసి |

**ప్రథమాంకం :-** శ్రీరామ పట్టాభిషేకానికి ఏర్పాట్లు చేయబడినవి. సీత తన చెలికత్తెలతో ముచ్చటించే సమయంలో అవదాతిక అనే చెలికత్తె నేపథ్య పాలిని మీద కోపంతో నార బట్టలను దొంగచాటుగా తీసుకొని వస్తుంది. నార చీరను చూచిన సీత తనకు కూడ బాగుంటుందేమో అనుకొని ధరిస్తుంది. అంతలో శ్రీరాముడు అక్కడకు వస్తాడు. అభిషేకం తనకు వద్దన్నప్పటికీ తండ్రిగారే ఆ కార్యక్రమాన్ని తలపెట్టారని, అభిషేక సమయానికి మంథర వచ్చి మహారాజు చెవిలో ఏదో చెప్పగానే అభిషేకం ఆగిపోయిందని వివరిస్తాడు. శ్రీరాముడు, కంచుకి వచ్చి కైక కోరిన దారుణ వరాలను తెలియజేస్తాడు. అవి తనకు కూడ అభిలషణీయాలే అని అంటాడు శ్రీరాముడు. దశరథ మహారాజు మూర్ఛపోయాడనే వార్త తెలియగానే లక్ష్మణుడు కోపంతో ఆగ్రహోదగ్రుడవుతాడు. శ్రీరాముడు అతనిని అనునయించి శాంతపరుస్తాడు. సీతా లక్ష్మణ సమేతుడై శ్రీరాముడు అడవికి బయలుదేరాడు.

**ద్వితీయాంకం :-** సీతా రామలక్ష్మణులు అడవికి వెళ్ళిపోయారనే వార్తను విన్న దశరథుడు మూర్ఛపోయి, కౌసల్యా, సుమిత్రల సహాయంతో మరల లేచి రాముడి కోసం అడుగుతూ ఉంటాడు. సుమంత్రుడు సీతారామలక్ష్మణులను అడవిలో దింపి వెనుకకు తిరిగి వస్తాడు. "అడవిలో విడిచిపెట్టే సమయంలో వారు ఏమైనా చెప్పారా?" అన్న ప్రశ్నకు "వారేదో చెప్పాలనుకొని కన్నీరు మున్నీరుగా విలపించటం వలన మాట రాక ఏమీ చెప్పకుండానే మౌనంగానే వెళ్ళి పోయారని సుమంత్రుడు సమాధానమిచ్చాడు. ఆ మాటలను విన్న దశరథుడు భరించలేని పుత్ర శోకంతో ప్రాణాలను విడిచిపెడతాడు.

**తృతీయాంకం :-** చనిపోయిన సూర్య వంశపురాజుల ప్రతిమలను ఒక చోట ఉంచుట ఆనాటి ఆచారం. అట్లే దశరథుని ప్రతిమ కూడ అక్కడకు చేర్చటం జరిగింది. కౌసల్య, సుమిత్ర, కైక మొదలగు వారు ఆ ప్రతిమను చూడటానికి అక్కడకు వస్తారు. మేనమామ ఇంటి నుండి అయోధ్యకు వస్తున్న భరతుడు, నగర ప్రవేశానికి ముహూర్తం మంచిది కాదని పురోహితులు సూచించగా రాజకుమారుడు అక్కడే ఆగిపోతాడు. కాలక్షేపానికి ప్రతిమా గృహంలో ప్రవేశిస్తాడు. అంతకు ముందెప్పుడూ భరతుడు ఆ ప్రతిమా గృహానికి వెళ్ళలేదు. అక్కడున్న దేవకులికుడు ఆ ప్రతిమలు ఎవరెవరివో వివరిస్తాడు. దశరథుడి గురించి కూడ వివరిస్తాడు. భరతుడి అనుమానం రూఢి అయింది. తండ్రి మరణించాడనే వార్త తెలియగానే భరతుడు అక్కడే కుప్పకూలిపోతాడు. అంతలోనే కౌసల్య, సుమిత్ర, కైక మొదలైన వారు అక్కడకు చేరుకోగా భరతుడు తన తల్లి కైకను గట్టిగా నిందిస్తాడు. అభిషేకాన్ని తిరస్కరిస్తాడు భరతుడు.

**చతుర్థాంకం :-** తండ్రికి అపరకర్మలు చేసి, అభిషేకాన్ని తిరస్కరించిన భరతుడు, సుమంత్రునితో అరణ్యానికి వెళ్ళాడు. ఇంతకు ముందు లక్ష్మణుడ్ని చూడకపోవటం చేతనో అతడ్ని గుర్తించడు భరతుడు. సుమంత్రుడు పరిచయం చేస్తాడు. రాజ్యాన్ని గ్రహించమని భరతుడు అన్నగారిని కోరగా, తండ్రిని అసత్యవాదిగా చేయరాదని హెచ్చరిస్తాడు శ్రీరాముడు. దానితో మారు మాట్లాడలేక వనవాసం పూర్తయ్యేవరకు రాజ్యాన్ని చూస్తానని, రామ పాదుకలకే అభిషేకం చేస్తానని భరతుడు విన్నవిస్తాడు. రాముడు "అట్లే" అని అంగీకరిస్తాడు.

**పంచమాంకం :-** పర్ణకుటీర ప్రాంగణంలో సీత మొక్కలకు నీళ్ళు పోయుచుండగా శ్రీరాముడు అక్కడకు వస్తాడు. తండ్రి గారికి ఆబ్దికాన్ని ఏ విధంగా పెట్టాలి అని శ్రీరాముడు ఆలోచిస్తున్న సమయంలో రావణుడు సన్యాసి వేషంలో అక్కడకు వస్తాడు. తాను వేదవేదాంగ వేత్తనని పరిచయం చేసుకుంటాడు. శ్రీరాముడు శ్రాద్ధకల్పాన్ని వివరించమని కోరగా, రావణుడు శ్రాద్ధీయ వస్తువుల గురించి తెలుపుతూ హిమవత్ పర్వతం మీద కాంచనపార్శ్వాలనే మేలుజాతి మృగాలు లభిస్తాయని, కాని ఆ మృగాలు మానవుల కన్నులకు కనిపించవని చెబుతాడు. శ్రీరాముడు వాటిని అక్కడికే తీసుకొని వస్తానని చెబుతాడు. అంతలోనే బంగారులేడి కనిపిస్తుంది. తీర్థయాత్రలు ముగించుకొని తిరిగి వస్తున్న కులపతిని స్వాగతించటానికి లక్ష్మణుడు ఆశ్రమం నుంచి బయటకు వెళతాడు. బంగారు లేడిని పట్టుకోవటానికి శ్రీరాముడు వెళతాడు. అదే సరియైన సమయమని భావించి రావణుడు తన అసలు రూపంతో సీతను అపహరించుకుపోతాడు. జటాయువు అడ్డుపడగా అతని రెక్కలు నరికేస్తాడు రావణుడు.

**షష్ఠాంకం :-** రావణునితో పోరాడి జటాయువు మరణిస్తాడు. భరతుడు శ్రీరాముని క్షేమ సమాచారం తెలిసికొని రమ్మని సుమంత్రుని పంపుతాడు. అతడు అరణ్యానికి వెళ్లి సీత అపహరించబడిందనే విషాద వార్తను మోసుకొస్తాడు. పట్టరాని కోపంతో తల్లిని పిలిచి "సీత అపహరింపబడిందని చెప్పి ఇప్పటికి నీ కోరిక తీరిందా?" అని దూషిస్తాడు. అప్పుడు కైక, దశరథ మహారాజుకు పుత్ర శోకంతో మరణిస్తాడని ముని శాపము ఒకటి ఉన్నదని సుమంత్రుని ద్వారా తెలుపుతుంది. శాపము అవార్యం కాబట్టి రాముని వనవాసం కోరానని, పద్నాలుగు రోజులనబోయి

పద్నాలుగు సంవత్సరాలని పొరపాటుగా పలికానని కైక వివరిస్తుంది. తపస్విని మరియు పాపరహితయైన తల్లిని దూషించినందుకు భరతుడు ఎంతగానో పశ్చాత్తాపతప్తుడై తల్లిని క్షమాపణ వేడుకుంటాడు. శ్రీరామునికి సహాయం చేయటానికి సైన్యంతో బయలుదేరతాడు.

**సప్తమాంకం :-** శ్రీరాముడు రావణుడ్ని సంహరించి విభీషణుడికి పట్టాభిషేకం జరిపిస్తాడు. సీతను తీసికొని పుష్పక విమానంలో జన స్థానానికి శ్రీరాముడు చేరుకొంటాడు. భరతుడు తల్లులతో, పౌరులతో శ్రీరామునికి ఎదురు వెళ్ళి అభినందనలు తెలుపుతాడు. వశిష్ఠాది మహర్షులు శ్రీరామునికి పట్టాభిషేకం చేస్తారు.

**డా॥ పి. వరప్రసాదమూర్తి**
**అధ్యక్షులు**
**పాఠ్య నిర్ణాయక మండలి**
**తెలుగు - ప్రాచ్య భాషా విభాగం**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**
**గుంటూరు.**

పాఠం - 8

# రూపక రచన వైశిష్ట్యం - దశ రూపకాలు - నాటక లక్షణం

కావ్యం ప్రధానంగా దృశ్యం, శ్రవ్యం అని రెండు రకాలు. దృశ్యమనగా అభినయించబడేది. ఆంగికం, వాచికం, సాత్త్వికం, ఆహార్యం అని అభినయం నాల్గు రకాలు. అవస్థలను అనుకరించడమే నాట్యం. చూడబడుతుంది కాబట్టి రూపమనీ, నటుని యందు రామాది పాత్రలు ఆరోపించబడతాయి కాబట్టి రూపకమనీ కూడా పేర్లు. నాట్యశాస్త్రాది గ్రంథాల్లో నాట్యం, రూపం, రూపకం అనేవి పర్యాయ పదాలుగా వాడబడ్డాయి. రూపకం పది రకాలు. వాటికే దశరూపకాలని ప్రసిద్ధి.

అవస్థానుకృతిర్నాట్యం
రూపం దృశ్యత యోచ్యతే
రూపకం తత్సమారోపాత్
దశధైవ రసా శ్రయమ్

నాటకం సప్రకరణం భాణః ప్రహసనం డిమః, వ్యాయోగ సమవకారౌవీథ్యంకేహామృగా ఇతి.

1. నాటకం, 2. ప్రకరణం, 3. భాణం, 4. ప్రహసనం, 5. డిమం,
6. వ్యాయోగం, 7. సమవకారం, 8. వీథీ, 9. అంకం, 10. ఈహామృగం

ఇవీ దశ రూపకాలు. సంపూర్ణ లక్షణాలు కల్గి ఉండడం వలన నాటకం మిగిలిన రూపకాలన్నిటికీ 'ప్రకృతి' (మూలం)గా చెప్పబడింది.

'ప్రకృతి త్వాదథాన్యేషాం భూయో రస పరిగ్రహాత్
సంపూర్ణ లక్షణత్వాచ్చ పూర్వం నాటక ముచ్చతే'

నాటకం దశ రూపకాల్లో ఒకటే అయినా, 'నాటకం' అనే పదం దృశ్య కావ్యాలన్నిటికి సామాన్య వాచకంగా ఆలంకారికుల చేత ప్రయోగించబడింది. భరతుని నాట్య శాస్త్రంలో కూడా 'నాటక' శబ్దం రూపక సామాన్య వాచిగా ప్రయోగించబడింది.

'నాటకాన్తం హి సాహిత్యం', 'కావ్యేషు నాటకం రమ్యం', 'సందర్భేషు దశరూపకం శ్రేయః' అనే ఆర్యోక్తులు రూపక రచనకు గల వైశిష్ట్యాన్ని వ్యక్తం చేస్తాయి. రూపకాలన్నీ రసాశ్రయములే అయినా, వస్తువు, నాయకుడు, రసం అనే భేదకములచే అవి పది రకాలుగా చెప్పబడ్డాయి.

వస్తు నేతా రసస్తేషాంచభేదకః - (దశరూపకం)

1. **వస్తువు :-** రూపక వస్తువుకు వృత్తమనీ, ఇతివృత్తమనీ పేర్లు. ఇతివృత్తం నాట్య శరీరంగా చెప్పబడింది.

ఇతివృత్తంతు నాట్యస్య శరీరం పరికీర్తితమ్. ఇతివృత్తం ప్రధానంగా మూడు రకాలు.

1. ప్రఖ్యాతం - రామాయణాది ఇతిహాస ప్రసిద్ధం
2. ఉత్పాద్యం - కవి కల్పితం
3. మిశ్రం - పై రెండింటి సమ్మేళనం

నాయకుడికి సంబంధించిన ఇతివృత్తానికి ఆధికారిక ఇతివృత్తమనీ, సహాయ నాయకుడికి (పతాక నాయకుడు) సంబంధించిన ఇతివృత్తానికి ప్రాసంగిక ఇతివృత్తమనీ పేర్లు.

2. **నాయకుడు :-** నాయకుడు ప్రధానంగా నాల్గు రకాలు.

1. ధీరోదాత్తుడు, 2. ధీరశాంతుడు, 3. ధీరలలితుడు, 4. ధీరోద్ధతుడు

శృంగార నాయక భేదాలు నాల్గు

1. దక్షిణుడు, 2. శఠుడు, 3. ధృష్టుడు, 4. అనుకూలుడు

3. **రసం :-**శృంగారాది నవ రసాలు.

శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః,
భీభత్సాద్భుత శాంతాశ్చ నవనాట్యేరసాః స్మృతాః

**నాటక లక్షణం :-**

1. ఇతివృత్తం - ప్రఖ్యాతం అయి ఉండాలి
2. నాయకుడు - ధీరోదాత్తుడు
3. రసం - శృంగారం, వీరం, (శాంతం) అంగిరసాలుగా ఉండాలి. నిర్వహణలో అద్భుత రసం ప్రయోగించాలి.

4. **పంచ సంధులు :-**

1. ముఖ సంధి, 2. ప్రతిముఖ సంధి, 3. గర్భసంధి, 4. విమర్శ సంధి, 5. నిర్వహణ సంధి

**పంచకార్యావస్థలు :-** ఆరంభ - యత్న - ప్రాప్త్యాశా - నియతాప్తి - ఫలాగమం

**పంచ అర్థప్రకృతులు :-** బీజ - బిందు - పతాకా - ప్రకరీ - కార్యాలు

అవస్థలు అయిదు. అర్థ ప్రకృతులతో కలిసి పంచ సంధులు ఏర్పడతాయి. ఈ సంధులకు ఉపకరించేవి సంధ్యంగాలు ఇవి 64.

5. **అర్థో పక్షేపకాలు :-** ప్రదర్శించడానికి యోగ్యం కాని, కేవలం సూచించబడే ఇత్వృవృత్త భాగాలు అర్థోపక్షేపకాలు. (techniques of the stage) ఇవి 5.

1. విష్కంభము, 2. ప్రవేశకము, 3. చూలికా, 4. అంకావతారము, 5. అంకాస్యము.

6. **అంక సంఖ్య :-** నాటకంలో 5 - 10 అంకాలు ఉండాలి.

(పంచాంకమేతదవరం దశాంకం నాటకం వరం)

**అంక స్వరూపం :-** అంకమనేది రూఢి శబ్దం. నానా విధాన సంయుక్తం, వివిధ రస భావాలతో అర్థాలను ప్రరోహింపచేసేది అంటే ప్రత్యక్ష భావనా యోగ్యాలుగా చేసేది. ఇది సామాన్యార్థం. దీని విశేషార్థం - అంక శబ్దం లక్షణం అనే అర్థంలో రూఢం. ఈ లక్షణం వల్ల అంకానికీ, ప్రవేశకాదులకు గల భేదం స్పష్టంగా తెలుస్తుంది. ఎందువలనంటే అంకం అభినేయం.

ప్రవేశకాదులు అనభినేయాలు. అంకం వల్ల రూపకానికి నానాత్వం సిద్ధిస్తుంది. అందువల్ల లక్షణార్థంలో అంక శబ్దం అన్వర్థం.

**అంక లక్షణం :-** నాయకుని చరితం ప్రత్యక్షంగా చూపించేదీ, రస భావాలతో ఉజ్జ్వలంగా ఉండేదీ, శబ్దార్థాలు అగూఢంగా ఉండేదీ, చిన్న వాక్యాలతో కూడుకున్నదీ ప్రత్యేక అవాంతర ప్రయోజనం కల్గినదీ అంకమని పిలువబడుతుంది.

**అంక నిషిద్ధ విషయాలు :-** దూర ప్రయాణం, వధ, యుద్ధం, రాజ్య దేశాది విప్లవం, ముట్టడించుట, భోజనం, స్నానం, సురతం, అనులేపనం, అంబర గ్రహణం (వస్త్ర గ్రహణం) ఇత్యాదులు అంకంలో ప్రత్యక్షంగా నిషిద్ధములు.

## A. ప్రతిమానాటక నామౌచిత్యం

మూడో అంకంలోని ప్రతిమా గృహ సన్నివేశం ఆధారంగా ఈ నాటకానికి 'ప్రతిమా నాటక'మనే పేరు సిద్ధించింది. అయితే ఈ పేరు భానుడే స్వయంగా ఈ నాటకానికి పెట్టాడా అన్నది చెప్పడం కష్టం. ఎందుకంటే మిగిలిన నాటక కర్తలలాగా భానుడు స్థాపనలో (ప్రస్తావనలో) ఎక్కడా నాటకం పేరు ప్రస్తావించలేదు. మహామహోపాధ్యాయ టి. గణపతి శాస్త్రిగారే ఈ నాటకానికి 'ప్రతిమా నాటకం' అని పేరు పెట్టినట్లుగా పండితుల అభిప్రాయం.

ప్రస్తావనలో నాటకం పేరు ప్రస్తావించకపోయినా 'నాందీ శ్లోకంలో' 'రావణార్య ప్రతిమః' అనే సమస్తపదంలో ప్రయోగించిన 'ప్రతిమ' అనే పదం నాటక సంజ్ఞకు మూల హేతువైన మూడో అంకంలోని ప్రతిమా గృహ సూచకమనీ అదే నాటక సంజ్ఞకు ఆధారమనీ కొందరు విమర్శకుల అభిప్రాయం (M.R. Kale). కానీ నాందీ శ్లోకంలో 'రావణార్య ప్రతిమః' అణే సమస్త పదంలో ఉన్నది 'అప్రతిమ'యే కాని 'ప్రతిమ' మాత్రం కాదు (రావణారి + అప్రతిమః).

ప్రతిమా నాటకం అనే పేరు పాణినీయం కూడా కాదు. పాణినీయమయితే మిగిలిన నాటకాల్లాగా మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, వేణీ సంహారం మొ॥న పేర్లలాగే 'ప్రతిమం' అని అయి ఉండేది. కాబట్టి ప్రతిమా (గృహ) ప్రధానం నాటకం ప్రతిమానాటకం అని అన్వర్థ సంజ్ఞ.

### ప్రతిమా గృహం :-

మూడో అంకంలో భరతుడు మాతుల గృహం నుండి అయోధ్యకు తిరిగివస్తూ ఊరి బయట ఉన్న ప్రతిమా గృహం దగ్గర విశ్రాంతి కోసం ఆగుతాడు. అక్కడి ద్వారపాలకుడైన దేవకులికుని ద్వారా దిలీపుడు, రఘువు, అజుడు మొ॥గు ఇక్ష్వాకు వంశపు రాజుల ప్రతిమల్ని చూస్తాడు. వాటితోబాటు దశరథుని ప్రతిమను చూసి 'జీవిస్తున్నవారి ప్రతిమలు కూడా ఇక్కడ ప్రతిష్ఠించబడతాయా' అని ద్వారపాలకుని ప్రశ్నిస్తాడు. కేవలం మరణించిన వారి ప్రతిమలే ప్రతిష్ఠించబడినట్లుగా దేవకులికుడు చెప్తాడు. ఆ విధంగా ప్రతిమా గృహంలో దశరథుని మరణవార్త విన్న భరతుడు స్పృహతప్పి పడిపోతాడు. దేవకులికుని ద్వారా తండ్రి మరణానికి కారణమైన కైకేయి వరం గూర్చి వింటాడు. తండ్రి మరణ వార్తతోబాటు సీతా, లక్ష్మణ సహాయుడైన రాముని వనగమన వార్త కూడా విని నిర్విణ్ణుడై స్పృహ కోల్పోతాడు. పితృశోకంతో కైకేయి పై కోపంతో భరతుడు అయోధ్యను ప్రవేశించకుండా, నేరుగా అక్కడ నించే తన తల్లులతో రాముని కలవడానికి వనానికి బయల్దేరతాడు. ఇదీ మూడో అంకంలోని 'ప్రతిమాగృహ' సన్నివేశం.

### నాటక సంజ్ఞ - ఆలంకారికులు :-

నాటకం పేరు ఇతివృత్తం, నాయకుడు, నాయిక లేక నాయికా నాయకులిద్దరి మీద కాని ఆధారపడి ఉండాలని అలంకార శాస్త్ర గ్రంథాల్లో చెప్పబడింది.

వస్తునో నాయకస్యాపి నాయికాయాః తథోభయోః ।
కవేరభిదయా వాపి కుర్యాత్ గ్రంథాభిధాం బుధాః ॥

ఉదా॥

| | | |
|---|---|---|
| అభిజ్ఞాన శాకుంతలం | - | వస్తువు (నాయిక) |
| మృచ్ఛ కటికం | - | వస్తువు |
| ఉత్తర రామ చరితం | - | నాయకుడు |
| రత్నావళి | - | నాయిక |
| మాళవికాగ్ని మిత్రం | - | నాయికా నాయకులు |
| మాలతీ మాధవం | - | నాయికా నాయకులు |

అభిజ్ఞాన శాకుంతలం నాటకంలో అభిజ్ఞానం మృచ్ఛకటికంలో 'మృత్ శకటిక' మొ॥నవి కథాగమనంలో ముఖ్యమైన మలుపుని సూచిస్తాయి. మరి ప్రతిమా నాటకంలో ప్రతిమా గృహ సన్నివేశం కథలో మలుపుగా కాకపోయినా మూడో అంకం తర్వాత నాటకం చివరి వరకు జరిగే ఇతివృత్తానికి ఇదే పతాకా సన్నివేశంగా చెప్పవచ్చు. ఇది రామాయణ మూలంలో లేకపోయినా భాసకవి కల్పితమైన ఉత్కంఠా భరితమైన వినూత్న సన్నివేశమని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

## B. సీత పాత్ర చిత్రణం

సీత మిథిలాధీశుడయిన జనకుని పుత్రిక. రాముని ధర్మపత్ని. వారిరువురిదీ అన్యోన్య దాంపత్యం. ఆమె సర్వావస్థల యందు రామునికి సహధర్మచారిణి. భవభూతి ఉత్తర రామ చరితంలో 'అద్వైతం సుఖదుఃఖయోరనుగతం సర్వాస్వవస్థాసుయత్' అని వీరి దాంపత్యం ఎంతటి అపురూపమయిందో వర్ణిస్తాడు.

ప్రథమాంకంలో రాముడు పట్టాభిషేకాన్ని ఆపేసిన వార్త చెప్పగానే ఆమె కించిత్తు కూడా బాధపడకపోగా దశరథుడే మహారాజుగా ఉన్నందుకు సంతోషిస్తుంది.

ప్రియం మే మహారాజ ఏవ మహారాజః

ఆర్యపుత్ర ఏవార్య పుత్రః

పట్టాభిషేక సమయంలో శ్రీరాముడెట్లు ప్రవర్తించెనో, సీత ఊహించి కళ్ళతో చూసినట్లు చెప్పగానే రాముడు -

'ఆల్పం తుల్యశీలాని ద్వంద్వాని సృజ్యన్తే'

అని ఆమె ఊహను మెచ్చుకుంటాడు. ప్రథమాంకంలోనే అవదాతిక వల్కలాలు తెచ్చినపుడు సీత ఆ వల్కలాలు తనకి బాగుంటాయా అని ఆమెను ప్రశ్నిస్తుంది. వెంటనే అవదాతిక - 'సర్వశోభనీయం సు'రూపం నామ' * అని ఆమె సౌందర్యాన్ని శ్లాఘిస్తుంది.

* - ఇదే భావం 'అభిజ్ఞాన శాకుంతలం'లో 'కిమివ హిమధురాణాం మండనం నాకృతీనామ్' అనే కాళిదాసు వాక్యంలో కన్పిస్తుంది.

వనవాసానికి రాముని అనుసరించి తనుకూడా వస్తున్నట్లు తెలియచేస్తూ 'సహధర్మచారిణీ ఖల్వహం' అంటూ పతివ్రతా ధర్మాన్ని రామునికి గుర్తు చేస్తుంది. ఆమెను వనవాసం నుండి మరలించాలని రాముడు ఎంత ప్రయత్నించినా, రాముని వాదనలన్నిటికీ ధర్మబద్ధంగా సమాధానాలిచ్చిన సతీమణి.

సీత దయామూర్తి. వనగమనానికి తనకి కూడా అనుమతి ఇమ్మని లక్ష్మణుడు అభ్యర్థించగానే - దేయతాం ఖల్వార్యపుత్రః సంతప్యతే సౌమిత్రిః' - అని రామునితో ఒప్పిస్తుంది. అలాగే నాల్గో అంకంలో వన వాసంలో ఉన్న సీతారాముల దగ్గరకి భరతుడు వెళ్తాడు. భరతుడు పాదుకలిమ్మని వేడగానే - 'నను దీయతే ఖలు ప్రథమ యాచనం భరతాయ' అని రాముని ఒప్పించి పాదుకలిప్పించేలా చేస్తుంది.

లక్ష్మణుడు, భరతుడు మొ॥న వారి యందు పుత్ర వాత్సల్యం నిండిన మాతృమూర్తి. భరతుడు వెంటనే అయోధ్యకి తిరిగి వెళ్ళాలని రాముడనగానే - ......అద్యైవ గమిష్యతి కుమారో భరతః' - (అయ్యో వెంటనే ఈ రోజే వెళ్ళిపోతున్నాడు భరతుడు) అని బెంగతో బాధపడ్తుంది. ఆశ్రమంలోని వృక్ష, లతాదులకు తనే స్వయంగా నీళ్ళు పోసి (జల సేచనం చేసి) కన్నబిడ్డల వలె చూసుకుంటుంది.

సీత మహా పతివ్రత. పంచమాంకంలో వనవాసంలో ఉన్న సీతారాముల దగ్గరకి సీతను అపహరించడం కోసం రావణుడు పరివ్రాజక (సన్యాసి) వేషంలో వస్తాడు. అతిథిగా వచ్చిన రావణునికి శుశ్రూష చెయ్యమని రాముడు చెప్తాడు. వెంటనే రావణుడు - 'ఈమె ఒక్కర్తే ఈ సమస్త జగత్తులో స్త్రీలందరిలోను అరుంధతి (పతివ్రత). ఎవరి యొక్క భర్తగా నిన్ను స్త్రీలందరు పూజిస్తారో' అంటాడు. సాక్షాత్తు శత్రువయిన రావణుడు పలికిన ఈ మాటలు ఆమె అసమాన పాతివ్రత్యానికి నిదర్శనం.

ఇయమేకా పృథివ్యాం హి మానుషీణామరుంధతీ,
యస్యా భర్తేతి నారీభిః సత్కృతః కథ్యతేభవాన్.

రాముడు శరీరమైతే అన్ని వేళలా వెన్నంటి ఉండే ఛాయ వంటిది సీత అని అంటాడు రావణుడు.

'అయి ఛాయాం పరిహృత్య శరీరం న లంఘయామి'

ప్రథమాంకంలో రాముని వనగమన వార్త విని రోషంతో మండిపడ్తున్న లక్ష్మణుడు ధనుర్ధారియై రాముణ్ణి శర సంధానం చెయ్యమంటాడు. అది విని సీత రామునితో దుఃఖించాల్సిన సమయంలో లక్ష్మణుడు బాణం సంధించాడే అని రామునితో వాపోతుంది.

పంచమాంకంలో రావణుడు మారు వేషంలో వచ్చి పన్నాగం పన్ని, రాముణ్ణి వనానికి పంపగానే ఒక అబలగా తన ఒంటరితనానికి భయపడ్తుంది. రావణుడు సీతతో తనని కూడా భర్త అయిన రాముని లాగే పరిగణించమన్నపుడు, ఆమె కోపంతో 'శప్తోఽసి' అని శపిస్తుంది. అది విని రావణుడు ఆహా ఏమి పతివ్రత యొక్క తేజో మహిమ అని ఆశ్చర్యపోతాడు. అతి వేగంగా ఆకాశంలో ఎగిరినపుడు సూర్యకిరణాల చేత కూడా దహింపబడని నేను ఈమె పరిమితమైన 'శప్తోఽసి' అన్న అక్షరాలచే దహింపబడుతున్నానంటాడు.

హహహ అహో పతివ్రతాయాస్తేజః
యోఽహ ముత్పతితో వేగాత్, నదగ్ధః సూర్యరశ్మిభిః
అస్యాః పరిమితైః దగ్ధః శప్తోఽసీత్యేభిరక్షరైః

భరతుడామెను 'ద్విధాభూతమరుంధతీ చారిత్రం' అంటాడు. సీత మూర్తీభవించిన శీలమని సుమంత్రుడు ప్రశంసిస్తాడు. 'బాలాప్యబాల చారిత్రాభర్తుః సహధర్మచారిణీ' ఆమె మాట్లాడిన ప్రతి మాటలో చేసే ప్రతి పనిలో స్త్రీ జాతి ప్రతిష్ఠకే తలమానికమయిన వాత్సల్యం, ఔన్నత్యం, సహనం వంటి సద్గుణాలు బహిర్గతమవుతాయి. వనవాసానికి వెళ్ళిన సీత కోసం దశరథుడు హా! సాధ్వి! మైథిలి! పతిస్థిత చిత్తవృత్తే! అంటూ విలపిస్తూ కూడా ఆమె గుణశీలాదుల్నీ కీర్తిస్తాడు.

సప్తమాంకంలో రాముడు సీతాపహారి అయిన రావణుని సంహరించి విభీషణుని పట్టాభిషిక్తునిగా చేసి సీతను తీసుకువచ్చినట్లుగా చెప్పబడింది. సీత 'అగ్ని పరీక్ష' సన్నివేశం ఈ నాటకంలో చెప్పబడలేదు.

నిరాడంబరత, సహజమైన మృదు మధుర స్వభావం, పాతివ్రత్యం, పెద్దలు, గురువుల యెడ అమితమైన గౌరవం మొ॥వి సద్గుణాలన్నీ ఒక చోట మూర్తీభవించినది సీత పాత్ర. ఈ పాత్ర చిత్రణలో భాసుడు కొంత కృత కృత్యుడయ్యాడనే చెప్పవచ్చు. అంతేకాదు, ఈ పాత్ర చిత్రణ 'సీతాయాశ్చరితం మహత్' అన్న మాట నిరూపించినట్లుగా రాముని పాత్ర కంటే కూడా చాలా చక్కగా జరిగిందని చెప్పవచ్చు. ఇంతెందుకు, రావణుడు పలికిన 'ధన్యా భూమి ర్వర్తతే యత్ర సీతా' (సీత ఉన్న భూమి ధన్యమైంది) అన్న ఒక్క మాట చాలు ఆమె ధన్య జీవి అని చెప్పడానికి.

## శ్రీరాముడు - పాత్ర చిత్రణం

కౌసల్యా పుత్రుడిగ అవతరించిన శ్రీ మహా విష్ణువే శ్రీరాముడు. శ్రీరాముడు సజ్జనుడు, సౌమ్యుడు, సర్వజన మనోభిరాముడు. సత్పురుషుల సేవలకు యోగ్యుడు. ఇతరుల్ని చూసి ఆనందించేవాడు. ఇతరులకి ఆనందాన్ని కల్గించేవాడు రాముడు. అదే శ్రీరామతత్త్వం. అదే రామ శబ్దానికి అర్థం. సర్వగుణ సంపన్నుడైన నరుడెవరు? అని అడిగిన వాల్మీకి ప్రశ్నకు శ్రీరాముడు సర్వగుణ సంపన్నుడు ఈ గుణాల్ని ఎవరూ ఇన్ని అని వర్ణించడం అసాధ్యం. లోకంలో ఒక్కొక్క గుణం ఒక్కొక్క దాని యందు మాత్రమే ప్రసిద్ధంగా ఉంటుంది. అటువంటి గుణాలన్నీ ఒకచోట మూర్తీభవించినవాడే రాముడని నారదుడు చెప్తాడు.

ఉదాహరణకు గాంభీర్యంలో సముద్రుడు, ధైర్యంలో హిమవంతుడు, పరాక్రమంలో విష్ణువు, చంద్రుని వలే ప్రియదర్శనుడు, క్షమలో భూమి, త్యాగంలో కుబేరుడు, సత్యపాలనలో ధర్మదేవత అని వర్ణించబడ్డ సకల గుణ సంపన్నుడు. దేవతలు సాక్షాత్తు శ్రీమన్నారాయణునిగా స్తుతించినా, 'ఆత్మానం మానుషం మన్యే' అని తనను నరునిగానే తలచిన మహనీయుడు.

ప్రథమాంకంలో పట్టాభిషేక వార్తనూ, వనగమన వార్తనూ విని ఏ మాత్రం చలించక, ఒకే రకమైన స్ఫూర్తితో స్వీకరించిన ధీరుడు శ్రీరాముడు.

కాంచుకీయుని ద్వారా వనవాస గమనానికి కారణం ఐన కైకేయి గురించి తెలుసుకుని - 'ఇంద్రసముడైన భర్త, సత్పుత్రులచే ధన్యమైన ఆ మాతృమూర్తికి వేరే కోరిక ఏముంటుంది? ఈ అకార్యం ఎందుకు చేస్తుంది? అని ఆమెను సమర్థించిన మహోదారుడు (I - 13). ఆమె కారణంగానే పట్టాభిషేకం నిల్పివేయబడినది అని చెప్పినా ఈ రకంగా చేయడం తనకి ఉపకారమేనని, ఈ విధంగా చేయడం వల్ల ఎన్నో గుణాలున్నాయని కాంచుకీయునికి వివరిస్తాడు. భరతునికి అభిషేకం చేయాలనే కైకేయి లోభం, స్వార్థచింతన గూర్చి ప్రస్తావించినపుడు కూడా 'వివాహ సమయంలో శుల్కంగా మహారాజు ఇస్తానన్న రాజ్యాన్ని తన స్వపుత్రుడైన భరతునికి ఇమ్మని అడగటం సమంజసమే అనీ, అటువంటి రాజ్యాన్ని తమ్ముడికి కాకుండా తను అంగీకరిస్తే తనదే దోషమవుతుంది అని విడమర్చి చెప్పిన ధర్మమూర్తి. భరతుని అభిషేక వార్త, రాముని వనవాస వార్త విని కోపంతో మండిపడుతు లక్ష్మణుడు రాముణ్ణి

బాణం సంధించమంటాడు. వెంటనే రాముడు - 'భరతుడు రాజైతేనేం, మనం రాజైతేనేం, ఏదైనా సమానమే కదా. నువ్వు ధనుర్విద్యలో కుశలుడివైతే వెళ్ళి ఆ రాజునే (భరతుణ్ణే) రక్షించు' అని పల్కి లక్ష్మణుడి రోషాన్ని ఉపశమింపజేస్తాడు.

భరతో వా భవేద్రాజా వయం వానను తత్సమమ్ ।

యది తేఽస్తి ధనుః శ్లాఘా స రాజా పరిపాల్యతామ్ ॥

అంతేకాక లక్ష్మణుడితో ఇలా అంటాడు. 'నీలో రోషం తగ్గి శాంతం కల్గాలనే ఇలా చెప్పాను'. ఇప్పుడు చెప్పు, సత్యాన్ని గౌరవించే తండ్రి పై బాణం వెయ్యమంటావా? లేక తనకి శుల్కంగా రావల్సిన ధనాన్ని తీసుకున్న తల్లి పై బాణం వెయ్యనా? లేక ఏ దోషమూ చెయ్యని సోదరుడైన భరతుణ్ణి చంపమంటావా? ఈ మూడు పాతకాల్లో నీ క్రోధం చల్లారాలి అంటే (నీకు) ఏది అభిమతం అని చెప్పమంటూ లక్ష్మణుణ్ణి నిలదీస్తాడు. నార బట్టలను కూడా పరమ సంతోషంతో ధరించడమే కాకుండా, మిగిలిన రాజులకెవ్వరికీ దక్కని ధర్మాచరణ చేసే భాగ్యం - యుక్త వయస్సులోనే (పితృాజ్ఞా పాలన ధర్మం వన గమనం ద్వారా ఆచరించడం) తనకు కల్గిందని సంతోషపడ్డాడు.

మంగళార్థేఽనయా దత్తాన్ వల్కలాన్వావదనాయ ।

కరోమ్యన్యైన్నృపైర్ధర్మం నైవాప్తం నోపపాదితమ్ ॥

లక్ష్మణుడు తనతో వనానికి రావడానికి అంగీకరించి, వల్కలాలంటే తపస్సనే యుద్ధంలో కవచం, ఏనుగులను అదుపులో పెట్టే అంకుశం, ఇంద్రియాలనే అశ్వాలకు పగ్గం వేసే కళ్ళెం, ధర్మానికి సారథీ, వంటివని చెప్తూ లక్ష్మణుడికి వల్కలాలిస్తాడు. దీన్నిబట్టి వనవాసం అనేది కేవలం పితృాజ్ఞా పాలన ధర్మంగా కాకుండా, ఎంత నియమ నిష్ఠలతో ఆచరించవలసిన ధర్మంగా రాముడు స్వీకరించాడో మనకి తెలుస్తుంది.

వనవాసంలో ఉన్న రాముడికి భరతుడి ద్వారా పుత్ర శోకంతో తండ్రి మరణ వార్త తెలుస్తుంది. ఒక వైపు తన కోసం ప్రాణత్యాగం చేసిన తండ్రి, మరోవైపు తనకు ప్రాప్తించిన రాజ్యాన్ని కూడా త్యాగం చేసి తననే అనుసరించి వనానికి వచ్చిన సోదరుడు - ఓహ్! ఎటువంటి పుత్ర వాత్సల్యం! ఎటువంటి సోదర ప్రేమ! అని సీతతో భావావేశంలో అంటాడు. వనవాసానికి తన వెంట బయల్దేరిన సీతతో అత్తమామల శుశ్రూష కర్తవ్యాన్ని బోధిస్తాడు.

'శ్వశ్రూశ్వశురశుశ్రూషాపి చ తే నిర్వర్తయితవ్యా ।'

వనవాసానికి వెళ్ళిన రాముణ్ణి తల్చుకుని (దశరథుడు విలపిస్తూ) -

రామ! జగతాం నయనాభిరామ! సత్యసంధ!

జితక్రోధ! విమత్సర! జగత్ప్రియ! గురుశుశ్రూషణే యుక్త!

అంటూ దశరథుడు చేసిన ఒక్కొక్క సంబోధన రాముడి (గుణ శీలాలకి మచ్చుతునకల్లాంటివి) గుణాలన్నీ ఒక దగ్గర ఏర్చి కూర్చిన హారం లాంటివి.

**ఆచార్య ఎమ్.వి. రమణ**
**సంస్కృత శాఖాధ్యక్షులు**
**ఆంధ్ర విశ్వ విద్యాలయం**
**విశాఖపట్టణం**

పాఠం - 9

# పాత్ర చిత్రణ - A. భరతుడు

నాటకంలో భరతుని పాత్ర మనకి 3, 4, 6, 7 అంకాల్లో కన్పిస్తుంది. మూడో అంకంలో భరతుడొక్కడే ప్రధాన నాయకుడు. మూడో అంకం ప్రతిమా గృహ ఘట్టం యావత్తూ సంపూర్ణంగా భరతునితోనే సాగుతుంది. నాలుగో అంకంలో భరతుడు తన తల్లులతో రాముణ్ణి కలవడం కోసం వెళ్తాడు. ఆరో అంకంలో సీతను రావణుడు అపహరించిన ఉదంతం భరత - సుమంత్రుల సంభాషణ ద్వారా చెప్పబడుతుంది. ఈ అంకంలోనే కైకేయి - భరతుల సంభాషణం ప్రధానమైంది. చివరి అంకంలో రావణ సంహారం అనంతరం సీతారామ లక్ష్మణులను భరతుడు కలిసిన సన్నివేశం, ఇవీ భరతుని పాత్రకి సంబంధించిన ప్రధాన ఘట్టాలు.

రాముడంటే భరతునికి గల ప్రేమ, గౌరవం, నిజాయితీ నిరుపమానమైనవి. ప్రతిమా గృహంలో దిలీపుడు, రఘువు, అజుడు మొ॥న ఇక్ష్వాకు వంశపు రాజుల ప్రతిమలు చూసి వారి కీర్తి ప్రతిష్ఠల గురించి తెల్సుకుంటాడు. అందరికీ ప్రణామాలర్పిస్తాడు. ఆ రాజుల ప్రతిమల చెంతనే ఉన్న దశరథుని ప్రతిమను చూసి మనసులో ఉద్విగ్నత చెందుతాడు. వెంటనే దేవకులికుని 'ప్రతిమా గృహంలో జీవించి ఉన్నవాళ్ళ ప్రతిమలు కూడా ప్రతిష్టిస్తారా?' అని అడుగుతాడు. మరణించిన వారి ప్రతిమలు మాత్రమేనని దేవకులికుడు బదులిస్తాడు. ఆ రకంగా ప్రతిమ ద్వారా తండ్రి మరణ వార్త విని మూర్ఛపోతాడు. "కైకేయి పుత్రుడవైన భరతుడివేనా" అని ద్వారపాలకుడు అడిగిన ప్రశ్నకు, దశరథ పుత్రుడైన భరతుణ్ణి, కైకేయి పుత్రుడను కాను అని సమాధానమిస్తాడు. తర్వాత విషయాలన్నీ వివరంగా తెల్సుకుంటాడు భరతుడు. సీతారామ లక్ష్మణుల వన గమన వార్త అతన్ని మరింత కృంగ దీస్తుంది. దేవకులికుడు భరతునికి ధైర్యం చెప్పి ఓదారుస్తాడు. తండ్రి, అన్న ఇద్దరూ లేని అడవి లాంటి అయోధ్య కోసం నేను నీరు లేని నది వెంట పిపాసార్తుని వలె పరిగెడుతున్నానంటాడు. దశరథుడు, రాముడు లేని అయోధ్య అడవిగా శూన్యంగా భావిస్తాడు.

అయోధ్యా మటవీ భూతాం, పిత్రా భ్రాత్రా చ వర్జితామ్ ।

పిపాసార్తోzనుధావామి క్షీణతోయాం నదీమివ ॥

సుమంత్రుడు, మహారాణులు ముగ్గురు ప్రతిమా గృహం దగ్గరికి వస్తారు. కౌసల్యా, సుమిత్రలిద్దరికీ గౌరవంతో నమస్కరించిన భరతుడు కైకేయికి నమస్కరించమని సుమంత్రుడు చెప్పగానే, గంగా, యమునల మధ్య ప్రవేశించిన 'కునది' లాగా ఆ తల్లులిద్దరి మధ్య నువ్వు తగవు అని నిందిస్తాడు.

ఆ పాపే!

మమ మాతుశ్చ మాతుశ్చ మధ్యస్థా త్వంనశోభసే ।
గంగా యమునయోర్మధ్యే కునదీవ ప్రవేశితా ॥

భర్తృ ద్రోహం చేస్తే కన్నతల్లయినా తల్లే కాదని, ఈ లోకంలో అపూర్వమైన ధర్మం స్థాపిస్తానంటాడు.

లోకేఽ పూర్వం స్థాపయామ్యేష ధర్మం ।
భర్తృ ద్రోహదస్తు మాతాప్యమాతా ॥

తన పట్టాభిషేకాన్ని ఏ మాత్రం అంగీకరించక, రాముని కోసం వనానికి బయల్దేరతాడు. రాముడు లేని అయోధ్య అయోధ్యే కాదు పొమ్మంటాడు.

తత్రయాస్యామి యత్రా సావర్తతే లక్ష్మణప్రియః ।

నాయోధ్యా తం వినాయోధ్యా సాయోధ్యా యత్రి రాఘువః ॥

మాకు వల్కలాలు, మహారాజుకు మృత్యువు, అయోధ్యా ప్రజలకు దుఃఖ సముద్రం, లక్ష్మణుడికి మృగాలతో జీవనం, శోకతప్తులైన తల్లులు, వన గమన ప్రయాసకు లోనైన సీత - ఇవన్నీ నీ వల్ల కల్గినవే కద అని కైకేయిని నిలదీస్తాడు. సదాచారాన్ని పాటించే నువ్వు తల్లికి ఎందుకు నమస్కరించవు అని కౌసల్య అడిగినపుడు భరతుడు నువ్వే నా తల్లివి ఆమె నా తల్లి కాదు అంటాడు. ఆమె 'నీ కన్నతల్లి కద అన్న కౌసల్యా మాటకి............ఇంతకుముందు (పూర్వం), ఇప్పుడు కాదు' (ఆ సీత్ పురా, నత్విదానీం) ఎందుకంటే భర్తృ ద్రోహం వలన తల్లే కాదంటాడు.

"భర్తృ దోహదస్తు మాతాప్యమాతా"

మహారాజు సత్యవచన పాలన కోసం తను ఇలా చేశానని కైకేయి చెప్పినా మనసు సమాధాన పరచుకోలేకపోతాడు. 'నీ పుత్రుడే రాజవ్వాలి' అంటే రాముడు మాత్రం నీకు పుత్రుడు కాడా? జ్యేష్ఠుడు, క్రమంలో అభిషేకానికి యోగ్యుడు కాదా? అతనంటే సోదరులకి ప్రేమ, గౌరవం లేదా? లేక అతనంటే ప్రజలకి ఇష్టం లేదా? అని ధర్మ సూక్ష్మాలు ప్రశ్నిస్తాడు. వివాహ సమయంలో శుల్కంగా రావలసిన దాన్ని అడిగినందుకే ఇలా ప్రశ్నిస్తున్నావా అన్న కైకేయితో 'రాజ్య సంపదకు దూరమై, నార బట్టలు ధరించి భార్యతో వనవాసం ఆజ్ఞాపించావే అది కూడా శుల్కంలో ప్రతిజ్ఞ చేయబడిందా? అని ఆవేదనతో తల్లిని సూటిగా ప్రశ్నిస్తాడు. సమయం వచ్చినపుడు నేనే చెప్తానంటుంది కైకేయి. నీకు 'రాజమాత' అన్న పేరే ఇష్టమయితే నిజం చెప్పు. రాముడు నీకు పుత్రుడు కాడా? నీ రాజ్య కాంక్షతో, మహారాజు అసువులు బాసినా లెక్కపెట్టలేదు. జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు, సర్వజన మనోభిరాముడైన రాముణ్ణి వనానికి పంపించావు. వల్కలాలను ధరించిన సీతను చూస్తుంటే నీ హృదయం కరగలేదా? ఎంత విచిత్రం? విధాత ఎంత కఠినమైన హృదయాన్ని సృష్టించాడు? అంటూ పరిపరివిధాల తన ఆవేదనను వ్యక్తం చేస్తాడు.

గోరక్షకుడు (గోపుడు) లేని గోవులు ఏ విధంగా ఛిన్నాభిన్నం అయిపోతాయో, నృపతి హీనులైన ప్రజలు కూడా అలాగే అశాంతికి గురవుతారనీ, అభిషేకానికి సిద్ధం కమ్మనీ వశిష్ట వామదేవుల విన్నపాన్ని తెలియచేస్తాడు సుమంత్రుడు. అవేమీ పట్టించుకోకుండా అందరు నా వెంట రండి అంటూ బయల్దేరతాడు.

గోపహీనా యథా గావో విలయం యాన్తి అపాలితాః ।

ఏవం నృపతిహీనా హి విలయం యాన్తి వై ప్రజాః ॥

అభిషేకం వదిలేసి ఎక్కడికి వెళ్తున్నావు అన్న సుమంత్రుని ప్రశ్నకు ఈమెకు ఇవ్వండి (చేయండి) అని కైకేయిని ఉద్దేశించి అంటాడు. 'ఎక్కడ రాముడుంటే అదే నాకు అయోధ్య' అంటాడు.

నాల్గో అంకంలో వనంలో ఉన్న రాముని దగ్గరకి వెళ్ళి 'శారీరకంగా ఇక్కడ ఉన్నా, కర్మాచరణలో అక్కడ ఉంటాను. మీ పేరు మీద రాజ్యాన్ని రక్షిస్తాను' అన్న నిస్వార్థ సోదరుడు భరతుడు. అభిషేకానికి అంగీకరించమని రాముణ్ణి ఓ సుగుణుడా! నీ వంశం నా వంశం ఒక్కటే. నీ తండ్రే నా తండ్రి కూడా ఓ మహానుభావా! మాతృ దోషం దోషం కాదు. ఆర్తుడైన భరతుణ్ణి చూసి అనుగ్రహించవయ్యా అని ఆవేదనతో ప్రార్థిస్తాడు. అది విన్న సీత భరతుడంత దీనంగా అడుగుతుంటే ఇంకా ఏమిటాలోచిస్తున్నారు అని అడుగుతుంది. ఇంతటి సుగుణాల రాశి అయిన భరతుణ్ణి గ్రహించని (అర్థం చేసుకోని) స్వర్గస్థులయిన తండ్రి గురించే ఆలోచిస్తున్నానని రాముడు చెప్తాడు. భరతుని నిష్కల్మష సోదర ప్రేమకీ, అతని పాత్ర ఔన్నత్యానికీ రాముడన్న ఈ ఒక్కమాటా చాలు.

భరతుడా! నీ నిష్కల్మష ప్రేమకి నాకు చాలా ఆనందంగా ఉంది. నీ శ్లాఘనీయ గుణాలకి నేను తలొగ్గి (తలవంచి) నువ్వు చెప్పినట్లే ఆచరిస్తాను. కాని నీ వంటి ఉత్తమ పుత్రుణ్ణి కన్న ఆ తండ్రి అసత్యవాది అవుతాడు కదా అని బదులిస్తాడు.

పద్నాలుగు సంవత్సరాల తర్వాత తను రాజ్యాన్ని తిరిగి స్వీకరిస్తానంటేనే రాజ్య భారం వహిస్తానని రాముణ్ణి ఒప్పిస్తాడు. రాముణ్ణి మరో వరంగా తన పాదుకలీయమనీ వాటిని ప్రతిష్ఠించి తిరిగి రాముడు వచ్చి రాజ్యం స్వీకరించే వరకు వాటికి (పాదుకలకు) విధేయుడుగా ఉంటాననీ అడుగుతాడు.

ఇంతవరకు జరిగిన శ్రీరామ - భరతుల సంభాషణంతా ఒక ఎత్తు. భరతుడు పాదుకలు అడిగిన వెంటనే రాముడు భరతుణ్ణి కొనియాడుతూ అన్న మాట ఒక్కటే ఒక ఎత్తు.

'ఎంతో కాలంగా నేను సంపాదించిన కొంచెం కీర్తి అచిరకాలంలోనే భరతుడి చేత సంపాదించబడింది'.

సుచిరేణాపి కాలేన యశః కించిన్మయార్జితమ్ ।
అచిరేణైవ కాలేన భరతేనాద్య సంచితమ్ ॥

వెంటనే రాముడు పాదుకలివ్వడం, పాదుకలకు అభిషేకం చెయ్యడం జరిగిపోతాయి. రాముడే తనకు పర దైవతంగా భావిస్తాడు.

మమమాతుః ప్రియం కర్తుం యేన లక్ష్మీర్వర్జితా, ।
తమహం ద్రష్టుమిచ్ఛామి దైవతం పరమం మమ ॥

భరతుని భ్రాతృ భక్తికి శ్రీరాముడే ఆశ్చర్యపోతాడు. పుత్ర ప్రేమ ఎలాంటిదో నా తండ్రి నిరూపించాడు, భ్రాతృ స్నేహం ఎలాంటిదో ఇపుడీ భరతుడు వ్యక్తం చేశాడు.

అద్యఖల్వవగచ్ఛామి పిత్రామేదుష్కరం కృతమ్, ।
కీదృశస్తనయస్నేహో భ్రాతృ స్నేహోఽయ మీదృశః ॥

భరతుడు నిష్కళంక చరితుడు. తల్లి వలన తనకు కల్గిన కళంకానికి తన శరీరాన్ని అగ్ని శుద్ధం చేసుకోడానికి సిద్ధపడతాడు. కైకేయి చేసిన నిర్దాక్షిణ్యపు పాపకృత్యం తనకు తెలియదనీ తన తల్లి చేసిన తప్పిదానికి క్షమాపణ అడగడానికి తను సిద్ధమేనని, ఎంత త్వరగా వనానికి వెళ్ళి రామునికి చెప్దామా అని ఆరాటపడతాడు. వనంలో ఉన్న రాముని దగ్గరికి వెళ్ళి తన రాకను తెలియ చెయ్యడం కోసం -

రాజ్యలుబ్ధ అయిన కైకేయి పుత్రుడను, ఇక్ష్వాకుకుల కళంక భూతుడను, బ్రహ్మఘ్నుడను, నిర్దయుడను, ప్రాకృతుడను...' అంటూ ఇలా ఎన్నో విధాల ఆత్మనింద చేసుకుంటాడు.

నిర్ఘృణశ్చ కృతఘ్నశ్చ ప్రాకృతః ప్రియసాహసః ।
భక్తిమానాగతః కశ్చిత్, ............... ॥

భరతుని శరీర సౌష్టవం యౌవనంలో ఉన్న దశరథుని పోలి ఉండటం వల్ల సుమంత్రుడు ఒకసారి భరతుణ్ణి చూసి దశరథుడనుకుని పొరబాటు పడ్డాడు. సీతా, లక్ష్మణులిద్దరూ వనంలో మొదటిసారి భరతుణ్ణి చూసి రాముడని అనుకుంటారు.

లక్ష్మణ - అయే అయమార్యో రామః న, న రూప సాదృశ్యమ్.

ముఖమనుపమం త్వార్యస్యాభం శశాంక మనోహరం,
మమ పితృసమం పీనం వక్షః సురారి శరక్షతమ్ ।
ద్యుతి పరివృతస్తేజోరాశిర్జగత్ప్రియ దర్శనో
నరపతి రయం దేవేంద్రో వా స్వయం మధుసూదనః ॥

భావం - శశాంకుని వలె మనోహరమైన, నిరుపమానమైన ముఖ కాంతి రాముని ముఖ కాంతిని పోలి ఉంది. విశాలమైన అసుర బాణాంకితమైన ఆ వక్షః స్థలం నా తండ్రి వక్షః స్థలాన్ని పోలి ఉంది. ఈ జగత్తుకి ప్రియ దర్శనుడు, కాంతి పుంజముచే ఆదరింపబడిన ఇతడు నరపతియా, సురపతియా లేక సాక్షాత్తు ఆ మధుసూదనుడా?

భరతుడు రాముని పాదుకలతో అయోధ్యకు తిరిగి వచ్చాక కూడా వనవాసంలో రాముడు ఏ రకమైన నియమ నిష్ఠలతో ధర్మాచరణ చేస్తున్నాడో తనూ అదే రకమైన ధార్మిక జీవితాన్నే గడుపుతాడు. ఆరో అంకంలో భరతుడు నార బట్టలు ధరించి, జటాధరుడై రాజ్యభారం వహిస్తున్నట్లు కన్పిస్తాడు. ఈ అంకంలోనే కైకేయి ద్వారా దశరథుని శాప వృత్తాంతం విని రాముని బదులుగా తననే వనానికి పంపించవచ్చు కదా అని అడుగుతాడు. నిజం తెల్సి తల్లిని దూషించినందుకు క్షమించమని మొక్కుతాడు.

వినయం, సౌశీల్యం, సత్ప్రవర్తన, గురువుల యెడ, పెద్దలయెడ గౌరవం, స్నేహం, వాత్సల్యం, నిరాడంబరత, నిజాయితీ ఇలా అన్ని గుణాలనీ పుణికి పుచ్చుకుని అందరి ప్రశంసలు, మన్ననలు అందుకున్న ఉదాత్త వ్యక్తి భరతుడు. ఎవరూ వేలెత్తి ఏ దోషం చూపించలేని మచ్చలేని పాత్ర భరతుడిది. లక్ష్మణుడు రామానుచరుడు. రామసేవకుడైతే భరతుడు రామ భక్తుడు. శ్రీరామునికి తగిన తమ్ముడిగా భరతుడు చిత్రించబడ్డాడు.

'రామ సదృశేన పథా ప్రయాతి' అని సుమంత్రుడు పలికినట్లు రాముని మార్గమే భరతుని మార్గము. ఆకారంలోనే కాదు శీలంలోనూ భరతుడు రామసదృశుడు.

# B. లక్ష్మణుడు

సౌమిత్రి రామభక్తి పరాయణుడు. ఎపుడూ రామునితో ఉండి అతని సేవ చేసి తరించడమే అతని జీవిత ధ్యేయం. సూర్యుని వెంట పగలులా, ఎపుడూ రాముని వెన్నంటి ఉండేవాడు లక్ష్మణుడు.

> సూర్య ఇవ గతో రామః సూర్యం దివస ఇవ
> లక్ష్మణోऽనుగతః

దశరథుడు సుమిత్రతో 'రఘుకుల శ్రేష్ఠుడైన శ్రీరాముని అహర్నిశలు ఛాయలా అనుసరించే నీ పుత్రుడు ధన్యుడు' అంటాడు. వనానికి బయల్దేరిన లక్ష్మణుని నివారించిన సీతతో, ఆర్యా! నా గురువైన శ్రీరాముని పాద శుశ్రూష నువ్వు ఒక్కదానివే చెయ్యాలనుకుంటున్నావు. దక్షిణ పాదానికి నువ్వు సేవ చేసి, వామ పాదానికి సేవ చేసే అవకాశం నాకు కల్గించమని' అర్థిస్తాడు.

రాముడు వల్కలాలు ధరించగానే రామునితోబాటు తనూ వల్కలాలు ధరించి వనానికి బయల్దేరతాడు. పద్నాలుగు సంవత్సరాలు రాముని వన వాసానికి కారణమైన కైకేయి గురించి విని రోషంతో మండిపడ్తూ, కైకేయిని మాత్రమే చంపడానికి కాదు లోకంలో యువతులందర్నీ చంపి యువతి రహితమైన లోకంగా చేస్తానంటాడు. అది అతని ఆవేశానికి ఒక నిదర్శనం.

> 'యువతి రహితం లోకం కర్తుం యతశ్చలితా వయం'

రామునితో క్షమ అంటే అభిమానం లేకపోవడమేనా అని ప్రశ్నిస్తాడు.

క్రమప్రాప్తే హృతే రాజ్యే భువిశోచ్యాసనే నృపే ।

ఇదానీమపి సందేహః కిం క్షమా నిర్మనస్వితా ॥

రోషాన్ని నిగ్రహించుకోలేకపోతున్నానని లక్ష్మణుడే స్వయంగా ఒప్పుకుంటాడు. (న శక్నోమి రోషం ధారయితుం) ముల్లోకాల్ని దహిస్తుందా అన్నట్లుంది లక్ష్మణుని భ్రుకుటి ముడి అంటూ రాముడు విమర్శిస్తాడు. ఉగ్రుడై ధనుస్సు ధరించి కైకేయిని చంపడానికి అనుమతించమని రాముని అడుగుతాడు. అంతటి రోషంలోను రామానుజ్ఞ కోరడం మరవలేదు.

భరతో వాభవేద్రాజా వయం వానను తత్సమమ్, ।

యది తేకస్తి ధనుః శ్లాఘా సరాజా పరిపాల్యతామ్. ॥

రామదర్శనార్థం వనానికి వచ్చిన భరతుని లోపలికి ప్రవేశ పెట్టడానికిక కూడా రాముని అనుమతి అడిగేటటువంటి రామ సేవకుడు. మరణావస్థ యందున్న తండ్రిని వదలి అన్న శ్రీరాముని వెంట వనానికి వెళ్ళిన లక్ష్మణుని భ్రాతృ భక్తి అతని పితృభక్తి కంటే గొప్పది.

# C. దశరథుడు

దశరథుడు ఇక్ష్వాకు వంశీయుడైన అజ మహారాజు పుత్రుడు. రఘు మహారాజు పౌత్రుడు. రఘు వంశపు రాజులందరిలాగే దశరథుడు సత్యసంధుడు. సత్యవాక్య పరిపాలన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు. ఈ నాటకంలో దశరథుడు వాత్సల్యం, కరుణ ఇవన్నీ కలబోసిన ఒక మూర్తిగా చిత్రించబడ్డాడు. అందమైన కరుణ రసానికి దశరథుడే ప్రధాన ఆశ్రయుడు. నాటకంలో ప్రతి ఒక్కరు అతని ఔన్నత్యాన్ని, పరాక్రమాన్ని, వ్యక్తిత్వాన్ని, పుత్ర వాత్సల్యాన్ని, ప్రజల యందలి అనురాగాన్ని ప్రశంసించే వారే. అదీ దశరథుని పాత్రలో వైశిష్ట్యం.

చాలా కాలం సంతాన రహితుడై చివరకు పుత్ర కామేష్టి వలన కల్గిన పుత్రులపై అవధులు లేని ప్రేమ గలవాడు. రాముడతనికి బహిః ప్రాణం. బహుశ కైకేయికిచ్చిన వాగ్దానం వల్లనే దశరథుడు రామునికి త్వరగా పట్టాభిషేకం చెయ్యాలనుకుంటాడు. అయితే కైకేయికి వాగ్దానం చేసిన నాటికి దశరథునికి సంతానం ఎవరు లేరు. కాని ప్రస్తుతం నల్గురు కుమారులు. పట్టపు రాణి కౌసల్యానందనుడైన రాముడు జ్యేష్ఠ కుమారుడు. దశరథుడు అందరికన్న మిన్నగా రాముణ్ణి ప్రేమించిన మాట వాస్తవం. సమయం ఎక్కువ ఇస్తే కైకేయికి శుల్కం గురించి ఇచ్చిన వాగ్దానం ఎక్కడ గుర్తుకొచ్చి అడుగుతుందో అని అకస్మాత్తుగా రాముడి పట్టాభిషేకం ఏర్పాట్లు చేస్తాడు. కైకేయి మంథర ద్వారా శుల్కం గురించి అడిగినపుడు దశరథుడు పెద్దగా బాధపడలేదు. కానీ రాముడి వనవాసం అడగ్గానే తట్టుకోలేని స్థితిలో స్పృహ తప్పి పడిపోతాడు. రాముని వనగమనం అతని ఎడబాటు దుర్భరమవుతాయి దశరథుడికి. రాముని కోసం దుఃఖిస్తూనే తుదిశ్వాస వదుల్తాడు.

ద్వితీయాంకంలో దశరథుడు రాముని కోసం విలపించిన తీరు చూస్తే, అతడు రాముని ఎంత ప్రాణాధికంగా ప్రేమించాడో తెలుస్తుంది.

హా వత్సరామ! జగతాం నయనాభిరామ

హా వత్స లక్ష్మణ! సలక్షణ సర్వగాత్ర!

హా సాధ్వి! మైథిలి! పతిస్థిత చిత్తవృత్తే!

హా హా గతాః కిల వనం బతమే తనూజాః ॥

సీతా రామ లక్ష్మణుల గుణగణాలు తల్చుకుని, వారితో కలిసి జీవించలేక పోయినందుకు బాధపడ్తాడు. కైకేయి కాఠిన్యాన్ని నిందిస్తూ ఆమెను ఆడ పులితో పోలుస్తాడు.

అనపత్యా వయం రామః పుత్రోऽన్యస్య మహీపతేః ।
వనే వ్యాఘ్రీ చ కైకేయీ త్వయా కిం నకృతం త్రయం ॥

ఓ హత విధీ! నన్ను సంతాన హీనుడిగా, రాముణ్ని మరో మహారాజు పుత్రునిగ, కైకేయిని వనంలో ఆడపులిగా ఈ మూడు నువ్వెందుకు చేయలేదని విధిని నిందిస్తాడు. కౌసల్యతో రాముని గర్భంలో ధరించిన నీవు ధన్యురాలవు. నేను అగ్నిసమమైన దుర్భరమైన ఈ విరహాగ్నిని సహించడానికి గాని నిగ్రహించడానికి గాని అశక్తుడను అంటాడు.

కౌసల్యే! సారవతీ ఖల్వసి! త్వయా హిఖలు రామోగర్భే ధృతః ।
అహం హి దుఃఖమత్యన్తమసహ్యం జ్వలనోపమం,
నైవ సోఢుం న సంహర్తుం శక్నోమి మృషితేంద్రియః ॥

సుమిత్రతో - ఓ సుమిత్రా రఘుకుల శ్రేష్ఠుడైన రాముని వనంలో నీడలా రాత్రింబవళ్ళు సేవించే నీ పుత్రుడు ధన్యుడు అంటూ వాపోతాడు.

రథంలో సుమంత్రుడొక్కడే తిరిగి వచ్చాడని తెల్సి, రథం శూన్యంగా (రామ రహితమై) వచ్చిందంటే నా మనోరథం భగ్నం అయినట్లే. నిశ్చయంగా దశరథుని తీసుకెళ్ళడానికి కాలం (యముడు) రథం పంపించి ఉంటుంది అని నిరాశ వ్యక్తం చేస్తాడు.

శూన్యః ప్రాప్తః యది రథో భగ్నో మమ మనోరథః
నూనం దశరథం నేతుం కాలేన ప్రేషితో రథః

ఒక్కసారి రాముని స్పృశిస్తే, ఒక్కసారి రాముని చూస్తే తన ప్రాణాలు నిలుస్తాయని దశరథుడు ఎంతో తపన చెందుతాడు. వనంలో సంచరించే రాముని స్పృశించే వాయువులు ఎంత ధన్యమైనవో కదా అని ఆక్రోశిస్తాడు.

పుత్ర శోకమే దశరథుని శారీరకంగా, మానసికంగా కృంగదీస్తుంది. చివరకు పుత్ర శోకాగ్ని దగ్ధ హృదయుడై తుది శ్వాస వదుల్తాడు.

ఈదృద్విధాః పురుష విశేషాః ఈదృశీమాపదం
ప్రాప్నువన్తీతి విధి రనతిక్రమణీయః

ద్వితీయాంకంలో దశరథుడు రాముని ఎడబాటు సహించలేక హృదయ విదారకంగా విలపిస్తూ పలికిన ఒక్కొక్క మాట ఎటువంటి వారినైనా హృదయం కదిల్చి కన్నీరు కార్చేలా చేస్తుంది.

పుత్ర ప్రేమ మూర్తీభవించిన పితృమూర్తి దశరథుడు.

# D. సుమంత్రుడు

సుమంత్రుడు దశరథుని మంత్రులలో ఒకడు. అంతేకాక దశరథునికి రథసారథీ, రాజ కుటుంబానికంతటికీ ఆప్తుడు, సన్నిహితుడు, రామాదులకు పితృసముడు. రాముడు, భరతుడు సుమంత్రుని తండ్రీ (తాత!) అని సంబోధిస్తారు.

ఒకసారి దశరథుడు వనంలో ఉన్న రాముని గురించి సుమంత్రుని ప్రశిస్తూ "క్వమే జ్యేష్ఠో రామః?" (జ్యేష్ఠుడైన నా రాముడెక్కడ అని ప్రారంభించి, వెంటనే సరిదిద్దుకుని క్వతే జ్యేష్ఠోరామః ప్రియసుత, అని అడుగుతాడు.

సుమంత్రునికి రామాదులందు కల పుత్ర ప్రేమ ఎటువంటిదో, దశరథుడు సుమంత్రుని ఎంత అత్యంత ఆత్మీయుడుగా భావించాడో తెలియడానికి ఈ ఒక్క సంఘటన చాలు. దశరథుని కష్ట సుఖాల్లో సమానంగా పాలుపంచుకుంటూ, ఆయన మరణించిన తర్వాత, తను ఇంకా జీవించి ఉన్నందుకు తనను తానే నిందించుకుంటాడు.

దశరథుని కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన సుమంత్రునికి అంతఃపురంలో కూడా ప్రవేశం ఉంది. రామ వన గమనం, దశరథ మరణం లాంటి దుర్ఘటనలను తన కళ్ళతో స్వయంగా చూడాల్సి వచ్చినందుకు తన ఆయుర్దాయమే తనకు శాపమని భావిస్తాడు.

నరపతి నిధనం భవత్ర్పవాసం భరత విషాద మనాథతాం
కులస్య ।
బహు విధమనుభూయ దుష్ప్రసహ్యం గుణ ఇవ
బహ్వపరాద్ధమాయుషా మే

నాటకంలో సుమంత్రుని పాత్రకి ఎంతో ప్రాధాన్యం ఉంది. సీతా రామ లక్ష్మణులు తనకి ఏమీ చెప్పకుండానే వనానికి వెళ్ళారని సుమంత్రుని ద్వారా విని దశరథుడు తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోతాడు. వెంటనే సుమంత్రుడు అతని పరిస్థితి గ్రహించి దశరథుని ఆప్తునిగా, అనుభవజ్ఞుడిగా అతనికి మరణమాసన్నమయిందని గ్రహించి, 'మహారాజు అప్రతీకారమైన దశ యందున్నారని మంత్రులకి వార్త పంపిస్తాడు'. దశరథునికి గల ముని శాప వృత్తాంత్తాన్ని తెలిసి కూడా రహస్యంగా కాపాడగల గాంభీర్యం కల్గిన అతి తక్కువ మందిలో సుమంత్రుడు ఒకడు.

మూడో అంకంలో ప్రతిమా గృహంలో దశరథుని ప్రతిమను చూడాలని బయల్దేరిన రాణులతో సుమంత్రుడు వెన్నంటి ఉంటాడు. ప్రతిమా గృహంలో భరతుడు సుమంత్రుని గురించి 'కచ్చిత్ తాత సుమంత్రో భవాన్ నను' అనగానే సుమంత్రుడు -

అన్వాస్యమానశ్చిర జీవదోషైః
కృతఘ్నభావేన విడంబ్యమానః ।
అహం హి తస్మిన్ నృపతౌ విపన్నే
జీవామి శూన్యస్య రథస్య సూతః ॥

అని నిర్వేదంతో బదులిస్తాడు. అభిషేకాన్ని తిరస్కరించి వనానికి బయల్దేరిన భరతునితో సుమంత్రుడు కూడా రామదర్శనార్థం బయల్దేరతాడు. భరతుని ఆశయం మెచ్చుకుని 'రామసదృశేన పథా ప్రయాతి' అంటాడు. తన తల్లులకు అభివాదన క్రమాన్ని

ఉపదేశించమని భరతుడు అడగ్గానే సుమంత్రుడు అనుభవజ్ఞుడిగా ఆ కుటుంబంలోని ఒక వ్యక్తిగా భరతునికి కౌసల్యా, సుమిత్ర, కైకేయిలను వరుసగా చూపిస్తాడు. భరతుడు కైకకు ప్రణామం చెయ్యడానికి కూడా ఇష్టపడడు.

రామదర్శనార్థులై వెళ్ళిన భరత సుమంత్రులు, రామునితో ఏం చెప్పమంటారు అన్న సుమంత్రుని ప్రశ్నకు భరతుడు - రాజ్యలుబ్ధుడైన కైకేయీ పుత్రుడు వచ్చాడని చెప్పమంటాడు. వెంటనే సుమంత్రుడు గురుజనాపవాదం తగదని చెప్తాడు. అయితే ఇక్ష్వాకు కుల కళంకభూతుడైన భరతుడు మీ దర్శనార్థియై వచ్చాడని చెప్పమంటాడు భరతుడు. నా నోటితో నేనలా చెప్పలేననీ అంటాడు సుమంత్రుడు. కేవలం పేరు ఒక్కటీ చెప్తే ప్రాయశ్చిత్తం చేసుకోనట్లుగా అన్పిస్తుంది. నేనే నివేదిస్తానంటాడు భరతుడు. ఈ సంభాషణలో సుమంత్రుడు ఆవేశంలో ఉన్న పుత్రుని ఒక తండ్రి మందలించినట్లుగా భరతుని మందలిస్తాడు. తండ్రి మరణ వార్త విని శోకతప్తుడైన రామునితో బాటు తనూ దుఃఖిస్తాడు. తను ఇంకా జీవించి ఉన్నందుకు బాధ పడ్తాడు. దశరథ మరణంతో సుమంత్రునికి కష్టాలు ప్రారంభమవుతాయి. మరణించిన దశరథుని కంటే జీవించిన సుమంత్రుడే ఎక్కువ కష్టాలనుభవిస్తాడు. రాముడు తన పాదుకలిచ్చి పంపుతూ, - తాత, మహారాజవత్ పరిపాల్యతాం కుమారః అని భరతుని సుమంత్రునికప్పగిస్తాడు. జీవించి ఉంటే అలాగే చేస్తానంటాడు సుమంత్రుడు (యది జీవామి తావత్ ప్రయతిష్యే).

రామాదుల క్షేమం కనుక్కోడానికి మళ్ళీ వనానికి వెళ్ళిన సుమంత్రుడు సీతాపహరణ వార్త తెల్సి పూర్తిగా కృంగిపోతాడు. దుఃఖంతో, నిర్వేదంతో అయోధ్యకి తిరిగి వస్తాడు. భరతునికి ఈ వార్త చెప్పకూడదనుకుంటూనే వికల మనస్కుడై బయట పెడ్తాడు.

ఆరో అంకంలో కైక కోరిక పై భరతునికి రామ వనవాసానికి కారణం సవివరంగా చెప్తాడు. దశరథుని శాప వృత్తాంతం తెలిసి అది ఫలించడానితి వశిష్ట వామ దేవులతో కలిసి కైక ద్వారా శ్రీరామ పట్టాభిషేక భంగం వనవాసం అడిగించిన వాడు సుమంత్రుడు.

సీతాపహరణ వార్త భరతునికి చెప్పగానే సుమంత్ర పాత్ర ముగుస్తుంది. ఒక రకంగా సుమంత్రుని పాత్ర ముగింపు సరిగ్గా చెప్పబడలేదు. ఎందుకంటే సప్తమాంకంలో రావణ సంహారం చేసి తిరిగి వచ్చిన రాముణ్ణి ఎదుర్కొన్న వారిలో సుమంత్రుడు లేడు. 'యది జీవామి అని రామునితో' అన్న మాటని బట్టి చూస్తే భరతునికి సీతాపహరణ వార్త చెప్పిన తర్వాత కొంత కాలానికి సుమంత్రుడు మరణించి ఉంటాడని భావించాలి. ఏది ఏమైన కథలో అత్యంత ప్రధానమైన సుమంత్ర పాత్ర ఒక రకంగా మధ్యలో ముగిసిందనే చెప్పాలి.

దశరథునిచే 'తమ్ముడా' (భ్రాతః) అనీ, రామాదులచే 'తండ్రీ' (తాత) అని పిలిపించుకున్న ధన్యజీవి సుమంత్రుడు. సంపూర్ణ నాటకంలో దశరథునితో, రాణులతో, రామాదులతో ప్రవర్తించిన తీరు, మాట తీరు చూస్తే ఒక్క దోషం కూడా ఎత్తి చూపలేని మచ్చలేని పాత్ర సుమంత్రుడు.

దశరథునితో, రాణులతో, రామునితో, భరతునితో ఇలా ఆకుంటుబంలోని ప్రతి ఒక్కరితో అన్ని కష్టాల్లోను పాలు పంచుకుంటాడు సుమంత్రుడు. అందరి కష్టాల్లోను అండగా నిల్చిన సుమంత్రుణ్ణి చివరి అంకంలో ఆనందం కల్గించే రామ పట్టాభిషేక సన్నివేశంలో భానుడు ప్రస్తావించకపోవడం అనూహ్యం.

**ఆచార్య ఎమ్.వి. రమణ**
**సంస్కృత శాఖాధ్యక్షులు**
**ఆంధ్ర విశ్వ విద్యాలయం**
**విశాఖపట్టణం**

పాఠం - 10

# పాత్ర పరిచయం - A. కైకేయి

రామాయణంలోని కైకేయి పాత్ర కంటే ఈ నాటకంలోని కైక పాత్ర విలక్షణంగా చిత్రించబడింది. రామాయణంలో కైకేయి స్వార్థం, కాఠిన్యం గూడు కట్టుకున్న వ్యక్తిగా కన్పిస్తుంది. ఈ నాటకంలో కూడా చివరి వరకు అదే విధంగా అన్పించినా ఆరో అంకంలో (షష్ఠాంకం) తన చర్యల అంతరార్థం చెప్పింతర్వాత ఒక ఉదాత్త వ్యక్తిగా కన్పిస్తుంది. అంతేకాక కైక ఈ నాటకంలో సహనంతో, మౌనంగా అందరి విమర్శలను ఎదుర్కొనే ఒక సంస్కారవంతురాలైన స్త్రీ.

శ్రీరాముని పట్టాభిషేకం ఆపడం, భరతునికి పట్టాభిషేకం, రాముని వన గమనం - వీటికి కారణమయిన కైక అందరి దూషణకు గురి అవుతుంది. స్త్రీల బుద్ధి కుటిలమని కాంచుకీయుడు నిందిస్తాడు. కైక అడిగిన శుల్కం గురించి విని లక్ష్మణుడు ఈ లోకాన్ని యువతి రహితం చేస్తానని బాణం సంధిస్తాడు. కైక వనంలో ఆడపులిగా ఎందుకు సృష్టించబడలేదో అని దశరథుడు విధిని నిందిస్తాడు. ఇంక భరతుని ఆగ్రహం, దూషణ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

ప్రతిమా గృహంలో తండ్రి గారి ప్రతిమ చూసి అతని మరణ వార్త విన్నాక మండిపడ్తాడు. భర్త ద్రోహం చేసి అతని మరణానికి కారణమైన ఆమె తనకు తల్లే కాదు పొమ్మంటాడు. ఓ పాపాత్మురాలా అని దూషిస్తాడు. రాజ్య లోభంతో వైధవ్యం తెచ్చుకున్న పాపాత్మురాలు అని పరిజనం నిందిస్తారు.

> అహో అత్యాహితం రాజ్యలుబ్ధయా భర్తృదారకస్య
> రామస్య రాజ్య విభ్రష్టం కుర్వత్యాత్మనో వైధవ్య
> మాదిష్టం లోకోऽపి వినాశం గమితః
> నిర్ఘృణా ఖలుభట్టిణీ పాపకం కృతం

అయితే ఇంతమంది నిందలకు, విమర్శలకు గురి అయిన కైకను నిందించనివాడు రాముడొక్కడే.

దశరథుడు స్పృహ తప్పిపోవడానికి కైకయే కారణమని కాంచుకీయుడు చెప్పగానే వెంటనే రాముడు 'అయితే ఏదో ప్రయోజనం ఉండి ఉండాలి' అంటాడు. అంతేకాక 'ఇంద్రసముడైన భర్త, సత్పుత్రులు కలిగిన ఆమెకు కోరదగినదేముంటుంది? ఎందుకు అకార్యం చేస్తుంది అని తిరిగి ప్రశ్నిస్తాడు'. ఆమె వల్లనే అభిషేకం ఆగిపోయిందని చెప్పినా మంచిదే కదా, ఇందులో తప్పేముంది అని ఆమెనే సమర్థిస్తాడు రాముడు. భరతుని పట్టాభిషేకం కోరడం లోభం కాదా అని కాంచుకీయుడు అన్నపుడు కూడా శుల్కంగా అడిగిన రాజ్యాన్ని కైక తన పుత్రుని కోసం అడగడంలో ఏ మాత్రం లోభం లేదు. పైగా సోదరుని రాజ్యమపహరించిన మనదే లోభమవుతుంది అంటాడు. కాంచుకీయుడు ఇంకా ఏదో చెప్పబోయేంతలో - అతఃపరంన మాతుః పరివాదం శ్రోతు మిచ్ఛామి' ఇంక తల్లి పై నిందలు నేను వినదల్చుకోలేదు అని ఖండిస్తాడు. సీత కూడా కైకేయిని పల్లెత్తు మాట అనదు "అథవా బహు వృత్తాన్తాని రాజకులాని నామ" అని మాత్రం అంటుంది.

తృతీయాంకంలో ప్రతిమా గృహంలో దశరథుని మరణ వార్త, రామ వన గమన వార్త విని వాటికి కారణమైన కైక గురించి తెల్సిన భరతుడు ఆమెను విపరీతంగా ద్వేషిస్తాడు.

భర్తృద్రోహాదస్తు మాతా ప్యమాతా -

> త్వయా రాజైషిణ్యా నృపతి రసుభిర్నైవ గణితః
> సుతం జ్యేష్ఠంచ త్వం ప్రవజ వనమితి ప్రేషితవతీ ।

నశీర్ణం యత్ దృష్ట్వా జనకతనయాం వల్కలవతీం
ఆహో ధాత్రా సృష్టం భవతి హృదయం వజ్రకఠినమ్ ॥

సుమంత్రుని ద్వారా సీతాపహరణ వార్త విన్న భరతుడు మళ్ళీ కైకను నిందిస్తాడు. అసలు విషయం చెప్పడానికి అదే అనువయిన సమయమని నిర్ణయించుకుని సుమంత్రుణ్ణి వివరంగా చెప్పమంటుంది. దశరథుడికి పుత్ర వియోగ దుఃఖంతో మరణిస్తాడనే ముని శాపం ఉంది. ముని శాపం అపరిహరణీయం. అవి శ్రీరామ వియోగ దుఃఖం వల్లే జరగాలి. రాముడు పట్టాభిషిక్తుడైతే అది జరగదు. అందుకని పట్టాభిషేకం ఆపాలి. ఆ పని చేయగలది ఒక్క కైక మాత్రమే. శుల్కంగా ఇస్తానన్న రాజ్యాన్ని భరతుడికి అడుగుతుంది. మరి రామ వనవాసం సాధించడం కూడా ఆమె చేతుల్లోనే ఉంది. దశరథుడు ఎపుడో తనకిచ్చిన వరాన్ని ఇపుడు ఈ రూపంలో అడుగుతుంది. అయితే ఈ ఆలోచనంతా కేవలం ఒక్క కైక ఒక్కర్తే చేసినట్లు లేదు. ఈ విషయం పెద్దవాళ్ళకి తెలుసా అని అడిగిన భరతుడి ప్రశ్నకు సుమంత్రుడు, వశిష్ట వామ దేవులకు ఇది విదితమేననీ వారు అనుమతించారని చెప్తాడు. దీన్ని బట్టి వశిష్ట వామదేవులు, సుమంత్రుడు కలిసి ఈ పథకాన్ని కైక ద్వారా అమలు చేసినట్లు కన్పిస్తుంది. కౌసల్య, సుమిత్రలకు కూడా బహుశ ఈ ఉదంతం తెలిసి ఉండవచ్చు. ఎందుకంటే జరిగేవన్నీ చూస్తూ కూడా వారు ఎక్కడా కైకను నిందించినట్లుగాని, మందలించినట్లుగాని లేదు. రాముడికి ఈ విషయాలన్నీ తెలిసి ఉండకపోవచ్చు. కాని కైకేయి లాంటి స్త్రీ చేసిన పనికి ఏదో మహా ప్రయోజనం ఉండకపోదని ఆయన భావన. చివరికి అదే నిజమవుతుంది.

ఎందుకంటే కైకచే వశిష్టాదులు చేయించిన పని వల్ల దశరథునికి గల ముని శాపం నెరవేరడమే కాక శ్రీరాముని వనవాస రూపమైన (దుష్టశిక్షణ, శిష్టరక్షణ ప్రధానంగా కల) ధర్మ ప్రతిష్ఠాపనం అనే మహా ప్రయోజనం కూడా నెరవేరింది.

ఈ మహత్తరమైన ప్రయోజన సిద్ధి కోసం లోకనింద, విమర్శలు అన్నీ మౌనంగా భరించిన ఉత్తమ వ్యక్తిగా కైక పాత్ర భాసునిచే చిత్రించబడింది. భరతుడు తనను ఎన్ని రకాలుగా నిందించినా ఆరో అంకంలో అసలు విషయం తెల్సి కోపంతో భ్రాతృ ప్రేమ వలన దూషించబడిన నువ్వు జరిగిన దానికంతటికీ క్షమించమని భరతుడు అడిగినపుడు కైకేయి ఏ తల్లి పుత్రుడు చేసిన అపరాధం క్షమించదు? "జాత! కా నామ మాతా పుత్రకస్యాపరాధం న మర్షయతి". అని పుత్ర వాత్సల్యంతో భరతుని క్షమించిన మాతృమూర్తి. నాటకం చివర సప్తమాంకంలో రావణుని సంహరించి, అభిషిక్తుడై తన పరివారంతో ఉన్న రామునితో ఈ అభ్యుదయమే (అభిషేక రూపమైన) అయోధ్యలో చూడాలని నా కోరిక అన్న కైకేయి మాట ఆమె నిష్కాపట్యానికీ రాముని యందు గల నిష్కల్మష ప్రేమకీ నిదర్శనం.

# B. రావణుడు

ఈ నాటకం పంచమాంకంలో మనకి రావణ పాత్ర కన్పిస్తుంది. పాత్ర చాలా తక్కువే అయినా వైవిధ్యంతో చిత్రీకరించబడింది. రాముడు పితృ శ్రాద్ధం గురించి ఎలా చెయ్యాలా అని సీతతో కల్సి మాట్లాడుతున్న సమయంలో రావణుడు సన్యాసి వేషంలో రాముని ఆశ్రమానికి వస్తాడు. ఆ సమయంలో లక్ష్మణుడు అక్కడ ఉండడు. రావణుడు వస్తూనే, ఖరవధ కృత వైరాన్ని సాధిస్తాననీ, రాముని వంచించి 'స్వరపదహీనమైన హవ్యధార'వలె సీతను అపహరించడం కోసం వెళ్తున్నాననీ తనలో తనే అనుకుంటాడు.

.........

ఖరవధకృత వైరం రాఘవం వంచయిత్వా

స్వరపద పరిహీణాం హవ్యధారామివాహం

జనక నృపసుతాం తాం హర్తుకామః ప్రయామి

'స్వాగత మతిథయే' అని రాముడు పలికిన వెంటనే సాధు విశేషితం ఖలు రూపం స్వరేణ అని రాముని స్వరం రూపాన్ని అతిశయింప చేసిందని ఆశ్చర్యపడతాడు. రాముడు ఆసనం చూపించి కూర్చోమనగానే 'కథం ఆజ్ఞప్త ఇవాస్మి అనేన' - (ఆజ్ఞప్తుడనయినట్లున్నాను) అని తనలో తానే అనుకుంటాడు. పాద్యంతో పరిచర్య చేయడానికి వచ్చిన సీతతో తన మాయ ఎక్కడ బయటపడ్తుందో అన్న ఖంగారుతో భవతు, భవతు 'లోకంలో ఉన్న మానవ స్త్రీలలో ఈమె ఒక్కర్తే కద అరుంధతి. ఈమె భర్తవని నువ్వు స్త్రీలచే గౌరవంగా చెప్పబడుతున్నావు' అని అంటూ ఆమెను వారిస్తాడు. తనే స్వయంగా శుశ్రూష చేస్తానని సిద్ధపడిన రామునితో - అయి ఛాయాం పరిహృత్య శరీరం నలంఘయామి. వాచానువృత్తిః ఖల్వతిథి సత్కారః' అంటాడు. సీత తేజస్సే ఆ విధంగా ఉంటే ఇంక రాముని తేజస్సు ఎట్లుండును? సీతారాములచే సేవ చేయించుకోవడానికి అతని మనస్సంగీకరించదు.

రావణుడు తను అధ్యయనం చేసిన శాస్త్రాలన్నీ చెప్పి శ్రాద్ధ కల్పంతో ముగిస్తాడు. అది విన్న రామునికి ఆసక్తి కల్గి తన తండ్రి శ్రాద్ధ కర్మకి కావలసిన వస్తువుల గురించి అడుగుతాడు. రావణుడు ద్రవ్యాలన్నీ చెప్పి 'పశుషు గౌః ఖడ్గోవా' అని అంటాడు. 'వా' అని అనడంలో ఇంకేదో ఉన్నట్లుంది చెప్పమని అడుగుతాడు రాముడు. ఉంది కాని అది మహా ప్రభావంతో కాని లభించదని చెప్తాడు. వెంటనే రాముడు ఆ పశువు వివరాలన్నీ అడుగుతాడు. హిమవత్పర్వత ప్రాంతంలో కాంచన పార్శ్వములనే మృగాలుంటాయనీ, వాటిని ఋషులు తమ ప్రభావంతో పొంది పితృకార్యాలు చేస్తారనీ చెప్తాడు రావణుడు. వాటితో పితృ కార్యం చేసే పుత్రుడే సత్పుత్రుడని కూడా చెప్తాడు. అది విన్న రాముడు వెంటనే హిమాలయాలకి బయల్దేరబోతాడు. అవి మానవులకు కనపడవని, రాముని అభిమానాన్ని రెచ్చగొడ్తాడు రావణుడు. వెంటనే రాముడు 'ఆ హిమవంతుడు ఆ మృగాల్ని నాకు చూపిస్తాడు. లేకపోతే నా బాణ వేగంతో క్రౌంచత్వాన్ని పొందుతాను' అంటాడు. వీరుడైన రాముడు చేసిన ప్రతిజ్ఞకు భయభ్రాంతుడయిన రావణుడు తేరుకుని తన మాయాబలంతో కాంచన పార్శ్వ మృగాన్ని అక్కడే ఉన్నట్లుగా సృష్టిస్తాడు. సమయానికి లక్ష్మణుడు దగ్గర లేకపోవడంతో రాముడే స్వయంగా దాన్ని పట్టుకోడానికి వెళ్తాడు.

వెళ్తున్న రాముని చూసి రావణుడు -

ఆహో బల మహా వీర్య మహో సత్త్వ మహో జవః

రామ ఇత్యక్షరైరల్పైః స్థానే వ్యాప్త మిదం జగత్

అని ఆశ్చర్యంతో తలమునకలవుతాడు. 'రామ' అనే రెండక్షరాలతో జగమంతా వ్యాప్తమగుట ఉచితమే అంటాడు. ఈ మాటతో రావణుడు రామ శత్రువుగా కాక రామ భక్తుడిలా కన్పిస్తాడు.

సీతను అపహరించబోతూ ఆమె 'శప్తోऽసి' అని అనగానే 'అహో పతివ్రతాయా స్తేజః' అని ఆమె తేజస్సుకి విస్తుపోతాడు. వేగంగా ఎగిరినప్పుడు సూర్యకిరణాల చేత కూడా దహింపబడని నేను ఇప్పుడు ఈమె అన్న 'శప్తోऽసి' అన్న అక్షరాలకి దగ్ధుడనవుతున్నానంటాడు.

యోऽహముత్పతితో వేగాన్నదగ్ధః సూర్యరశ్మిభిః ।

అస్యాః పరిమితైః దగ్ధః శప్తోऽసీత్యేభి రక్షరైః ॥

తన పరాక్రమం గురించి సీతకు చెప్తూ - భంగపడిన ఇంద్రుడు, కంపించిన కుబేరుడు, లాగబడిన (ఈడ్వబడిన) చంద్రుడు, మర్ధించబడిన యముడు - వీళ్ళందరి వైనం ప్రస్తావించి భీతులైన దేవతలకాశ్రయమైన స్వర్గం తుచ్ఛమనీ, సీత ఉన్న భూమి ధన్యమనీ అంటాడు.

ధన్యా భూమిర్వర్తతే యత్ర సీతా

సీతనెత్తుకొనిపోతూ జనస్థాన వాసులైన తపస్వులను పిలిచి -

బలాదేష దశగ్రీవః సీతామాదాయ గచ్ఛతి ।

క్షాత్రధర్మేయదిస్నిగ్ధః కుర్యాద్రామః పరాక్రమమ్ ॥

రావణుడు బలాత్కారంగా సీతను అపహరించుకొని వెళ్ళిపోతున్నాడు. రాముడే కనక క్షత్రియ ధర్మబద్ధుడైతే పరాక్రమం చూపించమంటాడు. మారీచుడు, మాయలేడి వృత్తాంతం ఈ నాటకంలో లేదు. ఈ విధంగా పంచమాంకంలో రావణుని పాత్రను భాసుడు భిన్నంగా చిత్రీకరించాడు.

# కౌసల్య - సుమిత్ర

కౌసల్య - సుమిత్ర వీరిద్దరు దశరథుని భార్యలు. నాటకంలో రెండు, మూడు, ఏడో అంకాల్లో కనిపిస్తారు. నాటకం మొత్తం ఎక్కడ కన్పించినా ఇద్దరూ కలిసి జంటగా కన్పడడమే ఈ ఇద్దరి పాత్రల వైశిష్ట్యం.

రెండో అంకంలో మిశ్ర విష్కంభకానంతరం రాజు, రాణులిద్దరు ప్రవేశిస్తారు. రాముని వియోగం భరించలేని దశరథుడు పరిపరి విధాల విలపిస్తాడు. వెంటనే కౌసల్య 'ప్రతిజ్ఞ తీరిన వెంటనే వారు తిరిగి వస్తారు కద' అని ఓదారుస్తుంది. దశరథుడు కౌసల్యను ఎవరు నీవు? అని ప్రశ్నించగానే ప్రేమ లేని పుత్రుని కన్న తల్లినని వాపోతుంది.

'అస్నిగ్ధ పుత్ర ప్రసవినీ ఖల్వహం'

దశరథుడు కౌసల్యతో రాముని నవమాసాలు గర్భంలో ధరించిన నువ్వు అదృష్టవంతురాలివి. శక్తి ఉడిగిన నేను ఈ శోకాన్ని సహించడానికీ నిగ్రహించడానికీ కూడా అశక్తుడను అంటూ ఆమెను ప్రశంసిస్తాడు.

కౌసల్య సుమిత్రని లక్ష్మణుని జననిగా దశరథునికి చెప్తుంది. రాముణ్ణి నీడలా వెన్నంటి ఉండే నీ పుత్రుడే సత్పుత్రుడని దశరథుడు ఆమెను కొనియాడతాడు. శూన్యరథుడై తిరిగివచ్చిన సుమంత్రుని చూచి భగ్న మనోరథుడై మూర్ఛిల్లిన రాజును రాణులిద్దరు ఒకే రకమైన సాంత్వన చేకూరుస్తారు.

సుమిత్ర సుమంత్రుని సీత మా గురించి ఏమీ అడగలేదా?'' అని ప్రశ్నించిన తీరు ఆమెకు సీత యందలి అవ్యాజానురాగాన్ని వ్యక్తం చేస్తుంది.

ఇంక మూడో అంకంలో ప్రతిమా గృహంలో ఉన్న భరతుడి దగ్గిరకి ముగ్గురు రాణులు వస్తారు. సుమంత్రుడు కౌసల్యా - సుమిత్రలను రామ లక్ష్మణులను కన్న మాతృమూర్తులుగా పరిచయం చేస్తాడు. భరతుడు నమస్కరించగానే పుత్రుని దుఃఖమెరిగి జాత! నిః సంతాపోభవ' అని పెద్ద మనసుతో ఆశీర్వదించిన మాతృమూర్తి కౌసల్య. సుమిత్ర కూడా 'జాత! యశోభాగీ భవ' అని భరతుని ఆశీర్వదిస్తుంది. సుమంత్రుడు భరతునితో కైకకు అభివాదం చెయ్యమని చెప్పినపుడు - భరతుడు 'గంగా యమునల మధ్య కునది వలె ఆ తల్లులిద్దరి మధ్య నువ్వు ఉండతగవు' అంటాడు. ఈ అనర్థాలన్నిటికీ మూల కారణం నువ్వే కదా అని భరతుడు కైకను నిందిస్తాడు. వెంటనే కౌసల్య ఎంతో ఔదార్యంతో - సర్వ సముదాచారము అనుష్ఠించే నువ్వు తల్లికి ఎందుకు నమస్కరించవు అని అడుగుతుంది. 'అమ్మా! నువ్వే నా తల్లివి' నీకే నమస్కారం అంటాడు భరతుడు. కాదు, కాదు ఈమె నీ తల్లి అంటూ కైకను చూపించి భరతుని ఆగ్రహాన్ని ఉపశమింప చేస్తుంది.

చివరగా సప్తమాంకంలో మిశ్ర విష్కంభకానంతరం సీతారాముల సమాగమ సన్నివేశంలో భరతుడు తన తల్లులతో సైన్యంతో వస్తాడు. రాముడు, లక్ష్మణుడు, సీత వరుసగా తల్లులకు నమస్కరిస్తారు. 'జాత! చిరంజీవ! ప్రతిజ్ఞ చెల్లించి సీతతో కుశలివై ఉన్న నిన్ను చూసి ధన్యులమయ్యామని ఆశీర్వాదంతో అభినందిస్తారు. 'చిర మంగళాభవ' అని ఆ తల్లులు సీతను సౌభాగ్యవతిగా దీవిస్తారు.

ప్రకృతులు, పరిచారకులు, సత్పురుషులు నాపుత్రుడైన రాముని విజయాన్ని ప్రకటిస్తున్నారనే సుమిత్ర మంగళ వాక్కులతో వీరి పాత్ర ముగుస్తుంది. శ్రీరాముని ప్రస్తావన ఎక్కడ వచ్చినా 'నా పుత్రుడు' అని నిండారా ప్రేమతో పలికే మాతృమూర్తులు సుమిత్ర, కైకలు.

నిండైన పుత్ర ప్రేమతో ఆదర్శ మాతృమూర్తులుగా, మాటలో ప్రవర్తనలో వేలెత్తి చూపలేని స్త్రీ రత్నాలుగా, గాంభీర్యం, హుందాతనం ఉట్టిపడే మహారాణులుగా మనకి దర్శనమిస్తారు కౌసల్య - సుమిత్రలు ఈ నాటకంలో.

# ద్వితీయాంక కథా ప్రాధాన్యం

శ్రీరాముని వన గమనం, పుత్ర వియోగం సహించలేని దశరథుని దుఃఖం ఈ అంకంలో ప్రధానాంశాలు. రెండో అంకానికి ముందు విష్కంభకంలో ప్రతీహారి - కాంచుకీయుల సంభాషణ ద్వారా దశరథుడు రామ వన గమనాన్ని నివారించడానికి అశక్తుడై పుత్ర వియోగ శోకాగ్నిచే దహించబడిన హృదయంతో సముద్ర (విశ్రాంతి) గృహంలో శయనించి ఉన్మత్తుడై ఏవేవో మాట్లాడుతున్నట్లు మనకు తెలుస్తుంది.

మిశ్ర విష్కంభకానంతరం రాణులతో దశరథుని ప్రవేశంతో రెండో అంకం ప్రారంభమవుతుంది. సీతా, రామ, లక్ష్మణులను తల్చుకుని దశరథుడు పలుపలు విధాలుగా విలపిస్తాడు.

హా వత్స రామ! జగతాం నయనాభిరామ!

హా వత్స లక్ష్మణ! సలక్షణ సర్వగాత్ర!

హా సాధ్వి మైథిలి! పతి స్థిత చిత్తవృత్తే!
హా హా గతాః కిల వనం బతమేతనూజాః ॥

రాముడు వెళ్ళిన దిశగా మాటిమాటికీ లేచి వెళ్తూ గట్టిగా వాళ్ళ పేర్లనే పిలుస్తూ క్రింద పడిపోతాడు. సీతారామ లక్ష్మణుల గుణాల్ని కీర్తిస్తూ విలపిస్తాడు.

సత్యసంధ! జితక్రోధ! విమత్సర! జగత్ప్రియ!
గురు శుశ్రూషణేయుక్త! ప్రతివాక్యం ప్రయచ్ఛమే ॥
సూర్య ఇవగతో రామః సూర్యం దివస ఇవ
లక్ష్మణోऽనుగతః ।
సూర్య దివసావసానే ఛాయేవ న దృశ్యతే సీతా ॥

దశరథుడు తను సంతాన హీనుడిగా రాముడు మరో మహారాజు పుత్రునిగా, కైకేయి వనంలో ఆడపులిగా ఈ మూడు ఎందుకు చెయ్యలేదు అని విధిని నిందిస్తాడు. దశరథుని ఓదార్చబోయిన కౌసల్యా, సుమిత్రలతో రామ వియోగ దుఃఖాన్ని తను భరించలేక పోతున్నానని అత్యంత హృదయ విదారకంగా రోదిస్తాడు.

రామాదులను వనంలో వదలి సుమంత్రుడు ఒక్కడే తిరిగి వచ్చాడని తెల్సి -

శూన్యః ప్రాప్తో యది రథో భగ్నో మమ మనోరథః ।
నూనం దశరథం నేతుం కాలేన ప్రేషితో రథః ॥

అంటూ విలపిస్తాడు. వనం నుంచి తిరిగి వచ్చిన సుమంత్రుని ఎంతో ఆతృతతో రామాదుల యోగ క్షేమం అడిగి తనకోసం ఏమైనా చెప్పమన్నారా అని చిన్నపిల్లాడిలా అడుగుతాడు. శృంగి బేరపురంలో రథం దిగి అయోధ్యాభిముఖులై నత శిరస్కులై వాళ్ళు ముగ్గురు ఏదో చెప్పాలనుకునీ పెల్లుబికిన దుఃఖంతో గొంతురుద్ధమై ఏమీ మాట్లాడలేక వనాలకి వెళ్ళిపోయారని సుమంత్రుడు చెప్తాడు. అది విని దశరథుడు ద్విగుణీకృత దుఃఖంతో మూర్ఛపోతాడు. దశరథుడికి మరణ మాసన్నమయ్యిందని గ్రహించిన సుమంత్రుడు మంత్రులకు వార్త పంపుతాడు. స్పృహ వచ్చాక దశరథుడు రాణులతో రాముని దిశగా వెళ్ళిన బుద్ధి ఇప్పటికీ తిరిగి రావటల్లేదు రామా! నిన్నే తల్చుకుంటున్నాను. నీకు అభిషేకం చేసి, రాజ్యభారం నీకప్పగించి తపోవనాలకి వెళ్ళాలనుకున్నాను. కాని కైకేయి నా ఆలోచనలన్నీ తారుమారు చేసింది అని బాధ పడ్డాడు.

సుమంత్రుని పిల్చి కైకేయితో "రాముడు వెళ్ళిపోయాడు. నీకు ప్రియమగు గాక. నేను ప్రాణ త్యాగం చేస్తున్నాను. కుమారుని త్వరగా రప్పించుకో పాపం సఫలమగుగాక" అని చెప్పమంటాడు. క్రమంగా ఇంద్రియ శక్తులన్నీ క్షీణిస్తున్న దశరథుడికి వరసగా దిలీపాది పితృదేవతలంతా కన్పిస్తారు. కాంచుకీయుని జలం తెమ్మని ఆచమనం చేసి రామ! వైదేహి! లక్ష్మణా! నేను నా పితరుల దగ్గరికి వెళ్ళిపోతున్నానంటూ కన్ను మూస్తాడు.

## ద్వితీయాంక ప్రాధాన్యం (విమర్శ) :-

కథాపరంగా చెప్పాలంటే రామ వనగమనం వల్ల పుత్ర వియోగ తప్తుడైన దశరథుని దుఃఖం, మరణం మాత్రమే ఈ రెండో అంకంలో చెప్పబడ్డాయి. కేవలం దశరథ మరణమొక్కటే ప్రయోజనం అయితే అది ఏ విష్కంభక / ప్రవేశకాదుల ద్వారానో చెప్పించవచ్చు. ఇంతుక మించి ఈ అంకానికి ఏ ఇతర విశేష ప్రయోజనం కన్పించుదు. అయితే రామాదుల కోసం వియోగాన్ని భరించలేక దశరథుడు దుఃఖించిన తీరు ఎటువంటి వారినైనా కదిలిస్తుంది. కరుణరస పరిపుష్టి మనకు ఈ అంకంలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

మొదటి అంకం చివరలో ప్రారంభమైన కరుణ రసం ఇంచుమించు ఆరో అంకం మధ్య వరకు పోషించబడింది. ఈ రకంగా (రస దృష్టితో) చూస్తే రెండో అంకం కరుణ రసానికి ఆయుపట్టు. ఇంకో విశేషమేమిటంటే ఈ రెండో అంకం చివర కాంచుకీయోవు యవనికాస్తరణం కరోతి అని చెప్పడం ద్వారా దశరథుని మరణం సాక్షాత్తుగా చూపించినట్లయింది. ఇది భరతముని నాట్య శాస్త్ర విరుద్ధం. ద్వితీయాంకంలో మరణ మాసన్నమైన దశరథునికి స్వర్గస్థులైన దిలీపాది పితృదేవతలు కన్పించినట్లు చెప్పబడింది. ఇది భాసుని కల్పన రామాయణంలో లేదు.

# చతుర్థాంక కథా ప్రాధాన్యం

చతుర్థాంకానికి ముందు ప్రవేశకంలో విజయ, నందినిక అనే ఇద్దరు పరిచారికల సంభాషణ వల్ల భరతుడు ప్రతిమా గృహాన్ని చూడ్డానికి వెళ్ళినట్లు తెలుస్తుంది. రాజ్య లోభంతో కైక రాముని వనానికి పంపి, తనకి వైధవ్యం తెచ్చుకుందనీ లోకాన్ని ఇలాంటి దుఃస్థితిపాలు చేసిన కఠినాత్మురాలు, పాపానికి ఒడిగట్టింది అని వారిద్దరు కైకను నిందిస్తారు. భరతుడు అభిషేకాన్ని తిరస్కరించి రామ ధర్మనార్థం వనానికి వెళ్ళినట్లు కూడా ప్రవేశకంలో చెప్పబడింది.

చతుర్థాంకం భరత, సుమంత్రులు రథంలో ఉన్న సన్నివేశంతో ప్రారంభమవుతుంది. రామ లక్ష్మణులు భరతుని కంఠస్వరం గుర్తిస్తారు. ఆశ్రమం బయటికి వచ్చిన లక్ష్మణుడు భరతుని చూచి రాముడని భ్రమపడ్తాడు. సీత తనే స్వయంగా వెళ్ళి భరతుని ఆహ్వానిస్తుంది. దశరథుని తల్చుకుని రాముడు దుఃఖిస్తాడు. రాముని పరిచర్య చేసుకుంటూ వనంలోనే ఉండిపోతానంటాడు భరతుడు. సత్యవాక్య పరిపాలకుడైన తండ్రి మాట నిలబెట్టమనీ, తిరిగి అయోధ్యకు వెళ్ళి రాజ్యపాలన చెయ్యమనీ రాముడు భరతుని ఆదేశిస్తాడు. 14 సంవత్సరాల తర్వాత తిరిగి తను రాజ్యం స్వీకరిస్తానంటేనే రాజ్యపాలన భారం వహిస్తానని భరతుడు షరతు పెడ్తాడు. రాముడు దానికంగీకరిస్తాడు. భరతుడు రాముని పాదుకలివ్వమనీ కార్యసిద్ధ పొందేవరకు తను వాటికి విధేయుడుగా ఉంటాననీ అర్థిస్తాడు. భరతుని కోరిక మన్నించి రాముడు పాదుకలిస్తాడు. భరతుడు అభిషేక జలాన్ని రామపాదుకలపై ఉంచి వాటికే అభిషేకం చేస్తాడు.

రాజ్య పాలనలో క్షణం కూడా ఏమరుపాటు తగదనీ, వెంటనే తిరిగి అయోధ్యకు వెళ్ళమనీ రాముడు భరతుని ఆదేశిస్తాడు. మహారాజు (దశరథుని) వలె ప్రజలను కాపాడమని రాముడు భరతుని భారాన్ని సుమంత్రునికి అప్పగిస్తాడు. వెంటనే భరత సుమంత్రులు అయోధ్యకు తిరుగు ప్రయాణమవ్వడంతో చతుర్థాంకం ముగుస్తుంది.

ఈ విధంగా చతుర్థాంకమంతా వనంలోనే జరుగుతుంది. కథా భాగాని కొస్తే - భరత, సుమంత్రుల వన గమనం రామ దర్శనం రామ పాదుకాభిషేకం భరత సుమంత్రుల తిరుగు ప్రయాణం - ఇవే ఘట్టాలు. అయితే ఈ అంకంలో భరతుని పాత్ర అసమానంగా చిత్రీకరించబడిందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

భరతుడు తన రాకను రామునికి నివేదించే సందర్భంలో ఇక్ష్వాకు కుల కళంకభూతుడననీ, నిర్దయుడు, కృతఘ్నుడు, ప్రియ సాహసుడు అయిన భక్తి పరుడొకడొచ్చాడని చెప్పమనడం అతని ఔన్నత్యాన్ని వెల్లడిస్తుంది. చిరకాలానికి నేను ఆర్జించుకున్న కొంచెం కీర్తిని భరతుడిపుడచిరకాలంలోనే ఆర్జించుకున్నాడు. ఇంతటి విశిష్ట గుణ సంపన్నుడైన పుత్రుని చూడకుండా స్వర్గానికి వెళ్ళిన మహారాజు గురించే చింతిస్తున్నాను. ఇటువంటి గుణనిధిని పొందీ లోకంలో మహా పురుషుల యందు విధికింత బలమున్నచో ఏమి చెప్పగలము? అన్న రాముని మాటల వల్ల భరతుని వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుస్తుంది.

ఈ అంకంలో సీతా, రామ, లక్ష్మణులు, భరతుడు మాట్లాడిన ప్రతీమాటా ధర్మవీర రస వ్యంజకాలు. తృతీయాంకంలో ప్రతిమా గృహం, చతుర్థాంకంలో రామ, భరతుల సంభాషణ చూస్తే భరతుడు పతాకా నాయకుడు అని నిస్సందేహంగా చెప్పచ్చు. నాటకంలో అంగిరసమైన ధర్మవీర రసపోషణకు ఈ చతుర్థాంకం పట్టుకొమ్మ లాంటిది.

# ప్రతిమా నాటకాంతర్గత సుభాషితములు

| | అంక సంఖ్య | శ్లోక సంఖ్య |
|---|---|---|
| అనుచరతి శశాంకం రాహుదోషేపి తారా | I | 25 |
| అలమిదానీం ప్రణే ప్రహర్తుం | IV | |
| అల్పం తుల్యశీలాని ద్వంద్వాని సృజ్యంతే | I | |
| ఈదృగ్విధాః పురుషా ఈదృశీమాపదమనుభవంతీతి విధరనతిక్రమణీయః | II | |
| కిం బ్రహ్మఘ్నానామపి పరేణ నివేదనం క్రియతే | IV | |
| కుతః క్రోధో వినీతానాం లజ్జా నా కృతచేతసాం | VI | 9 |
| గంగాయమునయోర్మధ్యే కునదీవ ప్రవేశితా | III | 17 |
| గోపహీనా యథా గావో విలయం యాంతి అపాలితాః | III | 24 |
| నృపతిహీనా హి విలయం యాంతి వై ప్రజాః | | |
| ఛాయాం పరిహృత్య శరీరం న లంఘయామి | V | |
| తిర్యగ్యోనయోపి ఉపకృతమవగచ్ఛంతి | VI | |
| న న్యాయ్యం పరదోషమభిధాతుమ్ | IV | |
| న వ్యాఘ్రం మృగశిశవః ప్రధర్షయంతి | V | 18 |
| నాయోధ్యా తం వినాయోధ్యా సాయోధ్యా యత్ర రాఘవః | III | 25 |
| నిమ్నస్థలోత్పాదకో హి కాలః | VII | |
| నిర్దోషదృశ్యా హి భవంతి నార్యో యజ్ఞే వివాహే వ్యసనే వనే చ | I | 29 |
| పతతి వృక్షే యాతి భూమిం లతా చ | I | 25 |
| పిపాసార్తోऽనుధావామి క్షీణతోయాం నదీమివ | III | 11 |
| పురుషాణాం మాతృదోషో న దోషః | IV | 21 |
| బహువృత్తాంతాని రాజకులాని నామ | I | |
| భర్తృనాథా హి నార్యః | I | 25 |
| రాజ్యం నామ ముహూర్తమపి నోపేక్షణీయమ్ | V | |

| | | |
|---|---|---|
| వార్ధలస్తు ప్రణామః స్యాదమంత్రార్చితదైవతః | III | 6 |
| విధిరనతి క్రమణీయః | III | 24 |
| శరీరేరిః ప్రహరతి హృదయే స్వజనస్తథా | I | 12 |
| సర్వశోభనీయం సురూపం నామ | I | |
| సర్వోపి మృదుః పరిభూయతే | I | 18 |
| సులభాపరాధీ పరిజనో నామ | I | |
| స్వః పుత్రః కురుతే పితుర్యది వచః కస్తత్ర విస్మయః | I | 5 |
| హస్తస్పర్శో హి మాతౄణాం అజలస్య జలాంజలిః | III | 13 |

## భాసుని ప్రతిమా నాటకము - ప్రముఖుల అభిప్రాయాలు :-

## భాసుని నాటక కళ :-

### డా॥ ముదిగంటి గోపాల రెడ్డి, సుజాత రెడ్డి :-

భాసుడు ప్రతిభాశాలి అయిన నాటకకారుడు. ప్రతి నాటకం ఒక ప్రత్యేకతను కలిగివున్నది. భాసుని నాటక కళ శాస్త్రీయ లక్షణాలను దృష్టిలో పెట్టుకొని గిరిగీసుకొని ఆ పరిధిలోనే సీమితమైంది కాదు. కథ, సన్నివేశాలు, పాత్రలను అవసరాన్ని బట్టి అతడు నేర్పుతో మలచుకొని చిత్రించాడు. అవన్నీ కూడా అతని ప్రతిభా జనితాలే కాని పూర్వ రచనల అణుకరణలు కావు. అందుకే అతని నాటకాలు ఇతర నాటకాల కన్నా భిన్నంగా, విలక్షణంగా, మౌలికంగా కన్పిస్తున్నవి. భాసుని నాటకాలు కేవలం పఠనయోగ్యంగానే కాక ప్రదర్శనకు చాలా యోగ్యంగా వున్నవి కాబట్టే కేరళ నటులు "చాక్యారు"లు వందల సంవత్సరాల నుంచి వాటిని ప్రదర్శిస్తూ వచ్చారు. వారి ఆదరణ చేతనే ఆ నాటకాలు నష్టం కాకుండా నిలిచినవి.

## M.R. KALE :-

Btasa was certainly a talented dramatist judging from the number and variety of his dramas. The principal characteristics of his plays that strike the reader most are their simplicity in construction, naturalness in styles, and realism indescription as well as the dramatic qualities of vigour, life and action and sharpness of characterization. The plot of each drama is unfoded in a few effective situations that follow each other in their natural sequence and that are calculated to bring out the sentiment in hand. The style is simple, clear and sweet. Bhasa's descriptions are simple, natural and straightforward.

**ఆచార్య ఎమ్.వి. రమణ**
**సంస్కృత శాఖాధ్యక్షులు**
**ఆంధ్ర విశ్వ విద్యాలయం**
**విశాఖపట్టణం**

పాఠం - 11 (క)

# ప్రతిమా నాటకము - నాటక లక్షణ సమన్వయము

భాస మహాకవి, మహాకవి పరంపరలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధికెక్కిన కాళిదాసునకును పూజ్యతను సాధించిన మహనీయుడు. అతని రచనలలో ప్రతిమా నాటకము విశిష్టతమము.

అభినయించి ప్రదర్శింపదగిన రచనా విశేషమును స్థూలముగా నాటకమందురు. ప్రేక్షకులు చూచి రసానుభూతిని పొందుదురు. కావున నిది దృశ్యకావ్యము. దృశ్యకావ్యమునకు కొన్ని ప్రత్యేక లక్షణములను శాస్త్రకారులు నిర్దేశించియున్నారు. ఆ లక్షణము లీ ప్రతిమా నాటకమునందెట్లు సమన్వయించునో పరిశీలింతుము.

నటించుట అను పని యెందు కలదో అది నాటకము. ఇందు నటులు అనుకార్యులైన రామాదులననుకరించి ఆంగికము, వాచికము, ఆహార్యము, సాత్త్వికము అను నాలుగు విధములైన అభినయములతో ప్రేక్షకుల యందు రసానందము కలిగింతురు. దీని నిర్వహణ బాధ్యతయంతయు ప్రధానముగా సూత్రధారుని యందుండును. సూత్రమును ధరించువాడని ఆ శబ్దమునకు అర్థము. ఇచట సూత్రమనగా ప్రయోగమునకు కావలసిన మూలాధార విజ్ఞానము. నేటి కాలపు 'దర్శకుని' క్రియా నిర్వహణము వంటి దానిని ధరించువాడు సూత్రధారుడు. సూత్రధారుడు ప్రయోగారంభమును చేసి నిష్క్రమించును.

ఈ నాటకమున సూత్రధారుడు ఆశీర్వచన రూపమైన మంగళమును ఆచరించి నటిని పిలిచి శరత్కాలమును గూర్చి పాట పాడమని అడిగి ఆమె పాడిన పిదప దానిని మెచ్చుకొనుచు వెనువెంటనే రాబోవు పాత్రను సూచించి వెడలిపోవును. ఈ కార్యక్రమమును ప్రస్తావన, స్థాపన అను పేరులతో వ్యవహరింతురు. "మనాక్ కావ్యార్థ సూచనమ్" అను వాక్యమున కనుగుణముగా ఇందు నాటకమున ప్రధాన పాత్రల పేరులన్నియు శ్లేషతో నిబంధింపబడినవి.

సీతాభవః పాతు సుమంత్ర తుష్టః
సుగ్రీవరామః సహలక్ష్మణశ్చ ।
యో రావణార్య ప్రతిమశ్చ దేవ్యా
విభీషణాత్మా భరతోఽను సర్గమ్ ॥

ఇందు రామాయణము నందలి ప్రధాన పాత్రలు సీత, సుమంత్రుడు, సుగ్రీవుడు, రాముడు, లక్ష్మణుడు, రావణుడు, విభీషణుడు, భరతుడు అను వారి పేరులు ప్రసక్తములైనవి. నాటకము 'ప్రతిమ' అనునదియు రూపొందినది.

నాటక కర్తలు రంగస్థలమున నటులను ప్రవేశపెట్టుటకు ముందు 'నాంది'ని నిర్వహించుట సంప్రదాయము. రంగ విఘ్నములను ఉపశమింపజేయుటకై నటులు నేపథ్యమున నిర్వహించు పూజా విధానము'నాంది'. ఇది సాధారణముగా దృశ్యము కాదు. కవి ఊరక సూచించి వదలి పెట్టును. సూత్రధారుడు చేయు దేవతా ప్రార్థనా రూపమైనదియు నాందియే. ఇది రంగ స్థలమున ప్రేక్షకుల ముందు జరుగును. అదియే ఇంతకుముందు చెప్పుకొన్న "సీతాభవః" ఇత్యాది శ్లోకము.

"దేవద్విజ నృపాదీనా మాశీర్వాదపరాయణా
నందన్తి దేవతా యస్మా త్తస్మా న్నాన్దీతి కీర్తితా"

అను శ్లోకమును బట్టి దేవతలు, విప్రులు, రాజులు మున్నగు వారి ఆశీర్వాద రూపమైనదియు, దేవతలకు ఆనందమును కలిగించునదియు నాంది.

ప్రతిమ యందు ఇది చక్కగా నిర్వహింపబడినది.

నటులు వేషధారణము చేయు తెర వెనుక నుండు లోపలి భాగమును నేపథ్యమందురు. నేపథ్యమనగా అలంకరణమనియు, అలంకరణము చేసికొనుతావనియు నర్థములు వ్యవహారమున నున్నవి. "కుశీలవ కుటుంబస్య స్థలం నేపథ్య ముచ్యతే". కుశీలవులనగా నటులు. వారి కుటుంబమనగా వారందరి సముదాయము. వారు ప్రదర్శనమునకు ముందు చేసికొను ఏర్పాటులకు అనువైన స్థలము నేపథ్యము. భాసుడు దానిని సూత్రధార ప్రవేశము తరువాత ప్రసక్తికి తెచ్చెను.

కాలదేశ పాత్రముల ఏకత్వ స్థితిని బట్టి నాటకమును అంకములుగా విభజింతురు. కథా విస్తృతిని బట్టియు, సన్నివేశముల ఆవశ్యకమును బట్టియు అంక విభజన జరుగును. ప్రతిమా నాటకమును భాసుడు ఏడు అంకములుగా విభజించెను. వాని స్వరూప స్వభావములను రేఖా మాత్రముగా పరిశీలించుట అవసరము.

1. మొదటి అంకము ఇతి వృత్తము జరిగిన చోటు అయోధ్య. కాలము శరదృతువు. రాముని పట్టాభిషేక ప్రసంగము, పట్టభంగ సంగతియు నిందు విషయములు.

2. సుమంత్రుడు సీతారామ లక్ష్మణులను అరణ్యమున విడిచి వచ్చుట, దశరథుడు పుత్ర విరహ శోకముచే మరణించుటయు ద్వితీయాంకమున సంభవించెను.

3. మూడవ అంకము నాటక నామ నిర్దేశమునకు ప్రముఖ ఘట్టము. భరతుడు మాతామహ గృహముల నుండి అయోధ్యకు తిరిగి వచ్చుట, రామాదుల వన వాసము, దశరథుని మరణము ప్రతిమల ద్వారమున తెలిసికొనుటయు నిందలి విషయము.

4. రాముని ఒప్పించి అయోధ్యకు తెచ్చు ప్రయత్నములో భరతుడు వనమున కరుగుటయు, పూనిక ఫలింపక పాదుకలు మాత్రము గ్రహించి తిరిగి వచ్చుటయు నాలుగవ అంకము నందలి యితి వృత్తము.

5. అయిదవ యంకమునందలి వృత్తాంతము సీతాపహరణము.

6. సుమంత్రుడు రాముడున్న వనముల కరిగి మరలి వచ్చి సీతాపహరణము, రామ సుగ్రీవుల కలయిక మున్నగు అంశములు ఆరవ యంకమున ప్రస్తావనకు వచ్చినవి. భరతుడు రామునికి సాయము చేయుటకై లంక పై దండెత్తు ప్రయత్నముతో వెడలుటకు నిశ్చయించుటయు నిందలి ప్రధానాంశము.

7. రాముడు రావణుని సంహరించి సీతను సాధించి తపోవనమునకు, పిదప అయోధ్యకును తిరిగి వచ్చుట ఏడవ అంకము విషయము.

ఇట్లు భాసుడు తాను చెప్పదలచుకొన్న అంశములను విభజించు కొని యంకములను నిర్మించెను. ఇందు మొదటి యంకము వృత్తాంతము అయోధ్యలో రాజ భవనమునందు జరిగెను. రెండవ అంకమునకు దేశ మదియే. మూడవ అంకము అయోధ్య నగర బహిః ప్రదేశమున నున్న ప్రతిమా గృహము స్థానము. నాలుగైదంకముల వృత్తాంతము జరిగిన తావు అరణ్యము. ఆరవ యంకము మరల రాజ భవనము. ఏడవ యంకము జన స్థానమను అరణ్య ప్రదేశము. ఈ విధముగా భాసుడు భావుక హృదయములను తన నిర్మాణ పాటవముతో అయోధ్యారణ్య ప్రదేశములందు విహరింపజేసెను. ఒక అంకము నందలి వృత్తాంతమునకు భిన్న దేశకాలములు సాధారణముగా కుదరవు. ఈ నాటక లక్షణ మిందు చక్కగా సమన్వయ మగుచున్నది. ఒక అంకమునకు మరియొక అంకమునకు నడుమ కాలదేశ వ్యవధానమెంతైన నుండవచ్చును. సహృదయ విమర్శకు లీ నాటక వృత్తాంతమునకు మొత్తము పదునాలుగు సంవత్సరముల కాలము పట్టినట్లుగా నిరూపించిరి.

రంగ స్థలమున సర్వ విషయములను ప్రదర్శించుట కవకాశము ఉండదు. మరియు సుకుమార హృదయముల పై ప్రభావము పడకుండుటకు గాను కొన్ని విషయములను ప్రదర్శింపరాదు. జుగుప్సావహములైన సన్నివేశములను చూపుట నిషిద్ధము. కాని

యిట్టివానిని ప్రేక్షకులకు తెలియజేయవలయును. వానికై నాటక లక్షణ కర్తలు విష్కంభము, ప్రవేశకము, చూళిక, అంకావతారము, అంకాస్యము అను నైదు విధానములను ఏర్పరచిరి. ఇందు ప్రతి నాటకమునందును అన్నియు నుండవలయునను నియమము లేదు. అవసరమును బట్టి కవి వానికి రూపకల్పన చేయును.

ప్రతిమా నాటకములో వీని స్థితిగతులను గమనింతము. ప్రథమ ద్వితీయాంకముల నడుమ మిశ్ర విష్కంభము కలదు. కడచినదో, కడవనున్నదో అయిన ప్రదర్శింపరాని విషయమును రెండు మూడు పాత్రల సంభాషణముల ద్వారా సూచించు ప్రక్రియను విష్కంభమందురు. సంస్కృత నాటకములలో భాషా విషయకముగా నొక వ్యవహార నియతి కలదు. ఇతి వృత్తమునందలి వారి వారి స్థితి భేదములను బట్టి కొందరు సంస్కృతమును, మరికొందరును ప్రాకృతమును పలుకుదురు. నాటకము నందలి వ్యక్తులను ఉత్తమ, మధ్యమ, నీచ భేదములతో వ్యవహరించుట ప్రాచీన కాలమున కలదు. ఇచటి ఉత్తమత్వము, నీచత్వము అనునవి గుణ పరములో, స్వభావ పరములో కాదు. సమాజము నందలి వారి వారి స్థాయిని బట్టి దీనిని ప్రాచీనులు నిర్ణయించిరి. ఉదాహరణకు రాజ పురుషులు, పురోహితుడు మొదలగువారు ఉత్తమ కోటికి చెందినవారు. సాధారణముగా స్త్రీలందరు తక్కిన రెండు విభాగములకు మాత్రమే చెందినవారు. పరిచారకులు, పరిచారికలు మొదలగువారు నీచ పాత్రలుగా పరిగణనకు వత్తురు. ఉత్తమ వ్యక్తులు సంస్కృతముననే వ్యవహరింతురు. తక్కిన వారు ప్రాకృతమును వాడుదురు. ప్రదర్శనకు యోగ్యము కాని అంశములను కేవలము సంస్కృత భాష పలుకువారే నిర్వహించినచో అది శుద్ధ విష్కంభము. సంస్కృత ప్రాకృతముల మేళనము గల దానిని మిశ్ర విష్కంభమందురు. విష్కంభకము అనియుననవచ్చును. ఇవి రెండంకములకునడుమ నిబద్ధములగును.

ప్రతిమా నాటకమున ద్వితీయాంక ప్రారంభమున మిశ్ర విష్కంభకము కలదు. ఇది కాంచుకీయ ప్రతీహారుల సంభాషణము. కాంచుకీయుడు సంస్కృతమున మాటాడు నధి కారము కలవాడు. ప్రతీహారియనగా ద్వారపాలకోద్యోగి. సాధారణముగా దీనిని స్త్రీలు నిర్వహింతురు. ఆమె ప్రయోగించు భాష ప్రాకృతము. ఇట్లిందు సంస్కృత ప్రాకృత మిశ్రణము ఉండుట వలన నిది మిశ్రవిష్కంభకమైనది.

సీతాలక్ష్మణ సమేతముగా శ్రీరాముడు అడవులకు వెడలిన తరువాత దశరథ మహారాజు పడుచున్న దుర్భర వేదనను, అయోధ్యానగర వాసుల మౌన రోదనను తెలియజెప్పుట దీని ప్రయోజనము. శ్రీరామాదుల ప్రయాణమును అయోధ్య నుండి అడవిదాక ప్రదర్శించుట రంగస్థలమందు సాధ్యమగు విషయము కాదు కదా! మరియు అయోధ్యా నగర వాసుల దుఃఖోద్గారమును సమగ్రముగా చూపుట కుదరదు కదా! అందువలన కవి విష్కంభకమును ఆశ్రయించెను. ఇందు రాముడు మొదలగువారడవికి చేరుకొనిరను వృత్త (గడచిన) విషయమును, దశరథుడు కౌసల్యా సుమిత్రలతో మహా దుఃఖముతో ప్రలపించుట అను వర్తిష్యమాణ (జరుగబోవుచున్న) విషయమును సూచనకు వచ్చెను.

ద్వితీయ తృతీయాంకముల నడుమ 'ప్రవేశకము'ను భాసుడు నిక్షేపించెను. విష్కంభకమునకును, ప్రవేసకమునకును పెద్ద భేదము లేదు. ఇందు సంభాషించు వ్యక్తులు ప్రాకృతమును మాటాడువారగుటయే భేదము. అనగా నాటక పరిభాషననుసరించి నీచ పాత్రలతో నిర్వృత్తమగునది ప్రవేశకము. ఇదియు జరిగిన, జరుగనున్న కథాంశములను సూచించును.

ప్రతిమానాటకమున తృతీయాంకారంభము నందలి ప్రవేశకము భట సుధాకర సంభాషణాత్మకము. భవనమునకు సున్నము వేయు సేవకుడును, వాని చేత నాపని చేయుంచు భటుడును ఇందు మనకు గోచరించు పాత్రలు. దశరథుడు మరణించెనను జరిగిపోయిన కథాంశమును ప్రతిమా రూపమున నిక్షేపించిన ఆతనిని గాంచుటకై కౌసల్య మొదలగు అంతఃపురజనమచటకు రాబోవుచున్నారనియు తెలుపుట దీనికి ప్రయోజనము. నాట్య శాస్త్ర మర్యాదననుసరించి మరణమును రంగస్థలమున ప్రదర్శింపరాదు. దానిని ఈ ప్రవేశకము తెలుపుచున్నది.

భాసుడు ఈ ప్రవేశకమున కొంత హాస్యరసమును చవి చూపించెను. సుధాకారుడు నీచ సేవకుడు. వాని పనిని పర్యవేక్షించు భటుడును సేవకుడే అయినను అతనికంటె కొంత ఘనుడు. వారిరువురివలె తనకు వేయి చేతులున్నచో నిన్ను చంపుదుననుట, కార్తవీర్యునకు వలె తనకు వేయి చేతులున్నచో నిన్ను చంపుదునని సుధాకారుడనుట మొదలగునవి నవ్వు పుట్టించు నంశములు.

నాలుగవ అంకము ప్రారంభమునకు ఒక ప్రవేశకము కలదు. విజయ, నందినిక అను నిరువురు పరిచారికలు ఇందు కానవత్తురు. వారి సంభాషణ ముఖమున తెలియవచ్చు అంశములు రెండు. 1. భరతుడు తల్లి చేసిన ద్రోహమునకు కోప శోకములు పెనగొనగా ఆమె ముఖమును కూడ చూచుట కష్టపడలేదనునది. 2. భరతుడు అభిషేక ద్రవ్యములను విడనాడి రాముడున్న తపోవనమున కరిగెననునది.

ప్రస్తావవశమున పరిచారికలు కూడ కైకేయి నెంతగా అసహ్యహించుకొనుచున్నారో ఈ ప్రవేశకము ద్వారమున తెలియవచ్చుచున్నది. ఇందలి పాత్రధారులిరువురు స్త్రీలు, పరిచారికలు కనుక ప్రాకృతమునందే సంభాషించుట నాటక సంప్రదాయము. అందువలన నిది ప్రవేశకమగుచున్నది.

ఆరవ అంకము మొదటి ఇద్దరు వృద్ధతాపసుల సంభాషణ రూపమున నొక 'శుద్ధ విష్కంభము'ను భాసుడు రూపొందించెను. ఇరువురు పురుషులు, తాపసులు కనుక సంస్కృతమునే ప్రయోగింతురు. అందువలన నిది శుద్ధ విష్కంభకము. ఈ సంభాషణ వలన తెలియవచ్చు నంశము - రావణుడు సీతనపహరించి గగనమార్గమున పోవుచుండుట, దశరథుని ప్రాణమిత్రము జటాయువు రావణుని నిరోధించుట, వారిరువురకు అంతరిక్షమున ఘోరమైన పోరు జరుగుట జటాయువు ప్రాణములను కూడ లెక్కింపక సీతా విముక్తికై రావణునితోపోరాడి మృతి చెందుట, ఆ విషయమును ఆ తాపసులు రాఘవునకు తెలియచెప్పుటకై అరుగుట - అనునవి.

యుద్ధము, మరణము మొదలగు నంశములను రంగస్థలమున ప్రదర్శింపరాదను నియమమును బట్టి కవి విష్కంభము ద్వారమున సూచించెను.

సప్తమాంక ప్రారంభమునందును భాసుడు మిశ్ర విష్కంభకమును నిబంధించెను. ఇందు తాపసుడును, నందిలకుడను నొక సేవకుడును కానవత్తురు. తాపసుడు సంస్కృతమునందును, నందిలకుడు ప్రాకృతమునందును మాటాడుట వలన నిది మిశ్ర విష్కంభకము. ఇందు సూచింపబడిన అంశము లీవిధముగా నున్నవి.

1. రావణ సంహారము
2. విభీషణ పట్టాభిషేకము
3. సీతా పునరాదానము
4. ఋక్ష రాక్షస వానర ముఖ్యులతో పరివృతుడై శ్రీరాముడు కులపతి ఆశ్రమ పదమునకు వచ్చుట.

రావణ సంహారము యుద్ధ విషయము కనుక ప్రదర్శనకు కుదరని విషయము. విభీషణ పట్టాభిషేకము లంక యందు జరిగినది కనుక దేశాంతర విషయము కనుక భిన్న స్థల సంఘటనమగుటచే ప్రదర్శనకు సరిపడదు. అట్టిదే సీతాదానము. ఋక్షాదులతో రాముడు తిరిగి వచ్చుట సంఖ్యాబాహుళ్య లక్షణము కనుక అదియు ప్రదర్శన సాధ్యము కాని విషయము. అందువలన నీ నాలుగంశములను మిశ్ర విష్కంభకము ద్వారమున కవి సూచించెను.

ఇందును చిన్న హాస్య ప్రసంగమును కవి నిబంధించెను. రాక్షసులందరు వచ్చిరి మరి వారి ఆహార విషయమో అని నందిలకుడు సందేహించుచు వారు తిందురు గదా! అని ఆ పదార్థమును స్పష్టముగా చెప్పక ఊహకు వదలివేయును. తాపసుడు వారు విభీషణ విధేయులు కనుక మాంస భక్షణము లేదా నర భక్షణము చేయరని చెప్పును. ఇది మనకు చిన్నగా నవ్వు తెప్పించు సన్నివేశము.

ఈ విధముగా భాసుడు అంకమునకు అంకమునకు నడుమ విష్కంభాదులను నిర్మించి అనేక కథాంశములను సూచించెను. ఇట్లు సూచించుట నాటక లక్షణములలో ఒక విధానము.

కావ్యము అన్నదే రసాత్మకమని సంభావన. అందును దృశ్య కావ్యమున దాని ప్రాచుర్యము మరింత అధికము. కావున నాటక లక్షణ సమన్వయ సందర్భమున రస విచారణము తప్పనిసరిగా చేయవలసి యున్నది. శాస్త్రకారులు కావ్యమునందు శృంగార వీరములలో ఒకటి ప్రధానముగా నుండవలయునని నిర్దేశించిరి. అదియే అంగిరసము. భాసుని యీ నాటకమున అంగిరసమును గూర్చి అనేకాభిప్రాయములు కలవు. తలపెట్టిన పట్టాభిషేకము చెడిపోవుట, రాజు కావలసిన రామ చంద్రుడు వనముల కరుగవలసి వచ్చుట, మహారాజు దశరథుడు మరణించుట, తల్లి తనకు సాధించి పెట్టిన రాజ్యమును భ్రాతృ భక్తితో భరతుడు గ్రహింపనొల్లకుండుట, వనమున కేగి రాముని తెచ్చుటకు ఆతడు ప్రయత్నించుట మొదలగు నంశములను ప్రదర్శించు ప్రేక్షకునకు దుఃఖము పెల్లుబికి వచ్చుట సహజము కావున కొందరీ నాటకమునందు కరుణమంగి రసమని భావించిరి. నాయకుడగు శ్రీరామ చంద్రునిలో భోగ లాలసత లేకుండుట, వనవాసమును తపోధనుల వలె ఆనందముతో చేయుటకు సిద్ధపడుట, తమ్ముని రాజ్యాభిషేకమును గోరుచు దానియందు తాను విరక్తుని వలె సంచరించుట మొదలగు నంశములను బట్టి మరికొందరిందు శాంతమునంగిరసముగా పరిగణించిరి. కాని యీ రెంటి యందును కవికి మొగ్గులేదని కావ్యమును మెలకువతో ననుశీలించువారికి స్పష్టముగా తెలిసివచ్చును. అంతేకాదు పై రెండును అంగి రసములుగా అలంకార శాస్త్రతత్వజ్ఞులు చెప్పిన వానిలో లేకుండుటయు గమనింపదగిన విషయము. శృంగార మంగియనుట కిందే మాత్రము నవకాశము కన్పట్టదు. కావున వీరమే యిందంగి యనుట సముతచితము. దాన, దయా, ధర్మ, యుద్ధ వీరములని వీరమును శాస్త్రకారులు నాలుగు విధములుగా వింగడించిరి. ఈ నాటకమునందు ప్రాయశః ధర్మ నిర్వహణరూపమైన ఉత్సాహము కథానాయకుడగు శ్రీరామ చంద్రుని యందు విశేషముగా గోచరించును. పితృవాక్యపాలనమునకై రాజ్యము నానందముతో వదలివేయగోరుట, అరణ్యముల కేగనిశ్చయించుట, అరణ్యమునందును పితృశ్రాద్ధమును అత్యంత శ్రద్ధతో చేయ సంకల్పించి భార్యను పోగొట్టుకొనుట, ధర్మపత్నిని తెచ్చుకొనుటకై లోకైక వీరుడగు రావణుని సంహరించుట, ధర్మాత్ముడగు విభీషణునకు లంకా రాజ్యమున పట్టాభిషేకము చేయుట, తన ప్రవృత్తి ద్వారమున నగర జనపద వాసులను, అరణ్యా వాసులను నిండుగా సంతోషపరచుట, అతి క్లిష్టమైన ధర్మ నిర్వహణమునకు అందరి మన్ననలను పొందుట మొదలగు అంశములను పరిశీలించినచో ధర్మ వీరమునంగిగా చేయుట యందే భాసునకు తాత్పర్యము కలదని స్పష్టముగా తెలియుచున్నది. మరియు "రామో విగ్రహవాన్ ధర్మః" అని వాల్మీకి రామాయణము ఎలుగెత్తి ఘోషించుచున్నది. 'ధర్మజ్ఞః" "రక్షితా స్వస్య ధర్మస్య, స్వజనస్య చ రక్షితా" అనియు రామాయణము పారవశ్యముతో ప్రకటించినది. భాస మహాకవి తద్భిన్నముగా మరియొక రసమును అంగిగా చేయు విపరీత భావన కలవాడగుట అసంభవము. కావున నాతడీ నాటకమునందు శ్రీరామ చంద్రునిలోధర్మోత్సాహమును పితృ వాక్య పాలనాది అంశములచే పుష్టమొనర్చి వీరమునంగిగా తీర్చెనని నిర్ణయించుటయే సముచితము.

మరియు నీ నాటకమున నాయకుడు రాముడా, భరతుడా అనియు నొక వివాదమును కొందరుద్భావన చేసిరి. నాటకమున నాయక నిర్ణయము కూడ ప్రధాన విషయమే కనుక దీనిని గురించియు మనమొక నిర్ణయమునకు రావలసి యున్నది. ప్రతిమా నామము నాటకమునకు భాసుడు నిర్ణయించెను. ఆ ప్రతిమావృత్తాంతము భరతునితో ముడిపడి యున్నది. మరియు నాటకమున నాతనికి రామునితో సమప్రాధాన్యము గోచరించుచున్నది. కాని "అంకమాసన్న నాయకమ్" అని లక్షణము. నాయకుడు ప్రతి అంకమునందును కానరావలయును. ఈ నియమమును బట్టి చూడగా మొదటి రెండంకములలో భరతుని ప్రవేశము లేదు. భరతుని ఆ కారణముగా నాయకుడనుట పొసగదు. అంతేకాదు శ్రీరామునిది పితృభక్తి. భరతునిది భ్రాతృభక్తి. పితృభక్తి కారణముగా రాముడు పట్టభంగము, భార్యా వియోగము మొదలగు కష్టములకు గురియాయెను. భరతుని భ్రాతృభక్తి శ్రీరాముని ప్రవృత్తికి ఉద్దీపనముగా మాత్రమే కన్పట్టును. అందువలన అంగప్రాయముగా మిగిలిపోవును. పోయిన రాజ్యము మరల చేరుకొనుట, పోయిన భార్య మరల సాధింపబడుట, లోక కంటకుడైన శత్రువును సంహరించుట మొదలైన మహాఫలములను పొందినవాడు రాముడు. భరతుడు ప్రత్యేకముగా పొందిన ఫలమేదియు నిందు కానరాదు. అంతేకాదు నాయకుడు సర్వస్వతంత్రుడు కావలయును.

భరతుడిందు రామునకు పరాధీనుడు. రాముడు తనకు కలిగిన దుఃఖములకు ఎవరిని నిందింపని ధీరోదాత్తుడు. భరతుడు (భాసుని కల్పనమును బట్టి) తల్లి నిర్దుష్టత నెరుగక అసహ్యించుకొని నిందించిన ఉద్ధత స్వభావుడు. ఈ కారణముల చేత శ్రీరాముడే యీ నాటకమున నాయకుడని నిర్ణయము.

సాధారణముగా నాటకాంతమున భరత వాక్యము, ఆది యందు ఆశీరాదిరూప మంగళ వాక్యము వలె, నిబంధింపబడును. భరతులనగా నటులు. వారు పరిసమాప్తి యందు ఆశంసారూపముగా పలుకు వాక్యము భరత వాక్యము. ఈ నాటకము నందిది లక్ష్మణ వాక్య రూపముగా నిట్లున్నది.

"యథా రామశ్చ జానక్యా బన్ధుభి సమాగతః
తథా లక్ష్మ్యా సమాయుక్తో రాజాభూమిం ప్రశాస్తు నః"

రాముడు జానకి తోడను బంధువుల తోడను కలిసి అయోధ్యా నగరమున సుఖముగా నెలకొనినట్లు రాజు లక్ష్మీయుక్తుడై భూమిని శాసించు గాక!

ఈ విధముగా ప్రతిమా నాటకమున రామరాజ్య స్ఫూర్తిదాయకమగు మంగళ వాక్యమును భాసుడు భరత వాక్యముగా నిబంధించెను.

ప్రదర్శన యోగ్యత లేనిచో ఎన్ని లక్షణములున్నను అది నాటకముగా పరిగణింపబడదు. భాసుని యీ ప్రతిమ చిన్న చిన్న సంభాషణా వాక్యములతో, నటులను ఇబ్బంది పెట్టదు. సుదీర్ఘ ప్రసంగములు లేనిదై చక్కగా రంగ స్థలమున ప్రదర్శించుటకు యోగ్యమైయున్నది. అట్లు ఉండుట అతి ప్రధానమైనది. ఈ విధముగా ఈ నాటకము ఉత్తమ స్థానము నాక్రమించునదియగుట పరమ ప్రమోద స్థానము.

**ఆచార్య శలాక రఘునాథ శర్మ**
**విశ్రాంతాంధ్రాచార్యులు**
**శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం**
**అనంతపురం**

పాఠం - 11 (ఖ)

# ప్రతిమా నాటకము - మూలకథ మార్పులు, చేర్పులు

భాస మహాకవి రచించిన ప్రతిమా నాటకమునకు మూలము వాల్మీకి రామాయణము. ఇందు నాటకకర్త ప్రధానముగా శ్రీరామ పట్టాభిషేకము భంగమగుటకు దైవికమగు నొక కారణమును ప్రతిపాదించు ప్రయత్నము చేసెను. శ్రీమద్రామాయణము నందలి అయోధ్యా, అరణ్య, కిష్కింధా, సుందర, యుద్ధ కాండములందలి ఇతివృత్తము ఇందు రేఖా మాత్రముగా గోచరించును.

పురాణముల నుండియో, ఇతిహాసముల నుండియో ఇతి వృత్తమును స్వీకరించి కావ్యములను, నాటకములను రచించు సంకల్పము గల అనంతర కవులు మూలకథలోని ఇతివృత్తమును యథాతథముగ నిబంధించుటకు పూనుకొనరు. అది ఇతిహాసము వలననే సిద్ధించును గదా! వారు ప్రధానముగా సాధింపదలచునది రసభావాది సామగ్రిని. దానికై ఊహించి కొన్ని మార్పులను, చేర్పులను చేయుదురు. దీనికి అలంకార శాస్త్ర తత్త్వజ్ఞుల ఆమోదము కూడ కలదు.

"ఇతివృత్త వశాయాతాం త్యక్త్వాననుగుణాం స్థితమ్ ।
ఉత్ప్రేక్ష్యో ౨ ప్యన్తరాభీష్ట రసోచిత కథోన్నయః" ॥

అని ఆనందవర్ధనుడు తన ధ్వన్యాలోకమున విస్పష్టముగా ప్రకటించెను. ఇతివృత్తమున వచ్చిన అననుగుణ స్థితిని వదిలి కవి రసమునకు ఉచితమైన కూర్పును ఊహించియు నడుమ నడుమ కూర్చునని పై శ్లోకమునకు భావము. మరియు ఆతడు "నహి కవే రితివృత్త మాత్ర నిర్వహణేన కిఞ్చిత్ ప్రయోజనమ్, ఇతిహాసాదేవ తత్సిద్ధేః" అనియు వక్కాణించెను. ఇతివృత్త మాత్రమును నిర్వహించుట చేత కవికి ఏ మాత్రమును ప్రయోజనము సిద్ధింపదు. అది ఇతిహాసము వలననే కలుగుచున్నది కదా! అని పై వాక్యము భావము. దీని వలన తెలియవచ్చు విషయమేమనగా కవులు కొన్ని ప్రయోజనములను దృష్టిలో ఉంచుకొని మూలకథను మార్పులతో, చేర్పులతో అలంకరింతురు. అందు ముఖ్య ప్రయోజనము రసస్ఫూర్తి.

భాసకవి మహోజ్జ్వలములగు రామకథా పాత్రములకు ఒక క్రొత్త వెలుగును సంతరించుటకు సంకల్పించెను. ముఖ్యముగా దశరథుడు, రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, కైక, రావణుడు మొదలగు పాత్రలను మనమీ నాటకము నందు క్రొత్త కోణములతో దర్శింతుము. అన్నింటికంటె లోక సామాన్యముగా నింద్యురాలైన కైక ప్రవృత్తిని ఉదాత్తముగా చూపుటలో భాసుడు తన పనితనమును వినియోగించెను. ఇది ఒక విధముగా విశ్వనాథ వారన్నట్లు, రామకథకు భాసుడు చేసిన భాష్యము. భాష్యకారుడు మూలకథాకారుని హృదయమున నిగూఢముగా నుండు భావములను నిపుణతతో వెలికి తీసి ప్రదర్శించును. దాని వలన పాఠకుల హృదయములలో చెలరేగు అనేక సంశయములు తొలగిపోవును. ఆనందసాంద్ర స్థితిని వారనుభవింతురు.

ఈ పూర్వ రంగముతో రామాయణ మూలకథను భాసుడు తన రచనలో ఎట్లెట్లు మలచుకొనెనో గమనింతుము.

1. శ్రీరామచంద్రుని పట్టాభిషేక సందర్భమున కాలానుగుణముగా ఒక నాటకమును ప్రదర్శించుటతో నాటకము ప్రారంభమగును. ఇది భాసుని కల్పన. ఇందు అవదాతిక అను పరిచారిక సంగీతశాల నుండి పరిహాసమునకై నార చీరలను అపహరించును. అది చూచి సీత దొంగిలించినందులకు అవదాతికను మందలించినను వేడుకతో వానిని ధరించుటకు ముచ్చటపడును. ఇంతలో రామాభిషేక వృత్తాంతమామెకు తెలియవచ్చును. రాముడును అచటకు వచ్చును. వల్కలములను ధరించుట కాతడును ముచ్చటపడెను. ఇది ఒక చిత్రమైన నాటకీయత. అప్పుడే పట్టాభిషేక వార్త వినిన రాముడు వన గమనము కూడ చేయవలయును. ఇట్లు భావార్థ సూచనను ఈ వల్కలాపహరణ ఘట్టము చేత కవి చేసెను. మరియు సీతారాములు వినోదముగా వల్కలములను తాల్పవలయుననుకొనుటను నిబంధించిన భాస మహాకవి భావికథనే కాదు వారి అంతరంగ ప్రవృత్తులను కూడ వ్యంగ్య పద్ధతిలో తెలుపుచున్నాడు.

'సీతారాములు సర్వ సందర్భములలో ఏకాత్ములు ఎట్టి విపత్పరిస్థితులందును ధైర్యము చెదరని గుండె నిబ్బరము కలవారు. సుఖములందు విగత స్పృహులు, దుఃఖములందనుద్విగ్నులు'. ఈ వృత్తాంతము నందు ప్రతీయమానములగు మహార్థములీ విధమైనవి.

2. రామ పట్టాభిషేక ప్రస్తావన సమయమున భరత శత్రుఘ్నులిరువురును మేనమామల యిండ్ల యందున్నట్లు రామాయణము చెప్పుచున్నది. ప్రతిమలో భరతుడొక్కడే మేనమామ యింట నున్నట్లు కలదు. రామాయణమున దశరథుని పుత్రులు నలువురు పరస్పర ప్రేమ గౌరవములు నిండుగా కలవారయ్యును లక్ష్మణుడు రామునికి, శత్రుఘ్నుడు భరతునకు తమ సర్వస్వమును అంకితము చేసికొనిన విధము కానవచ్చును. కేకయరాజు భరతునికి మాత్రమే మాతామహుడు. శత్రుఘ్నునకు కాదు. అందువలన శత్రుఘ్నుడుభరతుని మేనమామ యింటనున్నట్లు చిత్రించుట సమంజసము కాదని భాసుని భావనయై యుండును. కాని ఇందు విచారింపదగు నంశమొకటి కలదు. శత్రుఘ్నుడును పట్ట భంగ వన గమన సమయములందు అయోధ్య యందే యున్నచో లక్ష్మణుని వలె అతడు రామునికి తన్ను కూడ తీసికొని పొమ్మని నిర్బదింపకుండుటకు హేతువు కన్పట్టదు. మరియు ద్వితీయాంకమున తండ్రి దుర్భరమగు దుఃఖోపశమన ప్రయత్నమేమియు కన్పట్టదు. కనుక ఈ మార్పులో భాసుని భావన యేమో మనకు విస్పష్టముగా తెలియరాకున్నది.

3. పుత్ర విరహముచే దశరథుడు విశకలితేంద్రియుడై మహా దుఃఖమునను భవించుచు మరణమునకు దాపున సంచరించుచుండెను. అప్పుడాతనికి పితృ దేవతలు దర్శన మిచ్చినట్లు భాసుడు కల్పన చేసెను. రాముడు వనముల కేగగా అతడు ప్రాణములు పోవు దశకు చేరుకొనెను. అట్టి దశలో అతనికి పరలోక వాసులైన తాతముత్తాతలే కానవచ్చుచున్నారు. నాటకకర్త దీని చేత దశరథుని మరణమునందు సందేహమిసుమంతయు లేదను నర్థమును సూచించుచున్నాడు. మరియు తండ్రి, తాత, ముత్తాతయు మచ్చలేని జీవితమును గడిపిన వారు. కాని తాను భార్యా వశుడై పుత్ర ద్రోహము చేసితినను పరితాపమును పొందుచున్నవాడు. ఈ ద్రోహమునకు నిష్కృతి మరణమే యను దృఢ భావనయు నతనికి కలుగుట కీకల్పన దోహదము చేయును.

4. భాసుడీ నాటకమున చేసిన మహోదాత్త కల్పన ప్రతిమా గృహము. దీని వలన దశరథుని మరణ వృత్తాంతము భరతునకు హఠాదాగతమై ఆఘాతము కాకుండుట ప్రయోజనము. ఈ కల్పన యందు భాసునికి మిక్కిలి మక్కువ కలదనుటకు నాటకమునకు ఆ నామకరణము చేయుటయే ప్రబల సాక్ష్యము. సుకుమార హృదయులు హఠాత్తుగా కలుగు ఆఘాతములను తట్టుకొనజాలరు. ఈ కల్పన యందు మరియొక విశేషము కూడ కలదు. భాసుడు దిలీపుడు, రఘుని, అజుని గుణములను ప్రస్తావనవశమున ప్రస్తుతించెను. ఆ ప్రస్తుతి వలన శ్రీ మహా విష్ణువు తన యవతార స్థానముగా ఈ వంశమునే యెన్నుకొనుట యందలి ఔచిత్య మభివ్యక్తమగును. ప్రతిమా గృహ దర్శనము వలన భరతునకు దశరథుని మరణముతో పాటు దానికి ముందు జరిగిన రామ పట్టభంగ వన గమనములు క్రమక్రమముగా తెలియవచ్చెను. అందువలన ఆతడు ఆ మూడింటి సమాహారరూపమైన మహా దుఃఖమును తట్టుకొనగలిగెను. ప్రసంగ వశమున భరతుని హృదయమున నిండి పెల్లుబుకుచున్న పితృ భ్రాతృ గౌరవములను చక్కగా అభివ్యక్తములై తరువాతి అంకములలోని కథాంశములను సమర్థించుటకును తోడ్పడుచున్నవి.

కాగా ఈ ప్రతిమా కల్పనము నందు భావింపదగిన అతి ముఖ్యమైన విషయమొకటి కలదు. భాసుడు రామచంద్రునకు పూర్వము దశరథుడు, అజుడు, రఘువు, దిలీపుడు అను నలుగురిని మాత్రమే పేర్కొనెను. రఘు వంశమున కాళిదాసు కూడ ఈ నలువురి గాథలనే పరమ మనోజ్ఞముగ చిత్రించెను. కాని వాల్మీకి రామాయణము నందు శ్రీరామునకు పూర్వము పెక్కండ్రు మహారాజుల ప్రస్తావన కలదు. రామాయణము నందు వంశాను చరితమును

బట్టి దిలీపుని కుమారుడు భగీరథుడు. భగీరథుని కుమారుడు కకుత్థ్సుడు, అతని కొడుకు రఘువు. రఘువు నుండి పదునొకండవతరము వాడు అజుడు. అతని తండ్రి నాభాగుడు. అజుని కుమారుడు దశరథుడు. భాసుడును, కాళిదాసును ఆ వంశమునందలి గొప్ప వ్యక్తులను మాత్రమే చెప్పుచున్నట్లు ప్రకటింపలేదు. దిలీప రఘులకు, రఘు అజులకు, అజ దశరథులకు పితా పుత్ర సంబంధమును ప్రవచించిరి.

ఇంతకు ముందే మనము సంభావించినట్లు ఇతివృత్తమును యథాతథముగ చిత్రించుటకు రస ప్రలుబ్ధధీరులగు కవులు ప్రయత్నింపరు. మార్పులు, చేర్పులు చేయుచుందురు. కాని అట్టి మార్పులకు, చేర్పులకును ఏదియో ప్రయోజనము ఉండవలయును. సాధారణముగా అట్టి ప్రయోజనములను కవులు సూచింతురే కానీ వాచ్యము చేయరు. భాసుడు దిలీపుని 'ధర్మప్రదీపు'డని అభివర్ణించెను. రఘువును 'బ్రాహ్మణ జన సహస్ర పుణ్యాహ శబ్దరపు' డనియు, బ్రాహ్మణ జనా వేదిత రాజ్య ఫలుడనియు, అజుని ప్రియావియోగ నిర్వేదపరిత్యక్త రాజ్యభారుడు, నిత్యావబృథస్నాత ప్రశాంతరజుడనియు అభివర్ణించెను. దిలీపునిలో ధర్మ పురుషార్థ పౌష్కల్యమును, రఘువు నందు దాన ధర్మ వీరా వేశ ప్రతీయమానమగు అర్థపురుషార్థ గౌరవమును, అజుని యందు ప్రియా వియోగ నిర్వేద భావనలో స్ఫురించెడు కామ పురుషార్థ మహోన్నత్యమును సూచించెను. ఇట్లు పురుషార్థములను చక్కగా పండించుకొన్న పితృ దేవతలు గల దశరథుని తండ్రిగా ఎన్నుకొనుటలోని ఔచిత్యమును నిరూపించుటకై కవి యీ ముగ్గురినే, వరుస తప్పించియు పేర్కొనెను. ఈ భావమునే కాళిదాసు మరింత విపులముగా వర్ణించుచు రఘువంశ మహా కావ్యమును నిర్మించెను.

5. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు అని సోదరుల క్రమము లోకమున వ్యాపించియున్నది. కాని లక్ష్మణుడు, భరతుడు వీరిరువురిలో ఎవరు పెద్ద అనునది కొంత విచారింపదగిన అంశము.

శ్రీ మద్రామాయణమున పునర్వసు నక్షత్రమున శ్రీరాముడు, పుష్యమినాడు భరతుడు, అశ్లేష యందు లక్ష్మణ శత్రుఘ్నులు పుట్టినట్లు కలదు. అనగా లక్ష్మణుని కంటే భరతుడే పెద్దవాడు. కాని పాయసమును పంచి యిచ్చు సందర్భమున మొదట దశరథుడు సగము కౌసల్యకిచ్చెను. మిగిలిన సగములో సగము - అనగా నాలుగవ వంతు సుమిత్రకిచ్చెను. మిగిలిన నాలుగవ వంతు భాగమును మరల సుమిత్ర కిచ్చెను. అనగా $\frac{1}{2}=\frac{1}{4}+\frac{1}{8}+\frac{1}{8}$గా విభాగము జరిగెను. ఇందు సగము కౌసల్యకు, నాలుగవ భాగము ఒక మారును, ఎనిమిదవ భాగము మరియొక మారును సుమిత్రకు దక్కెను. ఎనిమిదవ భాగము భరతుని కన్న కైకకు ప్రాప్తించెను. కౌసల్య కిచ్చిన వెంటనే సుమిత్ర కొకభాగమిచ్చుట చేత దానిచే రూపొందిన లక్ష్మణుడు రెండవ వాడనుకొనుట కవకాశము కలదు. కాని జనన నక్షత్రముల వరుసను బట్టి చూచినచో భరతుడే లక్ష్మణ, శత్రుఘ్నుల కంటె పెద్దవాడు.

భాసుడు ప్రతిమ నాలుగవ అంకమున భరతుని లక్ష్మణుని కంటె చిన్నవానినిగా వ్యవహరించెను. సుమంత్రుడు, 'అయే, కుమారో లక్ష్మణః' - ఓహో యితడు కుమార లక్ష్మణుడు అని పలుకగా ప్రక్కనున్న భరతుడు 'ఏవం, గురు రయమ్, ఆర్య! అభివాదయే' అవును ఈయన నాకు అన్న. అయ్యా! నమస్కరించుచున్నాను అనెను. కావున భాసుని కల్పననుసరించి రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు వరుస. అంతేకాదు సుమంత్రుడు అతి స్పష్టముగా నీ కులమునకు పతాకము వంటి ఏ మహానుభావునకు నీవు తమ్ముడవో, అట్టి నీకితడు 'అనుజుడు' అని చెప్పెను.

రఘోశ్చతుర్థో౽య మజాత్ తృతీయః
పితుః ప్రకాశస్య తవ ద్వితీయః
యస్యానుజ స్త్వం స్వకులస్యకేతోః
తస్యానుజో౽యం భరతః కుమారః (IV. 9)

భాసూడీ యన్నదమ్ముల వరుస నీ విధముగా భావించెను. ఈ మార్పు వలన కలిగెడు ప్రయోజనము ప్రముఖముగా కన్పట్టుట లేదు. మొదటి భార్య కొడుకు రాముడు, రెండవ భార్య మొదటి కొడుకు లక్ష్మణుడు, మూడవ భార్య కొడుకు భరతుడుగా భావించుట సముచితమని ఆతని యూహ కావచ్చును. లేదా ఆతని కాలము నాటికి ఏదైన రామాయణమున అట్టి క్రమము ప్రచురమై ఉండెనేమో! కాదా రామలక్ష్మణులు, భరత శత్రుఘ్నులు అను జంటల కీవరుస సముచితమని ఆతడు భావించి యుండవచ్చును. మరియు నొక ఊహ రామాయణమున చెప్పిన జన్మ నక్షత్రముల నతడు పట్టించుకొనక పాయసప్రదానము నందలి వరుసను సగము, సగములో సగము, ఆ సగములో సగము, మిగిలిన భాగము అను దానిని బట్టి అన్నదమ్ములను స్థూల దృష్టితో పరిగణించియుండును.

6. సీతాపహరణమును రావణుడు చేసిన విధానమునంతటిని భాసుడు పూర్తిగా మార్చివైచెను. మారీచుని మాయా మృగముగ చేయుట, సీత దానిని కోరుట, రాముడు దానికై పర్ణశాలకు దూరముగ పోవుట, మారీచుడు కపట స్వరముతో హాసీతే, హా లక్ష్మణ అని యరచుట, సీత లక్ష్మణుని కఠినోక్తులతో తన నుండి దూరము చేసికొనుట, రావణుడు ఒంటరిగా నున్న సీతను హరించుకొని పోవుట మున్నగు వృత్తాంతము రామాయణమున గానవచ్చును. భాసుడు దీనిని మార్పు చేసెను. ఈతని మార్పులో మారీచునకు స్థానమే లేకుండ పోయినది.

రాముడు తండ్రికి శ్రాద్ధము చేయుటను గూర్చి ఆలోచించుచుండెను. రావణుడతిథియై వచ్చెను. ప్రసంగ వశమున పరివ్రాజక వేషమున నున్న అతడు శ్రాద్ధ కల్పమును గూర్చి మాటాడును. హిమవత్పర్వతము నందలి కాంచన పార్శ్వ మృగమును ఉపయోగించి శ్రాద్ధము నిర్వహించుట గొప్పదని చెప్పును. మరియు నవి అందరకు కన్పడవనియు చెప్పును. రాముడు హిమవంతుడు తనకు వానిని చూపనిచో నా బాణ మాతని గుండెలను చీల్చి వేయునని ప్రతాపస్ఫోరక వాక్యములు పలుకును. ఇంతలో ఒక కాంచ పార్శ్వ మృగమచట తిరుగాడుటను గాంచి హిమవంతుడిచటనే నిన్ను పూజించుచున్నాడనును. రాముడు దానికై వెడలును. లక్ష్మణుడంతకు ముందే తీర్థయాత్రల నుండి తిరిగి వచ్చుచున్న కులపతిని ఎదురేగి కొనివచ్చుటకై రామాజ్ఞచే నరుగును. అనగా రావణుడు పరివ్రాజక వేషమున వచ్చినపుడు సీతారాములు మాత్రమే యుండిరి. రాముడు వెడలిపోగా రావణుడు నిజ స్వరూపమును ప్రదర్శించి సీతను అపహరించి కొనిపోవును.

ఇది చాల పెద్ద మార్పు. దీని వలన సాధించిన ప్రయోజనములను పరికింతము. సీత కాంచన మృగాము పై మోజు పడుట ద్వారా ఆమె స్వభావమునందలి మచ్చ తొలగిపోయెను. లక్ష్మణుని శీలమును శంకింపవలసిన అవసరమును, ఆతని యెడ నిష్ఠురోక్తులను పలుకు నవసరమును లేకపోయెను. ఈ విధముగా సీతాపరమోదాత్త వ్యక్తిత్వమున దోషమును కవి పరిహరించెను. ఇంతేకాక శ్రీరాముని పితృ భక్తియు అతివేలముగా ప్రకటింపబడినది. తండ్రి శ్రాద్ధమునకై ఆతడెంత దుర్లభమైన పదార్థమునైనను తన తపో విద్యా బలములచే సాధించుననుటను కవి నిరూపించెను. ఈ విధముగా నాటక రసోచితముగా నాయికా నాయకుల మహోన్నత శీలమును దేదీప్యమానముగా చిత్రించుటలో భాసుడు కృతకృత్యుడాయెను. ఆ పితృభక్తియే ఆతడు సీతను కోల్పోవుటకును కారణమైనట్లు భాసుడు తీర్చెను.

7. ఆరవ అంకమున సుమంత్రుడు కూడ రాముని దర్శించుటకై అరణ్యమున కరిగినట్లు భాసుడు కల్పన చేసెను. దీని వలన భరతునకు సీతాపహరణ వృత్తాంతము తెలియవచ్చెను. అనుబంధముగా అన్నయెడల భక్తితో అతడు రావణుని పై ఎత్తిపోవుటకు నిర్ణయించుట అను విషయము ప్రసక్తమాయెను. అటు పిమ్మట దుఃఖమును నిలుపుకొనజాలని భరతుడు కైకను నిందించుటకై అంతఃపురమున భరతునకు తల్లి రాముని వనవాసమున కేల పంపెనో తెలిసెను. తల్లి యెడ అంతవరకు ఆతడు పెంచుకొనిన వైమనస్యము తొలగిపోయెను.

భరతుడు నిష్ఠురమైన మాటలతో తల్లిని అధిక్షేపించుచుండెను. అప్పుడామె ఇది తగిన సమయమని తలచి దశరథుని శాప వృత్తాంతమును ప్రస్తావించెను. శాపమెట్లు కలిగెనో చెప్పెను. పుత్ర శోకముచే మరణించుట శాపము తీరని వివరించెను. దానికై తాను నింద తనపై వేసికొని రాముని వన గమనమును సాధించితినని తెలిపెను. అప్పుడు భరతుడు నన్ను అరణ్యమునకు పంపి యుండవచ్చును గదా అనెను. నీవు మాతుల గృహమున నుంటివి కదా అని కైక బదులాడెను. అయినచో పదునాలుగేండ్లని యేల పలికితివని భరతుడడిగెను. పర్యాకులమైన హృదయముతో పదునాలుగు రోజులనబోయి పదునాలుగేండ్లంటినని కైక చెప్పెను. ఇది వశిష్ఠ వామదేవాది గురుజనమునకు తెలియునా అని భరతుడడిగెను. అప్పుడు సుమంత్రుడు తెలియును, వారు దీని ననుమతించిరనియు చెప్పెను.

భాసుని యీ కల్పన వలన కైక దోషము తొలగిపోయినది. అంతేకాదు ఆమె మహోదాత్త శీలము కల వ్యక్తిగా లోకమునకు తెలియవచ్చెను. ఒక మహానుభావుని శాపమును మరియొక విధముగా మార్చుట అసాధ్యము కనుక దానిని సఫలము చేయుటకై ఆమె పూనుకొని లోక నిందను, పుత్రధిక్కారమును, వైధవ్యమును స్వయముగా తెచ్చిపెట్టుకొనిన మహా వ్యక్తిగా కైకను భాసుడు చిత్రించెను. ఈ భావన ఆమెకు స్వయముగనే కలిగెను, కనుక మంథర కిందు ప్రవేశము కలుగునవసరము లేకపోయెను. వశిష్ఠ వామదేవాది గురుజనము దీనిని అనుమతించెనని సుమంత్రుని ముఖమున చెప్పించి భాసుడు, మూలమునందువలె వశిష్ఠారుంధతీప్రభృతులను ఆమెను నిందించిన విధానమును పరిహరించెను. అంతవరకు మాతృదోషమును సంభావించుచు కోపముతో ఉడికిపోవుచున్న భరతుడును తన తప్పిదమునకు పశ్చాత్తాపము పొంది తల్లి యందు పరమ గౌరవము కలవాడాయెను.

8. భాసుడు శ్రీరాముని అభిషేకమును రెండు మారులు చేయించెను. తపోవనమున నొక పర్యాయము, అయోధ్యయందొక పర్యాయము శ్రీరామ పట్టాభిషేకమును చేయించి యానందపడెను. దీని ప్రయోజనము నిట్లు సంభావింపదగును. శ్రీరాముడు సర్వజన ప్రియుడు. అరణ్యమున పెద్ద సంఖ్యలో నున్న శ్రీరామాభిమానులు అయోధ్య యందు జరుగు పట్టాభిషేకమహోత్సవమున పాల్గొనునవకాశము లేదు. వారందరి తృప్తికై జన స్థానమున నొకమారు పట్టాభిషేకము లఘువుగానైనట్లు భాసుడు కల్పించెను.

శ్రీమద్రామాయణ కథా భాష్యకారులనదగిన వారిలో భాసుడు ప్రథముడు. తరువాతి వారి కాతడొక మార్గమును నిర్దేశించెను. వాల్మీకి రామాయణము నందు నిగూఢముగా నుండు కొన్ని భావములను కావ్య ముఖమున వ్యాఖ్యానించి యాయా వ్యక్తుల యందు సాధారణముగా గలుగు అపోహలను తొలగించుటయే భాష్యకారుల లక్ష్యము. వాల్మీకి హృదయమును ఆవిష్కరించి అపోహలను తొలగించి కావ్యార్థమును అకర్దముగా చేయుట తమ కర్తవ్యముగా వారు భావించిరి. తదనుగుణముగా అనేకములైన కల్పనలను చేసి శ్రీరామ తత్త్వమును రస స్ఫురణాత్మకముగా నిరూపించుటకు పూనుకొనిరి. భాసుని దావిషయమున ప్రథమ తాంబూలము.

**ఆచార్య శలాక రఘునాథ శర్మ**

**విశ్రాంతాంధ్రాచార్యులు**

**శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం**

**అనంతపురం**

పాఠం - 12

# ప్రతిమా నాటకం - సందర్భ సహిత వ్యాఖ్యలు

సంస్కృత పాఠ్యాంశంలో ప్రతిమా నాటకం ఉంది. దీన్ని భాసుడు రచించాడు. దీనికి మూలం వాల్మీకి రామాయణం. దీనిలో ఏడు అంకాలు ఉన్నాయి. రాముడి పట్టాభిషేకం ఆగిపోవడం దగ్గర నుంచి మళ్ళీ రాముడి పట్టాభిషేకం జరగడం దాకా ఉన్న కథ ఈ నాటకంలో చోటు చేసుకుంది. ఈ నాటకంలో 'ప్రతిమా గృహం' ప్రాధాన్యత వహిస్తుంది. అందువల్ల ఈ నాటకానికి 'ప్రతిమా నాటకమని పేరు పెట్టడం జరిగింది. ఈ నాటకంలో చోటు చేసుకొన్న సందర్భ సహిత వ్యాఖ్యలను ఈ పాఠంలో పరిశీలించబోతున్నాం.

సందర్భ సహిత వ్యాఖ్యలు ఎలా రాయాలి? మొదట సామాన్య సందర్భం, తర్వాత ప్రత్యేక సందర్భం, ఇవ్వబడిన వాక్యానికి అర్థం, చివరగా వ్యాఖ్యానం రాయాలి.

సామాన్య సందర్భం అంటే ఆ వాక్యం ఎక్కడ నుండి తీసుకోబడిందో రాయాలి. ఎవరు ఎవరితో ఎప్పుడు ఎందుకు చెప్పారో ప్రత్యేక సందర్భంలో రాయాలి. ఇవ్వబడిన వాక్యానికి అర్థమేమిటో తర్వాత రాయాలి. చివరగా సన్నివేశాన్ని, వాక్యాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధించిన విషయాలను జోడించి వ్యాఖ్యానం రాయాలి. ఈ నాలుగూ సవ్యంగా పూర్తి చేస్తే ఒక సందర్భ సహిత వ్యాఖ్య రాసినట్లవుతుంది. ఈ పాఠంలో ప్రతిమా నాటకంలోని మూడు అంకాల్లో చోటు చేసుకున్న సందర్భ సహిత వ్యాఖ్యల్లో ముఖ్యమైన వాటిని పరిశీలించడం జరుగుతుంది.

1. **నఖల్వేకాకిన్యా హసితవ్యం (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

శ్రీరాముడికి పట్టాభిషేకం నిశ్చయమైంది. అభిషేక సన్నాహాలు త్వరగా పూర్తి చేయవలసిందిగా సంబంధించిన అందరినీ ప్రతీహారి తొందర చేస్తూ ఉంది. ఆ సమయంలో అవదాతిక నార చీరలు పట్టుకొని ప్రవేశిస్తుంది. ఈ సందర్భంలోనే అవదాతిక ఈ మాటలు అంటుంది.

నవ్వులాటకు నార చీరలు పట్టుకు వస్తేనే నాకెలాగో ఉందే, ఇతరుల సొమ్ములను అపహరించే వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో? నాకు నవ్వుకోవాలనిపించినా, నవ్వుకోలేకపోతున్నాను. <u>ఒంటరిగా నవ్వుకోవడం భావ్యం కాదు కదా!</u>

ఒంటరిగా నవ్వుకోవడం వల్ల అనేక అనర్థాలు తలెత్తే అవకాశం ఉంది. అందువల్ల ఒంటరిగా నవ్వుకోకూడదని పెద్దలు చెబుతారు. అవదాతిక ఈ విషయాన్నే తన మాటల్లో వ్యక్తం చేసింది.

2. **సులభాపరాధః పరిజనోనామ (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

అవదాతిక స్వగతంగా మాట్లాడుకుంటున్నప్పుడే సీత చేటితో ప్రవేశిస్తుంది. వారి రాకను గమనించిన అవదాతిక ముఖం వెలవెల పోతుంది. ఆవిడ ముఖం ఎందుకు వెలవెల పోతూ ఉందని సీత ప్రశ్నిస్తుంది. ఈ సందర్భంలో చేటి సీతతో ఈ వాక్యం చెబుతుంది.

పరిజనులు సులభంగా తప్పులు చేస్తుంటారు. ఈవిడ కూడా ఏదైనా తప్పు చేసి ఉంటుందో ఏమో! తప్పు చేసినందువల్లనే మోము వెలవెల పోతుందని చేటి సూత్రీకరించడం ఇక్కడ గమనించదగి ఉంది. స్వతఃసిద్ధమైన రెండు అంశాలు ఇక్కడ వెల్లడవుతున్నాయి. పరిజనులు సులభంగా తప్పులు చేస్తుంటారు. ఇది వారి స్వభావం అజ్ఞానం వల్ల వారికి తప్పులకు, ఒప్పులకు తేడా తెలియదు. తప్పులను కూడా ఒప్పులుగానే భావించి పదేపదే చేయడం వారి స్వభావం.

తప్పులు చేసినప్పుడు చేసిన వారి ముఖం వెలవెల పోవడం సహజం. మనస్సుకు ముఖమే అద్దమనే నానుడి ఉండనే ఉంది కదా!

**3. అథవా బహు వృత్తాంతాని రాజకులాని నామ (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

ఈ వాక్యం ఈ అంకంలో రెండుసార్లు వస్తుంది. రెండుసార్లూ సీతే చెప్పడం విశేషం. చేటి రామాభిషేక వార్త చెప్పినపుడు సీత సంతోషిస్తుంది. ఆమెను ఒడి పట్టుకొమ్మని కోరుతుంది. చేటి అలా చేయగానే తన నగలను తీసి అందులో వేస్తుంది. నగారా గణగణ మోగి ఆగుతుంది. ఇది ఎందుకిలా అర్థాంతరంగా ఆగిందో అని చేటి సంశయిస్తుంది. ఆ సందర్భంలో సీత ఈ వాక్యం చెబుతుంది. ఇది మొదటి సందర్భం. రెండవసారి రాముడు వచ్చినప్పుడు అతడు పట్టాభిషేకోచిత వేషంలో రాకపోవడం వల్ల చేటి పట్టాభిషేకం పట్ల సంశయం వెలిబుచ్చుతుంది. ఈ సందర్భంలో కూడ సీత ఈ వాక్యం అంటుంది.

కాబట్టి రాజ కులంలో ఇలాంటి అవరోధాలు సామాన్యంగానే సంభవిస్తూ ఉంటాయి.

రాజాన్తః పురాల్లో కుట్రలు, కుతంత్రాలు సహజంగానే చోటు చేసుకొంటూ ఉంటాయని, ఏ మంచి కార్యక్రమమైనా సవ్యంగా జరిగేవరకు నిశ్చయం లేదని ఈ వాక్యం ద్వారా వ్యక్తమవుతుంది. ఒక రాజ్యాన్ని పలువురు ఆశించేవారని, దాన్ని సాధించడం కోసం ఏమి చేయడానికైనా సిద్ధపడేవారని బోధపడుతుంది.

**4. స్వఃపుత్రః కురుతే పితుర్యది వచః కస్త్రత్రభో! విస్మయః (శ్లోకం 5)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

శ్రీరాముడికి పట్టాభిషేకం నిశ్చయమైంది. కైకేయి వరం కోరడం వల్ల అది భగ్నం కూడ అయ్యింది. రాముడు ప్రవేశించి ఆ వృత్తాంతాన్ని ప్రేక్షకుల నుద్దేశించి చెబుతున్నాడు. వాద్యాలు మోగుతున్నాయి. పెద్దలందరూ వచ్చి ఆసీనులయ్యారు. పవిత్ర మంత్ర పూత జలం నింపిన కలశం తలమీద ఒంపేందుకు సిద్ధంగా ఉంది. తండ్రి గారు రమ్మని కబురు పెట్టారు. నేను నిర్వికారంగా వెళ్ళాను. నాయనా! ప్రస్తుతానికి వెళ్ళి విశ్రమించు అన్నారు. నేను వచ్చేశాను. నా చొరవకు ప్రజలంతా ఆశ్చర్యపడ్డారు. ఇందులో వింత ఏముంది? <u>తండ్రి ఆజ్ఞను కుమారుడు పాటించడంలో ఆశ్చర్యానికి తావులేదు</u> అని రాముడు చెప్పాడు.

తండ్రి ఎలాంటి ఆజ్ఞ జారీ చేసినా దాన్ని తు.చ. తప్పకుండా అనుసరించడం పుత్రుని కర్తవ్యం. ఇది సనాతన ధర్మం పరంపరగా వస్తూనే ఉంది. పరశురాముడు, రాముడు, భీష్ముడు మొదలైన వారు పితృభక్తికి ప్రాధాన్యం ఇచ్చారు. మంచి విషయాలకు మాత్రమే వారు స్థానం కల్పించడం గమనార్హం.

రాముణ్ని ఆదర్శ మానవుడుగానే వాల్మీకి రూపొందించాడు. రాముడు ఆదర్శ తనయుడుగా తండ్రి ఆజ్ఞను తలదాల్చి మానవాళికి ఆచరణరూప బోధ చేశాడు.

**5. అల్పం తుల్యశీలాని ద్వంద్వాని సృజ్యన్తే (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

పట్టాభిషేకం ఆగిపోయిన తర్వాత రాముడు సీత దగ్గరకు వస్తాడు. పట్టాభిషేక ప్రయత్నం గురించి సీత, చేటి అప్పుడు మాట్లాడుకుంటూ ఉంటారు. ఏమిటని రాముడు వారిని ప్రశ్నిస్తాడు. సీత తమ కందిన పట్టాభిషేక వార్తను గురించి తెలియజేస్తుంది. దానికి స్పందించిన రాముడు సీతకు జరిగిన వృత్తాంతం తెలియజేస్తాడు.

పట్టాభిషేక ప్రయత్నం జరక్కపోలేదు. రాజు నన్ను తొడ మీద కూర్చోబెట్టుకొని కోసల దేశానికి రాజు కమ్మని కోరాడు. రాముడి మాటకు అడ్డు తగులుతూ అప్పుడు మీరేం చేశారు? అని సీత ప్రశ్నిస్తుంది. నేను ఏమి చేసి ఉంటానో నీవే ఊహించి చెప్పు అని రాముడు ఆమెను కోరతాడు. మీరు దీర్ఘంగా నిట్టూర్చి, దశరథుని పాదాల మీద వ్రాలి ఉంటారు అని జానకి చెబుతుంది. ఈ సందర్భంలోనే రాముడు సీతతో ఈ వాక్యం అంటాడు. నీవు చెప్పింది అక్షరాలా నిజం. ఒకే విధమైన శీలం గల భార్యాభర్తలను అప్పుడప్పుడు మాత్రమే బ్రహ్మ సృజిస్తూ ఉంటాడు.

వయస్సు, ఆకారం, సంప్రదాయం, ఆలోచనాసరళి మొదలైన అంశాల్లో భార్యభర్తలిద్దరూ ఒకటిగా ఉండడం ఉత్తమ లక్షణం అనేది సనాతన సంప్రదాయం.

భార్యాభర్తలిద్దరూ ఒకే వ్యక్తిలోని రెండు అర్ధరూపాలని బృహదారణ్యకోపనిషత్తు తెలియజేసింది. సీతారాములిద్దరిదీ కూడా ఒకేమాట. ఒకే బాట. అందుకే వీరు లోకానికి ఆదర్శ దంపతులు, ఆరాధ్య దంపతులు.

**6. రాజ్ఞః శనైరభిహితం చ న చాస్మి రాజా (శ్లోకం 7)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

రాముడు సీతతో తన పట్టాభిషేకం ఆగిపోయిన వృత్తాంతం చెబుతాడు. తండ్రిగారు రాజ్యాన్ని గ్రహించమని అడిగినపుడు రాముడు అంగీకరించడు. వృద్ధాప్య దోషంతో కూడిన తన ప్రాణాల మీద దశరథుడు ఒట్టుపెట్టుకొంటాడు. రాముడికి అంగీకరించక తప్పదు. అప్పుడు లక్ష్మణ శత్రుఘ్నులు మంత్రపూత జలఘటాన్ని పట్టుకొంటారు. దశరథుడు గొడుగుపైకెత్తి పట్టుకొంటాడు. ఈ విషయాన్ని చెబుతూ ఈ సందర్భంలోనే రాముడు సీతతో ఈ మాటలంటాడు.

ఇంతలో మంథర వచ్చి ఆయన చెవిలో ఏదో చెప్పింది. ఆ కారణం వల్ల నేను రాజు కాలేకపోయాను.

రాజుల దృఢ సంకల్పాలకు కూడా ఆ కాలంలో అవరోధాలు వచ్చేవని ఈ వృత్తాంతం బోధపరుస్తూ ఉంది. రాజులు ఎంత బలవంతులైనా బహు భార్యత్వం వల్ల వారి సక్రమ సంకల్పాలకు విఘాతాలు కలిగేవి. అంతకు ముందు భార్యలు అనేకులు ఉన్నప్పటికీ దశరథుడు కైకేయిని వరించడం అతని చాపల్యాన్ని ఆవిష్కరిస్తుంది. ఆమెకు స్వయంగా రెండు వరాలు ప్రకటించడం, ఆయన అనాలోచిత మనస్తత్వాన్ని అభివ్యక్తం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే రామ పట్టాభిషేకం హఠాత్తుగా ఆగిపోవడం, దశరథ దుర్మరణం సంభవిస్తాయి. అందువల్లనే ఏదైనా ఒక నిర్ణయం తీసుకొనే ముందు దాని పర్యవసానంతోబాటు బాగా ఆలోచించాలని పెద్దలు చెబుతారు. స్త్రీ లౌల్య బలహీనత ఎంత ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందో ఈ సంఘటన చక్కగా ఆవిష్కరిస్తుంది.

**7. పారయత్యార్యపుత్రో అలీకమపి సత్యమివ మంత్రయితుం (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

సీత నగలను తీసివేసినట్టు చెబుతూ ఎందుకలా చేసావని రాముడు ఆమెను ప్రశ్నిస్తాడు. తాను నగలే వేసుకోలేదని సీత చెబుతుంది. ఆమె హఠాత్తుగా నగలు తీసివేసినందు వల్ల ఏర్పడిన గుర్తులను రాముడు ఆమెకు తెలియజేస్తాడు. ఈ సందర్భంగా సీత రాముడితో ఈ వాక్యం చెబుతుంది.

<u>ఆర్య పుత్రులు అబద్ధాన్ని కూడా సత్యంగా చెప్పగల సమర్థులు.</u>

భార్యా భర్తలిద్దరూ పరస్పరం ఛలోక్తులు విసురుకోవడం పరిపాటి. రాముడు సత్యసంధుడైనప్పటికీ, అతడు చెప్పిన దానిలో యాథార్థ్యం ఉన్నప్పటికీ లేదని నిందించడం సీత చలాకీతనాన్ని, భర్తను ఆటపట్టించాలనే చిలిపితనాన్ని ఇక్కడ తెలియజేస్తూ ఉంది.

**8. ఇక్ష్వాకూణాం వృద్ధాలంకార స్త్వయా ధార్యతే (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

సీతనలంకరించుకొమ్మని రాముడు ఆమె ముందు నిలబడి అద్దం పట్టుకొంటాడు. ఆమె ధరించిన నార చీరలు అద్దంలో ప్రతిబింబిస్తాయి. ఈ సందర్భంలో రాముడు సీతను ఈ విధంగా ప్రశ్నిస్తాడు.

<u>వృద్ధాప్యంలో ఇక్ష్వాకు వంశస్థులు ధరించే నార బట్టలను ఇప్పుడే నీవు ఎందుకు ధరించావు.</u>

ఇక్ష్వాకు వంశ రాజులది క్రమ జీవితం. ఆదర్శ జీవితం. వారు బాల్యంలోనే విద్యనభ్యసిస్తారు. యవ్వనంలో విషయ సుఖాలనుభవిస్తారు. వృద్ధాప్యంలో ముని వృత్తి చేపడతారు. చివరిదశలో యోగంతోనే శరీరాన్ని త్యజిస్తారు. వీరి జీవన విధానాన్ని ధ్వనింపజేసే విధంగా రాముడి మాటలు ఉండడం ఇక్కడ గమనించదగి ఉంది. సీత నార చీరలు ధరించడం వల్ల రాముడికి కలిగిన కంటగింపును అధిక్షేపణాభావాన్ని అతడి మాటలు ఆవిష్కరిస్తాయి.

**9. శరీరే అరిః ప్రహరతి హృదయే స్వజనస్తథా (శ్లోకం 12)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

కంచుకి ప్రవేశించి రక్షించమని రాముడ్ని కోరుతాడు. ఎవరిని అన్న రాముడి ప్రశ్నకు రాజును అని సమాధానం చెబుతాడు. ఎవరి నుంచి ప్రమాదమని రాముడు అడగ్గా స్వజనుల నుంచి అని కంచుకి సమాధానం చెబుతాడు. స్వజనుల నుంచి ప్రమాదమైతే దానికి ప్రతీకారం ఉండదని చెప్పే సందర్భంగా రాముడు కంచుకితో ఈ మాటలు అంటాడు.

<u>శత్రువు శరీరం మీద కొడ్తాడు. స్వజనులు హృదయం మీద కొడతారు. నాకు స్వజనులనే మాట లజ్జను కలిగిస్తూ ఉంది.</u>

ప్రపంచంలో మంచీ చెడూ రెండూ ఉంటాయి. చెడు చేసే వాళ్ళు శత్రువులయితే మంచి చేసేవారు ఆత్మీయులుగా పరిగణింపబడతారు. అలా ఆత్మీయులుగా పరిగణింపబడేవారు కూడా చెడు చేస్తే అది శత్రువు చేసే చెడుకంటే గూడ మహా దారుణంగా ఉంటుంది. అది హృదయ శల్యంగా తయారువుతుంది. అందువల్ల శత్రువుల పట్ల మాత్రమే గాక స్వజనుల వల్ల గూడ జాగ్రత్తగా మసలుకోవాలని అభిప్రాయము. ఇది రామ సందేశం. అందరికీ శిరోధార్యం. ఇది భావికథా సూచకం కూడా.

**10. ఫలేకస్మిన్ స్పృహాతస్యా యేనాకార్యం కరిష్యతి (శ్లోకం 13)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

కైకేయి వల్ల ప్రమాదమని కంచుకి చెప్పినప్పుడు రాముడు నిరాకరిస్తాడు. ఏమీ! తల్లి వలనా? ఆమె వల్ల ప్రమాదమైతే అన్నీ మంచిగానే పర్యవశిస్తాయి అని రాముడు చెబుతాడు. అది ఎలా సాధ్యమని కంచుకి అడగ్గా రాముడిలా స్పష్టం చేస్తాడు.

తన భర్త ఇంద్రునిలాంటి వాడు. నాలాంటి వాడు ఆమెకు పుత్రుడు. అలాంటప్పుడు ఏ కోరికతో ఆమె ఈ తుచ్ఛమైన కార్యం చేస్తుంది.

ఇక్కడ రాముడికి కైకేయి మీద ఉన్న విశ్వాసం వ్యక్తమవుతుంది. ఆమెను అతడు తన సొంత తల్లిగానే భావించడం తేటతెల్లమవుతుంది. అతడి అపార మాతృభక్తి అభివ్యక్తమవుతుంది. దశరథుడి ఉత్కృష్టత, రాముడి మంచితనం బోధపడతాయి. సమర్థులైన వారి సాహచర్యంలో ఉన్నవారు అకార్యాలకు పూనుకోవడంలో అర్థం లేదనే ధ్వని ఇక్కడ గోచరిస్తుంది. సవ్యమార్గంలోనే కోరికలు తీర్చుకొనే అవకాశం ఉన్నప్పుడు అపసవ్య మార్గం గురించి ఆలోచించడం అవివేకమని అవగతమవుతుంది. భాసుడి లోక వ్యవహారజ్ఞత, శిల్పరామణీయకత ఇక్కడ ద్యోతకమవుతాయి.

**11. అలముపహతాసు స్త్రీ బుద్ధిషు స్వమార్జవముపనిక్షేప్తుమ్ (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

కంచుకి కైకేయి వల్ల విఘాతమని చెప్పినప్పుడు రాముడు అంగీకరించకపోగా ఆమెను సమర్థిస్తాడు. రాముడి మాటలకు తీవ్రంగా స్పందించిన కంచుకి రాముడితో ఈ విధంగా చెబుతాడు.

స్త్రీల పాడుబుద్ధులలో మీ మంచితనాన్ని ఉంచబోకండి. ఆమె కోరిక మీదనే కదా మీ పట్టాభిషేకం ఆగిపోయింది.

కంచుకి మాటల ద్వారా స్త్రీల సంకుచిత స్వభావం ధ్వనిస్తుంది. మంచివారు ఎదుటివారి చెడులో కూడ మంచినే చూస్తారు. ఒక విధంగా చెప్పాలంటే అద్దంలో తమ ప్రతిరూపం చూస్తున్నట్టే. మంచివారు ఎదుటివారిలో కూడ తమనే చూసుకొంటారు. ఇది మంచివారి లక్షణం. దీన్ని రాముడ్ని గురించి కంచుకి చెప్పిన మాటల ద్వారా భాసుడు ఎంతో చక్కగా లోకానికి తెలియజేశాడు. మానవ మనస్తత్వం పట్ల భాసుడికుండే చక్కని అవగాహన ఇక్కడ వ్యక్తమవుతుంది.

**12. అథ చ న పరిభోగైర్వంచితా భ్రాతరో మే (శ్లోకం 14)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

కైకేయి కోరడం వల్లనే పట్టాభిషేక భంగమేర్పడిందని కంచుకి చెప్పడంతో అది కూడ లాభకరమేనని రాముడు చెబుతాడు. అది ఎలా అని కంచుకి అడగ్గా రాముడు ఈ మాటలంటాడు.

తండ్రి గారికి వన గమనం తప్పింది. తండ్రి చాటు పిల్లవాడుగా నా బాల్యం కొనసాగుతుంది. ప్రజలకు కొత్త రాజు విచారము తప్పుతుంది. ఇంతకంటే కూడ తమకు తగిన రాజ్య భోగ వంచనను నా భ్రాతలు పొందకుందురు.

తనకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన భ్రాతలు రాజ్య భోగాల విషయంలో వంచింపబడకూడదనేది రాముడి ఆశయం. ఒక తండ్రి కుమారులైన అందరికీ రాజ్య భోగాలనుభవించే హక్కు సమానంగానే ఉంటుంది. అలాంటప్పుడు

తక్కిన వారికెవ్వరికీ లేకుండా, తాను మాత్రమే రాజ్య భోగాలు అనుభవించడం సమంజసం కాదని రాముడు భావించాడు. దశరథుడు కైకేయికి వరాలివ్వడంతోనే భరతుడికి రాజ్యం మీద హక్కు న్యాయంగానే సంక్రమించింది. అందువల్ల కైకేయి వరాలడగడం ఏ మాత్రం తప్పుకాదు. తండ్రి తానిచ్చిన వరానికి కట్టుబడి ఉండడం కూడా దోషం కాదు అని రాముడు భావించాడు. ఇక్కడ రాముడి ధర్మ చింతన, సుదీర్ఘాలోచన, భ్రాతృ ప్రేమ స్పష్టంగా గోచరిస్తాయి.

**13. అతఃపరం నమాతుః పరివాదం శ్రోతుమిచ్ఛామి (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

మీదు మిక్కిలి పిలువకనే వచ్చి కైకేయి భరతుడికి పట్టాభిషేకం కట్టాలంటుంది. ఇది కూడ మత్సరం లేనిదే అంటారా అని కంచుకి రాముడ్ని ప్రశ్నిస్తాడు. నీవు మా మీది పక్షపాతంతో వాస్తవాన్ని గుర్తించలేక పోతున్నావు. వివాహ సందర్భంగా ఆమెకు ఇవ్వవలసిన శుల్కం క్రింద రాజు రాజ్య ప్రదాన వాగ్దత్తం చేసినప్పుడు ఈ రాజ్యం ఆమెకే సంక్రమిస్తుంది. నాకు కాదు. నిజం చెప్పాలంటే భరతుడికి చెందిన రాజ్యాన్ని నేనే అపహరించబోయాను అని రాముడు కంచుకికి సమాధానం చెబుతాడు. తర్వాత అని కంచుకి ప్రశ్నించగా రాముడు ఈ విధంగా చెబుతాడు.

తర్వాత <u>మా తల్లి గార్ని గురించి ఒక్క అపవాదును కూడా వినడానికి నేను ఇష్టపడను.</u>

ఇతరులను గురించి చెడుగా మాట్లాడడం, చెడు వినడం ఉత్తమ పురుషుల లక్షణం కాదు. ఆ చెడు మనస్సునకంటుకొని కింకర్తవ్యతా మూఢులుగా చేసి వేస్తుంది. పైగా ఎదుటి వారి చెడును గురించి ఆలోచించే కొద్దీ వారి పట్ల ద్వేషం పెరుగుతుంది. ఈ ద్వేషం ఎదుటివారిలో కూడ ద్వేషం పెరిగేందుకు దోహదం చేస్తుంది. పరస్పర ద్వేషం సంఘర్షణకు, తద్వారా పరమ అశాంతికి దారి తీస్తుంది. రాముడు కూడ ఈ విషయాన్ని బాగా తెలిసినవాడు. పైగా కైకేయి పట్ల అపార భక్తి ప్రపత్తులు కలవాడు. అందుకే కైకేయిని నిందించడాన్ని ఏ మాత్రం ఓర్చుకోలేకపోయాడు.

**14. యువతి రహితం లోకం కర్తుం యతచ్ఛలితా వయం (శ్లోకం 18)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

దశరథుడికి దుఃఖ భారం వల్ల నోటమాట పెగలక చేతి సైగతో తనను ఇక్కడకు పంపి మూర్ఛిల్లాడని కంచుకి చెబుతాడు. ఏమిటి! మూర్ఛిల్లాడని చెబుతున్నావా? అతడి పట్ల దయను చూపకూడదు. బాణం ధరించాలి. అంటున్న లక్ష్మణుడి మాటలు వచ్చిన దిక్కు వైపుకు రాముడు చూస్తాడు. లక్ష్మణుడు విల్లంబులు ధరించి ప్రవేశిస్తాడు. ఈ సందర్భంలోనే లక్ష్మణుడు రాముడితో ఈ మాటలు చెబుతాడు.

రాజు పరితాపాన్ని సహించడు. దయా దాక్షిణ్యాలు ప్రదర్శించడు. బాణాలు ధరించు మెత్తగా ఉంటే బంధువులు ఎంతకైనా తెగిస్తారు. కాబట్టి నాకు అనుమతిని ఇవ్వు. <u>ఈ లోకంలో యువతులే లేకుండా చేస్తాను.</u>

యువతులే వ్యామోహానికి, లోకంలోని అన్ని అనర్థాలకు కారణమని లక్ష్మణుడు భావించాడు. అందువల్లనే లోకాన్ని యువతులే లేనిదిగా చేస్తానని సంకల్పించాడు. ఇక్కడ లక్ష్మణుడి ఆగ్రహం కట్టలు తెంచుకొన్నట్టు బోధపడుతుంది. కైకేయి పట్ల, దశరథ మహారాజు పట్ల అతనిలో గూడుకట్టుకుపోయిన ద్వేషం, కోపం వెల్లడవుతున్నాయి. అన్న పట్ల అతనికి గల అచంచలాభిమానం కూడ అతని మాటల ద్వారా బహిర్గతమవుతూ ఉంది.

**15. ఇదానీమపి సందేహః కిం క్షమా నిర్మనస్వితా (శ్లోకం 19)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

లక్ష్మణుడి విజృంభణ చూసి సౌమిత్రి ధనుర్బాణాలెందుకు ధరించాడని సీత రాముడ్ని ప్రశ్నిస్తుంది. రాముడు కూడ లక్ష్మణుడ్ని ఈ విషయంగానే ప్రశ్నిస్తాడు. రాముడి ప్రశ్నకు లక్ష్మణుడు ఈ విధంగా సమాధానం చెబుతాడు.

ఇది ఏమి అంటున్నావా? నీకు న్యాయంగా సంక్రమించవలసిన రాజ్యం లాక్కోబడింది. రాజు దుఃఖముతో మూర్ఛిల్లి సింహాసనం నుంచి పడిపోయాడు. ఇలాంటప్పుడు కూడ నువ్వు సంశయిస్తూనే ఉన్నావు. దీన్ని <u>ఓర్పు అనాలో, మనస్సు చాలని స్థితి అనాలో తెలియడం లేదు.</u>

లక్ష్మణుడికి రాముడంటే అపారభక్తి. అతడికి సంక్రమించవలసిన రాజ్యం పోయిందన్న బాధ బాగా వివశుడ్ని చేసింది. అందువల్ల రౌద్రాకారం ధరించాడు. తనను వారింపజూసిన అన్నతో కూడ అధిక్షేపణా పూర్వకంగా మాట్లాడాడు. అతడి స్థితిని అతడికి గుర్తు చేశాడు. మహోగ్రంగా విజృంభించవలసిన సమయంలో సంకోచిస్తూ కూర్చోవడం సబబు కాదన్నాడు. అతని స్థితి అవాంఛనీయమైన క్షమో, అజ్ఞానమో తనకు బోధపడలేదన్నాడు. అంతటి కోపంలోను లక్ష్మణుడు రాముడితో సున్నితంగా మాట్లాడటానికి ప్రయత్నించడం ఇక్కడ కనిపిస్తుంది. దీని మూలంగా లక్ష్మణుడి స్వభావం కూడా వెల్లడవుతుంది.

**16. యదితేఽస్తి ధనుః శ్లాఘా స రాజా పరిపాల్యతామ్ (శ్లోకం 20)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

లక్ష్మణుడు ఆవేశంతో ధనుర్బాణహస్తుడై రాముడి అనుజ్ఞ కోరతాడు. రాముడు తగిన విధంగా స్పందించడం లేదని అతడ్ని నిందిస్తాడు. అప్పుడు రాముడు లక్ష్మణుడితో ఈ విధంగా చెబుతాడు.

నాకు లభించవలసిన రాజ్యం పోవడం నీకు ఇంత ఉద్వేగాన్ని కల్గిస్తూ ఉంది కదా. నేను రాజైనా, భరతుడు రాజైనా రెండూ ఒకటే. <u>బాణం కలిగి ఉన్నందుకు రాజును రక్షించడమే కర్తవ్యం.</u>

తాను రాజైనా, భరతుడు రాజైనా ఒక్కటే అని చెప్పడం రాముడి విశాల హృదయాన్ని ఆవిష్కరిస్తుంది. తనకు సంక్రమించవలసిన రాజ్యం తన సోదరుడు భరతుడికి సంక్రమించినప్పటికీ రాముడిలో ఎటువంటి వికారమూ కలుగలేదు. ఇది అతడి ఉదాత్త వ్యక్తిత్వాన్ని బోధపరుస్తుంది. రాజు ఎవరైనప్పటికీ అతడ్ని రక్షించడమే ధన్వి కర్తవ్యమని బోధించడం వల్ల వీరుడి కర్తవ్యం రాజ్యాన్ని, సింహాసనాన్ని చిత్తశుద్ధితో పరిరక్షించడమేనని అభివ్యక్తమవుతుంది. ఇక్కడ నీతి, రాజనీతి క్షుణ్ణంగా తెలిసిన రాముడి వ్యక్తిత్వం వ్యక్తమవుతుంది.

**17. భృకుటిర్లక్ష్మణస్యైషా నియతీవ వ్యవస్థితా (శ్లోకం 21)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

రాముడి మాటలకు లక్ష్మణుడు సంతృప్తి చెందడు. కోపాన్ని అణచుకోలేకున్నానని లక్ష్మణుడు బయలుదేరుతాడు. అప్పటి ఆయన ఆకారాన్ని, స్థితిని చూసి రాముడు ఇలాఅంటాడు.

<u>మారని విధి వలె లక్ష్మణుడి భృకుటి నేరుగా ఉంటూ మూడు లోకాలను దహించేట్టు ఉంది.</u>

ఇక్కడ నియమితమైన విధితో లక్ష్మణుడి భృకుటిని కవి పోల్చాడు. విధికి ఎలాగైతే మార్పు ఉండదో, లక్ష్మణుడి ఆలోచనల్లోను అది ప్రతిబింబించే అతడి భృకుటిలో మార్పు ఉండదని అభిప్రాయం. లక్ష్మణుడి స్వభావ, తీవ్రతను ఇక్కడ గమనించవచ్చు. రాముడే స్వయంగా చెప్పడం వల్ల లక్ష్మణుడి ప్రతాపం ఎంత దుస్సహమో ఇక్కడ బోధపడుతుంది.

**18. కిం రోషణాయ రుచిరం త్రిషు పాతకేషు (శ్లోకం 22)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

లక్ష్మణుడి తెగువను జూచి రాముడు ఈ విధంగా చెబుతాడు.

మనస్సును దృఢతరం చేసేందుకు ఈ విధంగా చెప్పాను. ఇప్పుడు చెప్పు. సత్య సంధుడైనందుకు తండ్రిని వధించేందుకు బాణం ఎక్కుపెట్టమంటావా? తనకు రావలసిన ఆస్తిని తీసుకొనేందుకు ప్రయత్నించిన తల్లిని వధించమంటావా? నిష్కపటుడు, అమాయకుడైన తమ్ముడు భరతుణ్ణి వధించమంటావా? ఈ మూడు పాపాల్లో ఏది చేయమంటావు?

దశరథుడు, కైకేయి, భరతుడు నిష్కల్మషులు గానే రాముడికి గోచరించారు. వారిదంతా న్యాయమే. అలాంటప్పుడు వారిని వధించాలనుకోవడం అన్యాయమే అవుతుంది. లక్ష్మణుడి ఈ అన్యాయ సంకల్పాన్ని అతడికి బోధ పరచాలనుకున్నాడు. అతడి మార్గంలోనే వెళ్ళి బోధపరచేందుకు ప్రయత్నించాడు. ఇక్కడ రాముడి న్యాయదృష్టి, సంయమనం ఇతరులకు బోధపరచేందుకు తగిన విధానాన్ని ఎంపిక చేసుకోవడం ఎంతైనా ప్రశంసనీయం.

**19. కరోమ్యన్యైర్నృపైర్ధర్మం నైవాప్తం నోపపాదితమ్ (శ్లోకం 24)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

రాముడి మాటలకు స్పందించిన లక్ష్మణుడు రాజ్యం పోవడం పట్ల తనకు బాధ లేదంటాడు. రాముడికి విధించబడిన పదునాలుగేళ్ళ వనవాసమే బాధాకరం అంటాడు. లక్ష్మణుడి మాటలు విన్న రాముడు ఈ విధంగా చెబుతాడు.

నువ్వు వ్యామోహంతో మాట్లాడుతున్నావు. మైథిలీ! అవదాతిక నీకు తెచ్చి ఇచ్చిన నారచీరలు ఇలా తీసుకురా. వాటిని ధరించి <u>పూర్వ రాజులు ఎవ్వరూ చెయ్యని ధర్మాన్ని నిర్వహిస్తాను.</u>

తనకు వచ్చిన కష్టంలో కూడ రాముడు మంచినే దర్శించగలిగాడు. రఘువంశ రాజులు పుత్ర పట్టాభిషేకానంతరమే వాన ప్రస్థాన్ని స్వీకరించి అడవికి వెళ్ళేవారు. అయితే రాముడు మాత్రం తనకు పట్టాభిషేకం కాకముందే నార చీరలు ధరంచి అడవికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. ఇది తన పూర్వ రాజులెవ్వరికీ లభించని అవకాశం. ఈ అవకాశాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకొని వన వాసక్లేశాన్ని నిర్లక్షించడం రాముడి సత్క్రమాలోచనకు నిదర్శనం.

**20. నను సహధర్మచారిణీ ఖల్వహం(గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

రాముడు వన గమనానికి సిద్ధమవుతాడు. నీవు ఏమి నిర్ణయించుకొన్నావని సీతను ప్రశ్నిస్తాడు. సీత రాముడితో ఈ విధంగా సమాధానం చెబుతుంది.

<u>నేను నీ సహధర్మచారిణి కాబట్టి మీ ధర్మంలో పాలు పంచుకోవాలి. నేను కూడా అడవికి వస్తాను.</u>

భార్యాభర్తలిద్దరూ ఒక వ్యక్తిలోని రెండు అర్థభాగాలని బృహదారణ్యకోపనిషత్ తెలియజేసింది. దీనిని బట్టి భర్త ఏ కార్యాన్ని చేబడితే, భార్య కూడా ఆ కార్యంలో పాలు పంచుకోవాలని, భర్త ఎక్కడ ఉంటే భార్య కూడా అక్కడే ఉండాలని బోధపడుతుంది. భార్యా భర్తలిద్దరూ ఈ విధంగా అన్నిటా అన్ని వేళలా పరస్పరం సహకరించుకుంటే కుటుంబ జీవితం విజయవంతమవుతుంది. ఈ అంశాన్నే సీత మాటలు తేటపరుస్తున్నాయి. సీత తీసుకున్న దృఢనిర్ణయం, ఆమె ధర్మ చింతన ఆమెను ఒక ఉన్నత స్థానంలో నిలబెడుతున్నాయి.

**21. వ్రజతు చరతు ధర్మం భర్తృనాథా హి నార్యః (శ్లోకం 25)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

సీత వనగమన నిశ్చయానికి రాముడు అంగీకరించడు. అయోధ్యలోనే ఉండి అత్తమామలకు సేవ చెయ్యమని కోరతాడు. వనవాస క్లేశాన్ని వివరిస్తాడు. అయినప్పటికీ సీత తన నిర్ణయాన్ని మార్చుకోదు. ఆమె నిర్ణయం నుంచి ఆమెను మరల్చవలసిందిగా రాముడు లక్ష్మణుడ్ని కోరతాడు. ఆ సందర్భంలో లక్ష్మణుడు రాముడితో ఇలా తెలియజేస్తాడు.

చంద్రుణ్ణి రాహువు పట్టవచ్చినప్పుడు కూడా తార అతనితోనే ఉంటుంది. వనవృక్షం నేల కూలినపుడు లత కూడ నేల కూలుతుంది. ఏనుగు రొంపిలో దిగబడినప్పుడు కూడ ఆడ ఏనుగు దానిని విడిచి వెళ్ళదు. ఈ విధమైన ధర్మాన్నే ఈమె కూడ అనుసరిస్తుంది. <u>ఎందుకంటే సాధ్వి భర్తృ సనాథ కాబట్టి.</u>

ఈ శ్లోకంలో లక్ష్మణుడు మూడు దృష్టాంతాలు చెప్పాడు. ఒకటి దేవతలకు సంబంధించింది, మరొకటి జంతువులకు సంబంధించింది, ఇంకొకటి వృక్షజాతికి సంబందించింది. అదే విధంగానే సీత కూడ రాముడ్ని అనుసరిస్తుందని సీతను వారించకూడదని ఇక్కడ ధ్వని. అయితే లక్ష్మణుడి విషయం ఇందుకు భిన్నంగా ఉంది. ఊర్మిళ లక్ష్మణుడితో పాటు అడవికి వెళ్లవలసి ఉండగా, ఆమె వెళ్ళలేదు.

లక్ష్మణుడు సీతారాములను కంటికి రెప్పలా కాపాడే ఉద్దేశ్యంతో అడవికి బయలుదేరాడు. ఊర్మిళ కూడా తన వెంట వస్తే లక్ష్మణుడు తల పెట్టిన ధర్మానికి విఘాతం కలుగుతుందేమో అని సంశయం. అలా విఘాతం కలిగే పక్షంలో సీతారాములను అనుసరించి లక్ష్మణుడు అడవికి వెళ్ళే ప్రయోజనం నెరవేరదు.

**22. చీరమేకాకినాబద్ధం చీరే ఖల్వసి మత్సరీ (శ్లోకం 26)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

చేటి నార చీరలు తీసుకొని వచ్చి సీతకు ఇవ్వబోతుంది. రాముడు వారించి తనకు ఇమ్మని కోరతాడు. చేటి ఇచ్చిన నార చీరలను ధరిస్తాడు. లక్ష్మణుడు ఆ దృశ్యాన్ని చూచి రాముడితో ఈ విధంగా చెబుతాడు.

వస్త్రాలను, ఆభరణాలను, మాలను, సకల వస్తువులను ముందే నాకు సగం ఇచ్చేవాడివి. <u>ఇప్పుడు ఈ నార చీరలను ధరించావు. చీరలో మత్సరము ఎందుకు?</u>

రామ లక్ష్మణులు ఎప్పుడూ కలిసే తిరిగే వారు. వారికి లభించిన అన్నిటిలోనూ పాలుపంచుకొనే వారు. కష్ట సుఖాల్లో కూడా వారు సమాన భాగం వహించే వారంటే అతిశయోక్తి కాదు. అలాంటప్పుడు నార చీరలను రాముడు మాత్రమే ధరించి వన గమన క్లేశాన్ని ఒక్కడే భరించడం సబబు కాదని లక్ష్మణుడు సున్నితంగా ఇక్కడ అధిక్షేపించాడు. రామ లక్ష్మణులు అపూర్వ సహోదరులని, ఆదర్శ సహోదరులని ఈ సన్నివేశం తెలియజేస్తుంది.

**23. తవైవ దక్షిణః పాదో మమ సవ్యో భవిష్యతి (శ్లోకం 27)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

లక్ష్మణుడు తనకు కూడా నార చీరలు ఇప్పించమని రాముడ్ని కోరతాడు. రాముడు లక్ష్మణుడ్ని వారించవలసిందిగా సీతను ఆదేశిస్తాడు. వన గమన ప్రయత్నాన్ని మానుకొమ్మని సీత లక్ష్మణుడికి సూచిస్తుంది. ఆ సందర్భంలో లక్ష్మణుడు సీతతో ఈ మాటలు అంటాడు.

మా అన్నగారి పాద సేవను నువ్వు మాత్రమే చెయ్యాలనుకొంటున్నావా? దక్షిణ పాదం నీకే. ఎడమ కాలైనా నాకు దక్కనిమ్ము.

సీతా లక్ష్మణులిద్దరూ రాముడ్ని ఎంతగానో అభిమానించారు, ఆరాధించారు. ఆయన సేవకు తమను అంకితం చేసుకొన్నారు. అలాంటప్పుడు సీతాదేవి మాత్రమే రామసేవకు పూనుకోవడం సబబు కాదు. లక్ష్మణుడికి కూడ అందులో భాగం ఉండాలి. సీత దక్షిణ పాదాన్ని సేవిస్తే, లక్ష్మణుడు వామపాద శుశ్రూష చేయడం సబబు. అప్పుడు మాత్రమే సీతా లక్ష్మణులిద్దరూ రామ సేవ చేసినట్లవుతుంది. ఈ విషయాన్నే లక్ష్మణుడు తెలియజేశాడు. ఈ శ్లోకం వల్ల రాముడి పట్ల సీతా లక్ష్మణులు ప్రదర్శించిన భక్తి వెల్లడవుతుంది.

**24. ఖలీన మింద్రియాశ్వానాం గృహ్యతాం ధర్మసారథిః (శ్లోకం 28)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

సీత వారించినప్పటికీ లక్ష్మణుడు తన వన గమన ప్రయత్నాన్ని విరమించడు. అప్పుడు రాముడికి కూడ అంగీకరించక తప్పదు. లక్ష్మణుడు బాధపడుతున్నాడని అతడికి నార చీరలిమ్మని సీత చెబుతుంది. రాముడు లక్ష్మణుడికి వల్కల ప్రదానం చేస్తాడు. ఈ సందర్భంలోనే వల్కల విశిష్టతను రాముడు ఈ విధంగా తెలియజేస్తాడు.

నార చీరలు తపస్సు అనే యుద్ధానికి కవచం వంటివి. విషయమనే ఏనుగుకు అంకుశం. ఇంద్రియాలనే గుఱ్ఱాలకు కళ్ళాలు. ధర్మసారథివైన నీవు వీటిని పుచ్చుకో.

ఒక వస్తువును ఇతరులకు ఇచ్చేటప్పుడు దాని విశిష్టత చెప్పి ఇవ్వడం పద్ధతి. గ్రహించేవాడు కూడా దాని ఉపయోగాన్ని తెలుసుకొంటే వాడుకోవడం సులభంగా ఉంటుంది. ఈ దృష్టితోనే రాముడు లక్ష్మణుడికి వల్కలాల విశిష్టితను వాక్రుచ్చాడు. ఏ ప్రదేశానికి వెళితే ఆ ప్రదేశానికి అనువైన దుస్తులు వాడుకోవడం నివాసాన్ని సులభతరం చేస్తుంది. కాబట్టే వన వాసంలో నార చీరలు ఎంతో ఉచితంగా ఉంటాయి. ఈ విషయాన్నే రాముడు తెలియజేసినట్టు అయింది.

**25. నిర్దోష దృశ్యా హి భవన్తి నార్యో యజ్ఞే వివాహే వ్యసనే వనేచ**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ప్రథమాంకంలోనిది.

సీతారామలక్ష్మణులు నార చీరలు ధరించి వనవాసానికి బయలుదేరుతారు. ఈ వార్త విన్న పౌరులు వారిని తిలకించేందుకు బాష్పపూర్ణ నేత్రాలతో వీథుల్లో గుమిగూడుతారు. లక్ష్మణుడు ముందు వెళుతూ వైదొలగవలసిందిగా వారిని కోరుతాడు. రాముడి సూచన మేరకు సీత తన మేలి ముసుగును తొలగిస్తుంది. అప్పుడు రాముడు పౌరులనుద్దేశించి ఈ విధంగా చెబుతాడు.

మీరు నా భార్యను నేత్రాలతో స్వేచ్ఛగా చూడండి. స్త్రీలను యజ్ఞ వాటికలోను, వనంలోను, బాధలోను, వివాహంలోను చూడడం దోషం కాదు.

రాముడు ఏఏ సందర్భాల్లో స్త్రీలను చూడవచ్చో చెప్పాడు. ఈ సందర్భాలు తప్ప తక్కిన సందర్భాల్లో స్వేచ్ఛగా స్త్రీలను చూడడం సమంజసం కాదని ఇక్కడ ధ్వని. ఈ చెప్పిన సందర్భాల్లో ఎవరి పనుల్లో వారు ఉంటారు. ఇతరులను పట్టించుకొనే అవకాశం ఉండదు. అందువల్ల ఎలాంటి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉండదు. అందుకే రాముడు ఈ సందర్భాలను సూచించాడు. రామాయణంలోనే గాక స్మృతుల్లోను, ధర్మ శాస్త్రాల్లోను కూడా స్త్రీలను చూడటంలో ఇలాంటి మినహాయింపులు కల్పింపబడ్డాయి. వీటికే భాసుడు కూడా ప్రతిమా నాటకంలో స్థానం కల్పించాడు.

# ద్వితీయాంకము

**1. శోకాద్ భృశం శిథిలదేహమతిర్నరేంద్రః (శ్లోకం 1)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

అప్రమత్తులై తమ తమ స్థానాలను కాచుకోవలసిందిగా కాంచుకీయుడు ద్వారపాలకులను కోరుతాడు. విశేషాలేమిటని ప్రతీహారి ప్రశ్నించగా దశరథ మహారాజు స్థితిని కంచుకి ఈ విధంగా తెలియజేస్తాడు.

యుగాంత కాలంలో మేరువు చలించినట్టు, సముద్ర జలం ఇంకిపోయినట్టు, సూర్యుడు అస్తమయ సమయంలో బింబ మాత్రంగా మిగిలినట్టు దశరథ మహారాజు మనస్సు బాధతో క్రుంగిపోగా ఎంతో పరితపించాడు.

రాముడు వన గమనోన్ముఖుడైనప్పుడు అది ఇష్టం లేని దశరథ మహారాజు అతన్ని వారించి ఉండవచ్చు. అయితే రాజు ఆ పని చేయలేదు. ఎందుకంటే తన సత్యవాక్కును నిలుపుకోవాలని. పుత్ర వియోగం కన్నా, ప్రాణ వియోగం కన్నా సత్య వాక్కుకే దశరథుడు ప్రాధాన్యం ఇచ్చాడు. ఇక్కడ రఘువంశ రాజుల అందునా దశరథుడి ధర్మానురక్తిని ఈ సంఘటన తెలియజేస్తుంది.

**2. హాహా గతాః కిల వనం బత, మే తనూజాః (శ్లోకం 4)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

రామాదుల వన గమనం తర్వాత అయోధ్య ఎడారిగా తయారవుతుంది. అక్కడి పెంపుడు జంతువులు సైతం రామ వియోగ సంతాపాన్ని వెలిబుచ్చుతాయి. దశరథుడు అతి ప్రయత్నం మీద పైకి లేస్తాడు. నిస్సహాయంగా పడిపోతాడు. పుత్ర వియోగంతో బాధపడే రాణులు కౌసల్యా, సుమిత్ర తమను ఓదార్చుకొని, దశరథుడ్ని ఓదార్చే ప్రయత్నం చేస్తారు. అయినా ప్రయోజనం లేకపోతుంది. దశరథుడు బిగ్గరగా రోదన చేస్తాడు. రాఘవుడు అడవికి వెళ్ళిన దిక్కునే మాటి మాటికి చూస్తాడు. కంచుకి ఈ విషయాలు చెప్పగానే దశరథుడు రాణులిద్దరితో ప్రవేశిస్తాడు. ఈ విధంగా చెబుతాడు.

హాహా వత్సా! లోక నయనాభిరామా! రామా! వత్సా! లక్ష్మణా! మంచి లక్షణాలతోకూడిన శరీరం కలవాడా! భర్తను మనుస్సలో నిలుపుకొన్న సాధ్వి సీతా! హాహా నా కుమారులు వనానికి వెళ్ళారు కదా!

దశరథుడు పుత్ర వియోగంతో బాధపడడం ఇందలి ప్రధానాంశం. తన పుత్రులు, కోడలు చెప్పుకోదగిన వ్యక్తిత్వం లేని వాళ్ళైతే అతనికంత బాధ ఉండేది కాదేమో. రాముడి అందం లోకులందరికీ కూడ మనోహరం. లక్ష్మణుడి శరీర లక్షణ సంపద అందరికీ అభినందనీయమే. భర్తపట్ల సీతకున్న అనురాగం సర్వజన సంస్తుత్యం. అందువల్లనే దశరథుడు వారినంతగా అభిమానించాడు. వారి వియోగాన్ని సహించలేకపోయాడు. మొదట తన కుమారులిద్దరిని పేర్కొని, తర్వాత కోడలిని ప్రస్తావించడం దశరథుడి మమతానుక్రమాన్ని తెలియజేస్తుంది.

**3. గురుశుశ్రూషణేయుక్త ప్రతి వాక్యం ప్రయచ్ఛమే (శ్లోకం 6)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

లక్ష్మణుడు పితృభక్తి ఉపేక్షించి, భ్రాతృభక్తిని నింపుకొన్నాడని దశరథుడు చెబుతాడు. అయినప్పటికీ లక్ష్మణుడ్ని నాకు చూడాలనిపిస్తుందటాడు. రాముడు తనను విడిచి పెట్టాడని వాపోతాడు. లక్ష్మణుడు తనను గర్హించాడని బాధపడతాడు. అపకీర్తి తెచ్చిన నన్ను వారలా విడిచి పెట్టడం సబబే అంటాడు. రాముడ్ని, లక్ష్మణుడ్ని, సీతను పేరు పేరునా పిలుస్తాడు. వారులేని ప్రదేశం శూన్యంగా కనిపిస్తుందని చెబుతాడు. తన ప్రశ్నలకు సమాధానమివ్వలేదని బాధపడతాడు.

ఈ సందర్భంలోనే దశరథుడు రాముడ్ని ఉద్దేశించి ఈ శ్లోకం చెబుతాడు.

సత్యసంధా! కోపాన్ని జయించిన వాడా! మాత్సర్యం లేనివాడా! లోకమంతటికీ ప్రియమైన వాడా! <u>పెద్దల సేవలో తాదాత్మ్యం పొందేవాడా! నాకు బదులు చెప్పు.</u>

దశరథుడు చెప్పిన ఈ శ్లోకంలో రాముడి సద్గుణాలు ప్రస్తావించబడ్డాయి. అతడు సత్య సంధుడు కాబట్టే పితృవాక్య పరిపాలనకు ప్రాధాన్యమిచ్చాడు. కోపాన్ని జయించినవాడు కాబట్టే తనకు సంక్రమించవలసిన రాజ్యం చేజారిపోయినా తన మీద కాని, కైకేయి మీద గాని ఆగ్రహాన్ని ప్రదర్శించలేదు. అతడికి మాత్సర్యం లేకపోవడం వల్లనే తనకు సంక్రమించవలసిన రాజ్యాన్ని భరతుడు తీసుకొంటున్నప్పటికీ అతని మీద మాత్సర్యం చూపలేదు. ఇన్ని సుగుణాలు ఉండడం వల్లనే రాముడు లోకానికంతటికీ ప్రియమైనవాడుగా విరాజిల్ల గలిగాడు. పెద్దల సేవకే తనను అంకితం చేసుకోవడం రాముడి స్వభావం కాబట్టి కైకేయి, దశరథుల మాటలకు విలువ ఇచ్చి వనానికి వెళ్ళాడు.

రామాదుల వియోగం దశరథుడికి దుస్సహం అయింది. రాముడు సమీపంలో లేకపోయినా ఉన్నట్టే మాట్లాడ్డం మొదలు పెట్టాడు. ఇది అతని నిస్సహాయ స్థితిని, మనో దౌర్బల్యాన్ని తెలియజేస్తుంది.

**4. సూర్యదివసావసానే ఛాయేవ నదృశ్యతే సీతా (శ్లోకం 7)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

రామ వన గమనానంతరం దశరథుడు శోక సంతప్తుడవుతాడు. పలురకాలుగా చింతిస్తాడు. సీతారామలక్ష్మణులను ఎలుగెత్తి పిలుస్తాడు. ఈ సందర్భంలోనే దశరథుడు వారు వనానికి వెళ్ళిన విధానాన్ని ఈ విధంగా తెలియజేశాడు.

అస్తమించే సూర్యుడిలా రాముడు వెళ్ళాడు. సూర్యుడ్ని అనుగమించే పగటిలా లక్ష్మణుడు వెళ్ళాడు. <u>పగటి చివర కనిపించని ఛాయలాగ సీత కూడ కనిపించదు.</u>

రాముడ్ని సూర్యుడుగాను, అతని తమ్ముడు లక్ష్మణుడ్ని పగలుగాను, సీతను ఛాయగాను భాసుడు అభివర్ణించాడు. ఈ పోలిక మనోహరంగా ఉంది. సూర్యవంశ సంజాతుడైన రాముడు సూర్యుడితో పోల్చబడడం సమంజసంగా ఉంది. రాముడు జ్ఞాన సంపన్నుడు. జ్ఞానానికి ప్రతీక వెలుగు. పైగా సూర్యుడు కూడా మహాజ్ఞానే. అందువల్ల రాముడ్ని సూర్యుడితో ఉపమించడం ఎంతో యుక్తంగా ఉంది. లక్ష్మణుడికి, సీతకు రాముడితో ఉన్న అనుబంధాన్ని పురస్కరించుకొని పగలుగాను, ఛాయగాను వారిని ఉపమించడం చక్కగా ఉంది.

**5. రామోరఘుకులశ్రేష్ఠశ్ఛాయేవానుగమ్యతే (శ్లోకం 10)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

దశరథుడు లక్ష్మణుడ్ని పిలుస్తూ పైకి లేస్తాడు. రాణులిద్దరూ అతడిని పట్టుకొంటారు. కౌసల్య సంతాపం చెందవద్దని అతడి ప్రశ్నకు సమాధానం చెబుతుంది. సుమిత్ర కూడ అక్కడే ఉందని చెబుతుంది. లక్ష్మణుడ్ని కన్నందుకు దశరథుడు సుమిత్రను ప్రశంసిస్తాడు. ఈ సందర్భంగా లక్ష్మణుడి గుణగణాలను ఈ విధంగా శ్లాఘిస్తాడు.

నీ కుమారుడే సత్పుత్రుడు. ఎందుకంటే రఘుకుల శ్రేష్ఠుడైన రాముడ్ని రాత్రింబవళ్ళు వనంలో నీడలాగ వెన్నంటి ఉంటాడు.

రాముడికి వన గమనం విధింపబడింది. కాబట్టి అతడు వెళ్ళడం తప్పనిసరి. లక్ష్మణుడికి వనానికి వెళ్ళవలసిన ఆవశ్యకత లేదు. అయినప్పటికీ అతడి రామభక్తి, రామ రక్షణాసక్తి, త్యాగనిరతి అతన్ని వనానికి వెళ్ళేట్టు చేశాయి. ఒక్కమాటలో చెప్పాలంటే వనవాస విషయంలో రాముడి త్యాగం కంటే కూడ లక్ష్మణుడి త్యాగమే గొప్పది. ఈ విషయాన్ని అంతటి శోక వివశత్వంలోను దశరథుడు గుర్తించాడు. తనకు బహిః ప్రాణమైన రాముడికి బహిః ప్రాణంగా మసలుకొనే లక్ష్మణుడంటే అతడికున్న ప్రేమ బహు గుణాధికారంగా పరిణమించింది. అందుకే అతడి మీద ఈ ప్రశంసల జల్లు కురిపించాడు. దీనివల్ల దశరథుడి వ్యక్తిత్వం ఉన్నతీకరింపబడింది.

**6. విధిరనతిక్రమణీయః (గద్యం)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

దశరథుడు, రాణులు మాట్లాడుకొంటూ ఉండగానే కంచుకి ప్రవేశించి మంత్రి సుమంత్రుని రాక దశరథుడికి తెలియజేస్తాడు. దశరథుడు సంతోషంతో లేస్తాడు. రామసహితంగా వచ్చాడు కదా అని ప్రశ్నిస్తాడు. వట్టి రథంతోనే వచ్చాడని కంచుకి చెబుతాడు. వట్టి రథంతోనేనా? అని దశరథుడు మూర్ఛిల్లుతాడు. ఈ దృశ్యాన్ని చూచిన కంచుకి ఈ విధంగా చెబుతాడు.

ఇటువంటి మహాపురుషులు కూడ దుర్భర కష్టాలను పొందడం ఆశ్చర్యకరం. విధి అతిక్రమించడానికి వీలుకానిది. ఎంత బలీయమైంది.

దశరథుడు సూర్యవంశపు రాజు. ఇక్ష్వాకు దిలీపుడు, రఘువు, అజుడు ధీరులు, ధీరోదాత్తులు. ఇటువంటి వారి వంశంలో జన్మించిన దశరథుడికి దౌర్బల్యం ఉండకూడదు. దశరథుడు మహాజ్ఞాన సంపన్నుడైన వశిష్ఠుని శిష్యుడు. గురువుగారి జ్ఞానం కొంతైనా దశరథుడికి వంటబట్టి ఉంటుంది. జ్ఞాని మోహానికి గురికాకూడదు. దశరథుడిలో పుత్ర వ్యామోహం విజృంభించి అతడ్ని అపస్మారక స్థితికి తీసుకువచ్చింది. ఇలా జరగడానికి ప్రధాన కారణం విధి మాత్రమే. శ్రావణ కుమారుడి తల్లిదండ్రుల శాపమే విధి రూపంలో దశరథుడ్ని ఈ విధంగా పీడించింది.

**7. నూనం దశరథం నేతుం కాలేనప్రేషితో రథః (శ్లోకం 11)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

రాముడ్ని తీసుకురాకుండా సుమంత్రుడొక్కడే వచ్చాడని తెలిసిన దశరథుడు మూర్ఛిల్లుతాడు. కంచుకి ఆశ్వాసించగా కొంతసేపటికి తెప్పరిల్లుతాడు. అతడికి రామ వియోగ క్లేశం అధికమవుతుంది. దుర్భర మనోవ్యథతో దశరథుడు కంచుకినుద్దేశించి ఈ విధంగా చెబుతాడు.

రథం శూన్యంగా రావడంతో నా మనోరథం కూడా భగ్నమైపోయింది. దశరథుడ్ని తప్పనిసరిగా తీసుకువచ్చేందుకు కాలుడే ఆ రథాన్ని పంపించాడేమో!

రాముడ్ని తిరిగి తీసుకురమ్మని దశరథుడు సుమంత్రుడ్ని పంపాడు. అయితే అతడు వట్టి చేతులతోనే తిరిగి వచ్చాడు. అది దశరథుడిలో ప్రళయాగ్నిని ప్రజ్వలింపజేసింది. రాముడు తిరిగి రావాలనే కోరిక, తిరిగి వస్తాడనే నమ్మకం వమ్మయినట్టు గుర్తించాడు. రాముడ్ని విడిచి ఉండలేని తన దుస్థితిని గుర్తించాడు. ముని శాపం కూడా ఆ సమయంలో అతడికి గుర్తువచ్చి ఉంటుంది. అందువల్ల తనకు మరణం తథ్యమనే నిర్ణయానికి వచ్చాడు. పర్యవసానంగా దశరథుడి నోటి నుంచి పై శ్లోకం వెలువడింది. ఇక్కడ దశరథుడి మనో దౌర్బల్యం, మానసిక ఆందోళన, నిగ్రహించుకోలేని ఉద్రిక్తత వ్యక్తమవుతున్నాయి.

**8. బహుదోషాణ్యరణ్యాని సనాథైషా భవిష్యతి (శ్లోకం 15)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

సుమంత్రుడురాగానే అడవికి వెళ్ళిన తన కుమారులు తనకు ఏమి చెప్పి పంపారో తెలియజేయవలసిందిగా దశరథుడు సుమంత్రుడ్ని కోరతాడు. వైదేహి తమకు ఏమి చెప్పి పంపిందో చెప్పవలసిందిగా సుమిత్ర కూడా సుమంత్రుడ్ని ప్రశ్నిస్తుంది. సుమంత్రుడు వారి క్షేమ వార్తలను తెలియజేస్తాడు. అప్పుడు రాముడు, లక్ష్మణుడు, సీత అనే క్రమంలో వారి పేర్లను ఉచ్చరిస్తాడు. దశరథుడు వెంటనే అతడి మాటలకు అడ్డుపడి పేర్లక్రమాన్ని మార్చవలసిందిగా ప్రతిపాదిస్తాడు. ఆ క్రమం ఎలా అని సుమంత్రుడు ప్రశ్నిస్తాడు. రాముడు, సీత, లక్ష్మణుడు అని చెప్పాలని దశరథుడు సూచిస్తాడు. ఈ సందర్భంలోనే దశరథుడు సుమంత్రునితో ఈ మాటలు అంటాడు.

సీత రామ లక్ష్మణుల మధ్యే ఉండాలి. ఎందుకంటే అరణ్యాలు వివిధ ప్రమాదాలతో కూడి ఉంటాయి. రామలక్ష్మణుల మధ్య ఉన్నప్పుడే సీత చక్కగా రక్షింపబడుతుంది.

రాముడు, లక్ష్మణుడు సామాన్య వీరులుకారు. మహా బలపరాక్రమ సంపన్నులు, గొప్ప విజేతలు. ఎలాంటి ప్రమాదం ఎదురైనా ఇట్టే రూపుమాపగల సమర్థులు. అందువల్ల వారిద్దరి మధ్య అయితే సీత సురక్షితంగా ఉంటుందని దశరథుడి విశ్వాసం. అలాకాని పక్షంలో ప్రమాదాలకు నిలయాలైన అరణ్యాల్లో సీతకు ఏదైనా ప్రమాదం సంభవించవచ్చునని దశరథుడి భయం. ఇది భావి కథా సూచకంగా కూడ భాసిస్తూ ఉంది. రామలక్ష్మణులు ఇద్దరు ఉండి ఉంటే సీత అపహరణకు గురిఅయి ఉండేది కాదు. ఇలా అనడం ద్వారా దశరథుడికి తన పుత్రులపట్ల ఎంత విశ్వాసముండేదో బోధపడుతుంది. సీత మీద ఉండే ప్రత్యేక వాత్సల్యం కూడ దశరథుడి మాటల్లో వ్యక్తమవుతూ ఉంది.

9. **గతాయురమృతేనేవ జీవామీతి మతిర్మమ (శ్లోకం 16)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

దశరథుడి ఆదేశం మేరకు సుమంత్రుడు రామాదుల పేర్లక్రమాన్ని మారుస్తాడు. దశరథుడు సంతోషిస్తాడు. వారిని పేరుపేరునా పిలుస్తూ తనను కౌగిలించుకోమని కోరుతాడు. ఆ సందర్భంగా సుమంత్రునితో దశరథుడు ఈ విధంగా చెబుతాడు.

వెంటనే రాముడ్ని స్పృశించినా వెంటనే చూచినా మరణించినవాడు అమృతం సేవించి బ్రతికినట్టు నేను మళ్ళీ జీవిస్తాను. ఇది నా నిశ్చితాభిప్రాయం.

దశరథుడి మాటల వల్ల అతడి మరణ శంక వెల్లడవుతుంది. రామ పునః స్పర్శాదర్శనాదులతో మరణం దూరమవుతుందని దశరథుడి విశ్వాసం కూడ ఇక్కడ అభివ్యక్తమవుతుంది. రామదర్శనం దశరథుడికి అమృతప్రాయమని ఇక్కడ ధ్వని.

10. **బాష్పస్తంభిత కంఠత్వాదనుక్త్వైవ వనంగతాః (శ్లోకం 17)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

దశరథుడు రామదర్శనాన్ని, రామస్పర్శను అభిలషిస్తాడు. రామాదులు చెప్పి పంపిన సందేశాన్ని వినగోరతాడు. ఈ సందర్భంలోనే సుమంత్రుడు రామాదుల వన ప్రవేశ వృత్తాంతాన్ని ఈ విధంగా తెలియజేస్తాడు.

రామాదులు శృంగి భేరి పురంలో రథం దిగారు. అయోధ్యకు అభిముఖంగా నిలబడి శిరస్సు వంచి తమకు నమస్కరించారు. ఏదో చెప్పాలనుకున్నారు. వారి పెదవులు వణికాయి. కన్నీటితో కంఠం గాద్గదికం అయ్యింది. ఏమి చెప్పకుండానే అడవిలో ప్రవేశించారు.

సుమంత్రుడి మాటల ద్వారా రామాదులకు దశరథుడిపట్ల భక్తి వ్యక్తమవుతుంది. అయోధ్య విడిచిరావడంతో వారికి కలిగిన మనఃక్లేశం బోధపడుతుంది. వన ప్రవేశోన్ముఖులైన వారి దుస్థితి వ్యక్తమవుతుంది. దీన్నిబట్టి రామాదులు కూడా సంతోషంతోనే అడవికి వెళ్ళలేదని తెలుస్తుంది. రాముడు విష్ణ్వంశ సంభూతుడైనప్పటికీ మానవత్వమే ఇక్కడ అతడి మీద ఆరోపింపబడినట్లు స్పష్టమవుతుంది. భాసుడి పాత్ర చిత్రణా నైపుణ్యం ఇక్కడ గోచరిస్తుంది.

11. **రామం ప్రతిగతా బుద్ధిరద్యాపిననివర్తతే (శ్లోకం 18)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

రామాదులు ఏమీ చెప్పిపంపలేదా అని దశరథుడు మూర్ఛిల్లుతాడు. రాజు దుస్థితిని అమాత్యులకు తెలియజేయవలసిందిగా చేసిన సూచనతో కంచుకి నిష్క్రమిస్తాడు. రాణులు వచ్చి ఊరడిల్లమని దశరథుడ్ని కోరతారు. దశరథుడు కొంత ఊరడిల్లుతాడు. ఈ సందర్భంలోనే దశరథుడు కౌసల్యనుద్దేశించి ఈ విధంగా చెబుతాడు.

కౌసల్యా! నా శరీరాన్ని స్పృశించు. నా కళ్ళు నిన్ను చూడలేకున్నాయి. రాముడ్ని వెంబడించి వెళ్ళిన బుద్ధి ఈ నాటికీ తిరిగి రాలేదు.

దశరథుడి మాటలు అతడి దుస్థితిని తెలియ జేస్తున్నాయి. రాముడు వెళ్ళగానే తన సర్వస్వాన్ని కోల్పోయినట్లు అతడు భావించాడు. అతడికి ఆత్మీయహితకర స్పర్శ కావలసి వచ్చింది. అందువల్లనే తనలాగే బాధపడే కౌసల్యను తాకమన్నాడు. రాముడ్ని తప్ప మరే విషయాన్ని ఆలోచించలేని తన బుద్ధి నిస్సహాయతను తెలియజేశాడు. కన్న సంతానం మీద ఉండవలసిన దానికన్న ఎక్కువ వ్యామోహం పెట్టుకొంటే ప్రతి తల్లిదండ్రులు ఈ విధంగానే బాధపడవలసి ఉంటుందని భాసుడు దశరథుడి ద్వారా ఇక్కడ ధ్వనింపజేశాడు.

**12. క్షిప్రమానీయతాం పుత్రః పాపం సఫలమస్త్వితి (శ్లోకం 20)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం ద్వితీయాంకంలోనిది.

రాముడు తిరిగిరాడని తెలిసిన తర్వాత దశరథుడి పరిస్థితి విషమిస్తుంది. సుమంత్రుడి ఎదుటనే కౌసల్యాదులతో తన దుస్థితిని చెప్పుకుంటాడు. ఇంతలో అతడి మనుస్స కైకేయి వైపు మల్లుతుంది.ఆగ్రహం పెల్లుబుకుతుంది. పర్యవసానంగా కైకేయికి తెలియజేయమని సుమంత్రుణ్ణుద్దేశించి దశరథుడు ఈ విధంగా చెబుతాడు.

రాముడు వెళ్ళాడు నీకు సంతోషమే. నా ప్రాణాలు కూడా సంకటంలోపడ్డాయి. <u>వెంటనే నీ కుమారుడ్ని పిలిపించుకో నీ పాప ఫలం తప్పక సిద్ధిస్తుంది.</u>

రామ వన గమనం కైకేయికి సంతోషదాయకమని, తనకు ప్రాణ సంకటమని దశరథుడిక్కడ వ్యంగ్యంగా తెలియజేశాడు. భరతుడు రాజైనా తన పాపఫలాన్ని కైకేయికి అనుభవించక తప్పదన్నాడు. ఇక్కడ దశరథుడికి రాముడిపట్ల గల ప్రీతి, కైకేయి, భరతుల పట్ల ఏర్పడిన ఏహ్య భావమూ వెల్లడవుతున్నాయి. దశరథుడి పాత్రను సహజ స్వభావాన్ని ఇక్కడ చక్కగా ఆవిష్కరించినట్లయింది.

# తృతీయాంకము

**1. త్రీన్ దోషాన్ కోऽభిధాస్యతి? (శ్లోకం 4)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

భరతుడు అయోధ్యకు వస్తూ సూతుణ్ణి అక్కడి విశేషాలను గురించి ప్రశ్నిస్తాడు. సూతుడు సమాధానం చెప్పకుండా చెప్పకదాస్తాడు. భరతుడు నగరానికి వెళ్ళి తండ్రికి పాదాభివందనం చేయడం, అతడు తనను ఆశీర్వదించడం, తల్లులు కూడ కన్నీటితో తనను స్పృశించడం వంటి దృశ్యాలను ఊహించుకొని ఉత్సుకత పొందుతాడు. అతడి ఉత్సుకతను గమనించి సూతుడు తనలో ఇలా అనుకొంటాడు. నాకు తెలిసినప్పటికీ నిజాలను భరతుడితో చెప్పలేదు.

పితృ మరణం, అగ్రజ వనగమనం, తల్లి ఐశ్వర్యలుబ్దతా <u>ఈ మూడు దోషాలను ఎవరు అతడికి చెబుతారు.</u>

మంచికి తప్ప మరిదేనికీ మనస్సులో స్థానంలేని భరతుడు మంచినే ఊహించాడు. తనకంతా మంచి జరుగుతుందనే విశ్వసించాడు. చెడును శంకించలేకపోయాడు. భరతుడికి సంబంధించినంతవరకు చోటు చేసుకున్న ఆ మూడు దోషాల గురించి అతడికి తెలియనే తెలియదు. ఎవ్వరూ అతడికి చెప్పటానికి కూడ సాహసించలేదు. ఇక్కడ భరతుడి వ్యక్తిత్వం అభివ్యక్తమవుతుంది.

2. **అథచ ఉపోపవిశ్య ప్రవేష్టవ్యాని నగరాణీతి సత్సముదాచారః** (గద్యం)

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

భరతుడు అయోధ్యా నగరంలో ప్రవేశించబోతాడు. భటుడు వచ్చి గురువాదేశాన్ని భరతుడికి తెలియజేస్తాడు. కృత్తికా నక్షత్రం ఇంకొక గడియ ఉండటం వల్ల, రోహిణీ నక్షత్రం వచ్చాకనే నగర ప్రవేశం చేయవలసిందిగా గురువు చెప్పినట్టు తెలియజేస్తాడు. భరతుడు అంగీకరిస్తాడు. తాను గురువాజ్ఞను ఎప్పుడూ అతిక్రమించలేదని చెబుతాడు. విశ్రమించడానికి ప్రదేశాన్ని అన్వేషిస్తాడు. చెట్లచాటున ఉండే ఆలయాన్ని గుర్తిస్తాడు. అక్కడకు వెళ్ళితే దైవదర్శనం, విశ్రాంతి ఒకేసారి పొందవచ్చని భావిస్తాడు. ఈ సందర్భంలోనే భరతుడు సూతుడితో ఈ మాటలంటాడు.

నగర ప్రవేశం చేసే ముందు ఊరి బయట కొంతసేపు విశ్రమించడం పెద్దల ఆచారం.

రామాయణ కాలం వారు కూడా పూర్వాచారాల పట్ల చక్కటి స్పృహ కలిగి ఉండేవారని దీనిని బట్టి తెలుస్తుంది. నగరంలో ప్రవేశించే ముందు బయట విడిది చేయడం వల్ల, ఆ నగర విశేషాలను తెలుసుకొనే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా తలెత్తే సమస్యలను పసిగట్టి తదనుగుణంగా మసలుకొనేందుకు వీలేర్పడుతుంది.

3. **వార్షలస్తు ప్రణామః స్యాదమంత్రార్చిత దైవతః** (శ్లోకం 5)

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

భరతుడు కొంచెం ముందుకు వెళతాడు. తాను దర్శించదలచుకొన్న ఆలయానికి బదులుగా ప్రతిమా గృహాన్ని అక్కడ చూస్తాడు. అందలి ప్రతిమలు దైవ సంబంధాలా! మానవ రూపాలా! అని వితర్కించుకొంటాడు. వాటిని చూస్తున్నప్పుడు తనకు ఆనందం కలుగుతున్నట్టు గుర్తిస్తాడు. అవి దైవ సంబంధాలైతే తలవంచి నమస్కరించాలని, మంత్రం లేకుండా నమస్కరించడం నీచ ప్రవృత్తి అని భావించాడు.

మంత్రం భారతీయ జీవన విధానంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. ప్రతి కర్మకాండకు, ప్రతి దైవకార్యానికి, ప్రతి ఆధ్యాత్మిక కృత్యానికి మంత్రంతో విడదీయరాని సంబంధం ఉంది. మననం చేసే వారిని ఉద్ధరించే మహత్ శక్తి మంత్రానికి ఉందని పెద్దలు చెబుతారు. అందువల్లనే మంత్రాన్ని ఉచ్చరించకుండా చేసే నమస్కారం నీచ ప్రవృత్తిజన్యంగా పరిగణింపబడింది. ఈ విషయాన్నే భరతుడు ఇక్కడ తెలియజేశాడు.

4. **పిపాసార్తోऽనుధావామి, క్షీణతోయాం నదీమివ** (శ్లోకం 10)

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

భరతుడు ప్రతిమా గృహంలో ప్రవేశిస్తాడు. తన వంశానికి చెందిన పూర్వ రాజుల గురించి తెలుసుకొంటూ వెళతాడు. దిలీపుడు, రఘువు, అజుడు ప్రతిమల రూపంలో తారసిల్లుతారు. ఆయా రాజుల గొప్పతనాలను, ప్రత్యేకతలను సంభావించి నమస్కరిస్తాడు. అజుని తర్వాత దశరథుడి ప్రతిమను భరతుడు గుర్తిస్తాడు. దశరథుడు మరణించాడని దేవకులికుని ద్వారా తెలుసుకొంటాడు. అతడు ప్రశ్నించగా తాను కైకేయి కుమారుడుకానని, దశరథ కుమారుడని సమాధానం చెబుతాడు. అతడి ద్వారా దశరథుడు మరణించాడని, సీతాలక్ష్మణ సహితుడై రాముడు అడవికి వెళ్ళాడని తెలుసుకొంటాడు. వెంటనే మూర్ఛిల్లుతాడు. కొంతసేపటికి ఊరట చెంది భరతుడు దేవకులికునితో ఈ మాటలంటాడు.

తండ్రిగారు, అన్నగారు లేని అయోధ్య అడవి అయిపోయింది. దాహార్తుడు ఎండిపోయిన నదికి వెళ్ళినట్టు నేను ఇక్కడికి వచ్చాను.

దశరథుడు, శ్రీరాముడు భరతుడికి చాలా ముఖ్యమైన వారు. వారే లేనప్పుడు తక్కిన వారు ఉన్నా లేనట్టే. అందువల్ల అయోధ్య నగరం అయినప్పటికీ అడవి అయిపోయిందని భరతుడు భావించాడు. అతడు కేకయ నగరం నుంచి వచ్చేటప్పుడు వారిద్దరిని కలుసుకొని నమస్కరించి ఆశీర్వాదాలు పొందాలనుకున్నాడు. అది అతడి తృష్ణ. అతడు వచ్చేసరికి నీరులేని నదిలాగ అయోధ్య అతడికి గోచరించింది. ఇక్కడ అయోధ్యను నదితోను, దశరథ, రామాదులను నీటితోను పోల్చడం జరిగింది. అంటే రాముడు, దశరథుడు ఎంత ముఖ్యమైన వారో ఇక్కడ ధ్వనిస్తుంది.

**5. గంగాయమునయోర్మధ్యే కునదీవ ప్రవేశితా (శ్లోకం 16)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

భరతుడు ప్రతిమా గృహంలో ఉన్నప్పుడే దశరథుడి ముగ్గురు రాణులు, సుమంత్రుడు అక్కడికి వచ్చారు. సుమంత్రుడు, భరతుడు పరస్పరం గుర్తించుకొంటారు. జరిగిన విషయాలు గుర్తు చేసుకొని ఇద్దరూ దుఃఖపడతారు. ముసుగు ధరించిన ముగ్గురు స్త్రీలు ఎవరని భరతుడు సుమంత్రుడ్ని ప్రశ్నిస్తాడు. సుమంత్రుడు కౌసల్యా అని చెప్పగానే భరతుడు ఆమెకు నమస్కరిస్తూ తన నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తాడు. సుమిత్రను గురించి చెప్పగానే అడవికి వెళ్ళే అవకాశం లక్ష్మణుడు తనకు లభించకుండా చేశాడని సుమిత్రకు నమస్కరించి ఆమె ఆశీర్వాదాన్ని కూడా పొందాడు. కైకేయిని గూర్చి చెప్పగానే అగ్రహోదగ్రుడవుతాడు. ఆమెను ఛీత్కరిస్తాడు.

నా తల్లి నా తల్లి వీరి మధ్య శోభించదు. గంగా యమునల మధ్య చెడు నదిగా ఈమె ప్రవేశించింది.

నా తల్లి నా తల్లి అని భరతుడు రెండుసార్లు అనడం వల్ల ఆమె దుశ్చర్యలను తలపోసి వెటకారం చేసినట్లయింది. ఉత్తమరాండ్రు అయిన కౌసల్యా సుమిత్రల మధ్య దుష్ట స్వభావం కల కైకేయి శోభించదని చెప్పడం ద్వారా వారికి ఆమెకు మధ్య ఎంతో అంతరం ఉందని స్పష్టం చేసినట్లయింది. కౌసల్యా సుమిత్రలను గంగా యమునలతో పోల్చడం, కైకేయి దుస్వభావాన్ని ఎత్తి చూపినట్లయింది. తల్లి చేసిన తప్పు తీవ్రత, దాని పర్యవసానం భరతుడ్ని ఎంతగా బాధించాయో ఇక్కడ వ్యక్తమవుతుంది. ఇది భరతుడి పాత్రకు ఎంతో ఉదాత్తత చేకూర్చే సంఘటన.

**6. భర్తృ ద్రోహాదస్తు మాతాప్యమాతా (శ్లోకం 18)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

భరతుడు కౌసల్యకు, సుమిత్రకు నమస్కరిస్తాడు. కైకేయికి నమస్కరించక పోగా, తీవ్ర పదజాలంతో నిందిస్తాడు. పెద్దల పట్ల మర్యాదను ప్రదర్శించే భరతుడు తల్లి పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించడాన్ని కౌసల్య జీర్ణించుకోలేకపోయింది. తల్లికి నమస్కరించవలసిందిగా భరతుడికి హితవు చెబుతుంది. ఇంతకు మునుపు తనకు తల్లి అని, ప్రస్తుతం కౌసల్యే తన తల్లి అని భరతుడు చెబుతాడు. కైకేయే భరతుడి తల్లి అని చెబుతూ ఆమెకు నమస్కరించమని కౌసల్య భరతుడ్ని కోరుతుంది. భరతుడు నిరాకరిస్తూ కౌసల్యతో ఈ విధంగా చెబుతాడు.

సంక్రమించిన దోషాల వల్ల స్నేహ శీలాన్ని విడిచిపెట్టే వారికి పుత్రులు పుత్రులుగా ఉండరు. ఇంతకు మునుపు లేని ఈ క్రొత్త ధర్మాన్ని ఇప్పుడు నేను స్థాపిస్తాను. భర్తకు ద్రోహం చేసే స్త్రీ ఇక మీద తల్లిగా ఉండనేరదు.

భరతుడికి దశరథుడి మీద అచంచల భక్తి. ఆయన వల్ల తనకు లోటు జరగదనే విశ్వాసం. కాబట్టి కైకేయి దశరథుడ్ని పెట్టిన ఇబ్బందిని భరతుడు సహించలేకపోయాడు. హఠాత్తుగా ఆమెకు వచ్చిన దోషాల వల్ల భర్తపట్ల ఉండదగిన స్నేహశీలం ఆమె నుంచి వెళ్ళిపోయింది. అటువంటి వారికి పుత్రులుగా ఉండటానికి ఎవ్వరూ ఇష్టపడరు. అందువల్ల పుత్రులయినప్పటికీ వారు అపుత్రులే. భర్తను ఇబ్బంది పెట్టే భార్యను ఏ కుమారుడు కూడా తల్లిగా స్వీకరింపరాదు. ఈ అపూర్వ సిద్ధాంతాన్ని తానే ప్రవేశపెడుతున్నట్టు భరతుడు స్పష్టం చేశాడు. భార్య భర్తపట్ల ఎలా మసలుకోవాలో, ఏ మాత్రం అస్తవ్యస్తమైనా పరిస్థితి ఏ విధంగా విషమిస్తుందో భరతుడి మాటల ద్వారా వెల్లడయ్యాయి. దోషాన్ని సహించని భరతుడి తీవ్ర స్వభావం కూడ దీని ద్వారా బహిర్గతమవుతుంది.

**7. అహోధాత్రా సృష్టం భవతి హృదయం వజ్ర కఠినమ్ (శ్లోకం 22)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

రాజు సత్యవాక్య పరిపాలనను నిరూపించేందుకే తానే ప్రయత్నం చేశానని కైకేయి తనను సమర్థించుకొంటుంది. ఏమి కోరావని భరతుడు ఆమెను నిలదీస్తాడు. పుత్ర పట్టాభిషేకమని భరతుడికి నచ్చజెప్పడానికి కైకేయి వ్యర్థ ప్రయత్నం చేస్తుంది. రాముడు నీకు కుమారుడు కాడా? అని భరతుడు ఆమెను నిలదీస్తాడు. ఈ సందర్భంలోనే భరతుడు కైకేయినుద్దేశించి ఈ మాటలు చెబుతాడు.

నీ రాజ కాంక్షతో రాజు ప్రాణాలను కూడా లెక్కచేయలేదు. పెద్ద కుమారుడ్ని అడవికి పంపించావు. నార చీరలు ధరించిన జానకిని చూచి కూడా నీ హృదయం ముక్కలు కాలేదు. అయ్యో! బ్రహ్మ దేవుడు నీ హృదయాన్ని ఎంత కఠినంగా సృష్టించాడు.

తీవ్రమైన కోరిక చెలరేగినప్పుడు ఇతర విషయాలేమీ మదిలో మెదలవు. భరతుడికి లభించే రాజ్యం కన్నా కైకేయికి తన పసుపు కుంకుమలే ఎక్కువ. అయినప్పటికీ ఆమె వాటిని ఖాతరు చేయలేదు. తన కుమారుడికి రాజ్యాన్ని సంపాదించి ఇవ్వడంతో సరిపుచ్చుకోలేదు సరికదా తనకు మిక్కిలి ఇష్టుడైన కుమారుడికి వనవాస క్లేశాన్ని కలిగించడానికి కూడా వెనుకాడలేదు. సాటి స్త్రీ బాధపడుతూ ఉంటే చూచి ఓర్చుకోలేని జాలి గుండె సామాన్యంగా స్త్రీలకు ఉంటుంది. అయితే అదికూడ ఆవిడకు ఉన్నట్టు కనిపించదు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొనే బ్రహ్మదేవుడు కైకేయి హృదయాన్ని ప్రత్యకంగా వజ్ర తుల్యంగా తయారు చేశాడని భరతుడు నిరసించాడు. ఇక్కడ కైకేయి పాత్రలో న్యూనత, భరతుడి పాత్రలో ఔన్నత్యం కొట్టొచ్చేట్టు కనిపిస్తాయి.

**8. ఏవం నృపతిహీనా హి విలయం యాన్తివై ప్రజాః (శ్లోకం 23)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

భరతుడు, కైకేయి మాట్లాడుకొంటూ ఉండగానే సుమంత్రుడు ప్రవేశిస్తాడు. వశిష్ట వాసుదేవాది ఋషులు, అయోధ్యా పౌరులు అతడి పట్టాభిషేకంకై వేచి ఉన్నారని ప్రకటిస్తాడు. ఈ సందర్భంగా ఈ వాక్యాలను సుమంత్రుడు భరతుడితో చెబుతాడు.

గోపాలుడు లేకపోతే ఆలనా పాలనను నోచుకోని గోవులు నశిస్తాయి. అదే విధంగానే ప్రజలు రాజు లేకపోతే నశిస్తారు.

భాసుడు ప్రజలను గోవులతో పోల్చడం వారి మంచితనాన్ని తెలియజేస్తుంది. ఏది ఏమైనా ఎదుర్కొని తమ స్థితిని చక్కబెట్టుకోలేని వారి అసహాయతను సూచిస్తుంది. రాజు ఎవరైనా తలవూపడం అనే వారి దౌర్బల్యాన్ని, స్వయం నిర్ణయాధికారానికి నోచుకోని వారి దైన్యాన్ని బోధ పరుస్తుంది. రాజు లేనప్పుడు ప్రజలు కూడా నశిస్తారని, అందువల్ల రాజు కావడం భరతుడికి తప్పనిసరి అవుతుందని సుమంత్రుడు భరతుడికి నచ్చజెప్పినట్లయింది.

**9. నాయోధ్యాతం వినాయోధ్యాసాయోధ్యాయత్ర రాఘవః (శ్లోకం 24)**

ఈ వాక్యం భాసుడు రచించిన ప్రతిమా నాటకం తృతీయాంకంలోనిది.

సుమంత్రుడు వచ్చి పట్టాభిషేకాన్ని గూర్చి భరతుడికి తెలియజేస్తాడు. ప్రజలకు రాజు ఉండవలసిన ఆవశ్యకతను ప్రస్ఫుటం చేస్తాడు. అయినా భరతుడు అంగీకరించడు. అమ్మగారికి పట్టాభిషేకం చేయమని సూచిస్తాడు. ప్రజలంతా కూడా తనను అనుసరిస్తారని చెబుతాడు. ఎక్కడికి వెళతావని సుమంత్రుడు వేసిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ విధంగా తెలియజేస్తాడు.

ఎక్కడ లక్ష్మణుడికి ఇష్టమైన రాముడు ఉంటాడో అక్కడికి వెళతాను. రాముడు లేని అయోధ్య అయోధ్య కాదు. <u>అతడు ఎక్కడ ఉంటే అదే అయోధ్య.</u>

రాముడు నివసించే అడవులకు వెళ్ళాలనే భరతుడి దృఢనిర్ణయం ఇక్కడ బహిర్గతమవుతుంది. రాముడు అయోధ్యకు ప్రాణం వంటివాడు. అయోధ్యా వాసులందరు కూడ అతడిని తమ ప్రాణంగానే భావించారు. అలాంటప్పుడు రాముడు లేని అయోధ్య శాంతిభద్రత విషయంలోనైతేనేమి, ధర్మాచరణంలోనైతేనేమి అయోధ్యగా ఉండదని భరతుడి నిశ్చితాభిప్రాయం. ధర్మాత్ముడైన రాముడు ఎక్కడ నివసిస్తాడో అక్కడ శాంతిభద్రతలకు గాని, ధర్మాచరణకుగానీ కొదువ ఉండదు. అందువల్లనే ఆయన నివాసం రాజధానితో సమానంగానే తులతూగుతుంది. కాబట్టే భరతుడు రాముడు ఎక్కడ ఉంటే అదే అయోధ్య అని అన్నాడు. ఇక్కడ రాముడి వ్యక్తిత్వంతో పాటు భరతుడి సునిశిత దీర్ఘదృష్టి కూడ వెల్లడవుతుంది.

ఇంతవరకు ప్రతిమా నాటకంలోని మూడు అంకాల్లో చోటు చోసుకొన్న ముఖ్యమైన సందర్భసహిత వ్యాఖ్యలను కొన్నిటిని పరిశీలించాము. తర్వాత అంకాల్లో చోటు చేసుకొన్న వాటిని తర్వాత పాఠంలో వివరించడం జరిగింది.

**డా॥ ఉపమాండ్ల ప్రహ్లాదనాయుడు**
**అసోసియేట్ ప్రొఫెసర్**
**సంస్కృత విభాగం**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**

పాఠం - 13

# ప్రతిమా నాటకం - సందర్భసహిత వ్యాఖ్యలు

ప్రతిమా నాటకం గురించి చెప్పుకొన్న ఇంతకు ముందు పాఠంలో ఒకటవ అంకం నుంచి మూడవ అంకం వరకు ఉన్న సందర్భసహిత వ్యాఖ్యలను గురించి చెప్పుకొన్నాం. ఈ పాఠంలో నాలుగవ అంకం నుంచి ఏడవ అంకం వరకు గల నాలుగు అంకాల్లోని ముఖ్యమైన సందర్భసహిత వ్యాఖ్యల గురించి ఇప్పుడు ఆలోచిద్దాం.

1. **తమహంద్రష్టుమిచ్ఛామి దైవతం పరమం మమ (శ్లోకం 3)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

భరతుడు రామ సందర్శనార్థం అడవికి వెళతాడు. సుమంత్రుడు కూడ అతడి వెంట వెళతాడు. ధర్మమార్గాన్ని అవలంబించే రాముడెక్కడ? మహారాజు ప్రతినిధి ఎక్కడ? కైకేయి ప్రత్యాదేశమెక్కడ? కీర్తిపాత్రుడెక్కడ? సత్యసంధుడైన రాకుమారుడెక్కడ? అని సుమంత్రుడికి భరతుడు పలు ప్రశ్నలు వేస్తాడు. ఈ సందర్భంలోనే ఈ మాటలు అంటాడు.

మా తల్లికి ప్రీతి కలిగించేందుకు ఎవరిచేతైతే రాజ్యలక్ష్మి కూడా విడిచి పెట్టబడిందో ఆనా పరమ దైవాన్ని రాముణ్ణి చూడాలనుకొంటున్నాను.

భరతుడు రాముణ్ణి తన పాలిట పరమ దైవముగా పరిగణించాడు. ఎందుకు? ఇతరుల ప్రీతి కోసం, ఇతరుల సంతోషం కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసినందుకు. దీన్నిబట్టి త్యాగం దైవత్వమని, అవాఛంనీయ స్వార్థం అసురత్వమని ప్రతిపాదించినట్లయింది. ఇక్కడ రాముడి ఔన్నత్యమే కాక భరతుడికి రాముడిపట్ల గల భక్తి కూడ వ్యక్తమవుతుంది.

2. **సత్యం శీలం చ భక్తిశ్చయేషు విగ్రహవత్ స్థితా (శ్లోకం 4)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

భరతుడు అడవిలో ప్రవేశిస్తాడు. రాముడు సుగుణాలను పేర్కొని అతడెక్కడ ఉన్నాడో చెప్పమని సుమఅత్రుడ్ని కోరతాడు. ఈ సందర్భంలో సుమంత్రుడు భరతుడికి ఈ విధంగా సమాధానం చెబుతాడు.

ఈ ఆశ్రమ ప్రదేశంలోనే మహాయశస్కులైన రాముడు, సీత, లక్ష్మణుడు ఉన్నారు. వారు సత్యం, శీలం, భక్తి విగ్రహాల్లా ఉన్నారు.

ఇక్కడ సుమంత్రుడు రామసీతాలక్ష్మణులను కీర్తిమంతులని పేర్కొన్నాడు. వారు ముగ్గురు సౌఖ్యాలను, సంపదలను, ఆప్తజనులను త్యాగం చేశారు. కాబట్టే వారు కీర్తిమంతులయ్యారు. త్యాగం వల్ల కీర్తి, విపరీత స్వార్థం వల్ల ఆర్తి వస్తాయని అభిప్రాయం. పైగా సుమంత్రుడి శ్లోకంలో రామసీతాలక్ష్మణుల ప్రత్యేకతలను కూడ బయటపెట్టాడు. సుగుణాల ఉచ్ఛస్థాయి వారి ప్రత్యేకలది. రాముడు సత్యానికి, సీత శీలానికి, లక్ష్మణుడు భక్తికి ప్రతీకలు. ఆయా గుణాలు రూపాలు ధరిస్తే రామసీతాలక్ష్మణులయ్యారని అభిప్రాయం. ఈ అంశం ఆయా పాత్రల ఔన్నత్యాన్ని ఆవిష్కరించబడడమే కాక సుమంత్రుడి సదసద్వివేకాన్ని, గ్రహణశక్తిని కూడా వెల్లడిస్తుంది.

3. **అలం గురుజనాపవాద మభిధాతుమ్ (గద్యం)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

వనంలో ప్రవేశించిన భరతుడు రాముడి సుగుణాలను ఏకరువు పెడతాడు. అతడెక్కడున్నాడో తెలియజేయవలసిందిగా సుమంత్రుడ్ని కోరతాడు. సుమంత్రుడు రామసీతాలక్ష్మణుల సుగుణాలను పేర్కొని వారి ఆశ్రమంలోనే ఉన్నారని భరతుడికి చెబుతాడు. తన రాకను ప్రకటించవలసిందిగా భరతుడు సుమంత్రుడ్ని కోరతాడు. ఏమని ప్రకటించాలో తెలుపమని సుమంత్రుడు వేసిన ప్రశ్నకు సమాధానంగా రాజ్యలుబ్ధ కైకేయి కుమారుడు వచ్చాడని ప్రకటించ గోరతాడు. ఈ సందర్భంలో భరతుడి వాక్ తీవ్రతను ప్రతిఘటిస్తూ సుమంత్రుడు ఈ మాటలంటాడు.

పెద్దవారిని నిందించడం తగదు.

భరతుడిలో కైకేయి పట్ల ఏర్పడిన ద్వేషం, అసహ్యం తగ్గకపోగా పెరుగుతుండడం ఇక్కడ కన్పిస్తుంది. ఎవరికైనా పొరబాట్ల దొర్లడం సహజం. పెద్దవారు కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. కాబట్టి పెద్దవారి పెద్దరికాన్ని దృష్టిలో పెట్టుకొని, వారి పొరబాట్లు పట్టించుకోకూడదని సుమంత్రుడి అభిప్రాయం. ఎవరిని నిందించినా, నిందించేవారి హృదయమే కాక, వినేవారి హృదయం కూడా గాయపడుతుంది. అలాంటప్పుడు పెద్దలను నిందిస్తే వినేవారి హృదయం మరీ గాయపడుతుంది. అందుకే భరతుడు సుమంత్రుడ్ని వారించాడు.

**4. భక్తిమానాగతః కశ్చిత్ కథం తిష్ఠతు యాత్వితి (శ్లోకం 5)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

భరతుడు తన రాకను గురించి రాముడికి తెలియజేయమని సుమంత్రుడ్ని కోరతాడు. మొదట తల్లిని నిందిస్తాడు. తర్వాత తనను నిందించుకొంటాడు. ఇవేవీ చెప్పనని సుమంత్రుడు చెప్పగా భరతుడే స్వయంగా చెప్పుకోనేందుకు పూనుకొన్నాడు. ఈ సందర్భంలోనే భరతుడు ఈ శ్లోకం చెప్పాడు.

గుణాలు లేనివాడు, చేసిన మేలు మరచేవాడు, పామరుడు, మొరటువాడు అయినా భక్తి కలవాడు వచ్చాడు. ఇక్కడ ఉండాలో వెళ్ళిపోవాలో సెలవివ్వండి.

ఆత్మస్తుతి, పరనింద, ఆత్మనింద, పరస్తుతి ఇవేవీ మంచివి కాదని పెద్దలు చెబుతారు. అయినప్పటికీ భరతుడు ఇక్కడ ఆత్మనింద చేసుకొన్నాడు. కారణం తన నిర్దోషిత్వాన్ని రాముడు గుర్తించాలనే తపన. నిర్గుణుడు. కృతఘ్నుడు, పామరుడు, మొరటివాడు అని తన దోషాలను మొదట చెప్పాడు. తర్వాత తన భక్తిని వెల్లడించాడు. తర్వాత వాటివల్ల ముందువి నిర్వీర్యమవుతాయి అనే న్యాయం వల్ల తన భక్తి ముందు దుర్గుణాలన్నీ దిగదుడుపేనని భరతుడు భావించి ఈ క్రమాన్ని చెప్పి ఉండవచ్చు. ఉండాలో వెళ్ళాలో అని ప్రశ్నించడం రాముడి మనోగతాన్ని తెలుసుకోదలచిన అతడి ఉత్సుకతను వెల్లడి చేసింది.

**5. సస్నేహః శ్రుతిపథమిష్టతః ప్రవిష్టః (శ్లోకం 6)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

రాముడ్ని కలుసుకోవడానికి వచ్చిన భరతుడు తనరాకను బిగ్గరగా ప్రకటిస్తాడు. అతడి కంఠ స్వరం రాముడి చెవిలో పడుతుంది. అతడు సంతోషిస్తాడు. విన్నావా లక్ష్మణా అని ప్రశ్నిస్తాడు. సీతను కూడా వినమని ఆదేశిస్తాడు. తాను విన్న ఆ కంఠ స్వరం తనలో ఎటువంటి అనుభూతిని కలిగించిందో ఈ విధంగా తెలియజేస్తాడు.

తండ్రి కంఠ స్వరంలా ఉండే ఈ కంఠ స్వరం ఎవరిది? గాంభీర్యంలో మేఘనాదాన్ని మించిపోతూ ఉంది. నా హృదయంలో బంధుశంకను కలిగిస్తూ ఉంది. ఈ కంఠ స్వరం వీనులకు విందుగా ఉంటూ ఆనందాన్ని కలిగిస్తూ ఉంది.

భరతుడు వచ్చినట్టు తెలియకుండానే భరతుడి కంఠ స్వరంలో తండ్రి కంఠ స్వరాన్ని రాముడు గుర్తించాడు. పైగా అతడి రాక తనకు ఆత్మీయశంక కలిగిస్తూ ఉందని చెబుతాడు. భరత దశరథుల పట్ల రాముడికున్న అభిమానం ఇక్కడ వ్యక్తమవుతుంది. బంధువుల గురించి తెలుసుకోకుండానే బంధుశంక కలగడం యాదృచ్ఛికమే అయినప్పటికి, ఇది భావి సంఘటనా సూచకం. ఆత్మీయుల రాకగానీ, వారి మాటగానీ ఎవరికైనా ఆనందాన్నే కలిగిస్తాయి. ఇది ప్రకృతి సిద్ధం. రాముడికి కూడా మానవ సహజమైన ఈ ఆనందమే కలగడం గమనార్హం. ఇక్కడ మానవ స్వభావాన్ని భాసుడు చక్కగా ఆవిష్కరించాడు.

**6. సంక్రాంతం యత్రతే, రూపమాదర్శ ఇవతిష్ఠతి (శ్లోకం 11)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

రామలక్ష్మణులిద్దరు తాము విన్నది బంధు స్వరమేనని ధృవీకరించుకొంటారు. వచ్చిన వారెవరో చూసి రమ్మని రాముడు లక్ష్మణుడ్ని పురమాయిస్తాడు. లక్ష్మణుడు వెళ్ళి చూసి భరతుడ్ని రాముడుగా భ్రమిస్తాడు. రాముడి పోలికలే అని సరిపుచ్చుకుంటాడు. సుమంత్రుడి ద్వారా భరతుడని తెలుసుకుంటాడు. భరతుడ్ని దగ్గరకు తీసుకొని ఆశీర్వదిస్తాడు. _డి కోరిక మేరకు వచ్చినవాడు భరతుడని రాముడితో ఈ విధంగా నివేదిస్తాడు.

నీకు చాలా ఇష్టమైన భ్రాతా! భ్రాతృవత్సలుడైన భరతుడు. నీ రూపమే అతడికి సంక్రమించి అద్దంలో కనిపించే రూపంలా ఉంది.

భరతుడంటే రాముడికెంతో ఇష్టం. భరతుడికి కూడా భ్రాతాల మీద అపార వాత్సల్యం. ఇక్కడ పరస్పరానురక్తి గోచరిస్తుంది. అన్నదమ్ముల్లో ఉండవలసిన ఆత్మీయత ద్యోతకమవుతుంది. రాముడిలాగే భరతుడు కూడా ఉండడం యాదృచ్ఛికమే అయినా ఒకే తండ్రికి జన్మించిన కుమారులకు ఒకే విధమైన రూపం ఉండడం సహజమేనని బోధపడుతుంది. పైగా ఒక పాయసంలోని అంశాలే రామభరతులు ఇద్దరూ కూడా. రూప సాదృశ్యానికి అది కూడా కారణం కావచ్చు.

**7. కీ దృశస్తనయస్నేహో భ్రాతృ స్నేహోయమీ దృశః (శ్లోకం 12)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

భరతుడు వచ్చాడా అని రాముడు లక్ష్మణుడ్ని ప్రశ్నిస్తూ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తాడు. భరతుడ్ని చూసేందుకు సంసిద్ధం కమ్మని సీతను కోరతాడు. సీత కూడ భరతుడి రాక పట్ల కుతూహలం వెలిబుచ్చుతుంది. ఈ సందర్భంలోనే రాముడు తన మనోగతాన్ని ఈ విధంగా తెలియజేస్తాడు.

నాకు ఇప్పుడు గదా అవగతమవుతుంది. మా తండ్రి ఎంతటి దుష్కరమైన పని చేశాడో! తనయ స్నేహం ఎలాంటిదో భ్రాతృ స్నేహం కూడా అలాంటిదే.

భరతుడు అన్న రాముణ్ణి విడిచి ఉండలేకపోయాడు. అందుకే అడవికి వచ్చాడు. ఇది అతని భ్రాతృ మమకారాన్ని సూచిస్తుంది. ఇలాగే దశరథుడికి కూడా రాముడి మీద అపార పుత్ర వాత్సల్యం. దాన్ని కూడా పక్కనబెట్టి కైకేయి కోరిన వరాలిచ్చాడు. అది అతడికి సంబంధించినంత వరకు దుష్కర కార్యమే. భరతుడి రాకకు స్పందించినా రాముడు ఆ దుష్కర కార్యపు మోతాదును గుర్తించగలిగాడు. అందుకే సీతతో కూడ ఆమాట అన్నాడు. తండ్రికి బిడ్డల మీద ఎంత గొప్ప వాత్సల్యముంటుందో అన్నదమ్ముల మధ్య కూడ అలాంటి గొప్ప అనుబంధమే ఉంటుందని రాముడు చెప్పడం రామ భరతుల పరస్పర ప్రగాఢ ప్రేమానురాగాల పెంపును తెలియజేస్తుంది.

8. **తుషార పూర్ణోత్పలపత్రనేత్రా హర్షాస్రమాసారమివోత్సృజన్తీ (శ్లోకం 13)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

భరతుణ్ని ప్రవేశ పెట్టమంటావా అని లక్ష్మణుడు రాముణ్ని ప్రశ్నిస్తాడు. భరతుణ్ని తీసుకొచ్చేందుకు లక్ష్మణుడు సంసిద్ధమవుతాడు. రాముడు అతన్ని వారిస్తాడు. ఈ సందర్భంలోనే లక్ష్మణుణ్ని ఉద్దేశించి రాముడు ఈ శ్లోకం చెబుతాడు.

మాతృ భావంతో ఈమె అతణ్ని తీసుకురావడానికి వెళుతుంది. కలువ పూల మీద మంచు బిందువులు చోటు చేసుకున్నట్లు పుత్ర స్నేహం వల్ల ఆమె కళ్ళ నుంచి ఆనంద భాష్పాలు జారుతాయి.

మొదట భరతుణ్ని తీసుకువచ్చేందుకు లక్ష్మణుణ్ని వెళ్ళమని కోరిన రాముడు వెంటనే మనస్సు మార్చుకొన్నాడు. లక్ష్మణుడు భరతుడి పట్ల సుముఖంగా ఉన్నప్పటికీ భరతుణ్ని సమీపించగానే ప్రతీకారం, ఆగ్రహం ప్రజర్విల్లుతాయేమో అని భయం కూడ కారణం కావచ్చు. సహనశీల సీత అయితే అతడి మనస్సు గాయపడకుండా ఆహ్వానించగలదు. పైగా సీతపట్ల భరతుడికెంతగానో భక్తి ప్రపత్తులున్నాయి. అందువల్ల ఆమె వెళితే అతడికి ఇతోధిక ఆనందం కలిగే అవకాశం ఉంది. సీత కళ్ళను కలువలతోను, ఆమె ఆనంద భాష్పాలను మంచుతోను పోల్చడం అతి రమణీయంగా ఉంది. సీత భాష్పాలు కూడ మంచులాగే మాయమవుతాయని అభిప్రాయం. ఇక్కడ వదినా మరదుల మధ్య ఉండవలసిన ప్రగాఢ పవిత్ర బంధాన్ని ఆవిష్కరించడం జరిగింది. తనకు రావలసిన రాజ్యం భరతుడికి సంక్రమిస్తున్నప్పటికీ రాముడికి అతడిపట్ల అణు మాత్రం ద్వేషం లేదు పైగా ప్రగాఢానురాగమే ఉంది. ఇక్కడ రాముడి నిర్వికార సమస్థితి, నిశ్చితాభిప్రాయం వ్యక్తమవుతాయి.

9. **గణఇవ బహ్వపరాద్ధమాయుషామే! (శ్లోకం 18)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

రాముడి సూచన మేరకు సీత భరతుణ్ని తీసుకురావడానికి వెళుతుంది. భరతుణ్ని మొదట రాముడుగానే భ్రమపడుతుంది. తర్వాత భరతుణ్ని గుర్తించి అన్న దగ్గరికి రమ్మని ఆహ్వానిస్తుంది. సుమంత్రుడు కూడా జానకిని గుర్తిస్తాడు. భరతుడు ఆమెకు అభివాదం చేసి ఆమె గొప్పతనాన్ని శ్లాఘిస్తాడు. సీత సూచన మేరకు భరతుడు వెళ్ళి రాముడికి నమస్కరిస్తాడు. రాముడతడి మీద అంతులేని భ్రాతృ వాత్సల్యాన్ని ప్రదర్శిస్తాడు. సుమంత్రుణ్ని రాముడు క్షేమమడుగుతాడు. తన తండ్రి స్థితిని ప్రస్తావిస్తాడు. ఈ సందర్భంలోనే సుమంత్రుడు రాముడితో ఈ శ్లోకం చెబుతాడు.

రాజు మరణం, నీ ప్రవాసం, భరతుడి విషాదం కులానికేర్పడిన అనాథత్వం ఈ విధంగా సహింపరాని అనేక అనుభవాలు ఏర్పడ్డాయి. చిరకాలం జీవించడమనేది మేలులాగే కనిపించినా కీడే.

తనకు ఆప్తుడు, ఆత్మీయుడు, అనుగు మిత్రతుల్యుడు అయిన దశరథుడు మరణించడంతో అతడితోబాటు మరణించలేకపోయాననే అన్న ఆవేదన సుమంత్రునిలో కలిగింది. పర్యవసానంగా తాను చాలా కాలం జీవించానన్న స్పృహ ఏర్పడింది. అలా జీవించడం మూలంగా అనేక అయిష్టాలు అతడికి కలిగాయి. అవి ఏ మాత్రం సహింపరానివి. ఎదురు చూడనివి. జరిగిన నాలుగు ఒకదాని మించినది మరొకటి. వీటన్నిటికి తన దీర్ఘకాలిక జీవనమే కారణమని సుమంత్రుడు వాపోయాడు. రాజకుంటుంబం పట్ల అతడికున్న ప్రగాఢ భక్తి, క్షేమకాంక్ష, సాన్నిహిత్యం ఇక్కడ వెల్లడవుతాయి. అనుకోని దుర్భర సంఘటనలకు మౌన ప్రేక్షకుడిగా ఉండవలసిన దుస్థితి తనకు ప్రాప్తించినందుకు సుమంత్రుడు ఇక్కడ తన నిర్వేదాన్ని తెలియజేసినట్లైంది.

**10. నామ్నైవ భవతో రాజ్యం కృతరక్షం భవిష్యతి (శ్లోకం 19)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

రాముడి శోకాన్ని సుమంత్రుడి మాటలు అధికతరం చేస్తాయని సీత చెబుతుంది. ఇప్పుడే నిగ్రహించుకొంటానని రాముడు ప్రతిస్పందిస్తాడు. లక్ష్మణుడ్ని నీళ్ళు తీసుకొని రమ్మంటాడు. ఇప్పుడు తనవంతు వచ్చింది కాబట్టి తాను నీళ్ళు తీసుకు రావడమే న్యాయమని భరతుడు వెళ్ళి నీళ్ళు తీసుకొస్తాడు. రాముడపుడు లక్ష్మణుడి శుశ్రూష తగ్గిపోయిందని చెబుతూనే లక్ష్మణుడిక్కడ నాకు శుశ్రూష చేస్తుంటాడు. భరతుడు అక్కడ శుశ్రూష చేస్తాడు అని చెబుతాడు. ఈ సందర్భంలో భరతుడు రాముడితో ఈ మాటలు అంటాడు. నేను ఇక్కడ శ రీర రూపంలోను అక్కడ సేవా రూపంలోను ఉంటాను. <u>నీ పేరు చేతనే రాజ్యం సురక్షితం కాగలదు.</u>

భరతుడు భౌతికంగా రాముడితోనే గడపాలను కొన్నాడు. అయినప్పటికీ అయోధ్యలో కూడ రామ కార్యాలను సవ్యంగా జరిపించాలనుకొన్నాడు. ఇది రామ వియోగాన్ని క్షణ మాత్రం కూడా సహించలేని భరతుడి మనస్తత్వాన్ని ఆవిష్కరిస్తుంది. రాముడితో ఉంటూనే రామకార్యాలు చెయ్యించడం సులభంగా అయ్యే పనికాదు. అతి కష్టసాధ్యమే. అయినప్పటికి భరతుడు దానికి ఉపక్రమించాడు. కారణం రామభక్తే. రామనామంతో రాజ్యాన్నిసురక్షితం చేస్తానని కూడా భరతుడు చెప్పాడు. అయోధ్యా ప్రజలకు రాముడి పట్ల, రామ నామం పట్ల ఉన్న ప్రగాఢ భక్తి, అంచంచల విశ్వాసం అతడికి తెలుసు. అందువల్లనే అన్నీ కూడ సవ్యంగా జరుగుతాయని అతడి విశ్వాసం. రామ నామ మహిమ పై కూడ భరతుడికెంతో నమ్మకముండేదని దీన్నిబట్టి తెలుస్తుంది.

**11. కథం భవాన్ నీచపథే ప్రవర్తతే (శ్లోకం 20)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

భరతుడు తాను కూడా రాముడితో అడవిలో ఉంటాననే అభిప్రాయాన్ని వ్యక్తపరచగానే రాముడు సున్నితంగా తిరస్కరిస్తాడు. అతడి ఆలోచన సరిగాదంటాడు. తన పద్ధతి అలా కాదని తెలియజేసే సందర్భంలో రాముడు భరతుడితో ఈ మాటలంటాడు.

తండ్రి గారి ఆదేశం వల్ల నేను వనానికి వచ్చానే కాని భయం వల్లనో, దర్పం వల్లనో, విభ్రమం వల్లనో కాదు. సత్యమే మన కుల సంపద. <u>ఎందుకు నీచ మార్గంలో ప్రవర్తించాలనుకొంటావు.</u>

తన వన వాసం పితృవాక్ పరిపాలనార్థమేనని రాముడు స్పష్టం చేశాడు. ఆ విషయంలో తన మనస్సులో ఎటువంటి అస్పష్టత లేదని తెగేసి చెప్పాడు. వంశానుగతంగా తమకు సంక్రమించిన సంపద సత్యమేనన్నాడు. సత్యాన్ని విడిచి పెట్టి నీచ మార్గంలో ప్రవర్తించడం నింద్యమని సుస్పష్టం చేశాడు. భరతుడు తనంతట తానే అడవికి రావడం, అక్కడ నివసించాలనుకోవడం సబబు కాదని అందుకు తండ్రి ఆజ్ఞ లేదని ఇక్కడ ధ్వని పూర్వకంగా రాముడు తెలియజేసినట్లైంది.

**12. ధిగ్ భో! విధేర్యది బలం పురుషోత్తమేషు (శ్లోకం 22)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

సుమంత్రుడు తక్షణ కర్తవ్యాన్ని గురించి రాముడ్ని ప్రశ్నిస్తాడు. కైకేయి అభిమతం ప్రకారం చేయడమే సముచితమని రాముడు సూచిస్తాడు. తనను కనికరించవలసిందిగా భరతుడు రాముడ్ని కోరతాడు. భరతుడి దైన్యపూర్వక ప్రార్థనను

రాముడి దృష్టికి తెస్తూ రాముడి ఆలోచన ఏమిటని సీత అతడిని ప్రశ్నిస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానంగా రాముడు సీతనుద్దేశించి ఈ విధంగా చెబుతాడు.

తన కుమారుడి విశిష్ట గుణాలను చూడకనే స్వర్గానికి వెళ్ళిన రాజును గురించి ఆలోచిస్తున్నాను. ఈ విధంగా మంచి గుణాలు కల బిడ్డలను కన్న పుణ్యవంతుల పట్ల కూడా విధి బలీయంగా, అవాంఛనీయంగా ప్రవర్తిస్తుంది.

తల్లి ప్రతిపాదన ప్రకారం భరతుడికి రాజ్యం సంక్రమిస్తుంది. రాజ్య భోగాల్లో తేలే అదృష్టం సిద్ధిస్తుంది. అయినప్పటికీ భరతుడు అలా చేయలేదు. పైగా తనకు సంక్రమించనున్న రాజ్యాధికారాన్ని, సౌఖ్యాన్ని తృణ ప్రాయంగా తిరస్కరించాడు. సర్వ విధాలా త్యాగానికి సంసిద్ధుడయ్యాడు. ఇటువంటి గుణం సామాన్యుల్లో ఉండడం అరుదు. ఇది గొప్పవారిలోనే ఉంటుంది. తన కుమారుడిలో ఇంత గొప్ప గుణాన్ని తిలకించగలిగిన ఏ తండ్రి అయినా పులకించిపోతాడు. సుగుణవంతుడైన దశరథ మహారాజు తన కుమారుడైన భరతుడిలోని ఈ సుగుణాన్ని చూడడం తటస్థించి ఉంటే ఎంతగానో హర్షించి ఉండేవాడని అభిప్రాయం. అందువల్లనే ఈ సమయంలో తన తండ్రి ఉండి వుంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు. ఉత్తమ పుత్రులకు జన్మనిచ్చే తండ్రులను విధి సన్మానించవలసి ఉంది. అయితే దురదృష్టవశాత్తు అలా జరగడం లేదు. అటువంటి తండ్రులకే ఎక్కువ కష్టాలు కలుగుతున్నాయి. ఇది విధి వైపరీత్యం కాక మరేమిటని రాముడు తన విచారాన్ని వెలిబుచ్చాడు. ఇక్కడ రాముడి పాత్రకు, భరతుడి పాత్రకు, దశరథుడి పాత్రకు కూడ విశిష్టత చేకూరినట్లయింది.

**13. తావత్ భవిష్యామ్యనయోర్విధేయః (శ్లోకం 25)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

కైకేయీ అభిమతానుసారం భరతుడే రాజ్యాన్ని పాలించాలని రాముడు స్పష్టీకరిస్తాడు. మరో మార్గం లేకపోవడం వల్ల దానికి అంగీకరిస్తూనే భరతుడు ఒక షరతు పెడతాడు. రాముడు అడిగిన మీదట ఆ షరతును అతడికి చెబుతాడు. పదునాలుగు సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత నీవు ఇప్పుడు నా చేతిలో పెట్టిన రాజ్యాన్ని నీవే స్వీకరించాలని భరతుడు రాముడ్ని కోరతాడు. రాముడు అంగీకరిస్తాడు. మరో వరం కూడా తనకు కావాలని భరతుడు రాముడ్ని కోరే సందర్భంలో ఈ విధంగా చెబుతాడు.

నీ పాదాలను ధరించే నీ పాదుకలను శిరసా నమస్కరించేందుకు నాకు ఇవ్వు. నీవు కార్యం సఫలం చేసుకొని వచ్చే వరకు నేను వాటికి విధేయుడనై ఉంటాను.

పాదుకలు మానవుడి పాదాలను మోస్తాయి. అశుభ్రమైన ప్రదేశాలకు కూడా వెళతాయి. అందువల్ల వాటికి ప్రాధాన్యత ఉండదు. అలాంటి వాటిని భరతుడు కోరతాడు. రాముడి పాదాలు మహనీయాలు కాబట్టి అతడి పాదుకలు కూడా మహనీయాలే. రాముడి శరీరంలోని ప్రతి భాగం వంద్యము, పవిత్రమూ అయినట్టే రాముడి ప్రతి వస్తువు కూడా వంద్యము, పవిత్రము కాగలదు. అందున రాముడి పాదాలు మోసే అదృష్టాన్ని పొందిన అతడి పాదుకల గొప్పదనం అనుపమం, అనంతం. ఆ పాదుకల్లో రాముడ్ని దర్శించుకొని, ఆ స్ఫూర్తితోనే సులభంగా రాజ్యాన్ని పాలించవచ్చని భరతుడి ఆలోచన. అందుకే రామపాదుకలను అతడు కోరాడు. దీనిని బట్టి భరతుడి ఆర్జవం, మహోన్నత వ్యక్తిత్వం వెల్లడవుతాయి.

**14. అచిరైణైవ కాలేన భరతేనాద్య సంచితమ్ (శ్లోకం 26)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం చతుర్థాంకంలోనిది.

కైకేయి వరం వల్ల తనకు సంక్రమించిన రాజ్యాన్ని భరతుడు నిరాకరిస్తాడు. యుక్తి యుక్తంగా బోధపరచి రాముడు భరతుడి చేత రాజ్యాన్ని అంగీకరింపజేస్తాడు. వనవాసానంతరం రాముడే రాజ్యాన్ని స్వీకరించే షరతు మీద భరతుడు

రాజ్యాన్ని పాలించేందుకు ఇష్టపడతాడు. రాముడి పాదుకలను తనకు అనుగ్రహించవలసిందిగా భరతుడు ఒక వరాన్ని కోరతాడు. దీనికి స్పందిస్తూ రాముడు తనలో ఇలా అనుకొంటాడు.

సుదీర్ఘ కాలంలో నేను కించిత్ కీర్తిని పొందాను. <u>భరతుడు అచిర కాలంలోనే ఇప్పుడే ఆ యశస్సును సంపాదించాడు.</u>

పెద్దల మాటలను పాలించడం, వారు చెప్పినట్లు ఆచరించడం, సద్గుణాలను అవలంభించడం కీర్తి కారకాలు. రాముడు పెద్దలకు విధేయుడు. అందువల్ల పెద్దలను చిరకాలం సేవించి కొంత కీర్తిని మాత్రం సంపాదించ గలిగాడు. సూక్ష్మంలో మోక్షం అన్నట్లు రామ పాదుకలను కోరి పొందడం ద్వారా రాముడు సంపాదించిన యశస్సును అచిర కాలంలో పొందినట్లయింది. ఇక్కడ భరతుడి పట్ల రాముడికున్న మంచి అభిప్రాయం, భరతుడి వ్యక్తిత్వం వెల్లడవుతున్నాయి.

# పంచమాంకం

1. **కష్టంభో నృపతేర్ధురం సుమహతీమేకః సముత్కర్షతి (శ్లోకం 1)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

రాముడ్ని తీసుకు వెళ్ళడానికి భరతుడు అడవికి వస్తాడు. రాముడు భరతుడి కోరికను అంగీకరించడు. పైగా అయోధ్యారక్షణకై అతడ్ని నియోగిస్తాడు. భరతుడు విఫల మనోరథుడై తిరిగి వెళతాడు. ఈ నేపథ్యంలో భరతుడ్ని గురించి ఆలోచిస్తూ రాముడు ఈ విధంగా తలపోస్తాడు.

తండ్రి లేని రమ్యమైన అయోధ్యను విడిచి నాకు పట్టాభిషేకం చెయ్యాలనే ప్రయత్నంలో భరతుడు నా దగ్గరకు వచ్చాడు. గుణనిధియైన అతడు నగర రక్షణ కోసం మళ్ళీ అక్కడికి పంపబడ్డాడు. <u>అయ్యో కష్టం! ఒంటరిగానే రాజ్య భారాన్ని భరిస్తున్నాడు.</u>

భరతుడు భౌతికంగా వెళ్ళినప్పటికీ మానసికంగా రాముడితోనే ఉన్నాడు. ఈ విధంగానే భరతుడు వెళ్ళినప్పటికీ రాముడు అతన్ని గురించే ఆలోచిస్తున్నాడు. ఇది అన్నదమ్ముల అనుబంధ ప్రగాఢతను ఆవిష్కరిస్తూ ఉంది. తాను తండ్రి లేకపోవడం వల్ల మంచీ చెడూ చెప్పే సన్నిహితులు అతడికి అందుబాటులో ఉండరు. అందువల్ల ఆ స్థితి అతడికి దుర్భరమే. ఈ స్థితిని భరించలేక రాముడికి రాజ్యం కట్టబెట్టాలని భరతుడు అడవికి వచ్చాడు. అయినా ఆ ప్రయోజనం నెరవేర లేదు. రామ నియోగంతో మళ్ళీ అయోధ్యకే వెళ్ళవలసి వచ్చింది. ఒంటరిగా, దుర్భరంగా రాజ్యపాలన సాగించవలసి వచ్చింది. అందువల్ల రాముడి సానుభూతికి పాత్రుడయ్యాడు. పదే పదే అతడి మనస్సులో మెదలసాగాడు. ఇది భరతుడి పాత్ర విశిష్టతను చక్కగా ఆవిష్కరిస్తూ ఉంది.

2. **తత్రైవ పునః పతన్తి (శ్లోకం 4)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

సీత వనంలోని చెట్లకు నీరు పోస్తూ ఉంటుంది. అప్పుడే వచ్చిన రాముడికి స్వాగతం చెబుతుంది. రాముడు కూడా ఆమెను సముచితంగా సంభావిస్తాడు. సీత రాముడి ముఖంలోని విషాద ఛాయల్ని గుర్తిస్తుంది. కారణ మడుగుతుంది. ఆ సందర్భంలో రాముడు సీతతో ఈ విధంగా చెబుతాడు.

యముడి బాణాల దెబ్బల చేత నా హృదయం పుండై ఇంతవరకు ఆరలేదు. మళీఅళ కూడ నానా శోక బాణాలు అక్కడే అక్కడే తగులుతున్నాయి.

ఇక్కడ మానవ సహజమైన రాముడి హృదయ దౌర్బల్యం అభివ్యక్తమవుతూ ఉంది. ప్రాణుల కర్మలను బట్టి శిక్ష విధించేవాడు యమధర్మరాజు. యముడు తన శిక్షను అమలుపరచేందుకు ప్రాణులను యమపురికే తీసుకు వెళ్ళనక్కర లేదు. వారు భూ లోకంలో ఉన్నప్పుడు కూడా వారికి విధించిన శిక్షలను అమలు పరచవచ్చు. భారతం ఆది పర్వంలో మాండవ్య మహర్షికి కూడా ఈ విధంగానే శిక్షను అమలుపరచడం జరిగింది. ఆ విధంగానే రాముడి మీద కూడా కష్టాలు అనే బాణాలను ప్రయోగించి బాగా గాయపరిచాడు. ఆ పుండు ఆరక ముందే అనేక శోక బాణాలు అక్కడే గ్రుచ్చుకుంటూ ఆయాసాన్ని కలిగింపసాగాయి. రాముడు అవతార పురుషుడు. ధీరోదాత్త నాయకుడు. అతడికి ఇటువంటి హృదయ దౌర్బల్యం ఉండకూడదు. అయినప్పటికీ అతడు మానవుడే. కష్టపరంపరను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు అతనిలోను చలనం కలుగక తప్పలేదు. అతడి స్థితప్రజ్ఞ కూడా సడలక, చలించక తప్పలేదు. రాముడి పాత్రలోని వివిధ కోణాలను భాసుడు ఇక్కడ చక్కగా ఆవిష్కరించాడు.

**3. తాతస్య రామస్య చ సానురూపామ్ (శ్లోకం 5)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

సీత రాముడి శోక కారణాన్ని ప్రశ్నిస్తుంది. నానా శోకాలు తనను చుట్టిముట్టిన విధానాన్ని రాముడు తెలియజేస్తాడు. ప్రస్తుతం వచ్చిన కష్టమేమని సీత ప్రశ్నిస్తుంది. మరుసటి రోజే తన తండ్రి సాంవత్సరికం వస్తూ ఉందని రాముడు చెబుతాడు. పితృ శ్రాద్ధం తన కర్తవ్యమని తెలియజేస్తాడు. ఈ సందర్భంలోనే సీతతో రాముడు ఇలా చెబుతాడు.

నా దుస్థితి వారికి తెలుసు కాబట్టి నేను చేసే దానితోనే పితృదేవతలు తృప్తి పొందుతారు. కాబట్టి రాముడైన నాకు, మా తండ్రికి తగిన విధంగా నేను పూజ చేయాలనుకొంటున్నాను.

పితృ దేవతలకు వార్షిక శ్రాద్ధం చెయ్యడం సంతాన కర్తవ్యం. తాము ఎటువంటి స్థితిలో ఉన్నా స్థితికి తగ్గట్టు కొద్దిగానో, గొప్పగానో చెయ్యడం భావ్యం. శ్రద్ధే శ్రాద్ధంలో ప్రధానం. తన స్థాయికి ఉద్దిష్ట పితృ దేవత స్థాయికి తక్కువ కాకుండా శ్రాద్ధాన్ని జరిపించాలనేది ఇక్కడ రాముడి అభిప్రాయం. భారత జీవన విధానంలో విడదీయరాని భాగంగా ఇమిడిపోయిన కర్మకాండకు భాసుడిక్కడ ప్రాధాన్యతనిచ్చాడు.

**4. యస్యా భర్తేతి నారీభిః సత్కృతః కథ్యతే భవాన్ (శ్లోకం 8)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

సీతను అపహరించే దురుద్దేశంతో రావణాసురుడు రాముడి పర్ణశాలకు వస్తాడు. తనను అతిథి అని పరిచయం చేసుకొంటాడు. రావణుడ్ని సన్యాసిగా భావించి రాముడు స్వాగతం చెబుతాడు. ఆసనాదులను సమకూర్చుతాడు. పాద్యమిచ్చేందుకు నీరు తీసుకురమ్మని సీతను పురమాయిస్తాడు. సీత నీరు తీసుకువస్తుంది. సన్యాసి రూప రావణుని శుశ్రూష చేయమని రాముడు సీతను ఆదేశిస్తాడు. సీత తటాపటాయిస్తూ వుండగానే రావణుడు సున్నితంగా వారిస్తాడు. ఈ సందర్భంలోనే సీత గొప్పతనాన్ని రాముడికి రావణుడు ఈ విధంగా తెలియజేస్తాడు.

లోకంలోని స్త్రీలందరిలోను ఈమె ఒక్కటి మాత్రమే అరుంధతికి సమానమైంది. స్త్రీలలో ఈమెకు భర్త కావడం వల్లనే నీవు సత్కరింపబడుతున్నావని చెప్పబడుతూ ఉంది.

అరుంధతీ వశిష్టులు ఆదర్శ దంపతులు. సప్తర్షుల భార్యలలో కూడ అరుంధతికి ప్రత్యేక స్థానం ఉంది. అందువల్లనే ప్రపంచంలోని స్త్రీ పురుషులందరు కూడ ఆమెను ఆరాధనా భావంతో చూస్తారు. ఆమె తర్వాత అన్ని విధాలా అంతటి వ్యక్తిగా పరిగణింపదగిన ఉత్తమ ఇల్లాలు సీత. ఆమెకు భర్త కావడం వల్లనే రాముడికి గౌరవం అని రావణుడు చెప్పాడు. ఇక్కడ సీత గొప్పతనం, అరుంధతి గొప్పతనం కూడా తెలియజేయబడ్డాయి. అంతటి సాధ్విచేత పరిచర్యలు పొందడం సబబు కాదని రావణుడి మాటలు ధ్వనింపజేస్తున్నాయి. భార్య మంచితనం వల్లనే ప్రపంచంలో భర్తకు గౌరవం సిద్ధిస్తుందనే అంశం కూడా ఇక్కడ ధ్వనిస్తూ ఉంది.

**5. రామఇత్యక్షరైరల్పైః స్థానే వ్యాప్తమిదం జగత్ (శ్లోకం 14)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

శ్రాద్ధ కర్మలో పితృదేవతలు దేనితో తృప్తి పొందుతారని రాముడు సన్యాసి రూపంలో వున్న రావణుడ్ని ప్రశ్నిస్తాడు. కాంచన పార్శ్వమనే జింకను సమర్పించడం వల్ల పితృదేవతలు సంతృప్తులవుతారని రావణుడు చెబుతాడు. అప్పుడే అటుగా వచ్చిన జింకను రాముడు వెంబడిస్తాడు. అతడి తీరును తిలకించి రావణుడు తనలో ఈ విధంగా అనుకొంటాడు.

ఆహా! ఎంతటి బలము. ఎంతటి వీర్యము, ఎంతటి సత్వము, ఎంతటి వేగము. <u>రామ అనే రెండు అక్షరాలు గల ఈ పేరు లోకమంతా వ్యాపించి ఉంది.</u>

రాముడి పరాక్రమం గురించి రాముడు అంతకు ముందు విని వున్నాడే కాని చూడలేదు. మొదటిసారిగా అప్పుడే చూశాడు. రాముడి లాఘవం, శీఘ్ర చలనం అతన్ని ఆశ్చర్య పరిచాయి. పర్యవసానంగా తనలో ఈ మాటలనుకొన్నాడు. ఒక రకంగా చెప్పాలంటే రాముడి పరాక్రమానికి రావణుడు విస్తుపోయినట్టే ఉంది. ఒక వీరుడు ఎదుటి వీరుని బలపరాక్రమాలను గుర్తించడం, శ్లాఘించడం వీరోచిత లక్షణం. ఇది రావణుడిలో కనిపిస్తూ ఉంది. ఇక్కడ రాముడి వ్యక్తిత్వమే గాక రావణుడి వ్యక్తిత్వము గూడ చక్కగా గోచరిస్తూ వుంది.

**6. హరామి రుదతీం బాలామమంత్రోక్త మివాహుతిమ్ (శ్లోకం 15)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

పితృ శ్రాద్ధానికి కాంచన పార్శ్వమనే జింక యుక్తమని రావణుడు సూచిస్తాడు. అప్పుడే అలాంటి జింక ఒకటి అటుకేసి వస్తుంది. రాముడు దాని వెంటబడతాడు.

సీత రావణుని సన్నిధిలో వుండడానికి భయపడుతుంది. పర్ణశాల లోపలికి వెళ్ళబోతుంది. ఈ సందర్భంలోనే రావణుడు తనలో ఇలా తలపోస్తాడు.

మాయచేసి రాముడ్ని దూరంగా పంపివేశాను. మంత్రోక్తం కాని ఆహుతిలాగ ఏకాంతంగా ఉన్న సీతను ఏడుస్తున్నా తపోవనం నుంచి అపహరిస్తాను.

రావణుడి మాయావితనం, కాపట్యం, దురాలోచన, దుస్సాహసం, పాపభీతిలేమి ఇక్కడ అభివ్యక్తమవుతాయి. సీత పవిత్రత కూడా గోచరిస్తుంది. ఆహుతి అనే శబ్దం ప్రయోగింపబడడం వల్ల సీత దేవతలకు యోగ్యమైనదే కాని రాక్షసులకు యోగ్యమైనది కాదు అని ధ్వని. ఇది భాసుడి శిల్ప రామణీయకతను ఆవిష్కరిస్తుంది.

**7. ధన్యాభూమిర్వర్తతే యత్రసీతా (శ్లోకం 17)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

రాముడు జింక వెంబడి వెళ్ళగానే రావణాసురుడు నిజ రూపాన్ని ధరిస్తాడు. పర్ణశాల లోపలికి వెళ్ళబోయే సీతను వారిస్తాడు. తాను రావణుడని తెలియజేస్తాడు. శూర్పణకకు జరిగిన అవమానానికి, ఖర దూషణాదుల వధకు రాముడి మీద ప్రతీకారం తీర్చుకొనేందుకు తాను వచ్చినట్టు చెబుతాడు. సీతను అపహరించుకబోనున్నట్టు గూడ తెలియజేస్తాడు. సీత ఆక్రోశిస్తుంది. తనను కాపాడమని లక్ష్మణుడ్ని, రాముడ్ని ఉద్దేశించి బిగ్గరగా కేకలు పెడుతుంది. రావణుడు తనను ఎవరూ ఏమీ చేయజాలరని చెబుతాడు. ఈ సందర్భలోనే తన పరాక్రమాన్ని సీతకు ఈ విధంగా తెలియజేస్తాడు.

నేను ఇంద్రుడ్ని భంగపరిచాను. కుబేరుని వణికేట్టు చేశాను. చంద్రుడ్ని పడగొట్టాను. యముడ్ని చావమోదాను. భయంతో దేవతలు నివసించే స్వర్గం వ్యర్థం. <u>సీత ఉండడం వల్ల ఈ భూమే ధన్యం.</u>

రావణుడ్ని రాముడు ఏమీ చేయజాలడనే నమ్మకాన్ని సీతకు కలిగించాలి. అప్పుడు మాత్రమే ఆమె కేకలు వేయడం మానుతుంది. ఒకవేళ తనను అంగీకరించినా అంగీకరించవచ్చు. ఈ ఆలోచనతోనే రావణుడు తన పరాక్రమాన్ని సీతకు తెలియజేసే ప్రయత్నం చేశాడు. అష్టదిక్పాలకులు, సర్వభువన పాలకులు వారి సంరక్షణంలోనే ప్రపంచం ఉంది. అటువంటి వారినే నిగ్రహించానని చెప్పడం తనకు ఎక్కడా ఎదురులేదని చెప్పడమే అవుతుంది. భయపడే దేవతలున్న స్వర్గానికంటే పవిత్రురాలైన సీత నివసించే భూమే ధన్యమని చెప్పడం ద్వారా దేవతల కంటే కూడ సీత గొప్పదని చెప్పినట్లయింది. ఈ విధంగా మెరమెచ్చు మాటలు చెప్పి, మొగమాట పెట్టి సీతను లోబరచుకొనే ప్రయత్నం రావణుడు చేసినట్లయింది. ఇక్కడ సీత విశిష్టత, రావణుని ఘనతా కాపట్యాలు వెల్లడవుతాయి.

**8. నవ్యాఘ్రుం మృగశిశవః ప్రఘర్షయన్తి (శ్లోకం 18)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం పంచమాంకంలోనిది.

రావణుడు, సీతను అపహరించి తీసుకువెళతానని చెబుతాడు. సీత తనను రక్షించమని రాముడ్ని, లక్ష్మణుడ్ని కోరుతూ బిగ్గరగా కేకలు వేస్తుంది. రావణుడు తన పరాక్రమాన్ని చెబుతాడు. అయినా సీత రామలక్ష్మణులను శరణుగోరుతుంది. ఈ సందర్భంలోనే రావణుడు సీతతో ఈ మాటలంటాడు.

రాముడ్నో, లక్ష్మణుడ్నో, స్వర్గంలో వున్న దశరథ మహారాజునో శరణువేడు. దానివల్ల ప్రయోజనమేమిటి? అల్ప పురుషులనుద్దేశించి చేసే ఆక్రందన వల్ల ప్రయోజనమేమిటి? <u>పులిని జింక పిల్లలు ఎదుర్కోగలవా?</u>

ఇక్కడ రావణుడి ధీమా వ్యక్తమవుతూ ఉంది. తనకు ఎదురులేరని చెబుతూనే రామలక్ష్మణ దశరథులను శరణు వేడమనడంలో వెటకారం ధ్వనిస్తూ ఉంది. తనను పులిగాను, రామలక్ష్మణులను జింక పిల్లలుగాను పోల్చడంలో అతడి దురహంకారం ధ్వనిస్తుంది. రావణ పాత్రోచితమైన దంభదర్పాభిమానాలు ఇక్కడ వెల్లడవుతున్నాయి. సీత దైన్యత గోచరిస్తూ ఉంది.

# షష్ఠాంకము

1. **మృగీవ సీతా పరిభూయ నీయతే (శ్లోకం 1)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

రావణాసురుడు సీతను బలత్కారంగా అపహరించి తీసుకుపోతుంటాడు. సీత ఆక్రందిస్తూ ఉంటుంది. అది అక్కడ నివసించే తాపసుల చెవిలో పడుతుంది. వారిలో ఇద్దరు వృద్ధ తాపసులు కాపాడుమని బిగ్గరగా కేకలు వేస్తారు. ఈ సందర్భంలోనే మొదటి వృద్ధ తాపసి ఈ మాటలంటాడు.

కలువపూలలాంటి నీలిచ్ఛాయ గల దేహం, తామర పూల్లా ప్రకాశించే తెల్లని కోరలు, రాత్రిలో చరించే రాక్షసుడు <u>రావణాసురుడు ఆడ లేడి లాగ సీతను పరిభావించి హరించాడు.</u> ఆమెను కాపాడండి.

తెల్లని కోరలతో ఉండే నీలి రంగు దేహం రావణాసురుడిది. రావణాసురుడి దేహచ్ఛాయను కలువలతోను, కోరలను తెల్లని తామరలతోను పోల్చడం ఎంతో రమణీయంగా ఉంది. తామరల కాలం పగలు, కలువల కాలం రాత్రి అయినప్పటికీ ఈ రెండిటిని ఒకే దగ్గర ఒకేసారి చూపడం విశేషం. సీత స్త్రీ జింక వలె పరిభవింపబడింది అనడంలో కూడ ఔచిత్యం ఉంది. ఆమె కళ్ళల్లో కనిపించే భయం, ఆపదలో లేడిలాగ గెంతి పరుగెత్తే స్వభావం ఇక్కడ వ్యక్తమవుతాయి.

2. **తపోవనాత్ సిద్ధిరివాపనీయతే (శ్లోకం 2)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

రావణుడు పర్ణశాల నుంచి సీతను అపహరించుకు వెళుతున్నాడు. మొదటి తాపసి సీతకు జరిగిన పరాభవాన్ని గురించి తెలియజేశాడు. రెండవ తాపసి రావణుడు సీతను తీసుకువెళుతున్న తీరును సోదాహరణంగా ఈ విధంగా తెలియజేశాడు. ఆడ సర్పాన్ని గ్రద్ద తీసుకువెళుతున్నట్టు, గాలి పూలతీగను కంపింపజేసినట్లు <u>యజ్ఞవాటిక నుంచి యాగసిద్ధిని తీసుకువెళుతున్నట్టు దుస్పహ పాపాత్ముడైన</u> రావణాసురుడు తపోవనం నుంచి సీతను తీసుకువెళుతున్నాడు.

ఇక్కడ భాసుడు సీతను మూడింటితో పోల్చాడు. ఒకటి ఆడసర్పం, రెండు పూలతీగ, మూడు సిద్ధి. మగ సర్పం కంటే ఆడ సర్పానికే కోపం, పగ ఎక్కువ. అందువల్ల సీత రావణుడికి లోబడదని భవిష్యత్తులో ఏదో విధంగా పగ తీర్చుకుంటుందని ధ్వని. పూల తీగ వంటి సౌకుమార్యము కలదిగా సీత భావింపబడింది. ఇక్కడ ఆమె నిస్సహాయస్థితి ధ్వనిస్తూ వుంది. సీత సిద్ధితో పోల్చడం ద్వారా ఆమె పవిత్రతను ఆవిష్కరించినట్టయింది. రావణుడ్ని గ్రద్దతోను, పెనుగాలితోను పోల్చడం వల్ల అతడి ఔద్ధత్యం అభివ్యక్తమౌతుంది.

3. **రామం ప్రజానయనబుద్ధిమనోఽభిరామమ్ (శ్లోకం 7)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

రామదర్శనార్థం అడవికి వెళ్ళిన సుమంత్రుడు తిరిగి వస్తాడు. అతడి రాకను గురించి కంచుకీయుడు ప్రతీహారితో చెబుతాడు. ప్రతీహారి భరతుడితో నివేదిస్తుంది. భరతుడు ఈ సందర్భంలోనే ప్రతీహారినుద్దేశించి ఈ విధంగా చెబుతాడు.

నేనింతకు ముందు రామదర్శనార్థం అతని అనుగ్రహాన్ని, శపథాన్ని పొంది వచ్చాను. <u>ఇప్పుడు ప్రజానయన బుద్ధి మనోభిరాముడ్ని దర్శించి సుమంత్రుల వారు తిరిగి వచ్చారా ఏమి?</u>

రామదర్శనార్థం వెళ్ళిన భరతుడు అతడి అనుగ్రహాన్ని మళ్ళీ రాజ్యాన్ని పాలిస్తాననే రామ శపథాన్ని పొంది తిరిగి వచ్చాడు. తనలాగే అందరూ మంచిని పొందాలనే ఆకాంక్ష ఉండడం గొప్పవారిలో సహజం. భరతుడు కూడా గొప్పవాడు కాబట్టి తనలాగే సుమంత్రుడు కూడా రామ ప్రసాదాన్ని పొంది వచ్చి వుంటాడని విశ్వసించాడు. ఇది భరతుడి పాత్రకు విశిష్టతను చేకూరుస్తుంది. రాముడు ప్రజలందరి కళ్ళకు ఇంపు గొలిపేవాడు. మనస్సులకు కూడా అభిరాముడే. అయితే మనస్సు చటుక్కున దేనిపై నంటే దాని మీద వాలిపోతుంది. బుద్ధి అలాకాదు. తనకున్న వివేచనను ఉపయోగించి మంచిని మాత్రమే స్వీకరిస్తుంది. అంటే అల్లాటప్పా విషయాల మీదికి బుద్ధి వెళ్ళదన్నమాట. అలాంటి బుద్ధి కూడ రాముడ్ని అంగీకరించి ఆరాధించటం విశేషం. ఇక్కడ రాముడి గొప్పతనం వ్యక్తమవుతుంది.

**4. గుణ ఇవ బహ్వపరాద్ధమాయుషా,మే (శ్లోకం 8)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

రాముడ్ని చూసి వచ్చేందుకు అడవికి వెళ్ళిన సుమంత్రుడు తిరిగివస్తాడు. సుమంత్రుడి రాకను ప్రతీహారి ద్వారా భరతుడు తెలుసుకొంటాడు. అతడ్ని సత్వరమే ప్రవేశపెట్టమని కంచుకీయుడ్ని కోరతాడు. కంచుకీయుడు వెంటనే సుమంత్రుడ్ని ప్రవేశపెడతాడు. వచ్చీరాక ముందే కష్టం కష్టం అంటూ సుమంత్రుడు వాపోతాడు. ఈ సందర్భంలోనే సుమంత్రుడు భరతుడ్ని ఉద్దేశించి ఈ మాటలంటాడు.

మహారాజు మరణాన్ని చూశాను, రాకుమాల దుఃఖాన్ని తిలకించాను, సీతాపహరణ గురించి విన్నాను. దీర్ఘయువు కొంతమేలే అయినప్పటికీ నాపట్ల అపరాధంగానే పరిణమించింది.

సుమంత్రుడు రాజ కుంటుంబానికి మిక్కిలి సన్నిహితుడు. ఒక్కమాటలో చెప్పాలంటే కుటుంబంలోని వారందరికీ తలలో నాలుక వంటివాడు. రాజ కుటుంబం వారు సుమంత్రుడికి ఎంతటి గౌరవ స్థానం ఇచ్చారో సుమంత్రుడు కూడా ఆ కుటుంబసభ్యుల పట్ల అంతటి ప్రగాఢానుబంధాన్ని పెంచుకున్నాడు. వారి కష్ట సుఖాలను పంచుకొన్నాడు. అందుకే ఆ కుటుంబంలో జరిగిన అనిష్ట సంఘటనలన్నీ ఆ కుటుంబ సభ్యులకంటే కూడా సుమంత్రుడినే ఎక్కువగా బాధించాయి. ఆ విషయాన్నే ఇక్కడ తెలియజేశాడు. దీర్ఘాయువు మంచిదని, అకాల మృత్యువు మంచిది కాదని శాస్త్రాలు చెబుతున్నాయి. దీర్ఘాయువునుపయోగించి మానవుడు మాధవుడిని చేరుకొనే ప్రయత్నం చెయ్యాలని వాటి ఆంతర్యం. అంతటి మంచిలోను సుమంత్రుడికి చెడే జరిగింది. అనిష్టాలే సంప్రాప్తించాయి. అందుకని దీర్ఘాయువు తనపట్ల అపరాధంగా పరిణమించిందే అని వాపోయాడు.

**5. మయాదృష్టంతు తఛ్ఛూన్యం ధైర్యహీనం తపోవనమ్ (శ్లోకం 9)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

సుమంత్రుడు ప్రవేశిస్తాడు. రాముడ్ని చూసినారా అని భరతుడు ప్రశ్నిస్తాడు. సుమంత్రుడు చింతిస్తూ మౌనం వహిస్తాడు. మీరు జన స్థానానికి వెళ్ళారా మార్గమధ్యం నుంచే తిరిగి వచ్చారా అని భరతుడు ప్రశ్నించాడు. తాను జన స్థానానికి వెళ్ళే వచ్చానని సుమంత్రుడు చెబుతాడు. కోపంచేతగాని, లజ్జచేతగాని రాముడు దర్శనమివ్వలేదా అని భరతుడు సుమంత్రుడ్ని ప్రశ్నిస్తాడు. ఈ సందర్భంలోనే సుమంత్రుడు భరతుడికి ఈ మాటలు చెబుతాడు.

వినీతులకు కోపమెక్కడిది? పవిత్ర మనస్కులకు బిడియమెక్కడిది? <u>వారు ముగ్గురును అక్కడ లేరు. శూన్యమైన తపోవనాన్నే చూసి వచ్చాను.</u>

వినీతులైన వారు అభ్యాసం ద్వారా అణకువను సంపాదించుకొని కోపాన్ని నిగ్రహించగలగుతారు. అందువల్ల వినయ సంపన్నులకు కోపం ఉండదు. ఏదైనా ఆశించేవారు పవిత్ర హృదయులు కాజాలరు. అలాంటివారికే ఇతరులను కలుసుకొన్నప్పుడు లజ్జ కలుగుతూ ఉంటుంది. ఏ ఆశాలేని పవిత్ర హృదయులకు ఇతరుల చేత కావలసినదేదీ ఉండదు. అందువల్ల వారు ఎవరిని కలుసుకొన్నప్పటికీ లజ్జ కలుగదు. ఈ ఉత్తమ మానవ స్వభావాన్ని భాసుడు సుమంత్రుని ద్వారా ఇక్కడ ఆవిష్కరించాడు. తపోవనానికే రామలక్ష్మణుల ఉనికి జ్యోతిఃప్రాయం. అలాంటిది వారు అక్కడ లేకపోవడంతో ఎండ ఉన్నప్పటికీ ఆ తపోవనం శూన్యమైపోయింది. ఈ విషయాన్నే సుమంత్రుడు భరతుడికి తెలియజేశాడు.

**6. జీమూత చంద్ర ఇవ ఖే ప్రభయా విముక్తః (శ్లోకం 12)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

సుమంత్రుడేదో దాస్తున్నాడని భరతుడు చెబుతాడు. తాను అన్ని విషయాలు చెప్పివేసినట్లు సుమంత్రుడు పలుకుతాడు. ఏదో దాస్తున్నారని స్వర్గగతుడైన మహారాజు పాదాల మీద ఒట్టు పెడుతుండడం వల్ల సత్యం దాచకుండా చెప్పాలని భరతుడు సుమంత్రుడ్ని కోరతాడు. దాచకుండా చెబుతానని సుమంత్రుడంటాడు. రామరావణులకు పగ రగిలిందని పర్యవసానంగా మాయోపాయంతో రావణుడు సీతను అపహరించాడని సుమంత్రుడు చెబుతాడు. అది ఎలా సాధ్యం అని భరతుడు ప్రశ్నిస్తాడు. వెంటనే మూర్ఛపోయి కొంతసేపటికి తేరుకొంటాడు. ఈ సందర్భంలోనే భరతుడు ఈ మాటలంటాడు.

తండ్రా మరణించాడు. బంధువులా దగ్గర లేరు. అనుభవించేదా వనవాస క్లేశం. వీటికి తోడు భార్యా వియోగం. <u>మబ్బులు కప్పిన చంద్రుడిలాగా మా అన్న వైభవానికి దూరమయ్యాడే.</u>

కష్టాలేవీ ఒంటరిగా రావని కలిసే వస్తాయని పెద్దలు చెబుతారు. రాముడికి కూడా ఇప్పుడు అటువంటి పరిస్థితే తటస్థించింది. పితృ మరణం, బంధు వియోగం, వనవాస క్లేశం పైగా భార్య వియోగం రాముడికి వచ్చిన కష్టపరంపర. ఎంతటి ధీరుడైనా ఇలాంటి కష్టాలు వచ్చినపుడు మనో ధైర్యాన్ని కోల్పోక తప్పదు. అప్పుడు అతడి ముఖం ప్రసన్నంగా ఉండటానికి బదులు గ్లానితో కాంతి విహీనంగా ఉంటుంది. ఇటువంటి రాముడి స్థితినే మబ్బులు కప్పిన చంద్రుడి స్థితితో భరతుడు పోల్చాడు. మబ్బులు కష్టాలకు ఉపమానంకాగా చంద్రుడు రామచంద్రుడికి ఉపమానం.

**7. తస్యభార్యా హృతాసీతా పర్యాప్తస్తే మనోరథః (శ్లోకం 13)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

భరతుడు సుమంత్రుడితో కలిసి కైకేయిని చూడటానికి వెళతాడు. రాముడి దగ్గరకు వెళ్ళిన సుమంత్రుడు వచ్చాడని తెలుసుకొని భరతుడు తనను నిందించడానికే వచ్చాడని కైకేయి సంశయిస్తుంది. రాముడి వార్తలేమిటని భరతుడ్ని ప్రశ్నిస్తుంది. ఈ సందర్భంలోనే రాముడి దురవస్థను భరతుడు ఈ విధంగా కైకేయికి తెలియజేశాడు.

నీ ఆజ్ఞ చేత రాముడు రాజ్యాన్ని పరిత్యజించి వనవాసం వెళ్ళాడు. అక్కడ <u>అతడి భార్య సీత అపహరణకు గురైంది. ఇప్పుడు నీ కోరిక పరిపూర్ణంగా నెరవేరింది కదా.</u>

కైకేయి రాముణ్ణి అడవికి పంపినందువల్లే సీతాపహరణం జరిగిందని భరతుడు ఆమెను పరోక్షంగా నిందించాడు. రాముడికి కష్టాలు పెట్టడమే కైకేయి లక్ష్యం కాబట్టి రాముడు ఎక్కువ కష్టాలు అనుభవించినందువల్ల ఆమె కోరిక పరిపూర్ణంగా సిద్ధించింది కదా అని కైకేయిని భరతుడు దెప్పిపొడిచాడు. ఇక్కడ మానవ సహజమైన భరతుడి స్వభావం బహిర్గతమవుతుంది.

**8. వధూ ప్రఘర్షణం ప్రాప్తం ప్రాప్యాత్ర భవతీం వధూమ్ (శ్లోకం 14)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

భరతుడు కైకేయిని చూడవస్తాడు. భరతుడు వేసే నిందలను సహించేందుకు కైకేయి సంసిద్ధమవుతుంది. కైకేయి వల్లనే రామ వనవాసం, సీతాపహరణం జరిగాయని భరతుడు ధ్వని పూర్వకంగా కైకేయిని నిందిస్తాడు. ఈ సందర్భంలోనే కైకేయి వల్ల రఘువంశానికి కలిగిన కష్టాన్ని తెలుపుతూ ఆమెను నిరసిస్తాడు.

అయ్యో కష్టం. సత్య సంపన్నులు, మనసున్న వారు అయిన ఇక్ష్వాకు వంశజులకు <u>నీవు వధువుగా లభించడం వల్ల వధూ అపహరణం కూడా జరిగింది.</u>

ఇక్కడ ఇక్ష్వాకు వంశం వారు ఎంత మంచివారో ఎంత గొప్పవారో భరతుడు తెలియజేశాడు. అలాంటి వారికి అనుగుణమైన వధువు ప్రాప్తించి వుంటే ఆ వంశం ఇతోధికంగా పురోభివృద్ధి చెంది ఉండేది. కైక అనుగుణవతి కాకపోగా దుర్గుణ స్వభావాన్ని ప్రదర్శించి కుటుంబాన్నే అస్తవ్యస్తం చేసింది. తుదకు మహారాజు మరణానికి కూడా కారకురాలైంది. ఈ విషయాన్ని భరతుడు పరోక్షంగా తెలియజేశాడు. కుటుంబం అభివృద్ధి చెందినా, వినాశం పొందినా కోడలు కాలు పెట్టిన వేళా విశేషమని చెప్పడం పరిపాటి. ఈ విషయాన్ని కూడా భరతుడి ఆరోపణ చక్కగా ధ్వనింపజేసింది.

**9. కా నామ మాతా పుత్రకస్యాపరాధం న మర్షయతి (గద్యం)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం షష్ఠాంకంలోనిది.

రాముడికి జరిగిన అన్యాయం దృష్ట్యా భరతుడు కైకేయిని తూలనాడుతాడు. కైకేయి అదే అదనుగా భావించి దశరథునకేర్పడిన ముని శాపాన్ని ప్రస్తావిస్తుంది. కైకేయి సూచనమేరకు సుమంత్రుడు దశరథుడికి సంభవించిన శాప వృత్తాంతాన్ని చెబుతాడు. ఆ శాప ప్రభావం వల్లనే తాను శ్రీరాముడిని అడవికి పంపవలసి వచ్చిందని కైకేయి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే ప్రయత్నం చేస్తుంది. భరతుడు తన తల్లి నిర్దోషి అని భావిస్తాడు. ఆమెకు అభివాదం చేస్తాడు. అన్నమీది భక్తి వల్ల ఏర్పడిన కోపం చేత తల్లిని దూషించినందుకు క్షమాపణ కోరుకుంటాడు. ఈ సందర్భంలోనే కైక భరతుడితో ఈ మాటలంటుంది.

<u>కన్నతల్లి ఎవరైనా బిడ్డ తప్పును క్షమించకుండా ఉండలేదు.</u>

స్త్రీలకు విధించిన ఆరుగుణాల్లో క్షమాగుణం కూడా ఒకటి. సామాన్య స్త్రీకే క్షమాగుణం ఉన్నప్పుడు వాత్సల్యమూర్తి అయిన మాతృమూర్తికి క్షమాగుణం ఎక్కువగానే ఉండాలి. దీన్ని పురస్కరించుకొనే ఏ తల్లి అయినా బిడ్డ తప్పును క్షమిస్తుందని కైకేయి సుస్పష్టంగా చెప్పివేసింది.

# సప్తమాంకము

1. ప్రహ్లాదయ వ్యసన దగ్ధమిదం శరీరమ్ (శ్లోకం 7)

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

రావణ సంహారానంతరం రాముడు అయోధ్యకు వస్తాడు. తల్లులు ముగ్గురికి నమస్కరిస్తాడు. వారు ఆశీర్వదిస్తారు. లక్ష్మణుడు కూడ తల్లులకు నమస్కరించి ఆశీర్వాదాలు పొందుతాడు. సీత కూడ అత్తలకు నమస్కరించి దీవెనలు పొందుతుంది. భరతుడు ప్రవేశించి రాముడికి నమస్కరిస్తాడు. రాముడతన్ని ఆశీర్వదిస్తాడు. ఈ సందర్భంలోనే భరతుడ్ని ఉద్దేశించి రాముడు ఈ మాటలు అంటాడు.

కవాటమంత విశాలంగా నీ వక్షాన్ని పెంచు. విపులమైన భుజ ద్వయంతో నన్ను కౌగిలించుకో. శరత్కాలంలోని చంద్రుడి వంటి నీ ముఖాన్ని పై కెత్తు. <u>బాధలతో కాలిపోయిన శరీరానికి ఆహ్లాదం కలిగించు.</u>

మొదట బంధు వియోగం, తరువాత వనవాస క్లేశం, తర్వాత భార్య వియోగ క్లేశం, అనంతరం శత్రుపోరాట క్లేశం క్రమంగా రాముడికి కలిగాయి. ఒక దెబ్బ మీద మరొక దెబ్బ ఈ బాధల వల్ల అతడి మనస్సు, శరీరం కూడా బాగా తపించి, పరిదగ్ధమైనాయి. అయోధ్యలోని తన వారిని చూడగానే అతడిలో నిద్రాణమై ఉన్న బంధుప్రీతి, ఆత్మీయుల కోసం ఆరాటం విజృంభించాయి. ముఖ్యంగా భరతుడ్ని చూడగానే విజృంభణ కాస్త ఎక్కువైంది. భరతుడు తనకు సంక్రమించిన రాజ్యాన్ని తృణీకరించాడు. అగ్రజుడైన తన కోసం ఆరాటపడ్డాడు. సకల భోగభాగ్యాలను పరిత్యజించాడు. అంతటి మంచి వ్యక్తి తనకు ఆత్మీయుడు. అతన్ని చూడగానే నిద్రాణమై ఉన్న బాధ బహిర్గతమైంది. అతడి ఆలింగనాన్ని కోరింది. శరచ్చంద్ర తుల్యమైన ముఖాన్ని చూడాలని అభిలషించింది. అలా చూడగలిగినప్పుడు తనకు ఆహ్లాదం కలుగుతుందనే విశ్వాసం జనించింది. అందుకే భరతుడి ప్రగాఢ పరిష్వంగాన్ని రాముడు అభిలషించాడు.

2. జాత! చిరాభిలషితః ఖల్వేషమనోరథః (గద్యం)

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

భరతుడు లక్ష్మణుడికి నమస్కరించి ఆశీర్వాదం పొందుతాడు. ఈ రాజ్య భారాన్ని వెనక్కు తీసుకోమని రాముడ్ని కోరతాడు. ఎలాగ అని రాముడు ఆశ్చర్యం వెలిబుచ్చుతాడు. అప్పుడు కైకేయి జోక్యం కలిగించుకొని రాముడికి ఈ విధంగా చెబుతుంది.

<u>నేను కోరుకున్న ఇది నా చిరకాల మనోరథం కదా!</u>

రామ పట్టాభిషేకం తన చిరకాల మనోరథమని కైక చెప్పడం విడ్డూరంగానే కనిపిస్తుంది. ఎందుకంటే రామ వనవాసాన్ని, భరత పట్టాభిషేకాన్ని వరాలుగా కోరింది కైకేయియే. రాముడి కష్టాలన్నిటికి చాలామటుకు బాధ్యురాలు ఆమె అయినప్పటికి మంధర వల్ల కైకేయి ఈ విధంగా ప్రవర్తించవలసి వచ్చింది. చిన్నప్పటి నుంచీ కుడా కైకేయికి రాముడంటే చాలా ఇష్టం. అందువల్ల రాముడి బాల్యమాదిగా అతడే రాజు కావాలని కైకేయి కోరుకుంది. మధ్యలో మంధర వల్ల మనస్సు మార్చుకుంది. ఆ ప్రయోజనం నెరవేరగానే యథాపూర్వంగా రామ పట్టాభిషేకాన్నే కోరింది. కాబట్టి రామ పట్టాభిషేకం కైకేయి చిరకాలాభిలాషే. సజ్జనుల సత్స్వభావం దుష్ప్రభావానికి గురైనప్పటికీ ఆ ప్రభావం చాలా కాలం కొనసాగదు. దాని బలం తగ్గగానే యథాపూర్వంగా స్వీయ స్వభావం మళ్ళీ నెలకొంటుందనేందుకు కైకేయియే నిదర్శనం.

**3. ద్రష్టుం ముఖం సలిల సిక్తమివారవిందమ్ (శ్లోకం 9)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

రాముడు అయోధ్యకు వస్తాడు. కుటుంబ సభ్యులంతా కలుసుకొంటారు. పరస్పరాభివాదాలు, దీవెనలు అయిన తర్వాత శత్రుఘ్నుడు వస్తాడు. రామలక్ష్మణులకు అభివాదాలు చేసి వారి ఆశీస్సులను పొందుతాడు. ఈ సందర్భంలోనే రాముడ్ని చూచి శత్రుఘ్నుడు ఈ మాటలంటాడు.

నీ అనుగ్రహం చేత నానా నదీనదాల నుంచి అభిషేకం కోసం మునులే స్వయంగా తీర్థ జలం తీసుకువచ్చారు. మొదటిసారిగా అభిషేకం చేసుకొంటున్న నీటి కణాలతో నిండిన తామర పువ్వు లాంటి నీ ముఖాన్ని చూసేందుకు వారభిలషిస్తున్నారు.

రాజ్యంలో పట్టాభిషేకం అప్పుడప్పుడూ వచ్చే ఘటన కాదు. ఎప్పుడో వచ్చే చారిత్రక సంఘటన. అందువల్ల రాముడి పట్టాభిషేకానికి మునులే పవిత్ర మంత్ర పూత జలాన్ని నదుల నుంచి తీసుకువచ్చారు. అన్ని చోట్ల పట్టాభిషేకం జరిగేటప్పుడు ఈ విధంగానే తీసుకు వస్తారు. రాముడి ముఖాన్ని అప్పుడే వికసించిన తామరతో పోల్చడం వల్ల అతడి సౌకుమార్యం అభివ్యక్తమవుతుంది.

**4. రామో మహీం జయతి సర్వజనాభిరామః (శ్లోకం 10)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

రాముడి పట్టాభిషేకానికి కంచుకీయుడు మొదలైన సేవక వర్గం సంసిద్ధంగా ఉందని కైకేయి చెప్పింది. ప్రజలతో వేచి ఉన్నారని సుమిత్ర చెప్పింది. ఈ సందర్భంలోనే నేపథ్యంలో జనస్థాన వాసులనుద్దేశించి ఈ మాటలు చెప్పబడ్డాయి.

అంధకారాన్ని సూర్యకిరణాలు నశింపజేసినట్లు తన శౌర్యంతో ప్రతిమాన శత్రు ప్రభావాన్ని అంతం చేసి అశుభాలను పరిహరించే సీతను పొంది రాముడు సకల జనాభిరాముడై పాలిస్తున్నాడు.

రాముడు సూర్యవంశపు రాజు. అతన్ని సూర్యుడితో పోల్చడం ఇక్కడ సమంజసంగా ఉంది. తిమిర సంహారకుడైన శౌర్య భాస్కరుడే రాముడు. సీత లక్ష్మి అంశ కాబట్టి అశుభాలను పరిహరించే శక్తి ఆమెకుంది. అటువంటి సీతను పొందడం వల్ల రాముడు విజయలక్ష్మీ సమేతుడైనట్లయింది. సకల జనాభిరామంగా రాముడు రాజ్యాన్ని పాలిస్తున్నాడనడం ప్రజారంజక రామ రాజ్యాన్ని ధ్వనింపజేస్తుంది.

**5. ధర్మేణ, లోకపరిరక్షణమభ్యుపేతమ్ (శ్లోకం 11)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

నానా నదీనదాల నుంచి మునులు తెచ్చిన మంత్ర పూత జలంతో రాముడికి పట్టాభిషేకం చేస్తారు. జయఘోషలు మిన్నుముట్టుతాయి. అభిషేకానంతరం రాముడు ఆకాశం వైపు చూస్తాడు. తన తండ్రిని స్మరిస్తాడు. తండ్రినుద్దేశించి చెబుతున్నట్టు ఈ శ్లోకం చెబుతాడు.

స్వర్గంలోను సంతోషంగా ఉండు దైన్యాన్ని విడిచిపెట్టు. నువ్వు కోరుకున్నట్టే అంతా నాకు మంచి జరిగింది. నే రాజునయ్యాను. భూమి నంతటిని ధర్మమార్గంలో పరిపాలిస్తాను.

రామ వియోగ బాధతో మరణించిన దశరథుడు రామపట్టాభిషేక విఘ్నాన్ని తలచుకొంటూ మరణించిన దశరథుడు స్వర్గంలో కూడ బాధతోనే ఉండవచ్చని రాముడు భావించాడు. అందుకే పట్టాభిషేకమైన వెంటనే దశరథుడ్ని ఉద్దేశించి మాట్లాడాడు. స్వర్గంలో సంతోషం తప్ప మరేది ఉండదు. అయినా సంతోషంగా ఉండమని రాముడు దశరథుడ్ని కోరడం పైకి విడ్డూరంగానే కనిపిస్తుంది. దశరథుడు స్వర్గానికి వెళ్ళినా తన గురించే ఆలోచించే ప్రమాదముందని రాముడు సంశయించాడు. అందుకే సంతోషంగా ఉండమని ప్రత్యేకించి కోరాడు. దశరథుడికి సంతోషాన్ని కలిగించే తన రాజ్యాభిషేక వార్త తెలియజేసి ధర్మబద్ధంగా పరిపాలిస్తానని కూడా భరోసా ఇచ్చాడు. ఇవన్నీ దశరథుడికి సంతోష కారకాలే. తండ్రులను సంతోష పెట్టడం సంతానం కర్తవ్యం. కాబట్టి రాముడు దశరథునుద్దేశించి మాట్లాడాడు. రాముడి మాటలు దశరథుడికి వినిపించక పోయినా రాముడి మానవ సహజ స్వభావం ఇక్కడ వెల్లడవుతుంది.

**7. నవశశినమివార్యం పశ్యతో మేనతృప్తిః (శ్లోకం 12)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

పుణ్యతీర్థ జలాలతో రామపట్టాభిషేకం చేస్తారు. అతడు రాజలాంఛనాలన్నీ ధరిస్తాడు. తండ్రిని నిశ్చింతగా ఉండమని ఆకాశానికేసి చూస్తూ చెబుతాడు. ఈ సందర్భంలోనే భరతుడు రాముడ్ని తిలకిస్తూ ఈ మాటలంటాడు.

రాజ శబ్దానికి పాత్రుడైన వాడు, రాజ లాంఛనమైన ఛత్రాన్ని ధరించినవాడు, కిరీటాన్ని ధరించినవాడు, పవిత్ర తీర్థ జలాభిషిక్తుడు పెద్దలకు నమస్కరించినట్టు ప్రజలచే నమస్కరింపబడేవాడు అయిన <u>రాముడ్ని నవశశిని చూసినట్టు చూసినప్పటికి నాకు తృప్తి కలగడం లేదు.</u>

రాజు ధరించే రాజ లాంఛనాలను, రాజ వైభవాన్ని ఈ శ్లోకం వెల్లడి చేస్తుంది. మిక్కలి సంతోషం కలిగినప్పుడు గానీ, అధికారం సంక్రమించినప్పుడు గానీ ఏ వ్యక్తి అయినా వెలిగిపోతాడు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొనే రాముడు నూతన చంద్రుడు అని భాసుడు భరతుడి చేత అభివర్ణింపజేశాడు.

**7. పునః ప్రకాశతాం యాతి సోమస్యేవోదయే జగత్ (శ్లోకం 13)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

మహర్షులు తెచ్చిన పుణ్య నదీ జలాలతో శ్రీరాముడి పట్టాభిషేకం జరుగుతుంది. అందరూ సంతోషిస్తారు. రాముడ్ని అభినందిస్తారు. రాముడు కూడా తన తండ్రిని స్మరించి ఆత్మీయతను, కృతజ్ఞతను ప్రకటించుకొంటాడు. భరతుడు పట్టాభిషిక్తుడైన రాముడ్ని ఎంతచూసినా తనివి తీరలేదంటాడు. ఈ సందర్భంలోనే శత్రుఘ్నుడు రాముడ్ని దృష్టిలో పెట్టుకొని ప్రశంసా పూర్వకంగా ఈ మాటలంటాడు.

శ్రీరాముడి పట్టాభిషేకం చేత మా కుల కల్మషం తొలగిపోయింది. చంద్రోదయంతో <u>ప్రపంచం శోభించినట్టుగా మా కులం కూడా మళ్ళీ ప్రకాశవంతమయ్యింది.</u>

రాకుమారులలో రాముడే జ్యేష్ఠుడు. కాబట్టి పైతృకమైన రాజ్యం అతడికే సంక్రమించవలసి ఉంది. కాని అది అలా జరుగలేదు. అతడి కంటే చిన్నవాడైన భరతుడికి రాజ్యావకాశం లభించింది. అనూచానంగా వస్తున్న కుల ధర్మానికే ఇది విరుద్ధం. ధర్మం లోపించినప్పుడు అక్కడ కల్మషం చోటు చేసుకొంటుంది. అదేవిధంగానే రామ పట్టాభిషేక భగ్నంతో ఇక్ష్వాకు వంశం కల్మషనిలయమై పోయింది. రామ పట్టాభిషేకం మళ్ళీ జరగడంతో ఆ కల్మషం పూర్తిగా నశించింది. ధర్మ బాహ్యమైన కల్మషం నశించడంతో కులం నిష్కల్మషంగా ప్రకాశించింది. చంద్రోదయంతో లోకం ప్రకాశించినట్టుగా అనడంలో

కూడా ఒక విశేషం ఉంది. సూర్యోదయం అని వుంటే సూర్యుడి ప్రచండ తాపం అక్కడ ధ్వనించి ఉండేది. సూర్యుడి ఉష్ణ కిరణాల కంటే చంద్రుడి శీతల కిరణాలే ప్రపంచాన్ని ఎక్కువగా ఆహ్లాదపరుస్తాయి. చంద్ర కిరణాల్లాగ రాముడి పట్టాభిషేకం అందరినీ ఆహ్లాదపరిచింది అని అభిప్రాయం.

**8. సహాయానాం ప్రసాదాత్ వర్ధతఇతి కథ్యతామ్ (గద్యం)**

ఈ వాక్యం మహాకవి భాసుడు రచించిన ప్రతిమా నాటకం సప్తమాంకంలోనిది.

రామ పట్టాభిషేకం సవ్యంగా నెరవేరుతుంది. కుటుంబ సభ్యులంతా అతన్ని అభినందిస్తారు. భరత, శత్రుఘ్నులు రాముడ్ని గురించి ప్రశంసాపూర్వకంగా మాట్లాడతారు. అప్పుడే కంచుకీయుడు ప్రవేశించి విభీషణాదుల అభినందన సందేశాన్ని వినిపిస్తాడు. ఈ సందర్భంలోనే రాముడు ఈ మాటలంటాడు.

<u>సహాయకుల అనుగ్రహం చేతనే వర్థిల్లానని వారికి తెలియజెయ్యి.</u>

రాముడి సోదరులుగాని, విభీషణాది మిత్రులు గానీ తమ అదృష్టం చేత రాముడు వర్థిల్లాడని అతన్ని అభినందించారు. రాముడికి వారి అభిప్రాయం సరికాదనిపించింది. తన అభివృద్ధి మిత్రుల సహాయం వల్ల జరిగింది. రాముడు దీన్ని గుర్తించాడు. కృతజ్ఞతా పూర్వకంగా ఆ మాటనే మిత్రులకు చెప్పమని కంచుకిని పురమాయించాడు. అదృష్టం వల్ల మంచి జరిగిందనే ప్రతిపాదన రాముడికి బొత్తిగా రుచించలేదు. ఎందుకంటే అదృష్టమంటేచూపుకు అందని శక్తి. ఆ శక్తి వల్ల తనకు జరిగిన దానికంటే చూపుకందే రూపుతో వున్న హనుమత్సుగ్రీవాదుల వల్లను, విభీషణాదుల వల్లను, లక్ష్మణాదుల వల్లను తనకు మేలు జరిగింది. ఈ విషయాన్ని రాముడు మరిచిపోలేదు. సహృదయుని లక్షణం కృతజ్ఞత నివేదనం కాబట్టి రాముడు తన కృతజ్ఞతను వెల్లడించి యిక్కడ సహృదయ శ్రేష్ఠుడయ్యాడు.

**డా॥ ఉపమాండ్ల ప్రహ్లాదనాయుడు**
**అసోసియేట్ ప్రొఫెసర్**
**సంస్కృత విభాగం**
**శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి.**

**పాఠం - 14**

# BASIC GRAMMAR
# శబ్దాలు

సంస్కృత భాషలో సుబంతాలు, తిజంతాలు అని శబ్దాలు రెండు రకాలు. నామవాచకాలు, విశేషణాలు, సర్వనామాలు, అవ్యయాలు సుబంతాలలో అంతర్భవిస్తాయి. క్రియలను తెలుపు ధాతు రూపాలు తిజంతాలు. ఉదాహరణ - గచ్ఛతి, పఠతి మొదలగునవి.

| | ఉదాహరణ | | |
|---|---|---|---|
| నామవాచకం - | రామః | - | రాముడు |
| విశేషణం - | శ్యామః | - | నల్లనివాడు |
| సర్వనామం - | సః | - | అతడు |
| అవ్యయం - | అధునా | - | ఇప్పుడు |

సుబంతాలు పుల్లింగాలు, స్త్రీలింగాలు, నపుంసకలింగాలు అని మూడు రకాలు.

| | | |
|---|---|---|
| పుల్లింగం | - | రామః |
| స్త్రీలింగం | - | రమా |
| నపుంసకలింగం | - | ఫలమ్ |

ప్రాంతీయ భాషల్లో సాధారణంగా పుంవాచకాలు పుల్లింగాలు, స్త్రీవాచకాలు స్త్రీలింగాలు, రెండింటికి చెందనవి నపుంసకలింగాలు. కాని సంస్కృతంలో మాత్రం లింగభేదం శబ్దాన్ని బట్టి వచ్చును, అర్థాన్ని బట్టి రాదు. పుంవాచకం, స్త్రీవాచకం కూడ నపుంసకలింగమగును. ఉదాహరణ - మిత్రమ్ (స్నేహితుడు / స్నేహితురాలు) ఒక్కొక్క చోట స్త్రీ వాచకము పుల్లింగమగును - ఉదాహరణ - దారాః (భార్య) ఒక్కొక్కచోట స్త్రీ వాచకం నపుంసక లింగమగును - ఉదాహరణ - కలత్రమ్ (భార్య).

శబ్దాలు అజంతాలు, హలంతాలు అని రెండు రకాలు. అచ్చు చివరి అక్షరంగా గలవి అజంతాలు. ఉదాహరణ - రామ (అ), హరి (ఇ), రమా (ఆ) మొదలగునవి. హల్లు చివరి అక్షరంగా గలవి హలంతాలు. ఉదాహరణ - జలముచ్ (చ్), గిర్ (ర్), మనస్ (స్) మొదలగునవి.

ఇట్లే అకారాంతమనగా 'అ' కారం చివరనున్న శబ్దం. ఉదాహరణ - రామ (అ), ఇకారాంతమనగా 'ఇ'కారం చివరనున్న శబ్దం. ఉదా - హరి (ఇ) ఋకారాంతమనగా 'ఋ'కారం చివరనున్న శబ్దం - ఉదా - ధాతృ (ఋ).

సంస్కృతంలో వచనాలు మూడు. ఒక వ్యక్తిని లేక ఒక వస్తువును తెలుపునది ఏకవచనం. ఇద్దఱిని లేక రెండింటిని తెలుపునది ద్వివచనం. రెండింటికి మించిన దానిని తెలుపునది బహువచనం. భారతీయ భాషలలో సంస్కృతంలోమాత్రమే ద్వివచనం కనిపిస్తుంది.

శబ్దాలకు ఏడు విభక్తులు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి, పంచమి, షష్ఠి, సప్తమి. సంబోధన ప్రథమనుకూడ లెక్కించినచో ఎనిమిది.

సుబంతాలలో లింగం, వచనం, విభక్తి లేనివి అవ్యయాలు. వీటి రూపంలో ఎట్టి మార్పులు కలుగవు. రామ శబ్దానికి ప్రథమాది విభక్తులలో ఏకవచన శబ్ద రూపాలను గమనించండి.

| | | |
|---|---|---|
| రామః శరణం సమస్త జగతామ్ | - | ప్రథమా విభక్తి |
| రామం వినా కా గతిః | - | ద్వితీయా విభక్తి |
| రామేణ ప్రతిహన్యతే కలిమలమ్ | - | తృతీయా విభక్తి |
| రామాయ తస్మై నమః | - | చతుర్థీ విభక్తి |
| రామాత్ త్రస్యతి కాలభీమభుజగః | - | పంచమీ విభక్తి |
| రామస్య వశే సర్వమ్ అస్తి | - | షష్ఠీ విభక్తి |
| రామే భక్తిః అఖండితా భవతుమే | - | సప్తమీ విభక్తి |
| రామ! త్వమేవ ఆశ్రయః | - | సంబోధన ప్రథమా విభక్తి |

క్రింది శ్లోకంలో ప్రథమాది విభక్తులలో గురు శబ్దానికి ఏకవచన రూపాలను గమనించండి.

గురురేవ గతిః, గురుమేవ భజే, గురుణైవ సహాస్మి, నమో గురవే ।

న గురోః పరమం, శిశురస్మి గురోః, మతిరస్తి గురౌమమ, పాహి గురో! ॥

## అజంత పుంలింగ సాధారణ శబ్దాః

**1. అకారాంతః పుంలింగో రామశబ్దః (రాముడు)**

| **ఏకవచనమ్** | **ద్వివచనమ్** | **బహువచనమ్** | **విభక్తిః** |
|---|---|---|---|
| రామః | రామౌ | రామాః | ప్రథమా విభక్తిః |
| హే రామ | హే రామౌ | హే రామాః | సంబోధనా ప్రథమా విభక్తిః |
| రామమ్ | రామౌ | రామాన్ | ద్వితీయా విభక్తిః |
| రామేణ | రామాభ్యామ్ | రామైః | తృతీయా విభక్తిః |
| రామాయ | రామాభ్యామ్ | రామేభ్యః | చతుర్థీ విభక్తిః |
| రామాత్ | రామాభ్యామ్ | రామేభ్యః | పంచమీ విభక్తిః |
| రామస్య | రామయోః | రామాణామ్ | షష్ఠీ విభక్తిః |
| రామే | రామయోః | రామేషు | సప్తమీ విభక్తిః |

ఏవం కృష్ణః, గోవిందః, ముకుందః, శివః, వృక్షః, నిలయః, ఇత్యాదయః

(కృష్ణః, గోవిందః, ముకుందః, శివః, వృక్షః, నిలయః మొదలగు శబ్దాల రూపాలను రామ శబ్ద రూపాల వలె తయారు చేసుకోవాలి).

| **శబ్దము** | **అర్థము** | **విభక్తి** | - | **వచనము** |
|---|---|---|---|---|
| రామః | రాముడు | ప్రథమావిభక్తి | - | ఏకవచనము |
| రామౌ | ఇద్దఱు రాములు | ప్రథమా విభిక్త | - | ద్వివచనము |
| రామాః | బహు రాములు | ప్రథమా విభక్తి | - | బహువచనము |
| హే రామ | ఓ రామా! | సంబోధనా ప్రథమా విభక్తి | - | ఏకవచనము |
| హే రామౌ | ఓ ఇద్దఱు రాములారా! | సంబోధన ప్రథమా విభక్తి | - | ద్వివచనము |
| హే రామాః | ఓ బహు రాములారా! | సంబోధనా ప్రథమా విభక్తి | - | బహువచనము |
| రామమ్ | రాముని | ద్వితీయా విభక్తి | - | ఏకవచనము |
| రామౌ | ఇద్దఱు రాములను | ద్వితీయా విభక్తి | - | ద్వివచనము |
| రామాన్ | బహురాములను | ద్వితీయా విభక్తి | - | బహువచనము |
| రామేణ | రామునిచే | తృతీయా విభక్తి | - | ఏకవచనము |
| రామాభ్యామ్ | ఇద్దఱు రాములచే | తృతీయా విభక్తి | - | ద్వివచనము |
| రామైః | బహు రాములచే | తృతీయా విభక్తి | - | బహువచనము |
| రామాయ | రాముని కొఱకు | చతుర్థీ విభక్తి | - | ద్వివచనము |
| రామాభ్యామ్ | ఇద్దఱు రాముల కొఱకు | చతుర్థీ విభక్తి | - | ద్వివచనము |
| రామేభ్యః | బహు రాముల కొఱకు | చతుర్థీ విభక్తి | - | బహువచనము |
| రామాత్ | రాముని వలన | పంచమీ విభక్తి | - | ఏకవచనము |
| రామాభ్యామ్ | ఇద్దఱు రాముల వలన | పంచమీ విభక్తి | - | ద్వివచనము |
| రామేభ్యః | బహు రాముల వలన | పంచమీ విభక్తి | - | బహువచనము |
| రామస్య | రాముని యొక్క | షష్ఠీ విభక్తి | - | ఏకవచనము |
| రామయోః | ఇద్దరు రాముల యొక్క | షష్ఠీ విభక్తి | - | ద్వివచనము |
| రామాణామ్ | బహు రాముల యొక్క | షష్ఠీ విభక్తి | - | బహువచనము |
| రామే | రాముని యందు | సప్తమీ విభక్తి | - | ఏకవచనము |
| రామయోః | ఇద్దఱు రాముల యందు | సప్తమీ విభక్తి | - | ద్వివచనము |
| రామేషు | బహు రాముల యందు | సప్తమీ విభక్తి | - | బహువచనము |

మిగిలిన శబ్దాలకు ఈ విధంగానే రూపాలను తయారు చేసుకోవాలి.

**2. ఇకారాంతః పుంలింగో హరి శబ్దః (విష్ణువు)**

| | | |
|---|---|---|
| హరిః | హరీ | హరయః |
| హే హరే | హే హరీ | హే హరయః |
| హరిమ్ | హరీ | హరీన్ |
| హరిణా | హరిభ్యామ్ | హరిభిః |
| హరయే | హరిభ్యామ్ | హరిభ్యః |
| హరేః | హరిభ్యామ్ | హరిభ్యః |
| హరేః | హర్యోః | హరీణామ్ |
| హరౌ | హర్యోః | హరిషు |

ఏవం కవిః, అగ్నిః, రవిః, దాశరథిః, ఇత్యాదయః

**3. ఉకారాంతః పుంలింగః శంభుశబ్దః (శివుడు)**

| | | |
|---|---|---|
| శంభుః | శంభూ | శంభవః |
| హే శంభో | హే శంభూ | హే శంభవః |
| శంభుమ్ | శంభూ | శంభూన్ |
| శంభునా | శంభుభ్యామ్ | శంభుభిః |
| శంభవే | శంభుభ్యామ్ | శంభుభ్యః |
| శంభోః | శంభుభ్యామ్ | శంభుభ్యః |
| శంభోః | శంభ్వోః | శంభునామ్ |
| శంభౌ | శంభ్వోః | శంభుషు |

ఏవం విష్ణుః, భానుః, విధుః, ఇత్యాదయః

**4. ఋకారంతః పుంలింగో ధాతృశబ్దః (బ్రహ్మ)**

| | | |
|---|---|---|
| ధాతా | ధాతారౌ | ధాతారః |
| హే ధాతః | హే ధాతారౌ | హే ధాతారః |
| ధాతారామ్ | ధాతారౌ | ధాతౄన్ |
| ధాత్రా | ధాతృభ్యామ్ | ధాతృభిః |
| ధాత్రే | ధాతృభ్యామ్ | ధాతృభ్యః |

| | | |
|---|---|---|
| ధాతుః | ధాతృభ్యామ్ | ధాతృభ్యః |
| ధాతుః | ధాత్రోః | ధాతౄణామ్ |
| ధాతరి | ధాత్రోః | ధాతృషు |

ఏవం శాస్తా, కర్తా ఇత్యాదయః.

**5. ఋకారాంతః పుంలింగః పితృశబ్దః (తండ్రి)**

| | | |
|---|---|---|
| పితా | పితరౌ | పితరః |
| హే పితః | హే పితరౌ | హే పితరః |
| పితరమ్ | పితరౌ | పితౄన్ |

శేషం ధాతృ శబ్దవత్.

ఏవం జామాతా, భ్రాతా ఇత్యాదయః.

**6. ఓకారాంతః పుంలింగో గోశబ్దః (ఎద్దు)**

| | | |
|---|---|---|
| గౌః | గావౌ | గావః |
| హే గౌః | హే గావౌ | హే గావః |
| గామ్ | గావౌ | గాః |
| గవా | గోభ్యామ్ | గోభిః |
| గవే | గోభ్యామ్ | గోభ్యః |
| గోః | గోభ్యామ్ | గోభ్యః |
| గోః | గవోః | గవామ్ |
| గవి | గవోః | గోషు |

ఏవం సుద్యోః, స్మృత్యోః, ఇత్యాదయః.

ఇత్యజంత పుంలింగ సాధారణ శబ్దాః

## అజంత స్త్రీ లింగ సాధారణ శబ్దాః

**7. అకారాంతః స్త్రీ లింగో రమాశబ్దః (లక్ష్మి)**

| | | |
|---|---|---|
| రమా | రమే | రమాః |
| హే రమే | హే రమే | హే రమాః |

| | | |
|---|---|---|
| రమామ్ | రమే | రమాః |
| రమయా | రమాభ్యామ్ | రమాభిః |
| రమాయై | రమాభ్యామ్ | రమాభ్యః |
| రమాయాః | రమాభ్యామ్ | రమాభ్యః |
| రమాయాః | రమయోః | రమాణామ్ |
| రమాయామ్ | రమయోః | రమాసు |

ఏవం సీతా, భామా, పద్మా ఇత్యాదయః.

**8. ఇకారాంతః స్త్రీలింగో మతిశబ్దః (బుద్ధి)**

| | | |
|---|---|---|
| మతిః | మతీ | మతయః |
| హే మతే | హే మతీ | హేమతయః |
| మతిమ్ | మతీ | మతీః |
| మత్యా | మతిభ్యామ్ | మతిభిః |
| మత్యై, మతయే | మతిభ్యామ్ | మతిభ్యః |
| మత్యాః, మతేః | మతిభ్యామ్ | మతిభ్యః |
| మత్యాః, మతేః | మత్యోః | మతీనామ్ |
| మత్యామ్, మతౌ | మత్యోః | మతిషు |

ఏవం రుచిః, ఘృణిః ఇత్యాదయః.

**9. ఈకారాంతః స్త్రీలింగో గౌరీశబ్దః (పార్వతి)**

| | | |
|---|---|---|
| గౌరీ | గౌర్యౌ | గౌర్యః |
| హే గౌరి | హే గౌర్యౌ | హే గౌర్యః |
| గౌరీమ్ | గౌర్యౌ | గౌరీః |
| గౌర్యా | గౌరీభ్యామ్ | గౌరీభిః |
| గౌర్యై | గౌరీభ్యామ్ | గౌరీభ్యః |
| గౌర్యాః | గౌరీభ్యామ్ | గౌరీభ్యః |
| గౌర్యాః | గౌర్యోః | గౌరీణామ్ |
| గౌర్యామ్ | గౌర్యోః | గౌరీషు |

ఏవం వాణీ, నదీ ఇత్యాదయః.

**10. ఉకారాంతః స్త్రీలింగో ధేనుశబ్దః (ఆవు)**

| | | |
|---|---|---|
| ధేనుః | ధేనూ | ధేనవః |
| హే ధేనో | హే ధేనూ | దే ధేనవః |
| ధేనుమ్ | ధేనూ | ధేనూః |
| ధేన్వా | ధేనుభ్యామ్ | ధేనుభిః |
| ధేన్వై, ధేనవే | ధేనుభ్యామ్ | ధేనుభ్యః |
| ధేన్వాః, ధేనోః | ధేనుభ్యామ్ | ధేనుభ్యః |
| ధేన్వాః, ధేనోః | ధేన్వోః | ధేనూనామ్ |
| ధేన్వామ్, ధేనౌ | ధేన్వోః | ధేనుషు |

ఏవం తనుః, ఇషుః, పటుః ఇత్యాదయః

**11. ఊకారాంతః స్త్రీ లింగో వధూ శబ్దః (స్త్రీ)**

| | | |
|---|---|---|
| వధూః | వధ్వౌ | వధ్వః |
| హే వధు | హే వధ్వౌ | హే వధ్వః |
| వధూమ్ | వధ్వౌ | వధూః |
| వధ్వా | వధూభ్యామ్ | వధూభిః |
| వధ్వై | వధూభ్యామ్ | వధూభ్యః |
| వధ్వాః | వధూభ్యామ్ | వధూభ్యః |
| వధ్వాః | వధ్వోః | వధూనామ్ |
| వధ్వామ్ | వధ్వోః | వధూషు |

ఏవం తనూః, చమూః, ఇత్యాదయః.

**12. ఋకారంతః స్త్రీలింగో మాతృశబ్ద (తల్లి)**

| | | |
|---|---|---|
| మాతా | మాతరౌ | మాతరః |
| హేమాతః | హే మాతరౌ | హేమాతరః |
| మాతరమ్ | మాతరౌ | మాతౄః |

శేషం ధాతృశబ్దవత్

ఏవం యాతా, ననాందా, దుహితా ఇత్యాదయః

ఇత్యజంత స్త్రీలింగ సాధారణ శబ్దాః

## అజంత నపుంసకలింగ సాధారణ శబ్దాః

**13. అకారాంతః నపుంసకలింగో వనశబ్దః (వనము)**

| | | |
|---|---|---|
| వనమ్ | వనే | వనాని |
| హే వన | హే వనే | వనాని |
| వనేన | వనాభ్యామ్ | వనైః |
| వనాయ | వనాభ్యామ్ | వనేభ్యః |
| వనాత్ | వనాభ్యామ్ | వనేభ్యః |
| వనస్య | వనయోః | వనానామ్ |
| వనే | వనయోః | వనేషు |

ఏవం జ్ఞానమ్, ధనమ్, ఫలమ్ ఇత్యాదయః

**14. ఇకారాంతః నపుంసకలింగో వారి శబ్దః (నీరు)**

| | | |
|---|---|---|
| వారి | వారిణీ | వారీణి |
| హే వారే, హే వారి | హే వారిణీ | హే వారీణి |
| వారి | వారిణీ | వారీణి |
| వారిణా | వారిభ్యామ్ | వారిభిః |
| వారిణే | వారిభ్యామ్ | వారిభ్యః |
| వారిణః | వారిభ్యామ్ | వారిభ్యః |
| వారిణః | వారిణోః | వారీణామ్ |
| వారిణి | వారిణోః | వారిషు |

ఏవం కరాంఘ్రి, హరహరి ఇత్యాదయః

**15. ఉకారాంతః నపుంసకలింగః మధుశబ్దః (తేనె)**

| | | |
|---|---|---|
| మధు | మధునీ | మధూని |
| హే మధో, హే మధు | హే మధునీ | హే మధూని |
| మధు | మధునీ | మధూని |

| | | |
|---|---|---|
| మధునా | మధుభ్యామ్ | మధుభిః |
| మధునే | మధుభ్యామ్ | మధుభ్యః |
| మధునః | మధుభ్యామ్ | మధుభ్యః |
| మధునః | మధుభ్యామ్ | మధుభ్యః |
| మధునః | మధునోః | మధూనామ్ |
| మధుని | మధునోః | మధుషు |

ఏవమ్ అంబు, అశ్రు, వస్తు, దారు ఇత్యాదయః

ఇత్యజంత నపుంసకలింగ సాధారణ శబ్దాః

## హలంత పుంలింగ సాధారణ శబ్దాః

16. **చకారాంతః పుంలింగో జలముక్ఛబ్దః (మేఘం)**

| | | |
|---|---|---|
| జలముక్ | జలముచౌ | జలముచః |
| హే జలముక్ | హే జలముచౌ | హే జలముచః |
| జలముచమ్ | జలముచౌ | జలముచః |
| జలముచా | జలముగ్భ్యామ్ | జలముగ్భిః |
| జలముచే | జలముగ్భ్యామ్ | జలముగ్భ్యః |
| జలముచః | జలముగ్భ్యామ్ | జలముగ్భ్యః |
| జలముచః | జలముచోః | జలముచామ్ |
| జలముచి | జలముచోః | జలముక్షు |

ఏవం పయోముచ్, సువాచ్ ఇత్యాదయః

17. **జకారాంతః పుంలింగో వణిక్ఛబ్దః (వ్యాపారి)**

| | | |
|---|---|---|
| వణిక్ | వణిజౌ | వణిజః |
| హే వణిక్ | హే వణిజౌ | హే వణిజః |
| వణిజమ్ | వణిజౌ | వణిజః |
| వణిజా | వణిగ్భ్యామ్ | వణిగ్భిః |

| | | |
|---|---|---|
| వణిజే | వణిగ్భ్యామ్ | వణిగ్భ్యః |
| వణిజః | వణిగ్భ్యామ్ | వణిగ్భ్యః |
| వణిజః | వణిజోః | వణిజామ్ |
| వణిజః | వణిజోః | వణిక్షు |

ఏవం భిషజ్, ఋత్విజ్ ఇత్యాదయః

**18. తకారాంతః పుంలింగో మరుచ్ఛబ్దః (గాలి)**

| | | |
|---|---|---|
| మరుత్ | మరుతౌ | మరుతః |
| హే మరుత్ | హే మరుతౌ | హే మరుతః |
| మరుతమ్ | మరుతౌ | మరుతః |
| మరుతా | మరుద్భ్యామ్ | మరుద్భిః |
| మరుతే | మరుద్భ్యామ్ | మరుద్భ్యః |
| మరుతః | మరుద్భ్యామ్ | మరుద్భ్యః |
| మరుతః | మరుతోః | మరుతామ్ |
| మరుతి | మరుతోః | మరుత్సు |

ఏవం భాష్యకత్, ఇంద్రజిత్, జాగ్రత్, శాసత్, చకాసత్, దధత్, దదత్, బిభ్రత్ ఇత్యాదయః

**19. నకారాంతః పుంలింగో రాజన్ శబ్దః (రాజు)**

| | | |
|---|---|---|
| రాజా | రాజానౌ | రాజానః |
| హేరాజన్ | హేరాజానౌ | హే రాజానః |
| రాజానమ్ | రాజానౌ | రాజ్ఞః |
| రాజ్ఞా | రాజభ్యామ్ | రాజభిః |
| రాజ్ఞే | రాజభ్యామ్ | రాజభ్యః |
| రాజ్ఞః | రాజభ్యామ్ | రాజభ్యః |
| రాజ్ఞః | రాజ్ఞోః | రాజ్ఞామ్ |
| రాజ్ఞి, రాజని | రాజ్ఞోః | రాజసు |

ఏవం మహిమన్, అణిమన్, గరిమన్, లఘిమన్, సునామన్ ఇత్యాదయః

**20. నకారాంతః పుంలింగః ఆత్మన్ శబ్దః (ఆత్మ, తాను)**

| | | |
|---|---|---|
| ఆత్మా | ఆత్మానౌ | ఆత్మానః |
| హే ఆత్మన్ | హే ఆత్మానౌ | హే ఆత్మానః |
| ఆత్మానమ్ | ఆత్మానౌ | ఆత్మనః |

| | | |
|---|---|---|
| ఆత్మనా | ఆత్మభ్యామ్ | ఆత్మభిః |
| ఆత్మనే | ఆత్మభ్యామ్ | ఆత్మభ్యః |
| ఆత్మనః | ఆత్మభ్యామ్ | ఆత్మభ్యః |
| ఆత్మనః | ఆత్మనోః | ఆత్మనామ్ |
| ఆత్మని | ఆత్మనోః | ఆత్మసు |

ఏవం బ్రహ్మన్, అధ్వన్ ఇత్యాదయః

21. **నకారాంతః పుంలింగో గుణిన్ శబ్దః (గుణవంతుడు)**

| | | |
|---|---|---|
| గుణీ | గుణినౌ | గుణినః |
| హే గుణిన్ | హే గుణినౌ | హే గుణినః |
| గుణినమ్ | గుణినౌ | గుణినః |
| గుణినా | గుణిభ్యామ్ | గుణిభిః |
| గుణినే | గుణిభ్యామ్ | గుణిభ్యః |
| గుణినః | గుణిభ్యామ్ | గుణిభ్యః |
| గుణినః | గుణినోః | గుణినామ్ |
| గుణిని | గుణినోః | గుణిషు |

ఏవం యశ్వసిన్, తేజస్విన్, ధనిన్, శశిన్, కరిన్ ఇత్యాదయః

ఇతి హలంత పుంలింగ సాధారణ శబ్దాః

# హలంత స్త్రీలింగ సాధారణ శబ్దాః

22. **భకారాంతః స్త్రీలింగః కకుప్శబ్దః (దిక్కు)**

| | | |
|---|---|---|
| కకుప్ | కకుభౌ | కకుభః |
| హే కకుప్ | హే కకుభౌ | హే కకుభః |
| కకుభమ్ | కకుభౌ | కకుభః |
| కకుభా | కకుబ్భ్యామ్ | కకుభిః |
| కకుభే | కకుబ్భ్యామ్ | కకుభ్యః |

| | | |
|---|---|---|
| కకుభః | కకుభ్భ్యామ్ | కకుభ్యః |
| కకుభః | కకుభోః | కకుభామ్ |
| కకుభి | కకుభోః | కకుప్సు |

**23. రేఫాంతః స్త్రీలింగో గీర్శబ్దః (వాక్కు)**

| | | |
|---|---|---|
| గీః | గిరౌ | గిరః |
| హే గీః | హే గిరౌ | హే గిరః |
| గిరమ్ | గిరౌ | గిరః |
| గిరా | గీర్భ్యామ్ | గీర్భిః |
| గిరే | గీర్భ్యామ్ | గీర్భ్యః |
| గిరః | గీర్భ్యామ్ | గీర్భ్యః |
| గిరః | గిరోః | గిరామ్ |
| గిరి | గిరోః | గీర్షు |

**24. శకారాంతః స్త్రీలింగో దిక్శబ్దః (దిక్కు)**

| | | |
|---|---|---|
| దిక్ | దిశౌ | దిశః |
| హే దిక్ | హే దిశౌ | హే దిశః |
| దిశమ్ | దిశౌ | దిశః |
| దిశా | దిగ్భ్యామ్ | దిగ్భిః |
| దిశే | దిగ్భ్యామ్ | దిగ్భ్యః |
| దిశః | దిగ్భ్యామ్ | దిగ్భ్యః |
| దిశః | దిశోః | దిశామ్ |
| దిశి | దిశోః | దిక్షు |

ఏవం దృక్, యాదృక్, తాదృక్ ఇత్యాదయః

ఇతి హలంత స్త్రీ లింగ సాధారణ శబ్దాః

# హలంత నపుంసకలింగ సాధారణ శబ్దాః

**25. నకారాంతః** నపుంసకలింగః **కర్మన్ శబ్దః (పని)**

| | | |
|---|---|---|
| కర్మ | కర్మణీ | కర్మాణి |
| హే కర్మన్, హే కర్మ | హే కర్మణీ | హే కర్మాణి |
| కర్మ | కర్మణీ | కర్మాణి |
| కర్మణా | కర్మభ్యామ్ | కర్మభిః |
| కర్మణే | కర్మభ్యామ్ | కర్మభ్యః |
| కర్మణః | కర్మభ్యామ్ | కర్మభ్యః |
| కర్మణః | కర్మణోః | కర్మణామ్ |
| కర్మణి | కర్మణోః | కర్మసు |

ఏవం వర్మన్, సద్మన్, ఇత్యాదయః

**26. నకారాంతః నపుంసకలింగో నామన్ శబ్దః (పేరు)**

| | | |
|---|---|---|
| నామ | నామ్నీ, నామనీ | నామాని |
| హే నామన్, హే నామ | హే నామ్నీ, హే నామనీ | హే నామాని |
| నామ | నామ్నీ, నామనీ | నామాని |
| నామ్నా | నామభ్యామ్ | నామభిః |
| నామ్నే | నామభ్యామ్ | నామభ్యః |
| నామ్నః | నామభ్యామ్ | నామభ్యః |
| నామ్నః | నామ్నోః | నామ్నామ్ |
| నామ్ని, నామని | నామ్నోః | నామసు |

ఏవం ధామన్, హేమన్ ఇత్యాదయః

**27. సకారాంతః నపుంసకలింగో మనశ్శబ్దః (మనస్సు)**

| | | |
|---|---|---|
| మనః | మనసీ | మనాంసి |
| హే మనః | హే మనసీ | హే మనాంసి |
| మనః | మనసీ | మనాంసి |

| | | |
|---|---|---|
| మనసా | మనోభ్యామ్ | మనోభిః |
| మనసే | మనోభ్యామ్ | మనోభ్యః |
| మనసః | మనోభ్యామ్ | మనోభ్యః |
| మనసః | మనసోః | మనసామ్ |
| మనసి | మనసోః | మనస్సు |

ఏవం వయః, పయః ఇత్యాదయః

# సర్వనామ శబ్దాః

**28. అకారాంతః పుంలింగః సర్వశబ్దః (అందరు)**

| | | |
|---|---|---|
| సర్వః | సర్వౌ | సర్వే |
| హే సర్వ | హే సర్వౌ | హే సర్వే |
| సర్వమ్ | సర్వౌ | సర్వాన్ |
| సర్వేణ | సర్వాభ్యామ్ | సర్వైః |
| సర్వస్మై | సర్వాభ్యామ్ | సర్వేభ్యః |
| సర్వస్మాత్ | సర్వాభ్యామ్ | సర్వేభ్యః |
| సర్వస్య | సర్వయోః | సర్వేషామ్ |
| సర్వస్మిన్ | సర్వయోః | సర్వేషు |

ఏవమ్ అన్య, ఇతర, సమ ఇత్యాదయః

**29. అకారాంతః స్త్రీలింగః సర్వా శబ్దః (అందరు)**

| | | |
|---|---|---|
| సర్వా | సర్వే | సర్వాః |
| హే సర్వే | హే సర్వే | హే సర్వాః |
| సర్వామ్ | సర్వే | సర్వాః |
| సర్వయా | సర్వాభ్యామ్ | సర్వాభిః |
| సర్వస్యై | సర్వాభ్యామ్ | సర్వాభ్యః |
| సర్వస్యాః | సర్వాభ్యామ్ | సర్వాభ్యః |

| | | |
|---|---|---|
| సర్వస్యాః | సర్వయోః | సర్వాసామ్ |
| సర్వస్యామ్ | సర్వయోః | సర్వాసు |

**30. అకారాంతః నపుంసకలింగః సర్వశబ్దః (సమస్తం)**

| | | |
|---|---|---|
| సర్వమ్ | సర్వే | సర్వాణి |
| హే సర్వ | హే సర్వే | హే సర్వాణి |
| సర్వమ్ | సర్వే | సర్వాణి |
| సర్వేణ | సర్వాభ్యామ్ | సర్వైః |
| సర్వస్మై | సర్వాభ్యామ్ | సర్వేభ్యః |
| సర్వస్మాత్ | సర్వాభ్యామ్ | సర్వేభ్యః |
| సర్వస్య | సర్వయోః | సర్వేషామ్ |
| సర్వస్మిన్ | సర్వయోః | సర్వేషు |

**31. దకారాంతః యుష్మచ్ఛబ్దః (నీవు)**

| | | |
|---|---|---|
| త్వమ్ | యువామ్ | యూయమ్ |
| త్వామ్, త్వా | యువాం, వామ్ | యుష్మాన్, వః |
| త్వయా | యువాభ్యామ్ | యుష్మాభిః |
| తుభ్యమ్, తే | యువాభ్యామ్, వామ్ | యుష్మభ్యమ్, వః |
| త్వత్ | యువాభ్యామ్ | యుష్మత్ |
| తవ, తే | యువయోః, వామ్ | యుష్మాకమ్, వః |
| త్వయి | యువయోః | యుష్మాసు |

**32. దకారాంతః అస్మచ్ఛబః (నేను)**

| | | |
|---|---|---|
| అహమ్ | ఆవామ్ | వయమ్ |
| మామ్, మా | ఆవామ్, నౌ | అస్మాన్, నః |
| మయా | ఆవాభ్యామ్ | అస్మాభిః |
| మహ్యమ్, మే | ఆవాభ్యామ్, నౌ | అస్మభ్యమ్, నః |
| మత్ | ఆవాభ్యామ్ | అస్మత్ |
| మమ, మే | ఆవయోః నౌ | అస్మాకమ్, నః |
| మయి | ఆవయోః | అస్మాసు |

**33. దకారాంతః పుంలింగః యచ్ఛబ్దః (ఎవడైతే)**

| | | |
|---|---|---|
| యః | యౌ | యే |
| యమ్ | యౌ | యాన్ |
| యేన | యాభ్యామ్ | యైః |
| యస్మై | యాభ్యామ్ | యేభ్యః |
| యస్మాత్ | యాభ్యామ్ | యేభ్యః |
| యస్మై | యయోః | యేషామ్ |
| యస్మిన్ | యయోః | యేషు |

**34. దకారాన్తః పుంలింగః తచ్ఛబ్దః (అతడు)**

| | | |
|---|---|---|
| సః | తౌ | తే |
| తమ్ | తౌ | తాన్ |
| తేన | తాభ్యామ్ | తైః |
| తస్మై | తాభ్యామ్ | తేభ్యః |
| తస్మాత్ | తాభ్యామ్ | తేభ్యః |
| తస్య | తయోః | తేషామ్ |
| తస్మిన్ | తయోః | తేషు |

**35. దకారాంతః స్త్రీలింగః యచ్ఛబ్దః**

| | | |
|---|---|---|
| యా | యే | యాః |
| యామ్ | యే | యాః |
| యయా | యాభ్యామ్ | యాభిః |
| యస్యై | యాభ్యామ్ | యాభ్యః |
| యస్యాః | యాభ్యామ్ | యాభ్యః |
| యస్యాః | యయోః | యాసామ్ |
| యస్యామ్ | యయోః | యాసు |

**36. దకారాంతః స్త్రీలింగః తచ్ఛబ్దః**

| | | |
|---|---|---|
| సా | తే | తాః |
| తామ్ | తే | తాః |

| | | |
|---|---|---|
| తయా | తాభ్యామ్ | తాభిః |
| తస్యై | తాభ్యామ్ | తాభ్యః |
| తస్యాః | తాభ్యామ్ | తాభ్యః |
| తస్యాః | తయోః | తాసామ్ |
| తస్యామ్ | తయోః | తాసు |

**37. దకారాంతః నపుంసకలింగః యచ్ఛబ్దః**

| | | |
|---|---|---|
| యత్ | యే | యాని |
| యత్ | యే | యాని |
| యేన | యాభ్యామ్ | యైః |
| యస్మై | యాభ్యామ్ | యేభ్యః |
| యస్మాత్ | యాభ్యామ్ | యేభ్యః |
| యస్య | యయోః | యేషామ్ |
| యస్మిన్ | యయోః | యేషు |

**38. దకారాంతః నపుంసకలింగః తచ్ఛబ్దః**

| | | |
|---|---|---|
| తత్ | తే | తాని |
| తత్ | తే | తాని |
| తేన | తాభ్యామ్ | తైః |
| తస్మై | తాభ్యామ్ | తేభ్యః |
| తస్మాత్ | తాభ్యామ్ | తేభ్యః |
| తస్య | తయోః | తేషామ్ |
| తస్మిన్ | తయోః | తేషు |

**39. మకారాంతః పుంలింగః కిమ్ శబ్దః (ఎవరు)**

| | | |
|---|---|---|
| కః | కౌ | కే |
| కమ్ | కౌ | కాన్ |
| కేన | కాభ్యామ్ | కైః |
| కస్మై | కాభ్యామ్ | కేభ్యః |
| కస్మాత్ | కాభ్యామ్ | కేభ్యః |

| | | |
|---|---|---|
| కస్య | కయోః | కేషామ్ |
| కస్మిన్ | కయోః | కేషు |

40. **మకారాంతః స్త్రీలింగః 'కిమ్' శబ్దః (ఎవరు)**

| | | |
|---|---|---|
| కా | కే | కాః |
| కామ్ | కే | కాః |
| కయా | కాభ్యామ్ | కాభిః |
| కస్యై | కాభ్యామ్ | కాభ్యః |
| కస్యాః | కాభ్యామ్ | కాభ్యః |
| కస్యాః | కయోః | కాసామ్ |
| కస్యామ్ | కయోః | కాసు |

41. **మకారాంతః** నపుంసకలింగః **'కిమ్' శబ్దః (ఏమిటి)**

| | | |
|---|---|---|
| కిమ్ | కే | కాని |
| కిమ్ | కే | కాని |
| కేన | కాభ్యామ్ | కైః |
| కస్మై | కాభ్యామ్ | కేభ్యః |
| కస్మాత్ | కాభ్యామ్ | కేభ్యః |
| కస్య | కయోః | కేషామ్ |
| కస్మిన్ | కయోః | కేషు |

డా॥ పి. వరప్రసాదమూర్తి
అధ్యక్షులు
పాఠ్య నిర్ణాయక మండలి
తెలుగు - ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**పాఠం - 15**

# ధాతువులు

సంస్కృతంలో క్రియా పదానికి మూల రూపాన్ని ధాతువు అంటారు.

ఉదా॥ భవతి - ఇది క్రియా పదం; దీనిలో భూ + అ + తి అనే విభాగముంది. మూడు అక్షరాలున్నాయి గదా! వాటిలో మొదటిది 'భూ' ధాతు రూపం. రెండవది 'అ' వికరణ ప్రత్యయం. మూడవది 'తి' క్రియా విభక్తి ప్రత్యయం.

వికరణ ప్రత్యయం ధాతువుకు క్రియా విభక్తికి మధ్య చేరుతుంది.

↓ ↓

భూ + అ + తి

ఈ వికరణ ప్రత్యయాన్ని ఆధారం చేసుకొని సంస్కృత ధాతువులు దశధా - పది విధాలుగా విభక్తాలు. ఆ విభాగాలు, ఆయా వికరణ ప్రత్యయాలు చేరే ధాతువుల పేరు మీద వ్యవహృతాలౌతాయి. ఉదా॥

వికరణ ప్రత్యయం

↓

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | భూ + అ + తి | = | భ్వాదులు | - | భూ + ఆదులు |
| 2. | అద్ + - + తి | = | ఆదాదులు | - | అద్ + ఆదులు |
| 3. | హు + - + తి | = | జుహోత్యాదులు | - | జుహోతి + ఆదులు |
| 4. | దివ్ + య + తి | = | దివాదులు | - | దివ్ + ఆదులు |
| 5. | సు + ను + తి | = | స్వాదులు | - | సు + ఆదులు |
| 6. | తుద్ + అ + తి | = | తుదాదులు | - | తుద్ + ఆదులు |
| 7. | రుధ్ + న + తి | = | రుధాదులు | - | రుధ్ + ఆదులు |
| 8. | తన్ + ఉ + తి | = | తనాదులు | - | తన్ + ఆదులు |
| 9. | క్రీ + నా + తి | = | క్ర్యాదులు | - | క్రీ + ఆదులు |
| 10. | చుర్ + ఆయ + తి | = | చురాదులు | - | చుర్ + ఆదులు |

ఈ దశ విధ ధాతువులు పరస్మై పదాలు, ఆత్మనే పదాలు అని రెండు భిన్న రూపాలతో ఉంటాయి. ఈ భేదాలు ధాతువుకి చేరే క్రియా విభక్తి ప్రత్యయాలను బట్టి ఏర్పడతాయి. వాటిని గుర్తించడం సులభమే.

ఉదా॥ భవతి - పరస్మై పదం - తి

వర్ధతే - ఆత్మనే పదం - తే

ఈ భేదం - పరస్మై - ఆత్మనే పద భేదం మొదట అన్వర్థంగానే సప్రయోజనంగానే ఏర్పడింది. సంస్కృతంలో పదాలు అధిక భాగం వ్యుత్పన్నాలుగా - వ్యుత్పత్తి అర్థం గ్రహించదగినవిగా ఉంటాయి.

పరస్మై పదమంటే ఆధాతు ప్రయోగం ఇతరునకై చేయబడినది. పరస్మై = ఇతరునకై - పురనకై. అలాగే ఆత్మనేపదం తనకై - వక్తకై చేయబడినది. ఆత్మనే = తనకై - ఆత్మా = తాను.

ఉదా॥ పరస్మై పదం : సూతః పచతి = వంటవాడు వండుతున్నాడు వాడి కోసం గాదు పరుని కోసం.

ఆత్మనే పదం : రామః పచతే = రాముడు వండుతున్నాడు. రాముని కోసమే.

ధాతువులు కొన్ని పరస్మై పదులుగాను కొన్ని ఆత్మనే పదులు గాను, మరికొన్ని ఉభయ పదులుగాను ఉంటాయి. పైన ఉదహరించిన 'పచ్' ధాతువు (పచతి - పచతే) ఉభయపది. కాబట్టి దానికి రెండు రూపాలూ ఉంటాయి. కాని కొన్ని పరస్మై పదులుగాను, మరికొన్ని ఆత్మనే పదులుగాను మాత్రం ఉంటాయి. అంటే వాటికి ఈ ద్వివిధ రూపాలు ఉండవు. ఉండేది ఒకే రూపం.

ఉదా॥

| | | |
|---|---|---|
| భవతి | - భూ | - పరస్మై పదం |
| వర్థతే | - వృథ్ | - ఆత్మనే పదం |

ధాతువు కాలాన్ని (భూత భవిష్యద్వర్తమానాదులు) ధోరణిని (ఆజ్ఞా, ఆశీస్ - మొదలైనవి) తెలుపడానికి సంస్కృతంలోవిస్తృతమైన ఏర్పాటు జరిగింది. ఈ విషయాలు తెలుపడానికి దానిలో పది లకారాలు ఉన్నాయి. ఆ పదింటి పేర్లు ఇవి:

| | | | |
|---|---|---|---|
| 1. | లట్ | 2. | లోట్ |
| 3. | లఙ్ | 4. | (విధి) లిఙ్ |
| 5. | లిట్ | 6. | లుట్ |
| 7. | ల్రుట్ | 8. | లుఙ్ |
| 9. | ఆశీర్లిఙ్ | 10. | ల్రుఙ్ |

వీటిలో లట్, లఙ్, లుఙ్, లిట్, లుట్, ల్రుట్ ఈ ఆరూ కాలాన్ని తెలిపితే మిగిలిన లోట్, విధి లిఙ్, ఆశీర్లిఙ్, ల్రుంఙ్ ఈ నాల్గూ ధోరణి బోధకాలు ఆజ్ఞా మొదలయిన వాగ్ధోరణిని తెల్పుతాయి.

సంస్కృతంలో పదాలన్నీ మూడు వచనాలలో ఏక, ద్వి, బహు వచనాలలో ఉంటాయి. క్రియా పదాలూ మూడు రూపాలలో ఉంటాయి. పదాలు మూడు వచనాలలో ఉండటం ప్రస్తుత జీవద్భాషలలో లేదు. మనకు తెలిసిన ఆంగ్లం, హిందీ, తమిళం వంటి భాషలన్నీ పద సముదాయాన్ని రెండు వచనాలలోనే ఏక, బహు వచనాలలోనే తెల్పుతున్నాయి. అయితే ఈ సంస్కృతం అతి ప్రాచీన భాష. పైగా అది కొన్ని శతాబ్దాల క్రితం ఎలా ఉందో, ఇప్పటికీ అలాగానే ఏ మార్పు, చేర్పు లేకుండా నిలిచిపోయింది. ఆ కారణాన ఆభాషలో మూడు వచనాలు నేటికీ కొనసాగుతున్నాయి.

అయితే భాషలు జన వ్యవహారంలో తప్పని సరిగా మార్పులూ, చేర్పులూ పొందుతాయి. వ్యవహారస్థ భాషలకు ఇది అపరిహార్య లక్షణం - పరిహారింపరాని గుర్తు. కాగా సంస్కృతమని మనం పిలిచే భాష ఒకనాడు వ్యవహారంలో ఉండి క్రమంగా మార్పులూ, చేర్పులూ పొందుతూ, ప్రాకృతంగా, అపభ్రంశంగా, ఆధునిక ఉత్తరాది భాషలుగా మారిపోయింది. అయితే దాని నుండి పుట్టిన ఉత్తరాది భాషలలో ఎక్కడా వచన త్రయం - ఏక, ద్వి, బహు వచనాలు కనిపించవు. రెండే వచనాలు ఏక, బహు వచనాలు.

కాగా మనం సంస్కృత ధాతువులన్నిటికీ మూడు వచనాలలో రూప భేదాలను గ్రహించబోతున్నాం.

సంస్కృతంలో పది లకారాలలో మనం ప్రస్తుతం ఐదు లకారాలను లట్, లోట్, లఙ్, విధిలిఙ్, ల్రుట్ అనే వాటిని అభ్యసిద్దాం.

అలాగే 'భూ' మొదలయిన 30 ధాతువులకు పైన తెల్పిన ఐదు లకారాలలో రూపాలను, వాటి అర్థాలను క్రమంగా గ్రహిద్దాం.

1. **భూ - సత్తాయామ్**

భూ ధాతువు; సత్తా దాని అర్థం. సత్తాయాం అనేది సత్తా పదం - సప్తమీ విభక్తి. సత్తాయాం అంటే ఉనికి యందు అని అర్థం. ధాతువులన్నీ ఈ విధంగానే వాటి అర్థాలతో సహా పఠితాలౌతాయి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | భవతి | భవతః | భవన్తి | ప్రథమ పురుష |
| వర్తమాన కాలం | భవసి | భవథః | భవథ | మధ్యమ పురుష |
| | భవామి | భవావః | భవామః | ఉత్తమ పురుష |

భవతి = ఉంటున్నాడు (ఏక వచనం)

భవతః = (ఇద్దరు) ఉంటున్నారు (ద్వి వచనం)

భవన్తి = ఉంటున్నారు (బహు వచనం)

ఇదే విధంగా మధ్యమ ఉత్తమ పురుషలలోని క్రియలకు అర్థం గ్రహించవచ్చు.

భవసి = ఉంటున్నావు

భవథః = (మీరిద్దరు) ఉంటున్నారు

భవథ = మీరు ఉంటున్నారు

భవామి = ఉంటున్నాను

భవావః = (మేమిద్దరం) ఉంటున్నాము

భవామః = మేము ఉంటున్నాము

ద్వి వచన ప్రయోగం మనకు అపరిచితంగాబట్టి కొత్తగా అనిపిస్తుంది. కాని సంస్కృతంలో అది తప్పదు. సుబంతాలలోను, నామ వాచక పదాలలోను ఈ ద్వి వచనం ఉన్నది.

ఉదా॥ రామౌ = (ఇద్దరు) రాములు.

మిగిలిన లకారాలలో కూడ ముందు చూపిన విధంగా అర్థాలు గ్రహించవలసి ఉంటుంది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | భవతు, భవతాత్ | భవతామ్ | భవన్తు | ప్రథమ పురుష |
| ఆజ్ఞా అశీరర్థాలు | భవ, భవతాత్ | భవతమ్ | భవత | మధ్యమ పురుష |
| | భవాని | భవావ | భవామ | ఉత్తమ పురుష |

భవతు, భవతాత్ = ఉండనీ, ఉండుగాక, = ఉండాలి (వాడు)

భవతామ్ = (వారిద్దరు) ఉండాలి, ఉందురు గాక

భవన్తు = వారు ఉండాలి, ఉందురు గాక

మిగిలిన పురుషులలో కూడ ఈ విధంగానే అర్థాలు గ్రహించవచ్చు.

మధ్యమ పురుష క్రియలకు త్వం - యువాం - యూయం
(నీవు) (మీరిద్దరు) (మీరు)

ఉత్తమ పురుష క్రియలకు అహం - ఆవాం - వయం
(నేను) (మేమిద్దరం) (మేము)

క్రమంగా యుష్మదస్మదర్థక సర్వనామాలు కర్తలుగా ఉంటాయి అనే విషయం మనకు తెలిసిందే.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లజ్ : | అభవత్ | అభవతామ్ | అభవన్ | ప్ర. పు. |
| భూత కాలం | అభవః | అభవతమ్ | అభవత | మ. పు. |
| | అభవమ్ | అభవావ | అభవామ | ఉ. పు. |

అభవత్ = ఉండెను

అభవః = ఉంటివి

అభవమ్ = ఉంటిని

మిగిలిన వచనాలలోను ఈ విధంగా అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధి లిజ్ : | భవేత్ | భవేతామ్ | భవేయుః | ప్ర. పు. |
| ఆదేశం | భవేః | భవేతమ్ | భవేత | మ. పు. |
| | భవేయమ్ | భవేవ | భవేమ | ఉ. పు. |

తెలుగు వ్యవహారంలో ఆదేశార్థంలో ప్రత్యయాంతాలైన క్రియలు ఉండవు. అయినా ఈ సంస్కృత క్రియల్ని తెలుగులో అర్థం చేసుకోడానికి యత్నించాలి.

భవేత్ = అతడుండాలి

భవేః = నీవుండాలి

భవేయమ్ = నేనుండాలి

ఈ విధంగా క్రియ విధిని తెలిపేటట్లు గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | భవిష్యతి | భవిష్యతః | భవిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | భవిష్యసి | భవిష్యథః | భవిష్యథ | మ. పు. |
| | భవిష్యామి | భవిష్యావః | భవిష్యామః | ఉ. పు. |

భవిష్యతి = ఉండగలడు

భవిష్యసి = ఉండగలవు

భవిష్యామి = ఉండగలను

ఇతర పురుష - ఇతర వచనాలలో కూడ అర్థం సులభంగా గ్రహించవచ్చు.

**2. జీ - జయే**

జీ దాతువు జయార్థంలో ప్రయుక్తమౌతుంది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | జయతి | జయతః | జయన్తి | ప్ర. పు. |
| వర్తమాన కాలం | జయసి | జయథః | జయథ | మ. పు. |
| | జయామి | జయావః | జయామః | ఉ. పు. |

జయతి = జయిస్తున్నాడు - గెలుస్తున్నాడు

జయసి = జయిస్తున్నావు - గెలుస్తున్నావు

జయామి = జయిస్తున్నాను - గెలుస్తున్నాను

ఇతర క్రియా పదాల అర్థాలనూ ఈ పద్ధతిలోనే గ్రహించవచ్చు. ప్రతి చోట ద్వివచన మొకటి ఉన్నదని గుర్తుండాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | జయతు, జయతాత్ | జయతామ్ | జయన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదులు | జయ, జయతాత్ | జయతమ్ | జయత | మ. పు. |
| | జయాని | జయావ | జయామ | ఉ. పు. |

జయతు, జయతాత్ జయించు గాక. జయించాలి

ఈ పదానికి జయించనీ వంటి అర్థం ఉంది వ్యవహారంలో. కాని ఆ జయించనీ అనే పదం స్వభావరీత్యా మధ్యమ పురుష ఏకవచన రూపమే. 'జయ' ధాతు లోట్ - మధ్యమ పురుష - ఏకవచనార్థకమది. జయించనిమ్ము - జయించనీ - వాస్తవానికి ఇది ఈ రూపం జయించు + ఇచ్చు - ఈ రెండు క్రియల సమ్మిళిత రూపం. తెలుగు క్రియా పదాలను సంస్కృతాలకు సరి సమానంగా -

అన్యూనాతిరేకంగా - హెచ్చు - తగ్గులు లేకుండా చెప్పడం ఒక విధంగా అసంభవమనవచ్చు. తెలుగులో క్రియాపద నిర్మాణం - విస్తృతి సంస్కృతంతో పోల్చి చూచినపుడు చిన్నది. అందువలన పర్యాయపదాలు చెప్పడంలో ఈ రకం తంటాలు తప్పవు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అజయత్ | అజయతామ్ | అజయన్ | ప్ర. పు. |
| భూత కాలం | అజయః | అజయతమ్ | అజయత | మ. పు. |
| | అజయమ్ | అజయావ | అజయామ | ఉ. పు. |

అజయత్ = జయించెను

అజయః = జయించితివి

అజయమ్ = జయించితిని

మిగిలిన పురుషలలో వచనాలలో ఈ విధంగా అర్థాలు గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధి లిఙ్ : | జయేత్ | జయేతామ్ | జయేయుః | ప్ర. పు. |
| నిర్ధేశార్థకం | జయేః | జయేతమ్ | జయేత | మ. పు. |
| | జయేయమ్ | జయేవ | జయేమ | ఉ. పు. |

జయేత్ = జయించాలి (వాడు)

జయేః = జయించాలి (నీవు)

జయేయమ్ = జయించాలి (నేను)

తెలుగు క్రియా పద నిర్మాణం దాని విస్తృతి చిన్నది - అనడానికి ఈ ఉదాహరణలు దృష్టాంతం.

మిగిలిన పురుషలలో, వచనాలలో కూడ సందర్భాన్ని బట్టి కర్తృపదాన్ని గుర్తిస్తూ ఈ జయించవలెను, జయించాలి అనే ఏకమాత్ర పదమే విధ్యర్థకంగా వాడుకోవలసి ఉన్నది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | జేష్యతి | జేష్యతః | జేష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | జేష్యసి | జేష్యథః | జేష్యథ | మ. పు. |
| | జేష్యామి | జేష్యావః | జేష్యామః | ఉ. పు. |

జేష్యతి = జయించగలడు

జేష్యతః = (వారిద్దరు) జయించగలరు

జేష్యన్తి = జయించగలరు

మిగిలిన మధ్యమ ఉత్తమ పురుషులలోని వచనాలలో గూడ పై విధంగా సులభంగా అర్థ గ్రహణం చేయవచ్చు. ఏ భాషలోనైనా తప్పనిసరిగా ఉండవలసిన క్రియా పదాలు - వర్తమాన భూత భవిష్యదర్థకాలు. అంటే సంస్కృతంలో అవి లట్, లఙ్, ల్బడర్థకాలు, అందుకే ఆ మూడింటిని విద్యార్థులకు బోధించడం జరిగింది. పైగా అవి తెలుగు వ్యవహారంలోని ఆ మూడు విధాలయిన క్రియా పదాలకు సులభ గ్రాహ్యంగా అమరిపోతాయి. అయితే సంస్కృతంలోని క్రియా నిర్మాణ రీతి తెలియడం కోసం అదనంగా మరొక రెండు లకారాల్ని లోట్, విధి. లిఙ్ లను పరిచయం చేసికొన్నాం.

సంస్కృతంలో విస్తృత క్రియా పద నిర్మాణప్రక్రియ పదిలకారాలలో నిర్మితమై ఉన్నదని పాఠ ప్రారంభంలో గ్రహించి ఉన్నాం. గమనించదగ్గ మరొక విశేషమేమిటంటే సంస్కృతంలో 11వ లకారం గూడ మరొకటి ఉంది. దాన్ని లేట్ అంటారు. అది వేద వాఙ్మయంలో మాత్రం ప్రయుక్తమై ఉంటుంది.

**3. నీ(ఞ్) -** ప్రాపణే నీ ధాతువు, ప్రాపణం దాని అర్థం. ఈ అర్థాలన్నీ సప్త మ్యంతాలుగా - సప్తమీ ఏకవచనంలో ఉంటాయి. అని గ్రహించి ఉన్నాం.

ప్రాపణం = పొందించడం, కొనిపోవడం

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | నయతి | నయత : | నయన్తి | ప్ర. పు. |
| | నయసి | నయథ : | నయథ | మ. పు. |
| | నయామి | నయావ : | నయామ : | ఉ. పు. |

నయతి = కొనిపోతున్నాడు

నయసి = కొనిపోతున్నావు

నయామి = కొనిపోతున్నాను

మిగిలిన పురుషులలో వచనాలలో కూడ అర్థాలు పైన చూపినట్లు సులభంగానే గ్రహించవచ్చు.

మన అలవాటుకు భిన్నంగా ఈ భాషలో ద్వివచనాన్ని మాత్రం గుర్తుంచుకోవాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | నయతు, నయతాత్ | నయతామ్ | నయన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికార్థం | నయ, నయతాత్ | నయతమ్ | నయత | మ. పు. |
| | నయాని | నయావ | నయామ | ఉ. పు. |

నయ, నయతాత్ = కొనిపొమ్ము, కొనిపోవాలి

నయతమ్ = (మీరిద్దరు) కొనిపొండు - కొనిపోవాలి

నయత = కొనిపొండు, కొనిపోవాలి

మిగిలిన ప్రథమ ఉత్తమ పురుషులలోని ఏక ద్వి బహు వచనాలకు కూడ పైన చూపిన విధంగా తెలుగులో అర్థాలు గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అనయత్ | అనయతామ్ | అనయన్ | ప్ర. పు. |
| భూత కాలం | అనయః | అనయతమ్ | అనయత | మ. పు. |
| | అనయమ్ | అనయావ | అనయామ | ఉ. పు. |

అనయమ్ = కొనిపోతిని

అనయావ = (మేమిద్దరం) కొనిపోతిమి

అనయామ = కొనిపోతిమి

మిగిలిన ప్రథమ మధ్యమ పురుషులలోని మూడు వచనాలకు ఏక ద్వి బహు వచనాలకూ పై విధంగానే ఆంధ్రార్థాలు గ్రహించవలసి ఉంది.

సంస్కృత క్రియా రూపాలను గమనించినపుడు ప్రథమ పురుష ప్రత్యయాలు, మధ్యమ పురుష ప్రత్యయాలు, ఉత్తమ పురుష ప్రత్యయాలు భిన్నంగా ఆకారాన్ని బట్టి ఇంకా భిన్నంగా ఉంటున్నట్లు గమనిస్తున్నాం.

తెలుగులో అయితే ఈ క్రియా విభక్తి ప్రత్యయాలు సర్వనామాల అవశిష్ట భాగాలుగా చివరలలో స్పష్టంగా తెలుస్తూ ఉంటాయి. ఉదా॥

ప్ర. పు. ఏక - వస్తున్నా<u>డు</u> వా<u>డు</u>

మ. పు. ఏక - వస్తున్నా<u>వు</u> నీ<u>వు</u>

ఉ. పు. ఏక - వస్తున్నా<u>ను</u> నే<u>ను</u>

బహువచనాలు కూడ ఈ విధంగానే సర్వనామ బహువచనాల అంత్యవర్ణాలే ఉంటాయి.

అయితే సంస్కృతములో ఈ పద్ధతి లేదు. ఆ ప్రత్యయ నిర్మాణం స్వతంత్రంగా రూపుదిద్దుకున్నట్లు తెలుస్తుంది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధి లిఙ్ : | నయేత్ | నయేతామ్ | నయేయుః | ప్ర. పు. |
| విధ్యర్థకం | నయేః | నయేతమ్ | నయేత | మ. పు. |
| | నయేయమ్ | నయేవ | నయేమ | ఉ. పు. |

నయేః = కొనిపో (నీవు) కొనిపోవాలి

నయేతమ్ = కొనిపొండు (మిరిద్దరు) కొనిపోవాలి

నయేత = కొనిపొండు (మీరు) కొనిపోవాలి

మిగిలిన పురుషలలో వచనాలలో గూడ పై విధంగా అర్థాలు తెలిసికోవలసి ఉంది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | నేష్యతి | నేష్యతః | నేష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యత్కాలం | నేష్యసి | నేష్యథః | నేష్యథ | మ. పు. |
| | నేష్యామి | నేష్యావః | నేష్యామః | ఉ. పు. |

నేష్యతః = (వారిద్దరు) కొనిపోగలరు

నేష్యథః = (వీరుద్దరు) కొనిపోగలరు

నేష్యావః = (మేమిద్దరం) కొనిపోగలము

మిగిలిన ఏక బహు వచనాలలో పురుషలలో అర్థాలు గూడ ఈ విధంగానే గ్రహించవచ్చు.

**4. దృశ్ర్ ప్రేక్షణే** దృశ్ రూపానికి 'పశ్య' ఆదిష్ట రూపం చేరుతుంది. సంస్కృతంలో ఇలా స్వతస్సిద్ధ ధాతువులు ఆదేశంగా వచ్చిన రూపాలలో గూడ ఏర్పడతాయి.

ఇక ప్ర + ఈక్షణం = చూచుట

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | పశ్యతి | పశ్యతః | పశ్యన్తి | ప్ర. పు. |
| వర్తమానం | పశ్యసి | పశ్యథః | పశ్యథ | మ. పు. |
| | పశ్యామః | పశ్యావః | పశ్యామః | ఉ. పు. |

పశ్యన్తి = చూచుచున్నారు (వారు)

పశ్యథ = చూచుచున్నారు (మీరు) మూడు పురుషలలో బహువచన రూపాలు

పశ్యామః = చూచుచున్నాము (మేము)

పురుషలలో ఇతర వచనాలు - ఏక ద్వి వచనాలు పై విధంగా సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | పశ్యతు, పశ్యతాత్ | పశ్యతామ్ | పశ్యన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | పశ్య, పశ్యతాత్ | పశ్యతమ్ | పశ్యత | మ. పు. |
| | పశ్యాని | పశ్యావ | పశ్యామ | ఉ. పు. |

పశ్యతామ్ = (వారిద్దరు) చూడాలి - చూడవలెను

పశ్యతమ్ = (మీరిద్దరు) చూడాలి - చూడవలెను

పశ్యావ = (మేమిద్దరం) చూడాలి - చూడవలెను

తెలుగులో ఒకటే క్రియాపదం అన్ని పురుషులకూ, అన్ని వచనాలకూ అన్వయించే విధంగా ఉంది. కర్తృ పదాన్ని బట్టి అర్థాలు గ్రహిస్తున్నాం.

ఇలా ఎందుకు జరుగుతుంది? సమాధానం మనకు తెలిసిందే. తెలుగు క్రియాపద నిర్మాణం చిన్నది. కాబట్టి సరిపెట్టుకోవాలి, సర్దుకుపోవాలి.

ఈ సర్దుకుపోవడం, సరిపెట్టుకోవడానికి లోకవృత్తం నుండి ఒక మంచి ఉదాహరణ గుర్తుకు వస్తుంది. సంపన్న వర్గాలకు నివాస గృహాలు విశాలంగా ఉంటాయి. తినడానికి ఒక హాలు, కూర్చోడానికి ఒక హాలు, పడుకోడానికి మరొక హాలు, అతిథుల కోసం ఒక గది, సామానులకుఒక గది, వంటకు మరొక గది - ఇట్లా వాళ్ళయిళ్ళు విస్తృతంగా విడివిడిగా దేని స్థానం దానిదనినట్లు విశాల నిర్మాణాలు కలిగి ఉంటాయి. కాని బలహీన వర్గాల యిళ్ళు అలా ఉండవు. వారికి ఒకటి, రెండు, మూడుకు మించి గదులుండవు. ఒకటే గది ఉన్న యింట్లో వండేటప్పుడు వంటగది, తినేటప్పుడు భోజనశాల, కూర్చున్నపుడు డ్రాయింగ్ రూం, పడుకున్నపుడు పడకగది ఇలా అన్నిటికీ అదే గతి! దాన్నే మంచంతో పడకకు, కంచంతో తిండికి, కుర్చీతో కూర్చోడానికి, పొయ్యితో వంటకు వాడుకోవడం జరుగుతుంది. ఉన్నది ఒకటే గది అయినా, సందర్భాలన్ని బట్టి అన్నింటికీ అదే ఉపయోగపడుతుంది. మార్గాంతరం లేదు. సర్దుకుపోవాలి. సరిపెట్టుకోవాలి మరి. స్థూలంగా భాషలలో పదాలతో కూడ అవి విస్తృతంగా విరివిగా ఏర్పడి ఉండకపోతే సర్దుకుపోవాలి, సరిపెట్టుకుపోవాలి మరి. స్థూలంగా భాషలలో పదాలతోకూడ, అవి విస్తృతంగా విరివిగా ఏర్పడి ఉండకపోతే సర్దుకుపోవాలి, సరిపెట్టుకోవాలి. మరొకదారి ఉండదు మరి! సరి, ప్రస్తుతాంశానికి వద్దాం.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అపశ్యత్ | అపశ్యతామ్ | అపశ్యన్ | ప్ర. పు. |
| భూత కాలం | అపశ్యః | అపశ్యతమ్ | అపశ్యత | మ. పు. |
| | అపశ్యమ్ | అపశ్యావ | అపశ్యామ | ఉ. పు. |

అపశ్యత్ = చూచెను

అపశ్యః = చూచితివి — మూడు పురుషులలో ఏకవచన రూపాలు

అపశ్యమ్ = చూచితిని

మిగిలిన పురుషులలోను వచనాలలోను అర్థాలు పై ఉదాహరణలను బట్టి గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధి లిఙ్ : | పశ్యేత్ | పశ్యేతామ్ | పశ్యేయుః | ప్ర. పు. |
| విధ్యర్థకం | పశ్యేః | పశ్యేతమ్ | పశ్యేత | మ. పు. |
| | పశ్యేయమ్ | పశ్యేవ | పశ్యేమ | ఉ. పు. |

పశ్యేతామ్ = (వారిద్దరు) చూడాలి - చూడవలెను

పశ్యేతమ్ = (మీరిద్దరు) చూడాలి - చూడవలెను

పశ్యేవ = (మేమిద్దరం) చూడాలి - చూడవలెను

ఇతర వచనాలలో క్రమంగా ప్రథమ మధ్యమ ఉత్తమ పురుషలలో ఇతర వచనాలు - ఏక బహు వచనాలకు గూడ అర్థాలు ఈ విధంగానే గ్రహించవచ్చు - తెలుగు వ్యవహారాన్ని అనుసరించింది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్యట్ : | ద్రక్ష్యతి | ద్రక్ష్యతః | ద్రక్ష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | ద్రక్ష్యసి | ద్రక్ష్యథః | ద్రక్ష్యథ | మ. పు. |
| | ద్రక్ష్యామి | ద్రక్ష్యావః | ద్రక్ష్యామః | ఉ. పు. |

ద్రక్ష్యన్తి = చూడగలరు (వారు)

ద్రక్ష్యథ = చూడగలరు (మీరు) బహువచన రూపాలు ప్రథమ మధ్యమ ఉత్తమ పురుషలు

ద్రక్ష్యామః = చూడగలము

మిగిలిన వచనాలలో గూడ అర్థాలు పై నిరూపణను బట్టి సులభంగా తెలిసికోవచ్చు. తెలుగు అర్థాలు గ్రహించేటపుడు మనకు మాటిమాటికి కొత్తగా అన్పించేది సంస్కృతంలోని ద్వివచన రూపమే. ఈ ద్వివచనం సుబంతాలలోను, నామ పదాలలోను కలదన్న విషయం మనమెరిగినదే.

5. గమ్ గతౌ **గమ్ ధాతువుకి గచ్ఛ్ రూపం ఆదేశమై క్రియా రూపాలు ఏర్పడతాయి.**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | గచ్ఛతి | గచ్ఛతః | గచ్ఛన్తి | ప్ర. పు. |
| వర్తమానం | గచ్ఛసి | గచ్ఛథః | గచ్ఛథ | మ. పు. |
| | గచ్ఛామి | గచ్ఛావః | గచ్ఛామః | ఉ. పు. |

గచ్ఛతి = వెళ్తున్నాడు

గచ్ఛతః = (ఇద్దరు) వెళ్తున్నారు

గచ్ఛన్తి = వెళ్తున్నారు

ప్రథమ పురుషలోని మూడు రూపాలు

ఇదే రీతిలో మధ్యమ ఉత్తమ పురుషలలోని క్రియలకు అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | గచ్ఛతు, గచ్ఛతాత్ | గచ్ఛతామ్ | గచ్ఛన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | గచ్ఛ, గచ్ఛతాత్ | గచ్ఛతమ్ | గచ్ఛత | మ. పు. |
| | గచ్ఛాని | గచ్ఛావ | గచ్ఛామ | ఉ. పు. |

గచ్ఛతు, గచ్ఛతాత్ = (వాడు) వెళ్ళనీ, వెళ్ళాలి

గచ్ఛతామ్ = (వాళ్ళిద్దరు) వెళ్ళాలి ప్రథమ పురుషలోని మూడు వచనాలు

గచ్ఛన్తు = వెళ్ళాలి

ముందు మనం తెలుగు వ్యవహారంలో ఇలాంటి సందర్భాల్లో అన్ని వచనాల్లో ఒకే రూపం ఉంటుంది. కర్తృ పదం చూసి క్రియ వచనాన్ని గ్రహిస్తుంటాం - వ్యవహార సమయంలో.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అగచ్ఛత్ | అగచ్ఛతామ్ | అగచ్ఛన్ | ప్ర. పు. |
| భూతార్థకం | అగచ్ఛః | అగచ్ఛతమ్ | అగచ్ఛత | మ. పు. |
| | అగచ్ఛమ్ | అగచ్ఛావ | అగచ్ఛామ | ఉ. పు. |

అగచ్ఛః = వెళ్ళితివి

అగచ్ఛతమ్ = (మీరిద్దరు) వెళ్ళితిరి మధ్యమ పురుషలోని మూడు వచనాలు.

అగచ్ఛత = వెళ్ళితిరి

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధి లిఙ్ : | గచ్ఛేత్ | గచ్ఛేతామ్ | గచ్ఛేయుః | ప్ర. పు. |
| ఆదేశార్థకం | గచ్ఛేః | గచ్ఛేతమ్ | గచ్ఛేత | మ. పు. |
| | గచ్ఛేయమ్ | గచ్ఛేవ | గచ్ఛేమ | ఉ. పు. |

గచ్ఛేయమ్ = (నేను) వెళ్ళాలి, వెళ్ళవలెను

గచ్ఛేవ = (మేమిద్దరం) వెళ్ళాలి, వెళ్ళవలెను ఉత్తమ పురుష క్రియలు

గచ్ఛేమ = (మేము) వెళ్ళాలి, వెళ్ళవలెను

ఉత్తమ పురుష క్రియలు

విధ్యర్థకాలు తెలుగు వ్యవహారంలో ప్రత్యయాంతాలుగా ఉండవు. ఉండవు అనడం కంటే ఏర్పడలేదు అనడం ఉచితంగా ఉంటుంది. వెళ్ళవలసినదే ఇలాంటి వ్యవహారాల్లో క్రియాంత ప్రత్యయాలు కర్తృ పదాలకు సంబంధం లేకుండ ఉంటాయి. అన్నింటికీ అన్ని కర్తృ పదాలకు ఒకే క్రియా పదం ఉంటుంది. ఈ ఉదాహరణలో వెళ్ళవలసినది + ఏ అనే విభాగముంది. దీనిలో ఏ కారమే పదాన్ని ఆదేశార్థకంగా మార్చింది.

సంస్కృతంలో ఉన్న క్రియా పద వైవిధ్యాన్ని అంతటినీ తెలుగులో అన్వయించుకోవలసి రావడంతో మనం అనువాద సమయంలో తంటాలు పడవలసి వస్తున్నది.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| ల్రుట్ : | గమిష్యతి | గమిష్యతః | గమిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | గమిష్యసి | గమిష్యథః | గమిష్యథ | మ. పు. |
| | గమిష్యామి | గమిష్యావః | గమిష్యామః | ఉ. పు. |

గమిష్యతి = వెళ్ళగలడు

గమిష్యసి = వెళ్ళగలవు

గమిష్యామి = వెళ్ళగలను

మూడు పురుషలలోని ఏక వచన రూపాలు

సంస్కృత క్రియా పదాలను తెలుగు చేసేటపుడు వర్తమాన - భూత - భవిష్యదర్థక రూపాలు మాత్రం సరిగా కుదురుతున్నాయి. ప్రత్యయాంతాలుగా మిగిలిన రూపాలలో కుదిరిక ఉండటం లేదు. ప్రత్యయాలూ కనబడటం లేదు తెలుగు రూపాలలో. భాష తీరే అలా ఉంది మరి!

**6. ముచ్ - మోక్షణే** **మోక్షణం = విడిపించుట. ఇక్కడ వదలుట, విడుచుట**

ముచ్ ధాతువుకు ముఞ్చ్ ఆదేశమౌతుంది

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | ముఞ్చతి | ముఞ్చతః | ముఞ్చన్తి | ప్ర. పు. |
| వర్తమానం | ముంచసి | ముంచథః | ముంచథ | మ. పు. |
| | ముంచామి | ముంచావః | ముంచామః | ఉ. పు. |

ముంచతః = (వారిద్దరు) వదలుతున్నారు

ముంచథః = (మీరిద్దరు) వదలుతున్నారు

ముంచావః = (మేమిద్దరం) వదలుతున్నాము

మూడు పురుషులలో ద్వి వచనాలు

ఈ ద్వి వచన ప్రయోగం మనది కాదు. ప్రస్తుత కాలాన ఏ భాషా భాషులదీ కాదు. అయినా సంస్కృతంలో ఉంది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | ముంచతు, ముంచతాత్ | ముంచతామ్ | ముంచన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | ముంచ, ముంచతాత్ | ముంచతమ్ | ముంచత | మ. పు. |
| | ముంచాని | ముంచావ | ముంచామ | ఉ. పు. |

ముంచన్తు = (వారు) వదలాలి - వదలవలెను

ముంచత = (మీరు) వదలాలి - వదలవలెను

ముంచామ = (మేము) వదలాలి - వదలవలెను

మూడు పురుషలలో బహు వచనాలు

తెలుగులో క్రియా పదమొకటే అన్ని పురుషలలో వచనాలన్నింటినీ చెప్పినట్లయినది. ఇలాంటి సందర్భంలో ఈ లకారం విషయంలో ముందూ మనం గ్రహించి ఉన్నాం.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అముంచత్ | అముంచతామ్ | అముంచన్ | ప్ర. పు |
| భూతార్థం | అముంచః | అముంచతమ్ | అముంచత | మ. పు |
| | అముంచమ్ | అముంచావ | అముంచామ | ఉ. పు |

అముంచత్ = వదలెను

అముంచతామ్ = (వారిద్దరు) వదలిరి

అముంచన్ = వదలిరి

ప్రథమ పురుషలలో మూడు వచనాలు

మిగిలిన క్రియా పదాల అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధి లిఙ్ : | ముంచేత్ | ముంచేతామ్ | ముంచేయుః | ప్ర. పు. |
| ఆదేశార్థకం | ముంచేః | ముంచేతమ్ | ముంచేత | మ. పు. |
| | ముంచేయమ్ | ముంచేవ | ముంచేమ | ఉ. పు. |

ముంచేః = (నీవు) వదలు - వదలాలి

ముంచేతమ్ = (మీరిద్దరు) వదలాలి

ముంచేత = (మీరు) వదలాలి

మధ్యమ పురుషలో మూడు వచనాలు

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | మోక్ష్యతి | మోక్ష్యతః | మోక్ష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | మోక్ష్యసి | మోక్ష్యథః | మోక్ష్యథ | మ. పు. |
| | మోక్ష్యామి | మోక్ష్యావః | మోక్ష్యామః | ఉ. పు. |

మోక్ష్యామి = వదలగలను

మోక్ష్యావః = (మేము ఇద్దరం) వదలగలము

మోక్ష్యామః = (మేము) వదలగలము

మిగిలిన పురుష వచనాలలోను అర్థాలు సులభగ్రాహ్యాలే.

7. **ఇష్ ఇచ్ఛాయాం** **ఇచ్ఛ = కోరిక , ఇష్ ధాతువుకు ఇచ్ఛ్ రూపం ఆదేశమౌతుంది.**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | ఇచ్ఛతి | ఇచ్ఛతః | ఇచ్ఛన్తి | ప్ర. పు. |
| వర్తమానం | ఇచ్ఛసి | ఇచ్ఛథః | ఇచ్ఛథ | మ. పు. |
| | ఇచ్ఛామి | ఇచ్ఛావః | ఇచ్ఛామః | ఉ. పు. |

ఇచ్ఛతి = కోరుతున్నాడు

ఇచ్ఛసి = కోరుతున్నావు

ఇచ్ఛామి = కోరుతున్నాను

ప్రథమ పురుషైకవచనం మధ్యమ పురుషైక వచనం ఉత్తమ పురుషైక వచనం

మిగిలిన పురుష వచనాల అర్థాలు ఈ విధంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | ఇచ్ఛతు, ఇచ్ఛతాత్ | ఇచ్ఛతామ్ | ఇచ్ఛన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | ఇచ్ఛ, ఇచ్ఛతాత్ | ఇచ్ఛతమ్ | ఇచ్ఛత | మ. పు. |
| | ఇచ్ఛాని | ఇచ్ఛావ | ఇచ్ఛామ | ఉ. పు. |

ఇచ్ఛతామ్ = (వారిద్దరు) కోరాలి

ఇచ్ఛతమ్ = (మీరిద్దరు) కోరాలి

ఇచ్ఛావ = (మేమిద్దరం) కోరాలి

ప్రథమ మధ్యమ ఉత్తమ పురుషుల ద్వివచనాలు

ఆయా పురుషులలో మిగిలిన ఏక బహు వచనాల అర్థాలు ఇలాగే ఉంటాయి. సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | ఐచ్ఛత్ | ఐచ్ఛతామ్ | ఐచ్ఛన్ | ప్ర. పు. |
| భూతార్థకం | ఐచ్ఛః | ఐచ్ఛతమ్ | ఐచ్ఛత | మ. పు. |
| | ఐచ్ఛమ్ | ఐచ్ఛావ | ఐచ్ఛామ | ఉ. పు. |

ఐచ్ఛన్ = కోరిరి

ఐచ్ఛత = కోరితిరి

ఐచ్ఛామ = కోరితిమి

ప్రథమ మధ్యమ ఉత్తమ పురుషులలోని బహు వచనాలు

మిగిలిన రూపాల అర్థాలూ ఈ విధంగానే గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధి లిఙ్ : | ఇచ్ఛేత్ | ఇచ్ఛేతామ్ | ఇచ్ఛేయుః | ప్ర. పు. |
| ఆదేశార్థకం | ఇచ్ఛేః | ఇచ్ఛేతమ్ | ఇచ్ఛేత | మ. పు. |
| | ఇచ్ఛేయమ్ | ఇచ్ఛేవ | ఇచ్ఛేమ | ఉ. పు. |

ఇచ్ఛేత్ = కోరాలి (వాడు)

ఇచ్ఛేః = కోరు, కోరాలి (నీవు)

ఇచ్ఛేయమ్ = కోరు, కోరాలి (నేను)

ప్రథమ, మధ్యమ, ఉత్తమ పురుషులలో ఏక వచన రూపాలు

మిగిలిన క్రియా పదాల తెలుగు అర్థాలూ పై విధంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | ఏషిష్యతి | ఏషిష్యతః | ఏషిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | ఏషిష్యసి | ఏషిష్యథః | ఏషిష్యథ | మ. పు. |
| | ఏషిష్యామి | ఏషిష్యావః | ఏషిష్యామః | ఉ. పు. |

ఏషిష్యతః = (వారిద్దరు) కోరగలరు

ఏషిష్యథః = (మీరిద్దరు) కోరగలరు

ఏష్యావః = (మేమిద్దరం) కోరగలము

ప్రథమ మధ్యమ ఉత్తమ పురుషుల ద్వి వచనాలు

మిగిలిన సంస్కృత క్రియా పదాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

8. **లిఖ్ లేఖనే లేఖనం = వ్రాయుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | లిఖతి | లిఖతః | లిఖన్తి | ప్ర. పు. |
| వర్తమానం | లిఖసి | లిఖథః | లిఖథ | మ. పు. |
| | లిఖామి | లిఖావః | లిఖామః | ఉ. పు. |

లిఖన్తి = వ్రాస్తున్నారు (వారు)

లిఖథ = వ్రాస్తున్నారు (మీరు)

లిఖామః = వ్రాస్తున్నాము

తెలుగులో ప్రథమ మధ్యమ పురుష బహు వచనాలు ప్రత్యయాలు రెండూ 'రు' వర్ణాలే. ఎందుకంటే 'వారు, మీరు' లలో చివరి వర్ణాలు అవే గదా!

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | లిఖతు, లిఖతాత్ | లిఖతామ్ | లిఖన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | లిఖ, లిఖతాత్ | లిఖతమ్ | లిఖత | మ. పు. |
| | లిఖాని | లిఖావ | లిఖామ | ఉ. పు. |

లిఖతు, లిఖతాత్ = (వాడు) లిఖించనీ - వ్రాయనీ , లిఖించాలి - వ్రాయాలి

లిఖ, లిఖతాత్ = వ్రాయు - లిఖించు (నీవు) వ్రాయాలి లిఖించాలి

లిఖాని = (నేను) వ్రాయాలి

మూడు పురుషాలలో ఏకవచన రూపాలు

మిగిలిన ద్వివచన బహు వచన రూపాలకూ ఈ విధంగానే ఈ లకారంలో అర్థాలుంటాయి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అలిఖత్ | అలిఖతామ్ | అలిఖన్ | ప్ర. పు. |
| భూతార్థకం | అలిఖః | అలిఖతమ్ | అలిఖత | మ. పు. |
| | అలిఖమ్ | అలిఖావ | అలిఖామ | ఉ. పు. |

అలిఖతామ్ = (వారిద్దరు) లిఖించిరి

అలిఖతమ్ = (మీరిద్దరు) లిఖించితిరి

అలిఖావ = (మేమిద్దరం) లిఖించితిమి

మూడు పురుషలలో ద్వి వచనాలు

మిగిలిన వచనాలకు తెలుగులో అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| విధిలిజ్ : | లిఖేత్ | లిఖేతామ్ | లిఖేయుః | ప్ర. పు. |
| ఆదేశార్థకం | లిఖేః | లిఖేతమ్ | లిఖేత | మ. పు. |
| | లిఖేయమ్ | లిఖేవ | లిఖేమ | ఉ. పు. |

లిఖేయుః = (వారు) లిఖించాలి

లిఖేత = (మీరు) లిఖించాలి

లిఖేమ = (మేము) లిఖించాలి

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| ల్పట్ : | లిఖిష్యతి | లిఖిష్యతః | లిఖిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | లిఖిష్యసి | లిఖిష్యథః | లిఖిష్యథ | మ. పు. |
| | లిఖిష్యామి | లిఖిష్యావః | లిఖిష్యామః | ఉ. పు. |

లిఖిష్యతి = వ్రాయగలడు

లిఖిష్యసి = వ్రాయగలవు

లిఖిష్యామి = వ్రాయగలను

మూడు పురుషల ఏక వచనాలు

మిగిలిన క్రియా రూపాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

**9. పఠ్ పఠనే** **పఠనం = చదువుట**

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | పఠతి | పఠతః | పఠన్తి | ప్ర. పు. |
| వర్తమానం | పఠసి | పఠథః | పఠథ | మ. పు. |
| | పఠామి | పఠావః | పఠామః | ఉ. పు. |

పఠతః = (వారిద్దరు) చదువుతున్నారు

పఠథః = (మీరిద్దరు) చదువుతున్నారు

పఠావః = (మేమిద్దరం) చదువుతున్నాము

మూడు పురుషుల ద్వి వచనాలు

మిగిలిన ఏక బహువచన రూపాలు తెలుగు అర్థాలు పై వలె గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | పఠతు, పఠతాత్ | పఠతామ్ | పఠన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | పఠ, పఠతాత్ | పఠతమ్ | పఠత | మ. పు. |
| | పఠాని | పఠావ | పఠామ | ఉ. పు. |

పఠన్తు = (వారు) చదవాలి

పఠత = (మీరు) చదవాలి

పఠామ = (మేము) చదవాలి

మూడు పురుషలలో బహు వచనాలు

మిగిలిన వచనాలు తెలుగును పై విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అపఠత్ | అపఠతామ్ | అపఠన్ | ప్ర. పు. |
| భూతార్థకం | అపఠః | అపఠతమ్ | అపఠత | మ. పు. |
| | అపఠమ్ | అపఠావ | అపఠామ | ఉ. పు. |

అపఠత్ = చదివెను

అపఠః = చదివితివి

అపఠమ్ = చదివితిని

మూడు పురుషలలో ఏక వచనాలు

మిగిలిన వచనాల అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | పఠేత్ | పఠేతామ్ | పఠేయుః | ప్ర. పు. |
| ఆదేశార్థకం | పఠేః | పఠేతమ్ | పఠేత | మ. పు. |
| | పఠేయమ్ | పఠేవ | పఠేమ | ఉ. పు |

పఠేతామ్ = (వారిద్దరు) చదవాలి

పఠేతమ్ = (మీరిద్దరు) చదవాలి

పఠేవ = (మేమిద్దరం) చదవాలి

మూడు పురుషల ద్వి వచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ పై విధంగా సులభగ్రాహ్యాలు.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లృట్ : | పఠిష్యతి | పఠిష్యతః | పఠిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | పఠిష్యసి | పఠిష్యథః | పఠిష్యథ | మ. పు. |
| | పఠిష్యామి | పఠిష్యావః | పఠిష్యామః | ఉ. పు. |

పఠిష్యన్తి = చదువగలరు

పఠిష్యథ = (మీరు) చదువగలరు

పఠిష్యామః = చదువగలము

మూడు పురుషుల బహు వచనాలు

మిగిలిన క్రియా పదాల అర్థాలూ ఈ విధంగా గ్రహించవచ్చు.

10. స్పృహ్ - స్నేహే **స్పృహః = స్నేహము - చెలిమి**

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | స్పృహ్యతి | స్పృహ్యతః | స్పృహ్యన్తి | ప్ర. పు. |
| వర్తమానం | స్పృహ్యసి | స్పృహ్యథః | స్పృహ్యథ | మ. పు. |
| | స్పృహ్యామి | స్పృహ్యావః | స్పృహ్యామః | ఉ. పు. |

స్పృహ్యతి = స్నేహించుచున్నాడు - స్నేహం చేస్తున్నాడు

స్పృహ్యసి = స్నేహించుచున్నావు - స్నేహం చేయుచున్నావు

స్పృహ్యామి = స్నేహించుచున్నాను - స్నేహం చేయుచున్నాను

ఏక వచనాలు

ఇలాగే మిగిలిన పదాల అర్థాలూ సులభగ్రాహ్యాలు

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లోట్ : | స్పృహ్యతు, స్పృహ్యతాత్ | స్పృహ్యతామ్ | స్పృహ్యన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | స్పృహ్య, స్పృహ్యతాత్ | స్పృహ్యతమ్ | స్పృహ్యత | మ. పు. |
| | స్పృహ్యాని | స్పృహ్యావ | స్పృహ్యామ | ఉ. పు. |

స్పృహ్యతామ్ = (వారిద్దరు) స్నేహించాలి - స్నేహం చెయ్యాలి

స్పృహ్యతమ్ = (మీరిద్దరు) స్నేహించాలి - స్నేహం చెయ్యాలి

స్పృహ్యావ = (మేమిద్దరం) స్నేహించాలి - స్నేహం చెయ్యాలి

మిగిలిన పదాల అర్థాలూ ఇలాగే ఉంటాయి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అస్నిహ్యత్ | అస్నిహ్యతామ్ | అస్నిహ్యన్ | ప్ర. పు. |
| భూతకాలం | అస్నిహ్యః | అస్నిహ్యతమ్ | అస్నిహ్యత | మ. పు. |
| | అస్నిహ్యమ్ | అస్నిహ్యావ | అస్నిహ్యామ | ఉ. పు. |

అస్నిహ్యన్ = స్నేహించారు - స్నేహం చేశారు

అస్నిహ్యత = (మీరు) స్నేహించారు - స్నేహం చేశారు బహువచనాలు

అస్నిహ్యామ = స్నేహించాము - స్నేహం చేశాము

మిగిలిన పదాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

| | ఏక | ద్వి | బహు |
|---|---|---|---|
| విధిలిఙ్ : | స్నిహ్యేత్ | స్నిహ్యేతామ్ | స్నిహ్యేయుః |
| విధ్యర్థకం | స్నిహ్యేః | సిహ్యేతమ్ | స్నిహ్యేత |
| (ఆదేశం) | స్నిహ్యేయమ్ | స్నిహ్యేవ | స్నిహ్యేమ |

స్నిహ్యేత్ = (వాడు) స్నేహించాలి - స్నేహం చెయ్యాలి

స్నిహ్యేః = (నీవు) స్నేహించాలి - స్నేహం చెయ్యాలి

స్నిహ్యేయమ్ = (నేను) స్నేహించాలి - స్నేహం చెయ్యాలి

ఏక వచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు పై విధంగానే ఉంటాయి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్ఋట్ : | స్నేహిష్యతి | స్నేహిష్యతః | స్నేహిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | స్నేహిష్యసి | స్నేహిష్యథః | స్నేహిష్యథ | మ. పు. |
| | స్నేహిష్యామి | స్నేహిష్యావః | స్నేహిష్యామః | ఉ. పు. |

స్నేహిష్యతః = (వారిద్దరు) స్నేహించగలరు

స్నేహిష్యథః = (మీరిద్దరు) స్నేహించగలరు ద్వివచనాలు

స్నేహిష్యావః = (మేమిద్దరం) స్నేహించగలము

మిగిలిన వచనాలూ ఇలాగే తెలుగులో గ్రహించవచ్చు.

**11. కుప్ కోపే కోపః = కోపం**

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | కుప్యతి | కుప్యతః | కుప్యన్తి | ప్ర. పు. |
| వర్తమానం | కుప్యసి | కుప్యథః | కుప్యథ | మ. పు. |
| | కుప్యామి | కుప్యావః | కుప్యామః | ఉ. పు. |

కుప్యన్తి = కోపగిస్తున్నారు

కుప్యథ = కోపగిస్తున్నారు (మీరు) బహువచనాలు

కుప్యామః = కోపగిస్తున్నాము

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే తెలిసికోవచ్చు.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లోట్ : | కుప్యతు, కుప్యతాత్ | కుప్యతామ్ | కుప్యన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | కుప్య, కుప్యతాత్ | కుప్యతమ్ | కుప్యత | మ. పు. |
| | కుప్యాని | కుప్యావ | కుప్యామ | ఉ. పు. |

కుప్యతు, కుప్యతాత్ = (అతడు) కోపగించాలి

కుప్య, కుప్యతాత్ = (నీవు) కోపగించాలి ఏక వచనాలు

కుప్యాని = (నేను) కోపగించాలి

మిగిలిన వచనాలూ ఇలాగే అర్థాలతో గ్రహించవచ్చు.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లజ్ : | అకుప్యత్ | అకుప్యతామ్ | అకుప్యన్ | ప్ర. పు. |
| భూతకాలం | అకుప్యః | అకుప్యతమ్ | అకుప్యత | మ. పు. |
| | అకుప్యమ్ | అకుప్యావ | అకుప్యామ | ఉ. పు. |

అకుప్యతామ్ = (వారిద్దరు) కోపగించిరి

అకుప్యతమ్ = (మీరిద్దరు) కోపగించితిరి ద్వి వచనాలు

అకుప్యావ = (మేమిద్దరం) కోపగించితిమి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిజ్ : | కుప్యేత్ | కుప్యేతామ్ | కుప్యేయుః | ప్ర. పు. |
| ఆదేశం | కుప్యేః | కుప్యేతమ్ | కుప్యేత | మ. పు. |
| | కుప్యేయమ్ | కుప్యేవ | కుప్యేమ | ఉ. పు. |

కుప్యేయుః = (వారు) కోపగించాలి

కుప్యేత = (మీరు) కోపగించాలి బహు వచనాలు

కుప్యేమ = (మేము) కోపగించాలి

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్రుట్ : | కోపిష్యతి | కోపిష్యతః | కోపిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | కోపిష్యసి | కోపిష్యథః | కోపిష్యథ | మ. పు. |
| | కోపిష్యామి | కోపిష్యావః | కోపిష్యామః | ఉ. పు. |

కోపిష్యతి = కోపగించగలడు

కోపిష్యసి = కోపగించగలవు ఏకవచనాలు

కోపిష్యామి = కోపగించగలను

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

**12. తుష్ తోషణే తోషణం = (సం)తోషించుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | తుష్యతి | తుష్యతః | తుష్యన్తి | ప్ర. పు. |
| వర్తమానం | తుష్యసి | తుష్యథః | తుష్యథ | మ. పు. |
| | తుష్యామి | తుష్యావః | తుష్యామః | ఉ. పు. |

తుష్యతః = (వారిద్దరు) సంతోషిస్తున్నారు

తుష్యథః = (మీరిద్దరు) సంతోషిస్తున్నారు ద్వి వచనాలు

తుష్యావః = (మేమిద్దరం) సంతోషిస్తున్నాము

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | తుష్యతు, తుష్యతాత్ | తుష్యతామ్ | తుష్యన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | తుష్య, తుష్యతాత్ | తుష్యతమ్ | తుష్యత | మ. పు. |
| | తుష్యాని | తుష్యావ | తుష్యామ | ఉ. పు. |

తుష్యన్తు = (వారు) సంతోషించాలి

తుష్యత = (మీరు) సంతోషించాలి బహు వచనాలు

తుష్యామ = (మేము) సంతోషించాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే ఉంటాయి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అతుష్యత్ | అతుష్యతామ్ | అతుష్యన్ | ప్ర. పు. |
| భూతకాలం | అతుష్యః | అతుష్యతమ్ | అతుష్యత | మ. పు. |
| | అతుష్యమ్ | అతుష్యావ | అతుష్యామ | ఉ. పు. |

అతుష్యత్ = సంతోషించెను

అతుష్యః = సంతోషించితివి ఏకవచనాలు

అతుష్యమ్ = సంతోషించితిని

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | తుష్యేత్ | తుష్యేతామ్ | తుష్యేయుః | ప్ర. పు. |
| ఆదేశం | తుష్యేః | తుష్యేతమ్ | తుష్యేత | మ. పు. |
| | తుష్యేయమ్ | తుష్యేవ | తుష్యేమ | ఉ. పు. |

తుష్యేతామ్ = (వారిద్దరు) సంతోషించాలి

తుష్యేతమ్ = (మీరిద్దరు) సంతోషించాలి ద్వివచనాలు

తుష్యేవ = (మేమిద్దరం) సంతోషించాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే ఉంటాయి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | తోషిష్యతి | తోషిష్యతః | తోషిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | తోషిష్యసి | తోషిష్యథః | తోషిష్యథ | మ. పు. |
| | తోషిష్యామి | తోషిష్యావః | తోషిష్యామః | ఉ. పు. |

తోషిష్యన్తి = సంతోషించగలరు

తోషిష్యథ = సంతోషించగలరు (మీరు) బహువచనాలు

తోషిష్యామః = సంతోషించగలము

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

**13. శుష్ శోషణే శోషణం = ఎండుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | శుష్యతి | శుష్యతః | శుష్యన్తి | ప్ర. పు. |
| వర్తమానం | శుష్యసి | శుష్యథః | శుష్యథ | మ. పు. |
| | శుష్యామి | శుష్యావః | శుష్యామః | ఉ. పు. |

శుష్యతి = ఎండుతున్నది

శుష్యసి = ఎండుచున్నావు ఏకవచనాలు

శుష్యామి = ఎండుచున్నాను

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | శుష్యతు, శుష్యతాత్ | శుష్యతామ్ | శుష్యన్తు | ప్ర. పు. |
| ఆజ్ఞాదికం | శుష్య, శుష్యతాత్ | శుష్యతమ్ | శుష్యత | మ. పు. |
| | శుష్యాని | శుష్యావ | శుష్యామ | ఉ. పు. |

శుష్యతామ్ = (వారిద్దరు) ఎండాలి

శుష్యతమ్ = (మీరిద్దరు) ఎండాలి ద్వివచనాలు

శుష్యావ = (మేమిద్దరం) ఎండాలి

మిగిలిన వచనాల అర్థాలూ పై విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అశుష్యత్ | అశుష్యతామ్ | అశుష్యన్ | ప్ర. పు. |
| భూతకాలం | అశుష్యః | అశుష్యతమ్ | అశుష్యత | మ. పు. |
| | అశుష్యమ్ | అశుష్యావ | అశుష్యామ | ఉ. పు. |

అశుష్యన్ = ఎండిరి

అశుష్యత = ఎండితిరి బహువచనాలు

అశుష్యామ = ఎండితిమి

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలే.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | శుష్యేత్ | శుష్యేతామ్ | శుష్యేయుః | ప్ర. పు. |
| ఆదేశార్థకం | శుష్యేః | శుష్యేతమ్ | శుష్యేత | మ. పు. |
| | శుష్యేయమ్ | శుష్యేవ | శుష్యేమ | ఉ. పు. |

శుష్యేత్ = (వాడు) ఎండాలి

శుష్యేః = (నీవు) ఎండాలి — ఏకవచనాలు

శుష్యేయమ్ = (నేను) ఎండాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | శోషిష్యతి | శోషిష్యతః | శోషిష్యన్తి | ప్ర. పు. |
| భవిష్యదర్థకం | శోషిష్యసి | శోషిష్యథః | శోషిష్యథ | మ. పు. |
| | శోషిష్యామి | శోషిష్యావః | సోషిష్యామః | ఉ. పు. |

శోషిష్యతః = ఎండగలరు (వారిద్దరు)

శోషిష్యథః = ఎండగలరు (మీరిద్దరు) — ద్వి వచనాలు

శోషిష్యావః = ఎండగలము (మేమిద్దరం)

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు

**ఆచార్య ఆకురాతి పున్నారావు**
**విశ్రాంతాంధ్రాచార్యులు**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**
**నాగార్జున నగర్**

# ధాతువులు & సంధులు

**14.** **క్షిప్ క్షేపణే క్షేపణం** = విసరుట (విసరి వేయుట)

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | క్షిపతి | క్షిపతః | క్షిపన్తి | ప్ర.పు. |
| వర్తమానం | క్షిపసి | క్షిపథః | క్షిపథ | మ.పు. |
| | క్షిపామి | క్షిపావః | క్షిపామః | ఉ.పు. |

క్షిపన్తి = విసరుతున్నారు
క్షిపథ = విసరుతున్నారు (మీరు)
క్షిపామః = విసరుతున్నాము
} బహువచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | క్షిపతు, క్షిపతాత్ | క్షిపతామ్ | క్షిపన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | క్షిప, క్షిపతాత్ | క్షిపతమ్ | క్షిపత | మ.పు. |
| | క్షిపాని | క్షిపావ | క్షిపామ | ఉ.పు. |

క్షిపతు, క్షిపతాత్ = విసరాలి (వాడు)
క్షిప, క్షిపతాత్ = విసరాలి (నీవు)
క్షిపాని = విసరాలి (నేను)
} ఏకవచనాలు

మిగిలిన వచనాల అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అక్షిపత్ | అక్షిపతామ్ | అక్షిపన్ | ప్ర. పు. |
| భూతకాలికం | అక్షిపః | అక్షిపతమ్ | అక్షిపత | మ.పు. |
| | అక్షిపమ్ | అక్షిపావ | అక్షిపామ | ఉ.పు. |

అక్షిపతామ్ = (వారిద్దరు) విసరిరి
అక్షిపతమ్ = (మీరిద్దరు) విసరితిరి - విసరితిరి
అక్షిపావ = (మేమిద్దరం) విసరితిమి - విసరితిమి
} ద్వివచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | క్షిపేత్ | క్షిపేతామ్ | క్షిపేయుః | ప్ర.పు. |
| ఆదేశం | క్షిపేః | క్షిపేతమ్ | క్షిపేత | మ.పు. |
| | క్షిపేయమ్ | క్షిపేవ | క్షిపేమ | ఉ.పు. |

క్షిపేయుః = (వారు) విసరాలి
క్షిపేత = (మీరు) విసరాలి
క్షిపేమ = (మేము) విసరాలి
} బహువచనాలు

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | క్షేపిష్యతి | క్షేపిష్యతః | క్షేపిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యదర్థకం | క్షేపిష్యసి | క్షేపిష్యథః | క్షేపిష్యథ | మ.పు. |
| | క్షేపిష్యామి | క్షేపిష్యావః | క్షేపిష్యామః | ఉ.పు. |

క్షేపిష్యతి = విసరగలడు
క్షేపిష్యసి = విసరగలవు
క్షేపిష్యామి = విసరగలను
} ఏకవచనాలు

మిగిలన వచనాల అర్థాలూ సులభంగా గ్రహించవచ్చు.

**15. రుహ్ రోహణే రోహణం = మొలచుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | రోహతి | రోహతః | రోహన్తి | ప్ర.పు. |
| వర్తమానం | రోహసి | రోహథః | రోహథ | మ.పు. |
| | రోహామి | రోహావః | రోహామః | ఉ.పు. |

రోహతః = మొలస్తారు, (వారిద్దరు) మొలస్తువు (అవి రెండు)
రోహథః = మొలస్తారు (మీరిద్దరు) ద్వివచనాలు
రోహావః = మొలస్తాము (మేమిద్దరం)

మిగిలిన వచనాల అర్థాలూ సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | రోహతు, రుహతాత్ | రోహతామ్ | రోహన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | రోహ, రుహతాత్ | రోహతమ్ | రోహత | మ.పు. |
| | రోహాని | రోహావ | రోహామ | ఉ.పు. |

రోహన్తు = (వారు) మొలవాలి
రోహత = (మీరు) మొలవాలి } బహువచనాలు
రోహామ = (మేము) మొలవాలి

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లజ్ : | అరోహత్ | అరోహతామ్ | అరోహన్ | ప్ర.పు. |
| భతకాలం | అరోహః | అరోహతమ్ | అరోహత | మ.పు. |
| | అరోహమ్ | అరోహావ | అరోహామ | ఉ.పు. |

అరోహత్ = మొలచెను
అరోహః = మొలచితివి } ఏక వచనాలు
అరోహమ్ = మొలచితిని

మిగిలిన వచనాలూ సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిజ్ : | రోహేత్ | రోహేతామ్ | రోహేయుః | ప్ర.పు. |
| ఆదేశం | రోహేః | రోహేతమ్ | రోహేత | మ.పు. |
| | రోహేయమ్ | రోహేవ | రోహేమ | ఉ.పు. |

రోహేతామ్ = (వారిద్దరు) మొలవాలి
రోహేతమ్ = (మీరిద్దరు) మొలవాలి } ద్వివచనాలు
రోహేవ = (మేమిద్దరం) మొలవాలి

మిగిలిన వచనాల అర్థాలూ పై విధంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్రుట్ : | రోహిష్యతి | రోహిష్యతః | రోహిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యదర్థం | రోహిష్యసి | రోహిష్యథః | రోహిష్యథ | మ.పు. |
| | రోహిష్యామి | రోహిష్యావః | రోహిష్యామః | ఉ.పు. |

రోహిష్యన్తి = మొలవగలరు
రోహిష్యథ = మొలవగలరు (మీరు) } బహువచనాలు
రోహిష్యామః = మొలవగలము

మిగిలిన వచనాలకూ అర్థాలూ సులభగ్రాహ్యాలే.

**16. (డు)కృఞ్ కరణే కరణం = చేయుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | కరోతి | కురుతః | కుర్వన్తి | ప్ర.పు. |
| వర్తమానం | కరోషి | కురుథః | కురుథ | మ.పు. |
| | కరోమి | కుర్వః | కుర్మః | ఉ.పు. |

కరోతి = చేస్తున్నాడు
కరోషి = చేస్తున్నావు — ఏకవచనాలు
కరోమి = చేస్తున్నాను

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | కరోతు, కురుతాత్ | కురుతామ్ | కుర్వన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | కురు, కురుతాత్ | కురుతమ్ | కురుత | మ.పు. |
| | కరవాణి | కరవావ | కరవామ | ఉ.పు. |

కురుతామ్ = (వారిద్దరు) చేయాలి
కురుతమ్ = (మీరిద్దరు) చేయాలి — ద్వివచనాలు
కరవావ = (మేమిద్దరం) చేయాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే గ్రహించవలసినది.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అకరోత్ | అకురుతామ్ | అకుర్వన్ | ప్ర.పు. |
| భూతకాలం | అకరోః | అకురతమ్ | అకురుత | మ.పు. |
| | అకరవమ్ | అకుర్వ | అకుర్మ | ఉ.పు. |

అకుర్వన్ = చేసిరి
అకురుత = చేసితిరి — బహువచనాలు
అకుర్మ= చేసితిమి

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | కుర్యాత్ | కుర్యాతామ్ | కుర్యుః | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| ఆదేశం | కుర్యాః | కుర్యాతమ్ | కుర్యాత | మ.పు. |
| | కుర్యామ్ | కుర్యావ | కుర్యామ | ఉ.పు. |

కుర్యాత్ = (వాడు) చేయాలి
కుర్యాః = (నీవు) చేయాలి
కుర్యామ్ = (నేను) చేయాలి
} ఏకవచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్పట్ : | కరిష్యతి | కరిష్యతః | కరిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యదర్థం | కరిష్యసి | కరిష్యథః | కరిష్యథ | మ.పు. |
| | కరిష్యామి | కరిష్యావః | కరిష్యామః | ఉ.పు. |

కరిష్యతః = (వారిద్దరు) చేయగలరు
కరిష్యథః = (మీరిద్దరు) చేయగలరు
కరిష్యావః = (మేమిద్దరం) చేయగలము
} ద్వివచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

**17. హృ హరణే హరణం = హరించు - దొంగిలించు**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | హరతి | హరతః | హరన్తి | ప్ర.పు. |
| వర్తమానం | హరసి | హరథః | హరథ | మ.పు. |
| | హరామి | హరావః | హరామః | ఉ.పు. |

హరన్తి = హరిస్తున్నారు
హరథ = హరిస్తున్నారు (మీరు)
హరామః = హరిస్తున్నాము
} బహువచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | హరతు, హరతాత్ | హరతామ్ | హరన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | హర, హరతాత్ | హరతమ్ | హరత | మ.పు. |
| | హరాని | హరావ | హరామ | ఉ.పు. |

హరతు, హరతాత్ = (వాడు) హరించాలి }
హర, హరతాత్ = (నీవు) హరించాలి } ఏకవచనాలు
హరాని = (నేను) హరించాలి }

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అహరత్ | అహరతామ్ | అహరన్ | ప్ర.పు. |
| భూతకాలం | అహరః | అహరతమ్ | అహరత | మ.పు. |
| | అహరమ్ | అహరావ | అహరామ | ఉ.పు. |

అహరతామ్ = (వారిద్దరు) హరించిరి }
అహరతమ్ = (మీరిద్దరు) హరించితిరి } ద్వివచనాలు
అహరావ = (మేమిద్దరం) హరించితిమి }

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | హరేత్ | బహేతామ్ | హరేయుః | ప్ర.పు. |
| ఆదేశార్థం | హరేః | హరేతమ్ | హరేత | మ.పు. |
| | హరేయమ్ | హరేవ | హరేమ | ఉ.పు, |

హరేయుః = (వారు) హరించాలి }
హరేత = (మీరు) హరించాలి } బహువచనాలు
హరేమ = (మేము) హరించాలి }

మిగిలిన వచనాల అర్థాలు ఇట్లాగే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | హరిష్యతి | హరిష్యతః | హరిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | హరిష్యసి | హరిష్యథః | హరిష్యథ | మ.పు. |
| | హరిష్యామి | హరిష్యావః | హరిష్యామః | ఉ.పు. |

హరిష్యతి = హరించగలడు }
హరిష్యసి = హరించగలవు } ఏకవచనాలు
హరిష్యామి= హరించగలను }

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

**18. స్తృ స్తరణే స్తరణం - వ్యాపించు**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | స్తరతి | స్తరతః | స్తరన్తి | ప్ర.పు. |
| వర్తమానం | స్తరసి | స్తరథః | స్తరథ | మ.పు. |
| | స్తరామి | స్తరావః | స్తరామః | ఉ.పు. |

స్తరతః = వ్యాపిస్తున్నారు (వారిద్దరు)
స్తరథః = వ్యాపిస్తున్నారు (మీరిద్దరు)
స్తరావః = వ్యాపిస్తున్నాము (మేమిద్దరం)
} ద్వివచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు సులంభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | స్తరతు, స్తరతాత్ | స్తరతామ్ | స్తరన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | స్తర, స్తరతాత్ | స్తరతమ్ | స్తరత | మ.పు. |
| | స్తరాని | స్తరావ | స్తరామ | ఉ.పు. |

స్తరన్తు = వ్యాపించాలి (వారు)
స్తరత = వ్యాపించాలి (మీరు)
స్తరామ = వ్యాపించాలి (మేము)
} బహువచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అస్తరత్ | అస్తరతామ్ | అస్తరన్ | ప్ర.పు. |
| భూతకాలం | అస్తరః | అస్తరతమ్ | అస్తరత | మ.పు. |
| | అస్తరమ్ | అస్తరావ | అస్తరామ | ఉ.పు. |

అస్తరత్ = విస్తరించెను
అస్తరః = విస్తరించితివి
అస్తరమ్ = విస్తరించితిని
} ఏకవచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | స్తరేత్ | స్తరేతామ్ | స్తరేయుః | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| ఆదేశం | స్తరేః | స్తరేతమ్ | స్తరేత | మ.పు. |
| | స్తరేయమ్ | స్తరేవ | స్తరేమ | ఉ.పు. |

స్తరేతామ్ = (వారిద్దరు) విస్తరించాలి
స్తరేతమ్ = (మీరిద్దరు) విస్తరించాలి } ద్వివచనాలు
స్తరేవ = (మేమిద్దరం) విస్తరించాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగా గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | స్తరిష్యతి | స్తరిష్యతః | స్తరిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | స్తరిష్యసి | స్తరిష్యథః | స్తరిష్యథ | మ.పు. |
| | స్తరిష్యామి | స్తరిష్యావః | స్తరిష్యామః | ఉ.పు. |

స్తరిష్యన్తి = విస్తరించగలరు
స్తరిష్యథ = విస్తరించగలరు (మీరు) } బహువచనాలు
స్తరిష్యామః = విస్తరించగలము

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

**19. ధృ ధరణే ధరణం = ధరించుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | ధరతి | ధరతః | ధరన్తి | ప్ర.పు. |
| వర్తమానం | ధరసి | ధరథః | ధరథ | మ.పు. |
| | ధరామి | ధరావః | ధరామః | ఉ.పు. |

ధరతి = ధరిస్తున్నాడు
ధరసి = ధరిస్తున్నావు } ఏకవచనాలు
ధరామి = ధరిస్తున్నాను

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | ధరతు, ధరతాత్ | ధరతామ్ | ధరన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | ధర, ధరతాత్ | ధరతమ్ | ధరత | మ.పు. |
| | ధరాణి | ధరావ | ధరామ | ఉ.పు. |

ధరతామ్ = (వారిద్దరు) ధరించాలి
ధరతమ్ = (మీరిద్దరు) ధరించాలి } ద్వివచనాలు
ధరావ = (మేమిద్దరం) ధరించాలి

మిగిలిన వచనాల అర్థాలు ఇలాగే గ్రహించాలి

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లఙ్ : | అధరత్ | అధరతామ్ | అధరన్ | ప్ర.పు. |
| భూతకాలం | అధరః | అధరతమ్ | అధరత | మ.పు. |
| | అధరమ్ | అధరావ | అధరామ | ఉ.పు. |

అధరన్ = ధరించిరి
అధరత = ధరించితిరి } బహువచనాలు
అధరామ = ధరించితిమి

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | ధరేత్ | ధరేతామ్ | ధరేయుః | ప్ర.పు. |
| ఆదేశం | ధరేః | ధరేతమ్ | ధరేత | మ.పు. |
| | ధరేయమ్ | ధరేవ | ధరేమ | ఉ.పు. |

ధరేత్ = (వాడు) ధరించాలి
ధరేః = (నీవు) ధరించాలి } ఏకవచనాలు
ధరేయమ్ = (నేను) ధరించాలి

మిగిలిన వచనాలు అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లృట్ : | ధరిష్యతి | ధరిష్యతః | ధరిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | ధరిష్యసి | ధరిష్యథః | ధరిష్యథ | మ.పు. |
| | ధరిష్యామి | ధరిష్యావః | ధరిష్యామః | ఉ.పు. |

ధరిష్యతః = ధరించగలరు (వారు ఇద్దరు)
ధరిష్యథః = ధరించగలరు (మీరు ఇద్దరు) } ద్వివచనాలు
ధరిష్యావః = ధరించగలము (మేము ఇద్దరం)

మిగిలిన వచనాల అర్థాలూ ఇలాగే గ్రహించవచ్చు.

**20. షిచ్ సిఞ్చనే సించనం = తడుపుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | సించతి | సించతః | సించన్తి | ప్ర.పు. |
| వర్తమానం | సించసి | సించథః | సించథ | మ.పు. |
| | సించామి | సించావః | సించామః | ఉ.పు. |

సించన్తి = తడుపుతున్నారు
సించథ = తడుపుతున్నారు (మీరు)
సించామః = తడుపుతున్నాము
} బహువచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | సించతు, సించతాత్ | సించతామ్ | సించన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | సించ, సించతాత్ | సించతమ్ | సించత | మ.పు. |
| | సించాని | సించావ | సించామ | ఉ.పు. |

సించతు, సిచతాత్ = (వాడు) తడపాలి
సిచ, సించతాత్ = (నీవు) తడపాలి
సించాని = (నేను) తడపాలి
} ఏకవచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే ఉంటాయి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అసించత్ | అసించతామ్ | అసించన్ | ప్ర.పు. |
| భూతకాలం | అసించః | అసించతమ్ | అసించత | మ.పు. |
| | అసించమ్ | అసించావ | అసించామ | ఉ.పు. |

అసించతామ్ = (వారిద్దరు) తడిపిరి
అసించతమ్ = (మీరిద్దరు) తడిపిరి
అసించావ = (మేమిద్దరం) తడిపితిమి
} ద్వివచనాలు

మిగిలిన వచనాల అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | సించేత్ | సించేతామ్ | సించేయుః | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| ఆదేశం | సించేః | సించేతమ్ | సించేత | మ.పు. |
| | సించేయమ్ | సించేవ | సించేమ | ఉ.పు. |

సించేయుః = (వారు) తడపాలి
సించేతః = (మీరు) తడపాలి } బహువచనాలు
సించేమ = (మేము) తడపాలి

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్రుట్ : | సేక్ష్యతి | సేక్ష్యతః | సేక్ష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | సేక్ష్యసి | సేక్ష్యథః | సేక్ష్యథ | మ.పు. |
| | సేక్ష్యామి | సేక్ష్యావః | సేక్ష్యామః | ఉ.పు. |

సేక్ష్యతి = తడుపగలడు
సేక్ష్యసి = తడుపగలవు } ఏకవచనాలు
సేక్ష్యామి = తడుపగలను

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

**21. ధావ్ ధావనే ధావనం = పరుగెత్తుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | ధావతి | ధావతః | ధావన్తి | ప్ర.పు. |
| వర్తమానం | ధావసి | ధావథః | ధావథ | మ.పు. |
| | ధావామి | ధావావః | ధావామః | ఉ.పు. |

ధావతః = పరుగెత్తుచున్నారు (వారిద్దరు)
ధావథః = పరుగెత్తుచున్నారు (మీరిద్దరు) } ద్వివచనాలు
ధావామః = పరుగెత్తుచున్నాము (మేమిద్దరం)

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగా సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | ధావతు, ధావతాత్ | ధావతామ్ | ధావన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | ధావ, ధావతాత్ | ధావతామ్ | ధావత | మ.పు. |
| | ధావాని | ధావావ | ధావామ | ఉ.పు. |

ధావన్తు = (వారు) పరుగెత్తాలి
ధావత = (మీరు) పరుగెత్తాలి } బహువచనాలు
ధావామ = (మేము) పరుగెత్తాలి

మిగిలిన వచనాలకూ అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అధావత్ | అధావతామ్ | అధావన్ | ప్ర.పు. |
| భూతకాలం | అధావః | అధావతమ్ | అధావత | మ.పు. |
| | అధావమ్ | అధావావ | అధావామ | ఉ.పు. |

అధావత్ = పరుగెత్తెను
అధావః = పరుగెత్తితివి } ఏకవచనాలు
అధావమ్ = పరుగెత్తితిని

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | ధావేత్ | ధావేతామ్ | ధావేయుః | ప్ర.పు. |
| ఆదేశం | ధావేః | ధావేతమ్ | ధావేత | మ.పు. |
| | ధావేయమ్ | ధావేవ | ధావేమ | ఉ.పు. |

ధావేతామ్ = (వారిద్దరు) పరుగెత్తాలి
ధావేతమ్ = (మీరిద్దరు) పరుగెత్తాలి } ద్వివచనాలు
ధావేవ = (మేమిద్దరం) పరుగెత్తాలి

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్యట్ : | ధావిష్యతి | ధావిష్యతః | ధావిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | ధావిష్యసి | ధావిష్యథః | ధావిష్యథ | మ.పు. |
| | ధావిష్యామి | ధావిష్యావః | ధావిష్యామః | ఉ.పు. |

ధావిష్యన్తి = పరుగెత్తగలరు
ధావిష్యథ = పరుగెత్తగలరు (మీరు) } బహువచనాలు
ధావిష్యామః = పరుగెత్తగలము

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

**22. యజ్ పూజాయాం పూజా = పూజించుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | యజతి | యజతః | యజన్తి | ప్ర.పు. |
| వర్తమానం | యజసి | యజథః | యజథ | మ.పు. |
| | యజామి | యజావః | యజామః | ఉ.పు. |

యజతి = పూజించుతున్నాడు
యజసి = పూజించుతున్నావు
యజామి = పూజించుతున్నాను
} ఏకవచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | యజతు, యజతాత్ | యజతామ్ | యజన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | యజ, యజతాత్ | యజతమ్ | యజత | మ.పు. |
| | యజాని | యజావ | యజామ | ఉ.పు |

యజతామ్ = (వారిద్దరు) పూజించాలి
యజతమ్ = (మీరిద్దరు) పూజించాలి
యజావ = (మేమిద్దరం) పూజించాలి
} ద్వివచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు పై విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అయజత్ | అయజతామ్ | అయజన్ | ప్ర.పు. |
| భూతకాలం | అయజః | అయజతమ్ | అయజత | మ.పు. |
| | అయజమ్ | అయజావ | అయజామ | ఉ.పు. |

అయజన్ = పూజించిరి
అయజత = పూజించితిరి
అయజామ = పూజించితిమి
} బహువచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | యజేత్ | యజేతామ్ | యజేయుః | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| ఆదేశం | యజేః | యజేతమ్ | యజేత | మ.పు. |
| | యజేయమ్ | యజేవ | యజేమ | ఉ.పు. |

యజేత్ = (వాడు) పూజించాలి
యజేః = (నీవు) పూజించాలి } ఏకవచనాలు
యజేయమ్ = (నేను) పూజించాలి

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| ల్రుట్ : | యక్ష్యతి | యక్ష్యతః | యక్ష్యన్తి | ప్ర.పు. |
| భూష్యత్కాలం | యక్ష్యసి | యక్ష్యథః | యక్ష్యథ | మ.పు. |
| | యక్ష్యామి | యక్ష్యావః | యక్ష్యామః | ఉ.పు. |

యక్ష్యతః = పూజించగలరు (వారిద్దరు)
యక్ష్యథః = పూజించగలరు (మీరిద్దరు) } ద్వివచనాలు
యక్ష్యావః = పూజించగలము (మేమిద్దరం)

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

**23. (డు) పచ్ (ష్) పచనే పచనం = వండుట**

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | పచతి | పచతః | పచన్తి | ప్ర.పు. |
| వర్తమానం | పచసి | పచథః | పచథ | మ.పు. |
| | పచామి | పచావః | పచామః | ఉ.పు. |

పచన్తి = వండుతున్నారు
పచథ = వండుతున్నారు (మీరు) } బహువచనాలు
పచామః = వండుతున్నాము

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లోట్ : | పచతు, పచతాత్ | పచతామ్ | పచన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | పచ, పచతాత్ | పచతమ్ | పచత | మ.పు. |
| | పచాని | పచావ | పచామ | ఉ.పు. |

పచతు, పచతాత్ = (వాడు) వండాలి
పచ, పచతాత్ = (నీవు) వండాలి ఏకవచనాలు
పచాని = (నేను) వండాలి

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అపచత్ | అపచతామ్ | అపచన్ | ప్ర.పు. |
| భూతకాలం | అపచః | అపచతమ్ | అపచత | మ.పు. |
| | అపచమ్ | అపచావ | అపచామ | ఉ.పు. |

అపచతామ్ = వండిరి (వారిద్దరు)
అపచతమ్ = వండితిరి (మీరిద్దరు) ద్వివచనాలు
అపచావ = వండితిమి (మేమిద్దరం)

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | పచేత్ | పచేతామ్ | పచేయుః | ప్ర.పు. |
| ఆదేశం | పచేః | పచేతమ్ | పచేత | మ.పు. |
| | పచేయమ్ | పచేవ | పచేమ | ఉ.పు. |

పచేయుః = (వారు) వండాలి
పచేత = (మీరు) వండాలి బహువచనాలు
పచేమ = (మేము) వండాలి

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్ృట్ : | పక్ష్యతి | పక్ష్యతః | పక్ష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | పక్ష్యసి | పక్ష్యథః | పక్ష్యథ | మ.పు. |
| | పక్ష్యామి | పక్ష్యావః | పక్ష్యామః | ఉ.పు. |

పక్ష్యతి = వండగలడు
పక్ష్యసి = వండగలవు ఏకవచనాలు
పక్ష్యామి = వండగలను

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

**24. వహ ప్రాపణే ప్రాపణం = పొందించుట మోయుట - వహించుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | వహతి | వహతః | వహన్తి | ప్ర.పు. |
| వర్తమానం | వహసి | వహథః | వహథ | మ.పు. |
| | వహామి | వహావః | వహామః | ఉ.పు. |

వహతః = మోస్తున్నారు (వారిద్దరు)
వహథః = మోస్తున్నారు (మీరిద్దరు)
వహావః = మోస్తున్నాము (మేమిద్దరం)
} ద్వివచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | వహతు, వహతాత్ | వహతామ్ | వహన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | వహ, వహతాత్ | వహతమ్ | వహత | మ.పు. |
| | వహాని | వహావ | వహామ | ఉ.పు |

వహన్తు = మోయాలి (వారు)
వహత = మోయాలి (మీరు)
వహామ = మోయాలి (మేము)
} బహువచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అవహత్ | అవహతామ్ | అవహన్ | ప్ర.పు. |
| భూతకాలం | అవహః | అవహతమ్ | అవహత | మ.పు. |
| | అవహమ్ | అవహావ | అవహామ | ఉ.పు. |

అవహత్ = మోసెను
అవహః = మోసితివి
అవహమ్ = మోసితిని
} ఏకవచనాలు

మిగిలిన వచనాల అర్థాలూ సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | వహేత్ | వహేతామ్ | వహేయుః | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| ఆదేశం | వహేః | వహేతమ్ | వహేత | మ.పు. |
| | వహేయమ్ | వహేవ | వహేమ | ఉ.పు. |

వహేతామ్ = మోయాలి (వారిద్దరు)
వహేతమ్ = మోయాలి (మీరిద్దరు) } ద్వివచనాలు
వహేవ = మోయాలి (మేమిద్దరం)

మిగిలిన వచనాలకూ అర్థాలు పై విధంగానే గ్రహించాలి.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| ల్ృట్ : | వక్ష్యతి | వక్ష్యతః | వక్ష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | వక్ష్యసి | వక్ష్యథః | వక్ష్యథ | మ.పు. |
| | వక్ష్యామి | వక్ష్యావః | వక్ష్యామః | ఉ.పు. |

వక్ష్యన్తి = మోయగలరు
వక్ష్యథ = మోయగలరు (మీరు) } బహువచనాలు
వక్ష్యామః = మోయగలము

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలే.

**25. ఖాద్ భక్షణే భక్షణం = తినుట**

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | ఖాదతి | ఖాదతః | ఖాదన్తి | ప్ర.పు. |
| వర్తమానం | ఖాదసి | ఖాదథః | ఖాదథ | మ.పు. |
| | ఖాదామి | ఖాదావః | ఖాదామః | ఉ.పు. |

ఖాదతి = తింటున్నాడు
ఖాదసి = తింటున్నావు } ఏకవచనాలు
ఖాదామి = తింటున్నాను

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలే.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లోట్ : | ఖాదతు, ఖాదతాత్ | ఖాదతామ్ | ఖాదన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | ఖాద, భాదతాత్ | ఖాదతమ్ | ఖాదత | మ.పు. |
| | ఖాదాని | ఖాదావ | ఖాదామ | ఉ.పు. |

ఖాదతామ్ = తినాలి (వారిద్దరు)
ఖాదతమ్ = తినాలి (మీరిద్దరు) } ద్వివచనాలు
ఖాదావ = తినాలి (మేమిద్దరం)

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అఖాదత్ | అఖాదతామ్ | అఖాదన్ | ప్ర.పు. |
| భూతకాలం | అఖాదః | అఖాదతమ్ | అఖాదత | మ.పు. |
| | అఖాదమ్ | అఖాదావ | అఖాదామ | ఉ.పు. |

అఖాదన్ = తినిరి
అఖాదత = తింటిరి } బహువచనాలు
అఖాదామ = తింటిమి

ఇతర వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | ఖాదేత్ | ఖాదేతామ్ | ఖాదేయుః | ప్ర.పు. |
| ఆదేశం | ఖాదేః | ఖాదేతమ్ | ఖాదేత | మ.పు. |
| | ఖాదేయమ్ | ఖాదేవ | ఖాదేమ | ఉ.పు. |

ఖాదేత్ = (వాడు) తినాలి
ఖాదేః = (నీవు) తినాలి } ఏకవచనాలు
ఖాదయమ్ = (నేను) తినాలి

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | ఖాదిష్యతి | ఖాదిష్యతః | ఖాదిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | ఖాదిష్యసి | ఖాదిష్యథః | ఖాదిష్యథ | మ.పు. |
| | ఖాదిష్యామి | ఖాదిష్యావః | ఖాదిష్యామః | ఉ.పు. |

ఖాదిష్యతః = తినగలరు (వారిద్దరు)
ఖాదిష్యథః = తినగలరు (మీరిద్దరు) } ద్వివచనాలు
ఖాదిష్యావః = తినగలము (మేమిద్దరం)

మిగిలిన వచనాల అర్థాలూ సులభంగా గ్రహించవచ్చు.

26. పా పానే పానం = త్రాగుట

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | పిబతి | పిబతః | పిబన్తి | ప్ర.పు. |
| వర్తమానం | పిబసి | పిబథః | పిబథ | మ.పు. |
| | పిబామి | పిబావః | పిబామః | ఉ.పు. |

పిబన్తి = త్రాగుతున్నారు (వారు)
పిబథ = త్రాగుతున్నారు (మీరు)
పిబామః = త్రాగుతున్నాము (మేము / మనము)
} బహువచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలూ సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | పిబతు, పిబతాత్ | పిబతామ్ | పిబన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | పిబ, పిబతాత్ | పిబతమ్ | పిబత | మ.పు. |
| | పిబాని | పిబావ | పిబామ | ఉ.పు. |

పిబతు, పిబతాత్ = (వాడు ) త్రాగాలి
పిబ, పిబతాత్ = (నీవు) త్రాగాలి
పిబాని = (నేను) త్రాగాలి
} ఏకవచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అపిబత్ | అపిబతామ్ | అపిబన్ | ప్ర.పు. |
| భూతకాలం | అపిబః | అపిబతమ్ | అపిబత | మ.పు. |
| | అపిబమ్ | అపిబావ | అపిబామ | ఉ.పు. |

అపిబతామ్ = త్రాగిరి (వారిద్దరు)
అపిబతమ్ = త్రాగితిరి (మీరిద్దరు)
అపిబావ = త్రాగితిమి (మేమిద్దరం)
} ద్వివచనాలు

మిగిలన వచనాలక అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | పిబేత్ | పిబేతామ్ | పిబేయుః | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| ఆదేశం | పిబేః | పిబేతమ్ | పిబేత | మ.పు. |
| | పిబేయమ్ | పిబేవ | పిబేమ | ఉ.పు. |

పిబేయుః = (వారు) త్రాగాలి
పిబేత = (మీరు) త్రాగాలి
పిబేమ = (మేము) త్రాగాలి
} బహువచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| ల్ఌట్ : | పాస్యతి | పాస్యతః | పాస్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | పాస్యసి | పాస్యథః | పాస్యథ | మ.పు. |
| | పాస్యామి | పాస్యావః | పాస్యామః | ఉ.పు. |

పాస్యన్తి = త్రాగగలరు (వారు)
పాస్యథ = త్రాగగలరు (మీరు)
పాస్యామః = త్రాగగలము (మేము)
} బహువచనాలు

మిగిలిన వచనాలకు అర్థాలు సులభగ్రాహ్యాలు.

**27. పూజ్ పూజాయామ్ పూజా = పూజించుట**

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | పూజయతి | పూజయతః | పూజయన్తి | ప్ర.పు. |
| వర్తమానం | పూజయసి | పూజయథః | పూజయథ | మ.పు. |
| | పూజయామి | పూజయావః | పూజయామః | ఉ.పు. |

పూజయతి = పూజిస్తున్నాడు
పూజయసి = పూజిస్తున్నావు
పూజయామి = పూజిస్తున్నాను
} ఏకవచనాలు

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లోట్ : | పూజయతు, పూజయతాత్ | పూజయతామ్ | పూజయన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | పూజయ, పూజయతాత్ | పూజయతమ్ | పూజయత | మ.పు. |
| | పూజయాని | పూజయావ | పూజయామ | ఉ.పు. |

పూజయతామ్ = పూజించాలి (వారిద్దరు)
పూజయతమ్ = పూజించాలి (మీరిద్దరు) } ద్వివచనాలు
పూజయావ = పూజించాలి (మేమిద్దరం)

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లజ్ : | అపూజయత్ | అపూజయతామ్ | అపూజయన్ | ప్ర.పు. |
| భూతకాలం | అపూజయః | అపూజయతమ్ | అపూజయత | మ.పు. |
| | అపూజయమ్ | అపూజయావ | అపూజయామ | ఉ.పు. |

అపూజయన్ = పూజించిరి
అపూజయత = పూజించితిరి } బహువచనాలు
అపూజయామ = పూజించితిమి

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిజ్ : | పూజయేత్ | పూజయేతామ్ | పూజయేయుః | ప్ర.పు. |
| ఆదేశం | పూజయేః | పూజయేతమ్ | పూజయేత | మ.పు. |
| | పూజయేయమ్ | పూజయేవ | పూజయేమ | ఉ.పు. |

పూజయేత్ = పూజించాలి (వాడు)
పూజయేః = పూజించాలి (నీవు) } ఏకవచనాలు
పూజయేయమ్ = పూజించాలి (నేను)

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లృట్ : | పూజయిష్యతి | పూజయిష్యతః | పూజయిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | పూజయిష్యసి | పూజయిష్యథః | పూజయిష్యథ | మ.పు. |
| | పూజయిష్యామి | పూజయిష్యావః | పూజయిష్యామః | ఉ.పు. |

పూజయిష్యతః = పూజించగలరు (వారిద్దరు)
పూజయిష్యథః = పూజించగలరు (మీరిద్దరు) } ద్వివచనాలు
పూజయిష్యావః = పూజించగలము (మేమిద్దరం)

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

**28. వర్ణ వర్ణనే వర్ణనం = వర్ణించుట**

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | వర్ణయతి | వర్ణయతః | వర్ణయన్తి | ప్ర.పు. |
| వర్తమానం | వర్ణయసి | వర్ణయథః | వర్ణయథ | మ.పు. |
| | వర్ణయామి | వర్ణయావః | వర్ణయామః | ఉ.పు. |

వర్ణయన్తి = వర్ణిస్తున్నారు
వర్ణయథ = వర్ణిస్తున్నారు (మీరు) } బహువచనాలు
వర్ణయామః = వర్ణిస్తున్నాము

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | వర్ణయతు, వర్ణయతాత్ | వర్ణయతామ్ | వర్ణయన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | వర్ణయ, వర్ణయతాత్ | వర్ణయతమ్ | వర్ణయత | మ.పు. |
| | వర్ణయాని | వర్ణయావ | వర్ణయామ | ఉ.పు. |

వర్ణయతు, వర్ణయతాత్ = వర్ణించాలి (వాడు)
వర్ణయ, వర్ణయతాత్ = వర్ణించాలి (నీవు) } ఏకవచనాలు
వర్ణయాని = వర్ణించాలి (నేను)

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అవర్ణయత్ | అవర్ణయతామ్ | అవర్ణయన్ | ప్ర.పు. |
| భూతకాలం | అవర్ణయః | అవర్ణయతమ్ | అవర్ణయత | మ.పు. |
| | అవర్ణయమ్ | అవర్ణయావ | అవర్ణయామ | ఉ.పు. |

అవర్ణయతామ్ = (వారిద్దరు) వర్ణించిరి
అవర్ణయతమ్ = (మీరిద్దరు) వర్ణించితిమి } ద్వివచనాలు
అవర్ణయావ = (మేమిద్దరం) వర్ణించితిమి

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | వర్ణయేత్ | వర్ణయేతామ్ | వర్ణయేయుః | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| | వర్ణయేః | వర్ణయేతమ్ | వర్ణయేత | మ.పు. |
| | వర్ణయేయమ్ | వర్ణయేవ | వర్ణయేమ | ఉ.పు. |

వర్ణయేయుః = (వారు) వర్ణించాలి
వర్ణయేత = (మీరు) వర్ణించాలి } బహువచనాలు
వర్ణయేమ = (మేము) వర్ణించాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| ల్ఋట్ : | వర్ణయిష్యతి | వర్ణయిష్యతః | వర్ణయిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | వర్ణయిష్యసి | వర్ణయిష్యథః | వర్ణయిష్యథ | మ.పు. |
| | వర్ణయిష్యామి | వర్ణయిష్యావః | వర్ణయిష్యామః | ఉ.పు. |

వర్ణయిష్యతి = వర్ణించగలడు
వర్ణయిష్యసి = వర్ణించగలవు } ఏకవచనాలు
వర్ణయిష్యామి = వర్ణించగలను

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

**29. గణ గణనే గణనం = లెక్కించుట**

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లట్ : | గణయతి | గణయతః | గణయన్తి | ప్ర.పు. |
| వర్తమానం | గణయసి | గణయథః | గణయథ | మ.పు. |
| | గణయామి | గణయావః | గణయామః | ఉ.పు. |

గణయతః = (వారిద్దరు) లెక్కిస్తున్నారు
గణయథః = (మీరిద్దరు) లెక్కిస్తున్నారు } ద్వివచనాలు
గణయావః = (మేమిద్దరం) లెక్కిస్తున్నాము

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | **ఏక** | **ద్వి** | **బహు** | |
|---|---|---|---|---|
| లోట్ : | గణయతు, గణయతాత్ | గణయతామ్ | గణయన్తు | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | గణయ, గణయతాత్ | గణయతమ్ | గణయత | మ.పు. |
| | గణయాని | గణయావ | గణయావ | ఉ.పు. |

గణయన్తు = లెక్కించాలి (వారు)
గణయత = లెక్కించాలి (మీరు) } బహువచనాలు
గణయామ = లెక్కించాలి (మేము)

మిగిలిన వచనాలకూ అర్థాలు ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అగణయత్ | అగణయతామ్ | అగణయన్ | ప్ర.పు. |
| భూతకాలం | అగణయః | అగణయతమ్ | అగణయత | మ.పు. |
| | అగణయమ్ | అగణయావ | అగణయామ | ఉ.పు. |

అగణయత్ = లెక్కించెను
అగణయః = లెక్కించితివి } ఏకవచనాలు
అగణయమ్ = లెక్కించితిని

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | గణయేత్ | గణయేతామ్ | గణయేయుః | ప్ర.పు. |
| ఆదేశం | గణయేః | గణయేతమ్ | గణయేత | మ.పు. |
| | గణయేయమ్ | గణయేవ | గణయేమ | ఉ.పు. |

గణయేతామ్ = (వారిద్దరు) లెక్కించాలి
గణయేతమ్ = (మీరిద్దరు) లెక్కించాలి } ద్వివచనాలు
గణయేవ = (మేమిద్దరం) లెక్కించాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగా గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్పట్ : | గణయిష్యతి | గణయిష్యతః | గణయిష్యన్తి | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | గణయిష్యసి | గణయిష్యథః | గణయిష్యథ | మ.పు. |
| | గణయిష్యామి | గణయిష్యావః | గణయిష్యామః | ఉ.పు. |

గణయిష్యన్తి = లెక్కించలగరు
గణయిష్యథ = లెక్కించగలరు (మీరు) } బహువచనాలు
గణయిష్యామః = లెక్కించగలము

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

30. వృధ్ వర్ధనే వర్ధనం = పెరుగుట

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లట్ : | వర్ధతే | వర్ధేతే | వర్ధన్తే (ఆత్మనేపదం) | ప్ర.పు. |
| వర్తమానం | వర్ధసే | వర్ధేథే | వర్ధధ్వే | మ.పు. |
| | వర్ధే | వర్ధావహే | వర్ధామహే | ఉ.పు. |

వర్ధతే = పెరుగుతున్నాడు
వర్ధసే = పెరుగుతున్నావు } ఏకవచనాలు
వర్ధే = పెరుగుతున్నాను

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లోట్ : | వర్ధతామ్ | వర్ధేతామ్ | వర్ధన్తామ్ | ప్ర.పు. |
| ఆజ్ఞాదికం | వర్ధస్వ | వర్ధేథామ్ | వర్ధధ్వమ్ | మ.పు. |
| | వర్ధై | వర్ధావహై | వర్ధామహై | ఉ.పు. |

వర్ధేతామ్ = (వారిద్దరు) పెరగాలి
వర్ధేథామ్ = (మీరిద్దరు) పెరగాలి } ద్వివచనాలు
వర్ధావహై = (మేమిద్దరం) పెరగాలి

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగానే గ్రహించవచ్చు ఈ విధంగానే.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| లఙ్ : | అవర్ధత | అవర్ధేతామ్ | అవర్ధన్తామ్ | ప్ర.పు. |
| భూతకాలం | అవర్ధథాః | అవర్ధేథామ్ | అవర్ధధ్వమ్ | మ.పు. |
| | అవర్ధే | అవర్ధావహి | అవర్ధామహి | ఉ.పు. |

అవర్ధన్తామ్ = పెరిగిరి
అవర్ధధ్వమ్ = పెరిగితిరి } బహువచనాలు
అవర్ధామహి = పెరిగితిమి

మిగిలిన వచనాలకూ అర్థాలు సులభంగా గ్రహించవచ్చు.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| విధిలిఙ్ : | వర్ధేత | వర్ధేయాతామ్ | వర్ధేరన్ | ప్ర.పు. |

| | | | | |
|---|---|---|---|---|
| ఆదేశం | వర్ధేథాః | వర్ధేయాథామ్ | వర్ధేధ్వమ్ | మ.పు. |
| | వర్ధేయ | వర్ధేవహి | వర్ధేమహి | ఉ.పు. |

వర్ధేత = (వాడు) పెరగాలి
వర్ధేథాః = (నీవు) పెరగాలి } ఏకవచనాలు
వర్ధేయ = (నేను) పెరగాలి

మిగిలిన వచనాల అర్థాలూ ఈ విధంగానే గ్రహించాలి.

| | ఏక | ద్వి | బహు | |
|---|---|---|---|---|
| ల్పట్ : | వర్ధిష్యతే | వర్ధిష్యేతే | వర్ధిష్యన్తే | ప్ర.పు. |
| భవిష్యత్కాలం | వర్ధిష్యసే | వర్ధిష్యేథే | వర్ధిష్యధ్వే | మ.పు. |
| | వర్ధిష్యే | వర్ధిష్యావహే | వర్ధిష్యామహే | ఉ.పు. |

వర్ధిష్యేతే = పెరగగలరు (వారిద్దరు)
వర్ధిష్యేథే = పెరగగలరు (మీరిద్దరు) } ద్వివచనాలు
వర్ధిష్యావహే = పెరగగలము (మేమిద్దరం)

మిగిలిన వచనాల అర్థాలూ సులభగ్రాహ్యాలు.

ఇప్పటి వరకు మనం 30 ధాతువులకు 5లకారాలలో మూడు వచనాలలో ఏర్పడే రూపాలు అభ్యసించాం. చివరి ధాతువు తప్ప మిగిలినవన్నీ పరస్మైపదాలు. చివరిది ఆత్మనే పదం. వీటిని పరిశీలనగా గ్రహించగల్గినపుడు సంస్కృత ధాతువుల స్వరూప స్వభావాలు స్థూలంగా కంఠస్థంగా బుద్ధిస్థంగా నిలుస్తాయి.

ధాతువులపై కృదంత ప్రత్యయాలు చేరి అనేక పదాలు ఏర్పడతాయి. కృదంత ప్రత్యయాలు విరివిగా చాల ఉన్నాయి. మనమిపుడు వాటిలో 5 ప్రత్యయాలు, వాటితో ఏర్పడే రూపాలు గ్రహిద్దాం.

1. క్త ప్రత్యయం. ఇది కర్మార్థంలో ధాతువుకు చేరి, ప్రాతిపదిక రూపాలు సిద్ధిస్తాయి.

   ఉదా॥ భూ + క్త = భూత (ఉండబడిన)

2. క్తవతు ప్రత్యయం. ఇది ధాతువుకు కర్త్రర్థంలో చేరినపుడు ప్రాతిపదికలు ఏర్పడతాయి.

   ఉదా॥ భూ + క్తవత్ = భూతవత్ (ఉన్న)

3. క్త్వా ప్రత్యయం. ఇది అసమాపక క్రియగా ధాతువును మార్చడానికి ఉపయుక్తమౌతుంది.

   ఉదా॥ భూ + క్త్వా = భూత్వా (అయి - ఉండి)

4. ల్యప్ ప్రత్యయం. ఇది ధాతువుకు చేరి దానిని అసమాపకంగా మారుస్తుంది.

   ఉదా॥ సంభూ + ల్యప్ = సంభూయ (సంభవించి)

   ఇది ధాతువు ఉపసర్గతో (ప్ర, పద, సం - వంటి) కూడినపుడే ప్రసక్తమౌతుంది.

5. తుమున్ ప్రత్యయం. ఇది ధాతువుకి చేరి దానిని మనం 'కోసం' అనే అర్థంలో ('పండను బోయెను') వాడే అసమాపక క్రియను సృష్టిస్తుంది. బాలవ్యాకర్త దీనినే తుమర్థమన్నాడు.

ఉదా॥ భూ + తుమున్ = భవితుమ్ (అగుటకు)

ఈ ప్రత్యయాలు 5 చేరినపుడు కొన్ని మార్పులు జరిగి ఆయా రూపాలు సిద్ధిస్తాయి.

ఈ అయిదు ప్రత్యయాలతో సిద్ధించే రూపాలు, పైన మనం నేర్చుకున్న ధాతువులకు వరుసగా క్రమంగా అధ్యయనం చేద్దాం.

అంటే ఒక్కొక్క ధాతువుకు ఐదేసి కృదన్త రూపాలు క్రింద మనం చూడబోతున్నాం.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1. | భూ | - | భూత, | భూతవత్, | భూత్వా, | అనుభూయ | అనుభవితుమ్ |
| | | | (క్త) | (క్తవత్) | (క్త్వా) | (ల్యప్) | (తుమున్) |

మొదటిది క్త ప్రత్యయాంతం, రెండవది క్తవదంతం - ఇట్లా స్థానాన్ని బట్టి గ్రహించాలి. స్వరూపాన్ని బట్టి కూడ సులభంగా తెలిసికోవచ్చు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 2. | జీ | - | జిత, | జితవత్, | జిత్వా, | విజిత్య, | జేతుమ్ |
| 3. | నీ | - | నీత, | నీతవత్, | నీత్వా, | వినీయ, | నేతుమ్ |
| 4. | దృశ్ | - | దృష్ట, | దృష్టవత్, | దృష్ట్వా, | సందృశ్య, | ద్రష్టుమ్ |
| 5. | గమ్ | - | గత, | గతవత్, | గత్వా, | ఆగత్య, | గన్తుమ్ |
| 6. | ముచ్ | - | ముక్త, | ముక్తవత్, | ముక్త్వా, | విముచ్య, | మోక్తుమ్ |
| 7. | ఇష్ | - | ఇష్ట, | ఇష్టవత్, | ఇష్ట్వా, | వ్యష్య, | ఏష్టుమ్ |
| 8. | లిఖ్ | - | లిఖిత, | లిఖితవత్, | లిఖిత్వా, | విలిఖ్య, | లిఖితుమ్ |
| 9. | పఠ్ | - | పఠిత, | పఠితవత్, | పఠిత్వా | ప్రపఠ్య, | పఠితుమ్ |
| 10. | స్నిహ్ | - | స్నిగ్ధ, | స్నిగ్ధవత్, | స్నిగ్ధ్వా, | సంస్నిహ్య, | స్నేహితుమ్ |
| 11. | కుప్ | - | కుపిత, | కుపితవత్, | కుపిత్వా, | ప్రకుప్య, | కుపితుమ్ |
| 12. | తుష్ | - | తుష్ట, | తుష్టవత్, | తుష్ట్వా, | సంతుష్య, | తోషితుమ్ |
| 13. | శుష్ | - | శుష్క, | శుష్కవత్, | శుషిత్వా, | విశోష్య, | శోషితుమ్ |
| 14. | క్షిప్ | - | క్షిప్త, | క్షిప్తవత్, | క్షిప్త్వా, | ప్రక్షిప్య, | క్షేప్తుమ్ |
| 15. | రుహ్ | - | రూఢ, | రూఢవత్, | రోహిత్వా, | ప్రరుహ్య, | రోఢుమ్ |
| 16. | కృ | - | కృత, | కృతవత్, | కృత్వా, | వికృత్య, | కర్తుమ్ |
| 17. | హృ | - | హృత, | హృతవత్, | హృత్వా, | సంహృత్య, | హర్తుమ్ |
| 18. | స్మృ | - | స్మృత, | స్మృతవత్, | స్మృత్వా, | విస్మృత్య, | స్మర్తుమ్ |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 19. | ధృ | - | ధృత, | ధృతవత్, | ధృత్వా, | అధృత్య, | ధర్తుమ్ |
| 20. | షిచ | - | సిక్త, | సిక్తవత్, | సిక్త్వా, | సంషిచ్య, | సేక్తుమ్ |
| 21. | ధావ్ | - | ధావిత, | ధావితవత్, | ధావిత్వా, | ప్రధావ్య, | ధావితుమ్ |
| 22. | యజ్ | - | యష్ట, | యష్టవత్, | యిష్ట్వా, | సంయజ్య, | యష్టుమ్ |
| 23. | పచ్ | - | పక్త, | పక్తవత్, | పక్త్వా, | ప్రపచ్య, | పక్తుమ్ |
| 24. | వహ్ | - | ఊఢ, | ఊఢవత్, | ఊఢ్వా, | నిరూహ్య, | ఓఢుమ్ |
| 25. | ఖాద్ | - | ఖాదిత, | ఖాదితవత్, | ఖాదిత్వా, | సంఖాద్య, | ఖాదితుమ్ |
| 26. | పా (పిబ్) | - | పీత, | పీతవత్, | పీత్వా, | నిపీయ, | పాతుమ్ |
| 27. | పూజ్ | - | పూజిత, | పూజితవత్, | పూజయిత్వా, | ప్రపూజ్య, | పూజయితుమ్ |
| 28. | వర్ణ | - | వర్ణిత, | వర్ణితవత్, | వర్ణయిత్వా, | సంవర్ణ్య, | వర్ణయితుమ్ |
| 29. | గణ | - | గణిత, | గణితవత్, | గణయిత్వా, | పరిగణ్య, | గణయితుమ్ |
| 30. | వృధ్ | - | వర్ధిత, | వర్ధితవత్, | వర్ధయిత్వా, | సంవర్ధ్య, | వర్ధయితుమ్ |

# సంధులు

రెండు పదాలకలయిక సంధి. వ్యవహార వేగం వలన పదాలు అవ్యవహితంగా, దూరం లేకుండా ఉచ్చరితాలౌతాయి. అపుడు సంధులు సహజంగా ఏర్పడతాయి భాషలలో.

సంస్కృత భాషలో ఈ సంధులు అతి విస్తారంగా, ఎంతో వైవిధ్యంతో ఏర్పడి ఉన్నాయి. వ్యాకర్తలు భాషలోని ఆ సంధులన్నిటినీ సంగ్రహించి, విశ్లేషించి, వర్గీకరించి వ్యాకరణాలలో అనేక ప్రకరణాలుగా, విభాగాలుగా నిబంధించి ఉంచారు. వాటిలో కొన్నిటిని మాత్రం మనమిక్కడ దిఙ్మాత్రంగా గ్రహిద్దాం.

1. **సవర్ణదీర్ఘ సంధి :-** సవర్ణాలయిన అచ్చులు దీర్ఘంగా ఏర్పడడం వలన దీనికీ పేరు. "అకస్సవర్ణే దీర్ఘః" అనేది పాణిని సూత్రం (పాణిని మహర్షి తన కాలం నాటి భాషను 'అష్టాధ్యాయి' అనే వ్యాకరణంలో వ్యాకరించి, నిబంధించాడు. బహుశః నాటి నుండే కావచ్చు భాష సంస్కృతమైనది).

   అకః, సవర్ణే, దీర్ఘః - పదవిభాగం

   అకః సవర్ణే అచిపరే పూర్వ పరయోః దీర్ఘః ఏకాదేశః స్యాత్ - వృత్తి -

   సూత్ర వివరణం. అ, ఇ, ఉ, ఋ - వర్ణాలకు అవే వర్ణాలు పరమైతే పూర్వ పరములు అచ్చులు రెండింటికి దీర్ఘమైన అచ్చు ఆదేశమౌతుంది అని అర్థం. ఉదా॥

దైత్య + అరిః = దైత్యారిః (అ)

శ్రీ + ఈశః = శ్రీశః (ఇ)

విష్ణు + ఉదయః = విష్ణూదయః (ఉ)

హోతృ + ఋకారః = హోతౄకారః (ఋ)

**2. గుణ సంధి :-** "ఆద్ గుణః" అనేది సూత్రం.

ఆత్, గుణః పదవిభాగం.

అవర్ణాత్ అచిపరే పూర్వ పరయో రేకో గుణః ఆదేశః స్యాత్ వృత్తి. అవర్ణమునకు అచ్చుపరమైతే, పూర్వపర అచ్చులకు ఒకే గుణం వస్తుంది. ఆదేశంగా అని అర్థం.

గుణమంటే అ - ఏ - ఓ అనే వర్ణాలు. అ - 'అర్' రూపంతో అదేశమౌతుంది. ఉదా॥

ఉప + ఇన్ద్రః = ఉపేన్ద్ర (ఏ)

గంగా + ఉదకమ్ = గంగోదకమ్ (ఓ)

కృష్ణ + ఋద్ధిః = కృష్ణర్ధిః (అ - అర్)

**3. వృద్ధి సంధి :-** "వృద్ధిరేచి" సూత్రం.

వృద్ధిః , ఏచి - పద విభాగం.

అత్ పచిపరే వృద్ధిః ఏకాదేశః స్యాత్ - వృత్తి.

అవర్ణానికి ఏ ఓ ఐ ఔ వర్ణాలు పరమైతే వృద్ధి ఏకాదేశమౌతుంది - అర్థం. ఉదా॥

వృద్ధి అంటే ఆ - ఐ - ఔ అనే వర్ణాలు. ఆ - ఆర్.

కృష్ణ + ఏకత్వమ్ = కృష్ణైకత్వమ్ (ఐ)

గంగా + ఓఘః = గంగౌఘః (ఔ)

దేవ + ఐశ్వర్యమ్ = దేవైశ్వర్యమ్ (ఐ)

కృష్ణ + ఔత్కణ్ఠ్యమ్ = కృష్ణౌత్కణ్ఠ్యమ్ (ఔ)

(ఔత్‌కంఠ్యమ్)

సుఖ + ఋతః = సుఖార్తః (ఆ - ఆర్)

**4. యణాదేశ సంధి :-** "ఇకో యణచి" సూత్రం.

ఇకః, యణ్, అచి - పద విభాగం

ఇకః స్థానేయణ్ స్యాదచి సంహితాయాం విషయే - వృత్తి

ఇ ఉ ఋ వర్ణాలకు అచ్చుపరమైతే య వ అ ర వర్ణాలు క్రమంగా ఆదేశమౌతాయి అని అర్థం.

ఉదా॥ సుధీ + ఉపాస్యః = సుధ్యుపాస్యః (య్)

మధు + అరిః = మధ్వరిః (వ్)

ధాతృ + అంశః = ధాత్రంశః (అ(ర్))

5. **విసర్గ సంధి :-** సంస్కృతంలో విసర్గ(ః) సకారంగా, రేఫగా - రవర్ణంగా మారడంతో పాటుగా, స్వయంగా లోపించడం, పూర్వ వర్ణాన్ని దీర్ఘం చేయడం జరుగుతుంది.

"విసర్జనీయస్య సః" సూత్రం

ఖరి విసర్జనీయస్య సః స్యాత్ - వృత్తి

ఖ, ఫ, ఛ, ఠ, థ, చ, ట, త, క, ప, శ, ష, స - వర్ణాలకు పరమైన విసర్గకు సకారం వస్తుంది. ఉదా

విష్ణుః + త్రాతా = విష్ణుస్త్రాతా (స్)

హరిః + శేతే = హరిశ్శేతే (స్)

అహః + అహః = అహరహః (ర్)

సః + శమ్భుః = సశమ్భుః (లోపం)

హరిః + రమ్యః = హరీరమ్యః (దీర్ఘం)

సంస్కృత భాషాధ్యయనంలో సంధిని గురించిన పరిజ్ఞానం ప్రధానమైనది. ఎంత ప్రధానమంటే, సంస్కృత వ్యాఖ్యానంలో ప్రథమస్థానం పదచ్ఛేదానిదే. పద విభాగానిదే. కాబట్టి సంధ్యధ్యయనం, సంస్కృత వ్యాకరణంలో విస్తృతంగా వివరంగా చేయవలసినది.

**ఆచార్య ఆకురాతి పున్నారావు**

**విశ్రాంతాచార్యులు**

**తెలుగు - ప్రాచ్య భాషా విభాగం**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**

**నాగార్జున నగర్.**